# కథా కౌముది

## 2019 - Part 2





శ్రీ

కౌముది

మీ ముంగిళ్లో సాహితీ వెన్నెల

www.koumudi.net



కౌముది ప్రచురణలు - 205

కౌముది మాసపత్రికలో

2019 జూలై నుంచి జూన్ 2020

వరకూ

వచ్చిన కథలు


| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | నాణేనికి రెండో వైపు | కొండపల్లి శిరీష | 4 |
| 2 | సెల్ | ఎమ్.కె.కుమార్ | 9 |
| 3 | భిక్ష | విద్యార్థి | 13 |
| 4 | తోట 'కల' | ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 25 |
| 5 | నువ్వు + నేను = మనం | శ్రీనిధి యెల్లల | 29 |
| 6 | యోగి | రవి కొప్పరపు | 32 |
| 7 | పరుగు | విద్యార్థి | 35 |

| | | | |
|---|---|---|---|
| 8 | నా వోడు | భార్గవ్ చందు | 42 |
| 9 | త్రీ స్ట్రయిక్స్ | తాడికొండ కె. శివకుమార శర్మ | 45 |
| 10 | మార్పు | సోమ సుధేష్ణ | 52 |
| 11 | ఉమ్మడి | వెల్చేరు చంద్రశేఖర్ | 62 |
| 12 | సింహం మాట్లాడింది | రవి కొప్పరపు | 76 |
| 13 | 'లాకర్' గోల్డ్ | ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 80 |
| 14 | ది రైటర్ | శ్రీనివాస గౌతమ్ | 84 |
| 15 | ఓం పుండరీకాక్షాయ నమః | రాజశేఖర్ తటవర్తి | 94 |
| 16 | ఏది నా ఉనికి? | భాస్కరలక్ష్మి కర్రా | 97 |
| 17 | అమ్మా నాన్నా బంగారు తల్లీ.. | కృపాకర్ పోతుల | 102 |
| 18 | సోంగ్క్రాన్ | ఆరి సీతారామయ్య | 106 |
| 10 | కేశవుడు | రాయపెద్ది వివేకానంద్ | 109 |
| 20 | మనసు లోపల | డా.పేరం ఇందిరా దేవి | 115 |
| 21 | అంతా ఒకరి మంచికే | ఎలక్ట్రాన్ | 120 |
| 22 | పంకజం | డి.వి.జి.శంకర్రావు | 124 |
| 23 | పిపీలికం | కృపాకర్ పోతుల | 127 |
| 24 | కోడికూర | కొండపల్లి వివేకానంద | 133 |
| 25 | సుభద్ర పట్టాభిషేకం | కె.వి. బాపారావు (Los Anegeles, USA) | 138 |
| 26 | జనని–జన్మభూమి | శ్రీనివాస ఫణి కుమార్ డొక్కా (Atlanta, GA) | 144 |
| 27 | "నేను తప్పుచేశానంటావా?" | సాయి ప్రభాకర్ యర్రాప్రగడ(Winter Garden,FL) | 148 |
| 28 | "డోరియన్ – దూరియాన్" | నిర్మలాదిత్య {భాస్కర్ పులికల్, Tampa, FL} | 155 |
| 29 | ఆటలో అరటి పండు | సింధూరి పోతుల (Prague, Czech Republic) | 160 |
| 30 | కల్యాణం, కమనీయం | సి.హెచ్.రమాకాంత్ (Hamburg,Germany) | 164 |
| 31 | క్షుధానలం | గౌతమ్ లింగా (Johannesburg, South Africa) | 168 |
| 32 | అంతర్మథనం | శాంత సుసర్ల (Houston, TX) | 170 |
| 33 | చిత్రలహరి | కిరణ్ విభావరి | 172 |
| 34 | గోపీ చందనం మేడ | రాజశేఖర్ తటవర్తి | 176 |
| 35 | అత్తి రసాలు | ఎండపల్లి భారతి | 178 |
| 36 | అభినందనలతో | ఆర్.సి.కృష్ణస్వామి రాజు | 181 |

# నాణేనికి రెండో వైపు

కొండపల్లి శిరీష

"ఈ విషయంలో నేను నీతో ఏకీభవించలేను సాన్వికా" అంటోంది అనన్య.

"నువ్వు ఏకీభవించకపోయినా మనకి ఇలాంటప్పుడు ఇంత కంటే వేరే మార్గం లేదు అనన్యా"

...

అనన్య, సాన్విక ఇద్దరు ఒకటే కంపెనీలో సహోద్యోగినులు. గత నాలుగేళ్ళుగా ఇద్దరికీ మంచి స్నేహం ఉండటమే కాక అన్ని విషయాలూ లంచ్ బ్రేక్లో, కాఫీ బ్రేక్లో ఒకరితో ఒకరు పంచుకోవడం ఇద్దరికీ అలవాటు. ఎవరికి బాగా హైక్ వచ్చేలాగా ఉంది, ఏ మేనేజర్ దగ్గర పని చేస్తే రాచి రంపాన పెడతాడు లాంటి ఆఫీస్ విషయాలే కాక, ఏ కూర ఎలా చేస్తే బాగుంటుంది, భర్త పుట్టినరోజుకి ఏ గిఫ్ట్ ఇస్తే బాగుంటుంది లాంటి స్వంత విషయాల వరకు అన్నీ చర్చించుకుంటారు. ఇప్పుడు అనుకోకుండా ఇద్దరూ ప్రెగ్నెన్సీ స్టేజ్లో ఉండటం వల్ల ఇద్దరికీ చర్చించుకోవడానికి మరిన్ని విషయాలు దొరుకుతున్నాయి.

ఇవాళ వాళ్ళిద్దరికీ జరిగిన చర్చ పిల్లలు పుట్టాక తల్లిదండ్రుల లేక అత్తమమల సపోర్ట్ తీసుకోవాలా వద్దా అని. సాన్విక ఉద్దేశం ప్రకారం సహాయం తీసుకోకుండా తిరిగి ఉద్యోగంలో చేరడం కష్టం. పైగా తల్లిదండ్రులు అయినా, అత్తమామలు అయినా మనవడితోనో మనవరాలితోనో టైం స్పెండ్ కూడా చెయ్యాలి కదా. తప్పేముంది రెండూ కలిసి వస్తాయి అంటుంది.

అనన్య ఆలోచనలు వేరు. ఈ వయసులో తల్లిదండ్రులకి అత్తమామలకి అదనపు బరువు బాధ్యతలు అప్పజెప్పడం తనకి ఇష్టం లేదు. వాళ్ళు ఈ వయసులో స్వతంత్రంగా ఉండటానికే ఇష్టపడతారు అని తన ఉద్దేశం. పైగా అనన్యకి వారపత్రికలు, మాసపత్రికలు చదివే అలవాటు ఎక్కువ. తన వయసు వారు తక్కువగా చదివే ఆ పత్రికల నిండా అలంటి కథలు ఎక్కువ. రిటైర్ అయిన వారు కొడుకుల, కూతుళ్ల ఇళ్ళకి వెళ్లి అక్కడ మనవల, మనవరాళ్ళ బాధ్యత వల్ల నలిగిపోవడం, సర్దుకుని ఉండలేకపోవడం, కోడలు లేదా కూతురు వారి పట్ల ఆదరణ లేకుండా ప్రవర్తించటం, అల్లుడు లేదా కొడుకు వారితో మర్యాద లేకుండా ఉండటం, ఇలాంటివి అన్నమాట. రిటైర్ అయిన వయసు వాళ్ళే ఎక్కువగా ఈ పత్రికలు చదువుతారేమో మరి!

...

ఏది ఏమైనా కాలగమనంలో సాన్వికకి మగపిల్లాడు, అనన్యకి ఆడపిల్ల కలిగారు. కొంత కాలం పుట్టింట్లో ఉండి వచ్చారు ఇద్దరూ. తిరిగి ఉద్యోగంలో చేరే రోజు రానే వచ్చింది. సాన్విక కి వాళ్ళ అమ్మగారు వాళ్ళు, అత్తగారు వాళ్ళు వంతుల వారిగా వచ్చి వెళ్తున్నారు.

అనన్య మాత్రం ఒక బేబీ సిట్టర్ సహాయంతో ఎక్కువగా వర్క్ ఫ్రొం హోమ్ చేస్తోంది. ఎప్పుడైనా ఆఫిస్ కి వెళ్ళవలసి వస్తే పాపని డే కేర్ లో పెడుతుంది. డే కేర్ లో పెట్టిన రోజు అనన్యకి మనసంతా పాప మీదే. అక్కడ అది ఎలా ఉందో, తిన్నదో లేదో, ఆడుకుంటోందో లేక ఏడుస్తోందో అని. పైగా తిరిగి తల్లి దగ్గరకి వచ్చాక ఆ రోజంతా తల్లిని వదిలిపెట్టదు ఇంక ఆ పసిది. తల్లి మళ్ళీ ఎక్కడ విడిచి వెళ్ళిపోతుందో అని భయం దానికి. ఎలాగో రోజులు వెళ్ళబుచ్చుతోంది అనన్య. కానీ మనసులో కించిత్తు గర్వంగానే ఉంది. ఎవరి సహాయ సహకారాలు లేకుండానే పిల్లని పెంచుకొస్తున్నా అని.

...

చాలా రోజులకి కలిశారు సాన్విక, అనన్య.  ఇప్పుడు వేర్వేరు టీమ్స్ లో పనిచేస్తున్నందువల్ల ఇది వరకు అంత తరచుగా కలవలేకపోతున్నారు.

"కంగ్రాట్స్ సాన్విక. ప్రమోషన్ వచ్చిందని విన్నాను."

"థాంక్స్ అనన్య. ఇంతకీ ఈసారి అయినా మీ మేనేజర్ నీ కష్టానికి తగ్గ ఫలితాన్ని ఇస్తా అంటున్నాడా లేదా?"

"ఎం చెప్పమంటావే. ఎక్కువగా వర్క్ ఫ్రమ్ హోంలు తీస్కున్నావు కదా. వచ్చే ఏడాది చూద్దాం లే అన్నాడు."

"అదేంటే?! వర్క్ ఫ్రొం హోమ్ చేస్తే మాత్రం ఏమిటట. వర్క్ చేసావు కదా. పైగా నువ్వేమీ కంపెనీ పాలసీని అతిక్రమించలేదు కదా."

"ఫ్లెక్సిబిల్ వర్కింగ్ ఉంది కదా. ఇంకేం కావాలి అన్నట్టు ఉందే ఆయన చెప్పేది. అయినా నేను కూడా కొంత కాలం ఇలాంటివి అన్నీ పక్కన పెడ్తున్నాలే. మా అమ్మాయి పెద్దది అయ్యి ప్రీ స్కూల్ కి వచ్చాక అప్పుడు కెరీర్ గురించి ఆలోచిస్తా."

"అప్పుడు మాత్రం ఎలా మేనేజ్ చేస్తావు? ప్రీ స్కూల్ మూడు గంటలే ఉంటుంది. తర్వాత మీ అమ్మాయిని ఇంట్లో చూసుకునేది ఎవరు?"

"ప్రీ స్కూల్ నుండి డే కేర్ కి పంపాలి"

"ఆ ఆప్షన్ ఎప్పుడూ ఉండేదే. కానీ వాళ్లకి కూడా కనీసం కొంత వయసు వచ్చే వరకు ఇంట్లో అమ్మమ్మా తాతయ్య, బామ్మా తాతయ్యల చేత కథలు, పద్యాలూ చెప్పించుకుంటూ, తెలుగు నర్సరీ రయిమ్స్ నేర్చుకుంటూ ఉండే అవకాశం మళ్ళీ రాదు కదా అనూ. ఆలోచించు. పెద్దవాళ్ళు ఇంట్లో ఉంటే వాళ్ళు మనకి అండ. మనం వాళ్లకి ఈ వయసులో ఆసరా."

ఏమీ మాట్లాడలేదు అనన్య. తను ఇన్నాళ్లూ నమ్మిన సిద్ధాంతాల తాలూకు పునాదులని కదిలించాలి అనిపించలేదు.

...

"బామ్మా! బాగున్నావా బామ్మా? ఎంత కాలం అయిందో నీతో మాట్లాడక"

"బాగున్నానే. నా మనవరాలు, మునిమనవరాలు ఇద్దరూ బాగున్నారా?"

"మేము ఇక్కడ అందరం బాగానే ఉన్నాం బామ్మ. నువ్వు హైదరాబాద్ ఎప్పుడు వస్తావు చెప్పు ముందు?"

"ఈ వయసులో నాకు ప్రయాణాలు కష్టమే. నువ్వే ఇటు వైపు వచ్చి నీ బిడ్డను చూపించు ఒకసారి."

"అదేంటి బామ్మా అలా అంటావు! అప్పుడు పెళ్లి అయిన కొత్తలో రమ్మంటే పిల్లో పిల్లాడో పుట్టాక వస్తా లేవే అన్నావు కదా. అన్నట్టు పెద్దమ్మ, పెద్దనాన్న బాగున్నారా?"

"బాగున్నారమ్మా. వాళ్లకి వాళ్ళ మనవడి ఆలనా పాలనతో తీరికే దొరకట్లేదు. అన్నయ్య, వదిన ఇద్దరూ ఉద్యోగస్తులే కదా."

"అయ్యో పాపం. పెద్దమ్మ కి అసలే ఆరోగ్యం అంతంత మాత్రమే కదా. ఎలా మేనేజ్ చేస్తున్నారు మరి?"

"కష్టమే అనుకో. కానీ నేను మాత్రం మీ అన్నయ్య, అక్కయ్యలని చిన్నప్పుడు పెంచలేదుటే? పెద్దమ్మ పొద్దున్నే ఎనిమిది గంటలకే వెళ్ళిపోయేది కదా బ్యాంకుకి."

"నిజం చెప్పు బామ్మా, నీకు ఎప్పుడూ అన్నయ్య, అక్కయ్యలని చూస్కోవడం తలకు మించిన భారం లాగా అనిపించలేదా?"

"నువ్వెందుకు ఆ ప్రశ్న వేశావో అర్ధమైందిరా నాకు. మా అప్పుడు పెళ్ళిళ్ళు త్వరగా చేస్కునేవాళ్ళం కదా. అందుకే నాకు మనవళ్ళు, మనవరాళ్ళు పుట్టేసరికి ఇంకా ఒంట్లో ఓపిక ఉంది. ఇప్పుడు నువ్వు అన్న తలకు మించిన భారం మీ పెద్దమ్మకి కొద్దిగా అనిపిస్తోంది. కాకపోతే కాలానికి తగ్గట్టు గా ఇప్పుడు బేబీ సిట్టర్లు, న్యానీలు అని వచ్చారు కదా. వాళ్ళ సహాయంతో పనులు చేసుకోవడమే. ఒకటి చెప్పనా అమ్మడు. మనసుంటే మార్గం ఉంటుంది. మీ తరంలో ఆడవాళ్ళు కూడా ఉద్యోగాలు చేస్తేనే మధ్య తరగతి కుటుంబాలు సాఫీగా సాగుతాయి కదా. అలాంటప్పుడు ఒకరికి ఒకరు చేదోడు వాదోడుగా ఉండటంలో తప్పేముంది? ఎప్పటికైనా మీ పెద్దమ్మ, పెద్దనాన్నలకి కూడా కొడుకు దగ్గర ఉంటేనే హాయిగా ఉంటుంది కదా" అంటూ చిద్విలాసంగా నవ్వేసింది బామ్మ.

"ఏమిటే అనన్యా అంత చిక్కిపోయావు? ఒంట్లో బాగానే ఉందా?" అడిగింది సాన్విక.

"ఏదో ఉన్నానే. అసలు రోజులు ఎలా గడుస్తున్నాయో తెలీట్లేదు. పొద్దున్న లేచింది మొదలు ఊపిరి సలపనన్ని పనులు. మా ఇద్దరికీ వంట చేసి, చార్వీకి వేరేగా బేబీ ఫుడ్ చేసి, నేను ఆఫీస్ కి రెడీ అయ్యి, దాన్ని రెడీ చేసి పరుగు పరుగున బయల్దేరతాం ఇద్దరం. రోజూ డే కేర్ లో పెట్టేటప్పుడు ఒకటే ఏడుపు అదేమో. దాన్ని అందులో వదిలి ఆఫీస్ కి వెళ్ళినా మనసంతా దాని చుట్టే తిరుగుతుంది. దాంతో పని మీద దృష్టి ఉండదు. మా మేనేజర్ నుండి వార్నింగ్ కూడా వచ్చింది పోయిన వారం, జాగ్రత్త గా పని చెయ్యకపోతే యాక్షన్ తీసుకుంటాం అని. పోనీ శని, ఆదివారాల్లో రెస్ట్ తీస్కుందాం, కొన్ని పనులు మా ఆయన పంచుకుంటారా అంటే, ఏవో చిన్న చిన్న పనులు అయితే చేస్తారు కానీ చార్వీ పనులు మాత్రం అన్నీ నేనే చెయ్యాలి. అయినా మా ఆయనని కూడా ఏమి అనలేకపోతున్నా. తను కూడా వారం అంతా కష్టపడి రెస్ట్ తీసుకునేది వీకెండ్స్ లో నే కదా. పోనీ ఉద్యోగం మానేద్దాం అనుకుంటే హౌసింగ్ లోన్ కూడా ఉంది, మానేస్తే ఖర్చులకి ఇబ్బంది అవుతుంది. స్ట్రెస్ ఎక్కువయిపోయి అసలే నిద్ర ఉండట్లేదు అంటే దానికి తోడు చార్వీ కూడా రాత్రిళ్ళు రెండు మూడు సార్లు లేస్తుంది. పరిస్థితులు అన్నీ కలిసి నా మీద కక్ష కట్టాయే" అంటూ ఉబికి వస్తున్న కన్నీరుని తుడుచుకుంటూ చెప్పింది అనన్య.

"పోస్ట్ పార్టం డిప్రెషన్ (కాన్పు తర్వాత మానసిక ఒత్తిడి లేక ఆందోళన) గురించి ఎపుడైనా విన్నావా? మన దేశంలో ప్రతి అయిదుగురిలో ఒకరికి ఇది వస్తోంది అని ఒక అంచనా. ఇది ఎంత తీవ్రమైన స్థాయికి వెళ్ళవచ్చు అంటే ఇటీవల ఒక ఆవిడ ముంబైలో పదిహేను రోజుల తన కన్న కూతురిని చంపేసింది. కారణం పోస్ట్ పార్టం డిప్రెషన్. రెండు రోజుల వరకు ఎవరితనూ మాట్లాడకుండా చివరికి మూడో రోజు నేరం ఒప్పుకుందట. ఇదివరకు ఇది మన దేశంలో ఎప్పుడూ లేదు. ఇప్పుడు ఎందుకు వస్తోందో తెలుసా? మన కుటుంబ విలువలు దెబ్బతినడం వల్లనే. మన కాలం వాళ్ళు ప్రతి దానికి డిప్రెషన్ అంటారు అని మన తల్లిదండ్రుల తరం వాళ్ళు కొట్టి పారేయ్యవచ్చు. కానీ వారి తరంలో ఇది ఎందుకు లేదు అని ఆలోచించి ఉండరు.

అనన్యా, అన్ని పనులు సొంతంగా చేస్కోగలను అనే ఆత్మ విశ్వాసం మంచిదే కానీ అది నీ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి సాధించుకోకు. అసలు ఈ విషయాలన్నీ మీ అమ్మ వాళ్లకి కానీ, మీ అత్తయ్య వాళ్లకి కానీ చెప్పావా?"

"లేదే. దూరంగా ఉన్నారు పైగా వాళ్ళ బిజీలో వాళ్ళు ఉంటారని చెప్పలేదు. అయినా సాన్వి, ఒకళ్ళు సహాయం చేస్తారని పిల్లల్ని కంటామా? మన ఆనందం కోసం మనం కంటాం. కష్టమో, నిష్ఠూరమో మన పిల్లలని మనమే పెంచుకోవాలి కదా. "

"చేతనైన సహాయం చేయమని అడగడమూ, పెంచమని అడగడమూ ఒకటే అంటావా అనన్యా? అయినా నాకు తెలియక అడుగుతాను, వాళ్లకి ఏదైనా అవసరం వస్తే నువ్వు ఆదుకుంటావా ఆదుకోవా? అవసరాలకి ఆదుకునే వాళ్ళు నీ వాళ్ళు అనన్యా, నీ సొంత వాళ్ళు. మీకు వాళ్ళు, వాళ్లకు మీరు సొంత వాళ్ళే కదా. మారుతున్న కుటుంబ విలువలు అని నేను ఇందాక చెప్పింది ఇదే."

"నువ్వు చెప్పే కుటుంబ విలువలు మారడానికి కారణం ఎవరు? మా దగ్గరకి వచ్చి ఉండండి అంటే మేము స్వతంత్రంగానే ఉందాం అనుకుంటున్నాం అంటారు. పిల్లల ఇళ్ళల్లో ఇమడలేరు. సరే పోనీ స్వతంత్రంగానే ఉండండి అంటేనేమో మమ్మల్ని దూరంగా ఉంచుతున్నారు అంటారు. ఎటు పోయినా సానుభూతి మాత్రం వాళ్ళకే ఉంటుంది పెద్దవాళ్ళు కనుక."

"ఈ రోజుల్లో పెద్దవాళ్ళకి పిల్లల ఇళ్ళలో ఇమడడం కష్టంగా ఉందన్న మాట వాస్తవమే. అందుకు ఇరు తరాల వారు బాధ్యులే అని నా ఉద్దేశం. ఎందుకంటే దీనికి మూల కారణం కమ్యూనికేషన్ గ్యాప్. చాలా కేసుల్లో అసలు ఒకరి వల్ల మరొకరు ఏమి ఇబ్బందులు పడుతున్నారో తెలీదు. మనసు విప్పి ఇదీ సంగతి అని మాట్లాడుకోవడానికి సంకోచిస్తుంటారు. ఒక్కోసారి పెద్దవాళ్ళేమో వారు కనీ పెంచిన పిల్లలు పెళ్లవగానే పరాయి వాళ్ళుగా మారిపోయారని భ్రమ పడుతుంటారు. ఇటు పిల్లలు కూడా ఒక్కోసారి పెద్దల్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. మనం మన పెద్దవాళ్ళను సరిగ్గా చూస్కుంటేనే రేపు మన పిల్లలు మనల్ని చూసుకుంటారు అని గ్రహించరు. వాళ్ళ పిల్లలకి వాళ్ళు సరియైన విలువలు నేర్పుతున్నారా లేదా అని ప్రశ్నించుకోరు. ఏదేమైనా అసలు ముందు నువ్వు మీ అత్తయ్య వాళ్ళని కానీ, అమ్మ వాళ్ళని కానీ అడిగి చూశావా అనేది ప్రశ్న. నువ్వు సహాయం కావాలి అని అడుగు. వాళ్ళు రామంటారా? అనగలరా?"

"మొదటి నుండీ పల్లెటూరిలో పెద్ద ఇంట్లో ఉంటూ ఇప్పుడు ఒక్కసారిగా ఈ మహానగరంలో ఇరుకు అపార్ట్మెంట్లలో ఉండటం కష్టంగా లేదా ఆంటీ?" దివ్య వాళ్ళ అమ్మగారిని అడిగింది అనన్య.

అనన్యకి బాల్య స్నేహితురాలు దివ్య. చిన్నతనంలో వాళ్ళ పల్లెటూరిలో పక్క పక్క ఇళ్ళలో ఉండేవాళ్ళు అనన్య వాళ్ళ బామ్మగారు వాళ్ళు, దివ్య వాళ్ళు. అనన్య సెలవులకి పల్లెటూరు వెళ్ళినప్పుడు ఇద్దరూ కలిసి పొలాల వెంట, మామిడి తోటల వెంట, కాలువల వెంట తిరిగిన ఎన్నో తీపి జ్ఞాపకాలు ఉన్నాయి వాళ్ళిద్దరికీ. దివ్య వాళ్ళ అమ్మగారు పల్లెటూరిలో ఉన్న స్కూల్లో టీచర్గా పని చేసి అదే స్కూల్కి ప్రిన్సిపాల్గా చేసి రిటైర్ అయ్యారు. వాళ్ళ నాన్నగారు ఉన్న పది ఎకరాల భూమిని కౌలకి ఇవ్వకుండా ఆయనే వ్యవసాయం చేసుకునే వారు. దివ్య చదువు అయిపోయి హైదరాబాద్లో ఉద్యోగం చేస్తూ ఉండగా, అదే ఊళ్ళో సంబంధం చూసి పెళ్లి చేశారు. ఇప్పుడు తనకి పిల్లవాడు పుట్టడంతో పల్లెటూరి జీవితం వదిలి పట్నానికి మకాం మార్చారు వారు.

"మొదట్లో కష్టమే అనిపించింది అనన్యా. కానీ ఇప్పుడు అలవాటు అయిపోయింది. విదేశాల్లో ఉన్న మనవలు, మనవరాళ్ళ కోసం ఏకంగా ఫ్లైట్లు ఎక్కి ఆరేసి నెలలు ఉండి వస్తుంటారు కొందరు. పైగా విదేశం వెళ్ళొచ్చాము అంటూ గర్వంగా చెప్పుకుంటారు. నిజానికి ఇక్కడ కంటే అక్కడే ఎక్కువ పనులు చేసుకోవాలి కూడా. అలాంటిది ఇదే దేశంలో కళ్ళెదుటే ఉంది కదా మా అమ్మాయి. ఆ మాత్రం రాలేమా! ఇక్కడ అపార్ట్మెంట్లో పిల్లల్ని పిలిచి సాయంత్రాలు ట్యూషన్ చెప్తున్నా. మీ అంకుల్ ఏమో మధ్య మధ్యలో వెళ్లి పొలం కౌలకి ఇచ్చారు కదా ఆ పనులు చూసుకుని వస్తున్నారు. ఎప్పటి నుండో చదవాలి అనుకున్న పుస్తకాలు లైబ్రరీ నుంచి తెచ్చుకుని మరీ చదువుకుంటున్నారు కూడా."

"అమ్మా, అనన్యకి పిల్లల బాధ్యత తల్లిదండ్రుల మీద, అత్తమామల మీద ఉంచకూడదు అని, ఈ వయసులో మీకు నచ్చినట్టు మిమ్మల్ని ఉండనివ్వాలి కానీ బాధ్యతల భారం మోపకూడదు అని గట్టి అభిప్రాయం ఉంది. అందుకే అలా అడుగుతోంది" తెలియజేసింది దివ్య.

అదా సంగతి అన్నట్టు చూసింది ఆవిడ అనన్య వైపు.

"మీ అమ్మాయితో ఉద్యోగం ఎలా మేనేజ్ చేస్తున్నావు అనన్యా?" అడిగారు దివ్య వాళ్ళ అమ్మగారు.

"డే కేర్ లో పెడ్తున్నా ఆంటీ"

తల్లీ కూతుళ్లు మొహాలు చూసుకున్నారు.

"అంటున్నా అని మరోలా అనుకోకు అనన్యా. చిన్నప్పటి నుండీ తెలిసిన చనువు కొద్దీ, టీచర్ గా నా సహజ స్వభావం కొద్దీ చెప్తున్నాను. మా వయసు వారిని మాకు నచ్చినట్టు మమ్మల్ని ఉండనివ్వాలి. నిజమే. కానీ పుట్టిన ఆరు నెలలకే డే కేర్ లో వేసే సంస్కృతి మనది కాదు అనన్యా. సమాజం లో ఇవాళ ఓల్డేజ్ హోమ్స్ ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించే జనం డే కేర్స్ ఎందుకు వస్తున్నాయని కూడా ఎందుకు ప్రశ్నించరో అర్థం కాదు."

"ఏముందమ్మా ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడం మొదలుపెట్టాకే కదా ఇవన్నీ వచ్చాయి. ఉద్యోగాలు చెయ్యకపోతే ఏం అని ప్రశ్నిస్తారు"

"అమ్మాయిలు కూడా చక్కగా చదువుకుంటున్నారు. ఏ కారణం తో ఉద్యోగం వద్దు అంటాం? ఒక వైపు ఆడపిల్లలకి చదువు చెప్పించాలి అని బేటీ పఢావో అంటూనే ఇంకో వైపు నుండి వాళ్ళ రెక్కలు కత్తిరించలేము కదా. ఆడవాళ్ళు కెరీర్ లో కొనసాగించాలి అంటే వ్యవస్థ తోడ్పాటు ఉండాలి అనన్యా. అలంటి వ్యవస్థ మనకి ఉంది. కానీ మనమే చేజేతులా దాన్ని నాశనం చేసుకుంటున్నాం. అంత వరకు ఎందుకు. మా దివ్య కూడా మొదట్లో నీ లాగే మీరు ఎవరూ రాకండి మేమే మేనేజ్ చేసుకుంటాం అంది. మీరు ఈ సిటీ లో ఇమడలేరు అంది. కానీ మేమే ముందుకి వచ్చాము. మా కోసం తను ప్రశాంతమైన కాలనీలో అపార్ట్మెంట్ తీసుకుంది. మాకంటూ ఒక రూమ్ కేటాయించింది. పూజ మందిరాన్ని నాకు నచ్చేటట్టుగా ఏర్పాటు చేసింది. మాకు ఏ ఇబ్బంది కలుగకుండా చూసుకుంటోంది. ఇన్ని చేసినా మాకు మా పల్లెటూరి ఇల్లు  జ్ఞాపకం వస్తూనే ఉంటుంది. అందుకే మధ్య మధ్యలో వెళ్లి వస్తూనే ఉంటాం.

మీ పిల్లల్ని పెంచడం మీ తల్లిదండ్రుల, మీ అత్తమామల బాధ్యత కాదు, కానీ చేతనైన సహాయం చెయ్యడం వల్ల వారికి కూడా మీ పిల్లలతో అనుబంధం ఏర్పడుతుంది. అలాగని మొత్తం బరువు బాధ్యతలు పెద్దలకి అప్పజెప్పకుండా కొద్దిగా తీరిక సమయం కల్పించాలి. అలా పూర్తిగా నెత్తిన పడితే అటు పిల్లలకి చెప్పుకోలేక, విడిచి రాలేక కొందరు సతమతమౌతారు. వారిని చూసి మిగిలిన వారు తమకి కూడా అటువంటి పరిస్థితి ఎక్కడ ఎదురవుతుందో అనే భయంతో అసలు సహాయం చెయ్యడానికి కూడా ముందుకి రారు. దానికి "ఇండిపెండెంట్ గా ఉండటమే మాకు ఇష్టం" అనే ముసుగు కప్పుతారు.  చెప్పొచ్చేది ఏమిటంటే అన్ని తరాల  వారు ఒకరి అవసరం ఇంకొకరికి ఉందని గ్రహించి సామరస్యంగా మెలగితే సమాజంలో ఓల్డేజ్ హోమ్స్ రావు, అలాగే డే కేర్ లు రావు"

"మీరు గుడికి వెళ్ళిరండి అత్తయ్యా. నేను ఇవాళ చార్వీ కి టిఫిన్ తినిపిస్తాను."

"నీకు ఆఫీస్ కి లేట్ అయిపోతుందేమో అమ్మా"

"ఫర్వాలేదు లెండి అత్తయ్యా. ఇవాళ లేట్ గా వస్తాను అని మా టీంకి చెప్పాను."

అనన్య వాళ్ళ అత్తగారు వాళ్ళు వచ్చి నెల రోజులైంది. అంతకు ముందే వాళ్ళ అమ్మానాన్నగారు వాళ్ళు కూడా వచ్చి వెళ్లారు. ఇప్పుడు చిన్నారి చార్వి ఇంట్లోనే బామ్మా, తాతగారు మరియు బేబీ సిట్టర్లతో కాలక్షేపం చేస్తోంది!

# సెల్

ఎమ్.కె.కుమార్

వైబ్రేషన్‌లో పెట్టిన సెల్ కాళ్లజర్రీ కదలినట్టు కదిలింది. సాయంత్రం 6 గంటలవుతోంది. ఆఫీసు నుండి ఇంటికి బయలుదేరుతున్నా. ట్రాఫిక్ విపరీతంగా వుంది. ఆగిన కాళ్లజర్రీ మళ్లీ పాకుతోంది. జేబులో నుండి అది బయటకు దూకేటట్టు వుంది. తిరప్తి నాలుక్కాళ్ల మండపం దగ్గర బైక్‌లో పోతున్నా. పక్కన ఆపుదామంటే, జనం గంగమ్మ జాతరకు వచ్చినట్టు వచ్చినారు. దీపావళి కాబట్టి రోడ్డు మీదే పిల్లల, పెద్దోళ్ల బట్టలు కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. సెల్ లో మాట్లాడాలంటే ఆ పద్మవ్యూహం నుండి బయటకు వచ్చేదానికి ప్రయత్నించాలి. ట్రాఫిక్‌ను దాటేలోపలే 10 కాల్స్ వచ్చాయి. ట్రాఫిక్‌ను దాటి రోడ్డు ప్రక్కన బైక్ ఆపి కాల్ చేశాను. అన్నమయ్య కీర్తన శ్రావ్యంగా వినిపిస్తోంది. తిరప్తిలో వ్యక్తే అని ఇట్టే అర్థమైపోయింది. దైవచింతన ఎక్కువట్టుంది, అన్నమయ్య పాట కాలర్ టోన్‌గా పెట్టాడు.

"హలో " అవతలి గొంతు బొంగురుగా వుంది.

" ఎవరండి ఇందాక 10 సార్లు కాల్ చేశారు " అన్నా.

" నీ పేరు అనంతేనా? "

"అవునండి "

" సెల్ ఎక్కడిది " ఏకవచనం, అదీ ప్రశ్న.

" మీరెవరండీ? " కొంచెం గొంతు పెంచాను.

" నా పేరు, చెంగలాల్రాయిలు, క్రైమ్ స్టేషన్ నుండి మాట్లాడ్తున్నా. ఏం నా పేరు చెప్తేగాని, తమరు వివరాలు చెప్పరా?" వెటకారంగా అన్నాడు.

" సార్, అసలు విషయం ఏందీ?" నా గొంతు సౌండ్ ఎవరో వాల్యూమ్ తగ్గించినట్టు తగ్గింది.

" అడిగిందానికి చెప్పరా? "

" సార్ .. కొంచెం మర్యాదగా మాట్లాడండి " నా మాటలు తడబడ్డాయి.

" సెల్ ఎక్కడ నొక్కేశావ్? "

" సార్, నేను సెల్ షాపులో కొన్నా "

" మూసుకుని పది నిమిషాల్లో క్రైమ్ స్టేషన్‌కి రా " ఫోన్ కట్ చేశాడు.

నా చేతులకి చెమటలు పద్దాయి. విషయమేందో తెలీదు. క్రైమ్ పోలీసులకు నాతో ఏంపనో అర్థంగాల. వాడు పది నిమిషాల్లో రమ్మన్నాడు. అసలు స్టేషన్‌కు ఎందుకు పోవాల. పోకుండా వుందామంటే ధైర్యం చాల్ల. ఎవరనన్నా తోడుకు రమ్మని అడుగుదామంటే, యక్ష ప్రశ్నలేస్తారు. నాకు తెలిసిన లాయరు మిత్రుడికి ఫోన్ చేశా. సెల్ స్విచ్ఛాఫ్ వచ్చింది. నేనేం తప్పు చేయలేదు, ఏమయితే అదౌతుందని, బైకును క్రైం స్టేషన్‌కు పోనిచ్చా.

నా జీవితంలో పోలీసు స్టేషన్‌కి వెళ్లడం అదే మొదటిసారి. స్టేషన్ బయట, బైక్ పెట్టా. జనాలు గుంపులు గుంపులుగా వున్నారు. రెండు పోలీసు జీపులు బయట ఆగున్నాయి. నా చొక్కా బటన్స్‌ను సరిచేసుకున్నా. మడిచిన చొక్కా చేతుల్ని ఫుల్‌హాండ్స్ చేసి బటన్స్ పెట్టుకున్నా. మొదటిసారి స్కూల్లో చేరిన విద్యార్థి మల్లే బెరుగ్గా లోపలికి పోయా. ఎదురుగ్గా ఒక ఆడపోలీసు ఇంత రద్దీలో కూడా పేపరు చదువుకుంటోంది. ఆమె ముందరకి పోయి,

" మేడమ్ " నా మాట నాకే వినిపీల

మళ్లీ " మేడమ్ " అన్నా.

పేపరు కొంచెం కిందకి దించి, " ఏం కావాలి? " ప్రశాంతంగా అడిగింది.

ఈ లోపల హడావుడిగా నలుగురు పోలీసులు, ఒక పెద్ద తలకాయ పోలీసు స్టేషన్‌లో నుండి బయటకి పోయినారు. వాళ్లకి వినయంగా దారిచ్చి, మళ్లీ మేడమ్ వైపు చూసేటప్పటికీ, ఆమె తలకాయ బదులు పేపరు కనిపించింది. కొంచెం పక్కగా ఒక నడిమోస్తరు పోలీసాయన నిలబడి సెల్‌లో మాట్లాడుతున్నాడు. విధిలేక ఆయన కళ్లలో పడేదానికి నానా తంటాలు పడ్డా. " సార్.. చెంగల్రాయలు సార్ " కొంచెం నీళ్లు నమిలా.

ఆయన సెల్‌లో పూర్తిగా మాట్లాడి " ఎవడు.. చెంగల్రాయలా, నా కొడకా, కళ్లు బైర్లు కమ్మినాయా.. రేయ్ ఈ నా కొడుకుని లోపలెయ్యండ్రా " అంటూ మళ్లీ సెల్ మోగితే చెవికి ఆనించుకున్నాడు.

ఆయన అరుపుకు లోపల్నించి, ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చారు. నన్ను భుజం మీద చెయ్యేసి కొంచెం తోసుకుంటూ లోపలికి తీసుకుపోయిన్నారు.

" ఏయ్యా, నీకు బుద్దుందా, సిఐ దగ్గరికి పోయి కానిస్టేబుల్ పేరడగుతావ్, ఇంకా నయం, లాగిపెట్టి తన్నల" ఒక బట్టతల పోలీసాయన రుసరుసలాడాడు. దాన్నుండి తేరుకునేదానికి నాకు 5 నిమిషాలు పట్టింది. ఏం మాట్లాడితే ఏం కొంప మునుగుతుందేమోనని, మూసుకోని నిలబడ్డా.

ముక్కు చివర చిన్న కళ్లజోడు పెట్టుకుని, తలవంచుకుని ఏదో రాసుకుంటున్నాడు. తపాలా బోర్లించినట్టుంది. బోడిగుండు మెరుస్తోంది. రాసుకుంటున్నాయన ఎవరో కీ ఇచ్చినట్టు తల సర్రున పైకెత్తి " నా కొడకల్లారా, మక్కెలిరగ దీస్తా, నేను లేచానంటే మనిషిని కాదు, ఆ పెంట నోళ్లను కొంచెం మూయండి " అని అక్కడున్న నా లాంటి వాళ్లను ఉద్దేశించి అరచి మళ్లీ కిందకి దించేశాడు.

ఆయన అరుపుకు నేను ఒక చివర నిలబడ్డా. తపాలా మొహమోడు రైటరని అర్థమైంది. అతని ఎదురుగా ఇద్దరు కానిస్టేబుళ్లు డబ్బులు లెక్కలేసుకుంటున్నారు. ఎదురుగా నలుగురు ఒక గుంపుగా దాదాపుగా ఒకరిమీద ఒకరు కుర్చోన్నారు. వాళ్లకి కొంచెం పక్కగా చిన్న జైలు లాంటిదుంది. అది మా యింట్లో బాత్రూమ్‌కన్నా చిన్నది. దాంట్లో దాదాపు 6 మంది ముఖాలు వేలాడదీసుకుని కూర్చున్నారు. వీళ్లందరితో సంబంధం లేనట్టు ఒక నడివయసు ఆమె, ప్రశాంతంగా కూర్చొని ఏదో ఆలోచిస్తోంది. రైటరు యధావిధిగా తలపైకెత్తి, అదే అరుపు, మాట అరచి రాంగ్‌వేలో తల నా వైపు తిప్పాడు.

" ఎవడ్రా నువ్వు..?" పిలిచినా అరచినట్టుంది.

" సార్.. నా పేరు అనంత్.." నేను విషయం చెప్పబోయేంతలోనే అతనే నా సెల్ నంబరు కూడా చెప్పాడు తన సెల్ చూస్తూ.

" అవున్సార్, ఆ నెంబరు నాదే. తమరు చెంగలార్యిలా సార్ " కొండమీద వెంకన్న దర్శనం ఎట్టకేలయినట్టు అనిపించింది.

" ప్యాంటు, షర్టు విప్పి.. ఆ నా కొడుకుల పక్కన కుర్చో.. రేయ్ అల్లుడుగారికి కొంచెం జాగా ఇయ్యండ్రా " అరుస్తూ మళ్లీ రాసుకోవడం మొదలుపెట్టాడు. నా కాళ్లు నాకు తెలియకుండానే వణకడం మొదలెట్టాయ్. అసలు నాకే చెప్పాడా, అనుమానంతో చుట్టూ చూశా, ఎవరు లోకంలో వాళ్లున్నారు. ఇంతలో డబ్బులు పూర్తిగా లెక్కించిన కానిస్టేబుళ్లు నన్ను రమ్మని దగ్గరికి పిల్చారు. ఊసూరుమంటూ వెళ్ళా.

" నీ సెల్, జేబులో వున్న డబ్బులు, ఇంకా ఏమన్నా వుంటే, అన్నీ టేబుల్ మీద పెట్టు " అన్నాడు ఇద్దరిలో ఒక కానిస్టేబుల్. నాకు లోపలెక్కడో ఆవగింజంత వున్న ధైర్యం కాస్తా ఆవిరై పోయింది. అక్కడ మాట్లాడాలంటే గొంతు పెగలడంల. చిన్నగా కళ్లు తిరుగుతున్నట్టు అనిపించింది. నా జేబులో వున్నవన్ని వణుకుతూనే టేబుల్ మీద పెట్టా.

" నువ్వు ఎంప్లాయా? " కానిస్టేబుల్ నా గుర్తింపుకార్డును చూస్తూ అడిగాడు.

" అవున్సార్, తిరప్తి దేవస్థానంలో అటెండరుగా పనిచేస్తున్నా, సార్ " కొంచెం బొంగురు గొంతుతో చెప్పా. దాంతో పోలీసోడు తన పక్కన కుర్చోమన్నాడు. వూపిరి పీల్చుకుంటూ అతని పక్కన కుర్చున్నా.

రైటరు తలపైకెత్తి " సెల్ ఎక్కడ కొట్టేశావ్ ?" గొంతులో ఘాటు తగ్గించి అడిగాడు.

" సార్, సెల్ కొన్నా సార్, బస్టాండ్ దగ్గర షిర్డి మొబైల్ షాపులో కొన్నా సార్ " తడబడుతూ చెప్పా.

" బిల్లుందా? " రైటరు గద్దించాడు. " లేద్సార్, సెకండ్ హాండ్ సెల్ సార్ " అన్నా.

" అదికాదయ్యా, తిరప్తి దేవస్థానంలో పనిచేస్తూ, కొత్త సెల్లు కొనుక్కోకుండా దొంగ సొత్తు నీకెందుకయ్యా " కానిస్టేబుల్ వెటకారంగా అన్నాడు.

" సార్, తెలియద్సార్, తెలిస్తే ఎందుకు కొంటాను సార్ " నీళ్లు నమిలా.

రైటరు నా వైపు సీరియస్ గా చూస్తు అన్నాడు " యోవ్, నీ దగ్గరుండేది దొంగ సెల్, ఆ సెల్‌ను, 20 గ్రాముల బంగారం గొలుసును తట్టేశాడు. సెల్‌లోని ఈఎమ్ఐవి నెంబరును బట్టి నీ సెల్ నెంబరును ట్రేస్ చేశాము ".

" దొంగ వస్తువు నీ దగ్గర వుంది కాబట్టి, నీ మీద కేసుకట్టి కోర్టుకు పంపిస్తాం. నీ బాధంతా కోర్టుకు చెప్పుకో " మరో మాట లేకుండా, తలను కిందకి దించి పెన్నుతో గీకడం మొదలెట్టాడు. అసలు కాగితాల మీద రామకోటి మాదిరి ఏం రాస్తున్నాడో అర్థంగాల. నా గుండె చిన్నగా అదరడం మొదలుపెట్టింది. ఒక సెల్ కొంటే సెల్‌లో వేస్తారా, దీని వెనకాల ఇంత ఎపిసోడా. ఏం చేయాలో దిక్కు తోచల.

ఈ లోపల ఇద్దరొచ్చి, రైటరికి వంగి మరీ దండాలు పెట్టారు. రైటరు తలెత్తి " ఏరా ఎన్నిసార్లు చెప్పినా మీకు బుద్దిరాదా, దొంగసెల్లులు అమ్మడమే మీ వృత్తా? " అంటూ చిరాకు పడ్డాడు.

వాళ్లు అతివినయంగా ఏం మాట్లాడకుండా నిలబడేవున్నారు.

కానిస్టేబుల్ నన్ను పిలిస్తూ, వాళ్లిద్దర్ని చూపిస్తూ " నీకు తెలుసా వీళ్లు?" అన్నాడు. మొదట తెలీదన్నట్లు తలూపబోయి, నిదానంగా అతని నిలకడలేని కళ్లని చూసి, యాడ్నో చూశానే అని బుర్ర గోక్కున్నా. తర్వాత నా మొహం విప్పారింది. ఆత్మీయుడ్ని చూసినట్టు అతన్ని చూస్తూ " సార్, ఇతని షాపులోనే నేను సెల్ కొన్నా " కొలంబస్ అమెరికాను కనుగొన్నంత రేంజ్‌లో అరిచా.

కానిస్టేబుల్ తల పంకిస్తూ " ఆ పక్కనాయన తెలుసా? " అని అడిగాడు.

" లేద్సార్ " ఖచ్చితంగా చెప్పా.

" వాడు కొట్టేసిన సెల్‌నే నువ్వు షాపులో కొంది " అని కానిస్టేబుల్ నింపాదిగా అన్నాడు.

" సార్, మీరు నిజంగా పోలీసోళ్లు సార్.. నిమిషాల మీద అందర్ని పట్టుకున్నార్ సార్ " మహా సంబరిపడిపోతూ అన్నా.

రైటర్ తలెత్తి నా వైపు చూశాడు. వాడి కాకి మొహం చూడగానే నా మొహం మాడి పోయింది.

"సరే, సెల్ దొరికింది, 10 గ్రాముల బంగారు గొలుసు మాటేంటి?" రైటరు నా వైపు చురచుర చూస్తు గద్దించాడు. ఎవ్వరూ ఏం మాట్లాడల.

మళ్లీ రైటరే " మీరు ముగ్గురు బైటకెళ్లి నాకు ఆ 10 గ్రాముల బంగరం సంగతిని తేల్చండి, లేదంటే ముగ్గురి మీద కేసు పెడ్తా" హుంకరిస్తూ తల దించుకుని తన పనిలో నిమగ్నమయ్యాడు.

ఊసూరుమంటూ మేం ముగ్గురం బైటకి పోతుంటే నాతో చనువుగా మాట్లాడుతున్న కానిస్టేబుల్, నా సెల్ తప్ప నా డబ్బులు, వస్తువులు అన్నీ నాకిచ్చేశాడు. " రాత్రి 9 అవుతోంది, బయటకెళ్లి 6 చికెన్ బిరియానీ, ద్వారకా హోటళ్లో తీసుకురా " ఆర్డరేశాడు. నేను కుదరదు అని చెప్పలేకపోయా. అతనే అక్కడున్న పిల్లోడ్ని పిలిచి "సార్ డబ్బులిస్తాడు, బిరియానీ తీసుకురా" అని ఆర్డరేసి వెళ్లిపోయాడు. నేను మారు మాట్లాడకుండా వెయ్యి రూపాయలిచ్చా.

ముగ్గురం స్టేషన్ బయటకు వచ్చాం. సెల్‌ఫోను చుట్టూ ముగ్గురు జీవితాలు అల్లుకున్నాయి. తమాషా ఏంటంటే నా అంత బాధ వారు పడటం లేదు. అది నాకు మరింత బాధనిస్తోంది. రోడ్డుమీద జనాలు వాళ్ల కుటుంబాలతో ఆనందంగా తిరుగుతున్నారు. టపాసుల హోరుకి తిరప్తి మారు మోగిపోతోంది. ఆకాశం రంగు, రంగుల చొక్కాలేసుకుంటోంది.

"ఊరంతా దీపావళి, మన ముగ్గురికి తప్ప, అయినా ఇంతమంది శ్రీకృష్ణుడ్లు వుంటే.. ఇంకేం దీపావళి " స్టేషన్ వైపు నిష్టూరంగా అన్నా.

" సరే, తొందరగా తేల్చండి. నేను పిల్లలకు టపాసులు తీసుకుపోవాల, ఫోన్ల మీద ఫోన్లు వస్తున్నాయి " సెల్‌షాపు ఓనర్ చిరాగ్గా అన్నాడు.

" అది గాదన్నా, సెల్ కొట్టేసింది ఈ కుర్రాడు, ఆ సెల్ అమ్మింది నువ్వు, అయినా నాకేం సంబంధం " లాయర్ వాదన మొదలెట్టా.

" అదే సెల్ కొన్నావ్ కాబట్టి " విసురుగా అన్నాడు ఓనరు.

" ఎంత అన్యాయం గురు, నీ షాపులో సెల్‌కొన్న కస్టమరు గురించి ఆలోచించవా? " ఆక్రోశంగా అన్నా.

" తప్పక ఆలోచిస్తా, కొత్త సెల్ కొంటే, కాని సెకండ్ హేండ్ సెల్ కొన్నోళ్ల గురించి కాదు. అయినా ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ రాదు " షాపు ఓనరు సెలవిచ్చాడు. అతను ఎవ్వరికో ఇందాకటి నుండి తెగ ఫోన్లు చేస్తున్నాడు.

సెల్ దొంగలించిన కుర్రాడు ఏ మాత్రం చలించడం లేదు. వాడ్ని చూస్తే, నాకు ఆశ్చర్యం కలుగుతోంది. నిండా 20 ఏళ్లు వుండవు. పైగా డిగ్రీ చదువుతున్నాడు. లెక్కలేనట్టున్నాడు. వీడి లెక్కేందో అర్థంగాల. అదే విషయం వాడ్ని అడిగా.

" అన్నా, నేను తెచ్చిన దొంగ సెల్లులన్నీ ఈ షాపాయనకే అమ్ముతా. ఈ స్టేషన్లో పై నుంచి కిందవరకు ప్రతి పోలీసోడికి ఈ షాపాయన వాటా ఇవ్వాల. ఈ మధ్య ఇవ్వడం లేదేమో " షాపాయన వైపు అనుమానంగా చూస్తూ అన్నాడు.

" నేనే కాదు. తిరప్తిలో సెకండ్ హేండ్ సెల్‌ఫోన్లు అమ్మే ప్రతి షాపువాడు ఇవ్వాల " షాపు ఓనర్ పళ్లు ఇకిలిస్తూ అన్నాడు.

" అయినా చదువుతున్నావు కదా, నీకెందుకు ఈ సెల్‌ఫోన్ దొంగతనాలు? " చనువుతో కుర్రాడినడిగా.

" నీకవసరమా, వాడు లేకపోతే నా షాపు లేదు, ఈ స్టేషను లేదు.' కొంచెం మీ పని చూసుకోండి" నావైపు గుర్రుగా చూస్తూ అన్నాడు షాపు ఓనరు.

" ఇది తిరప్తి, రోజుకు 50 వేలమంది భక్తులు వస్తూ పోతుంటారు. ఇట్లాంటి సెల్‌దొంగలు డజన్ల కొద్దీ వుంటారు. వీరి కోసం మా లాంటి షాపులు వుంటాయి. కక్కుర్తిపడి వాటిని కొంటానికి నీ లాంటి కస్టమర్లు వుంటారు. ఏ భక్తుడు సెల్ ఫోన్ పోతే కంప్లైంట్ చేయడు. వాడు దర్శనం అయినాంక వూరికి పోయే హడావుడిలో వుంటాడు. కంప్లైంట్ చేసేదానికి వచ్చినా పోలీసుల్లోకి డబ్బులియ్యాల. వాడికి అవసరమా ఇదంతా " చిన్న సైజు ఉపన్యాసమిచ్చాడు షాపు ఓనరు.

" ఎవడో సెల్ డేటాతో అవసరమయ్యే భక్తుడే ఫిర్యాదు చేస్తాడు. అదీ కొంచెం ప్రెజర్ చెయ్యిస్తినే యవ్వారం ఈడదాకా వస్తాది " షాపాయన కంటిన్యూ చేశాడు.

" మరి పోలీసోళ్లకు మీరు మామూళ్లు ఇచ్చేటప్పుడు మిమ్మల్ని ఎందుకు స్టేషన్‌కు పిలుపిచ్చారు? " నేను ఆశ్చర్యంగా అన్నా.

" మరీ అమాయకంగా మాట్లడతావేం గురూ. ఎన్ని సెల్‌ఫోన్లు దొంగలించినవి కొన్నామో పోలీసోళ్లకి చెప్తామా, లేకపోతే ఈ నాకొడుకులకి అన్నిటికి వాటా ఎవడిస్తాడు. అందుకే నా కొడుకులకి కడుపుమంట, అవకాశం వస్తే ఇలా పేచీ పెడతారు " షాపాయన అన్నాడు.

" అన్నా నీ దగ్గర పదివేలు పెట్టి ఐ ఫోను కొన్నా, డబ్బు పోతే పోయా, మళ్లీ బంగారం అంటూ భయపిస్తున్నాడే " కళ్లల్లో నీళ్లు తిరుగుతుంటే మాటలు కూడా బయటకి రాల.

" అరే దీనికి ఏడస్తావెందుకు, ఏం భయపడకు, పోలీసోల్లకి దుడ్లు కావాల, అందుకే బంగారం కత అల్లినారు, అసలు కంప్లైంటిస్తే, కంప్లైంటిచ్చినోడు ఇంతవరకు ఈడకెందుకురాల, సెల్‌కూడా దొరికిందిగా " సూటిగా అన్నాడు కుర్రాడు. ఎందుకో వాడ్ని చూస్తే దొంగ అనబుద్ది కావడంలా. పోలీసోళ్లకన్నా వాడు ఎంతో మంచివాడిగా కనిపించాడు.

మేం మాట్లాడుతుండంగానే ఎవరో చేతికి బ్రాస్‌లెట్, చేతి వేళ్లకి నాలుగు ఉంగరాలు, మెడ్లో కుక్కకి కట్టే గొలుసంత లావు బంగారు చెయిన్ వేసుకుని స్టేషన్‌కి వచ్చాడు. ఖద్దరు చొక్కా వేసుకున్న అతను మా వైపు చూసి, చేయూపి, స్టేషను లోపలకెళ్ళాడు.

" ఇంకేం బయంలే, ఆయన లోపలకెళ్లి విషయం సెటిల్ చేస్తాడు " కుర్రాడు హుషారుగా అన్నాడు.

అన్నట్టుగానే పది నిమిషాల్లో ఖద్దరాయన సినిమాలో హీరో లెక్క నవ్వుతూ బయటకొచ్చాడు. లేకపోతే నాకలా అగుపించాడో తెలియదు.

" తలా 7 వేలు ఇచ్చేయండి, ఇంటికెళ్లి టపాసులు కాల్చుకోండి " మీసం సవరించుకుంటూ అన్నాడు.

కుర్రాడు, షాపాయన ముందుగానే డబ్బులతోనే స్టేషను కొచ్చినట్టున్నారు. చెరో 5 వేలిచ్చి, " దీంతో అడ్జస్టు చేయన్నా, పండగ కదా " వినయంగా అన్నారు. ఆయన నా వైపు తిరిగి " ఏం తమ్ముడూ, డబ్బు బయటకి తీ " అన్నాడు.

" అన్నా.. నాకు సంబంధం లేకున్నా " నేను మాట ముగించక ముందరే " సరే బ్రదర్, అదే విషయం రైటర్‌కి చెప్పుకాని రా " అంటూ అతను స్టేషన్ వైపు వెళ్లబోయాడు. " అన్నా నా దగ్గర మూడువేలే వున్నాయి. అది పండక్కి, నా భార్యా, పిల్లలకు బట్టల కోసం అప్పుజేసినా, తీసుకోండి, మిగిలింది రేపిస్తా " బెరుగ్గా అన్నా.

" సరే.. తమ్ముడూ, నేనేం పోలీసోడినా, అట్లనే ఇద్దువులే, నా సెల్ నెంబరు తీసుకో " అంటూ విజిటింగ్ కార్డిచ్చాడు. మళ్లీ ఖద్దరాయన లోపలికెళ్లాడు.

" అన్నా ఈయనెవరు?" వుండబట్టలేక అడిగా. ఎందుకంటే కోర్టు, జైలంత పెద్ద విషయాన్ని నిమిషాల మీద సెటిల్ చేసిన శ్రీకృష్ణ పరమాత్ముడి మల్లే అగుపించాడు.

" బ్రోకరు " వెటకారంగా అన్నాడు షాపాయన.

" తిరప్తిలో ఇటువంటి విషయాలన్నిటికీ ఈయనే దిక్కు. అటు పోలీసులోళ్లకి, ఇటు దొంగలకి " కుర్రాడు గీతోపదేశం చేశాడు.

అతని విజిటింగ్ కార్డుని జాగ్రత్తగా జేబులో పెట్టుకున్నాను. ఈ సారి ఖద్దరాయనతో పాటు రైటరు కూడా బయటకి వచ్చాడు. ఆయనకి ద్వారపాలకుల మాదిరి ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చారు. మగ్గురు వినయంగా నిలబడ్డాం. రైటరు నవ్వుతూ ముగ్గురికి, షేక్‌హాండిచ్చి " హ్యాపీ దీపావళి " కాకరొత్తులా నవ్వాడు. దొంగ సెల్ ఖద్దరాయన చొక్కా జేబులోంచి తొంగిచూస్తోంది. అందరూ నవ్వారు నేను తప్ప.

## భిక్ష — విద్యార్థి

"మావయ్యా, నీకు అసలు బుద్ధి ఎప్పుడు వస్తుందీ?" అంటూ మృదువుగా సాగదీసింది సత్యవతమ్మ.
"ఇప్పుడు బుద్ధి వచ్చి మాత్రం ఉపయోగం ఏముందీ? అన్నీ అవచేసుకున్న తరువాతా!" వంత పాడింది భారతమ్మ.

"అసలు ఏమాత్రం బుద్ధి ఉన్నా, అత్తమ్మకు పసుపుకొమ్ము కట్టి అటునుంచి అటు జైలుకు వెళ్లేవాడా?' ప్రశ్నించింది స్వరాజ్యమ్మ.

"బాబూ, మన త్యాగ బుద్ధి సమష్టికి మంచి చేస్తుంది" అన్నాడు వందేమాతరం తాతయ్య నన్ను చూస్తూ.

ఎందుకో గొంతు పూడుకుపోయి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ముప్పై సంవత్సరాల క్రితం చదువు కోసం నేను అమెరికా ప్రయాణమవుతున్న రోజు అది. రాత్రికి ప్రయాణమైతే పగలంతా దగ్గరి బంధువులు అందరి మధ్యనా గడిపిన సన్నివేశం కళ్లలో తిరిగింది.

ఇన్ని సంవత్సరాల తరువాత, ఇంట్లో శుభకార్యం, బంధువులమంతా ఒకచోట కలుద్దామని కూడుకున్నాం. ఇరవై మూడు గంటల విమాన ప్రయాణం, ఆరు గంటల కారు ప్రయాణం. ఊరు దగ్గరదాక వచ్చాను, కానీ ట్రాఫిక్‌లో చిక్కుకున్న కారు కదలటం లేదు. ఇంకొక గంటలో ఇంటికి చేరతామని డ్రైవర్ సర్ది చెప్పాడు.

కళ్లు మూసుకుని తల వాల్చాను. ముప్పై ఏళ్ల నాటి ఆ దృశ్యం కళ్లల్లో కొనసాగింది.

ప్రతి సంవత్సరం వీరాయి పౌర్ణిమకు మా ముగ్గురమ్మల సంతానం, మామయ్యల సంతానం, వాళ్ల కుంటుంబాలు వేసవి శలవలు ముగిసే సమయానికి ఒక చోటకి చేరేవారం. మా ముగ్గురమ్మలూ వీరాయి పౌర్ణిమ రోజున వందేమాతరం తాతయ్యను పిలిచి, ఆయనకు పంచెలు పెట్టి, ఆయన భోంచేసిన తరువాత మామిడి పళ్ళు పెట్టి, ఆయన ఎంగిలి ఆకులోనే అందరికీ కొత్త ఆవకాయ ముద్దలు కలిపి పెట్టేవాళ్లు. ఇది మా ఇంటి ఆచారం. "మనమందరం ఈ రోజు ఒక పచ్చడి మెతుకుల ముద్ద తినగలుగుతున్నామంటే వందేమాతరం తాతయ్య ఎంగిలి మెతుకులే, ఇది ఆయన పెట్టిన భిక్ష" అని మా అమ్మలు మాకు పాఠం చెప్పేవారు.

మా ముగ్గురు అమ్మల సంతానంతో బాటూ, మామయ్యల పిల్లలమందరమూ అందరి అమ్మల చేతి అన్నపు ముద్దలు తిన్నాం, అందరి ఇళ్లళ్ళోనూ చదువుకుని పెరిగాం, అందరి అమ్మలతో మొట్టికాయలూ తిన్నాం. వందేమాతరం తాతయ్యను మా అమ్మలు ఎన్ని మాటలైనా అనే హక్కు ముద్దుల మేన కోడళ్లగా వాళ్లకు సంక్రమించింది. వేరే వాళ్లెవరైనా ఆయనని ఒక్క మాటంటే మాత్రం చీరేస్తారు.

"అసలు నువ్వు తిని ఏనాడయ్యింది?" అంటూ పప్పు గుత్తిని పక్కన పెట్టి, పప్పు పిడతను తాతయ్య అరిటాకు లోని అన్నం మీదకు వంచి, వేడి వేడి పప్పును ఓరగిలించింది సత్యవతమ్మ.

"సంవత్సరానికోసారి మన ఇంట్లో మనం పెడితే తినటమే కానీ ఏనాడయినా తను తిన్నాడా, అత్తమ్మకు పెట్టాడా?" అన్నది భారతమ్మ మట్టి మూకుడులోని గుమ్మడి కాయ కూరను ముల్లు అట్లకాడతో కలదిప్పుతూ.

"ఒంటెలాగా సంవత్సారనికి ఒకే ఒక్కసారి తినగలడు, ఊళ్లోవాళ్ల బరువులు మోస్తూ సంవత్సరమంతా తిరగగలడు" మజ్జిగ చిలుకుతూ అన్నది స్వరాజ్యమ్మ.

"బాబూ, పప్పు మన వంటికి శ్రేష్ఠం, శాఖాహారం మంచిది" అన్నాడు వందేమాత్రం తాతయ్య. ఆయన అన్నది నాకు అర్థమయ్యింది. అమెరికా వెళ్లి మాంసాహారపు అలవాట్లు చేసుకోవద్దు, అహింస వద్దు, ఆస్వాద నియంత్రణ చేసుకో అని చెపుతున్నాడు.

"అసలు మేము అడిగేదేమిటీ? నువ్వు చెప్పేదేమిటీ? పాపం అత్తమ్మ ఎలా నెట్టుకొచ్చిందో నీతో?" ఒక్కసారిగా వాపోయి తలలు పట్టుకున్నారు ముగ్గురమ్మలూ.

"ఆ పసుపు కొమ్ము కట్టటేమే తప్ప, అత్తమ్మకు ఏనాడయిన్నా చిన్నమెత్తు పెట్టావా? అసలు ఆ పసుపు కొమ్ము మాత్రం కొనుక్కొచ్చాడూ! ఎక్కడినుంచో అరువు పట్టుకొచ్చాడు కాదూ? జైల్లో కూర్చుని ఒక పేక రాట్నం మాత్రం పంపించాడు అత్తమ్మకి. అదేదో గొప్ప ఘనకార్యం అయినట్టు." పొడిగించింది సత్యవతమ్మ.

"జైలులోనుంచి వచ్చి ఏమన్నా ఇంటి పట్టున ఉన్నాడా? మళ్లీ పోయి లాఠీ దెబ్బలు తినొచ్చాడు కాదూ? పాపం, అత్తమ్మ ఉపచర్యలు చేసీ చేసీ తను మూలబడింది" నిట్టూర్చింది భారతమ్మ.

"అసలు నువ్వు వెళ్లితే వెళ్లావు జైలుకి, లాఠీ దెబ్బలు తింటే తిన్నావు, నీతో పాటు అత్తమ్మను తీసుకు వెళ్లటమేమిటి? పదమూడేళ్లన్నా ఉన్నాయో లేదో అత్తమ్మకప్పుడు, దేశభక్తి గేయాలు అంటూ నేర్పి ఉరూరూ పాడిస్తూ ఎండల్లో తిప్పావు. ఏం, ఉళ్లో అందరనీ పొరుగూరు కాలేజీకి పంపించావు, అత్తమ్మను ఎందుకు పంపలేదూ"? ఝూడించింది స్వరాజ్యమ్మ.

"బాబూ, సత్య శోధనకు దృఢ సంకల్పం తోడైతే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదు" అన్నాడు నన్ను చూస్తూ వందేమాతరం తాతయ్య. శ్రద్ద పెట్టి, ఎన్ని కష్టాలు ఎదురైనా పై చదువు పూర్తి చేసుకోమని తాతయ్య నాకు చెపుతున్నాడని అర్థమయ్యింది.

మా ముగ్గురమ్మలతో పాటూ మా మామయ్యలకీ, వాళ్ల సంతానం, అనగా మా తరం పిల్లమూక ప్రతి ఒక్కరికీ పేర్లు పెట్టింది వందేమాతరం తాతయ్యే. గాంధీ గారు ఒకానొకసారి సత్యాగ్రహం మొదలుపెడితే, మద్దతుగా వందేమాతరం తాతయ్య వెళ్లబోతున్న సమయంలో పుట్టిందట సత్యవతమ్మ. గాంధీ గారు "భారత్ చోడో" ఉద్యమం మొదలు పెట్టి లాఠీ దెబ్బలు తినటానికి వెళ్లేటప్పుడు పుట్టిందట భారతమ్మ. ఇవ్వన్నీ జరిగిన తరువాత నెహ్రూ గారు “Tryst with Destiny” అంటూ అర్థ రాత్రి పూట ప్రసంగిస్తుంటే ఠంచనుగా పుట్టుకొచ్చిందట స్వరాజ్యమ్మ.

"నువ్వు కోరుకున్న స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా నీ బాగు నువ్వు చూసుకో లేదు, అది సరే, అత్తమ్మను కూడా సుఖపడనీయక పోతివి. ప్రభుత్వం నీకు ఫించను ఇచ్చింది కదా, ఎప్పుడన్నా రూపాయ్ ఇంటికి తీసుకువచ్చి అత్తమ్మకు ఇచ్చావా?" సాగదీస్తూ ప్రశ్నించింది సత్యవతమ్మ.

"ఫించను డబ్బు పోతే పోనీ, అది నువ్వు తిన్న లాఠీ దెబ్బలకే వచ్చిందని అనుకుందాము. వారసత్వంగా నీ వంతు వచ్చిన ఎకరాన్నర మెట్ట పొలం కూడా దానం చేశావయ్యే, కనీసం అదైనా ఉంచుకోవద్దూ?" గదమాయించింది భారతమ్మ.

“ఆ మెట్ట పొలం కూడా తన వారసత్వపు హక్కేననుకో, కనీసం అత్తమ తెచ్చుకొన్న రెండెకరాల మాగాణి కూడా దానం చేసావయ్యే? పిచ్చిమాలోకం కాకపోతే అత్తమ్మ నువ్వు చెప్పిందల్లా విన్నది. ఊరుకి ఆనుకుని ఉన్న చేను, మంచి నీటి సాగు ఉన్న పొలం, బంగారం పండే పొలం. అది కూడా మిగల్చక పోతివి!!! అసలు అత్తమ్మ పొలం మీద నీకేమిటి హక్కు?" నిలదీశింది స్వరాజ్యమ్మ.

“బాబూ, బళ్లారి జైలులో ఒక గదిలో పద్నాలుగురం ఉండేవాళ్లం. అందులో నాతో పాటు చౌటపల్లి కుఝ్ఞాడు వెంకటేశ్వర రావు అని ఉండేవాడు. పస్తుల్లుండి, సంగీతం నేర్చుకున్నాడు. ప్రతి రోజూ ఉదయానే క్రమం తప్పకుండా సాధన చేసేవాడు. పట్టుదల, సాధన ఉంటే ఎంతటి శిఖరాలనైనా చేరవచ్చు. మనమొక్కరమే చేరటం కాదు, మనతో పాటు అందరినీ తీసుకువెళ్లాలి”. క్రమ శిక్షణతో చదువుకో, సర్వభావనతో మెలగమని చెపుతున్నాడని అర్థమయ్యింది నాకు.

అని చెప్పి భువనభోనంతరాలు దద్దరిల్లేటట్టు "బ్రేవ్, బద్ద" అంటూ ఒక తేపు తేపి, కళ్ల జోడు సరి చేసుకుని శూన్యంలోకి చూస్తూ పొట్ట సవరదీసుకోవటం మొదలుపెట్టాడు వందేమాతరం తాతయ్య.

"మనం అన్న మాటలు ఒకటైనా పట్టిందేమో చూడు!!!" విస్తుపోయింది సత్యవతమ్మ

"చూడు, బుద్ధావతారం లాగా ఎటో చూస్తున్నాడు" వాపోయింది భారతమ్మ

"అసలు ఆ కళ్లద్దాలు ఏమిటి? ఒక అద్దానికి బీటు వేసింది, రెండో అద్దం చిట్లింది, రెక్కలు లేని ఆ కళ్లజోడుని పాత నులకతాడుతో కట్టుకోకపోతే, మేమేమన్నా కొనిపెట్టలేమనుకుంటున్నావా ..." అంటూ రెట్టించబోయింది స్వరాజ్యమ్మ.

"చేతులు కడుక్కొందురు కాని, లేవండి" అంటూ సుతారంగా అమ్మల దండకం నుండి తప్పించింది పెద్దత్తయ్య. మా అమ్మలు పెట్టిన భోజనానికి భుక్తాయసంతో వందేమాతరం తాతయ్య లేవలేకపోయాడు. నేనూ, నాతో పాటు పిల్ల మూక అందరమూ కలసి వెనక పట్టుకుని నానా తంటాలు పడి లేపాము. ఇంటిల్లిపాదీ ఆ తంతు చూసి పగలబడి నవ్వుకున్నారు. తాతయ్య కూడా నవ్వాడు. ఆ పక్కన ఉన్న అరటి తోపు మొదట్లో నేను చేతి మీద నీళ్లు పోస్తే, చేయి కడుక్కున్నాడు. భారంగా కదిలి వసారాలో ఓ పక్కన ఉన్న గెడంచి ఎక్కాడు. ధాన్యం బస్తాల పక్కనున్న కొంచెం జాగా సరి చూసుకుని, ఓ చిన్న మినుముల మూటను తీసి తలగడ లాగా పెట్టుకుని శేష పానుపు వేసి తూగుతూ, క్రింద ఉన్న మా కుటుంబాన్ని అంతా అవలోకితం చేసాడు.

పెద్ద అత్తయ్య తాతయ్యకు పెట్టిన అరడజను బంగినపల్లి పళ్లని ముక్కలుగా కోసి, ఒక ఇత్తడి పళ్లెంలో పెట్టి తాతయ్యకు ఇచ్చింది. ఈ బంగినపల్లి చెట్టును పెరటిలో నేను పుట్టినప్పుడు నాటాడంట తాతయ్య. ఇలా ఇంటి చుట్టూతా పళ్ల మొక్కలతో పాటు, ఊరి నిండా ఎక్కడ పడితే అక్కడ పళ్ల చెట్లూ , వేప చెట్లూ ఇంకా ఏవేవో నాటాడు, నీళ్లు పోసి సాకాడు.

మా అమ్మలు తాతయ్య తిన్న ఎంగిలి అరటాకు చుట్టూ ఇంకో నాలుగు ఆకులు వేసి కొత్త ఆవకాయతో అన్నం కలిపి ఒక ఘటోత్కచుడి ముద్ద చేసారు. పిల్ల మూక అంతా అమ్మల చుట్టూ చేరి "నాకు, నాకు" అంటూ ఎగబడ్డారు. శేష పానుపులో తూగుతున్న వందేమాతరం తాతయ్య, తూగుతూనే "ఈ సారి ఆవకాయకు మామిడి ముక్కలు కొట్టింది పెద బాబు, తనే మొదటి ముద్ద అందుకుంటే బాగుంటుంది, పాపం వేలు కూడా తెగింది" అన్నాడు. నిజమే, నా బొటను వేలుకు చిన్న అత్తయ్య తన కొంగును చింపి కట్టిన కట్టును అందరికీ గర్వంగా చూపించి, వెళ్లి ఆ ఘటోత్కచుడి కొత్తావకాయ ముద్దని దోసిట్లో అందుకుని తాతయ్య దగ్గరకి వచ్చి ఆయన కాళ్లకి ఆనుకుని కూర్చున్నాను. చిన్నత్తయ్య చేతిలో ఒక చిన్న ముద్దని ఉప్పూ కారాల ఘాటు సరిపోయిందేమో చూడమని పెట్టింది సత్యవతమ్మ. చిన్నత్తయ్యా, పెద్దక్కయ్యా వచ్చి నాకు చెరి ఒక వైపూ కూర్చున్నారు.

కళ్ళు మూసుకుని దోసిట్లోని కొత్తావకాయ అన్నం వాసానలని తన్మయంగా ఆఘ్రాణిస్తుండగా, పదునుగా మాటలు వినబడ్డాయి. "ఏం, నువ్వు మామిడి ముక్కలు కొడితే ఏంటంటా? మేము మాత్రం బస్తాడు ఎండు మిరపకాయలకి తొడాలు తియ్యలేదా? మా చేతులు ఎంత మండిపోయినయ్యి? ఆ పళ్లెంలో మొదటి ముద్ద మాదే." రోహిణి కార్తి ఎండలో నిలబడి పేచీ పెట్టటం మొదలుపెట్టింది పెద్ద మామయ్య కూతురు. లేత పగడపు రంగు పావడా మీద అరిటాకు ఓణీ వేసుకుని అంత ఎండలోనూ చంద్రకాంత పువ్వులాగా మెరిసింది.

"తిను, తిను, ఇంతింత పెద్ద ముద్దలు తిను, సగం పండిన సన్న పచ్చి మిరపకాయల్లే ఉన్నావు. ఇంత ఆవకాయ అన్నమూ నెయ్యి మీగడలతో తిన్నావంటే పండి పోయిన బుంగ పచ్చి మిరపకాయలాగా తయారువుదువుకానీ" అన్నాను. వెంటనే మామయ్య కూతురు "ఆగు, మూలపుటమ్మతో చెపుతా" అంటూ ఉక్రోషంగా వసారా ప్రక్కనున్న మూలగది దగ్గరకి పరిగెత్తుకు వెళ్లింది. రోహిణీ కార్తె ప్రచండ భానుడు చెయ్యలేని పని, నా మాటలతో మామయ్య కూతురు బుగ్గలు ఎర్రబడినాయి. నాకు ఒక ప్రక్క కూర్చున్న పెద్దక్కయ్య మెత్తగా చురక వేసింది. అటు ప్రక్క కూర్చున్న చిన్నత్తయ్య కిసుక్కున నవ్వి, అరచేతిలోరుచి చూడటానికి పెట్టుకున్న ఆవకాయ ముద్దను తిని "అన్నీ సరిపోయినాయి వదినా, అయినా మన ఇంటిలో ఎండుకారమూ, ఆవపిండీ ఎప్పుడూ ఘాటు ఎక్కువే కదా అన్నది." తాతయ్య చిన్మయ్యంగా నవ్వాడు.

మూలపుటమ్మ మా ముగ్గురమ్మలకీ అమ్మ. వందేమాతరం తాతయ్య మూలపుటమ్మకు అన్నయ్య వరస. ఎప్పుడూ మూలగదికి అడ్డంగా ఒక కుక్కి నవ్వారు మంచం మీద పెద్ద సైజు పాత్రం రాయల్లే, ఒక కాలు పట్టె మీద మడతపెట్టి, రెండో కాలు కిందకి వేలాడేసి లలితాసనం వేసుకుని ఆసీనమై ఉండేది. సగం మూసిన కళ్లతో మా కుటుంబాన్ని అంతా నియంత్రిస్తూ ఉండేది. మా అమ్మలు చేసే మిఠాయిలు, పిండి వంటలు, పండేసిన సపోటాలు, అరటి గెలలు, మామిడి పళ్లు, పచ్చడి జాడీలూ అన్నీ ఆ మూల గదిలో ఆవిడ అధీనంలో ఉండేవి.

మూలపుటమ్మ కళ్లు తెరిచి చూస్తోందో, తూగుతూ నిదరపోతున్నదో మా పిల్లమూకకు అర్థమయ్యేది కాదు. అందుకని ఆవిడని రకరకాలుగా ఎక్కిరెంచే వాళ్లం. అసలు మిగతా పిల్లమూకకు నాయకుడిగా మూలపుటమ్మను రకాలుగా ఎక్కిరించటం నేర్పించింది నేనే. అయినా కదిలేదు కాదు. కానీ ఎప్పుడన్న మాలో ఒకరిని పేరు పెట్టి పిలిచి దగ్గరకు రమ్మని తన తలగడ క్రింద చెయ్యి పెట్టేది. ఆ తలగడ క్రింద పటిక బెల్లం పొట్లం, వీపు గోకుకొనే పులి పిడికిలి గొడుగు కర్ర ఉండేవి. మూలపుటమ్మ పటికి బెల్లం ముక్క పెడుతుందో, లేక పులి పిడికిలి గొడుగు కర్రతో కొడుతుందో తెలీక భయం భయంగా దగ్గరకు వెళ్లే వాళ్లం.

ఆ రోజు ఉదయం నేను మూలపుటమ్మకు చిన్నప్పటినుంచీ ఉన్న అలవాటు ప్రకారం కూజాలో మంచి నీళ్లు పెట్టి వస్తుంటే, మూలపుటమ్మ పిలిచింది. దిండు క్రింద ఉన్న పటిక బెల్లం పొట్లాం తీసి మరీ చిన్నది, మరీ పెద్దదీ కాని ముక్క ఒకటి తీసి నోటిలో పెట్టి, సత్యవతమ్మ దగ్గర తాతగారి కలము, భారతమ్మ దగ్గర పోతన భాగవత పద్యాల పుస్తకం, స్వరాజ్యమ్మ దగ్గర ఫీజు కట్టటానికి రొఖ్ఖం తీసుకోమని చెప్పి పంపింది. అలాగే అని ఒక శాల్యూట్ పడవేసి, మూలపుటమ్మను వెక్కిరించి తిరిగి వచ్చేసా.

పిల్లలందరూ అమ్మల చుట్టూ చేరి మరి నాకు నాకు అంటూ ఎగబడితే, "బుద్దిగా చుట్టూ కూర్చుని తింటారా, వీపు మోగించమంటారా" అంటూ సత్యవతమ్మ పప్పు గుత్తి పైకి ఎత్తి దండం తిప్పినట్టు తిప్పింది.

"సరిగ్గా వంతులువారీ తినకపోతే అందరికీ వాతలు పెడతాను, జాగ్రత్త" అంటూ ముల్లు అట్లకాడ దూసింది భారతమ్మ.

"ఇంకొక్క మాట వినబడిందంటే తాట తీస్తాను" అంటూ చల్ల కవ్వం తాడు ఝళిపించింది స్వరాజ్యమ్మ.

మొదటిగా అందరికీ వట్టి ఆవకాయ ముద్దలతో. రెండో విడతగా పిడత పప్పుతో కలిపిన ఆవకాయ ముద్దలు, మూడో సారి నెయ్యితో కలిపిన ఆవకాయ ముద్దలు, నాలుగో సారి వెన్నతో కలిపిన ఆవకాయ ముద్దలూ, ఆఖరుగా మీగడతో కలిపిన ఆవకాయ ముద్దలు పెట్టారు మా అమ్మలు. ఇంకా కావాలి అంటే మాత్రం మా అమ్మలు పెట్టలేదు. మా అమ్మలు మాకు ఇష్టమయ్యింది ఎప్పుడూ సరిపడా పెట్టేవారు కాదు. అదే కాకరకాయ కూరో, కొయ్య తోటకూరో అయితే పీకలు నిండిన తరువాత పాతిక ముద్దలు గొంతులో తోసి “ఇది తింటే మీ కళ్లకి మంచిది, ఇది తింటే మీ మెదడుకి మంచిది బోలెడు చదువులు చదువుకోవచ్చు” అనే వారు.

ఆ రోజు తలుచుకుంటే ఇప్పటికీ మనసు నిండుతుంది. నోరు ఊరి ఆకలి పెరుగుతుంది.

ఇంటికి వచ్చాం అంటూ గతంలోనుంచి మేల్కొల్పాడు డ్రైవర్.

నాకు గుర్తున్న రెండు నిట్టాడుల పాక ఉన్నచోట ఒక డాబా ఇల్లు ఉంది. అవును, ఇది మామయ్య చేసిన పనే. చుట్టూ కొబ్బరి, మామిడి చెట్లు ఉండేవి. పొరుగున ఉండాల్సిన వేప, కొండమల్లి చెట్ల స్థానంలో పెద్ద పెద్ద అపార్టుమెంట్ బిల్డింగులు ఉన్నాయి. నాకు గుర్తున్న పల్లెటూరిని టౌను మింగేసింది. మామయ్య పిల్లలు ఈ డాబా కూడా తీసివేసి అపార్టుమెంటులు కట్టిస్తారేమో? వందేమాతరం తాతయ్య ఈ చెట్లు నాటి, పాదులు చేస్తువుంటే నేను నీళ్లు పెట్టటం గుర్తు వుంది.

ఇల్లంతా సందడి. పలకరింపులలో ఆప్యాయత ఉన్నా, పెళ్లి హడావిడిలో ఎవరమూ మాట్లాడుకోలేకపోయాము. అందరమూ ఓ పెద్ద మారేజ్ హాలుకు చేరుకున్నాం. పెళ్లి విందులో "ఫిఫ్టీ వన్ అయిటంస్” అంటూ హడావిడిగా వడ్డించుకుంటూ వెళ్లారు. ఎందుకో, కడుపు నిండ లేదు, మనస్సు అంతకన్నా నిండ లేదు. తెల్లవారు ఝాము పెళ్లి. ఫోటోగ్రాఫరులు, వీడియోగ్రాఫర్లూ ఆధ్వర్యంలో పెళ్లి జరిగింది. చిన్నప్పటి రోజులలో తాటాకు పందిరి కింద జరిగిన పెళ్లిళ్లు గుర్తుకు వచ్చాయి. ఆ రోజులలో ఊరు అంతా ఒక్కటై చేసేది కదా పెళ్లి!!!

తెల్లవారుతోంది. ఎందుకో నిరుత్సాహం ఆవరించింది. మారేజ్ హాల్ బయటకు వచ్చి గమ్యం లేకుండా నడవడం మొదలు పెట్టాను. ఎక్కడో దూరంగా రేడియోలో నుంచి దేశ భక్తి గేయాలు వినబడ్డాయి. దగ్గరకు వెళ్లితే అది గాంధీ బొమ్మల సెంటరు అని పోల్చుకున్నా. ఎంతగా మారిపోయింది? వందేమాతరం తాతయ్య ప్రతిష్ఠించిన బొమ్మలు ఇవి. తాతయ్య ఉన్నంత కాలం ఉదయం, సాయంకాలం ఊడ్చి శుభ్రపరిచి, ఓ నిమిషం బొమ్మలకి ఎదురుగా తల వంచి నుంచునే వాడు. నన్ను కూడా తీసుకువెళ్లేవాడు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు చుట్టూ మామిడి తోరణాలు కట్టి చరఖా తిప్పేవాడు.

ఇప్పుడు భారత జెండాలకు బదులు రకరకాల రాజకీయ రంగుల ప్లాస్టిక్ తోరణాలతో గందరగోళంగా ఉంది. గాంధీ బొమ్మలు ప్రక్కన ఊరి రౌడీ గారి పెద్ద విగ్రహం ఒకటి వెలిసింది. ఆ రౌడీగారి విగ్రహం నీడలో గాంధీ బొమ్మలు చిన్నబోయాయి. చుట్టూ రకరకాల అరాజకీయ పార్టీ జెండా స్తంభాల పైన మెరుస్తున్న జెండాలు రెపరెపలాడుతున్నాయి. ఎందుకో నిర్లిప్తత ఆవరించింది.

ఇంతలో "బాబూ" అన్న పిలుపు వినిపించింది. ఎక్కడో తెలిసిన గొంతు. ఒక ముసలతను నన్ను పిలుస్తూ ప్రాయాసపడుతూ వస్తున్నాడు. ఒక్కసారిగా గుర్తు పట్టి "మీసాల తాతా .." అంటూ నేనే పరిగెత్తుకు వెళ్లాను. మీసాల తాత నా చేతులు తడిమి, తన పై తుండు తీసి బడ్డీ కొట్టు ఎదురుగా ఉన్న బెంచీని తుడిచి కూర్చో బెట్టాడు. చిన్నప్పుడు నాకిష్టమైన చిరుతిండులు ఇంకా ఆ సీసాలలో కనబడ్డాయి. మీసాల తాత గబా గబా ఆ సీసాల్లోనుంచి తీసి నాకిచ్చాడు. ఎంతో ఉత్సాహంగా “వందేమాతరం గారి పెద్ద బాబు వచ్చాడు” అంటూ కేకలు వేశాడు.

ఉన్నట్టుండి ఒక చిన్న గుంపు పోగయ్యింది. ఆ బడ్డీ కొట్టులో ఉన్న రేడియోలో నుంచి ఒక పాట వినిపించసాగింది.

"నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు"

మీసాల తాత ఎగసిపడే ఉత్సాహంతో నన్ను చూపిస్తూ అందరికీ చెపుతున్నాడు.

"వందేమాతరం గారు వేలుపట్టుకుని నడిపించుకొచ్చేవారే, ఆ చిన్న పిల్లాడే ఈ పెద బాబు". నా వైపు తిరిగి, "బాబూ, ఆయేళ వందేమాతరం గారు చేసే పని యేదీ అయిపొచ్చేది కాదు. మీ అమ్మల మేనత్తకి చిన్న పిల్లప్పుడే పెళ్లి సేస్తే, అత్తారింటికెల్లెకుండానే పసుపు కుంకాలు పోయినాయి. ఆ యమ్మను బోడెమ్మను సేత్తుంటే "వందేమాతరం" అంటూ ఉప్పు పట్టుకోవటానికి ఒక దండును పోగేసి సముద్రం దిక్కుకి పోతున్న మీ తాతగోరు, ఈ తంతుని సూసి, మా ఇంటెదురుగా పసుపుకొమ్ములారబెడితే, ఓ పసుపుకొమ్మెత్తుకుపోయి బోడెమ్మను సెయ్యబోయే పిల్లకి కట్టి, మళ్లీ ఉప్పు కోసం సముద్రం దారంట ఎళ్లారు. రొండో రోజుకి వచ్చిన కబురేంటంటే, సముద్రపు ఒడ్డున ఉప్పు పిడికిట్లో బిగించి "వందేమాతరం" అని కూతలు పెడతాంటే బళ్లారి జైల్లో ఏసారు. అప్పటినించీ ఆయన పేరు వందేమాతరం గోరే!!! కొంతకాలం వెలేసారులే మీ వోళ్లనందరినీ. జైలునుంచి వచ్చిన తర్వాత ఈడ రావి చెట్టు కింద రోజూ తెల్లారే ఆంధ్ర పత్రిక గట్టిగా సదివేవారు. సదూ రానాళ్లమందరమూ ఒచ్చి యింటుండేవాళ్లం. ఓ రోజు నాతో, ఈడ జనం పోగవుతుండిరి కదా, నేను మీ అయ్యకి పసుపుకొమ్ము తాలుకా బాకీ ఉంటిని కదా, ఇదిగో ఈ కాసు తీసుకుపోయి బలపాలు, పలకలూ, పళ్లపొడి, సబ్బు బిళ్లలూ అమ్ముకోరాదే అన్నారు. ఇదిగో సూడండి బాబు అప్పుడు పెట్టుకొన్న బడ్డీ కొట్టు, ఇన్నాళ్లూ మా కుటుంబాన్ని పోషించింది. మా పిల్లలకి సదూ సెప్పించి పెద్దోళని సేసింది. ఆ పసుపు కొమ్ముతో మీ తాతమ్మగారి బతుకే కాదు, మా బతుకులు కూడా బాగు పడ్డాయి."

రేడియోలో పాట కొనసాగింది.

"ఆ పుణ్య మూర్తులు చూపిన మార్గం
అనుసరించుటే ధర్మం, అనుసరించుటే నీ ధర్మం
నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు"

పూజకు పూలు కోసకోవటానికి వెళుతున్న ఇంకో పండు ముదుసలి కొనసాగించింది. "అంతేనా బాబూ, వందేమాతరం గారు తను మళ్లీ జైలుకెళ్లితే పత్రిక చదివే వాళ్లు ఉండరని అందరికీ పట్టుబట్టి చదువు నేర్పించారు. మీ జేజమ్మగారిని పంపి ఆడవాళ్లందరికీ కూడా నేర్పించేవారు. ఎవరికి వాళ్లు ఇదేం చోద్యం అని ఎగతాళి చేసినా, పట్టు వదిలే వారు కాదు. ఆడవాళ్లు చదువుకుంటే పిల్లలకి కూడా చదువు అబ్బుతుందని గొప్ప ఉడుం పట్టే పట్టారు. ఆడవాళ్లు వీధి బడిలోనూ వసారాలోనూ చదువుకోవటం బిడియమని, ఆయన ఇంటినే బడిగా మార్చి పగలు పిల్లల బడి, రాత్రి ఆడవాళ్ల బడి నడిపేవారు. రాత్రి బడికి అందరూ రావటంలేదని, మీ జేజమ్మగారితో భాగవతం కథలు చెప్పించేవారు. నేనేమో అప్పుడు చిన్న పిల్లని., తరుదు ఫారం నాకు అయిపోతే, నన్ను అంగలూరు పంపి టీచర్ ట్రైనింగ్ ఇప్పించి అదే బడిలో పంతులమ్మను చేసారు. ఆ తరవాత నాకు పెళ్లై ఆడ పిల్లలు పుడితే, నువ్వూ తరుదు ఫారం, నీ పిల్లలూ తరుదు ఫారమేనా అని చెప్పి, మా అమ్మాయిలని టౌనులో హై స్కూలుకి పంపించమన్నారు. నాలుగు మైళ్లు ఆడపిల్లలు నడవలేరని అంటే, వందేమాతరం గారు బస్సు డిపోలో మేనజరు గది ముందే పడుకుని బస్సు వేయించారు. అయినా సరే, ఎవరూ ఆడపిల్లలని టౌనులో హైస్కూలుకి పంపలేదు, ఆ బస్సు టికెట్టు కొనలేమన్నారు. వందేమాతరం గారే తన పెన్షన్ డబ్బులు పెట్టి టికెట్టు కొని ఆడ పిల్లలని హైస్కూలు చదువు పూర్తి చేయించారు. చదివింది చాల్లే మా ఆడ పిల్లలకి పెళ్లి చేస్తామంటే ధైర్యమున్న ఆడ పిల్లలని నలుగురిని పోగేసి మళ్లీ కాలేజీ చదువు మొదలు పెట్టించారు. మా అమ్మాయి అలాగే పై చదువుకెళ్లింది".

“ఆ సంస్కర్తల ఆశయరంగం నీవు నిలిచిన సంఘం
నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు”

ఇంకో పెద్దాయన కొన సాగించాడు "అంతేనా, అంతటితో ఆపితే ఆయన వందేమాతరం గారు ఎందుకు అవుతారూ? ఆయన ఇల్లుని బడి చేశాడు కదా! బళ్లో పిల్లలు ఎక్కువయితే, ఇన్ని టికెట్లకి డబ్బులు పెట్టే బదులు మనమే హైస్కూలు కట్టించుకోవచ్చని ఆయనకున్న ఎకరమున్నర మెట్ట పొలంలో హైస్కూలు కట్టించారు. హెడ్డుమాస్టారుకి రెండు గదుల కోడి గుడ్డు సున్నం గోడలతో డాబా, పిల్లల తరగతులకి మట్టి గోడలతో రెండు పాకలూ వేయించారు. ఇవి కట్టించటానికి ఆయన దగ్గర డబ్బులు ఎక్కడ? అందుకని ఊళ్లో వాళ్లందరిని కోడిగుడ్లు ఇవ్వమన్నారు, ఇవ్వలేని వాళ్లనందరినీ కనీసం నాలుగు తాటాకులు ఇవ్వమన్నారు. ఇచ్చినవాళ్లకంటే తిట్టిపోసినవాళ్లెక్కువ. వందేమాతరం గారు అవ్వేమీ పట్టించుకోలేదు. ఆయన ఎకరమున్నరలో ఊళ్లో అందరికీ పనికి వచ్చేటట్లు హైస్కూలు పెట్టించారు. చుట్టూ చెట్లు నాటించి పిల్లలతో కలిసి నీళ్లు పోయించారు".

ఉన్నట్టుండి చిన్న గుంపు తయారయ్యింది. వెనకనించి కర్ర తాటించుతూ, కర్రతో మనుషులిని తోస్తూ వెనక నుంచి ఒక వంగి పోయిన ముసలి అవ్వ. "బాబూ" అని పిలిస్తే గొంతు గుర్తు పట్టాను. "అప్పమ్మా, నువ్వా, ఎంత పెద్దదానివయ్యావు?" అని ఇంకా ఏదో మాట్లాడబోతే, క్రిందకి వంగమని సైగ చేసి, తేగ ముక్క ఒకటి నా నోట్లో పెట్టి, ముఖమంతా తడిమి నా ప్రక్కన కూర్చుని చెప్పటం ప్రారంభించిది "బాబూ, వందేమాతరంగోరు గురించి ఏటి చెపుతాం? వొక్క మాట మాట్లేడేవోరు కాదు. ఏదైనా చేసి చూపించేవోరు. అందరూ ఆయన్ని మొండోడు అనే వోరు. ఇప్పటికి తెలిసొచ్చింది, ఆయన చేసిన పనుల యిలువ. మేం పనులుకి పోతావుంటే, తెల్లారే మా పోరళ్లని బడికి తీసుకు పోతనని వొచ్చేవోరు. పోరగాళ్లని పాలేరు పనికి పంపితే కవతం వొస్తది కదాని వొల్లదంటే వొల్లదనేవోళ్లు. మొండోరు కదా వందేమాతరం గారు. మీ జేజమ్మతో సెప్పి ఆవిడకున్న రెండెకరాల పొలాన్ని మీరందరూ పోరగాళ్లని బడికంపిస్తే పల్లె వేసుకుందురూ, కాలవ గట్టున వర్సాలొచ్చినప్పుడు కాలవ పొంగి ఇబ్బంది పడుతుండిరి గదా అన్నారు. ముందు ఒకళ్లిద్దరు తయారయ్యారు, రెండు సంవత్సారలయ్యేటప్పటికి అందరూ ఇల్లేస్కున్నారు. పల్లె తయారయ్యింది. బాబూ, అప్పటినుంచి ఇప్పటిదాకా మేమెవ్వరం భయం లేకుండా ఆడనే ఉంటిమి. మా పోరగాళ్లేకాదు, పోరిలుకూడా సదూకుని పెద్దాళ్లయ్యారు."

“మీసాల తాతా, తాతగారి ఇంటిలో బడి బాగుందా” అన్నాను. "బాగోకేం, బాగానే ఉంటది. అందరూ సదూకుని బాగుపడినోళ్లే కానీ పట్టించుకునే వాళ్లెవరూ లేరు, మీరే సూద్దురు కాని, రండి" అని తీసుకు వెళ్లాడు. నాతో పాటు అ పది మంది పాత తరం వాళ్లు కూడా వచ్చారు.

తాతయ్య పెంకుటిల్లు అలాగే ఉంది. నాలుగు గదుల ఇల్లు, ముందు వసారా, వెనక వసారా. చుట్టూ తాతయ్య పెట్టిన చెట్లు వృక్షాలై ఇంటిని కమ్మేసినాయి. పూజకు పూలు కోసకోవటానికి వెళుతున్న పండు ముదుసలి కేకేస్తూ పిలిస్తే ఇంకొక పెద్దావిడవచ్చింది. "ఇదిగో, మా అమ్మాయి. ఈ ఎలిమెంటరీ స్కూలుకి నేను రిటైరు అయ్యేనాటికి చేరింది, ఇప్పుడు స్కూలుకి హెచ్ ఎం" అంటూ నన్ను పరిచయం చేసింది.

"వందేమాతరం గారి మనవడా మీరు? ఈ స్వాతంత్ర్య దినం మీరు రావటం ఎంతో బాగుంది. జెండా వందనం మొదలు పెడుతున్నాము, మీరు కూడా రండి అని" లోపలికి తీసుకువెళ్లింది. అవును, తాతయ్య వల్లనేకదా నాకు అందరూ ఇంత గౌరవం ఇస్తున్నారు?

ఇంతలో ఒక చిన్నారి వచ్చి ముందుకు వంగమని చెప్పి, చిన్ని కాగితం జెండా, గుండు సూదితో నా చొక్కా జేబుకి గుచ్చింది.

జెండా వందనం చేస్తూ ప్రధానోపాధ్యాయురాలు చుట్టూ ఉన్న చెట్లని పిల్లలకి చూపుతూ "ఆ తరం పెద్దవాళ్లు మొక్కలు నాటితే, ఈ తరం పిల్లలు మీరు తినటానికి అవి పండ్లు కాస్తున్నాయి. అలాగే వందేమాతరం గారి లాంటి వాళ్లు ఎన్నో త్యాగాలు చేసి నాటిన మొక్క మన స్వాతంత్ర్యం, మనం ఆ చెట్టు పళ్లు తింటున్నాము. ఈ చెట్లకు కాసే పళ్లు ఆనాటి త్యాగమూర్తులు ఈనాటికీ మనకు పెడుతున్న భిక్ష. మనకి కూడా ఆ చెట్లన్ని రక్షించే భాద్యతా, ఆ స్వాతంత్ర్యాన్ని సద్వినియోగం చేసుకునే భాద్యత ఉన్నది. మనం చెట్లు కున్న పళ్లు కోసుకోవటమే కాదూ, మనము కూడా వందేమాతరం గారి స్ఫూర్తితో ముందు తరాలకి మంచి మంచి పళ్లు ఉండేటట్టుగా చెట్లని నాటాలి, మంచి పనులు చేస్తూ దేశాభివృద్దికి తోడ్పడాలి." అని చెప్పింది.

ఆ పిల్లల సందడిలో అలాగే సమయం గడిచిపోయింది.

పిల్లలకి మధ్యాహ్న భోజనం చూద్దురు గాని రండి అని ప్రధానోపాధ్యాయురాలు పిలిచింది. నేను కూడా పిల్లలతో కలిసి భోంచేస్తానని చెప్పి పిల్లలతో పాటు కూర్చున్నాను. ప్రధానోపాధ్యాయురాలు కూడా నా ప్రక్కన కూర్చున్నారు. అన్నము, ఆవకాయా, పప్పుకూర, మజ్జిగ మాత్రమే. ఆవకాయ కలుపుకుని ఒక ముద్ద నోట్లో పెట్టుకోగానే ఒక్కసారిగా ప్రాణం లేచి వచ్చినట్లయ్యింది. ప్రధానోపాధ్యాయురాలు "ఇక్కడ పిల్లలకి ఇంతకంటే పెట్టే అవకాశం లేదు. ఈ ఆవకాయ పచ్చడి అయినా, అదిగో మీ తాతగారు పెట్టిన జలాల చెట్టు కాయలదే. ఈ ఆవకాయ ఉండబట్టి పిల్లలు ఇంకో ముద్ద ఎక్కువ తినగలుగుతున్నారు."

నిజమే ఎంత రుచిగా ఉన్నాయి ఈ పచ్చడి మెతుకులు. పిల్లలతో కలసి తిన్న పచ్చడి మెతుకులతో కడుపు నిండింది. ఇది అంతా నిజంగా తాతయ్య చలువే, ఆయన ఈ రోజుకు వేస్తున్న భిక్ష.

ప్రధానోపాధ్యాయురాలు చెప్పటం కొనసాగించింది "ఈ బడిలో చదువుకుని కొందరు వేలమంది పై వర్గంలోకి చేరారు. కానీ ఈ కాలంలో మీ తాతగారి వంటి వాళ్లు కనబడటం లేదు. ఈ బడికి వచ్చే వాళ్లకి భోజనం వసతులే లేవు, ఇంక పుస్తకాలు కొనే స్తోమత ఎక్కడిది? గాలి వాన వస్తే బడి పెంకులు ఊడి నీళ్లు కారతాయి."

మళ్లీ ఎక్కడో మైకులో పాట వినిపించింది

“ఆ దేశ భక్తులు వెలసిన దేశం నీవు పుట్టిన భారతదేశం
నీవు పుట్టిన ఈ దేశం
నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవద్దు”

ఇంతలో నాకు కాగితపు జెండా గుచ్చిన చిన్నారి మళ్లీ వచ్చి, జేబుకున్న జెండా జారిపోతోందని చెప్పి, గుండు సూది తీసి మళ్లీ గుచ్చింది. ఆ తొందరలో గుండు సూది నా చర్మంలోనుంచి గుచ్చింది. రెండు నెత్తురు చుక్కలు చెమర్చి చొక్కా తడిచింది.

మనస్సు నిండింది. కర్తవ్యం బోధపడింది.

## పిలుపు వినగ లేవా..!?

కాళ్ళకూరి శైలజ

“అమ్మా!అమ్మా!! అమ్మా, ఇలా చూడు, నేనమ్మా, కిరణ్ , నేను వచ్చేనమ్మా !”

“చినబాబూ! ఇంక బయటకు రండి ,కాసేపయాక మళ్ళీ కబురు పెడతాం.” ఆశ కిరణ్ ను కొంచెం గట్టిగానే హెచ్చరించింది. నిస్సహాయంగా ఒక చూపు చూసి వెనుతిరిగాడు కిరణ్ .

“ ఎక్కడా కనీవినీ ఎరుగనిది ! సింప్లీ రిడిక్యులస్.... మీనింగ్లెస్ !!! హాస్పిటల్ ఐసీయూలో, తల్లి, చెల్లి: ఇద్దరూ పేషంట్స్. తండ్రేమో తాగి పడుకున్నాడు. అంతా నా ఖర్మ!!!” కిరణ్ చేతితో నుదిటి మీద కొట్టుకున్నాడు.

"ఇంటికి పెద్ద కొడుకుగా ఇందులో నీ పాత్ర ఏమిటి?బాధ్యత ఏమిటి?ఆలోచిస్తావా ,లేక కర్మసిద్ధాంతం వల్లిస్తావా? కిరణ్ బాబూ!" ఆశ కంఠం తీవ్రంగా ధ్వనించింది. కిరణ్ బిత్తరపోయాడు. అలా అనేసి ఆశ మటుకు ఐ.సి.యు గది లో ఉన్న అపస్మారక దేహాల వైపు చూస్తోంది. డాక్టర్ స్వర్ణ ఒకపక్క , ఆమె కూతురు స్రవంతి వెంటిలేటర్ మీద మరోపక్క.

..............

ఆ చూపులు కనీసం 32 సంవత్సరాల పాటు డాక్టర్ స్వర్ణ ఎక్కడుంటే అక్కడ తిరుగాడుతున్న చూపులు. ఎంబిబిఎస్ ఐన స్వర్ణ కు డాక్టర్ మధుసూదన్ కు పెళ్ళయి అన్నేళ్ళు అయింది మరి! అప్పట్లో రెండు గదులలో ప్రాక్టీసు పెట్టినప్పుడు, మధు ఉన్నత చదువుకోసం బెల్గాం వెళ్ళినప్పుడు, మొదటిసారి అబార్షన్ అయినప్పుడు, తొలి బిడ్డగా కిరణ్, మలి బిడ్డగా స్రవంతి పుట్టినప్పుడు, చిన్న క్లినిక్ హాస్పిటల్ అయినప్పుడు, హాస్పిటల్ ఎదిగినప్పుడు మంచి – చెడు అన్నింటిలో , స్వర్ణ తో ఒక నీడలా – తోడుగా ఉన్నది ఆశే.

"ఆశా ! 'నాతో' నువ్వు ఉండాలని కాబోలు దేవుడు నిన్ను పంపాడు !!!" అని స్వర్ణ కన్నీళ్లను తుడుచుకున్న ప్రతిసారి అంటుండేది. ఆశ నర్సింగ్ ట్రైనింగ్ ప్రత్యేకంగా అవ్వనేలేదు. మొదట స్వర్ణ దగ్గర ఉండడానికి వచ్చి, అలా –అలా – ఆస్పత్రి పనులన్నీ నేర్చుకుంది. ఆస్పత్రి పెరుగుతున్న కొద్దీ ,ఇతర ఉద్యోగస్తులు ,మందుల షాపు వాళ్ళు , లేబరేటరీ లో పని వాళ్ళు, ఎవరు ఎందరు వచ్చి వెళ్లినా ఆశ మాత్రం అలా నిలబడిపోయింది. స్వర్ణ కు వెనక ముందు పక్క , తానే అయి నిలబడేది. తల్లిదండ్రులు, అత్తమామలు ఎప్పుడొచ్చినా చుట్టం చూపుగా నాలుగైదు రోజుల కన్నా ఉండేవారు కారు. ఆశకు పెళ్లయ్యాక, భర్త కు చిన్న బడ్డీకొట్టు. అది మెల్లగా కిరాణా సామానులు అమ్మేదాక వచ్చింది. అందుకే ఆశకు ఇంకో ఊరు వెళ్లాల్సిన అవసరమే రాలేదు. కిరణ్ పుట్టిన తరువాత ఆశకు కూడా ఓ బిడ్డ పుట్టాడు. నార్మల్ డెలివరీ కనుక త్వరగానే వచ్చేసింది .

మధుసూదన్ ప్రాక్టీస్ నానాటికీ పెరిగింది. అలా అనే కన్నా తానే పెంచాడు! అనాలి. పొలానికి హైబ్రిడ్ విత్తనాలు, ఎరువులు వేసినట్టు చుట్టుపక్కల పల్లెటూళ్లలో ఉండే ఎందరో మనుషులు , మధ్యవర్తులు ... ఎప్పుడూ పేషెంట్లకు కొదవలేకుండా 'మాట సాయం'గా పంపడం, వాళ్లకి ' చేతి సాయం' గా తాను ఎంతో కొంత ముట్టచెప్పడం జరుగుతూనే ఉండేది. తను కూడా చుట్టుపక్కల ఊళ్లకు సర్జన్ గా కేసులకు వెళ్ళి వస్తూండేవాడు. ఒక్కోసారి తెల్లవారుజామున వెళితే, ఏ పొద్దు పోయేకో , అర్ధరాత్రికో ఇల్లు చేరేవాడు. మధుసూదన్ లేకపోయినా నర్సింగ్ హోం బాధ్యతలన్నీ స్వర్ణ చూసుకునేది. ఆమెకు చేదోడువాదోడుగా ఆశ.

...........

"ఆంటీ ",మళ్లీ వచ్చాడు కిరణ్. వాడి ఎత్తయిన భుజాలు ఇప్పుడు కొంచెం వంగి, కళ్ళు బరువుగా ఉన్నాయి.

"చెప్పు చినబాబూ!" అంటూ ఆశ ఐసియు కారిడార్ లోకి వచ్చి అక్కడ బెంచీమీద కూర్చుని లాలనగా అడిగింది. ఉన్నట్టుండి ఏడ్చాడు కిరణ్ .

"తప్పయ్యా! ధైర్యంగా ఉండు"అని వెన్ను నిమిరింది.

"లేదాంటీ భయంగా ఉంది. నా పిలుపు అమ్మకు వినిపిస్తుందా ! అమ్మ లేస్తుందా ??చెల్లికి బాగౌతుందా ? అసలిలా ఎందుకు చేసింది? ఎలా జరిగింది?"

"అమ్మ కూడా ఇవే మాటలు నన్ను అడిగేది బాబూ! కిరణ్ కి నా మాట వినిపిస్తుందా ??ఎప్పుడైనా తిరిగి వస్తాడా?" అని. ఆశ గొంతు భారంగా ఉంది .

కిరణ్ తల ఎత్తి చూశాడు "ఆంటీ తప్పే ! నేను నాన్న , అమ్మ కి ఏం చేయలేదు. పైగా ఇద్దరం పరీక్షలు పెట్టాం. ఇవి చాలవన్నట్టు లైఫ్ కూడా పరీక్షలు పెడుతోందా? కనీసం చెల్లెలైనా, అమ్మతో అమ్మకి నచ్చినట్టు ఉండి ఉంటే బాగుండేది. ఎందుకలా సూసైడ్ అటెంప్ట్ చేసింది? ఏమైనా ఎఫైరా ?" బాధలో కూడా తీవ్రంగా అడిగాడు కిరణ్.

ఒక్క క్షణం ఆశకి కిరణ్ మీద చాలా కోపం వచ్చింది. వీడిని తన చేత్తో ఎత్తుకొని ఆడించాను.. ఇంత ఎదిగాక, ఎవరికి ఏం అధికారాలు ఉంటాయి? అనునయిస్తున్న చేతిని వెనక్కి తీసేసుకుని, దూరంగా చూస్తూ కూర్చుంది .

కిరణే మళ్లీ అడిగాడు ,” ఏమాంటీ!మీరైనా నిజం చెప్పొచ్చుగా? “

“ఏం చెప్పమంటావు ?”సాయంకాలపు నీరెండ కేసి చూస్తూ అంది .

“నిజాలే చెప్పండి” అన్నాడు .

-----

“నువ్వు ఇల్లు వదిలి మూడేళ్లయింది. ఫోన్ చేసి అమ్మ తో మాట్లాడి కనీసం ఆరు నెలలైంది! ఇది ఒక 30 ఏళ్ళ కథ . 30 వాక్యాల్లో చెప్పినా, కనీసం అరగంట పడుతుంది. అంత ఓపిక ఉందా ?” తాపీగా అడిగింది ఆశ .

“అంటే ఏమిటి?ఆంటీ ! నేను ప్రతిసారి వాదిస్తాను, చెప్పేది వినను, గత మూడేళ్లుగా నా ప్రపంచంలో నేను ఉంటున్నాను అనేనా?” అన్నాడు విసుగ్గా .

ఇంతలో ఫిజిషియన్ రావు గారు వచ్చారు. లోపలికి వెళ్లి ఇద్దరూ ఆయనతోపాటు స్వర్ణను, స్రవంతిని చూశారు . ఆయన రివ్యూ చేసి కొత్తగా కొన్ని పరీక్షలు వ్రాసి ఇచ్చి , అందులో చిన్న చిన్న మార్పులు చేశారు. వెళ్తూ ,

“వాట్ కిరణ్! ఎట్లాస్ట్ ! నువ్వు వచ్చావు !మమ్మీని చూసుకుంటావా ?! మీ సిస్టర్ కి , పి.ఎ.ఎం (P.A.M.) తగ్గించవచ్చు . పాయిజన్ విల్ బి సూన్ వీనింగ్ ఆఫ్!” అన్నారు.

కిరణ్ తలవూపాడు, “ఓకే అంకుల్ “ అంటూ.

ఆయన వెళ్ళాక మళ్లీ బెంచి మీద కూర్చున్నాడు. ఈసారి ఆశ వైపు జరిగి కూర్చున్నాడు.

” ఆంటీ! నేను లేని ఈ ఇల్లు గురించి తెలుసుకోవాలంటే ముందు అమ్మ గురించి మీరు చెప్పాలి. నేను వింటాను. వినాలని ఇవాళ నిర్ణయించుకున్నాను. ప్లీజ్ ,చెప్పండి “అన్నాడు.

ఆశ నవ్వింది మెల్లగా. ఒక దీర్ఘ నిశ్వాస విడిచింది. కిరణ్ తన ఫోన్ తీసి స్విచ్ ఆఫ్ చేశాడు. బెంచి మీద పెట్టాడు.

..............

“మీ నాన్నగారు డిగ్రీ చేసి వచ్చాక ప్రాక్టీసు ఊపిరి సలపకుండా ఉండాలని చాలా ప్రయత్నాలు చేశారు. బయటికి ఎంత బిజీగా ఉందనిపించినా, ప్రాక్టీసులో మధ్యదళారులు ఎందరు ఉన్నారో మేడం కు, నాకు, తెలుసు. ఎవరి ‘మామూలు’ వారికి ఇవ్వగా, నెలకోసారి నాన్నగారికి స్నేహితులతో పార్టీలు పెరిగాయి. డబ్బు సంపాదించడం ఒక పని అయితే, ఆ ఒత్తిడి తగ్గించుకోవడానికి పార్టీలు ఎక్కువయ్యాయి. ఆసుపత్రి బాధ్యతలన్నీ మీ అమ్మే మోసింది. ప్రతిరోజు పేషంట్లను చూసుకోవడం, బిల్లులు, చిన్నా- చితకా గొడవలు, ఆడిటర్ పని , టాక్స్ లు అన్నీ ఆవిడే. మీ ఇద్దరూ పుట్టాక, నిన్ను డాక్టర్ని చెయ్యాలన్న పంతం కొద్దీ, తన వారసుడివి అంటూ సారు నిన్ని హాస్టల్ కు పంపేశారు. అలా నిన్ను, అమ్మను చిన్నప్పుడే విడదీశారు.విజయవాడ, హైదరాబాదు ,గుల్బర్గా, ఇలా ఒక్కోసారి- ఒక్కో వూరు. అయినా ఆవిడ నీ హాస్టల్ కు వచ్చినప్పుడల్లా తన ప్రేమను ఆ కాస్త సేపట్లో నీకు ఎలా చూపించాలో తెలియక సతమతమయ్యేది. సెలవులకిఇంటికొస్తే మీ నాన్న నిన్ను స్విమ్మింగ్, ట్రెక్కింగ్ అంటూ అక్కడికి, ఇక్కడికి పంపేవారు. అమ్మ ఆరాటం తీరనే లేదు.తర్వాత నువ్వు పీ .జీ . లో జాయిన్ అవ్వడం, ప్రేమ వివాహం చేసుకోవడం, అమ్మకు చెప్తే బాధపడుతుందన్న సాకుతో నాన్నగారిని సాక్ష్యంగా తీసుకెళ్లి, రిజిస్టర్ మేరేజ్ చేసుకోవడం, పెళ్లయిన ఆరు నెలల దాకా అమ్మకి చెప్పకపోవడం ఆవిడని చాలా క్షోభకు గురి చేసింది. నీకు తాను ఏమీ కానని ఆవిడ ఎంత కుంగిపోయేరో, ఎన్నాళ్ళు తనవారిలో తలెత్తుకోలేకపోయారో నా కళ్ళార చూసాను.

"సరేలెండి ,ఆంటీ ! ఆ పరిస్థితుల్లో నేను అలా ప్రవర్తించడం నాకు తప్పలేదు. నాన్న , నేను , అమ్మకి భయపడ్డాం . ఆవిడ ఎక్కడ రభస చేస్తుందో, అని పరువు పోతుందని అలా చేశాం. నిజమే ! తప్పే ! ఆవిడకి చెప్పకపోవడం , అమ్మ ను నిర్లక్ష్యం చేయడమే ! ఇంతకూ చెల్లి సంగతి ఏమిటి? బాగానే ఉండేది గా, ఆంటీ... ఇలా..."

ఇంతలో ఐసీయూ లోంచి సిస్టర్ పరిగెత్తుకొచ్చింది "సార్ ! చెల్లెమ్మ వెంటిలేటర్ అలారం ఇస్తోంది."

కిరణ్ , ఆశ ఇద్దరూ పరుగు –పరుగున లోపలికి వెళ్లారు. స్రవంతి ఆయాసపడుతోంది. కిరణ్ అన్ని చూశాడు.

"ఇంకొంచెం సెడేట్ చేద్దాం " అన్నాడు.

చెల్లికి కళ్ళల్లో టార్చ్ లైట్ వేసి చూసి పక్కనే కూర్చున్నాడు. వెంటిలేటర్ సెట్టింగ్స్ మార్చాడు కాసేపటికి స్రవంతి పడుకుంది. చెల్లికి తల రాస్తూ నిలుచున్నాడు. నర్సు వేడిగా స్ట్రాంగ్ కాఫీ తెచ్చింది. కిరణ్ , ఆశ ,ఇద్దరూ నర్సింగ్ స్టేషన్ లోనే కూర్చుని కాఫీ తాగారు.

"ఆంటీ " మొదలు పెట్టాడు కిరణ్. ఆశ కళ్ళతోనే వారించింది. కాఫీ అయ్యేదాకా మాటల్లేవు.

"విమలా! నేను చినబాబు బయట బెంచి దగ్గర కూర్చుంటాం. ఏం తేడా వచ్చినా, ఇలాగే వెంటనే చెప్పు సుమా !" అంటూ ఆశ బయటకు దారితీసింది. ఆమెను కిరణ్ అనుసరించాడు.

ఈసారి ఆశ కిరణ్ నుంచి ఏ ప్రశ్న రాకుండానే మొదలు పెట్టింది.

"స్రవంతిని సారు మొదటి నుంచి గారాబంగా పెంచారు. మేడం కాస్త పద్దతిగా ఏమైనా చెప్తే చాలు,'మోడ్రన్ గా పెంచాలి' అంటూ అన్నిటిలో కల్పించుకునే వారు. మాటతీరు వేషధారణ , ఫ్రెండ్స్ తో పుట్టినరోజు పార్టీలు అన్నిటికీ స్రవంతి నాన్న కూతురు లాగే పెరిగింది. మీ నాన్నగారు కూడా స్రవంతి అంటే తన సంపాదనను అనుభవించే ఓ 'ఫ్యాషన్ ఐకాన్ ' అనుకునేవారు.'నా బిడ్డ ఒంటిపై బంగారం, బ్రాండెడ్ జారా షూస్, తరుణి డ్రెస్సెస్ ...అన్నీ టాప్ వే ఉండాలి ఆడపిల్ల తండ్రిగా ఇవి నా సొంత achievements." అని కళ్ళెగరేసి ఆయన చెప్తుంటే , నేను , మేడం అలా చూస్తూ ఉండేవాళ్ళం. చిన్న పిల్ల కదా! చెల్లి సారు చేతిలో బొమ్మ అయిపోయింది. ఫోన్లు, పిక్నిక్ లు. ఇంటర్ కు వచ్చేసరికి కష్టాలు మొదలయ్యాయి. నువ్వు చదివినట్టు చదవాలి అంటారు. స్పెషల్ బ్యాచ్లో చేర్చారు. స్రవంతికి అంత తెలివితేటలు లేవు. వాళ్లిద్దరికీ పడేది కాదు. వాళ్లిద్దరికీ మధ్య వెళ్తే ఇద్దరితో మాటలు అనిపించుకోవడం తప్ప మరేం జరిగేది కాదు, మమ్మీకి. వాళ్ళు ముగ్గురు నా కళ్ళెదుటే వాదులాడుకుంటూ ,పరస్పరం దూరాలను పెంచుకుంటూనే పోయారు. మొదటిసారి, క్వాలిఫై మార్క్స్ కూడా రాకపోయేసరికి, నాన్న చాలా కట్టుదిట్టం చేశారు. స్రవంతి నాన్నను ఎదిరించడంమొదలు పెట్టింది. అది సార్ కు నచ్చలేదు.

తరచూ వాళ్ళిద్దరూ గొడవ పడేవారు. కావాలని స్రవంతి ఖాళీగా కూర్చోవడం సార్ ను మరింత ప్రేరేపించేది. మేడం చాలాసార్లు వాళ్ళిద్దరి మధ్య సయోధ్య కుదర్చడానికి శ్రమ పడుతుండేవారు. నిర్లక్ష్యంగా స్రవంతీ, కోపంతో నాన్నా, ఏం చేసినా, ఎలా ఉన్నా మమ్మీ మాత్రం బ్యాలెన్స్డ్ గా హాస్పిటల్ పని చూస్తూ, చేస్తూ పేషెంట్లకు ఏ లోటు లేకుండా చూసుకుంటూ ఉండేవారు.

ఒకోసారి అప్పటివరకు వాదోపవాదాలు అయినా, కళ్ళు తుడుచుకుని,తల దువ్వుకుని పౌడర్ జల్లుకొని, మమ్మీ లిఫ్ట్ దిగి వస్తుంటే నాకే ఇదేం పరీక్షరా! దేవా ! అనిపించేది.

నాన్నగారు, ప్రాణం కన్నా మిన్నయిన నువ్వు, టీనేజి లో చెల్లి, ముగ్గురూ ఏం మాట్లాడకపోయినా, ఎలా ప్రవర్తించినా, ఎప్పుడూ ఆవిడ ఆవేశ పడలేదు. తనవంతు తాను మీ అందరికీ జీవితంలో హోదా తో పాటు ప్రేమ– కుటుంబం ఎంత ముఖ్యమో , అని చెప్పడానికి అన్నట్టు తను ఒక ప్రేమ ధార అయింది. ఉమ్మడి కుటుంబాలు ఎప్పుడో పోయాయి. ఇప్పుడు చివరికి ఒక ఇంట్లో తల్లి తండ్రి పిల్లలు ఒకరికొకరు కాకుండా పోతున్నారు.

" నిజం నువ్వే ఆలోచించు! చిన్నప్పుడు సరే కనీసం పెద్దయ్యాక అయినా అమ్మ ప్రేమ వన్ వే ట్రాఫిక్ లో ఉందని , అమ్మకు మనం ఏమిస్తున్నామని ఒక్కసారైనా , అనుకున్నావా? ఇదొకటే నా బాధ ...కిరణ్ ." ఆశ గొంతులో బాధ జీర కొట్టొచ్చినట్టుగా వినబడుతోంది.

కిరణ్ ఆశ వైపు చూస్తూ ఉండిపోయాడు. ఆశ ఆంటీ ఒక్కతే అమ్మ కు నిజమైన కామ్రేడ్ , ఫ్రెండు , అన్నీ.... మనిషి అంటే ఇలా ఉండాలి మరో మనిషిని స్టడీ చేయాలి ఎన్నేళ్లు? ! అబ్బ ! ఇలా నేను చేయగలనా? కనీసం నా ఫ్రెండ్ కైనా? పోనీ, ప్రేమించి పెళ్లి చేసుకున్న నా భార్య కైనా! కిరణ్ మౌనంగా ఉండేసరికి ఆశ ఆగిపోయింది.

"ఆంటీ , మీకు అమ్మకు ఏమిటా బంధం? " అడిగాడు.

ఆశ నవ్వింది. "నాకు , మమ్మీ కి ఐదు సంవత్సరాలు వయసులో తేడా. నేను జీవితాన్ని ఇక్కడే ప్రారంభించాను. ఆవిడ, నేను ఎన్నో మాట్లాడుకునేవాళ్ళం. నాకున్న లోకజ్ఞానం, మనుషుల పట్ల అవగాహన, అన్నీ ఆవిడ వల్లే వచ్చాయి. నీకు తెలుసా మమ్మీ ఇలా , మన ఆసుపత్రిలో ఉండిపోయింది కానీ, లేకపోతే డి ఎం హెచ్ ఓ అయిపోను. అంత H.R మన మేడం.."

కిరణ్ అవాక్కయ్యాడు. అవును !అమ్మ ఏమైంది? అమ్మగానే ఉండిపోయింది. తన జీవితం తన ఉద్యోగం, ఇంకేం లేవు తనకు.

" మరి, ఇంత హఠాత్తుగా ఏమైంది?" అడిగాడు.

" ఏముంది కిరణ్ బాబు..? స్రవంతి ఎవరితోనో అబ్బాయితో ఎక్కువగా మాట్లాడుతూ ఉన్నట్టు తెలిసింది. ఎవరో చెప్పారు , సారు స్నేహితుడు కొడుకు ద్వారా తెలిసింది. అంతే ! 'నా పరువు మంట కలిసిపోయిందని' ఫైర్ అయ్యారు. సోమవారం నాడు పూర్తిగా బరస్ట్ అయ్యారు. చెల్లి మీద చేయి చేసుకున్నారు కూడా. చదువుకున్నా , మానేసినా పరవాలేదు. మగ పిల్లలతో స్నేహాలు పట్టి తన పరువు బజారుకి ఈడుస్తుంటే సహించేది లేద'ని , స్రవంతి కి పెళ్లి చేసేస్తాన'ని సార్ కోపంగా మాట్లాడారు. అమ్మ 'నెమ్మదిగా నచ్చ చెప్పుదాం లెమ్మ'ని అంటున్నా వినలేదు. స్రవంతి గదిలోకి పోయి తలుపేసుకుంది. ఏ అఘాయిత్యం చేస్తుందో అని అమ్మ తలుపులు కొట్టడం మొదలు పెట్టిం . అప్పుడే కిందకి వచ్చిన సారు ఆ చప్పుళ్ళకు వెంటనే పైకి పరిగెత్తారు. ఆవేశంతో అమ్మను గట్టిగా లాగి తోసేశారు. అసలే నీరసంగా ఉన్న అమ్మ పక్కకు పడిపోతూ టేబుల్ కు తగిలింది. తల కి పెద్ద గాయమైంది . సార్ గట్టిగా తలుపులు కొట్టి , ఎలాగో తెరిచి చూసేసరికి, చెల్లి , అమ్మను, నాన్నని భయపెట్టడం కోసం, రూఫ్ గార్డెన్ కోసం తెప్పించిన పురుగుల మందు తాగేసింది. ఇటు అమ్మ , అటు చెల్లి ,ఇద్దరినీ ఆదరాబాదరాగా మన ఐసీయూలోనే పెట్టాము. నాన్నగారి క్లోజ్ ఫ్రెండ్ రావు గారు, రాజేష్ గారు వచ్చారు . రావు గారే నీకు ఫోన్ చేయమన్నారు." అని ముగించింది ఆశ.

కిరణ్ వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అమ్మ ఒంటరిపోరాటం చేసింది. నే వచ్చినా ఎపుడూ అమ్మతో మనసారా మాట్లాడనే లేదు. ఎప్పుడూ తీసుకోవడమే, ఇవ్వడం తెలీదు. దరిదాపుగ 28 ఏళ్ళొచ్చాయి. ప్చ్... చాల పెద్ద తప్పు చేసాను. వయసు కాదు ముందు మనసు మెచ్యూర్ అవ్వాలి.... "మమ్మీ!" అన్నాడు పైకి .

" కిరణ్ ! మళ్లీ , మళ్లీ , పిలువు. అమ్మా, అమ్మా అని. 28 ఏళ్ళ నీ జీవిత కాలం పాటు పిలవాలి"....

"లోపలికి వెళ్దాం ఆంటీ..!"

ఇప్పటికిప్పుడు అమ్మను గుండెలకు హత్తుకుని ఓదార్చాలనిపించింది కిరణ్ కు.

"నేను వచ్చాను , అమ్మా కిరణ్ ని . నేను వచ్చేసాను ..." అంటూ స్వర్ణ కాళ్లు నొక్కుతూ పక్కనే కూర్చున్నాడు కిరణ్.

ఆశకు కిరణ్ పిలుపు వేదనతో ఉన్నట్టు అనిపించలేదు.

ప్రేమను, గౌరవాన్ని అమ్మకు సంపూర్ణంగా ఇవ్వాలనే అవకాశం ఇమ్మని అనారోగ్యాన్ని బతిమాలుతున్న అర్థిస్తున్నట్టు గా అనిపించింది.

ఆశ వెనుతిరిగింది .

"స్వర్ణ మేడం కోలుకుంటే బాగుండు "తనలో తానే అనుకుంటూ ఇంటి దారి పట్టింది.

***

# తోట 'కల' 

ఆర్.సి.కృష్ణస్వామి రాజు

రిటైర్డ్ స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ రాంప్రసాద్ తన చిన్ననాటి కోరికను తీర్చుకోదలిచినాడు. తిరుపతి సుందరయ్య నగర్ లోని తన డుప్లెక్స్ హౌస్ ఇంటి ప్రక్కనే పాతిక సెంట్ల భూమి అమ్మకానికొస్తే రిటైర్మెంట్ ఫండ్స్ తో కొనేసాడు. అందమైన తోట పెంచాలన్నది అతడి జీవిత ఆశయం. తమ తాత ముత్తాతలకి వంద ఎకరాలు వుండేదని, వాటిని కూటి నీళ్లకు దారబోసినారని అమ్మమ్మ అమృతమ్మ చెప్పే . తను వందల ఎకరాలు కొనలేక పోయినా వంద చెట్లయినా నాటి తన చిన్ననాటి కల (కసి)తీర్చుకోవాలని ఆశ పడ్డాడు.

గార్డెన్ సిటీ బెంగళూరులో రకవారీ నర్సరీలు వున్నాయని రకవారీ మొక్కలు, పండ్ల మొక్కలూ దొరుకుతాయని తెలుసుకొని తన బ్యాంకు మిత్రుల ద్వారా లారీ చెట్లు తెప్పించుకున్నాడు.

నారింజ , మామిడి , జామ , సపోటా , దానిమ్మ , అరటి , కొబ్బరి చెట్లను నాటించినాడు . తమ ఇంటి పూజకు పూలలోటు వుండరాదని మల్లెలు , కనకాంబరాలు , నందివర్ధనాలు , ముద్దబంతులు , పారిజాతాలు , గన్నేరు , గులాబీ చెట్లు పాతినాడు . నీటిలోటు రారాదని తోటలోనే మూడువందల అడుగుల లోతుకి బోరువేసి మోటారు బిగించినాడు.

'అన్ని బాగుంది – చెట్లకు నీళ్లు ఎవరు పోస్తారు? పాదులు ఎవరు తీస్తారు? కంచె ఎవరు కడతారు ? చెత్తా చెదారం శుద్ధి ఎవరు చేస్తారు ? పశువుల బారిన పడకుండా , పురుగూ పుట్రా చేరకుండా ఎవరు కాపాడుతారు ' అని భార్య భవాని నిలదీసింది.

తలలో వున్న నాలుగు వెంట్రుకల్నీ పీక్కుంటూ ఆలోచనల్లో పడ్డాడు. "సలాంలు కొట్టే జనం , బెల్ కొడితే బాయ్, అడిగితే చాయ్ , స్విచ్ వేస్తే ఎ .సి ., కదిలితే కారు , అడ్డ దుడ్డాలకి అటెండర్లు " వున్న మేనేజర్ రేంజి నుండి అదీ 'పైసలకు పని చేసే మనిషి ఎవడు దొరకతాడబ్బా' అని వెదికే రోజు వచ్చింది. పర్మినెంట్ గా తోట మనిషి కావాలని అక్కడ ఇక్కడా విచారించినాడు. ఎక్కడా దొరకలేదు . 'ఎవ్వరూ దొరకడం లేదు ఏందబ్బా ' అనుకున్నాడు. సివిల్ ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్న కొడుకు కొలంబస్ ని చెట్లకు నీళ్లు పోయమని అడిగినాడు. వాడు వచ్చీ రాని గడ్డాన్ని పీక్కుంటూ తన ఫ్రెండ్స్ పంపే పేస్ బుక్ మెసేజ్ లకీ , వాట్సప్ మెసేజ్ లకీ రిప్లైలు ఇవ్వడానికే టైం చాలటంలేదని ఖరాఖండిగా చెప్పేసినాడు.

జర్నలిజంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్న ముద్దుల కూతురు జయశ్రీని కదిపినాడు. 'తోట చెట్లకి నీళ్లు పోసుకుంటూ వుంటే నా కెరియర్ చెట్టు ఎండిపోదా నాన్నా ' అంది. భార్య భవానిని భంగపడినాడు, తోట చెట్లకి సాయం చేయమని. “కూర్చుంటే లేవలేను , లేస్తే కూర్చోలేను , మోకాళ్ల నొప్పుల్తో ముడుచుకొని వుండాను. పి.ఎఫ్ డబ్బుల్తో మోకాలి చిప్పలు మార్చమంటే మార్చకపోతి . సిన్ననాటి కలలంటూ తిక్క తిక్క ప్రయోగాలన్నీ మాపై రుద్దకండి“ అని మొహమాటం లేకుండా ముఖంపైనే చెప్పేసింది. వారి మాటలకి బోనసాయ్ మొక్కలాగా చిన్నబోయినాడు. అయినా పట్టువీడలేదు. వాక్ మెట్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పరాంకుశంని సలహా అడిగినాడు .

"రాంప్రసాద్ గారూ ! పాతిక సెంట్ల తోటకి పనిమనిషి ఎందుకండీ! మీరే రోజుకి రెండు మూడు గంటల ఎక్సర్ సైజులనుకొని తోట పనులు చేసుకొంటే పోలా! షుగరూ తగ్గుతుంది . బ్లడ్ ప్రెషరూ పారిపోతుంది ' అని ఉచిత సలహా ఇచ్చినాడు. సలహాని చత్వారపు అద్దాలు వేసి ఒకసారి అద్దాలు తీసి మరొకసారి చెప్పినాడు వాక్ మెట్.

పరాంకుశం గారి సలహా భలే భలే నచ్చింది సారుకి. వెంటనే గాంధీ రోడ్డుకి వెళ్లినాడు. చిన్న కత్తి – పెద్ద కత్తి, చిన్నకత్తెర – పెద్ద కత్తెర, చిన్నపార – పెద్ద పార, చిన్నగడ్డపార – పెద్ద గడ్డపార, తొలిక, కొడవలి , దోటి, చేంతాడు , నిచ్చెన , రెండు డ్రమ్ములు , రెండు బకెట్లు , నాలుగు ప్లాస్టిక్ బిందెలు , నాలుగు మగ్గులు , పొడుగాటి ప్లాస్టిక్ పైపు ... అన్నీ తెచ్చుకున్నాడు. సేఫ్టీ మేజర్ మెంట్స్ లో భాగంగా కాళ్లకి స్లిప్పర్స్ , సాక్స్ , చేతికి గ్లౌజ్ , తలకి టోపీ , ఎండకి రంగు మారే నీలి కళ్లద్దాలు, ఎలాస్టిక్ నిక్కరు, తడి తుడుచుకోవడానికి ఓ తుండుగుడ్డ కూడా కొనుక్కున్నాడు .

అడవి రాముడు సినిమాలోని యన్ .టి .ఆర్ . పాట "కృషి వుంటే మనుషులు ఋషులవుతారు " రెండు మూడు సార్లు యూట్యూబ్ లో చూసుకున్నాడు . తనను తాను రైతు బిడ్డగా, రైతు బంధుగా , రైతే రాజుగా , రైతు నేస్తంగా , మట్టి బిడ్డగా , అన్నదాతగా ఊహించుకొని మురిసిపోయాడు . 'ఆడుతుపాడుతు పని చేస్తుంటే అలుపూ , సలుపూ ఏమున్నది ' అంటూ అక్కినేని పాట పాడుకొంటూ రంగంలోకి దిగాడు .

మొదటిరోజు తెల్లపంచె, కట్ బన్నీయను వేసుకొని తలకి గుడ్డ చుట్టుకొని తోటపని చేసుకుపోతున్నాడు. ఎక్కడి నుంచో రెండు పిచ్చుకలు వచ్చి వాలినాయి . సంతోషం పట్టలేక పోయాడు . చిన్న పిల్లాడిలా పరిగెత్తుకెళ్లాడు వాటి దగ్గరకి. అవి తుర్రున లేచి వెళ్లిపోయాయి. దిగాలుగా నిలబడి వుంటే రెండు వీధి కుక్కలు తోకలు ఆడించుకొంటూ వచ్చి కాళ్లెత్తినాయి. చిన్న గులక రాళ్లు ఎత్తుకొని పరిగెత్తినాడు వాటిని తరమడానికి, అవి బెదరలేదు. నింపాదిగా తమ పని పూర్తి చేసుకొని నాలికలు జాడించుకొంటూ నడిచిపోయాయి. అతడు పరిగెత్తుతూ వుంటే సన్నది , చిన్నది , నల్లది , పొడుగుది అయినా పాము ఒకటి కనిపించింది. ఎగిరి పడినాడు మాజీ మేనేజరు. శబ్దం లేకుండా పాము ఎట్లా వచ్చిందబ్బా? 'ఓ .... అవును కదూ – సినిమాల్లో అయితే పాము వచ్చేటప్పుడు మ్యూజిక్ పెడతారు. ఇక్కడ మ్యూజిక్ ఎవరు కొడతారులే ' అనుకున్నాడు. పాము తోట దాటి పోయేంతవరకు గుండెలు అర చేతిలో పెట్టుకొని తోట మూలగా నిలబడ్డాడు. ఎవరో ఒక కాలనీ ఆమె పసుపు పచ్చ నైటీ వేసుకొని ఊగుతూ ఊగుతూ వచ్చి పెద్ద నల్ల పాలిథీన్ కవర్లో చెత్తతెచ్చి పడేసింది. గబ్బంటే గబ్బుకాదు. రెండు లీటర్ల ఫినాయిల్ చల్లినా గబ్బు తగ్గేట్లు లేదు. దగ్గరకెళ్లి అరుద్దామనుకున్నాడు. ఈ పెద్దాయన నడుచుకుంటూ ఆమె దగ్గరికి వెళ్లేలోగా ఆమె ఊగుతూ ఊగుతూ వెళ్ళిపోయింది . ' బ్యాంకులో సింహం లా తిరిగే వాడిని , తోటలో తోటమాలిగా తిరగాల్సి వస్తోంది' అనుకున్నాడు.

రెండవ రోజు పనిలోకి దిగినాడు. రాత్రి పడిన వానకి నీళ్లు చేరివున్నాయి. పీతలు , గొల్ల భామలు , తేళ్లు, కప్పలు, జెర్రిలు , నత్త గుల్లలు , వానపాములు , ఉడతలు , ఎలకలు , బల్లులు .... ఇంకా రకరకాల జీవరాశులు కనిపించాయి. ' నేలపైన జీవరాశులు కాకపోతే వజ్రవైఢూర్యాలు కనబడతాయా ' అనుకొని తనకుతాను భుజం తట్టుకొని దైర్యం తెచ్చుకున్నాడు. 'మేనేజర్ గా వున్నప్పుడు స్టాఫ్ చేసే శ్రమదానం, మొక్కలు నాటే సన్నివేశం , వృక్షో రక్షతి రక్షితః కార్యక్రమం భలే గమ్మత్తుగా వుండేదికదా. ఇప్పుడెందుకిలా కష్టంగా వుంది' అనుకున్నాడు. 'చేసుకుంటూ పోతే అలవాటవుతుందిలే' అని తనను తాను సముదాయించుకున్నాడు .

పనంతా అయినాక తన మట్టి గుడ్డల్ని తనే ఉతుక్కోసాగాడు. గుడ్డల పని కూడా చెబితే భవాని కేకలేస్తుందేమోనని భయపడి. తను గుడ్డలుతుకుతుంటే "టైర్డ్ అయ్యాడని బ్యాంకోళ్లు రిటైర్డ్ చేస్తే ఆయన పంగ లేని పనులన్నీ నెత్తిన వేసుకున్నాడమ్మా " అని తన ఎనభై ఏళ్ల తల్లితో ఫోనులో చెబుతోంది భవాని. వినీ విననట్లు వున్నాడు కానీ సారుకి చిన్న సైజ్ కోపం వచ్చింది. 'పెళ్లాలకి ప్రాధత్యం వచ్చినాక మొగుళ్లకి కాస్త పట్టువిడుపులు వుండాలప్పా ' అని చెప్పిన ధర్మవరం మేనేజర్ ధర్మరాజు చిలకపలుకులు గుర్తొచ్చి గమ్మున వుండిపోయినాడు.

00000

రెండు రోజుల తోట పనికే నడుము నొప్పి, భుజం నొప్పి, మెడ నొప్పి , కాళ్ళ నొప్పి , కీళ్లనొప్పి ఒళ్ళంతా నొప్పి , కండరాల నొప్పి వచ్చినాయి . అట్లే వదిలేస్తే పెద్ద ప్రాణం ఇబ్బంది పడుతుందని ఎముకల డాక్టరు దగ్గరికి వెళ్ళినాడు. డాక్టరు ఇచ్చిన మాత్రలతో కడుపులో మంట , నాటిన చెట్లు ఎండిపోతుంటే కడుపుమంట కలిగినాయి సారుకి.

డాక్టరు సలహా మేరకు ఫిజియోథెరపిస్టు ప్రకాశంని ఇంటికి పిలిపించుకొని థెరపీ ప్రారంభించినారు. 'కాల్షియం కలిగిన కోడి గుడ్డు తినండి . ఎముకలకి ఎరువు, ఒంటికి శొంఠిలాగా పనిచేస్తుంది' అని చెప్పినాడు ప్రకాశం. రోజుకి రెండు గుడ్లు ఉడకపెట్టి తెల్లగుడ్డు మాత్రమే మొగుడికి పెట్టసాగింది భవాని. పసుపు గుడ్డు వైపు కనుగుడ్లు మిటకరించి ఆశగా చూడసాగాడు. ' అవి తింటే కొవ్వు కొలెస్ట్రాల్ పెరుగుతుంది జాగ్రత్త ' అన్నట్లుగా చూసేది

భవాని. అవి పారవేయడం దేనికని పనిమనిషి రాములమ్మకిచ్చింది తినమని. "మాయబ్బకి రక్తపోటు వుండాదని మమ్మల్ని కూడా గుడ్డు పసుపు తినొద్దన్నాడమ్మా డాకటరు " అని వాటిని తీసుకోలేదు రాములమ్మ. 'అందరకి హెల్త్ అవేర్ నెస్ లే " అని తిట్టుకుంటూ డస్ట్ బిన్ లో పడేసింది భవాని. మన్నుతిన్న పాములాగా గమ్మునవుండి పోయినాడు సారు.

00000

వారం రోజుల థెరఫీ అయిపోయాక ప్రకాశం "సారూ ! ఇకపై అన్ని పనులు మీకు మీరే చేసుకోవచ్చు " అన్నాడు. కస్సున లేచింది భార్య భవాని. " అయ్యా ! ప్రకాశం ! అయనికి ఓవర్ కాన్ఫిడెన్స్ ఎక్కువ బాబూ! గత ఏడాది శుక్లాల ఆపరేషన్ చేసుకున్నపుడు కంటి డాక్టరు ఇలాగే చెప్పాడు "అన్ని పనులూ మీకు మీరే చేసుకోండి " అని. "గంటకొకసారి కంటి చుక్కలు వేసుకోవాలి. పడిసెం ముక్కుకీ మందు వేసుకోవాలి. తన పని తాను ఇండిపెండెంటుగా చేసుకోవాలని ముక్కుమందు కంటికి, కంటి మందు ముక్కుకి వేసుకున్నాడు. దానికి వైద్యం చేయించలేక ఆరువారాలు నానా అగచాట్లు పడ్డాం'. అని ఎగిరెగిరి చెప్పింది.

ముసలి మొగుడు, ముసలి పెళ్ళాం మధ్యలో దూరితే తనకి 'ఎలక్ట్రో థెరఫీ ' చేయించేలా వున్నారని అక్కడ నుంచి చిన్నగా జారుకున్నాడు ప్రకాశం.

.

00000

దింపుడు కళ్లెం ఆశతో రాత్రికి రాత్రి ఇంట్లో వారినందరినీ కూర్చోబెట్టి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినాడు సారు. తన కలల తోటని కాపాడమని కోరినాడు అందరనీ. తోటని కాపాడే తోటమాలిని వెదకండని వేడుకున్నాడు.

'మనల్ని చూసేదానికే ఒక మనిషి కావాలి. దానికే దిక్కు లేదు. మళ్లీ మీ తోటకొక మనిషా? ' అని నిలదీసింది భవాని. "కలగనడమంటే తాజ్ మహల్ కట్టే కలో , గోల్కొండ కట్టే కలో కనాలి గానీ , తోట కలలు ఈయనకు ఎందుకొచ్చాయబ్బా " అని పుత్రరత్నం మరియు పుత్రి కారత్నంలు తమలో తాము ప్రశ్నించుకున్నారు.

సాధ్యసాధ్యాలు సుఖాలు లాభనష్టాలు వ్యయ ప్రయాసలు మంచి చెడ్డలు ఆలోచించినారు. పనిమనిషి రాములమ్మకు ఇంటి పని జీతం మూడువేల నుంచి అయిదు వేలకి పెంచి తోటని కాపాడుకొందామని కొడుకు సివిల్ ఇంజనీర్ ప్రతిపాదనతో అందరూ తృప్తి పడ్డారు.

'అయినా ఆ పిల్ల ఎక్కడ పనిచేసి చస్తుంది రా బాబూ ! గుడ్డలు వాషింగ్ మిషనులో వేయకుండా తన చేత ఉతికిస్తానని మిషను తుప్పు పట్టిపోదా అమ్మగారూ అని అడిగిందిరా ఈ మధ్య' అంది భవాని.

'వెయిట్ అండ్ సీ' అంది భావి భారత జర్నలిస్ట్ జయశ్రీ.

' ఏమో ! నా అమెరికా తమ్ముడు అమెరికా నుంచి వచ్చేలోగా తోట అందంగా కనబడాలి. మావతోట ఎంతదాకా వచ్చిందక్కా అని ఫేస్ బుక్ లో ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తున్నాడు వాడు ' అని నిట్టూర్చింది భవాని.

00000

రాముల్లమ్మ ఒప్పుకొంది. ఒకేసారి రెండువేల జీతం పెరిగేసరికి ఎగిరి గంతులేసింది. మొగుడు మురారి సిమెంట్ కంపెనీ వాచ్ మెన్ గా సంపాదించేదీ ఐదువేలే. మొగుడు సంపాదనతో తన సంపాదన సమానమయ్యిందని ఆమె ఆనందానికి పట్ట పగ్గాలు లేకుండా పోయింది. నాలుగైదు రోజులు ఎగిరెగిరి పని చేసింది. అన్ని గమనించ సాగాడు సారు.

రాములమ్మ తోటపని చేస్తోందంటే చేస్తోంది కానీ సంతోషంగా మనస్సు పెట్టి పనిచేయడం లేదనిపించింది ఇంటిల్లిపాదికీ. ఆమె చేసే తోట పనిలో 'జీవం ' వున్నట్లు గోచరించలేదు వారికి . ఏదో మొక్కుబడిగా చేస్తున్నట్లు అనిపించింది. జీతానికి పనిచేస్తున్నట్లుగా కాక ఉచితంగా పనిచేస్తున్నట్లుగా పని చేసేది . కుంటి సాకులు చెప్పి అడపాదడపా పని ఎగరగొట్టేస్తూ వచ్చింది కూడా. ఒక రోజు తలనొప్పి, ఇంకొక రోజు కాళ్లు నొప్పి, మరొక రోజు ఒళ్లు నొప్పి ... ఇలా చెప్పడం ప్రారంభించింది. ఒక వారం బిడ్డకి ఒళ్లు బాలేదు, ఇంకొక వారం సంఘం కాడికి పోవాలి. మరొక వారం మా ఇంటాయనకు బాలేదు .... ఇలా దండిగా సెలవులు పెట్టసాగింది. శక్తి వస్తుందని పండూ , పాలు ఇస్తే తిని తాగుతోంది కానీ తృప్తిగా పనిచేయడం లేదు. చెట్లు చస్తే

నాకేమి, బతికితే నాకేమి అన్నట్లుగా నీళ్లు పట్టసాగింది. ఈ అమ్మి వయ్యారాలకు తోట ఎక్కడ పాడైపోతుందోనని బాధపడసాగారు ఇంట్లో వాళ్లంతా. పసిపిల్ల – పని చేయలేక కాదు, సరైన ప్రేరణ లేక రాములమ్మ తోటపని చేయలేక పోతోందని గ్రహించినాడు మాజీ మేనేజర్.

00000

ఆరోజు – వాష్ బేసిన్ వద్ద నిల్చొని అద్దంలో ముఖం చూసుకుంటూ షేవింగ్ చేసుకుంటున్నాడు సారు. వాష్ బేసిన్ చిన్న బొక్కల్లోంచి రెండు బొద్దింకలు మీసాలు ఊపుకుంటూ బయటకొచ్చాయి. ఉలిక్కి పడినాడు. కాసేపటికి తేరుకొని 'ఇంత చిన్న బొక్క నుంచి అంతపెద్ద బొద్దింక ఎలా వస్తోందబ్బా ' అని ఆలోచించినాడు. బి.యస్సీ డిగ్రీలో చదివిన డార్విన్ సిద్ధాంతం ' స్ట్రగుల్ ఫార్ ఎగ్జిస్టెన్స్ ' గుర్తొచ్చింది. పనిలో పనిగా పదేళ్ల ఫ్లాష్ బ్యాక్ గుర్తొచ్చింది. రాయలసీమ బిల్డర్స్ వారు తిరుపతి – రేణిగుంట రోడ్డు లో రెండు మూడు అపార్టుమెంట్స్ వెంచర్లు వేసినారు. వాటిలో వందమంది క్లయింట్లకు తాను హౌసింగ్ లోన్ మంజూరు చేసాడు. కృతజ్ఞతా పూర్వకంగా బిల్డర్లు తమ అపార్టుమెంటులో ఒక టేకు చెట్టు తన చేతితో నాటించి చెట్టుకింద తన పేరుతో చిన్న సిమెంట్ బోర్డు పెట్టించినారు. తను ఎంత సంతోషపడినాడో ... అదే బిల్డర్లకు ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా పదింతలు సహాయం చేసివుంటాడు తను. రేణిగుంట రోడ్డులో వెళ్లే ప్రతిసారీ ఆ ఫ్లాట్స్ వద్దకి వెళ్లి టేకు చెట్టుని తృప్తిగా స్పృశించి తనివితీరా కళ్లారా చూసి వస్తుంటాడు. కొన్ని నీళ్లు కూడా పోసి వస్తుంటాడు.

00000

ఏదో వింత ఆలోచన ఒకటి ఫ్లాష్ లాగా వెలిగింది. గబగబా షేవింగ్ ముగించి టౌన్ లోని కర్నాల వీధికి పరుగులు తీసినాడు. వెల్డర్ వెంకటేశ్వర్లుని కలిసినాడు. నాలుగడుగుల రాడ్ కట్ చేయించి చిన్నసైజు బోర్డుని దానికి వెల్డింగ్ ద్వారా అతికించినాడు. బోర్డుకి, రాడ్ కి రంగులు వేయించినాడు.

ఇంటికెళ్లి చల్లటి వాతావరణంలో తోటలో మీటింగు పెట్టినాడు. భార్యనీ , పిల్లలనీ , రాములమ్మనీ , రాములమ్మ మొగుడ్నీ పిలిచినాడు. చాక్ లెట్లు పంచినాడు. ఇనుప కమ్మికి, బోర్డుకి, పసుపు , కుంకుమలు రాయించినాడు. తోట మధ్యలో చిన్న సిమెంట్ దిమ్మె కట్టించినాడు. సిమెంట్ దిమ్మెకు చందనం రాసి కుంకుమ బొట్లు పెట్టినాడు. ఎర్రమందారాలు దిమ్మె చుట్టూ పరిచినాడు. తను తెచ్చిన రాడ్ బోర్డుని దానిపై నిలబెట్టినాడు. బోర్డుపై ముత్యాల్లాంటి అక్షరాలు "రాములమ్మ తోట "ని చూసి అందరూ తప్పట్లు కొట్టినారు. రాములమ్మకి షేక్ హ్యాండ్లు ఇచ్చినారు. చామంతుల చెండు రాములమ్మకిచ్చినారు . ముద్ద బంతుల మాల మురారికి వేసినారు. మొగుడు మురారి భార్యని మెచ్చుకోలుగా చూసినాడు.

రాములమ్మ ఉలిక్కిపడింది. ఉక్కిరిబిక్కిరి అయిపోయింది 'తోట పేరే నీపేరు పెట్టారు రాములమ్మా ! దీనినెట్లా కాపాడుకొంటావో ఏమో ' అని అంది భవాని. తన పేరు పెద్ద పెద్ద అక్షరాల్లో రంగురంగుల బోర్డుపైన మెరుస్తూ వుంటే రాములమ్మకి దిమ్మ తిరిగి పోయింది. చటుక్కున ఓనర్ మరియు ఓనరమ్మల పాదాలపైన పడింది. మొగుడితో కలసి ఆశీర్వాదం తీసుకొని అక్షింతలు చల్లించుకొంది. గంతులేస్తూ పెరట్లోకి పరిగెత్తింది. నీటి తొట్టిలో తనను చూసుకొంటూ చిన్న పిల్లలా డాన్సులేసింది. పల్లెల్లో జాతరకి పలకలు కొడితే వేసే "డబ్బుస్కు డబ్బుస్కు ' అడుగులేసిం . ఇప్పుడు తన స్టేజ్ మారిందని గుర్తొచ్చి కాసేపు వెస్టర్న్ డ్యాన్స్ చేసి అలసి పరుగెత్తుకెళ్లి బాధ్యతగా తోట పనిలో లీనమయ్యింది.

నాలుగేళ్లు గడిచాయి. ఓ సాయం సంధ్యవేళ – రాములమ్మ తోటలో దేముడి పటాలకని మల్లెపూలు కొస్తోంది భవాని. సపోటా చెట్టు క్రింద కుర్చీలో కూర్చొని స్ట్రక్చరల్ ఇంజనీర్ కొలంబస్ డుప్లెక్స్ బిల్డింగ్ ప్లాన్ గీస్తున్నాడు. జామ చెట్టు కింద కూర్చున్న జర్నలిస్ట్ జయశ్రీ ఆదివారం అనుబంధానికి ప్రత్యేక వ్యాసం వ్రాస్తోంది. మాజీ మేనేజర్ అద్దం ముందర పెట్టుకొని చిన్న కత్తెర తో తెల్ల మీసాలు ఏరి ఏరి కత్తిరిస్తున్నాడు. రాములమ్మ మొగుడు చింత చిగురు కోస్తున్నాడు. తోట మూలన రోకట్లో చింతకాయల పచ్చడి దంచుతోంది రాములమ్మ.

అమెరికా మరిది ఆనందరావు పట్టీల మంచంపైన వెల్లకిలా పడుకొని జామకాయ కొరుకుతూ "ఫైసల్ చెయ్యలేని ప్రేరణ – చిన్న బోర్డు చేసింది కదా మావా ! జామకాయలు తియ్యగా లేవేమి మావా ! అని అడిగినాడు. అందరూ గొల్లున నవ్వినారు. పారిజాతం చెట్టు తెల్ల పూలను పలపలా రాల్చింది . సంపెంగ పూలు సంతోషంగా అటూ ఇటూ ఊగినాయి .

# నువ్వు + నేను = మనం

శ్రీనిధి యెల్లల

ఇది రెండో రోజు వరసుగా, నేను బాక్సు కట్టడం తను తీసుకోకుండా ఆఫీసుకి వెళ్ళడం. ఇద్దరి మధ్య మాటలు లేవు. అసలు చూపులు కూడా లేవు. భోజనానికి అన్నీ పెట్టి కూర్చున్నాను. వస్తే కదా పురుషుడు. అహంకారం...హుమ్...నీకే అంత ఉంటే నాకెంత ఉండాలి. నేను కూడా పిలవలేదు. నేను మాత్రం ఇంత అన్నం, కూరా ప్లేట్లో వేస్కుని దిగ మింగాను. కలిసి కాకుండా ఇలా విడిగా తినడం ఇబ్బందే కానీ, ఆ విషయం పైకి కనపడనివ్వలేదు. అమ్మో ఇంకేమైనా ఉందా అలుసైపోమూ!? ఈ కాండిడేట్ కి అసలు ఆకలి వెయ్యదా? సిగ్నల్ ఇవ్వడానికి అన్నట్లు ప్లేటులో గరిటతో టంగు టంగు మని కొట్టాను. విసురుగా లేచి వచ్చి, హల్దిరామ్స్ రెడీ మేడ్ మీల్స్ ప్యాకెట్ ని ఓవెన్ లో వేడి చేసుకుని తినడం మొదలుపెట్టాడు.

ఎంత పొగరు...ఎంత కండకావరం...ఎంత ఇది...ఎంత అది. ఛా! మాటలు కూడా అందడం లేదు. అసలు ఇంకోసారి ఈ రెడీమేడ్ ఫుడ్డుని తీస్కుని రాకూడదు ఇంట్లోకి అనుకున్నాను. గిన్నెలు సర్దుతూ ఓరకంట చూస్తును కదా, ఎంచక్కా లాప్ టాప్ లో ఏదో కెలుక్కుంటున్నాడు. అప్పట్లో ఆడవాళ్ళకి ఆడవాళ్లతోనే సవతి కష్టాలు వచ్చేవి. ఈరోజుల్లో ఈ లాప్ టాప్ లు, ఐపాడ్లు తగలడ్డాయ్ మా ప్రాణానికి. తిన్నగా కాపురం కూడా చేస్కోనివ్వడం లేదు జనాలని. పక్కనున్న పెళ్ళాం అందంగా వుందో లేదో చెప్పరు కాని, అక్కడెక్కడో వున్న హీరోయిన్ కి, ఫ్రెండ్స్ కి లైకులు, కామెంట్లు పెడతారు ఫేస్ బుక్ లో.

ఓ ముద్దూ ముచ్చటా ఏమీ పట్టవు. గూట్లో గుండ్రాయి లాగా ఉంటాడు. సరే ఎన్ని రోజులు ఇలా ముడుచుకు కూచుంటాడో చూస్తా. ప్రాణం లేని వస్తువులతో ఎన్ని రోజులు కాపురం చేస్తాడో చూద్దాం. బెడ్ రూమ్ లోకి వెళ్ళి అలిగిన మంచంపై వాలి ఆన్ లైన్ ఎఫెం పెట్టుకుని వింటూ వున్నాను. నాకిష్టమైన పాట బాలూ గారిది,"మాటే రాని చిన్నదాని కళ్ళు పలికే ఊసులూ"వస్తోంది. ఎంత హాయిగా వుంది పాట. పెళ్ళికి ముందు ఎంత హుషారుగా వుండేదాన్ని, సెలయేటి వేగం, వెన్నెల రాత్రుల మౌనం, చిగురుటాకుల రాగం అన్నీ కలిస్తే నేను లాగా వుండేదాన్ని. ఇదిగో ఈ పురుషున్ని ఏ ముహూర్తాన చూసానో సెలయేటి ప్రవాహం ఆగిపోయి చలనం లేని చెరువు లాగా అయిపోయాను. వెన్నెల కరిగి కృష్ణ పక్షం మొదలయ్యింది, ఎందుకులే ఎక్కువ ఆలోచిస్తే చికాకులో వైరాగ్యం వస్తుంది....!

★★★★★★★★★★




ఎంత పొగరు. మొగుడు అనే గౌరవం ఏ కాస్తన్నా వుందా! అవునులే ఈ కాలం ఆడపిల్ల కదూ, వీళ్ళకి సమాన హక్కుల కోసం రచ్చ కెక్కడం మాత్రమే తెలుసు. సమాన గౌరవం గురించి ఏమి తెలుస్తుంది. ఒక చిన్న మాట అంటే ఇంతెత్తున్న ఎగిరి దూకి మౌన యుద్ధం పాటించాలా? అయ్యో, మొగుడు మాట్లాడట్లేదే, కొంచం పలకరిద్దామని ఏమైనా వుందా? అసలు ఈ పిజ్జా బర్గర్ల దేశంలో ఏం తింటున్నాడో అనే బాధ కాస్తైనా వుందా? వంటిల్లు, పడకటిల్లు తన అదుపులో పెట్టుకుని,

తనకీ, తన తిండికి నన్ను బాగా అలవాటు చేసేసేకుని ఎక్కడికి పోతాడులే అని అనుకుంటోన్దేమో? ఆ పప్పులేమీ నా దగ్గర ఉడకవు. నాకు గానీ తిక్కరేగిందంటే కడుపు ఆకలి ఐనా, ఆ ఆకలి ఐనా కేర్ చెయ్యను.

పెళ్ళి చూపుల్లో ఎంత బాగుంది, బాపూ గారి బొమ్మలా, వేసవిలో మల్లెపువ్వులా, పల్లెల్లోని ముద్దమందారం లా అబ్బా...నా పంట పండింది అనుకున్నాను. పెళ్ళికి ముందు ఎంత జాలీగా వుండేవాణ్ణి...నా రూములో నా ఇష్టం వచ్చినట్లు వస్తువులు పెట్టుకునే వాన్ని, ఎప్పుడూ కావలిసి వస్తే అప్పుడు నా మిత్రబృందం వాలిపోయేవారు, అన్ని కలర్ల ఫిల్ములు చూసేవాడ్ని, ఎత్తితే బీరుబుడ్డీలు లేచిపోయేవి...మరి ఇప్పుడో? ఆఫీసునుండి రాగానే షూల నుండి వాచీ వరకూ ఏవి ఎక్కడ పెట్టాలో అక్కడే పెట్టాలి. పొరపాటున ఇంకెక్కడైనా పెడితే స్నానం చెయ్యకుండా పూజలో కూర్చున్న వాడిలా, నన్నొక్క చూపు చూస్తుంది. ఈవిడ పర్మిషన్ లేనిదే నా మిత్రబృందం తాలూకు ఒక్క కాకి కూడా వాలడానికి లేదు. సీరియల్లన్నీ ఐపోయాక ఒక పావుగంట ఇస్తుంది నాకు నచ్చినవి చూసుకోడానికి. సరేలెమ్మని ఫేస్ బుక్, యు ట్యూబ్ అలవాటు చేసుకుంటే పట్టించుకోడం లేదని నస.

బేసిగ్గా వీళ్ళకి ఏం కావాలో వీల్లకే తెలిసి చావదు. ఒకటి చెప్తే తక్కువా, రెండు చెప్తే ఎక్కువా. కోట గారు, 'భద్రం బీకేర్ ఫుల్ బ్రదరూ' అని, నాగార్జున గారు 'వద్దురా సోదరా' అని ఎంత చెప్పిన కూడా విని చస్తే కదా. సరేలే ఎక్కువ ఆలోచిస్తే ఫార్ములు వదిలేసి కాషాయం కట్టుకోవాలనిపిస్తుంది. పడుకుందాం...అమ్మో మంచం వద్దు అక్కడ ఈ టైములో అతీత శక్తులు ఉంటాయ్...కౌచ్ లోనే ముడుచుకుని పడుకుంటాను.

★★★★★★★★★★★★



**మూడో రోజు:** ఛా! ఏమి బాగోలేదు. ఇలా ఆంధ్ర, తెలంగాణాల్లా వుండడం. కష్టమో నష్టమో ఏదో ఒకటి మాట్లాడుకుంటు ఉంటేనే బాగుంది. మాట్లడేద్దామా? వద్దులే. తను మాట్లాడొచ్చు కదా? పాపం. బాగా కోపం వచ్చినట్లు ఉంది. నేనే అనవసరంగా నోరు పారేసుకున్నాను. వెయ్యి మాటల్లో చెప్పలేనిది ఒక్క స్పర్శ తో చెప్పగలదు. నా నడుము చుట్టూ చెయ్యి వేసి పడుకుంటే ఎంత ధీమాగా వుండేది. కోట్లిచ్చినా కొనలేని ధైర్యం అది. ఇక తన ప్రేమలో నన్ను ఉక్కిరి బిక్కిరి చేసే క్షణాలు మర్చిపోగలనా అసలు. నాకే బుద్ధిలేదు. పాపం ఆ ఆఫీసులో ఏమి తింటున్నాడో ఏమో. ఛా! ఎన్ని మాటలు అనుకున్నాను.

కుదురు లేని నిలకడ లేని సెలయేరుకి ఒక కుదురు, ఒక స్థానం ఇచ్చింది తనే కదా. కృష్ణపక్షం అంటూ ఒకటి లేకపోతే వెన్నెలకి విలువ ఉంటుందా? చిగురుటాకులు ముదిరి రాలితేనే కదా కొత్త అందాలకి అవకాశం వచ్చేది. నా దగ్గర నుండి ఆయన ఏమీ దోచుకుంది లేదు. ఇంకా తన స్నేహంతో నన్ను పరిపూర్ణం చేసాడు. పిచ్చి సీరియళ్ళు, కథలు చదివి మనసు పాడు చేసుకుంటున్నాను. ఇక నా వల్ల కాదు ఈ శపథాలు, ఛాలెంజులు. తను విసుకున్నా, కోపం తెచ్చుకున్నా నేను మాటాడేస్తాను...అంతే.

★★★★★★★★★★★★★★



ఛీ! ఎదవ బతుకు. సరిగ్గా తిని మూడు రోజులైంది. ఈ బ్రెడ్డు ముక్కలు తినీ తినీ నాలుక మందం అయిపోయింది. ఐనా నాకింత కోపం ఉండకుండా ఉండాల్సింది. పాపం నాకోసం అందర్నీ, ఉద్యోగాన్ని వదిలేసి ఇక్కడ ఖైదీ లా ఉంటోంది. ఏదో విసుగులో ఒక మాట అంటే నేను పడోచ్చుకదా. కొవ్వు. నాకీమాత్రం జరగాల్సిందే. ఎంత చక్కగా బాక్సు కట్టేది. తన ప్రేమంతా తన బాక్సు కట్టే విధానం లోనే తెలిసిపోయేది. నేను కాస్త అలసిపోయినా ఎంత కంగారు పడేది. నా దగ్గర గువ్వలా ఒదిగిపోయేది, మైనం లా కరిగిపోయేది.

ఇల్లు ఎంత ఆర్టిస్టిక్ గా పెడుతుంది. ఒక్క రోజైనా నా వస్తువుల కోసం వెతుకున్నది లేదు. ఎప్పుడూ వాటి స్థానాల్లో అవి రెడీగా ఉండేవి. మా ఫ్రెండ్స్ వస్తే ఏదైనా చేసి పెట్టాలని ముందుగానే చెప్పమనేది కానీ ఎప్పుడూ ఎవరినీ రావద్దని చెప్పలేదే. అంత అందం ముందుంటే ఇంక కలర్ ఫిల్ముల అవసరం ఏంటి నాకూ. ఏమి చెప్పినా నా ఆరోగ్యం కోసమే కదా...నేనే ఫూల్ ని ఎన్నడూ తనని మెచ్చుకున్న పాపాన పోలేదు. నా ఫీలింగ్స్ ని ఎప్పుడూ సరిగ్గా తెలియజేసిందే లేదు. ఏమైనా సరే తనతో మాట్లాడాల్సిందే...చివరికి కాళ్ళు పట్టుకోడానికైనా నేను రెడీ.....హా.!

★★★★★★★★★★★★★

**నాలుగో రోజు:**



"ఆఫీస్ టైం అవుతోంది లేరా"...

"ఒక 5మినిట్స్ రా ప్లీజ్" ...

"సరే బజ్జోలే, నేను లేపుతా కాసేపాగి."

"ఇడ్లి సూపర్ ...పచ్చడి అదిరింది"...

"అన్ని బాక్సులు తినెయ్యాలి, ఫ్రూట్స్ పెట్టిన బాక్సు ఈవెనింగ్ 4 కలా తిను" ...

"అలాగే. నీకు ఈరోజు డ్రైవింగ్ క్లాస్ అప్పాయింట్మెంట్ తీస్కున్నాను, త్వరగా ఇంటి పని చూస్కుని వెళ్ళు. బి బ్రేవ్"...

"ఓకే రా. వీకెండ్ జెమ్స్ షో కి వెళ్దామా, కొన్ని చైన్స్ కొనాలి",...

"ఓకే డన్...సాయంత్రం మిరపకాయ్ బజ్జీలు చేస్తావా తినాలని ఉంది"....

"సరే, టేక్ కేర్ బాయ్"....

ఓకే మా. బాయ్. ఉ.... మ్మా......

**మూడు రోజుల క్రితం:**

"ఆఫీస్ కాల్ మాట్లాడేటప్పుడు టీవీ వోల్యూం తగ్గించవచ్చుకదా".

"నాకేం తెలుసు నువ్వు కాల్ లో వున్నావని"

'నీకేం తెలుసు ఏమి తెలీదు, నా టెన్షన్స్ నీకు అర్ధం కావు. గంట సేపు వంటింట్లో ఉండి రోజంతా టీవీ ముందు, కిట్టి పార్టీల్లో గడపడం మాత్రం తెలుసు".

"కోపంలో ఏది పడితే అది మాట్లాడొద్దు...నువ్వెలాగు నాతో మాట్లాడవు. నా పాటికి నేను టీవీ చూడడం కూడా తప్పేనా...నాకేమన్నా సరదానా పార్టీలకు వెళ్ళడానికి. మీ కొలీగ్ వాళ్ళ మిసెస్ లు అని పరిచయం చేసి మీరు సోషల్ గా మూవ్ అవమంటేనే కదా నేను పార్టిలకి వెళ్ళేది."

"అన్నిటికీ అన్ని సమాధానాలు చెప్తావ్...నీతో మాట్లాడడం వేస్ట్..."

"ఎవరిమీదో కోపం నాపై చూపిస్తావ్ నీతో మాట్లాడడం కూడా వేస్ట్..."

"పో"...

"నువ్వు కూడా పో"...

❦❦❦

వాళ్ళలో ఎవరు ముందు మాట్లాడారో వాళ్ళకే తెలీదు. తెలుసుకోవాలని కూడా వాళ్ళకి ఉన్నట్టు లేదు. మూడు రోజులుగా మౌన మునుల్లాగా మాట్లాడుకోవట్లేదనే విషయం గురించి అసలు గుర్తే లేదు.

❦❦❦

## యోగి — రవి కొప్పరపు

రాత్రి డేరా లో కూర్చుని ఉన్న బషరత్ ఆలీ, గౌస్ ఖాన్ దగ్గరికి ఒక భటుడు వచ్చాడు.

"ఎవరో కుర్రాడు మన తిరుగుబాటు సైన్యంలో చేరడానికి వచ్చాడండి. పంపమంటారా?"

ఆలీ, ఖాన్ వైపు చూసి భటుడి తో "సరే పంపు" అన్నాడు. భటుడు కొంతసేపైన తరువాత సన్నగా ఉన్న ఒక కుర్రాడితో లోపలికి వచ్చాడు. గౌస్ ఖాన్, బషరత్ ఆలీ ఆ కుర్రాడ్ని పరీక్షగా చూసారు. మాసిపోయిన బట్టలు, పెరిగిన కొంచెం గడ్డం. ఏదైనా తిని చాలా రోజులైనట్టుంది.

"నీ పేరు?" ఖాన్ అడిగాడు

"హరిభావ్ భూసరి"

"వయస్సు?"

"పంతొమ్మిది సంవత్సరాలు"

"నీకిక్కడ పనేంటి, ఎందుకొచ్చావ్?"

"రాణీ లక్ష్మీ బాయ్ సైన్యం లో చేరి, సిపాయిల తిరుగుబాటు లో పోరాడదామని వచ్చా."

ఆలీ చిన్నగా నవ్వి "నువ్వు గట్టిగా గాలి వీస్తే పడిపోయేలా ఉన్నావ్. నువ్వు మా సైన్యంలో ఏంచేస్తావ్? వెళ్ళు, కావాలంటే తాత్యా టోపే దగ్గర చేరు. ఏదైనా మొయ్యడానికి పనికొస్తావ్. ఇక్కడ మేమే చాలా ప్రమాదంలో ఉన్నాం"

"నేను మీలాగే రాణీ గారి సైన్యం లో ఉంటాను. ఆంగ్లేయులని గ్వాలియర్ నుండి, ఝాన్సీ నుండి తరిమెయ్యడానికి ఏదైనా సహాయం చేస్తాను. కత్తి యుద్ధం నేర్చుకున్నాను, వలలు పన్నడం వచ్చు. నన్ను చేర్చుకోండి, మీ దారికి అడ్డు రాకుండా సహాయ పడతాను"

ఖాన్, ఆలీ వైపు చూస్తూ "వీడు గూఢచారి కాదని నమ్మకమేంటి? చేరి వెన్నుపోటు పొడిస్తే? ఈ సమయంలో కొత్త వాళ్ళని చేర్చుకోవడం వద్దు. ఎవరినీ నమ్మడానికి వీలు లేదు"

ఆలీ ఆ కుర్రాడి వైపు చూసి, కొద్ది క్షణాల తరువాత అడిగాడు,

"ఏ ఊరు మీది?"

"పర్భణి జిల్లా లో పత్రి అనే ఊరు."

"అంటే అహ్మద్ నగర్ కి దగ్గరన్న మాట" అన్నాడు ఖాన్, ఆలి వైపు ఓరకంట చూస్తూ

"కాదండి, నాందేడ్ కి దగ్గర, ఆంధ్ర దేశ సరిహద్దు మాకు పెద్ద దూరం కాదు"

ఖాన్, ఆలీ ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు

"ఇంతకు ముందు ఏం పని చేసావు? యుద్ధ విద్యల లో శిక్షణేమైనా తీసుకున్నావా?"

కొంచెం తటపటాయించాడు కుర్రాడు. గౌస్ ఖాన్ మళ్ళీ అడిగాడు ఏంచేసేవాడివని. అతను నసుగుతూ చెప్పాడు,

"కొంతమంది ఫకీరుల తో దేశాటన చేశాను...వాళ్ళ దగ్గరే కత్తి సాము నేర్చుకున్నా."

ఆలీ, ఖాన్ ఇద్దరూ పెద్దగా నవ్వారు.

"ఫకీరులతో తిరిగావా..హ హ హ....యుద్ధంలో పోరాడమంటే మాయలు, మంత్రాలు చదవడం, దేవుడిని ప్రార్ధించడం కాదు. సరే..కత్తి యుద్ధం వచ్చన్నావ్ కదా, ఏదీ నాకు చూపించు" అని ఒక కత్తి ఇచ్చాడు ఖాన్.

భూసరి కత్తి పట్టుకొని నిల్చున్నాడు. ఖాన్ కత్తి తీసుకొని కుర్రాడి ముందుకు వచ్చి "కానివ్వు" అన్నాడు.

భూసరి కత్తిని మెరుపు వేగంతో ఖాన్ మీదికి తిప్పాడు. అది ఊహించని ఖాన్ తడపడి, వెంటనే తేరుకొని తన కత్తి అడ్డం పెట్టాడు. కొద్దిగా ఆలశ్యం అయ్యుంటే కోసుకుపోయేది. బషరత్ ఆలీ చూస్తూ వుండి, కదలక కూర్చున్నాడు.

"పరవాలేదు, కత్తిలో వేగం వుంది. మరి నైపుణ్యం వుందేమో చూద్దాం" అన్నాడు ఖాన్.

భూసరి వెనక్కి తగ్గి నిల్చున్నాడు. ఖాన్ ముందుకు వచ్చి తన కత్తి తో దాడి చెయ్యబోతే, భూసరి తప్పించుకొని ఖాన్ కత్తిని కొట్టబోయాడు. అది గమనించే, ఖాన్ మళ్ళీ దాడి చేసాడు. ప్రతి దాడి కి భూసరి దగ్గర సమాధానం వుంది. ఖాన్ ఎంత ప్రయత్నించినా ఆ కుర్రాడిని ముట్టుకోలేకపోయాడు. ఖాన్ కి, ఆలీ కి అర్ధం అయ్యిందేంటంటే భూసరి కత్తి తో దాడి చెయ్యలేదు. అలాగని ఎలా దాడి చేసినా అడ్డుకోగలడు. అంటే భూసరి గెలవడానికి ప్రయత్నించట్లేదు. ప్రత్యర్ధి తో ఎప్పుడూ సమానం అవుతూ వస్తూ ఉన్నాడు. ఇదొక వ్యూహం అన్న మాట. అంటే ప్రత్యర్ధి తో ఎప్పుడూ సమానం అవుతూ వచ్చి, చివరికి విసిగించి, అలిసిపోయేలా చేసి అప్పుడు దాడి చేసి గెలవడం.

సమయం గడుస్తున్నకొద్దీ అదే నిజమయ్యేలా వుంది. ఖాన్ కి అసహనం పెరిగి పోతూ వుంది. ఎంతకీ ఎవరు విజేతో తెలియట్లే. చివరికి ఒక్క క్షణం సహనం కోల్పోయి పొరపాటు చేసాడు. అంతే, అదే అదనుగా భూసరి తన కత్తి ని ఖాన్ మెడ మీద పెట్టాడు. ఇదంతా చూస్తున్న బషరత్ ఆలీ పెద్దగా నవ్వుతూ చప్పట్లు కొట్టి నిల్చుని,

"శెహభాష్, నీ వ్యూహం చాలా కొద్ది మందికే తెలుసు. ఆ ఫకీరులెవరో ప్రార్ధన తో పాటు నీకు ఉపయోగపడేది కూడా నేర్పించారు"

భూసరి కొంచెం ఆయాస పడుతూ "దీనితో పాటు, తత్వ శాస్త్రం లాంటివి కూడా నేర్పించారు"

ఖాన్ ముందు కు వచ్చి "ఆ శాస్త్రాన్ని యుద్ధం లో వినిపించి, ప్రత్యర్ధులని విసిగించి ఓడిస్తావా, నీ కత్తి యుద్ధం లాగా?" అన్నాడు

ఆలీ మరో సారి బిగ్గరగా నవ్వుతూ

"విసుక్కోకు మిత్రమా, ఈ కుర్రాడు మనకి ఉపయోగ పడతాడు. చూడు...పేరేంటన్నావ్? ఆ, భూసరి, నీకు నైపుణ్యం వుంటే సరిపోదు. అన్నికంటే నీ మీద నమ్మకం కలగాలి. అది వుంటే నువ్వు ఇక్కడ వుంటావ్. లేదంటే, నిన్ను నేనే స్వయంగా మట్టుబెడతా? అర్ధమయ్యిందా?"

తలూపాడు భూసరి.

"రాణీ లక్ష్మీ బాయి వీరనారి, దేశానికి ఎంతో ముఖ్యమైన యోద్ధురాలు. ఆవిడ సమ్రక్షణ మా భాధ్యత. ఆవిడని కాపాడటం కోసం దేనికైనా సిద్ధం మేము. నిన్ను ఇప్పుడప్పుడే ఆవిడకి రక్షణగా వుంచము. ముందు నువ్వు మాతో పాటు ఆంగ్లేయులతో పోరాడు. ఈ సిపాయిల తిరుగుబాటు ఉద్యమం  ఇంకా పెరుగుతుంది. అప్పుడు నీ అవసరం వుండొచ్చు. కాలం గడిచే కొద్దీ నువ్వేంచేస్తావో చూస్తాము" అన్నాడు ఖాన్.

"దేశాన్ని కాపాడ్డానికి నేను సిద్ధం. రాణీ గారి గురుంచి చాలా మంది కథలుగా చెప్పుకుంటున్నారు నేనుండిన ఊళ్ళో. ఆవిడే నాకు ప్రేరణ. మీరు ఏం చెయ్యమన్నా దానికి నేను ముందుంటాను"

ఆలీ, ఖాన్ ఇద్దరూ చిన్న గా నవ్వారు.

"రేపటి నుండి సైన్యం లో చేరు"

★★★★★★★

భీకరమైన యుద్ధం జరుగుతోంది గ్వాలియర్ దగ్గర ఉన్న ఫూల్ బాగ్ లో. లక్ష్మీ బాయి ఆధ్వర్యం లోని సేనలు కెప్టెన్ హెనియేజ్ దళాల తో హోరాహోరీ పోరాడుతున్నారు. రాణీ గారు చెలరేగిపోయి చేస్తున్న పోరాటాన్ని చూడటానికి రెండు కళ్ళు చాలవు. తన రెండు చేతులలో రెండు ఖడ్గాలు పట్టుకొని శత్రు వినాశనం చేస్తున్న తీరు మనం చిత్రపటాల్లో చూపే వీరత్వం అస్సలు సరిపోదు.  ఆ సమయంలో రాణి గారిని చూసిన వారికి ఉద్వేగపూరితమైన ఉత్తేజం కలగక మానదు. ఇంకొక చోట బషరత్ ఆలీ తన శక్తి మేర రాణీ గారిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాడు. కాని హెనియేజ్ దళాల జోరు ఎక్కువైపోయింది. ఎవరో ఇద్దరు తుపాకులు పట్టుకొని రాణీ గారి వైపు వెళ్ళడం చూశాడు. రాణీ గారు ప్రమాదం లో ఉన్నారని గ్రహించి, ఆలీ గట్టిగా అరిచాడు,

"భూసరి.. రాణీ గారిని కాపాడు...త్వరగా"

భూసరి తిరిగి ఒక్క అడుగు వేసాడో లేదో, తుపాకి పట్టుకున్న ఒకతను రాణీ గారి వైపు గురి పెట్టి కాల్చాడు.....

ఏదైతే జరగకూడదని అనుకున్నారో, అదే జరిగింది...భూసరి నిశ్చేష్టుడై చూస్తూ వుండిపోయాడు. ఎంత సేపు గడిచిందో తెలియదు. ఆలీ ఏదో అరుస్తున్నా వినే స్థితిలో లేడు. కళ్ళ ముందు జరిగింది నమ్మ బుద్ధి కావటం లేదు. అలా నుంచుని చుట్టూ చూస్తుంటే అతనికి కనిపించేదంతా ఘోర

కలి. రక్తమోడుతున్న శరీరాలు, అవయవాలు పోయిన మానవ కళేబరాలు, హాహాకారాలు. ఏమిటిది? ఎంత మంది జీవితాలు నాశనమయ్యాయి? తను ఎంతో ఆరాధించే రాణీ గారు కూడా....కుప్ప కూలి మోకాళ్ళ మీద కూర్చున్నాడు. కత్తి చేతిలో నుండి పడిపోయింది. ఇంకా ఎంత కాలం ఈ నరకం? ఎంత మందికి ఈ నరకం? వీరికీ, వీళ్ళ కుటుంబాలకి తనేం చెయ్యగలడు? ఓదార్పు తప్ప? అదేం సరిపోతుంది?...తల కిందకు దించుకుని కూర్చున్నాడు. ఇంతలో ఎవరో దుస్తులు పట్టుకొని పక్కకి తీసుకెళ్ళి పోయారు.

★★★★★★★

నెల రోజులయ్యింది యుద్ధాన్ని వీడి. ఎక్కడెక్కడో తిరిగాడు భూసరి. చివరికి రాణీ గారి సైన్యం లో చేరక ముందు తనున్న ఊరొచ్చి, ఆ ఊరి చివర్లో చెట్టు కింద కూర్చుని ఆలోచనలో మునిగిపోయాడు. ఎక్కడ చూసినా, ఏ ఊరెళ్ళినా జనాల బాధలే. వాటికి కారణం కూడా ఒకరి మీద ఒకరికి ప్రేమ లేకపోవడం, అత్యాశ. ఎంత సేపయ్యిందో తెలియలేదు. ఆకలేసింది. తినడానికి ఏమీ లేదు. ఆ ఊర్లో భిక్షాటనకి బయల్దేరాడు. ఎవరో దయ తలిచి కొంచెం భోజనం పెట్టారు. తన దగ్గరున్న పొడుగు తెల్ల కండువా కప్పుకొని ఆ చెట్టు కిందే పడుకున్నాడు.

ఇదే దినచర్య. నిద్ర లేచి, దగ్గర్లో వున్న చెరువు దగ్గరికి వెళ్ళి, కాలకృత్యాలు అయ్యిన తరువాత, చెట్టు దగ్గర కూర్చొని సుదీర్ఘమైన ఆలోచనలో ఉండడం, ఆకలేసినప్పుడు భిక్షాటన చెయ్యడం, మళ్ళీ ఆలోచనలు....ఇలా నెలయ్యేసరికి ఆ ఊళ్ళో ఉన్నవాళ్ళు మెల్లగా గమనించడం మొదలెట్టారు. ఎవరితను, ఫకీరు లాగున్నాడు? ఎవ్వరితోను మాట్లాడటం లేదు. భిక్షాటనకు మాత్రమే ఊళ్ళో కనిపిస్తున్నాడు. పిల్లలు ఎవరో పిచ్చోడని గేలి చేసారు. పెద్ద వాళ్ళు కొందరు అనుమానపడ్డారు. కాని అతని లో ఏదో తెలియని ఆకర్షణ. ప్రశాంతమైన మోము.

ఒక రోజు మధ్యాన్నం భిక్షాటన అయ్యిన తరువాత, కూర్చోవడానికి దగ్గరిలో ఉన్న గుడి కి వెళ్ళాడు. అక్కడ కూర్చుని, వున్నది తిని నీళ్ళ కోసం చూస్తే గుడి పూజారి కనిపించాడు. అతన్ని నీళ్ళడిగితే, అతను నీళ్ళిచ్చాడు. తాగి ధన్యవాదాలు, చెప్పాడు. అప్పుడు పూజారి దగ్గరగా వచ్చి అన్నాడు,

"లోపలికి రండి సాయి. ఈ షిరిడి లో ఎండ కొంచెం ఎక్కువ. కాసేపు విశ్రాంతి తీసుకుందురుగాని"

## పరుగు — విద్యార్థి

"అలాగే ఏడుస్తూ క్రింద పడి వుండు. మోకాళ్లు పగిలిపోయాయి, కాళ్లు కోసుకుపోతున్నాయి అంటూ ఏడుస్తూ పడి వుండు. ఛ ఛా, మగాడిలా తయారయ్యింది? అదే మగాడెవరన్నా అయితే నొప్పులంటూ ఇలా రోడ్డు మీద ఏడుస్తూ దొల్లుతూ పొర్లుతూ పడి ఉండడు".

———————

**మూడు సంవత్సరాల క్రితం –**

ప్రతి రాత్రి మాదిరిగానే ఇంట్లో అందరమూ కలసి భోంచేస్తున్నాం.

"నాకు ఆఫ్రికా వచ్చింది" అన్నాడు మా ఎనిమిదేళ్ల అబ్బాయి.

"ఓ, నాకు ఆస్ట్రేలియా" వచ్చింది అన్నాను నేను.

మా ఆరేళ్ల అమ్మాయి బిక్క మొహం పెట్టి, "మిగిలింది నార్త్ అమెరికా, సౌత్ అమెరికా మాత్రమే, నాకు వద్దంటే వద్దు" అన్నది.

"ఇదిగో మీ అమ్మ ఏషియా చేస్తోంది, తీసుకో" అన్నా నేను.

"అసలు, ఏషియా, యూరప్ అనటం ఎందుకు, మొత్తం ఒకటే కదా" అంటూ పాయింటు లేవ దీసాడు మా అబ్బాయి.

మా మల్లిక చపాతీలు చేసినప్పుడల్లా వాటికి రక రకాల పేర్లు పెట్టి జోక్ చేస్తూ వుంటాము నేనూ పిల్లలూ కలసి. తను కూడా హాయిగా నవ్వుతుంది. ఎదురు జోక్ వేస్తుంది. కానీ ఈవేళ నవ్వటం లేదు. ఏదో ఆలోచనలో ఉంది. తను తినటం లేదు.

పిల్లలని మాట్లాడకుండా తినమని చెప్పి, తనని విషయం అడిగాను. నెమ్మదిగా చెప్పింది, తన స్నేహితురాలి అక్కయ్య బ్రెస్ట్ కాన్సరుతో చనిపోయిందని. ఆవిడ సిగ్గుతో రోగం బాగా ముదిరేదాకా ఎవరితోనూ చెప్పుకోలేకపోయింది, వైద్యం కోసం వెళ్లకపోయింది. జరిగిన ఆలస్యంతో ఒరిగిపోయింది. ఆవిడకి కాలేజీకీ రాబోతున్న పిల్లలు. తన చిన్నప్పుడు తనను కూడా సొంత చెల్లెలి లాగా చూసుకునేదన్న విషయం ఇదివరకే చాలా సార్లు చెప్పింది. సముదాయించటానికి ప్రయత్నించాను. తన మనస్సులో కూడుకున్న విచారం, వ్యథ ఒక్కసారిగా భళ్లున కట్టలు తెంచుకున్నాయి. కొన్ని సందర్భాలలో ఏమి మాట్లాడాలో, ఏమి చెయ్యాలో తెలవదు, కొన్ని సంఘటనలు మనలని అచేతనం చేస్తాయి.

కొంత నిదానించిన తరువాత, తన స్నేహితురాలి అక్క కోసం ఏమీ చెయ్యలేకపోయాను అని వాపోయింది. పోనీ ఇప్పుడన్నా ఏమన్నా చెయ్యగలనా అంటూ బాధపడింది. వాళ్ల పిల్లలకు సహాయం చేద్దాము అని నేను అంటే, వాళ్ల కుటుంబం చాలా మంచిది, పిల్లల బాధ్యత అందుకునే వాళ్లు చాలా మంది ఉన్నారు అన్నది. అలా అయితే, బ్రెస్ట్ కాన్సర్ పరిశోధనకి అందరూ డబ్బులు ఇస్తారు, మనము కూడా ఇద్దాము అన్నాడు మా అబ్బాయి. తనకి ఎందుకో నచ్చలేదు, డబ్బులు విదిలించి మనం ఏదో చేశాము అనుకోవాటం చేతులు దులుపుకున్నట్టు ఉంటుంది అని అన్నది. కొంత మంది బ్రెస్ట్ కాన్సర్ బాధితులకు మద్దతుగా 5K, 10K, ఇంకా మరాథన్ కూడా చేస్తారు, నేను కూడా 10K చేస్తాను, నువ్వు కూడా వీలయితే కొంచెం దూరం నడువు అని చెప్పా.

తను వెంటనే, “ఏం నన్ను నడవమంటున్నారు, మీరేమో 10K అంటున్నారు, నా స్నేహితురాలి అక్క నాకు కూడా అక్కయ్యే, ఆ మాత్రం నేనూ పరుగెత్తగలను” అని అన్నది.

"నువ్వా, బొద్దుగా ముద్దుగా బంతిమల్లె లాగా ఉన్నావు, ఎత్తు పల్లాల రోడ్డు మీద నువు వెళ్తుంటే దొల్లుకుంటూ వెళ్లినట్టు వుంటుందేమో" అన్నాను. ఛివాలున తల ఎత్తి, ముకుళించి, శూలాల లాంటి చూపులతో, నన్ను చూసింది. అసందర్భపు హాస్యం అపహాస్యమై వికటించిందని నాకు అర్థమయ్యింది. ఏదో చెప్పబోయాను. తను లేచి చెప్పులు వేసుకుని రుస రుసా బయటకు వెళ్లింది. ఒక నిమిషం చూసాం, లోపలికి రాలేదు.

పిల్లలని భోజనం పూర్తి చేయించి, పిల్లలతో కలసి టేబిల్ సర్దాను. పిల్లలని పొడుకోమంటే పొడుకోలేదు. అందరమూ కలసి టీవీ చూస్తూ తన కోసం ఎదురు చూస్తున్నాం. తను వెళ్లి గంట దాటింది, రాత్రి తొమ్మిదిన్నరయ్యింది. సరే, కోపంగా ఎటు నడుచుకుంటూ వెళ్లిందో నేను చూసి వస్తానంటే, పిల్లలు కూడా వస్తామన్నారు. అందరం కలసి బయట పడి ఐదు నిమిషాలు నడిచేటప్పటికి తను తిరిగి వస్తూ ఎదురయ్యింది. పిల్లలు ఒక్కసారిగా పోటీలు పడుతూ వాళ్ల అమ్మ దగ్గరికి పరిగెత్తి, తన చుట్టూ రెండు రౌండులు గిర్రున తిరిగి, అమ్మ నెమ్మదిగా, కొండ పైకి ఎక్కలేని స్టీం ఇంజనులా రొప్పుకుంటూ రోజుకుంటూ బుస కొట్టుకుంటూ వచ్చేస్తున్నదని, నాకు కనిపించిన విషయాన్నే గట్టిగా చెప్పారు. తను విన్నది. ఇంటిలో ఎవరూ, ఏ రోజూ కోపంగా నిద్రపోకూడదు అన్న మా ఇంటి నియమం తప్పింది. ఆ రాత్రి మొదలుకుని వారం రోజులు మా ఇద్దరి మధ్య మాటలు లేవు.

తరువాత ఆదివారం వేకువన నేను జాగింగ్‌కి వెళుతూ, తను నాతో పాటు వస్తే ఇద్దరమూ కలసి కాసేపు నడవచ్చు అని చెప్పా. తన మనసు కాస్త చల్లపడినట్టుంది, తనుకూడా వచ్చింది. కొంచెం దూరం నడిచిన తరువాత తనని బెంచి మీద కూర్చోమని చెప్పి నేను జాగింగ్ చేస్తుంటే తను కూడా నా వెనుక నడవటం మొదలుపెట్టింది. ఇంటికి వచ్చిన తరువాత, "రేపటి నుండి మీ కాఫీ మీరే పెట్టుకోండి, నేను ఇక నుంచి ఉదయం వాకింగ్‌కు వెళ్లి వస్తా"నన్నది.

రెండు సంవత్సరాల క్రితం –

ఆదివారం ఉదయం పిల్లలు ఇంకా నిద్రలేవని ప్రశాంతతలో, కిటికీ ప్రక్కన కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాను. ఒక పాతిక పేజీలు చదివేటప్పటికి మా మల్లిక కబుర్లు మొదలుపెడుతుంది. నేను ఊ కొడుతూ ఉంటాను. ఓ అరగంట తరువాత నావి వట్టి "ఊ"లే, ఏమీ వినటం లేదని నిర్ధారణ చేసుకుని, విసుక్కున్న తరువాత, పిల్లలని లేపటం మొదలు పెడుతుంది. నేను జాగింగ్‌కి వెళ్తాను.

అటువంటి క్రమం మారింది. “వచ్చే ఆదివారం బ్రెస్ట్ కాన్సర్ కోసం నిర్వహిస్తున్న రన్నింగ్ రేస్‌లో 10Kలో పరిగెత్తుతున్నాను, ఈవేళ ప్రాక్టీస్ కోసం వెళ్తున్నాను” అని ప్రకటించింది. ఊ కొట్టటం మరచిపోయి తల ఎత్తి చూస్తే రన్నింగ్ షూస్, ట్రాక్ పాంట్స్, టీ షర్ట్‌తో సాక్షాత్కరించింది. వస్తున్న నవ్వుని బిగపట్టి, "పోనీ 5K నడవరాదూ" అన్నా. బిగపట్టిన నవ్వుని తను పసిగట్టినట్టుంది, చాలా కోపం వచ్చింది. "ఇక నుంచి ఆదివారం ఉదయం మీ కాఫీ మీరే పెట్టుకుని మీరే చేసుకుని పిల్లలకు కూడా ఏమన్నా చేసిపెట్టండి. నేను 10K చేసేది మాత్రం ఖాయం." అంటూ రుస రుసలాడుతూ వెళ్లి తలుపు భళ్లున వేసి మాయమయ్యింది.

కొత్త ప్రశాంతతలో చదువుతున్న పుస్తకం పూర్తి చెద్దామనుకుంటే, పేజీ కదలలేదు. సరే, నేను కూడా తనకి తోడుగా పరిగెత్తటానికి బయలుదేరా. ఎదురుగా మిట్ట పైకెక్కుతున్న రోడ్ ప్రక్కనున్న ఫుట్ పాత్ మీద నడుము మీద చేతులు పెట్టుకుని కష్టబడుతూ ఎక్కుతూ తను కనిపించింది. దగ్గరకి వెళ్లి, "ఆ నడుము మీద చేతులేమిటి, నిన్ను నువ్వు తోసుకుంటూ ఎక్కుతున్నావా" అని జోకా. తనకి వెటకరించింది. కళ్లు చిట్లించి నా పైకి ఒక ఆగ్నేయాస్త్రాన్ని వేసి, ఫుట్ పాత్ దూకి పరుగెత్తబోయింది. ఆ తొందరలో రోడ్డుకి ఉన్న చిన్న గుంతలో కాలు పడి, ముందుకు తూలి ఫుట్‌పాత్ మీద నుదురు కొట్టుకుని బాగానే దెబ్బ తగిలింది.

హాస్పటల్ ఎమర్జన్సీ రూంలో నర్సు తనని నన్ను మార్చి మార్చి చూసి, "ఆడవాళ్ల మీద ఇలా చెయ్యి చేసుకుంటే, మేం పోలీసులని పిలవాలి" అన్నది. మతి పోయింది. అలాగే పిలువు, కానీ ముందు కట్టు కట్టమన్నా. ఏమనుకుందో ఏమో, మా మల్లిక తనంతటకు తానే నర్సుకు నచ్చ చెప్పింది, ఈ విషయంలో నా తప్పేమీ లేదని. నర్సు కట్టు వేసేంత సేపూ నా వైపు అనుమానంగా చూస్తూనే ఉంది.

వారం రోజులు గడిచాయి. శనివారం రాత్రి, తెల్లవారిన తరువాత మా మల్లిక 10K పరిగెత్తాల్సిందే అని పట్టు పట్టింది. ఈ కట్టుతో ఏం పరిగెత్తుతావు అని నచ్చ చెప్పబోతే, ఏది ఏమైనా వెళ్తానని భీష్మించింది. రెండో రోజు బ్రెస్ట్ కాన్సర్ 10K రేస్‌లో నేను కూడా తనతో పరిగెత్తటం మొదలుపెట్టా. మొదటి మైలు తను ప్రాయాసపడుతూ పరిగెత్తింది. పోనీలే మిగతా దూరం ఇద్దరం కలసి నడుద్దామంటూ నేను ఆగితే, చురుక్కుమనే పక్క చూపు చూసి, వేగం పెంచి పరుగందుకుంది. పది అడుగులు వేసిందో లేదో కాలు బెణికి ప్రక్కకి పడింది. ఆ పడటం ఆపుకోవటం కోసం తన చేతిని అడ్డం పెట్టబోయి, మణి కట్టు విరిగి మోచేయి కొట్టుకుపోయింది.

మళ్లీ ఎమర్జన్సీ రూముకి పరుగు. వారం క్రితం చూసిన నర్సే. గృహ హింస క్రింద అరెస్ట్ చేయించుతాను, పోలీసులకి ఫోన్ చేస్తాను అంటూ నానా రభస చేసింది. మొత్తానికి కట్లు వేసింది. ఇప్పుడు తనకి నుదుటి మీద ఒక పెద్ద బాండెయిడ్, చేతికి కట్లూ, కాలుకి కట్లూ. ఇంటికి తీసుకు వస్తే పిల్లలు కూడా నన్ను అనుమానంగా చూసారు.

సాయంకాలం తనకి టీ నేనే చేసి ఇచ్చి, కాస్త నిదానించిన తరువాత, "ఈ దెబ్బలు కూడా ఒక దెబ్బలేనా, అదే మగాళ్లయితే ఇవేమీ పట్టించు కోకుండా 10K పూర్తి చేసే వాళ్లు. బొండుమల్లె లాగా ఉన్నావు, నీకెందుకు ఈ పరిగెత్తటం, అందరూ నేను నిన్ను ఏదో చేశాను, హింసించానని అనుకోవటం” అని అన్నా.

తను ఒక్క ఉదుటన లేచి నిలబడి, తల ఎగరేసి, ఒదులుగా ఉన్న జుట్టును వెనక్కి లాగి బిగకట్టి, కను గుడ్లు మిటకరించి,”నేను వచ్చే సంవత్సరం 10K చెయ్యటం ఖాయం. నేను రేపటి నుంచి ఉదయమే గంట సేపు పరిగెత్తటం ఖాయం. పిల్లలని లేపి నేను వచ్చేటప్పటకి స్కూలుకి తయారుచెయ్యండి" అంటూ మిరిగుడ్లతో ఉరిమింది.

రెండవ రోజు అన్నంత పనీ చేసింది. ఉదయమే కుంటుకుంటూ పరిగెత్తటానికి వెళ్లింది. హాయిగా జరిగే జీవితం మారింది. పిల్లలని నిద్ర లేపటంలో ఉన్న కష్టం తెలిసి వచ్చింది.

ఒక సంవత్సరం క్రితం –

ఆదివారం సాయంకాలం అందరమూ కలసి పిల్లలకు నచ్చిన సినిమా టివీలో చూడడం అలవాటు. అలా ఆ రోజు చూస్తున్న సినిమాలో ఉన్న ఒక తల్లి ఉన్నట్టుండి తన బిడ్డకు పాలు పట్టబోతూ ఇబ్బంది పడుతున్న దృశ్యం. మా అబ్బాయి "ఓ" అంటూ ముఖం పక్కకి తిప్పుకుని, కళ్లు మూసుకున్నాడు. మా అమ్మాయి, ఏం నువ్వు చిన్నప్పుడు పాలు తాగలేదా? అని అడిగింది. పిల్లల పోట్లాట పెరగబోయింది. నేను సినిమా ఆపాను.

"ముందు ఆ తల్లి ఎందుకు ఇబ్బంది పడుతున్నదో ఆలోచించావా" అని మా అడిగింది మల్లిక. "ఏమో, నాకేమైనా బ్రెస్ట్స్ ఉన్నాయా, నాకేం తెలుస్తుంది?" అన్నాడు మావాడు.

"మరి నాకే ఆ ఇబ్బంది వస్తే ..." అని ఇంకా ఏదో చెప్పబోయింది మల్లిక. పిల్లలు ఒక్కసారిగా కంగారు పడ్డారు. తనకి ఆ సమస్య లేదని వాళ్లని సముదాయించి, తను కొనసాగించింది. "మనుషులన్న తరువాత అందరికీ ఏదో ఒక సారి ఆరోగ్యం దెబ్బ తింటుంది. కొన్ని రకాల కాన్సర్ ఆడవాళ్లకు మాత్రమే వస్తాయి. అవి ముందు తెలుసుకుంటే చాలా వరకు చికిత్స ఉంటుందన్న విషయం తెలియని వాళ్లు చాలా మంది ఉన్నారు. నీకు మీ అమ్మ ఎంత ముఖ్యమో, అందరికీ వాళ్ల అమ్మ, అక్కా చెల్లెళ్లు, కూతుళ్లు అంత ముఖ్యమే కదా" అన్నది. అవున్నట్టు తల ఊపాడు మావాడు.

"ఇప్పటికీ చాలా మంది ఆడవాళ్లు సిగ్గుతో తమకున్న ఆరోగ్య విషయం గురించి అంత తొందరగా చికిత్స కోసం వెళ్లరు. ఎంత ముందుగా బ్రెస్ట్ కాన్సర్ చికిత్స మొదలుపెడితే, అంత ఎక్కువగా కాన్సరుని తీసివేయటానికి అవకాశం ఉంటుంది. మరి నీలాగా మొఖం వికారంగా పెడితే, అదేదో తప్పు అనుకుని డాక్టరు దగ్గరకి వెళ్లకపోతే ఇంకొక అమ్మకి ఎంత కష్టమో కదా" అన్నది మా మల్లిక. మా పదేళ్ల అబ్బాయి "అవును నిజమే, ఇంకెప్పుడూ అలా చెయ్యను", అని అన్నాడు. ఇంకా కొంచెం సేపు ఈ విషయం గురించి పిల్లలకి వివరించింది. తన స్నేహితురాలి అక్క గురించి, వాళ్ల పిల్లల గురించి చెప్పింది. తన స్నేహితురాలి అక్క కోసం తను పరిగెత్తటం మొదలుపెట్టినట్టు గుర్తు చేసింది.

"మరి బ్రెస్ట్ కాన్సర్ కోసం నువ్వు పరిగెడితే ఆవిడ మళ్లీ బ్రతకదు కదా, అలాగే ఇంకొకరికి తగ్గదు కదా, ఉదయమే నువ్వు పరిగెత్తటానికి వెళ్తుంటే, నాన్నగారు అరుస్తూ మమ్మల్ని నిద్ర లేపుతున్నారు, అదే నువ్వయితే నెమ్మదిగా లేపుతావు", అన్నది మా అమ్మాయి.

"మనం పరుగెత్తటం బ్రెస్ట్ కాన్సర్ వచ్చిన వాళ్లకి మనం తోడున్నాము అని చెప్పటానికి. మీకు జ్వరం వస్తే నన్ను మీ పక్కన కూర్చునే ఉండమంటారు కదా, ఇది కూడా అలాగే. ఇంకా ఈ విషయం గురించి ఎవరూ సిగ్గుపడవలసిన అవసరం లేదు, రోగం లక్షణాలు ఎలా ఉంటాయో, ఎవరి దగ్గరకు వెళితే సరి అయిన వైద్యం అందుతుందో అందరికీ తెలియటానికి."

"అలా అయితే మేము కూడా పరిగెత్తుతాము" అన్నారు పిల్లలు.

"మనం పరిగెత్తటం మాత్రమే కాదు, సందర్భాన్ని పట్టి నువ్వు మీ స్నేహితులతో ఆడుకునేటప్పుడు ఈ విషయం ఏదన్నా వస్తే మాట్లాడుకోవటంలో తప్పు లేదు. అందరికీ బ్రెస్ట్ కాన్సర్ గురించి, చికిత్సకు వున్న అవకాశాలను తెలియపరచటానికే ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంటే World Health Organisation అక్టోబర్ నెలను బ్రెస్ట్ కాన్సర్ అవగాహనా మాసంగా ప్రకటించింది. ఆ విషయాలు అందరికీ ప్రచారం చేయటం కోసమే ఈ పరుగు. అలాగే ఇంకా ఏమయినా అడగాలంటే, మమ్మల్ని సిగ్గు పడకుండా అడగండి" అని అన్నది.

"అలాగే వచ్చే ఆదివారం నలుగురమూ బ్రెస్ట్ కాన్సర్ రన్‌లో 5K పరిగెత్తుదాము" అని అన్నా.

"లేదు, నేను 10K పరిగెత్తాల్సిందే" అన్నది మా మల్లిక.

"లేడికి లేచిందే పరుగు. పోయిన సారి నువ్వు ఇలాగే మొదలుపెట్టి, కాళ్లూ చేతులూ విరగ కొట్టుకున్నావు, గుండు మల్లె లాగా ఉన్నావు, పేద్ద మగాడిలాగా, అన్నీ చేస్తానని తయారవుతావు. నువ్వు 10K ఏం చేస్తావు? మళ్లీ ఈ సంవత్సరం కూడానా"? అనటం ఆలశ్యం, మా మల్లిక వేంటనే నడుము మీద రెండు చేతులూ వేసుకుని, ముక్కు మీద నుంచి నన్ను సూటిగా చూస్తూ , "నేను 10K చేసేదే ఖాయం" అన్నది.

ఝుడుసుకుని తప్పుకున్నాను. సరే, తప్పదు, పోయిన సారి లాగా కాకుండా కొంత జాగ్రత్త పడి తనకి స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజులు నేర్పాను. పిల్లలు కూడా చేరి, వాళ్ల కున్న లేత శరీరాలతో రక రకాలుగా వంకర్లు తిరుగుతూ స్ట్రెచింగ్ ఎక్సర్‌సైజులు చేస్తూ వాళ్ల అమ్మనీ, నన్ను ఆట పట్టించారు.

ఆ తరువాత ఆదివారం పిల్లలు 5K, నేనూ మా మల్లిక 10K చేసాం. తను కూడా 10K షుమారుగా నాతో పాటే పరిగెత్తగలిగింది. రేస్ పూర్తి కాగానే తన చెయ్యి పట్టుకుని, మృదువుగా నొక్కి, "చాలా బాగా చేసావు" అని కంగ్రాట్స్ చెప్పి, "ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముద్దాడి నేర్పినన్" అని జోకా. వెంటనే కనుబొమ్మలు పైకెత్తి, మెడ సాగదీసి, తల అటూ ఇటూ నెమ్మదిగా ఆడిస్తూ, బుస కొడుతూ, కళ్లతో కాటేయ్యబోయింది మా నాగమల్లి. "వచ్చే సంవత్సరం నేను మరాథన్ చెసేదే ఖాయం, మీ సహాయం నాకేం అవసరం లేదు, నేను వేరే ట్రయినింగ్‌కి వెళ్తాను. ఇక నుంచి పిల్లల హోంవర్క్ బాధ్యత కూడా పూర్తిగా మీదే" అన్నది.

ఇంటికొచ్చిన తరువాత పిల్లలు కాళ్ల నొప్పులతోనూ, మా మల్లిక మోకాళ్ల నొప్పులతోనూ నాలుగు రోజులు పడక. ఇంటి పనులూ, వాళ్లకి సపర్యలూ చెయ్యటం నాకు తప్పలేదు. వాళ్లకి నొప్పులు లేకపోయినా తల్లీ పిల్లలు కూడబలుక్కుని నన్ను ఆట పట్టిస్తున్నారేమో అని అనుమానం వచ్చింది.

మూడు నెలల క్రితం –

పిల్లలకి శలవు రోజు, కానీ నా ఉద్యోగానికి శలవు లేదు. ఉదయమే తొందరగా ఆఫీసుకు బయలుదేరాను. కారు డ్రైవ్ చేస్తూ కొంచం దూరం వెళ్తుంటే, ఎదురుగా ఉన్న మిట్ట మీదకు ప్రాకుతున్న రోడ్డు మీద నుంచి సూర్యోదయం కనిపించింది. ఇంతలో తెలిమంచుపై తేలియాడుతూ, పోనీ టైల్‌ని వయ్యారంగా ఊపుతూ, సన్నజాజి లాంటి ఓ యువతి , లీలగా, అవలీలగా, కొండ పైకి ఎక్కుతున్న దారి మీద నుండి సూర్యోదయంలోకి పరిగెత్తుతూ కనిపించింది. దగ్గరగా వెళ్లినప్పుడు ఓర కంటితో చూస్తే, మా మల్లిక.

ఆశ్చర్యం నుంచి తేరుకుని, బ్రేక్ వేసి కిటికీలో నుంచి, "ఓయోయ్, సన్నజాజి పిల్ల, నీది ఏ కాలేజీ, నాతో పోటీకి వస్తావా" అంటూ కన్ను గీటి, సీటీ కొట్టి, కొంటెగా పాట అందుకున్నా. తను తల కొంచెం పక్కకి తిప్పి "ఏమనుకుంటున్నారు" అన్నట్టు కనుబొమ్మలూ, తల ఎగరేసింది. నాలుక బయట పెట్టి నన్ను వెక్కిరించి, ఉన్నట్టుండి లేని కోపాన్ని ప్రదర్శించి, అటు ప్రక్క వున్న రోడ్డు లోకి తిరిగి మాయమయ్యింది. నేను పాట పాడుకుంటూ డ్రైవ్ చెయ్యటం మొదలుపెట్టా.

ఆఫీసు చికాకుల మధ్య ఇరుక్కుంటున్న సమయంలో, ఇండియాలో మా అమ్మ దగ్గర నుండి ఫోన్ వచ్చింది. సామాన్యంగా ఈ సమయంలో అమ్మ ఫోన్ చెయ్యదు. ఖంగారు పడుతూ ఫోన్ తీస్తే, "కోడలు పిల్లకు ఏమయ్యింది, ఆరోగ్యం బాగానే ఉందా, మీరు సరిగ్గా ఉంటున్నారా? ... దొంతర మల్లి లాగా, నిండుగా ఉండేది, మరీ తీగ మల్లి లాగా సాగి ఏలాడుతున్నది" అంటూ దండకం మొదలుపెట్టింది. మొత్తానికి అర్థమయ్యింది. నా సన్నజాజి పొగడ్తకు పొంగిపోయిన మా మల్లిక, పరుగెత్తి వచ్చిన అలసట ముఖంతోనే సెల్ఫీ తీసుకుని, వాళ్ల ఇంటికీ, మా ఇంటికీ ఫోన్‌లో పంపి, తను ఆఫీసుకు వెళ్లే హడావిడిలో ఇంకా ఏం చెప్పకుండా వెళ్లింది. ఆ ఫొటో చూసి అక్కడ మా అమ్మ ఖంగారు. సర్ది చెప్పేటప్పటికి నాకు తల వాచింది.

అలా ఫోన్ పెట్టానో లేదో, మా మావగారి దగ్గర నుంచి ఫోన్. "అల్లుడుగారూ, ఏవన్నా విషయాలు ఉంటే మనం మాట్లాడుకుందాం, ఏ విషయమూ తొందరపడవద్దు, అమ్మాయేదో చాలా కలత పడి మరీ అంతగా చిక్కిపోయింది" అంటూ ఇంకా ఏదో చెప్పబోయారు. అప్పటికే తల వాచిన నేను, అంతకంటే బిరుసుగా, "మీ పని మీరు చూసుకోండి, అనవసరంగా మా విషయాలలో కలగచేసుకోవద్దు" అని అన్నా. "అంటే, పసి పిల్లలు, వాళ్ల

సంగతి కూడా ఆలోచించుకోవాలి కదాండీ ..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయారు. నాకు చిర్రెత్తుకొచ్చి ఏవో నాలుగు మాటలు అంటే "మేము ఫ్లైట్ టికెట్ ఇప్పుడే ఇంటర్నెట్‌లో కొన్నాం, వచ్చే ఆదివారం వచ్చేస్తున్నాం అంటూ ప్రకటించారు.

ఈవేళ –

ఉదయం మూడున్నరకే లేచి తనని మరాథన్ రేస్ దగ్గర దింపటానికి బయలుదేరాను. ఎండ పెరగక ముందే రేస్ పూర్తి చేయాలన్న ఉద్దేశంతో మరాథన్ ఉదయం ఐదు గంటలకే ప్రారంభం. కొన్ని వేల మంది పాల్గొంటునట్లున్నారు. 26 మైళ్ల 385 గజాలు, లేకపోతే 42 కిలోమీటర్ల 195 మీటర్లు. ప్రాక్టీసులో 34 కిలోమీటార్లే పరిగెత్తాను, మొత్తం రేస్ పూర్తి చెయ్యగలనా అని మా మల్లికకి ఆఖరు నిముషంలో అనుమానంతో కూడిన భయం పట్టుకుంది. ఇది వెనుకాడే సమయం కాదని ధైర్యం చెప్పి, తన స్నేహితురాలి అక్క ఫొటోని తన చొక్కాకి గుండె మీద అతికించాను.

నేను కూడా 10 కిలోమీటర్ల రేసులోకి చేరా. ఇద్దరిదీ ముగింపు దారి అదే. మాకు ఆరున్నరకి మొదలయ్యింది. నేను పరిగెత్తటం ఆపి ఆఖరి 5కి.మీ.దగ్గర ఒక ఎయిడ్ స్టేషన్ ప్రక్కన తన కోసం ఎదురు చూస్తూ నుంచున్నాను. కొంత మంది గుంపులు గుంపులుగా సముద్రంలోని కెరటాల లాగ ఎగసిపడుతూ పరిగెత్తుతున్నారు. ఇంకొంతమంది పడి లేచే కెరటాలులాగా నెమ్మదిగా ముందుకు జరుగుతున్నారు. ఎవరికెవరూ పోటీ కాదు. అందరి విజయం గమ్యమే.

ఎయిడ్ స్టేషన్లోని వలంటీర్లు అందరినీ ఉత్సాహపరుస్తూ మంచి నీళ్లు, ఎలెక్ట్రోలయిట్ గ్లాసుల్లో నింపి అందిస్తున్నారు. ఇంకా ఖర్జూరాలు, వలిచిపెట్టిన నారింజ కాయలు, మెత్తగా కాల్చి ఉప్పు బాగా అతికిన బంగాళ దుంపలు, వేరుశనగ గుజ్జుతో చేసిన బిస్కెట్లు, జీడి పప్పు బాదంతో చేసిన బిస్కెట్లూ ఇంకా ఏవేవో అందిస్తున్నారు. మెడికల్ యూనిట్ వాళ్లు మేము ఇంకా పరిగెత్తలేము అని క్రింద పడిన వాళ్ల కాళ్లకు మర్ధన చేస్తూ, అనునయిస్తూ మాట్లాడతూ, వాళ్లకి ఎలెక్ట్రోలైట్ ఇచ్చి, కాళ్ల నొప్పులు తగ్గటానికి జెల్ రాసి, ఉత్సాహపరచి పంపుతున్నారు. రోడ్డుకి అటువైపునా, ఇటు వైపునా చప్పట్లు కొడుతూ జనం. అపార్టుమెంట్ బిల్డింగ్ బాల్కనీలలోనుంచి కేకలు వేస్తూ ఉత్సాహపరుస్తున్న జనం.

ఆ కెరటాలలోనుండి బలంగా సైకిల్ చక్రాలతో చేసిన స్ట్రోలర్‌ని తోసుకుంటూ, "అమ్మ కోసం" అని రాసి ఉన్న గులాబి రంగు బనీను వేసుకున్న ఒక కుర్రాడు వస్తున్నాడు. ఆ స్ట్రోలర్లో జుట్టు ఊడిపోయి, శుష్కించిన మధ్య వయస్కురాలు. ఆ కుర్రావాడు వాళ్ల అమ్మని తోసుకుంటూ పరిగెదుతుంటే, అతని అమ్మకూ, అతనికీ మద్దత్తుగా ఒక ఇరవయి మంది మిత్ర బృందం గులాబి రంగు చొక్కాలు వేసుకుని, వాటిపై పేపర్ కప్స్‌తో చేసిన బ్రా వేసుకుని వెనుక పరిగెదుతున్నారు. అతని స్నేహితురాళ్లు కూడా పరిగెదుతున్నారు.

ఇంకా ఎంత మందో అక్క కోసం, అమ్మ కోసం, చెల్లి కోసం, భార్య కోసం, కూతురు కోసం, స్నేహితురాలి కోసం అంటూ పరిగెదుతున్నవారు.

ఇంతలో ఒక భయంకర దృశ్యం. ఒక యువతి చాతీకి కుక్కకు వేసిన కళ్లెం లాంటి తాడు. దానిని అదిలిస్తూ, నోరు తెరిచి "హా, హా, హా" అంటూ నవ్వుతూ, తల అటూ ఇటూ ఊపుతూ పరిగెదుతున్న మగ మనిషి. వళ్లు జలదరించింది. దగ్గరగా వచ్చిన తరువాత అర్ధమయ్యింది. అతను అంధుడు. మరాథన్ చేసే అతనికి, అతని స్నేహితురాలు ఆ విధంగా దారి చూపుతోంది. సిగ్గు పడ్డాను.

ఇంకొక ఇరవై మంది యువతీ యువకులు అందరూ కలసి కాళ జెర్రి (centipede) లాగా ఒక బారులో పరిగెత్తుతున్నారు. అందరూ కలసి ఒకే చొక్కా వేసుకున్నారు. దాని మీద “Support the fight" అని పెద్ద పెద్ద అక్షరాలతో రాసి ఉంది.

దూరంలో మా మల్లిక కుంటుతూ, నెమ్మదిగా ఒక కాలు ఈడుస్తూ నెమ్మదిగా వస్తూ కనబడింది. దగ్గరకు వచ్చిన తరువాత ఒక మోకాలు పగిలిపోతున్నంత నొప్పిగా వున్నది అంటూ కాలు పట్టుకుని పడబోయింది. ఊతం ఇచ్చిపట్టుకుని, కొంత ఎలెక్ట్రోలయిట్ తాగించిన తరువాత "ఇంకా 5K. మాత్రమే" అంటూ ధైర్యం చెప్పి, చిన్న చిన్న కబుర్లు చెపుతూ తనతో పాటు నెమ్మదిగా పరిగెత్తటం మొదలు పెట్టాను.

తను అడుగు అడుగుకీ నెమ్మదించింది. ఇంకా 4 కి.మీ. ఉందనగా రెండవ కాలుకి కూడా మోకాలు పగిలిపోయేటంత నొప్పిగా ఉందని కూలబడతుంటే పట్టుకున్నా. అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగుతున్నాం. ఉన్నట్టుండి ఒక కాలుకి “క్రాంప్స్", ఇంక ముందుకు వెళ్లలేనని పడిపోయింది. ఆ కాలుకి నేను మర్ధన చేసి, మళ్లీ ధైర్యం చెప్పి ముందుకు నెమ్మదిగా పరిగెట్టటం మొదలు పెట్టాం.

ఇంకా 2 కి.మీ. ఉందనగా రెండు కాళ్లకీ క్రాంప్స్‌తో కాళ్లు కోసుకుపోతున్నాయి, మోకాళ్లు పగిలిపోయినాయి, ఇంక పరిగెత్తటం తన వల్ల కాదంటూ కుప్ప కూలిపోయింది. తన కాళ్లకి మర్ధన చేసీ, చేసీ, ఉత్సాహపరుస్తూ నెమ్మదిగా పైకి లేపబోయాను. మళ్లీ కుప్ప కూలి రోడ్డు మీద పడి కాళ్లు పట్టుకుని దొర్లుతూ ఏడవటం మొదలు పెట్టింది. రెండు మూడు నిమిషాలు అనునయిస్తూ, ఉత్సాహపరుస్తూ “40కి.మీ.లు పరిగెత్తావు, ఇంకా రెండు కి.మీ.లు మాత్రమే” అని గుర్తు చేసాను. ఎంత అనునయించి, ఉత్సాహపరిచినా తను నొప్పితో "నేను ఇంకా లేవలేను" అంటూ తన కాళ్లు పట్టుకుని రోడ్డు మీద పొర్లుతూ ఏడవటం మానలేదు. ఏం చేయాలో తోచలేదు.

విసుగు వచ్చి "అలాగే ఏడుస్తూ క్రింద పడి వుండు. మోకాళ్లు పగిలిపోయాయి, కాళ్లు కోసుకుపోతున్నాయి అంటూ ఏడుస్తూ పడి వుండు. ఛ ఛా, మగాడిలా తయారయ్యింది? అదే మగాడెవరన్నా అయితే నొప్పులంటూ ఇలా రోడ్డు మీద ఏడుస్తూ , దొల్లుతూ, పొర్లుతూ పడి ఉండదు ”, అని అన్నాను.

ఆశ్చర్యం. మా మల్లిక నెమ్మదిగా కూడ తీసుకుని లేచి కూర్చుంది. ముఖమంతా ఎర్రబడి, ఎర్రమల్లిలాగా కనిపించింది. ఎర్రటి కళ్లతో నా మీద ఉల్కాపాతం కురిపించింది. నాలుగు కాళ్ల మీదా లేచి, వేటకి ఉపక్రమించుతూ వెనక్కి వంగి, పొంచి, ముందుకు దూకుతున్న శివంగిలా, ఒక్క ఉదుటున లంఘించి పరుగు మొదలు పెట్టింది. నేను తేరుకుని ముందుకు పరిగెత్తాను. నేను తన పరుగును అందుకోలేకపోయాను.

ఫినిష్ లయిన్ దగ్గరకు నేను ప్రాయాసపడుతూ వెళ్లేటప్పటికి తన చుట్టూ మా మావగారూ, పిల్లలూ ఉన్నారు. పిల్లలు నా దగ్గరకు పరిగెత్తుకు వచ్చి, నా చుట్టూ రెండు సార్లు గిర్రున తిరిగి, వాళ్ల అమ్మ దగ్గరకు వెళ్లి "నాన్నగారు నెమ్మదిగా, బాటరీ అయిపోయిన బొమ్మ కారులాగా, నెమ్మదిగా పాక్కుంటూ వస్తున్నారు" అని నాకు వినబడేలాగా చెపుతున్నారు. తను పిల్లలకి "అలా అనకూడదు, తప్పు" అని చెపుతోంది. మా మావగారు, "మా అమ్మాయి అనిపించుకున్నావు" అంటూ గొప్పలు పోతూ, ఛాతీ పెంచేసుకుంటూ, చొక్కా గుండీలు తెంపేసుకుంటున్నారు.

పిల్లలు "అమ్మా, నువ్వే మా హీరోయిన్" అన్నారు. తను "నేను కాదు, బ్రెస్ట్ కాన్సర్‌తో పోరాడే ప్రతి మహిళ హీరోయిన్. నా స్నేహితురాలి అక్క కూడా పెద్ద హీరోయిన్, అలాగే ఏ కాన్సర్ కానీ, ప్రాణంతకమైన వ్యాధితో కానీ పొరాడే ప్రతి ఒక్కరూ హీరో హీరొయిన్లే, వారికి మనం తోడుండాలి" అన్నది.

ఒక చేత్తో తన స్నేహితురాలి అక్క ఫొటోని వేళ్లతో గుండె మీద హత్తుకుంటూ, ఇంకొక చేత్తో మరాథన్ మెడల్‌ని చూపుతూ తను నుంచుంటే ఫొటో తీసాను. తరువాత పిల్లలతోనూ, వాళ్ల నాన్నగారి తోనూ ఫొటో తీసాను. ఇప్పుడు నా వంతు. తన ప్రక్కన నుంచుని తన చేతిని పట్టుకుంటే, మెత్తగా నా చేతిని నొక్కింది. ఇంతలో ఏం గుర్తుకువచ్చిందో, తెచ్చిపెట్టుకున్న కోపంతో క్రింది పెద్దవి ఒక ప్రక్కన పంటితో కొంచెంగా కొరుక్కుంటూ నా చేతిని మెత్తగా చరిచి గట్టిగా విదిలించి కొట్టింది.

"నేను కూడా ఎప్పటి కైనా మరాథన్ పూర్తి చేస్తే, ఒకవేళ నేను కూడా కాళ్ల నొప్పులూ అంటూ క్రింద పడితే, అప్పుడు నువ్వు చెపుదువు కానీలే, అదే ఆడవాళ్లయితే, ఎంత నొప్పైనా భరిస్తారు, అనుకున్నది సాధిస్తారని” అన్నాను.

హాయిగా నవ్వుతూ "రేపు ఉదయం మనమిద్దరమూ కలసి రికవరీ రన్‌కి వెళ్దాము" అంటూ నా చెయ్యి పట్టుకుని మెత్తగా నొక్కింది మా నిత్యమల్లి.



# నా వోడు

భార్గవ్ చందు

మంచుతెర భలే బావుంది అని మనసులో అనుకున్నా,

గుండెకి వినిపించిందేమో పడి పడి నాక్కూడా కళ్ళివ్వమని అడుగుతూనే నిమిషానికి 72 సార్లు అరుస్తోంది. దాని అరుపుల సడి, మనసు గడి తెరిచి ప్రేమ గాడిన పడేసేసరికి మా తెలుగోడు తలంపుకొచ్చాడు.

ఆ తలంపుల తలుపులు తెరవగానే "ఆగ్రాకెళ్దామా?" అని మా తెలుగోడిని అడిగిన నా మాటలు వినిపించాయి.

వాడు ఒక నవ్వు నవ్వి "ముంతాజ్ ఇక్కడే ఉందిగా, ఇంకెందుకు ఆగ్రా?" అన్నాడు.

అంటే అన్నాడులే గాని, తెలుగోడు తెలుగోడే మంచి మాటకారి...

ఏమి నవ్వుతాడో తెలుసా...!

"అందుకే వాడు నవ్విన ప్రతిసారి కనుల పొలాన్ని కౌలుకిచ్చేస్తా...చిక్కగా చక్కగా ... వయసు చేతికి పిల్లన గ్రోవిని ఇచ్చినట్లు, ఆ చేయి ఆగకుండా ఆ పిల్లనగ్రోవిని వాళ్ళ అమ్మాయిల దేవుడు వాయించినదానికంటే బాగా వాయించినట్లు నవ్వుతాడు.

అసలు ఆ నవ్వు చూస్తే వసంత ఋతువుకి వొళ్లొచ్చి ఆడిద్దేమో అన్నట్లు ఉంటుంది.

అట్లా నవ్వినప్పుడు...

ముచ్చటేసి చేతికందే మావోడి బుగ్గలు పట్టుకుందామంటే, అప్పుడే వస్తున్న గడ్డం అడ్డు, నుదుటిపై ముద్దెడదామని చేరుకుందామంటే వాడి నోటికందే నా గడ్డాన్ని జున్నుముక్కలా అందుకుంటాడని భయం.

భయం ఎందుకంటే రోజురోజుకీ పెరిగిపోతోంది మావోడి ముద్దుల పద్దు.

"ఇంకిట్లా కాదులే అని వాడి నవ్వుని చెవి లోపలికి పంపి, అక్కడి నుంచి తల మీదకి ఎక్కించి, అక్కడే జ్ఞాపకాలను దాచుకునే చోటు ఉంటుంది కదా చిన్న మెదడు అని, ఆ చోట దాచెయ్యాలనుకున్నా, కానీ పడితేగా!!!"

అసలు నాకిది అర్థమయ్యి చావదు,

"వాడు చిన్నగానే నవ్వుతాడు, ఆఖరి కవ్వపు చిలికింతకి పొంగిన వెన్నలా కూసంతే ఉంటుంది ఆ నవ్వు, అయినా ఎంత బరువుంటుందో...తెలుసా?

గుండె ఓపలేనంత...!

ఆ నవ్వుని ఎక్కడా దాచలేను, మా ఊరిబ్యాంకులో, అలాంటివి తాకట్టు పెట్టకపోతే పెట్టకపోయారు కనీసం లాకరు ఐనా ఇమ్మని అడుగుదామంటే, మళ్ళీ ఆ లాకర్ని ఎవరైనా కొల్లగొడతారేమో అని భయం...

ఇంతలో ఏదో వాసన వస్తుంటే ఊపిరి గట్టిగా పీల్చాను,

మా తెలుగోడ్ని ముద్దాడినప్పుడు చిందే విరజాజుల వాసన గురుతొచ్చింది. అది ఒక గుభాళింపు, మా బాబా అత్తరు సెంటు కూడా ఆ వాసన ముందు చేతులు కట్టుకు నుంచోవాల్సిందే అన్నంత బావుంది.

ఇంత బావుందేంటి!?

అనుకుంటుండగా...

నావోడు పెట్టిన మరో ముద్దు వచ్చింది చిన్న గుండె గది వాకిలికి గురుతుల తుఫానుకి మల్లె....,

నావోడు నూనూగు మీసాలు మెలేసే వాడు, చదువులో అంత పొడుగు కాదు గాని మాటల్లో తాటి చెట్టే, ఎప్పుడు ఏ మాట వచ్చినా నన్ను ఆ తాటి చెట్టే ఎక్కిస్తాడు, ఓపలేక నా భాషలో "బస్ బస్" అంటానా.. బస్ ఎక్కుతావా ఐతే దిగు అన్నట్లు తన మాటల్తో పడేస్తాడు.

★★★

"ఏమే నేపాల్, ఏంటా బంగారపు కళ్ళు?" అంటాడు,

"అట్లా నన్ను పిలిచావో నా రంగు మొత్తం నీకిచ్చేస్తా" అంటూ వాడి మాటలకు పడిపోతే,

చూపుల్తో వడిసిపట్టి, "దించను గాక దించను" అంటూ ఇబ్బంది పెట్టేస్తాడు....అనుకుంటూ మళ్ళీ ప్రస్తుతం లోకి పడిపోయాను.

గడియారం చూసుకున్నాను...

వాడు నేర్పిన భాషలో చెప్పాలంటే బొటన వేలు పొడుగు తక్కువని సిగ్గుపడింది.

కానీ ఎండ లేదు, నల్లటి గొడుగులు ఆకాశంలో ఎక్కడికో వెళ్తున్నాయ్ చీకటిని చిందిస్తూ, చీకటి అనుకోగానే గుర్తొచ్చింది...

ఒకరోజు చీకటి పడితే మళ్ళీ ఎట్లెల్లాలో ఇంటికి అనుకుంటూ ఆలోచిస్తుండగా, "ఏమి పిల్లలకు ఏం పేర్లు పెట్టలా అని ఆలోచిస్తున్నావా?" అంటూ జడ లాగాడు నావోడు.

"నువ్వు ఏడు ముడులు వేస్తే కదా" అన్నాను నాకున్న పెళ్ళి జ్ఞానంతో,

"ఏడు కాదు బేటా మూడు" అన్నాడు నెత్తిని చిన్నగా కొడుతూ,

"సరే ఇంక చాలు నేను వెళ్ళాలి, మా ససూర్ (అత్త) కూడా వచ్చింది" అని నావోడి పక్కన కూర్చున్న నేను పైకి లేచాను.

"ఎక్కడికి పోతావ్?" అని వాడి గుండె మళ్ళీ నన్ను లాగింది.

"నేను పోవాలి" అన్నాను ఊపిరితో కబురంపి,

నావోడికి నా బరువుకి ఊపిరాడలేదేమో, కను గుడ్లు పెద్దవిచేస్తూ...

"ఏమంత తొందర?" అని అడిగించాడు...

"చీకటి పడుతుంది, మళ్ళీ చీకట్లో ఎట్లా పోను!?" అన్నాను,

మాలాగా కలిసిపోతున్న పక్కపిన్నుల జంటను నోటితో విడదీస్తూ.

"ఏమీ బాహర్ పోయినావని తెలిస్తే మీ జాఫర్ తిడతాడా?" అన్నాడు నావోడు,

"నువ్వట్లా మా భాషని మీ భాషతో కలపినావో....?" అంటూ కళ్ళకి వాడి మీద ప్రేమ చూపాలని బయటికొస్తున్న హృదయపు రంగునద్ది కోపం నటించాను...మళ్ళీ పైకి లేస్తూ,

"ఐతే పో నేను ఊరికెళ్తున్నా ఇంక మీ భాషని కలవను, నిన్ను కలవను" అన్నాడు.

"ఏయ్ పాగల్ యాడికి బే పోయేది, నన్ను వొదిలినావంటే కొండెక్కి దూకుతా" అన్నాను,

నేను దూకుతాను అన్నమాట బుగ్గమీద ముద్దుతో వదిలేసి,

"ఇప్పుడేగా నీ భాషని, నా భాషని కలపద్దు అన్నావ్ మళ్ళీ నువ్వే పాగల్ అంటావేంటి" అంటూ మళ్ళీ నవ్వాడు.

వాడు నవ్వుతుంటే లేచి పోబుద్ధి అవ్వదు, కానీ చీకటవుతుందని పోక తప్పలేదు...

అనుకుంటుండగా నావోడు ఇంకా రాలేదని గురుతొచ్చింది.

★★★

ఇంటికి పోదామనిపించింది,

చుట్టు పక్కల చూస్తే ఎవరూ కనిపియ్యలా? టైమ్ చూసుకున్నాను ఈసారి బ్రౌటన వేలుని సిగ్గు పడింది ఇక చాలని మిగిలిన నలుగురూ లేపినట్లున్నారు.

"రారా నాయనా ఇంకా ఎంతసేపు ఎదురుచూడాలీ.." అని మావోడ్ని తిట్టుకుంటుండగా, ఎదురుగా ఏదో ఎర్రని కాంతి...దాన్ని చూడగానే అప్పుడెప్పుడో మావోడు సముద్రం కాడ చూపించిన ఎండ పెద్దాయన గుర్తొచ్చాడు.

"భలే ఉంది కదే బంగారపు కళ్ళ దానా" అని అడిగాడు, మెడ మీద ముద్దుపెట్టడానికి జరుగుతూ,

అదేమో వాడు ఎక్కడ ముద్దు పెడతానంటే అక్కడకి పోతామంటాయి నా పెదవులు,

"నీకంటే ఎక్కడ బావున్నాడు..." అని వాడ్ని వాటేసుకోబోయాను,

"ఏయ్ ఇది పగలు" అంటూ ఒక్కడుగు వెనక్కేశాడు.

"పగలు కాదుబే పాగల్, రా ఈడ" అని చెప్పి గట్టిగా వాటేసుకున్నా,

మావోడేమైనా తక్కువ తిన్నాడా ఆ కౌగిలింతకి వడ్డీ కలిపి ఇచ్చాడు.

అసలు తీసుకుని వడ్డీ వాడికే ఇచ్చేశాననుకో అది వేరే విషయం...

సన్నగా ఉన్నా నన్నెత్తుకునేవోడు ముద్దుల, కౌగిళ్ళు తప్ప హద్దులు దాటననేవాడు, "ఒక్కోసారి నాకే దాటదామనిపించి తెలుగోడా తొలిరాత్రికి పోదామా, ఈ హద్దులకి నేనెక్కడ కాపలా కాసేది" అంటానా...,

"పోయి మీ అబ్బాజాన్ ని అడగవే నేపాల్... హద్దులు ఏం కర్మ మూడు ముళ్లేశాక ముప్పతిప్పలు పెట్టడానికి కూడా నాకేం ఇబ్బంది లేదు, ఉద్యోగం కూడా ఉందని చెప్పడం మర్చిపోకు" అన్నాడు.

"మా అబ్బాజాన్ కి మేరా జాన్ ఉద్యోగం కర్తా" అని తెలుసులే అన్నాను గర్వంగా.....

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి... తీరా చూస్తే అబ్బాజాన్,

రానీలే పక్కన ఎవరూలేరుగా అనుకున్నా...,

కానీ అబ్బాజాన్ రాగానే "పాగల్ బన్ గయే క్యా...?" అంటూ చెంప మీద చంపేంత కోపంగా కొట్టాడు.

కళ్ళల్లోకి నీళ్లొచ్చాక మనసుకి స్పృహ వచ్చింది...

మా అబ్బాజాన్ దెబ్బ పడ్డాక తెలిసింది

నేను ఎదురు చూస్తుంది పొలం గట్టున కాదు, ఊరికి ఉత్తరాన ఉన్న శ్మశాన వాటికలో అని , కింద చూస్తే తెలిసింది నేను కూర్చుంది పొలం గట్టునున్న గడ్డి మొత్త మీద కాదు డబ్బున్నోడెవడో కట్టించిన ఇటుక ముక్కల సమాధి మీద అని, అది చూశాక,ఏడుపు తన్నుకొచ్చింది ఎందుకంటే....ఎందుకంటే... అది మంచుతెర కాదు పొగ అని తెలిసి ఎక్కడ్నుంచి వస్తుందా అని చూశాను, పూర్వం నాకు వస్తున్నది గుభాళింపు కాదు శరీరం కాలుతున్న వాసన అని తెలిసింది, ఇంతకీ, ఎక్కడ కాలుతోంది అని చూస్తే ఇందాక నాకు కనిపించింది ఎర్రని కాంతి కాదని మావోడ్ని కాల్చుతున్న మంటలని తెలిసింది... అవన్నీ చూశాక ఎందుకు కొట్టావ్ అని అబ్బాజాన్ ని అడగలేక పోయాను.

కనీసం నావోడ్నైనా అడుగుదామంటే ...

"ఎందుకు పోయినవ్ రా!?" అని వాడ్ని ఎట్లా అడగాల, మోసం చేసి పోతేనో, ఏడు ముళ్ళు కాదు కాదు, మూడు ముళ్ళు వెయ్యనంటేనో నిలదీసేదాన్ని...కానీ,

"వాడు సరిహద్దుల్లో కడతేరి దేశానికి ముద్దు బిడ్డయిపోయాడు కదా" అనుకుంటూ..నేను పైకిలేచాను...పైకి లేవద్దంటూ కన్నీళ్లు కిందకి బాకుల్లా జారాయి.,

"ఈ పిచ్చి తగ్గదే, ఏదైనా వేరే ఊరు పోదాం పదవే" అన్నాడు మా అబ్బాజాన్...

మూడు ముళ్ళు వెయ్యకుండానే బొట్టుతీసుకెళ్ళిన మావోడ్ని చూసి కళ్ళల్లో నీళ్ళు మరిన్నిగా కదిలాయి, నుదుట ముద్దు పెట్టే నా తోడు బొట్టు పెట్టేదానికి లేకుండా పోయాడని గొంతు చించుకుని నా గుండెలరుస్తుంటే.. ఊపిరి ఇక ఆడలేనని మొండికేసింది.

శ్మశానం దాటుతుండగా మళ్ళీ గుర్తొచ్చాడు మావోడు,

"ఏమి నీ గుండెల్లోనైనా ఉండాల్నా? పోవాల్నా" అని అడిగాడు....

"ఇంకెక్కడికి పోయేది!" అని గుండెని గట్టిగా ఆపేశా ఆ క్షణం..ఒక్క క్షణం కాదు... నావోడి కోసం అనుక్షణం... ఎందుకంటే నేను ప్రేమ పక్షం..పైగా వాడు పరాయోడు కాదు మొత్తం నాకే చెందిన నావోడు.

❦❦❦

## త్రీ స్ట్రయిక్స్ — తాడికొండ కె. శివకుమార శర్మ

స్వీట్లు ఇష్టపడేవాళ్లు కాకరకాయనీ, ఆవకాయనీ కూడా ఇష్టపడొచ్చునని తేలిగ్గా ఒప్పుకుంటాం గానీ ఒక మనిషికి మంచివాడు అని ముద్ర పడిన తరువాత ఆ మనిషి ప్రవర్తన ఊహించేదానికి భిన్నంగా వేరే ఏ విషయంలో నయినా ఉంటుందని ఒప్పుకోవడాని కిష్టపడడం అరుదు. కసాయివానికి సున్నితత్వం ఉండడం గూర్చిన ఆలోచన కూడా ఆ కోవలోకే వస్తుంది. మొదటి పరిచయంలోనే ఒక మనిషిని మంచివాడు, కసాయివాడు అనే రెండింటిలో ఒక గూటిలో చేర్చడం అంత తరచుగా జరిగేది కాదేమో గానీ నాకు రాజారాం గారి గూర్చిన ఫస్ట్ ఇంప్రెషన్ కలగడానికి సహకారం మాత్రం ఆయన్ని అప్పటికే అలా చేర్చేసినవాళ్ల మధ్యలో జరిగింది.

మామయ్యా వాళ్లింటి తలుపు తీసి లోపలకు అడుగు పెట్టి కుడి వైపు లివింగ్ రూంలో ఆగిపోయిన సంభాషణ మధ్యలో కనిపించిన మామయ్య మొహాన్ని చూస్తూ, "నేనేనా, చివరగా వచ్చింది?" అన్నాను. అక్కడ కనీసం పదిమంది పురుషులు ఉండుంటారు. వయసులో అందరూ నాకన్నా పెద్దవాళ్లే. అమెరికాలో భారతీయుల ఇళ్లల్లో జరిగే పార్టీల్లో మగాళ్లు లివింగ్ రూములోనూ లేదా బేస్‌మెంటులోనూ, వాళ్ల సతీమణులు ఫామిలీ రూములోనూ విడిగా కూర్చోవడం సాధారణంగా జరిగేదే.

"పిల్లలని పికప్ చేసుకోవడం వల్లటగా? అత్తయ్య చెప్పిందిలే," అన్నాడు మామయ్య. అక్కడున్నవాళ్ల వయసుని బట్టీ పిల్లలని యాక్టివిటీలనించి పికప్ చేసుకోవలసిన అవసరాలనించి వాళ్లు విముక్తులయి కనీసం ఒక దశాబ్దం అయివుంటుం దని అనిపించింది. "ఇతను మా బావమరిది కొడుకండీ. ఈ మధ్యనే మన ప్రాంతాని కొచ్చాడు," అని మామయ్య నన్ను వాళ్లకి పరిచయం చేశాడు.

"ఏమిటి, స్పోర్ట్సా లేక ఫైన్‌ఆర్ట్సా?" అడిగా రొకరు.

అది పిల్లలు ఏ యాక్టివిటీలో ఉన్నారు అన్న ప్రశ్నగా అర్థమై, "బేస్‌బాల్," అని జవాబిచ్చాను.

"లిటిల్‌లీగ్ ఆటల్లో ఆరేడేళ్ల పిల్లలు బాట్ పట్టుకుని బంతిని కొట్టడానికి ట్రై చేస్తుంటే చూడడానికి తమాషాగా ఉంటుంది," అన్నా రొకరు.

"మొదటిసారి బంతిని వేసినప్పుడు వీడికి బాట్‌ని కదపాలన్న ఆలోచనే లేదు. రెండవ బంతికి కదపబోయేసరికి అది కాస్తా హోమ్ ప్లేట్‌ని దాటి వెళ్లి ఒక గంట అయ్యుంటుంది. మూడవసారి కొద్దిగా బాట్‌ని కదిపాడు గానీ ఫలితం మామూలే. అయితే, ఈసారి, త్రీ స్ట్రయిక్స్, యూ ఆర్ అవుట్! అని చెప్పి అక్కణ్ణించీ కదిపారు," అన్నాను.

"ముందతన్ని పేరు చెప్పనిస్తారా, లేదా?" అన్నా రొకరు.

"సీతారాం," జవాబిచ్చాను.

"అయితే, మనకిప్పుడు ఇద్దరు రాంలు. ఆయన కూడా రాజారాంతో ఏకీభవిస్తే అప్పుడు మనకీ, వాళ్లకీ రాంరాం!" అన్నా రొకాయన. నేను ప్రత్యేకంగా వాళ్ల పేర్లని అడక్కపోవడం, వాళ్లు చెప్పకపోవడంవల్ల ఏ మొహాన్నుంచీ ఏ అభిప్రాయం వెలువడుతోందో వినడానికి మాత్రమే తల నటు తిప్పుతూన్నాను.

"ముందు ఆ అభిప్రాయ మేదో తెలియాలిగా?" అన్నాను.

"నిర్భయలాంటి కేసులు అప్పుడప్పుడూ జరుగుతూండాలట!" అన్నా రొకరు.

"మీరాయన నోట్లో మాటలు దూరుస్తున్నారు. పాపం, రాజారాం అలా అనలేదు," అన్నా రింకొకరు.

"లాస్ట్ ఇన్ ట్రాన్స్‌లేషన్!" అన్నా రొకరు సన్నగా నవ్వుతూ. ఆయనే రాజారాం అయ్యుంటా రనిపించింది.

"సరే, మీ మాటల్లోనే చెప్పండి!" అన్నా రిందాక టాయన.

"ఇప్పు డేమిటీ, పిల్లీ, పిల్లీ తగవులాటకి కోతి తీర్పు చెప్పాలా?" అన్నాడు మామయ్య.

"మమ్మల్ని పిల్లు లనడం మాట అలా వుంచి, మిమ్మల్ని కోతి అంటుంటే చూస్తూంటా రేమిటండీ?" అన్నా రొకాయన నన్ను చూస్తూ.

"ఆయన నాకు మామయ్య కాబట్టి నన్ను కోతి అనే అవకాశమే లేదు. అంటే ఆయనకు కూడా తగులుతుంది కదా," అన్నాను నవ్వుతూ.

"చూశారా, మనల్ని మాత్రం పిల్లులం కాదనలేదు. ఎంతయినా మామ, అల్లుళ్లు కదా!" అన్నా రాయన చుట్టుపక్కలవాళ్ల వైపు చూస్తూ.

"మీ మాటల్లోనే చెప్పండి రాజారాం," అన్నారు మామయ్య.

"నిర్భయలాంటి కేసులు సమాజానికి శ్రేయస్కరం," అన్నారు రాజారాం.

"అంటే, అలాంటి కేసులు జరగాలనా?" అన్నా రొకాయన కోపంగా. "స్త్రీలు రాత్రిపూట ఒంటరిగా బయట తిరగ గలిగే స్వేచ్ఛ భారతం కావాలన్న గాంధీగారి కలని పక్కన పెడదాం. ఆడపిల్లలు చీకటిపడ్డ తరువాత బయట తిరగడం స్వాతంత్ర్యం వచ్చిన డెభ్భై ఏళ్ల తరువాత కూడా కుదరదా? పైగా పక్కన ఒక మగా దున్నా గానీ?"

"అలాంటి కేసులు జరగకూడ దన్నదే నా అభిమతం కూడా. అయితే, వంద, వేల ఏళ్ల కాల గమనంలో సమాజాభివృద్ధి సరళరేఖ మీద పోతున్నట్లు కనిపిస్తుంది గానీ పది, ఇరవై ఏళ్ల కాలపరిమితుల్లో ఒక అడుగు ముందుకీ, రెండడుగులు వెనక్కీ వెడుతున్నట్లు కనిపించడంలో ఆశ్చర్య మేమీ లేదు. ఈ అభివృద్ధి స్టాక్ మార్కెట్ పోకడకి దగ్గరగా ఉంటుంది," అన్నారు రాజారాం నింపాదిగా.

"నిర్భయలాంటి కేసులు ముందు జరగలేదే మరి?" అన్నా రింకొకరు.

"అందుకనే అలాంటి ఘోరం మళ్లీ సమాజంలో జరగకూడదని అందరూ ఒప్పుకునేలా చెయ్యడాని కది ఉపయోగపడుతుంది. జరిగిన ఘోరాల మూలంగా కొత్త చట్టాలని తేవలసివచ్చి నప్పుడు వాటిని విక్టిమ్స్ పేరు మీద తేవడాన్ని అమెరికాలో చూస్తూనే ఉన్నాం గదా," అన్నారు రాజారాం.

"మరి కూతురు దళితుణ్ణి పెళ్లి చేసుకున్నదని అల్లుణ్ణి చంపించిన ఆ పిల్ల తండ్రి సంగ తేమిటి?" అన్నాను నేను.

"ఒకానొక కాలంలో సమాజం అలాంటి వివాహాలని ఒప్పుకోకపోవడమే కాక సమాజ నియమాలని ఉల్లంఘించినవాళ్లని తల్లిదండ్రులతో సహా వెలివేసి వాళ్ల జీవితాలని దుర్భరం చేసింది. ఈనాడు చంపించినవాడిని చట్టమూ, సమాజంలో అత్యధికశాతమూ సమర్థించడంలేదు గదా? ఇది ప్రోగ్రెస్ కిందకు రాదా?" అన్నారు రాజారాం.

"ఇంకా ఇలాంటివి కులాల పేరిట ఇండియాలో జరుగుతున్నయ్యని న్యూయార్క్ టైమ్స్ లో చదవడం, దానిగూర్చి కొలీగ్స్ అడగడం ఎంత అవమానకరంగా ఉన్నదో!" అన్నా రొకరు.

"బిలియనుకు పైగా ప్రజలున్న దేశంలో ఇలాంటివి అక్కడక్కడా, అప్పుడప్పుడూ మాత్రమే జరగడంవల్ల న్యూయార్క్ టైమ్స్ వాటిని వార్తలుగా పరిగణిస్తోంది. వందల సంఖ్యలో ప్రతిరోజూ జరిగేటట్లయితే ఆ పత్రిక అలాంటి వార్తల జోలికే పోదు. ఉదాహరణకి, ఇప్పటికీ ఆఫ్రికా ఖండంలో చాలా

దేశాల్లో స్త్రీల జననాంగాల మీద చిన్నతనంలోనే జరుపుతున్న దాడుల లాగా. ఈ దేశంలో ఏ న్యూస్ పేపర్ దాని మీద వార్తలని రాస్తోంది? ఆవిధంగా చూసినా మీరు ఉదాహరించిన కేసు అభివృద్ధికి కొలమానమే," అన్నారు రాజారాం.

"ఇదండీ ఈయన రేషనల్ థింకింగ్‌కి కొలమానం!" అన్నా రొకరు.

"దొంగతనం నేరం అని ప్రపంచంలో అన్ని చోట్లా తెలుసు. అయినా అది జరుగుతూనే ఉన్నది. అలాగే, హత్యలు కూడాను. ఆవేశంలో చేసేవి కొన్నయితే, ఎంతో ప్లాన్ వేసి, తప్పించుకుంటా మన్న ధైర్యంతో చేస్తున్నవి కొన్ని. ఈ పిల్ల తండ్రి తప్పించుకోవడం పరపతితో జరుగుతుందన్న ధైర్యంతో ఉండివుంటే తప్ప ఇది క్షణికావేశంలో చేయించిందని అనుకోవచ్చు," రాజారాం జవాబిచ్చారు.

"ఇది సమాజానికెలా ఉపయోగపడుతున్నట్లు?" అన్నాన్నేను.

"రెండు రకాలుగా. మొదటిది – వెనుకబడ్డ ఆలోచనలతో జీవనాలని సాగిస్తున్నవాళ్లు సమాజంలో ఇంకా ఉన్నారని గుర్తుచెయ్యడంవల్ల. రెండవది – పరిణామాలు సినిమాల్లో చూపిస్తున్నవాటి కన్నా ఘోరంగా ఉంటయ్యని తెలియజెయ్యడంవల్ల," అన్నారు రాజారాం. నాకు అది మొండివాడి వాదన లాగా కాక సహేతుకంగానే అనిపించింది.

"ఇప్పుడు రాజారాం గారంటోం దేమిటంటే, కారు తయారై రోడ్డుమీద తిరగడం మొదలుపెట్టిన తరువాత అది మనిషికి డాష్ ఇచ్చి గాయాలని చేస్తే, మరీ ముందు కెళ్లి ఒకళ్ల జీవితాన్ని కట్ షార్ట్ చేస్తే, దాన్ని నేరంగా పరిగణించడం కారు తయారీతోనే మొదలుపెట్టలేదు గదా! మొదట్లో, కారు ఎవరిని గుద్దేసినా అది డ్రైవర్ తప్పు అని కాక కారు తప్పు అని చెప్పి కొంతమంది తప్పించుకునే ఉంటారు. అప్పటిదాకా ఉన్నవి జట్కాబళ్లే మరి. 'జట్కాబండీ చక్రాల కింద పడి పిల్లాడి మృతి!' అన్న న్యూస్ పేపర్ హెడ్‌లైన్‌ని ఊహించగలమా?" అన్నా రొకాయన.

ఒకరిద్దరు సన్నగా నవ్వారు. రాజారాం ఆ అన్న ఆయనవైపొకసారి చూసి, నిశ్శబ్దంగా ఫోన్‌ని బయటకు తీసి స్క్రోల్ చెయ్యడం మొదలుపెట్టారు. వాతావరణంలో తేమ అంతా ఘనీభవించి మంచుగడ్డలా మారి మా మధ్యలో చేరిన ట్లనిపించింది.

"ఇప్పటికీ అన్నిచోట్లా జరుగుతోంది. కొంచెం ఎక్కువ తక్కువలు అంతే," అన్నారు మామయ్య. ఆయన మొహంలో సంభాషణ ఈవైపు దారితియ్యడం నచ్చలేదన్న అభిప్రాయం కనిపించింది. "డిన్నర్ రెడీ అయిందేమో కనుక్కొస్తాను," అని లేచి ఆడవాళ్లు కూర్చున్నవైపు కెళ్లారు.

"నాలుగయిదేళ్ల క్రితం దాకా రాజారాం గారు ఆ వాదనకి జవా బివ్వకుండా ఉండేవారు కాదు," అన్నా రొకరు. రాజారాం గారు నవ్వి ఊరుకున్నారు.

"కోతికి కొబ్బరికాయ దొరికితే పరిణామం అందరికీ తెలుసు గానీ, ట్రంపు నెన్నుకున్న తరువాత కదా అలాంటివాళ్ల చేతికి అధికారా న్నిస్తే ఏమవుతుందో తెలిసింది, ఇదీ అలాగే!" అన్నా రొకరు. ఇక్కడ రాజారాంగారికి కోతితో పోలిక పెడుతున్నారా, లేక ట్రంపుతోనా, ఏదయినా గానీ ఈ లంకె ఏమిటీ అన్న ప్రశ్నలు నాకు కలిగాయి గానీ, వాటికి సమాధానాలు మామయ్య దగ్గర వెదుక్కోవడం మంచిదనిపించి ఊరుకున్నాను.

"మోదీకి అధికారాన్నిస్తే అంటూ మొదలుపెడతారు ఇంకొకరు. ఎందుకొచ్చింది గానీ, కాంట్రావెర్సీ ల్లేని తెలుగు సినిమాల గూర్చి మాట్లాడండి," అన్నా రొకరు.

"ఈనాటి చర్చనీయాంశం, కాంట్రావెర్సీకి కూడా నోచుకోని తెలుగు సినిమా. దీన్ని గూర్చి ఆహూతు లేమంటారో తెలుసుకుందాం," అన్నా రొకరు.

"తెలుగు సినిమా, కాంట్రావెర్సీ ఇద్దరూ కవలపిల్లలు. ఇద్దరూ క్షేమంగానే ఉన్నారు!" అన్నా రింకొకరు.

రాజారాం గారు ఫోన్ కేసి చూస్తూ ఉండిపోయారు. అక్కడి వాతావరణంలో మార్పు అంత కనిపెట్టలేనిది కాదు. "యు కెన్ కట్ ది టెన్షన్ విత్ ఎ నైఫ్!" అన్న వర్ణన గుర్తొచ్చింది.

"అత్తయ్యకి హలో చెప్పివస్తాను," అని అక్కణ్ణించీ లేచి మామయ్యదారిలోకి మళ్లాను.

@ @ @

మామయ్యతో ఆనాటి సంభాషణ ప్రసక్తి తీసుకురావడం వెంటనే కుదరలేదు. 'కారు కింద పడో లేక జట్కాబండీ చక్రాల కింద పడో పిల్లాడి మృతి–' అన్న వాక్యం అక్కడ చేర్చిన టెన్షన్ కి ఎలా కారణమో అర్థం కానిది నా కొక్కడికే అయివుండాలని అనిపించింది. ఆ సమావేశంలో కొత్తవాణ్ణి నేనొక్కణ్ణే మరి.

"గుర్రబ్బండీ కింద పడి కూడా పిల్లలు గాయాలకి గురయి ఉండవచ్చు. కాదనలే రెవరూను. అలాగే, కారువల్ల బయట ఉన్న కొంతమందికి దానివల్ల గాయాలు అయిన తరువాతే దాని గూర్చిన చట్టాలు చేసి ఉండవచ్చు. కానీ, అతనెప్పుడూ మిగిలిన వాళ్లతో ఏకీభవించినట్లు కనిపించకపోవడంవల్ల రాజారాంకి కోడిగుడ్డుకు ఈకలు పీకుతాడనే అపవాదు వున్నది. కోర్టులో లాయర్ల లెవెల్లో వేరే కోణాన్నించీ చూస్తాడని అతనితో చర్చల్లో పాల్గొన్నవాళ్లకి అనిపిస్తుంది. 'మీరు కరక్టు!' అని అతను ఎవరినీ అనకపోవడం అందుకు కారణ మని నే ననుకుంటాను. ఆనాటి రెండు టాపిక్కులూ నాకు గుర్తున్నాయి. నిర్భయ ఒకటీ, అగ్రకులపు తండ్రి కూతురు మొగుణ్ణి దళితుడని చంపించడం ఒకటీ కదా? అతని వాదనలో నిజం లేదని నే ననలేను. కానీ, అతని కున్న అపవాదు గూర్చి చెప్పాగా! అందుకని వెంటనే పర్సనల్‌గా పోవడానికి వెనుకాడనివాళ్లు ఆ అవకాశాన్ని చేబుచ్చుకుంటారు," అన్నాడు మామయ్య.

"రాజకీయాల్లో లాగా. అయితే, ఇక్కడ రాజకీయ మే మున్నది?"

"వాదం గెలవడం కోసం దేన్నయినా సరే రాజకీయాన్ని చెయ్యడానికి కొందరు వెనుకాడరు!"

"అవతలివాళ్లు మాట్లాడాలనే అనుకోకపోతే అది వాదం గెలవడ మెలా అవుతుంది?"

"ఇక్క డెవరూ ప్రైజు లివ్వడంలేదు గదా! దెబ్బతీయడమే వాదం గెలవడం. మెచ్యూరిటీ అనేది అందరికీ వయసుతోబాటే ఎదగదు. దానికి ఆ సుదర్శనమే నిదర్శనం!"

"ఆయనకి రాజారాం గారిమీద అంత కక్ష ఎందుకు?"

"వితండవాదం చేస్తాడని! పుణ్యం, పాపం, స్వర్గం, నరకం – వేటికీ నిదర్శనా ల్లేవంటాడు రాజారాం. ఆ అన్నింటినీ నమ్ముతాడు సుదర్శనం. అతనికి నచ్చని అభిప్రాయాలు రాజారాంలో బోల్డున్నాయి. పోనీలే అని వదిలెయ్యడు. కావాలని ఎరవేసి బరిలోకి లాక్కొస్తాడు. రాజారాం అయినా ఊరుకుంటాడా అంటే యుద్ధం చెయ్యమని ఒకడు సవాల్ చేసినప్పుడు వెనుకాడడం పిరికిదనం అని ఎవరో ప్రబోధించినట్లుగా నోరు తెరుస్తాడు. ఇద్దరికీ సరిపోయింది."

"సుదర్శనం గారు పర్సనల్‌గా వెళ్లా రన్నావు. నాకు తెలియనిది ఏదో జరిగుండాలి!" అన్నాన్నేను.

"రాజారాం కారు కింద ఒక పిల్లాడు పడడం," అన్నాడు మామయ్య.

షాకు తిన్నాను. "అమెరికాలో ఒక పిల్లాడు కారు కింద పడిన తరువాత కూడా ఆయన జైలు కెళ్ల లేదా?" ఆశ్చర్యపోయి అడిగాను.

"అసలు కేసు లేదు. పిల్లాడు పోయాడు కూడా అని చెబితే ఇంకా ఆశ్చర్యపోతావు!"

"వాట్?" అరిచినంత పని చేశాను. "అదెలా సాధ్యం?"

"దాదాపు పదిహేనేళ్ల క్రితం సంగతి. ఆరంగుళాలకి పైగా మంచు కురవడంవల్ల స్కూళ్లకి ఆరోజు సెలవిచ్చారు. పిల్లలకి స్లెడ్డింగ్ అంచెప్పి మంచుమీద జారుడుబండ జారడం ఇష్టమని నీకు తెలుసుగా! కొంతమంది పెద్దల సూపర్‌విజన్‌లో స్లెడ్డింగ్ చేస్తే కొందరు పెద్దల కళ్లు గప్పి చేస్తారు. కొందరు పెద్దలు అసలు పట్టించుకోరు; పిల్లలు తమ జోలికి రాకుండా వుంటే చాలనుకుంటారు. ఆ రోజున పొద్దున పది గంటల ప్రాంతంలో రాజారాం డ్రైవ్ చేస్తున్నాడు. రెండు లేన్లు మాత్రం ఉన్న రోడ్డు మీద. ట్రాఫిక్ నత్తనడక నడుస్తోంది. రోడ్డుకు కుడిపక్కన ఎత్తుమీద మొదలై రోడ్డుమీదకు ఎండ్ అవుతూ జారుడుబండ స్లోపు. దానిమీద నుంచీ వచ్చాట్ట ఆ పిల్లాడు. కారుకు ఏదో గుద్దుకున్నట్లు, రాజారాంకి తెలిసిందట గానీ అతని కేమీ అర్థం కాలేదట. అతను ముందు దేనినీ గుద్దలేదు. ముందు చక్రాలు దేనిమీద నించీ వెళ్లలేదని అతనికి గుర్తుంది. కారులోంచి కిందకు దిగి, వెనక్కు నడిచి చూస్తే వెనక కారు గుద్దిన సూచనలేమీ లేవు. కారెక్కడానికి ఎడమవైపుకు నడవబోతుంటే వెనక కారు హాంక్ చేసి, దాని డ్రైవర్ కారు దిగి, 'ఓ మై గాడ్!' అని గుండెలు బాదుకుంటూ కుడివైపుకు వేలితో చూపిస్తే గానీ రాజారాం అటువైపు వెళ్లలేదట. అతని కారుకు గుద్దుకున్నది ఒక పిల్లాడు. కారు ముందు చక్రాలకీ, వెనుక చక్రాలకీ మధ్యభాగంలో. సగం కారు కింద ఉన్నాడు. అంటే ఆ పిల్లాడి మీదకు కారు ఎక్కలేదు. అతనే కారు కింద పడ్డాడు. పైగా వెనక డ్రైవర్ ప్రత్యక్ష సాక్షి.

రాజారాం ఎంతో పెద్ద ప్రమాదం నుంచీ తప్పించుకున్నందుకు – ప్రమాదం జైలు కెళ్లడం కదా! – తెలుగువాళ్లల్లో ఈ వార్త నలుదిశలా తొందరగానే చేరిపోయింది. అందరూ ఆయన అదృష్టాన్ని కొనియాడినవాళ్లే. ఒక్క సుదర్శనమే ఆయనతో వాదం పెట్టుకున్నది."

"ఎందుకని?"

"అందరూ రాజారాం అదృష్టాన్ని కొనియాడితే సుదర్శనం మాత్రం, 'ఇప్పటికైనా మించిపోయింది లేదు, ఆ గుడిలో అర్చన, ఈ దేవుడికి అభిషేకం, గ్రహాలకి శాంతులూ చేయించ'మన్నాడు. అంతటితో ఊరుకోకుండా కలిసినప్పుడల్లా 'చేయించావా?' అని అడిగేవాడు. రాజారాం శాంతంగానే, 'చేయించలేదు, చేయించను!' అని జవాబిచ్చేవాడు. వెంటనే సంస్కృతి అంతా ఎలా తగలబడిపోతోందో అంటూ సుదర్శనం ఉపన్యాసా లిచ్చేవాడు."

"ఆయన సైంటిస్టు కదూ?"

"ఎంత సైంటిస్టయినా ఆచారవ్యవహారాల దగ్గర కొచ్చేసరికి ఆయన ఒక శతాబ్దంవాడు. దేవుడి ఉనికి గూర్చిన ప్రశ్నకు సమాధానం కోసం రాజారాం వెదుకుతుంటే, 'ప్రత్యేక మయిన ఆచారాలే ఆ దేవుడికి దగ్గరగా చేర్చే మార్గాలు!' అని సుదర్శనం వాదిస్తాడు. ఎవరినీ తన మార్గానికి తిప్పడానికి రాజారాం ప్రయత్నించడు. తన మార్గానికి తిప్పడానికి ట్రై చెయ్యకుండా సుదర్శనం ఉండలేదు. ఇద్దరూ ఉన్నచోట ఫైర్‌వర్క్స్!"

"నాకు మాత్రం సీమటపాకాయ మోత కూడా వినబడలేదు!" అన్నాన్నేను.

"కొన్నేళ్ల క్రితం దాకా లక్ష్మీ అవుట్ల స్థాయిని దాటేవి," అన్నాడు మామయ్య.

"నాలుగయిదేళ్ల క్రితం దాకానా? ఎవరో అన్నట్లు గుర్తు! ఇంక ఆయనకి విసుగొచ్చి వుండాలి!"

ఒక్క క్షణం ఆగి మామయ్య అన్నాడు. "అది కాదు కారణం. నువ్వెవరికీ చెప్పకుండా ఉంటా నంటేనే. నీ భార్యక్కూడా!"

లోపల పొంగిపొర్లుతున్న ఉత్సుకతని పైకి కనబడనివ్వకుండా యాథాలాపంగా అన్నాను. "ఛ. నే నెందుకు చెబుతాను?"

"ఇంకో పిల్లాడొచ్చి రాజారాం కారుని గుద్దాడు!"

"డ్రైవ్ చేస్తూనా?"

"మూడేళ్ల పిల్లా డెలా డ్రైవ్ చేస్తాడు?"

ఆశ్చర్యపోతూ అడిగాను. "మళ్లీ మంచమీద జారుతూ వచ్చా?"

"కాదు. పరుగెత్తుకుంటూ వచ్చి."

రాజారాం జైల్లో మగ్గకుండా స్వేచ్ఛగా బయట తిరుగుతున్నాడని గుర్తొచ్చి, "ముందునించీ అయ్యుండదు!" అన్నాను.

"మధ్యాహ్నం నాలుగ్గంట లప్పుట్ట! ఒక బ్లాకు ముందు కెడితే కుడిపక్కన ఎలిమెంటరీ స్కూలు. ముందర ఎడమపక్కన ఆగి, ఎర్రవి గానీ, పసుపుపచ్చవి గానీ లైట్లు వెలగకుండా ఉన్న స్కూల్ బస్సు. కుడిపక్కన ఇద్దరాడవాళ్లు కర్బ్ మీద నిలబడి మాట్లాడుకుంటున్నారు. వాళ్ల కాళ్ల దగ్గరొక పిల్లాడు. స్కూలు సందులో కాబట్టి అది 25 మైళ్ల స్పీడ్ జోన్. అందుకే చాలా జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నా నన్నాడు రాజారాం. ఆ పిల్లాణ్ణి ఏం ఆకర్షించిందో గానీ, వాడు హఠాత్తుగా పరుగెత్తి రోడ్డు దాటబోయాడు. రాజారాం చూశాట్ట గానీ, 25 మైళ్ల వేగంతో వెళ్లే కారు బ్రేక్ వేస్తే ఆగడానికి రెండు కారు పొడవుల దూరం కావలసివస్తుంది. అదే జరిగింది. అప్పటికే ఆ పిల్లాడు బంపర్ దగ్గరకి వచ్చేశాడు. తల్లి, "శామ్!" అని అరిచిందట గానీ ఆ కేక అతణ్ణి ఆపలేకపోయింది. మళ్లీ ఇన్వెస్టిగేషన్. 'ఇదే మదృష్టమో గానీ తప్పు నాది కాదని చెప్పడానికి ఆ తల్లే కాక ఆమెతో మాట్లాడుతున్నావిడా, ఆ బస్ డ్రైవరూ కూడా ఉన్నా' రన్నాడు రాజారాం. 'ఉన్నది తల్లి ఒక్కటే అయ్యుంటే తప్పుని నీమీదకు తప్పకుండా తోసివుండే' దన్నాను. 'మనుషుల మీద తనకు నమ్మక మున్నది, అలా జరగ' దన్నాడు. 'ఈ పిల్లలు నాతోనే ఎందుకు పెట్టుకుంటా రండీ?' అని బాధపడ్డాడు. కొన్నాళ్లు సైకియాట్రిక్ కౌన్సిలింగ్ తీసుకున్నాడు. ఈ వివరాలన్నీ తెలిసినవాళ్లు చాలా తక్కువమంది. అనవసర ప్రచార మెందుకని నేను కూడా ఎవరికీ చెప్పద్దన్నాను. ఏ మయినా గానీ అప్పటి నించీ మాట్లాడ్డం తగ్గించేశాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు కనిపిస్తాడు. సుందరం రెచ్చగొట్టినప్పుడు కొద్దిగా మాట్లాడతాడు గానీ మరీ ముందటిలాగా వాదాల్లోకి దిగడం మానేశాడు. ఆయన ఒంటరిగా కనిపించినప్పుడు 'మీరు మారా రండీ!' అంటాను. 'కాదు, నేను ఒకప్పటి రేషనలిస్టునే!' అని జవాబిస్తాడు. నాలుగయిదేళ్ల నించీ మూడీగా ఉన్నట్లు కనిపిస్తున్నాడు. అది ఆ సంఘటన జరిగిన దగ్గరనుంచే నని నా నమ్మకం. ఈ సంఘటన గూర్చి తెలిస్తే సుదర్శనం పెట్రేగి పోతాడు.

ఇప్పటికే ఎన్నో అభిషేకాలూ, శాంతులూ చేసివుండాలంటాడు. రోహిణి – అదే, రాజారాం భార్య – వాటిని చేయిస్తూండడం వల్లే ఈ మాత్రమయినా నడుస్తోందంటాడు.”

“ఈయన నాస్తికత్వం ఆవిడ కంటలేే దన్నమాట!”

“పూజలు చేసేవాళ్లని ఆస్తికులని అనచ్చేమో గానీ, చెయ్యనివాళ్లని నాస్తికులని ఎలా అంటావ్?”

“నే ననబోయింది వేరే. సరేలే. ఈయన లేకుండా ఆవిడ అభిషేకా లెలా చేయిస్తుంది?”

“గుళ్లల్లో చేయించడానికి పక్కన ఆయన ఉండక్కర్లేదుగా! ఇక్కడా, ఇండియా వెళ్లినప్పుడల్లా అక్కడి పుణ్యతీర్థాల్లోనూ.”

“ఈయన వెళ్లరా?”

“కొన్నాళ్లు వెళ్లాట్ట. ఒకసారి కుటుంబసమేతంగా తిరుపతి వెళ్లినప్పుడు అడుక్కుంటూ ఒకపిల్ల వెంటపడ్డదట. దాదాపు కూతురు వయసున్న పిల్ల. ‘పట్టులంగాతో సమీర, మట్టికొట్టుకుపోయి, చిరిగిన బట్టలతో ఆ పిల్ల. దేవుడున్నాడని ఎలా అనగలను?’ అన్నాడు నాతో. తరువాత గుళ్లవైపు ఎప్పుడూ వెళ్లలే దనుకుంటా.”

“ఇదే నాకు అర్థం కానిది. సెన్సిటివ్ అని చెప్పి ఏమీ చెయ్యకుండా సమస్యకి దూరంగా కూర్చున్నంత మాత్రాన దానికి పరిష్కారం దొరకదు గదా!”

“ఆయన ఏమీ చెయ్యట్లేదని ఎందుకనుకుంటావ్? ఆయన చేసే దానధర్మాల గూర్చి మనకేం తెలియదు గదా!”

“ఏమో! ఆయన ఇక్కడున్నారు, పావర్టీ అక్కడున్నది,” అన్నాన్నేను.

“పావర్టీ ఇక్కడా ఉన్నది!”

“అదీ నిజమే!” అన్నాను గానీ, ఆయనతో వాదనని పొడిగించ దలచుకోలేదు. దానివల్ల ప్రయోజనమేమీ లేదు గనక.

@ @ @

మామయ్యవాళ్లింట్లో ఆ దీపావళి గెట్ టుగెదర్ అంత ఆనందకరంగా లేదనే చెప్పవచ్చు. రాజారాంగారు సాధారణంగా ఆహ్వానితులుగా వచ్చే ఏ ఇంట్లోనూ ఇంతకన్నా ఆనందకరమైన వాతావరణం నెలకొంటుందని అనుకోను. ఒక్క రెడ్డిగారికే ఈ విషయం తెలియనట్లుంది. లేకపోతే, “రాజారాంగారు ఊళ్లో లేరా? ఆయన మాకన్నా ఎప్పుడూ ముందే వస్తారు గదా!” అని ఆయన అనేవారు కాదు.

“మీరు ఊళ్లో లేరీ మధ్య. అందుకని మీకు తెలియదు,” అన్నారు సుదర్శనంగారు. ఆర్నెల్ల వ్యవధి తరువాత వీళ్లందరినీ అదే మళ్లీ కలవడం. అందరి పేర్లూ అంతగా గుర్తు లేకపోయినప్పటికీ కొందరివి గుర్తున్నాయి. ముఖ్యంగా సుదర్శనం గారిది.

“ఒక నెలరోజులపాటు ఇండియాలో తీర్థయాత్రలూ అవీ చేసొచ్చాం. మానస సరోవర్, అవన్నీని,” అన్నారు రెడ్డిగారు.

“రాజారాంగారు కొద్దిగా అన్‌స్టేబుల్‌గా ఉన్నార్ట,” అన్నా రొకరు.

“అన్‌స్టేబులంటే?”

“మనమధ్యలో ఉన్నా గానీ లేనట్లుండడం,” ఒకరు జవాబిచ్చారు.

రెడ్డిగారికి అర్థం కాక మామయ్య మొహంలోకి చూస్తే ఆయన తన తలవైపు చేతివేలితో చూపించి “మతిస్థిమితం లేదు!” అన్నారు.

“ఛ. ఎప్పటినించీ?”

“దాదాపు నెలనించీ.”

“ఎలా?”

“డాక్టర్లకి తెలిస్తేగా చెప్పడానికి?”

“పుణ్యం, పాపం లేదని వాదించొచ్చు. అనుభవంలోకి వచ్చిన తరువాత గుర్తించడానికి బ్రెయినే లేదు,” అన్నారు సుదర్శనంగారు.

“కీప్ ది డీటెయిల్స్ కమింగ్!” అన్నారు రెడ్డిగారు.

"ఒక మూణ్ణెల్ల క్రితం అనుకుంటాను. రాజారాంగారు ఒక యాక్సిడెంట్లో ఇన్వాల్వ్ అయ్యారు. ఆయన రెడ్ లైట్ మీద రైట్ టర్న్ తీసుకుంటుంటే కారుని ఎవరో గుద్దిన శబ్ద మయిందట. దిగి చూస్తే, కారుకు ముందు కుడిపక్కన ఒక సైకిలూ, పన్నెండేళ్ల కుర్రాడూ కింద పడి ఉన్నారట. ఆంబులెన్స్ వచ్చి, అందులోని పెరామెడిక్స్ ఆ పిల్లాడికి తగిలిన దెబ్బలకి అక్కడే కట్లు కట్టారట. చిన్నదెబ్బలేనుట. పోలీసులు రాజారాంని, 'నీ కారు పెడస్ట్రియన్ వాక్ వేకి మధ్యలో ఉన్నది. రోడ్డుని కాలినడకన క్రాస్ చెయ్యకూడదని ఎర్ర సిగ్నల్ ఉన్నట్లు చూశావా?' అనడిగార్ట. 'గుర్తు లే' దని ఈయన జవాబిచ్చారట. 'ఆ పిల్లాడు తనకి దాటవచ్చు నన్న తెల్ల సిగ్నల్ ఉన్నప్పుడే సైకిల్ మీద దాటడానికి ప్రయత్నించా నని చెబుతున్నాడు. నువ్వేమో తెలియదని చెబుతున్నావు. అందుకని నీదే తప్పుగా నిర్ధారిస్తున్నాం, ఫలానా రోజున కోర్టుకి వచ్చి హాజరు కా!' అని ఈయనకి చెప్పి, ఆ పిల్లాడికి కూడా ఆ రోజున కోర్టులో హాజరు కమ్మనమని చెప్పారట. ఆ పిల్లాడు మెక్సికన్ అన్నాడు రాజారాం. ఆ ఇంటర్‌సెక్షన్‌కి దగ్గరలోని ఒక అపార్ట్‌మెంటులో ఉంటాట్ట. లాయర్ని పెట్టుకొమ్మన్నాను. 'మహా అయితే రెక్లెస్ డ్రైవింగ్ అని తీర్పిస్తారు, ఈ మాత్రానికే జైల్లో వెయ్యర్లే!' అన్నాడు తప్పితే లాయర్ని పెట్టుకోలేదు, ..." అంటూ మామయ్య చెప్పుకుపోయాడు.

ఈ వివరాల నన్నింటినీ మామయ్య క్రితంవారం నాకు చెప్పాడు. రాజారాం గారు కోర్టు కెళ్లడం, ఈయనకి టిక్కెట్టిచ్చిన పోలీసాఫీసరూ రాజారాంగారూ వెళ్లి జడ్జీగారి ముందు నిలబడడం, ఆ మెక్సికన్ కుర్రాడు రాకపోవడం –

ఆ పిల్లాడు రాకపోవడంవల్ల జడ్జీగారు కేసుని డిస్మిస్ చేస్తే పోలీసాఫీసర్ తెల్లబోయాట్ట. రాజారాంగారి కూడా వెళ్లిన ఆయన భార్యవల్ల తెలిసింది ఆ సంగతి. ఆవిడ తన పూజలూ, వ్రతాలూ ఫలించినందుకు దేవుళ్లకి ధన్యవాదాలు తెలుపుకున్నదట.

రాజారాంగారు జడ్జీగారి ముందు కదలకుండా నిలబడడం చూసి "యూ కెన్ గో!" అని మళ్లీ చెబితే కోర్టులో ఉన్నవాళ్లు నవ్వారట కూడా. నిద్రలో నడిచినట్లు రాజారాంగారు తన భార్య ముందునించే ఆమెను పట్టించుకోకుండా నడిచి వెడుతుంటే ఆమె ఆశ్చర్యపోయిందట. కోర్టు బయటకు రాగానే ఆయన పిచ్చిపిచ్చిగా మాట్లాడ్డాలూ, చేతులతో జుట్టు పీక్కోవడాలూ, ఏడవడాలూ చేశారట. ఆవిడకి డ్రైవింగ్ వచ్చు కాబట్టి ఆయన్ని కారులో కూర్చోబెట్టి ఇంటికి చేర్చి, మామయ్యకి ఫోన్ చేస్తే ఈయన పరుగెత్తుకు వెళ్లారు. రాజారాంగారి పిల్లలకి వేరే ఊళ్లల్లో ఉద్యోగాలు మరి. పైగా వాళ్లకి ఆప్తుడు మామయ్యే.

"త్రీ స్ట్రయిక్స్!" అన్నాడు మామయ్య నాతో.

మామయ్య దేని గూర్చి అంటున్నాడో అర్థమయింది గనుక, "మొదటి రెండింటిలోనూ ఆయన తప్పేమీ లేదని నిర్ధారించారు గదా!" అన్నాను.

"అవుననుకో, కానీ ఆయన మెదడులో ఏమున్నదో మనకేం తెలుసు? పదిహేనేళ్ల క్రితం వీళ్ల పిల్లలు చిన్నవాళ్లు కాబట్టి కుటుంబ బాధ్యతల దృష్ట్యా ఆయన ఒక పెద్ద రిలీఫ్ ని ఫీలయి వుంటారు. రెండవది, నాలుగయిదేళ్ల క్రితం, పిల్లలు కాలేజీల్లో ఉన్నప్పుడు. 'ఆ పిల్లాడి తల్లిదండ్రుల పరిస్థితిలో తానుంటే?' అన్న ఆలోచన వచ్చుంటే తన తప్పు లేకపోలేదా అన్న అనుమానం రాజారాం మదిలో చొరబడి ఉండవచ్చు. లేటెస్ట్ దాంట్లో తన తప్పున్నదనే ఆయన నమ్మకం. అది జరిగిన రోజున నాకు ఫోన్ చేసి, 'ఇన్నేళ్ల డ్రైవింగ్ అలవాటు తరువాత రెడ్ లైట్ ఉన్నప్పుడు పక్కకు తిరిగి పెడస్ట్రియన్‌కి సిగ్నల్ ఉన్నదా లేదా అని చూసే అలవాటు పోక మానదు. తనకు సిగ్నల్ ఉన్నది కదా అని ఆ సైకిల్ మీది పిల్లాడు నేను ఆగుతానని అనుకునే ఉంటాడు. ఆగకపోవడం నా తప్పే!' అని అన్నాడు. 'దీసీజ్ ది థర్డ్ స్ట్రయిక్! ఈసారి తప్పించుకోలేను. ఐ విల్ బి అవుట్!' అని జోడించాడు కూడా. అలా నాతో అంటున్నప్పుడు అతని మొహం ఆనందంతో నిండివున్నదని నా నమ్మకం. 'నాకు పోలీసు టిక్కెట్టిచ్చాడోచ్! అని ఆనందంగా చెప్పేవాళ్ల నెవరినైనా చూశారా?' అని ఆయన భార్య మీ అత్తయ్యతో అన్నదట కూడా," అన్నాడు మామయ్య.

ఏమయినా గానీ, ఏ అంశం గూర్చి చర్చించబోయినా ఎదురు చెప్పడానికి రాజారాంగారు లేని లోటు సుదర్శనంగారికి బాగానే కనిపించింది. రాజకీయాల్లోకి తలదూర్చినా, సినిమాల్లో వేలు పెట్టినా ఆ చర్చలు దమ్ముకున్న దీపావళి టపాసుల లాగా తుస్సుమన్నాయి.

రాజారాం గారిని మొదటి పరిచయంలో చేర్చిన గూటినించీ రెండో దానికి మార్చాను గానీ మనసులో మాత్రం ఒక మూలనించీ 'తప్పుచేశావు కదా?' అని ప్రశ్న రావడం ఇప్పుడిప్పుడే ఆగేలా లేదు.

# మార్పు

సోమ సుధేష్ణ

మనసులో రకరకాల ఆలోచనలతో హరి ఆక్స్ రోడ్ లో జాయిన్ అయ్యాడు. రోడ్డు మీద కార్లన్నీ దూసుకు పోతున్నాయి. ఈ టైంలో ఏ దారిలోంచి వెళ్ళినా ఇదే ట్రాఫిక్.

“వెన్ యు ఆర్ ఎ రాకెట్, యూ ఆర్ ఎ రాకెట్ ఆల్ ది వే” పాటతో పాటు కారు వేగం పెంచాడు. అవతల కార్ల బిజి, మెదడులో ఆలోచనల గజిబిజి. కాలేజిలో పరీక్షల టైం. ఈ కుర్రాళ్ళు బుర్ర కొల్ల గొడుతున్నారు. కాలేజి కుర్రాళ్ళ బుర్రలు ఎప్పుడు షార్ప్ గానే ఉంటాయి. అది మంచిదే కాస్త ఛాలెంజింగ్ గా ఉంటుంది. ఒక పది శాతం లేజీ బుర్రలుంటాయి. వాళ్ళకి గ్రాండు పేరెంట్సు ఉంటారో లేదో తెలియదు దేవుడికే తెలుసు. ఈ కుర్రకుంకలు తమ అనుకూలానికి గ్రాండ్ పేరెంట్స్ ని సంవత్సరానికి ఐదు సార్లైనా చంపేస్తారు. ఎన్నిసార్లు చంపేస్తారురా మీ గ్రాండు పేరెంట్సుని! అని నాలుగు సొట్లు పెట్టలనిపించినా చిరాకేసి ఎమోషనల్ బ్లాక్మెయిల్ అనుకుని ఏమి చేయలేక చాల సార్లు ఊరుకుంటాడు.

ఇరవై నిమిషాల దారికి ఒక గంట పట్టింది. కారు ఏక్సిడెంట్ ఏదో అయ్యిందని గూగుల్ కూనలమ్మ ఒకటే వార్నింగ్స్ ఇస్తోంది. ట్రాఫిక్ తో పాటు కార్లో నదుస్తూ కాలేజి చేరాడు హరి.

“హాయ్ హేరీ!” స్టాఫ్ పార్కింగ్ లాట్ లో కారు పార్కు చేసి కార్లోంచి దిగుతున్న హరిని చూస్తూ అన్నాడు కొలీగ్ రాబర్ట్.

“హయ్ బాబ్ ” అన్నాడు హరి కారులోంచి తన బ్రీఫ్ కేసు అందుకుంటూ (పేర్లను ముక్కలు చెయ్యడంలో అమెరికన్లు వాళ్ళకి వాళ్ళే సాటి) రోమ్ లో రోమన్ లాగే ఉండాలిగా హరికి అలవాటయి పోయింది.

“ఈ సారి కరెక్షన్ పేపర్స్ త్వరగా ఇవ్వాలట చీఫ్,” హరి వైపు చూస్తూ అన్నాడు.

“నాకింకా వార్త రాలేదు.” ఇద్దరూ కలిసి బిల్డింగ్ లోకి వెళ్ళారు.

“కంప్యూటర్ లో కరెక్ట్ చేస్తామనుకో అయినా ఫైనల్ గా మనం చూడాల్సిందే కదా!”

“ఒకసారి వాళ్ళు నిర్ణయం తీసుకున్నాక వెంటనే మార్చడం కష్టమే. రాబోయే సెమెస్టర్ కు స్టాఫ్ అందరం చర్చించుకుందాం” అన్నాడు హరి. రాబర్ట్ కి డెడ్ లైన్ ఇష్టం ఉండదని చీఫ్ అఫ్ స్టాఫ్ గా వచ్చిన తర్వాత హరి తెలుసు కున్నాడు.

కాలేజి అయిపోగానే లేబ్ లో పని ముగించుకుని ఇంటికి బయల్దేరాడు హరి. నీల రెండు గార్డెనియ ప్లాంట్స్ తీసుకు రమ్మంది. ఒకటి తనకు మరోటి వాళ్ళమ్మకు రేపు వెళ్ళినప్పుడు తీసికెళ్ళడానికి.

రేపు మల్చ్ డెలివరీ చేస్తారు. వర్షం రాకముందే అదంతా చెట్లకి, పూల పొదలకు స్ప్రెడ్ చేయాలి. కూరగాయల మొక్కలన్నీ రెడీగా ఉన్నాయి. సాయిల్ రెడీ చేసి వాటిని ట్రాన్స్ ప్లాంట్ చేయాలి. ఈ పనులు చేస్తున్నానంటే అమ్మ 'వ్యవసాయం చేయడానికి ఆ దేశం వెళ్ళాలా! మన దేశం లోనే మన తోట చూసు కోవచ్చుగా!' అంటుందేమో, ఆ ఆలోచనకే నవ్వుకున్నాడు హరి.

ఆనాడు...మొదటి సారి నీలను కలిసిన సంఘటన తీరు...అప్పుడప్పుడు హరి మనసులో ఝుమ్మంటు మధుర గానం పలికిస్తుంది.

★★★★★★★★★★★★★★★★

ఒకరోజు హేన్గింగ్ పులతోట్టి కొనడానికి హరి నర్సరీ వెళ్ళాడు. అబ్బో! ఎన్ని పూలచెట్లు! చుట్టూ తిరిగి, అన్నీ చూసి ఆనందించాక ఒక పూల తొట్టి తీసుకున్నాడు. ఆ పక్క లేన్లో ఓ ఇండియన్ యువతి, ఆమె చేతిలో కూడా ఒక పూల తొట్టి ఉంది. ఆమె, తొట్టి ఇద్దరూ కూడా అందంగా వున్నారు. 'షి ఈజ్ వేరి ప్రెట్టి' అనుకుని అమేనే చూస్తూంటే బావుండదని మార్చి పూల తోట్టి కేసి చూసాడు. హరిని చూసింది ఆ యువతి. హరి పలకరింపుగా నవ్వాడు. ఆ యువతి కూడా నవ్వింది.

"ఆ పూలు బావున్నాయి, అలాంటిది నాక్కనబడలేదే!" అంటూ కుడి వైపు చూస్తూ అన్నాడు.

"ఇది డబుల్ పెటల్ బెగోనియా, అటు కాదు ఇటు వేపు ఉన్నాయి. నాకూ ఇంకొకటి తెచ్చుకుంటాను." అంటూ ఆ యువతి ఎడమ వైపు వెళ్ళింది. హరి ఆ యువతి వెనకే వెళ్ళాడు. పూల తోట్టితో పాటు తిరిగి కౌంటర్ దగ్గరకు వచ్చేలోగా ఇద్దరి పరిచయాలు అయ్యాయి. ఫోన్ నంబర్లు ఎక్స్ చేంజ్ చేసుకున్నారు. హరి మనసు పల్టీలు కొట్టింది. పేరు నీల. నవ్వితే ఎంత బావుంటుంది. ఆ తర్వాత..

పూట పూట కు ఫోన్ చేసుకున్నారు. ప్రతి మాట ఫోన్ లో మాట్లాడు కున్నారు. ప్రేమలో పడ్డామని తెలుసుకుని పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించు కున్నారు. ఈ పెళ్ళి వద్దు అన్న తల్లి సుజాతను ఇబ్బంది పెట్టలేదు నీల. ఆరు నెలల్లోనే హాయిగా పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళికి పిలిచినా సుజాత వెళ్ళలేదు. ఆలోచనల తోనే హరి ఇల్లు చేరాడు.

★★★★★★★★★★★★★★★★

మరునాడు వర్క్ నుండి వచ్చే సరికి నీల రెడీ అయి హరి కోసం ఎదురు చూస్తోంది. గబగబా ఫ్రెషప్ అయిన హరి శాండిల్స్ వేసుకుంటూ "అత్తారింటికి దారేది చూపమ్మా" అంటూ రాగం తీస్తూ నీల వైపు చూసాడు. లేత గులాబీ రంగు చుడిదార్ లో నీల అందం ద్విగుణి క్రుతమయ్యింది. ఆ ఆకర్షణకే బోల్తా పడి పోయాడు హరి. నీలను దగ్గరగా తీసుకుని సున్నితంగా బుగ్గపై కిస్ చేసి,

"ఇద్దరం సంతోషంగా వెళ్తున్నాం, సంతోషంగా తిరిగి వచ్చేద్దాం." అన్నాడు.

సరే అన్నట్టు తలూపింది. హరికి తెలుసు నీల మనసులో అలజడిగా ఉందని. పెళ్ళయాక మొదటి సారి వెళుతున్నాం.

కారులో వెనక సీటు కేసి చూసి "గార్డేనియా మంచి సువాసనలు వేద జల్లుతోంది." అంటూ కారు స్టార్టు చేసాడు.

"గార్డేనియా మల్లె లాగే ఉంటుందని ఆ పూలంటే మమ్మీకి చాల ఇష్టం." నవ్వుతూ అంది.

నీల హైస్కూల్లో ఉన్నప్పుడే తండ్రి జగదీశ్ గుండె సమస్యతో ఆఫీసులో పని చేస్తూ చేస్తూ ప్రాణాలు వదిలాడు. కంపెనీ వాళ్ళు ఇచ్చిన డబ్బు కొంత ధైర్యాన్నిచ్చింది. జీవితం అంతా గడపడానికి సరిపోదుగా. ముందు నుండి ఇంటిరీయర్ డేకరేటర్ గా డిపార్ట్ మెంట్ స్టోర్ లో పని చేస్తున్న నీల అమ్మ సుజాత కొన్నాళ్ళు పని చేసి ఆ తర్వాత పెద్ద కంపెనీలో చేరింది. అందంగా ఉన్న కూతురిని ఏ డాక్టరో, ఐటి అబ్బాయో చేసుకుంటాడని కొండంత ఆశతో బ్రతికింది, కాని నీల కాలేజి టీచర్ ను ప్రేమించింది. అది సుజాతకు పెద్ద షాక్ లా తగిలింది.

"మనం శుభవార్త చెప్పడానికి వెళ్తున్నాం." అన్య మనస్కగా ఉన్న నీలను చూస్తూ హరి కూల్ గా చెప్పాడు.

శుభ వార్త చెప్పడం ఇది రెండవ సారి. నీల మనసు రివైండ్ అయ్యింది---

శుభవార్త అనుకునే నీల ఒకరోజు తల్లితో తన మనసును సంతోషంతో పల్టీలు కొట్టించిన హరి గురించి చెప్పింది.

"మామ్, ఐ మెట్ ఏ గై, చాల మంచివాడు. నాకు చాల నచ్చాడు. నీక్కూడా నచ్చుతాడు." అంది.

చివ్వున వెనక్కి తిరిగి "ఏం చేస్తున్నాడు?" అడిగింది సుజాత. పేరు గూడ అడగలేదు.

"జార్జ్ మేసన్ లో టిచ్ చేస్తాడు. పేరు హరి." ఖుషిగా అంది నీల.

"ఐ సీ" అయిష్టంగా అంది.

"ఒకరోజు ఇంటికి రమ్మంటాను."

"ఇప్పుడు కాదులే." అంది.

"ఈ వీకెండ్ కు నన్ను డిన్నర్ కు తీసుకెళ్తా నన్నాడు మమ్మీ" నీల గొంతు లోపిచ్ లో ఉంది.

"అప్పుడే డేట్ వరకు వెళ్లి పోయావా! ఇంకా నయం పెళ్ళి చేసుకున్నామని చెప్పడం లేదు." కాస్త కోపంగా అంది సుజాత.

మరునాడు సుజాత ఇంట్లోకి వస్తూనే తలుపు ధామ్మని మూసేసి కూతురి కోసం వెయిట్ చేస్తూ సోఫాలో కూర్చుంది. కాలేజికి వెళ్లి హరిని చూసాక ఆమెలో ఉన్న వివేకం, విచక్షణ ఆవిరై పోయి ఆ స్థానంలో దుఖం, బాధ, కోపం నిరాశ, జీవితంలో ఓడిపోయాననే వేదన ఆమె మనసంతా నిండి పోయాయి. జీవితంలో ఇన్నాళ్ళుగా నిర్మించుకున్న హర్మ్యాన్ని ఎవరో కూలదోసినట్టుగా తోచింది. అరగంట తర్వాత నీల ఇంట్లోకి వచ్చి హేండ్ బేగ్ అక్కడే పడేసి నవ్వుతూ తల్లి కెదురుగా సోఫాలో కూర్చుంది. మనసు కుతకుత లాడి పోతున్న సుజాత అలసి పోయిన కూతురి మొహం చూసే స్థితిలో లేదు. తల్లి మొహం చూసి 'ఏమయింది' అనుకుంటూ నిటారుగా కూచుంది నీల.

"నీకు ఎలా నచ్చాడు? ఈ అవిటి వాడు తప్ప నీ కెవరు దొరక లేదా? నీ ముందు దిష్టి బొమ్మలా ఉన్నాడు. నిన్ను ఎంత అపురూపంగా పెంచు కున్నాను! నీ జీవితం ఉన్నతంగా ఉండాలని నేను ఎన్ని మొక్కులు మొక్కుకున్నానే...నీ కోసం ఏ డాక్టరయినా, ఏ ఐటి అయినా కళ్ళ కద్దుకుని

చేసుకుంటారు. నీ రూపు రేఖలు, మన వంశం అలాంటివి." దుఖంతో మాట రాలేదు సుజాతకు. ఏం తప్పు చేసానని ఈ శిక్ష వేసావు భగవంతుడా! అని గగ్గోలు పడింది సుజాత మనస్సు. 'మమ్మీ హరిలో అవిటి తనం చూసిందా!' షాక్ అయింది నీల.

"హరి అవిటి వాడు కాదు. హరి చాల మంచి వాడు మమ్మీ. నేను హరిని లవ్ చేస్తున్నాను. నువ్వు అలా అంటున్నావంటే నాకు నమ్మ బుద్ధి కావడం లేదు." ఆగని కన్నీళ్ళు తుడుచు కుంటూ అంది. తల్లికి తన మీద ఉన్న ప్రేమంతా ఏమయింది!తల్లిని ఇలా ఎప్పుడు చూడలేదు. తల్లి కొత్త అవతారం ఎత్తినట్టుగా ఉంది.

"అవిటి వాడు కాదా! రెండు కాళ్ళు కూడా సమంగా లేవు. అంత కుంటిగా నడుస్తూంటే కూడా నీకు కనిపించడం లేదా! నీ కళ్ళకు గంతలు కట్టేసాడా, అనుకున్నానులే" కోపం బుసలు కొడ్తోంది సుజాత మాటల్లో.

"ఒక కాలు అంగుళం తక్కువ ఉంటె ఆవిటి వాడై పోతాడా! అలా పుట్టడం హరి తప్పు కాదుగా మమ్మీ. మాట్లాడిన మొదటి రోజే ఆ విషయం నాకు చెప్పాడు. అతన్ని అలా కించ పరచడం బాధగా ఉంది మామ్మీ." దుఖాన్ని ఆపుకోలేక తన రూమ్ లోకి గబగబా వెళ్లి పోయింది.

నీల మనసు బాధగా మూలిగింది. షూస్ లేకుండా ఉన్న హరిని మామ్మీ ఎప్పుడు చూసింది!! ఎక్కడికి వెళ్ళినా షూజ్ వేసుకునే వెళ్తాడని తెలుసు.

"వాడితో డేటింగ్ చేయాలనుకుంటే నీకు తల్లి లేదనుకో. నీ జీవితం నీ ఇష్టం. నిన్ను చదివించాను. ఇప్పుడు జాబ్ చేస్తూ నీవు చాల ఎదిగి పోయావు. నిన్ను ఎంత కష్టపడి పెంచుకున్నాను. ఇప్పుడు నీ బతుకు నీదై పోయింది. నా అవసరం నీకు లేదు. నువ్వు ఏం చేసుకుంటావో నీ ఇష్టం. వాడే నీకు కావాలనుకుంటే నేను నీకు లేను అంతే. నా బాధ్యత తీరి పోయింది." గట్టిగా నీలకు వినబడేలా సుజాత కసిగా అంది. నీల తల్లి మాటలు వినడమే కాదు, ఉద్యోగం చేస్తూ కూడా తల్లి మీద ఎంతకాలం ఆధార పడతాను. ఆలోచిస్తూ ఒక నిర్ణయానికి వచ్చిన నీల త్వరలో ఒక అపార్ట్ మెంట్ లోకి వెళ్ళిపోవాలని నిశ్చయించు కుంది ఆ క్షణంలోనే.

ఇంట్లో ఉన్న రెండు వారాలు తల్లి, కూతుళ్ళు ఒకరిని ఒకరు పలకరించు కోలేదు. నీల ఏ ఒక్కపూట కూడా ఇంట్లో భోంచెయ్యలేదు. రాత్రి పడుకోవడానికే వచ్చేది. సుజాత కూడా ఏమి పట్టించుకోలేదు.

★★★★★★★★★★★★★★★★

ఇంటి ముందున్న మెర్సిడిస్ బెంజ్ వెనకాల టొయోటను పార్క్ చేసాడు హరి. నీల బరువైన మనసుతో ముందుకు కదిలింది. నీల వెళ్ళిపోగానే సుజాత ఇల్లు అమ్మేసి చిన్న ఇంట్లోకి మారిందని నేయిబర్ ఆన్య ద్వారా నీల వింది. కానీ ఇదే మొదటి సారి చూడటం.

డోర్ బెల్ నొక్కాడు హరి.

సుజాత తలుపు తీసి పక్కకి జరుగుతూ "రండి" అంది. తల్లిని హత్తుకోవాలని తహతహ లాడింది

తల్లి హగ్ ఇస్తుందేమోనని నీల ఆశగా చూసింది. తలుపు తీసిన తల్లి పక్కకి జరగడంతో ఇద్దరూ లోపలికి నడిచారు. ఇల్లు చిన్నదిగా ఉంది.

సుజాత "కూర్చోండి" సోఫా వేపు చూపించింది. చిక్కి పోయి, మొహం పీక్కుపోయిన తల్లిని చూసి నీలకు బాధేసింది.

గార్డేనియా కాఫీ టేబుల్ పై పెట్టాడు హరి. సుజాత పూల తొట్టి చూసింది కానీ ఏమి కామెంటు చేయలేదు. హరి నీల పక్కనే కూర్చుని పరిసరాలు పరికించాడు. హరి సుజాత వేపు చూసాడు. అనుభవము, సభ్యత ఉన్న స్త్రీ. బ్రౌన్ కలర్ బాబ్డ్ హెయిర్ తో అందంగా నీట్ గా నాన్సీ పెలోసి ఫోటోలాగా కనిపిస్తోంది. భర్త చనిపోయినా కృంగి పోక ధైర్యంగా జీవితంలో ముందుకు సాగింది. ఒంటరిగా పరదేశంలో కూతురిని చదివిస్తూ పరువుగా బతుకుతున్న ఆమె మీద హరికి గౌరవం. సంఘంలో పదవి, డబ్బు, గౌరవం సంపాదించుకున్న మహనీయు రాలు అనుకున్నాడు హరి.

నిశ్శబ్దాన్ని చీలుస్తూ "ఇల్లు ఈజీగానె దొరికిందా?" జవాబు కోసం ఆగకుండానే వాళ్ళ వైపు చూస్తూ

"ఏం డ్రింక్ తీసుకుంటారు?" సుజాత అడిగింది. ఆ మాటలు నిశ్శబ్దాన్ని ఛేదించినా మాటలు ముందుకు సాగడం లేదు.

"కోక్ తీసుకుంటారా?"

సరే నన్నట్టు తలాడించారు ఇద్దరు.

సుజాత లేచి వంటింటి వేపు వెళ్ళింది, వెనకే నీల కూడా వెళ్ళింది. నీల కేసి కాస్త పరీక్షగా చూసింది సుజాత. వెయిట్ పెరిగింది. మొహం నిగనిగ లాడుతోంది.

"జాబ్ ఎలా ఉంది?" సుజాత అడిగింది.

"బావుంది మమ్మీ. ఇంటికి దగ్గిరే. హరి కాలేజి కూడా ఇంటికి చాల దగ్గిరే. మామ్, నేను.. మేము.." మాటలు తడబడ్డాయి నీలకు. తల్లి వేపు చూస్తూ మాటలు మరిచి పొయింది.

" ఏమిటి చెప్పు?" అంది సుజాత సున్నితంగానే, మనసులో ప్రేమ బీజం తలూపింది.

"మాకు బేబి రాబోతోంది." గబగబా అనేసి ఊపిరి బిగ బట్టుకుని తల్లిని చూసింది.

"ఎన్నోనెల ఇప్పుడు?"

"మూడో నెల "

బలవంతపు నవ్వు ముఖాన పులుము కుని "మంచి వార్త" పొడి పొడిగా అంది సుజాత.

"ఇవి తీసికెళ్ళు." అంటూ ఐస్ వేసి కోక్ పోసిన రెండు గ్లాసులు నీలకు అందిచ్చింది.

అప్పటి వరకు ఇంటీరియర్ డేకరేటర్ మేగజైన్లోలా ఉన్న ఆ గది అలంకరణ చూస్తూ, అత్తగారి అభిరుచిని మనసులోనే అభినందిస్తూ ఆమెకున్న నైపుణ్యత, కళాభిరుచి కళ్ళార చూస్తున్న హరికి నీల కోక్ గ్లాసు అందిచ్చింది..

"మమ్మీకి మన బేబి గురించి చెప్పాను." నవ్వుతూ అంటున్ననీల అందమైన మొహం చూసి కర్పూరంలా కరిగి పోయిన హరి ఇక ఏ తల్లి మనసు కరిగి పొంగిపోదు! అనుకున్నాడు.

కొంత సేపటికి సుజాత రెండు ప్లేట్లల్లో చికెన్ పకోడి, మిరపకాయ బజ్జీలు తెచ్చి "తీసుకోండి" నవ్వుతూ ప్లేటులో పెట్టిచ్చింది. ఆ స్నాక్ నీలకు ఫేవరేట్.

"మంచి వార్త! కంగ్రాట్స్!" నీరసంగా నవ్వింది.

"ప్లేస్ కంఫర్టబుల్ గా ఉందా? బేబి రాబోతోంది అన్నావు."

"త్రీ బెడ్ రూమ్ ఇల్లు. ఇద్దరి వర్క్ కి దగ్గరగానే ఉంటుంది."

"డాక్టర్ కు చూపించుకున్నావా? వయస్సు ఎక్కువైతే డెలివరీ కష్టం అంటున్నారు" సుజాత

ఆత్రుతగా అంది. ముప్పై దాటితే పిల్లలు సరిగా పుట్టారని, డెలివరి కష్టమని సుజాత నమ్మకం.

రంగులు మారుతున్న సుజాత మొహం చూసి

"డాక్టర్ జాన్సన్ చూసింది. మెచూర్ మదర్స్ చాల మంచి పేషెంట్లు, తల్లిగా కూడా చాల కేర్ తీసుకుంటారని అంది." నీల నవ్వుతూ అంది.

సుజాత కళ్ళు చిట్లించి చిరాగ్గా చూసింది. నీల చిన్నబోయింది. వెంటనే తేరుకుని,

"మాకు నేచురల్ చైల్డ్ బర్త్ కావాలని ఉంది. బుధవారం నుండి క్లాసెస్ కు వెళ్తున్నాము."

"అవునా!" అసంతృప్తిగా అంది సుజాత. కుడి చెయ్యి వేళ్ళతో నుదురు రాసుకున్నట్టు చేస్తూ తన బాధను దాచుకుంది. తన అవసరమే లేదు వాళ్ళకు.

'ఆమెకి తలనొప్పి రాలేదుకదా!' అనుకున్నాడు హరి.

నీల వెంటనే "మామ్, మేము సంతోషంగా ఉన్నాము. నిన్ను బాధ పెట్టాలని కాదు కానీ ఈ శుభవార్త స్వయంగా చెప్పాలని పించింది. బేబి వచ్చే సరికి అన్ని రడీ చేసుకునే ప్లాను ఉంది."

"నేను వార్తలు వినడం, మిమ్మల్ని అభినందించడం తప్ప..." సుజాత నోట మాట రాలేదు.

ఈ శుభ వార్త విని సంతోషపడుతుందను కున్నాడు హరి కానీ ఆమెలో సంతోషం కనిపించలేదు. నిటారుగా సోఫాలో వెనక్కి అతుక్కు పోయి కూర్చుంది. బలవంతంగా నవ్వుతున్నట్టుగా ఉంది. మాటలు పొడిపొడిగా కదులుతున్నాయి. తనంటే ఏమాత్రం ఇష్టం లేదని గుర్తు రాగానే హరి చాల ఇబ్బంది పడిపోయాడు.

"మేం వెళ్తాం మమ్మి." నీల లేచింది. హరి నమస్కారం చెప్పి తలుపు వేపు నడిచాడు.

కారులోకి రాగానే ..

"మమ్మీని చూస్తుంటే నాకు దిగులుగా ఉంది. 'మీ మమ్మీ డ్రైవ్ చేస్తోంటే చూసాను. కారే మీ మమ్మిని డ్రైవు చేస్తున్నట్టుగా ఉంది' అని ఒకసారి లత అంటి అన్నది."

"అది అతిశయోక్తి అనిపిస్తోంది నీల. నువ్వేం గాబరా పడకు. ఒక వారం ఆగి ఫోన్ చేసి మాట్లాడు. చెప్పకుండా ఎవరినో పెళ్ళి చేసుకుంటే వేరే జాతి వాళ్ళు, మతం వాళ్ళు భరించలేరు. మనం హిందువులం. ఉరుమే గాని కరవం. మీ మమ్మి అరిచి గోల పెట్టలేదు, పెద్దగా ఏడవ లేదు. బేబి వచ్చేసరికి ఆవిడ పూర్తిగా మారి పోతుంది చూడు. బాధ్యత బ్రతికిస్తుంది, కర్తవ్యం తృప్తి నిస్తుంది." పాజిటివ్ ఫీలింగ్స్ నే పరమార్థంగా తీసుకునే హరి హామీ ఇచ్చాడు.

★★★★★★★★★★★★★★★★

నీల, హరి గడప దాటగానే తలుపు మూసి అక్కడే కూలబడి సుజాత రెండు జన్మలకు సరిపడా ఏడ్చేసింది. తాను పెంచిన కూతురేనా! ఇంత అనాలోచితంగా ఎలా చేయగలిగింది. ఇన్నాళ్ళు పెంచిన నేనేమి కానా! ప్రేమను ఎలా తెంచుకో గలిగింది. నేను తనమీద ఆశ పెట్టుకునే జీవిస్తున్నానని తనకు తెలీదా! నా ఆశల్ని కొల్లగొట్టి, నన్ను ఒంటరి దాన్ని చేసి పోయింది. రూపూ లేదు, ఆదాయము లేని ఆ మనిషితో జీవితం అంతా ఎలా గడుపుతుంది! నలుగురి ముందు నన్ను తల ఎత్తుకోకుండా చేసింది. నా బిడ్డ నాకంటే ఉన్నతంగా బతకాలని, దేనికి కొరత లేకుండా ఈడు జోడుతో కలిసి జీవించాలని ఎన్ని మొక్కులు మొక్కుకున్నాను!! నా కలలన్ని కల్లలై పోయాయి. సుజాత ఆవేదన పెరిగిందే కానీ తరగ లేదు.

సుజాత స్నేహితురాలు, వాణి వీలైనప్పుడల్లా సుజాతను విజిట్ చేస్తూనే ఉంది. నీల పెళ్ళి జరిగి నప్పటినుండి దినదినానికి క్షీణించిపోతున్న సుజాత బాధను చూడలేక పోతున్నారు. వాణితో పాటే ఉంటున్న వాణి తల్లి దమయంతి కూడా ఎన్నోసార్లు ఎన్నో విధాలుగా నచ్చ జెప్పింది. ఎన్ని ఓదార్పు మాటలు చెప్పినా సుజాత తన గుండెలోంచి ఎవరో అర్ధ భాగం తీసుకు పోయినట్టుగా, ఒక మర మనిషిలా జీవిస్తోంది.

టివి ముందు సోఫాలో కూర్చున్న సుజాత మనసు మాత్రం ఆలోచనల కందిరీగల ఝుమ్మనే నాదాలలో మునిగి పోయింది. వాణి తల్లి దమయంతిగారు చెప్పినట్టు కట్నం, కానుకల డిమాండ్ పెరిగినపుడు వాటి బారినుండి తప్పించుకోవడానికి ఈ ప్రేమ పెళ్ళిళ్ళు బాగానే ఉంటాయి. కాని, పెంచి, పెద్ద చేసిన తల్లి, దండ్రులను ప్రేమించలేని వాళ్ళు మరొకరిని మాత్రం ఎలా ప్రేమించగలరో నాకు అంతు పట్టని విషయం అంటున్న దమయంతి గారి మాటల్లో నిజం ఉందనిపించింది సుజాతకు.

★★★★★★★★★★★★★★★★

ఐకియాలో తెచ్చిన బేబి క్రిబ్ బాక్స్ తెరిచి టూల్ కిట్ తో కూచున్నాడు హరి. కాసేపట్లోనే నాలుగిళ్ళ అవతల ఉన్నటోని సహాయం చేయడానికి వచ్చాడు. ఇద్దరూ కలిసి నాలుగు గంటల్లో ఎసెంబుల్ చేసేసారు. ప్రతి వస్తువ ఇన్ స్ట్రక్షన్స్ తో వస్తాయి ఒక్క పుట్టే పిల్లలు తప్ప! కారు హార్న్ విని తల తిప్పాడు హరి.

"నీల ఇంట్లో ఉందా?" టోని వైఫ్ లిండా కారు డ్రైవ్ వే లోకి పుల్ చేస్తూ అడిగింది.

“ఈ రోజు కంపెని మీటింగ్ ఉంది, లేటుగా వస్తుంది.” హరి గట్టిగా అన్నాడు. అప్పుడప్పుడు నీలకు సాటర్ డే కంపెని మీటింగ్ ఉంటుందని నీల పాట్ లక్ గ్రూప్ వాళ్ళకి తెలుసు. వాళ్ళంతా రోజుకు పదిసార్లు టెక్స్ట్ పంపుకుంటారు. ఏ స్టోరులో ఏ సెల్ ఉంది-ఎవరు ఎన్ని కొంటున్నారో తెలుసు కోవాలిగా మరి.”

“అవును కదా! బేబి షోవర్ గురించి నీలకు చెప్పకు హేరీ. క్రిబ్ డిజైన్ బావుంది. ఫస్ట్ బేబికి అన్ని చేస్తారు, సెకెండ్ బేబికి అన్నీ హ్యాండ్ డౌన్ లే. సీ యూ లెటర్.” నవ్వుతూ వెళ్లి పోయింది.

టోని, హరి కలిసి క్రిబ్ ను బేబి రూమ్ లోకి మూవ్ చేసి ఫైనల్ గా ఒక్క క్రిబ్ ఆకారాన్ని కూర్చారు.

“వావ్ హేరీ! బేబి రూమ్ ఇజ్ వెరీ బ్యూటిఫుల్, గ్రేట్ జాబ్ మాన్” భుజం తట్టాడు.

“ఫ్యూ థింగ్స్ టు డు. ఆల్మోస్ట్ డన్” గర్వంగా అన్నాడు హరి.

టోని వెళ్లి పోయాక మ్యూజిక్ పెట్టుకుని సన్నగా పాటతో పాటు విజిల్ వేస్తూ బేబి రూమ్లో చేంజింగ్ టేబుల్ సెట్ చేస్తున్నాడు.

ఫోన్ మోగింది. పేరు చూడగానే హరి గబుక్కున ఫోన్ అందుకున్నాడు.

“హల్లో హరి! నేను సుజాతను, నీల మదర్ని.”

“అవును. హలో అండి, బావున్నారా?”

“బావున్నాను, మీ ఇంటికి రావాలని ..”

“తప్పకుండా..ఎప్పుడు వస్తారు?”

“ఇప్పుడే, మీ ఇంటి ముందే ఉన్నాను.”

“లోపలికి రండి. తలుపు తీస్తాను.” మాటల్లో తడబడ్డాడు. గాబరాగా ఫోన్ పెట్టేసి తలుపు వేపు గబగబా వెళ్ళాడు.

“రండి, నీలకు ఈ రోజు ఆఫీస్ మీటింగ్ ఉంది.” అంటూ సుజాతను ఫేమిలీ రూమ్ లోకి తీసికెళ్ళి కూర్చో మన్నాడు.

“నాకు తెలుసు నీలకు మీటింగు ఉందని. నేను నీలతో మాట్లాడాను. చెప్పే ఉంటుంది. ఏదైనా పనిలో ఉన్నావా?”

“ఆ..నీల చెప్పింది. పనేమీ లేదు.”

“నేను బేబి రూమ్ చూడొచ్చా?”

“తప్పకుండా” అంటూ పైన ఉన్న బేబి రూమ్ లోకి తీసి కెళ్ళాడు.

"చాల బావుంది. ప్రొఫెషనల్ లాగ చేసావు. నేనిలా కూర్చుంటాను నికభ్యంతరం లేక పోతే. నీ పని ఆపకు. "

"కూర్చోండి" అన్నాడే కానీ హరికి ఇబ్బందిగా ఉంది.

సుజాత టూల్ కిట్ చూసి "ఏదో ఫిక్స్ చేస్తున్నట్టున్నావు. నా మూలంగా నీవు చేసే పని ఆపకు. నీ కభ్యంతరం లేక పోతే నేనిక్కడ కూర్చుంటాను, నీ పని చేసుకో." అంది.

"చెంజింగ్ టేబుల్ ఫిక్స్ చేస్తున్నాను. ఆది తర్వాత ఎప్పుడైనా చేసుకోవచ్చు. ఇంకా చాల టైం ఉంది. మీకు డ్రింక్ తెస్తాను, ఏం తీసుకుంటారు?"

"ఏదైనా సరే"

"లేమనేడ్ తెస్తాను" ఓకె అన్నట్టుగా సుజాత తలూపింది.

అక్కడే రాకింగ్ చెయిర్ లో కుర్చుని బేబి కేటలాగ్ చూస్తోంది. హరి ఇచ్చిన లేమనేడ్ గ్లాసు కేసి తదేకంగా చూస్తోంది. మనిషి చాల నీరసంగా ఉంది. ఏ టాపిక్ మాట్లాడాలో తేలిక కోక్ కెన్ ఓపెన్ చేసి ఒక్క గుటకలో సగం కేన్ తాగేసాడు. రెండు నెలల్లో ఆమెలో ఎంత మార్పు వచ్చింది!

"మీరు వచ్చినపుడు నేను ఏదైనా అని ఉంటె అది మనసులో పెట్టుకుని బాధ పడొద్దు అని చెప్పాలని వచ్చాను. ముఖ్యంగా కాలేజికి వచ్చి నిన్ను పిలిచి మరీ తూలనాడాను. నీ మనసు చాల బాధ పెట్టాను. ఐ అపోలజైజ్. నా లెటర్ చదివే వుంటావు. స్వయంగా చెప్పాలని...వచ్చాను."

"చదివాను. మీరు అంతలా పశ్చాత్తాప పడవలసిన అవసరం లేదు. కూతురి కోసం ఆరాట పడే తల్లి మనసు చూసాను. మీరు అప్ సెట్ అయ్యారని తెలుసు. నేను మీ కొడుకు లాంటి ..." ఆగి పొయ్యాడు.

"నాకు కొడుకు లాంటి కాదు, కొడుకువే అనుకుంటున్నాను. అప్సెట్ అయిన మాట నిజమే కానీ నేను ఎక్కువ ఆలోచించ లేదు. తర్వాత– అలవాట్లు, అతిశయోక్తులు చంపుకునే వయస్సు నాది అని గుర్తు చేసుకున్నాను. పూలతొట్టి కింద పెట్టిన నీ అడ్రస్ కార్డు చూసాక నీకు నా కృతజ్ఞత చెప్పాలని అనిపించింది. యూ ఆర్ ఏ నైస్ యంగ్ మాన్. మంచి మనసున్నవాడివి, అను బంధాల విలువ తెలిసినా వాడివి. జీవితంలో అంతకంటే గొప్ప విషయం మరోటి లేదని తెలిసినా మరిచి పోయిన మూర్ఖురాలిని. మీ ఇద్దరికి అభ్యంతరం లేకపోతే పాప బాధ్యతలు కొన్నైనా నాకు ఇవ్వండి. ఇక నే వెళ్తాను" అంటూ లేచింది.

సుజాత మనసు విప్పి మాట్లాడు తున్నందుకు హరికి చాల రిలీఫ్ గా ఉంది.

"నీల వచ్చే వరకు ఉండండి"

"ఇక్కడికి రాక ముందే నీలతో మాట్లాడాను. మళ్ళి వస్తానుగా" అంటూనే సుజాత ముందుకు నడిచింది.

"మళ్ళి తప్పకుండా రండి." అంటూ కారు వరకు వెళ్లి సాగ నంపాడు.

నీల ఫోన్ చేసి "హరి మామ్మి వచ్చిందా? నేను మీటింగ్ కు వెళ్లేముందే ఫోన్ చేసింది. తన ఆలోచించిన తీరుకు తానే బాధ పడుతున్నానని అంది. నీతో కూడా మాట్లాడతానని అంది."

"మీ మమ్మీ రావడం, వెళ్ళిపోవడం కూడా జరిగింది. నాకు తెలుసు ఇదంతా త్వరలోనే ముగుస్తుందని. రెండు నెలలకే ఆమెలో చాలా మార్పు వచ్చింది. రాబోయే బేబి మహత్యం." హేపీగా ఈల వేస్తూ అన్నాడు.

★★★★★★★★★★★★★★★★

ఒక నెల రోజుల తర్వాత ఒక రోజు డాక్టర్ థామస్ నీల ఆఫీస్ కు ఫోన్ చేసి

"మీ మదర్ హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యింది. బ్లడ్ ప్రెషర్ ఎక్కువయి బ్లడ్ వామిట్ చేసుకుంది. వెంటనే హాస్పిటల్ కు తీసుకు రావడం మంచిదయింది. లేకపోతే చాల ప్రమాదం జరిగేది." అన్నాడు.

"ఇప్పుడెలా ఉంది డాక్టర్?" కంగారుగా అడిగింది నీల.

"ఇప్పుడు అబ్జర్వేషన్ లో ఉంది. యు కెన్ కమ్ అండ్ సీ హర్."

నీల గాబరాతో డెస్క్ దగ్గర అన్నీఅలాగే వదిలేసి వెంటనే హాస్పిటల్ కు బయల్దేరింది. హరికి క్లాసు ఉంది, మధ్యలో ఫోన్ ఆన్సర్ చేయడు. టెక్స్ట్ పెట్టింది.

డాక్టర్ తో వివరాలు మాట్లాడి వెళ్లి తల్లి పక్కనే కూర్చుంది. తల్లికి బిపి ఉందా! ఎప్పటినుండి.. నాకు తెలీదే!! నేనెంత స్వార్థ పరురాలిని, నా చదువు, ఫ్రెండ్స్, కోరికలు తప్ప దేని మీద ఆలోచన లేకుండా జీవించాను. నాన్న లేని కొరత తెలియకుండా పెంచింది.. మామ్ ఎంత కష్ట పడేది, స్వంతంగా కంపెని మొదలు పెట్టి ఎంత పేరు తెచ్చుకుంది. నేను అడగక ముందే అన్ని అవసరాలు తీరేవి. బిజినెస్ తో సహా అన్నివిషయాలు తనతో షేర్ చేసేది. తన హెల్త్ గురించి ఎందుకు చెప్పలేదు! తల్లి బాధలో ఏదో అంటే నేను ఇంట్లోంచి వెళ్లి పోయాను. నిదానంగా నచ్చ చెప్పి వెళ్ళాల్సింది. జాబ్ చేస్తూ కూడా ఎంజాయ్ చేసానే కానీ మామ్ ను పెద్దగా పట్టించుకోలేదు. మనసులో మధన పడ సాగింది నీల.

తల్లి హాస్పిటల్ బెడ్ మీద నీరసంగా, మంచానికి అతుక్కుపోయి పడుకోవడం చూడలేక పోయింది. మరునాడు డాక్టర్ వచ్చి నపుడు

"ఫర్వాలేదు. స్టేబుల్ గా ఉంది. ఇది వార్నింగ్, ఇక ముందు జాగ్రత్తగా ఉండాలి. మందులు రెగ్యులర్ గా తీసుకోవాలి. టెన్షన్, వర్రీస్ ఉండకూడదు. రేపు ఇంటికి పోవచ్చు." డాక్టర్ మాటలు

వినగానే నీల గుండె దడ దడ లాడింది. ఇది వార్నింగా! బాధతో కళ్ళనుండి నీరు కారసాగింది.

ఇక ముందు మామ్ ఒంటరిగా ఉండటానికి వీల్లేదు. హరితో కూడా అదే చెప్పింది. హరి సంతోషంగా

"ఒక్కర్తి ఉండటం నాక్కూడా ఇష్టం లేదు. పాప బాధ్యత తనదే." తల్లి కూతుళ్ళ మధ్య సంధి కుదిరిందని హరి సంబరపడి పోయాడు. పెళ్ళితో వాళ్ళిద్దరూ అలా దూరం అయ్యారనే బాధ తీరిపోయింది.

"మామ్! నువ్వు మాతో పాటే ఉంటావు. నాకు ఇప్పుడు నీ చేతి వంట తినాలని చాల కోరికగా ఉంది. ఈ మధ్య అప్పుడప్పుడు చేసి ఇస్తున్నావు కానీ అది చాలదు. బేబి కోసం అన్ని ప్లాన్స్ వేయాలంటే నీ సలహా కావాలి. బేబి వచ్చాక ఊపిరి సలపని పనులుంటాయి, నీవు లేకుండా నేను, హరి చూసుకోలేము. నువ్వు మాతో ఉండాల్సిందే."

మందహాసంతో కూతురి వేపు చూసింది. ఒంటరిగా ఉంటె తనకు ప్రమాదమని డాక్టర్ చెప్పడం వింది.

'హరి మనసు ఎంత మంచిది. అతని వంకీల జుట్టు చూసి బుట్టలో పడి పోయింది కాని అతని కుంటి నడకను చూడలేదు అని కూతురిని తూల నాడింది. అవిటి తనం నాలో ఉంది. బిడ్డను ప్రాణంగా పెంచు కున్నాను నా మాట వినలేదు అని బాధ పడ్డాను కానీ బిడ్డకు ప్రాణమైన అతన్ని ఒక్కసారైన అర్థం చేసు కోవడానికి ప్రయత్నించలేదు. నేనే అవిటిదాన్ని. హరి లోని మెచ్యూరిటి, నెమ్మదితనం గమనిస్తే గాని అర్థం కావు. చాల మంచివాడు.' పశ్చాత్తాపంతో సుజాత మనసు కృంగి పోయింది. కూతురు ఎదిగింది తాను చిన్నదై పోయింది. తన వయస్సు ఎప్పుడో పెరిగింది అవగాహన ఇప్పుడు పెరిగింది, నవ్వుకుంది సుజాత.

హరి, నీల తమతో పాటే సుజాతను తమ ఇంటికి తీసుకు వెళ్ళారు. సుజాత ఏమి అభ్యంతరం చెప్పలేదు. అందరి జీవితాలలో ఈ మార్పు ఆనందాన్ని తెచ్చింది. సుజాత తృప్తిగా నవ్వుకుంది.

బేబికి నవ్వుల తోరణాలతో ఆహ్వానం సిద్ధంగా ఉంది.

## ఉమ్మడి — వెల్చేరు చంద్రశేఖర్

"సింహం అన్నయ్య రాలేదా?"

రిక్షా దిగుతూనే ప్రశ్నించా పెద్దత్తని...,

"ఇంకా ఇంట్లో అడుగుపెట్టనే లేదు, అదేం ప్రశ్నోయ్? అయినా ఆయనొస్తే ఇల్లు ఇలా వుంటుందా?" అంది అత్త నవ్వుతూ ముందు కొచ్చి రిక్షాదిగుతున్న రజని చంకలో బాబుని ఎత్తుకుంటూ...

"ఏరా ప్రయాణం సుఖంగా సాగిందా?" అన్నారు నాన్న పడక్కుర్చీలోంచే...

"ఆ" అన్నా..., ఎక్కడుందో స్నేహ పరిగెట్టుకుంటూ వచ్చి చేతిలో సూట్ కేసు తీసుకుంది. దాని రెండుజడల్లో ఒక జడ పీకా... అదే దాన్ని పలకరించడం.

"ప్రసాద్ గారు ఎప్పుడూ లేటే" అంటూ ఎదురొచ్చాడు పెద్దన్నయ్య.

"శలవు దొరకడం కష్టం అన్నయ్యా" అన్నా.

"కారణాలు చెప్పకు. ఆలస్యం అయింది అంతే" అని నవ్వుతూ,"ఢిల్లీనుండి రాజ్యం అత్తకూడా వస్తానంది." అన్నాడు.

"రాజ్యం పిన్ని వస్తోందా?" అంది ఆనందంగా రజని

"ఆ అది కూడా తోడైతే వేరే బోగిమంట అక్కర్లేదు."అంది పెద్దత్త నవ్వుతూ.

"ఏరా రెండ్రోజులముందొస్తే, ఏం పోయింది?'' అంటూ అమ్మఎదురొచ్చింది.

"అత్తా ఈ మధ్య ఈయన వంటింట్లోకి కూడా రావడం లేదు.... ఎక్కువ ఆశలు పెట్టుకోకండి." అంది రజని.

"అమ్మా కాఫీ" అంటూ లోపలికి పోయా.

---

సాయంకాలం ఇంటిముందు రిక్షాలో చిన్నవదిన, బొండాంగాడు దిగారు.

"అన్నయ్యేడీ?" అన్నా...

"ఆయన ఆ సెంటర్లో దిగారు అందర్నీ పలకరించి వస్తారు." మూతి విరిచింది చిన్న వదిన

"అంతేనా ఎవర్నేనా ప్రత్యేకించి పలకరించడానికి వెళ్ళాడా?"

"అది మీ అన్నాతమ్ముళ్ళకే తెలియాలి" చిన్నొదిన ఎత్తిపొడుస్తూ.

చిన్నొదిన వచ్చిన అరగంటకి ప్రకాశం వచ్చాడు. ప్రకాశం వచ్చిన అరగంటకి సింహం అన్నయ్య వచ్చాడు. అందర్నీ పలకరించి "ఏడీ ఎర్రచిబుకం రాలేదా?" అన్నాడు.

"బెంగపెట్టుకోకు వచ్చాలే" అన్నాడు ప్రకాశం లోపల్నించివస్తూ...ప్రకాశాన్ని సింహంఅన్నయ్య ఎర్రచిబుకం అంటాడు. దానికి కారణంకూడా చెప్తాడు. ఎవరికేనా కోపం వస్తే, బుగ్గలెర్రబడతాయి, కళ్ళెర్రబడతాయి వీడికి మాత్రం చిబుకం ఎర్రబడుతుంది... అంటాడు.

"ఏమోలేరా ఎటిమోలోజిక్ గురించి ఎవరు చెప్తారా" అని బెంగ అన్నాడు.

"నీకు ఎటిమోలజీ ఎందుకు, అన్ నాచురల్ ప్లెజరిష్టుని."

ఇంకా సంభాషణ ముందుకి వెళ్ళను కానీ...

నాన్న "ఔరేయ్ వెళ్ళి స్నానం చెయ్... వాదించుకోడానికి మూడ్రోజులుంది వెళ్ళు"అని గదమాయించారు.

సింహం అన్నయ్య టవల్ తీసుకు బాత్రూములోకి పోయాడు.

నేను ప్రకాశంతో "అన్నాచురల్ కాదు అన్ఎథికల్ రా, ప్లెజరులో నేచురల్ అన్నాచురల్ వుండవు." అన్నా

"చెప్పేవి శ్రీరంగనీతులు దూరేవి...., "

"అందరూ అంతో ఇంతో అంతే,"

ఇద్దరం పెరట్లోకి వెళ్ళి నూతిగట్టు మీద కూర్చున్నాం

"ఏమైనా పెళ్ళి అదీ ఆలోచించావా?"

"లేదు వెళ్తే అమెరికా వెళ్దామనుకుంటున్నా... పోస్టుడాక్టరల్ చెయ్యడానికి "

"నీకు పెట్టుబడిదారీ కంట్రీ ఎందుకురా?"

ప్రకాశం మాట్లాడలేదు.

"రాజ్యంఅత్త ఎందుకొస్తోందో ఇన్నాళ్ళతర్వాత?వాళ్ళ అమ్మాయిని నీకిద్దామనుకుంటోందేమో?"

"ఏమో? మీ బామ్మర్ది ఆస్థిలెక్క చెప్పమన్నాడట"

"నాన్న చెప్పేసేదుగా,"

"పిల్లకాకికేం తెలుసు వుండేలు దెబ్బ."

"వాడు అన్నదాంట్లో కొంత నిజం లేకపోలేదు మా అమ్మ ఈ ఇంటికి చేసిన చాకిరి వెలకట్టమన్నాడా?"

"అత్త చేసిన సేవకి వెలేం కడతావురా?, మీ అత్తగారికి సపోర్టు వెళ్ళకు.... ఆలోచించు.?"

"ఏమిటాలోచించేది లేబరు లేబరేకదా అత్త కార్మికస్థాయి నుండి మధ్యతరగతిలో చేరింది. ఆవిడ విలువలు మారిపోలేదు. ఇంకా సేవచేస్తూనే వుంది. కాని కొడుక్కి చదువూ సంస్కృతి పెరిగాయి. స్వార్ధం కొంచెం చూపించాడేమో?."

"కాదు నాన్న పెత్తందారీ విధానం వాడికి నచ్చలేదు. స్వార్ధం లేదేమో, నేనిప్పుడెటువేపు నాన్న తరుపు మాట్లాడాలా, బావమరిది తరుపు మాట్లాడాలా?"

"......................"

"అత్తని తీసుకెళ్దాం అనుకుంటున్నా" అన్నా... చిన్నగా ఈలవేసాడు ప్రకాశం

అప్పటికి సింహం అన్నయ్య లుంగీ పైకికట్టుకునూతిగట్టు కొచ్చాడు.

"ఏరా ఎర్రచుబుకం రష్యాలో చైనాలో పరిస్థితులు బాగున్నాయా?"

"ఏమంటోంది ఇండియా, ఇందిరమ్మ ఎమర్జెన్సీ చూసి చంకలుగుద్దుకుంటునట్టున్నారు..., మీ కమ్యూనిష్టులు."

"వడ్డించిన విస్తరి మీ జీవితం మర్యాద, మప్పితం,... నడతానాణ్యతల విషయం ...నిశ్చలనిశ్చితాలు మీవి."

సింహం అన్నయ్య పకపకానవ్వాడు.

"నీకు ఎక్కడ పొడవాలో తెలుసు అంతే...అయినా మీవదినకు లేని బాధ నీకెందుకురా?"

"వదినెకు బాధలేదని ఎందుకనుకున్నావు."

పెళ్ళైనమొదటి రాత్రే చెప్పాను నా విషయం, రాణికి నాకు సంభందం వుందని ఆమెని వదల్లేనని....,,

"మరి నన్నెందుకు చేసుకున్నారని అడగలా?" ప్రకాశం ఎత్తిపొడుపు .

"లేదు మరినన్నెందుకు చేసుకున్నారని అడగడం మూర్ఖత్వం... నా స్థాయి ఏమిటి?" అని అడిగింది.

"నీ సమాధానం?"

"ఈ కుటుంబంలో రెండోకోడలవు, నాకు భార్యవు అన్నా మరి రాణో మీ వదిన ప్రశ్న

ప్రేమిక అనను అదో భాధ్యత అటాచ్ మెంట్ తప్పదు... ఏమవుతుందో చూద్దాం?" ....,అన్నా.

"అంటే నువ్వో హిడోనిష్టువన్నమాట"

"అంటే?"

"నువ్వు చేసిన పని మంచిదో కాదో నువ్వే నిర్ణయిస్తావు... నైతికత నీవేపే వుందని నీ ఆలోచన మన గాంధీలాగ అయనాఅంతే నాయకత్వం అంట కట్టేసరికి ఆయన చేసింది ప్రతీదీ రైటు అనే అహంకారంతొ దాన్నిమనమీద రద్దేసాడు, న్యాయం వేరు గాంధీన్యాయం వేరు అయి కూర్చుంది. ఆయనే కాదు ఇందిరాప్రిదర్శిని అంతే ఎమర్జెన్సీ విధించడం వొక రైట్యువస్నెస్ అనుకుంది. ఆవిడ పేరులో గాంధీ కూడా అదే. ఈ సెల్ఫ్ స్టైల్డ్ రైట్యువస్నెస్ మనుషుల్లో నువ్వూ వున్నావు, అయితే లెవెల్ తక్కువ! ముందుముందు ఇంకా ఎక్కువ వుంటుంది. ఈ వుమ్మడి జీవితాలని, సమాజపు కట్టుబాటులని ప్రశ్నిస్తుంది. తప్పదు."

"మంచిదే కదా?"

"మంచిదా? కాదా? అన్నది కాదు ప్రశ్న... పునాదులు కదులుతున్నాయా? లేదా? అన్నదిముఖ్యం"

"ఇవి పునాదులు కావురా ప్రకాశం..... వుమ్మడి కుటుంబం, కులవ్వవస్థ, వుమ్మడి సమాజికన్యాయం, ఒక యాంత్రికఏర్పాటు మాత్రమే యంత్రం చెడవచ్చు, ఎందుకంటే యివన్నీభౌతికఅవసరాలని బట్టి ఏర్పడ్డ భౌతికపరిస్థితులు......కానీ చైతన్యం వేరు దాని పునాదులు వేరు. మానసిక

చైతన్యం, దాని అవసరాలు వేరు. అది అధి భౌతిక శాస్త్రం దేహం, వుద్రేకం, వూహ(మనసు),బుద్ధి(relativity),...ఇంకా ఇలాంటి స్థాయిలు వున్నాయి. అవన్నీ వాటి స్వరూపస్వభావాల్లో తేడా వల్ల వచ్చినవి. వాటిని మనుషులకి ఎలా అన్వయించాలన్న, విషయంలో మనకో విషన్ వుంది. అదే..,సాంఖ్య.

మొట్టమొదట ఈ మట్టిలో పుట్టి ఈ మట్టిలో కలిసే మనకి ఇక్కడి సంస్కృతి సంస్కారం తప్ప మరొక్కటి అబ్బదు. ఇంకొకటి అబ్బించుకుంటే అది కృతకం ఎన్నాళ్ళో సాగదు.

ఈ కృతకం లిష్టులోకి మతం పేరుతో క్రిష్టియన్లు, సిద్ధాంతం పేరుతో మార్క్సిస్టులు మారుతున్నారు. ఇలా మారుదామని మార్చాలని ఎప్పటినుండో హిందూ సమాజానికి లోపలనుండి, బైటనుండిపీడన జరిగింది. ఏదోకొంచెం పీడించగలిగింది కానీ సమూలంగా మార్పు తేలేక పోయింది.

నూరేళ్ళ భ్రష్ట యోగి మార్క్సు, సుమారు రెండువేల ప్రేమ యోగి జీసస్, సుమారు పదిహేనువందల ఏళ్ళ వయసు కలిగిన నిర్వికార సంస్కారి మహమ్మద్... ఈ హిందూ సమాజానికి కొత్తకాదు, మనకి మతం మత్తుమందు కాదు. మావో దలైలామాతో చెప్పినట్టు విషమూ కాదు. ప్రతీ దానికి పరమార్ధం నీచార్ధం రెండూ వుంటాయి. కానీ మనిషికి సాధన, అనుభూతి, దర్శనంనుండి పుట్టినవే ఈ మతాలు.

ఇతర మతాలపై ద్వేషం కలిగిన మతం, క్షుద్రమతం..., జీసస్ గొప్పవాడు, కానీ క్రైస్తవం కాదు,మహమ్మద్ గొప్పవాడు, ఇస్లాం కాదు, బుద్ధుడు గొప్పవాడు కావచ్చు బౌద్ధం కాదు. పై వాటిలా హిందూమతం అని నువ్వనుకుంటున్నది, యే వ్యక్తి ద్వారానో రాలేదు. అందుకే దీన్ని సనాతనధర్మం అన్నారు. ఆహారం కల్తీ అయిందని ఆహారం మానెయ్యంకదా! కేష్ట సిష్టం అంటావా , కేష్ట కాకపోతే, క్లాసు వుంది. మన కేష్టలన్నీ స్కిల్డ్ పని వాళ్ళు...,సమాజంలో బతకడానికి ఏదో స్కిల్ ప్రాక్టిస్ చేసినవాళ్ళు. "

"రష్యాలోను, చైనాలోను రాలేదా?"

"ఏమిటి వచ్చింది. స్టాలిన్ క్రూరత్వం, మావో ఎక్సపెన్షిజం.., తప్ప"

"సమసమాజం ఏర్పడలేదా?"

"అంతలా ఏర్పడితే కాన్సన్ట్రేషన్ కేంపు లెందుకు?"

"మార్పు రాలేదా, ఈనాడు అవి బలమైనదేశాలు..,"

"అవును బలమైన దేశాలే., అవి ఆ బలాన్ని ఎలా సాధించాయి., హింసతో ఆ హింస ప్రజలు భరించగలిగిన్నాళ్ళు... అవి వుంటాయి.., తర్వాత మూటాముల్లె సర్దుకుంటాయి. హింసతో ఈ దేశాన్ని ఆక్రమించిన మంగోలయన్స్..,వ్యాపారం పేరుతో ఈ దేశానికి జ్ఞానం నేర్పదామనుకున్న బ్రిటిష్ ఎవరూ మిగల్లేదు. వాళ్ళని మనం హింస తో పంపేయలేదు. మనకి రెండో దారివుంది. ఆ దారిలో పోయాం, మృదువుగా మీ అవసరం మాకు లేదని చెప్పగలిగాం ఎందుకంటే ఈ దే శ సంస్కారం గొప్పది గనుక!"

"ఏమిటి గొప్ప, కర్మ సిద్ధాంతమేనా?"

"అదొక్కటేనా వైశేషికం(logic) యోగా, న్యాయ, సాంఖ్య, మనజీవితాలని సమాజాన్ని నిర్మించాయి, ఈ పునాదులు అంత తొందరగా కదలవు. గాంధీ అవలంబించిన న్యాయం గౌతముడి న్యాయ సూత్రాలే, నిరాహారదీక్ష యోగశాస్త్రానికి ప్రాక్టికల్. బౌద్ధికమైన వుప్పుసత్యాగ్రహందానితో ఆయన సాధించిన భౌతికమైన ఆందోళణ, సాంఖ్యకి వ్యాఖ్యనం కాదా?."

"వీటి ఆధారాలతో నిర్మించబడిన వ్యక్తి, సమాజం..., ఇంకో సంస్కారం ఏది అలవర్చు కుందామని ప్రయత్నించినా (conflict ) కాంఫ్లిక్ట్ మిగులుతుంది. అంతే!"

"వొరేయ్ ఎర్రచుబుకం ఎక్కువ చదివి నువ్వు పాడయిపోయావు. కొంచెం ఈ దేశానికి సంబంధించినవి కూడా చదువు "

"నా సంగతొదిలెయ్ దుర్గ ఎటూ నిర్ణయించుకోలేకపోతున్నాడు. అత్తని తనతో తీసుకెళ్తాం అంటున్నాడు నీ వుద్దేశం చెప్పు. ..." టాపిక్ మారుస్తూ ప్రకాశం.

"అత్తని నువ్వుతీసుకెళ్ళడం ఫేలసీ ... అత్త నాన్నని వదిలి నీతో వస్తుందా అది పాయింటు."

" అమ్మో సింహంగారు ....సింహంగారే ..." అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

"వీడికి అత్తమీద అంత అభిమానం ఎందుకొచ్చిందో తెలుసా, వీడిబామ్మర్ది ఆస్తి పంచమని నాన్నని నిలదీసాడు. నాన్న ఆస్తి అంటూ ఇస్తే అత్త పేరే ఇస్తాడు. అందుకు అత్తమీద అభిమానం పెరిగింది వీడికి...."

"మీ ఇద్దరూమాట్లాడు కోండి. నే పోతా" అన్నా చికాకుగా .

"ఇది పచ్చినిజంరా వుడుక్కోకు....," అన్నాడు సింహం అన్నయ్య. వీడికి ఎవరు పెట్టారో నరసింహం అని వీడు నిజంగా నరుల్లో సింహమే,

అన్నయ్యా అమ్మ భోజనానికి రమ్మంది. స్నేహ పిలుపుకి ముగ్గురం ఇంట్లోకి పోయాం.

భోజనం దగ్గర నాన్న, "రాజ్యం వస్తోంది వెళ్ళి తీసుకురావాలి."

పెద్దన్నయ్య "నేవెళ్తాలే నాన్న" అన్నాడు.

వెంటనే పెద్దొదన చీకట్లో మీరెందుకు ప్రకాశం వెళ్తాళ్ళెండి. అంది

"పర్వాలేదు వదినా, అన్నయ్య వెళ్తాడ్లే..." అన్నాడు ప్రకాశం. పెద్దన్నయ్య ఏం మాట్లాడ్లా అంటే వెళ్తాదన్నమాట... వదిన ఏం అడ్డుచెప్పలా...

"వొరేయ్ దుర్గా రేపు బేంకుకి వెళ్ళి నయాపైసలు పట్రా బాబుకి భోగీపళ్ళు పోయాలిగా. దొరుకుతున్నాయా రాగిపైసలు వస్తున్నాయా."

"_______"

"చూడు రాగిపైసలే అందం."

"వొరేయ్ దుర్గా మార్కెట్లోకి వెళ్తే రెండు చీరలు పది జాకెట్ గుడ్డలు పట్రా... చీర చిన్నత్తకి" అంది అమ్మ .

చిన్నత్తకి చీర అని చెప్పడంలో ప్రత్యేకం వుంది ఆవిడకి చీర నచ్చకపోతే ఏ బియ్యండబ్బామీదో పెట్టేసి పోతుంది.

"ప్రకాశం, కట్టెలు కొట్టేవాడ్ని రమ్మన్నా, పెరట్లోదుంగని కొట్టించు. పోలమ్మదగ్గరకి వెళ్తే.... భోగిపిడకలు ఇస్తానంది. స్నేహతో వెళ్ళితీసుకురా."

అంటూ అందరికీ అన్నీ పన్లు పురమాయించారు నాన్న. "రాజేష్ రాలేదేం ...?" అని అడిగా అత్తని, రాజేష్ రజని తమ్ముడు ... ఇంజనీరింగ్ చదువుతున్నాడు.

"మూడ్రోజులే శలవులట ... రేపొస్తాడు," అంది అత్త.

"ఇంతకు ముందు పండగ శలవులు పదిహేనురోజులిచ్చేవాళ్ళు... ఇప్పుడవి క్రిస్మస్ శలవులకింద మార్చేసారు. పండక్కి మూడేరోజులు శలవులిస్తున్నారు.

"ఇంతమందికీ వంటకష్టం వంటావిడని పిలిస్తే ...," ప్రకాశం .

"ఎంతమంది వున్నారోయ్ నేను మీ అమ్మ లేమూ.. వండిపడేస్తాం... రాజ్యం రానే వస్తుంది."

"రాజ్యం నీలాగ అనుకుంటున్నావా, అత్తా ఈ నాలుగురోజులేనా సుఖంగా వుందామని వచ్చా.... అక్కడేవుంటే తక్కువ సేవతో సరిపొయ్యేది...,అంటూ వాపోతుంది."

"నీది మరీ చోద్యంరా ప్రకాశం ....నేను అదీ ఈ ఇంటిఆడబడుచులం ఆమాత్రం చెయ్యలేమా?"

"చెయ్యగలరు కానీ అత్తా మరి నీకొడుకు నాన్నని నిలదియ్యలేదా నువ్వేదో ఇక్కడ కష్టపడిపోతున్నావని ...."

"ప్రకాశం నోరుముయ్యి..." అన్నారు నాన్న విసుగ్గా.

"ప్రకాశం అన్నదాంట్లో తప్పేముంది నాన్న ...?" సింహం అన్నయ్య సపోర్టు.

"తప్పుందిరా దాని కొడుకు దాని కష్టం గురించి మాట్లాడితే అది అభిమానంతో ప్రశ్నించినట్టు... నువ్వు మాట్లాడితే అది వెక్కిరింపు ....నువ్వు దాని కొడుకువు కాదు....అదే తేడా"

సింహం అన్నయ్యకి అర్థం అయింది.

భోజనాలయాయి, అందరూ వీధరుగుమీదకి చేరాం.... పెద్దన్నయ్య స్కూటరేసుకు స్టేషన్ కి బయలుదేరాడు. రాజ్యం అత్త వాడికన్న పదేళ్ళు పెద్ద, పెద్దరికం చూపించి వాడ్ని వెనగ్గా తిప్పుకునేది. రాజ్యం పెళ్ళయేవరకూ దాన్ని వదల్లేదు వీడు.

"హొరేయ్ చీకటి.. జాగ్రత్త" అన్నారు నాన్న

సమాధానం చెప్పకుండా వెళ్ళాడు పెద్దన్నయ్య.

ప్రకాశం, సింహం ఎమర్జెన్సీ గురించి మాట్లాడుకుంటున్నారు నాకు చిరాకేసి ... లోపలికి పోయా.

రాత్రి పన్నెండుకి రాజ్యం అత్త వచ్చింది. అందరి పలకరింపులూ అయాక, "సింహం ఏడీ?" అన్నాడు అన్నయ్య .

"సివంగి దగ్గరికి పోయుంటాడు...తెల్లారివస్తాడ్లే పడుకోండి.." అంది రాజ్యం అత్త...

కొందరు ముసిముసిగా నవ్వుకున్నారు. కొందరు మూతి ముడుచుకున్నారు. అందరూ వెళ్ళి పడుకున్నారు.

"అమ్మని మనతో తీసుకెళ్తున్నామా ?" రజని.

"ఊ...."

"అమ్మని అడిగారా?"

"లేదు రాజేష్ వచ్చాక మాట్లాడుతా"

"అమ్మ రాదు...."

"ఏం...?"

"వాళ్ళ వదిన్ని వదిలి ఆవిడరాదు అత్తవాళ్ళ అత్తిగని వదల్దు."

"___________"

"రాజేష్ మావయ్యని ఆస్తి పంచమని అడగడం పొగరంటారా,? ధైర్యం అంటారా?",

"నువ్వేం అనుకుంటున్నావ్"

"నేనేం అనుకుంటున్నానో అన్నది కాదు ... మావయ్య ఏం మనుకుంటున్నారో?"

"నాన్న అవునని కానీ కాదని కానీ అన్లేదుగా?......," నా మాటముగియనే లేదు.

హో మూలనుండి రాజ్యం అత్త, "ఇద్దరూ పెరట్లోకి పోయి మాట్లాడుకోండిరా పడుకోనివ్వండి, "అంది. లైటార్పేసి నంతమాత్రాన అందరూ పడుకున్నారనుకోడం పొరపాటు....., అందరం కాకపోయినా కొందరు పడుకున్నట్టు నటించాం.

.................

అటు ఆకాశవాణి భక్తిగీతాలతో తెలివొచ్చింది. బ్రెష్ కి పేష్టు పెట్టుకు పెరట్లోకి వెళ్ళేసరికి, అత్త పెరట్లో మొహం కడుక్కొంటోంది.

"ఏరోయ్ హొళ్ళు చేసావ్" ,అంది.

నవ్వేసి వూరుకున్నా ... ఈలోగా సింహం అన్నయ్య వచ్చాడు పెరట్లోకి

"ఈయన పేరుకి సింహంగాని గ్రామసింహమేరా" అంది అత్త సెటైర్ వేస్తూ.

"అమ్మోరాజధాని వచ్చేసింది" అన్నాడు సింహం అన్నయ్య అప్పుడే బైటకొచ్చిన రజని ఫక్కుమని నవ్వింది.

అది రాజ్యం అత్తకి నచ్చలా "ఏమే బాబుకి మీనాన్నపేరు పెట్టలేదటగా ... పెట్టివుంటే బావుండేది" అంది.

అప్పుడే కాఫీగ్లాసు సింహం అన్నయ్యకి అందించి "దుర్గ ఇష్టంలెద్దూ అయినా పాతకాలం పేర్లు ఏం బావుంటాయి." అంది అత్త.

"పాతకాలం పాతపేర్ల వాళ్ళు మనుషులు కాదుగామోసు" అంది రాజ్యం అత్త నన్ను చూస్తూ

"కొత్త పేర్లవాళ్ళని నువ్వు ఎత్తుకోవా?," సింహం అన్నయ్య దెప్పిపొడుపు.

"వాళ్ళ అమ్మా నాన్నని ఎత్తి మోసింది చాలు.. ఇంక వాళ్ళ పిల్లల్ని కూడా ఎత్తి మోయాలా?"

"ప్రసాద్ ని ఎత్తుకున్నావ్ గాని అత్తా నన్నెత్తుకోలేదు ...."

"అప్పటికి నీకు నాలుగేళ్ళు దున్నపోతులా వున్నావ్ ఇంకా ఎత్తుకోలేదని కంప్లైంట్ కూడానా?.....

అందరూ నవ్వుతూ చూస్తున్నారు ఇద్దర్నీ.....

అప్పుడు నాన్న పెరట్లోకి వచ్చారు. రాగానే ఇద్దరూ ఏదో వాదించుకుంటున్నారని గ్రహించారు.

"తెల్లారిందీ వాదనలకి ..." అన్నారు.

"వాదనకాదు నాన్న పండక్కి పొట్టేలు పందెం పెట్టించాం, ఒకటి ఢిల్లీనుంచి రప్పించాం... ఇంకోటి విజయవాడనుండి రప్పించాం..." అన్నా నవ్వుతూ.

"ఏరా ఢిల్లీ నించి రప్పించావా ...వెళ్ళేలోగా పొడిచిపోతా కాచుకో...." అంది రాజ్యంఅత్త నవ్వుతూనే.

"సరిసరి అందరూ చేరేరూ వేన్నీళ్ళు చల్లారిపోతాయి. దేగిశాలోనీళ్ళు తొలుపుకు పోసుకోండి. ...పని కానీయండి...." అంటూ అమ్మవచ్చి అందర్నీ అదిలించింది. అందరూ బుద్ధిగా విడిపోయాం .

అంతమంది చేరినప్పుడు మేనేజ్ చెయ్యడం కష్టం కానీ ఏ మేనేజ్ మెంటు డిగ్రీలేని అమ్మఎంత బాగా ఈవెంట్స్ మేనేజ్ చేస్తుందో.

పొద్దున్నే కాఫీలు... ఎనిమిదిలోగా టిఫిన్లు .... మళ్ళీ కాఫీలు ... పిల్లలకి పాలు. పన్నెండింటికి ...భోజనాలు ....తర్వాత కునుకులు. తర్వాత రోజుకి ఏం కావాలో ... బజారునుండి ఏంతేవాలో అన్ని పనుల పురమాయింపులు.....

నాలుగుగంటలకి ... చిరుతిళ్ళు ..కాఫీలు .. రాత్రికి భోజనాలు ... పడకలు ఏర్పాట్లు ... తర్వాత చిన్న కునుకు .... మళ్ళీ రోజు మొదలు.... ఇవన్నీ జరిగిపోవాలి .... ఏమాత్రం తప్పినా, ఇంట్లోవాళ్ళంతా వున్నారా కట్టకట్టుకు ఎక్కడికేనా పోయారా, అన్న విరుపుమాటలు.

సాయంకాలం అయేసరికి,, ఎవరో పంపారు అంటూ చెరకుగడలు, రేగిపళ్ళు, అరటిపళ్ళగెల, ఖర్జూరం వచ్చాయి. "అమ్మా పాలువచ్చాయి నాలుగుశేర్లు సరిపోతాయా?" ....అన్నయ్య ఎంక్వైరీ...

"చాలవు మరోరెండు పుచ్చుకో ఎన్ని పాలు కాఫీలకే చాలడంలేదు...."

"అదేమిటి అలా అనేసావ్ మేం అంతా కాఫీలు ఎక్కువ తాగేస్తున్నామా,?" సింహంఅన్నయ్య అమ్మమీద విసురు...

"తాగడంలా... అయినా అలా అనడం ఏమిటి ఇందులో పైవాళ్ళెవ్వరా ... పొడుచుకురావడానికి ...," అమ్మ

"అలా అనండి అత్తయ్యా బావగారికి ఎప్పుడూ ఏదో తంపు పెడదామనే ధ్యాస" అంది రజని .

"ఆవిడ రెండో ఆడబడుచు ముందు నేనెందుకూ పనికిరానే రజని "

రాజ్యం అత్తని కెలకబోయాడు అన్నయ్య.

"నీ వలలో పడనుగానీ ...పెద్దోడితో చీరసెలక్షన్ కి పోతున్నా....." అంటూ పెద్దన్నవెనకాలే వెళ్ళిపోయింది రాజ్యం అత్త.

"స్నేహ, రజనీ రేపు పొద్దున్నవెళ్ళి బాబుకి సాయంకాలం భోగిపళ్ళు పోస్తున్నామని పేరంటానికి పిలవండి."

"టైము చెప్పద్దూ?" ....,

"ఆ అయిదుగంటలకని చెప్పండి." అమ్మ.

"రజనీ రాణిని కూడా పిలవండి....." సింహం అన్నయ్య.

రజని అన్నయ్యకి సమాధానం చెప్పలేదు. అమ్మవేపు చూసింది. "సర్లె పిలవాలో వద్దో రేపుచెప్తా...."అంది అమ్మ.

నాన్న సలహా తీసుకు చెప్తుంది..... ఎప్పుడూ అందరం కూడలేదు. అప్పుడు ఇంట్లో పేరంటానికి రాణిని పిలిచేవారు. కానీ ఈసారి రాజ్యం అత్తవుంది. ఏమైనా అనేస్తే లేనిపోని ఇబ్బంది అని అమ్మ ఆలోచన. నాన్నతో చెప్పేస్తే నాన్నకి తెలుసని రాజ్యంఅత్తకి తెలుస్తే ... ఇంకేం మాట్లాడదని అమ్మ వూహ,

సింహం అన్నయ్య మరి మాట్లాడలేదు.

రాణిని పిలవడం పిలవకపోవడం పెద్దసమస్య కాదన్నట్టు తేల్చేసింది అమ్మ. కానీ సమస్యే అని అందరికీ తెలుసు. చిన్నవదిన చిన్నబుచ్చుకుంటుంది. పెద్దవదిన ఏమీ అనదు కానీ నచ్చదు.

ప్రకాశం వూళ్ళోకి పోయాడు. సింహం అన్నయ్య రాణింటికి పోయాడు. అక్కడ వాడికోసం బ్లాక్ నైట్ విస్కీయో బేక్ పైపరు విస్కీనో వుంటుంది. ఏం చెయ్యాలో తోచక స్నేహ ఇంటిముందు రోడ్డుమీద మట్టిపోద్దాం రావే అనిపిలిచా, అది పరిగెట్టుకు వచ్చింది.

రోడ్డుకు పక్కగా మట్టి పరిచాం దానిమీద భోగిమంటకి తయారుచేసాం ....

అప్పుడొచ్చాడు రాజేష్.

రాజేష్ ని చూసి లోపలికెళ్ళిపోయింది స్నేహ ...

అందరూ వచ్చి పలకరించారు.

"చంటమ్మ ఏదీ?"

"అది వస్తుందని నీకెలా తెలుసు?" అత్త,

"నే వస్తున్నా చాలా రోజులయింది నిన్ను చూసి ఎన్ని పన్లున్నా రారా "అని వుత్తరం రాసింది.

"మార్కెట్టుకి కెళ్ళారు."

"రాజేష్ చదువెలా వుంది?" అంటూ అడిగా .

"వంట చదువు కుదరడం లేదు."

"వంటేమిటి హాస్టల్లో లేవా?"

"లేదు ఓరూము తీసుకున్నా...",

"చెప్పలేదేం?" రజని ఆశ్చర్యం

"చెప్పడానకేముందక్కా ..."

వీడు రూముతీసుకు వేరేగా వుండడానికి చాలా బలమైన కారణం వుండే వుంటుంది. వీడికి ఈ సలహా ఎవరు చెప్పారు. అన్న ఆలోచనలు పొడిచాయి.

"నాన్నతో చెప్పావా?"

"ఇందులో చెప్పడానికి ఏముంది."

"నీకు పంపుతున్నడబ్బు సరిపోతుందా?"

"లేదు సరిపోటం లేదు కానీ ....................."

రాజేష్ మౌనం చాలా అనుమానాలకి దారి తీస్తోంది. కాని... ప్రతి విషయంలో నాతో, రజనితో అంత క్లోజ్ గా వుండే రాజేష్ .... అంతలా ఎందుకు మారాడు. అత్త సలహా లిస్తుందంటే నమ్మబుద్ధి కావడం లేదు. ఇక మిగిలింది రాజ్యంఅత్త ఇద్దరి మధ్యా వుత్తరాలు నడుస్తున్నాయంటే.... అనుమానమే.

ఈ లోగా రాజ్యంఅత్త, అన్నయ్యా వచ్చారు. ప్రకాశం వచ్చాడు.

"ఏరా బావున్నావా?" అంటూ రాజ్యంఅత్త రాజేష్ ని ప్రత్యేకంగా పలకరించింది. రాత్రి భోజనాలయ్యాయి. భోజనాల దగ్గర రాజ్యంఅత్త, "వదినా గాజులు కొత్తవా మిలమిలామెరిసిపోతున్నాయ్" అంది.

"అవును కొత్తవే" అంది అమ్మ ముభావంగా .

అమ్మ కొత్తగాజులు చేయించుకుందా నాన్నకి రాబడిబాగానే వుందా మరి మూడునెలల క్రితం డబ్బు సర్దుబాటు చెయ్యమని వుత్తరం రాసారే, సింహానికి, ప్రకాశానికి అలాగే రాసారని తెలుసు.

కానీ మేం మాకు వీలయింది మాత్రం పంపాం....అంతే కాని ఆయనకి అవసరమైంది పంపలేదు. ఇప్పుడీ గాజుల వ్యవహారం చూస్తుంటే డబ్బుకేం ఇబ్బంది వున్నట్టు లేదు.

నేనాలోచిస్తున్నట్టే ప్రకాశంకూడా ఆలోచిస్తున్నాడా? రాజేష్ గాడి ఆలోచన ఏమిటో తనతల్లి పేరవున్న పొలం రాబడి నాన్న వాడేసుకుంటున్నాడన్న వాడి ఆలోచనకి సపోర్టు దొరికినట్టయింది.

అందరి గురించి నేనాలోచించడం చిరాకేసింది. ప్రకాశంతో కలిసి వీధిచివరికి పోయా సిగరెట్టు అయిందనిపించికు, వచ్చేసరికి ఇంట్లో అమ్మ అన్నయ్య మాట్లాడుకుంటున్నారు. అయిన ఖర్చులు అందులో హెచ్చుతగ్గుల గురించి.....................

"రాజ్యంఅత్త చీర కొంచెం ఎక్కువఖరీదే...నేనేం అనలేకపోయా .."

"పోన్లే నచ్చిందా?" అమ్మ

"ఆ నచ్చదా! నేనెప్పుడో గాని రాను అంటూ ... క్రేప్ సిల్క్ చీర తీసుకుంది..."

"అదేమిట్రా అంత ఖర్చే .... అయినా నిన్ను దానితో పంపడం .... దాని తీరే అంత" అమ్మ నోటివెంట రాణి మాటలని మనం బేరీజు వేసుకోవచ్చు ......

కాసేపు చల్లగా వుంటుంది అని పెరట్లోకి పోయా, నూతిగట్టు దగ్గర అత్త, రాజ్యంఅత్త రాజేష్ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"వదినవి గిల్టుగాజులు.... క్రితంనెల అన్నయ్యకి  బాగా జబ్బు చేసింది. పెద్దవాడూ, సింహం పంపింది సరిపోలా అందుకు గాజులు తాకట్టుపెట్టింది. చేతులు బోసిగావుంటే బాగుండవని గిల్టుగాజులు కొని వేసుకుంటోంది." అంది అత్త.

రానురాను ఈ కుటుంబం మారుతోందా, ఏ విధంగా, దేని ఆధారాలు కదులుతున్నాయి. నైతిక, ఆర్థిక..., పునాదుల్లో మార్పు వస్తోంది. నన్ను చూసి టాపిక్ మార్చేసారు.

బోగి

తెల్లవారి మూడు గంటలకి అందరినీ లేపేసింది అమ్మ.

ఇంటికి పక్కగా రోడ్డుమీద కర్రలు పేర్చి పిడకలువేసి, అంతా తయారు చేసేసరికి, ఇంటిల్లిపాదీ లేచారు. నాలుగు గంటలకి చిన్నచిరుచలిలో భోగీమంట అందుకుంది. మంటపెరిగినకొద్దీ దానిసెగ బాగా తగులుతోంది, చిటపట్లు లేస్తున్నాయి.

తెల్లారేసరికి ఇంట్లో అందరి స్నానాలు అయాయి.

నాన్న అందర్నీ పిలిచి, కొత్త రూపాయి నోట్లు పదిపదిగా అందరికీ పంచారు. అందరం ఆయనకి నమస్కరించాం, ఆయన ఆశీర్వదించారు.

"చాలా ఏళ్ళనుండి కట్నం ఏం పెరగటం లేదు " అన్నాడు సింహం అన్నయ్య హాస్యంగా...

సమాధానం హాస్యంగా రాలేదు. "నా జేబుకి అనారోగ్యం అనే చిల్లుపడింది రా, ఈ సారికి దీనితో సరిపెట్టుకోండి"

పండగ వాతావరణం వచ్చేసింది. రంగు రంగు పట్టు పరికిణీలు అందరి ఇళ్ళ ముందు రెపరెపలాడాయి.

రథంముగ్గు, అష్టదళపద్మం, అరవైనాలుగు చుక్కలు, డెభ్బైఆరు చుక్కలు, అంటూ నిన్నజరిగిన చర్చల్లో సారాంసంగా ఇళ్ళముందు చిత్రవిచిత్రమైన ముగ్గులు వెలిసాయి.

రాజ్యం అత్త, పెద్ద అన్నయ్య, ప్రకాశం, నేను పేకాటకి కూర్చున్నాం.

పెద్దొదిన, చిన్నొదిన, రజని వంటగదిలో హడావిడిగా వున్నారు.

పేకాట చాలజోరుగా సాగింది. నయాపైసల్తో మొదలై రూపాయినోట్లు వరకూ వెళ్ళింది.

మధ్యలో సింహం అన్నయ్య వచ్చాడు. తనూ కూర్చున్నాడు.

పిల్లల భోజనాల తర్వాత, అమ్మ బలవంతంచేస్తే.., అందరం పేకాటనుండి లేచాం.

భోజనాలుఅవుతున్నాయి.

“అత్తా మావయ్య గూడా వచ్చివుంటే బావుండేది” అన్నా

“వొకటి రెండ్రోజులకి అంతదూరం నుండి రావడం కష్టం, ఎక్కువ రోజులకి శలవు దొరకదు”

భోజనాలుఅయాయి. తర్వాత కునుకులు.

సాయంత్రం నాలుగు గంటలకి బోగీపళ్ళ హడావిడి మొదలయింది.

-----------------

ఈ రోజు సంక్రాంతి.

నిన్న భోగీపళ్ళకి రాణిని పిలవలేదని సింహం అన్నయ్యకి బోగీనాడు సాయంకాలమే తెలిసింది. ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. సంక్రాంతినాడు ఇంతవరకు రాలేదు. భోజనాలు కునుకులు అయింతర్వాత, అత్త కాఫీ లిచ్చింది. అమ్మ స్నేహని తీసుకు పసుపు కుంకుమ పంచడానికి వెళ్ళింది.

అందరం కూర్చుని కాఫీలు తాగుతున్నాం..,

“స్నేహని చేసుకోడానికి, ఆయన బదరీ ఇద్దరూవప్పుకోవడం లేదురా అన్నయ్యా”

అందరికీ రాజ్యం అత్త ఎందుకొచ్చిందో అర్థం అయింది!

“దానికేమే...,కాకపోతే నేను నువ్వనుకున్నంత కట్నం ఇచ్చుకోలేను”

“కట్నంకాదు సమస్య...,మేనరికం మంచిదికాదని”

“ఇదేమిటి కొత్త తెలువులు పుట్టుకొస్తున్నాయి”

“మేనరికాలు మంచివి కావని సైంటిఫిక్ గా ప్రూవ్ చేస్తన్నారు,పిల్లలు సరైనవాళ్ళు పుట్టరని” ప్రకాశంతనవంతు లాజిక్ ఇచ్చాడు...,

“మరి రజనిని ప్రసాదుకి చేసుకున్నప్పుడు ఈతెలివితేటలు లేవే ఎవరూ ఏమీ మాట్లాడ లేదే. పైగా నువ్వు కాబట్టి మమ్మల్ని నీ నీడలో దాచావు అన్నయ్యా అన్న భావుకత వొకటి.”

నాన్నకి వళ్ళు మండిపోతున్నట్టు వుంది.

“అది నీ ఇష్టం అయి చేసావు నాన్నా”

“మీ సైన్స్ లో ఇష్టాఇష్టాలు కూడా వున్నాయేమిటి?”

“--------------------------“

“అయినా ఇందులో ఇష్టాఇష్టాలు ఎక్కడ్రా, ఈనాడు తప్పయినది, నిన్నా తప్పయివుంటుంది. రేపూ తప్పే కదా “

“అవును అది తప్పే”

“కొన్ని వందల ఏళ్ళ నుండి సాంప్రదాయంగా వస్తున్నది, రాత్రికి రాత్రే తప్పయిపోతుందా?...లేక తప్పు చేసేసారా?”

“అప్పుడు ఈ విషయం తెలీకా”

“ఇప్పుడు కొత్తగా తెలిసింది ఏమిటి? పిల్లల పుట్టుకలో తేడా వుంటుదనేనా? మనకి అవసరం అయినప్పుడు ఆధునిక ఆలోచన! లేనప్పుడు సంప్రదాయం, ఈ అవకాశవాదం ఇంతకుముందు మనలో లేదే?”

“------------”

“వంద మేనరికాల్లో పుట్టిన పిల్లల్ని చూసి చెప్పండి, ఎంతమంది తేడాతో పుట్టారో?”

"___________"

"రక్తం చెడకోడదని అన్నాచెల్లెళ్ళే పెళ్ళి చేసుకుంటారటగా ఈజిప్షియన్లు" అన్నాడు రాజేష్.

వాడిని చూసి నోరెళ్ళ బెట్టారందరూ, సింహం అన్నయ్య వుంటే వేరుగా వుండేది, అయినా రాజేష్ నాన్నకి సపోర్ట్ ఎందుకువెళ్ళాడో అర్థంఅవుతోంది.

"ఈ వెధవ ఆలోచనలు, జానాలు, మీ చదువులవల్లే వస్తున్నయా?" నాన్న చిరాకు

"అవన్నీ కాదులే అన్నయ్యా బదరీ ఇంకా చదువుదామనుకుంటున్నాడు. ఇప్పుడే పెళ్ళి వద్దంటున్నాడు.. "

నాన్న స్నేహని బదరీకి చేద్దామని అనుకుని వుంటాడు, అది రాజ్యం అత్తకి రాసుంటాడు, చిన్నత్తకి తెలుసు నాన్న దగ్గరనుండి కాసులేమీ రాలవని...,

ఈ సంభాషణ ముగియకుండానే అమ్మ స్నహ వచ్చేసారు.

"సింహం వూళ్ళో లేడా?" అమ్మ ప్రశ్న..,

"లేడు రాణీ పిల్లలతో అన్నవరం వెళ్ళాడు" ప్రకాశం సమాధానం

"అందుకే ఇల్లు తాళం పెట్టి వుంది" స్నేహ

పసుపు కుంకుమ పంచడానికి రాణి ఇంటికి వెళ్ళి వుంటారు. రాణిని నిన్న పేరంటానికి పిలవనందుకు ఇది బేలన్సింగ్ యాక్ట్ అనుకుని వుంటుంది. కానీ సింహం అన్నయ్యకి కోపంవచ్చి వాళ్ళందరితో అన్నవరం వెళ్ళి పోయాడు.

అయినా సింహం అన్నయ్య తనరెండో పెళ్ళాన్నికూడా ఈ వుమ్మడిలో భాగం చేద్దామని, ఆవిడకీ మర్యాదలు జరగాలని అనుకోడం.., అదేదో హక్కు మేమంతా కాదన్నట్టు, కోపగించుకోడం నాకర్థం కాలేదు.

"ఇంకా పంపకాలు మిగలి పోయాయి," అంటూ అమ్మ, స్నేహ వెళ్ళారు. నే పెరట్లోకి పోయా ........

"మీరూ ఎవరి ఆలోచనలోనేనా పడ్డారా?" అంటూ వచ్చింది రజని.

"నువ్వు అవకాశమిస్తేనా..... ఇంకెవరి గురించేనా ఆలోచించడానికి"

"నేనేం చేసానూ?"

"చిన్నప్పటినుండి బావా..బావా అంటూ వదిలితేనా"

"ముద్దు పెట్టుకున్నప్పుడూ, చాటుగా వడిసి పట్టుకున్నప్పుడూ, మరదలు పనికొచ్చిందే..., ఇప్పుడు ఎందుకో ఈ దెప్పుడు"

"అక్కా తమ్ముళ్ళు ఇద్దరూ గట్టివాళ్ళే..."

"ఏం అన్నాతమ్ముళ్ళు గట్టివాళ్ళు కారా..."

"స్నేహ బాగానే వుంటుంది కదా..... నలుగురన్నదమ్ములం ఏదో సాయం చేద్దుము కదా"

"ఈ మాట పెళ్ళిమాటలప్పుడు ఏ అన్నదమ్ముడూ అనలేదేం"

"ఎందుకు అక్కడ అనాలా?"

"మరి..,మావయ్య పెళ్ళి మాటలు మాట్లాడితే, బాధ్యత అంతా ఆయనదే..,ఆయన పెద్దగా వెనకవేసింది లేదు కాబట్టి...పెళ్ళి ఆయన తాహతుకి తగినట్టుగానే వుంటుంది..అంటే స్నేహ పెళ్ళి మావయ్య కూతురిగానే జరుగుతుంది, తప్ప నలుగురు సంపాదనకలిగిన అన్నదమ్ములచెల్లెలుగా వుమ్మడి బాధ్యతతో మాత్రం జరగదు"

"ఎందుకలా అనుకుంటున్నావు "

"మీనలుగురూ ఎప్పుడైనా మావయ్యతో స్నేహ బాధ్యత గురించి ఆలోచించారా? లేదు, ఎందుకు అది మీబాధ్యత అని మీరనుకోలేదు"

"అలా నుకోవాలా"

"అనుకోనక్కర్లేదా?"

"ఏమో?"

"ఏమో కాదు, మీ చదువులకి మీ ఎదుగుదలకి మావయ్య చేస్తున్న ఖర్చు మీ హక్కుగా భవించలేదా?"

"వురుము వురిమి మంగలం మీద పడిందట"

"వురుము ఇంకా వురమలేదు, రేపు వురుముతుంది, మావయ్యమీద పడుతుంది"

నేనేదో అడిగేలోగా, బాబు ఏడుస్తున్నాడంటూ, రజని వెళ్ళిపోయింది.

మేం నలుగురు అన్నదమ్ములం లౌక్యంగా స్నేహ బాధ్యత మాది కాదన్నట్టు ప్రవర్తించామా?..,ఎందుకో అవుననే అనిపించింది. నాన్న మాతో ఈ విషయం ప్రస్తావిద్దామని చూసారు. మేమెవరం ఆసక్తి చూపలేదు.

అంతవరకూ వస్తే నాన్న జబ్బుకి చేసినట్టు తోచినసాయం చేసుండేవాళ్ళమే కానీ, నాన్న అవసరానికి కావలసిన సాయం చెయ్యకపోయుండేవాళ్ళం మేమో?.

నాన్నకి స్నేహ పెళ్ళికూడా వొక జబ్బేనా?

రజనికి మేం సరిగ్గా స్పందించలేదు  అన్న ఆలోచన ఎలా వచ్చింది.  నాన్న జబ్బుకి నాన్న ఆసించిందానికన్న తక్కువ పంపండంవల్లా? లేక ఆడపిల్లగా ఆలోచించిందా?

స్నేహకూడా ఇలాగే ఆలోచిస్తుందా?

మిగతావాళ్ళు కూడా ఇలాగే ఆలోచిస్తున్నారా? ఎవరూ ఎందుకు బయట పడరు. బయటపడీ లాభం లేదనా?

నాన్న లౌక్యంగా రాజ్యం అత్తని అడిగాడు. రాజ్యం అత్తకూడా లౌక్యంగా తిరస్కరించింది.

ఈ ఘటనలో నిజం ఎంత? రాజ్యం అత్తకి స్నేహ ఇష్టం లేదా? నాన్న ఆర్ధికపరిస్తితి నప్పలేదా? బదరీ నిజంగానే చదువుకి పెళ్ళి పెళ్ళి అడ్డు అనుకున్నాడా? లేక ఇంకేదైనా కారణం వుందా?

అమ్మ స్నేహ రావడంతో అందరూ భోజనాలకి తయారయారు.

---------------

మర్నాడు కనుమ

పొద్దున్నే కనుమస్నానాల హడావిడితో మొదలయింది. కనుమనాడు మినువు తినాలి అంటూ అమ్మ గార్లు పెరుగుగార్లు, చేసింది. భోజనాలవరకూ, ఎవరూ ఆగలేదు, రాజేష్, రజని, స్నేహ, వేడిగా బలేగా వన్నాయి అంటూ, తలోప్లేటు, తెచ్చారు, చిన్నా పెద్దా అనిలేకుండా, అందరూ రెండేసి ప్లేట్లు, తిన్నారు. దాంతో భోజనాలు లేటయ్యాయి.

సరిగ్గా భోజనాల టైముకి సింహంఅన్నయ్య వచ్చాడు.

"ఎక్కడకి పోయావురా రెండురోజులు కనపడ్డదు." అన్నారు నాన్న...,

అన్నయ్య సమాధానం చెప్ప లేదు. చెప్పడం ఇష్టం లేకో తెలీదు. నేను సర్వ స్వతంత్రుడిని, సమాధానం చెప్పవలసిన అవసరం లేదనుకున్నాడేమో. మేమంతా స్వతంత్రలమా బైటకి అలాగే కనిపిస్తున్నా ఏదో తెలీని బంధం పెనవేసి వుమ్మడిగా వుంచింది, వుమ్మడి అంటేనే తల్లీదండ్రులకి వొక అథారిటి, పెట్టి పోతలకో డిమాండు, పెళ్ళి పేరంటాలు వో బాధ్యత, అయి కూర్చుంటాయి. ఇందులో పరిధుల్ని గుర్తించడం కష్టం, ఎందుకంటే పరిధులు, చాలా నాజూకుగా వుంటాయి. సింహం అన్నయ్య ఆ నాజూకుని గుర్తించలేదు. అలాగని సర్వ స్వతంత్రుడిని అని ప్రకటించి తెగతెంపులు చేసుకోనూ లేదు, మేనేజ్ చేస్తున్నాడు.

రాణి సంగతి సింహం అన్నయ్య పెళ్ళి తర్వాతే తెలిసింది. వదినే సమాధాన పడినప్పుడు, మేమెవరం ఆ వూసు ఎత్తడానికి, సింహం అన్నయ్య కులంలో అమ్మాయినిని పెళ్ళి చేసుకుని, రాణి సమస్యని పరిష్కరించుకున్నాడు.

మధ్యాహ్నం భోజనాల హడావిడి మొదలైంది... ఆతర్వాత పడకలు..,

---------------

నాన్న ఏదో గట్టిగా అనడం వినిపించి లేచాను.

వసారాలోకి వెళ్ళేసరికి....,

నాన్న పడకకుర్చీలో..,దూరంగా రాజేష్ నిలబడి వున్నాడు. పెద్దన్నయ్య క్కడే కూర్చుని వున్నాడు. రాజేష్ నాన్నతో అమ్మని నాతోతీసుకెళ్తనన్నాడట...,

"నువ్వు తీసికెళతావు సరే అది వస్తుందా?" అని పెద్దత్తని పిల్చాడు.

పెద్దత్త చేతులు తుడుచుకుంటూ వచ్చింది. వెనకే రజని వదినలు, సింహం, ప్రకాశం అందరూ వచ్చారు, అమ్మ తప్ప....,

"ఏమే వాడు నిన్ను కాకినాడ తీసుకెళతాడట.., వెళ్తావా?"

"అదే నాతోనూ అన్నాడు అన్నయ్యా" అంది పెద్దత్త.., అంతే గానీ.., తను వెళ్తుందోలేదో చెప్ప లేదు.

"వాడి సంగతి సరే... నీ కిష్టమేనా?"

"ఇందులో ఇష్టా అయిష్టాలు ఏమున్నాయి అన్నయ్యా. వాడికి అవసరంగా వుందేమో అనిపించింది."

"అంటే వెళ్తవన్న మాట.."

అత్త మౌనం..,

"అక్కడ వుండటానికి మరికొంప.., సామాన్లు అవీ కావాలిగా "

"మా అత్తారింటివి, ఆ కొట్టుగదిలో పడి వున్నాయిగా మార్చేస్తే మాకుసరిపడా సామానులు వచ్చేస్తాయి"

"ఆలోచించే పెట్టు కున్నావన్న మాట., వేరెళతానంటావు"

పెద్దత్త లౌక్యం అంతవరకే, నాన్న చెప్పినట్టు ఈ ఆలోచన ఎప్పటినుండో జరుగుతోంది. తెలియని వెర్రి వాళ్ళం అల్లా నేను రజని, నాఆలోచన్లో నే వుండగానే, రాజ్యంఅత్త పెద్దత్తకి మద్దతుగా "ఇందులో వేరెళ్ళడంకలిసుండడం ఏమిటి అన్నయ్యా ఏదో అవసరానికి వెళ్తానంటోంది అవసరం అవగానే తిరిగి వచ్చేస్తుంది"

"వాడికి తల్లి అవసరం వాడి పెళ్ళి అయేవరకు వుంటుంది"

"--------------"

"మరి నీ భూమి మీద వచ్చే ఫలసాయం మీఇద్దరికీ సరిపోతుందా"

ఎవరూ మాట్లడలేదు, నాన్న అసహనం అందరికీ అర్ధం అయింది. నాన్నని శాంత పరుద్దామనుకున్నాడో ఏమో రాజేష్ "మావయ్యానువ్వవప్పు కుంటే స్నేహని పెళ్లి చేసుకుంటాను "

అక్కడి వాతావరణంలో అగ్ని పర్వతం బద్దలైంది.

లావా ఎటు మళ్ళుతుందో...... ఈ మాట చెవిని పడగానే అమ్మ లోపలినుండి వచ్చింది.

నేను రజని వేపు చూసాను. రజని ఆశ్చర్యానికి అంతులేదు.

అందరికన్నా ముందు తేరుకున్నది నాన్న.

"అది నీకన్నా రెండేళ్ళు పెద్దది తెలుసా?"

"అయితేయేం "

"వరహీనం కాదా?"

"అంటే?....."

“అవును నిజమే వయసు తక్కువైనంత మాత్రాన చేసుకోకూడదా?” .....ప్రకాశం

“చేసుకోవచ్చు ఎందుకు చేసుకోకూడదు ......తెలిసిన వాళ్ళు ....అనగలిగిన వాళ్ళు మొహం మీద వుమ్మేస్తారు” ...నాన్న

“ఎవరి సంగతో మాకెందుకు? మీ ఇష్టాఇష్టాలు చెప్పండి”

“మా ఇష్టా ఇష్టాలు మాత్రం నీకెందుకు?”...నాన్న

రాజేష్ నుండి మాట పలుకూ లేదు.

సింహం అన్నయ్య అప్పటి వరకూ మౌనంగా వున్నా రాజేష్ బాసటగా వస్తూ “ఈ లేనిపోని ఎథిక్స్ మనం కల్పించుకున్నవే..........”

“వీటిని ఎథిక్స్ అంటారా మరి సంస్కృతి అని దేన్ని అంటారో?”

“ఇది సంస్కృతా?”

“మరి పచ్చిమాంసం తినక పోడం, వండుకు తినడం అన్న రెండింటిలో సంస్కారం లేదా? జంతు స్వభావం నుండి బయటపడడం కాదా? ఇదీ అంతే జంతువులకి జత కట్టడానికి, ఆహారానికి అనుభూతి సరిపోతుంది.

మనకి విచక్షణ వుంటుంది అది మన సంస్కారం బట్టి వుంటుంది. ఈజిప్ట్ లో అన్నాచెల్లెళ్ళు పెళ్లిచేసుకున్నారని, ఇడిపస్ కాంప్లెక్స్ గ్రీకులలో వుందని, ఎలెక్ట్రా కాంప్లెక్స్ ఆంగ్లో సాక్సేన్ లో వుందని, అనే ఎంగిలి సంస్కారం ఎంతవరకూ సమంజసం. ఈ సమాజం ఎన్ని సంస్కరణలకు లోనై, ఈ దశకి చేరుకుంది. దీని వెనకాల యెంత ఆలోచన వుంది. ఈ విషయాన్ని సగం మెదడుతో ఆలోచించి ఇదింతే అదంటే అంటే, సరిపోతుందా? అందుకే ప్రపంచం వొక సహజ జీవనానికి అలవాటు పడ్డట్టుగా, నీలేనిపోని సూత్రాలకి లొంగదు. ప్రపంచంలో కుడిచేతి వాటం వాళ్ళే ఎక్కువ, వాళ్ళకోసమే ప్రపంచం ఎడమచేతి వాళ్ళు తక్కువ వాళ్ళ ఆలోచనలు తక్కువే.

నేను స్నేహ పెళ్లి రాజేష్ తో చేస్తే, ఏదో చేతకాక వదిలించుకోడానికి చేశానంటారు. అదే ఏ వయసు యే ఎక్కువ వయసు ఉన్నవాడితో చేసినా అలాగే అంటారు. ఈడూ జోడూ చూసి చెయ్యాలంటే, నా ఆర్థికస్తోమత సరిపోదు. ఈ కుటుంబ వ్యవస్థ, ఈ సాంఘిక కట్టుబాట్లు యెంత వత్తిడి నిస్తున్నాయో! అంత రక్షణ కూడా నిస్తున్నాయి.”

“ఏమిటి రక్షణ వొత్తిడే కనిపిస్తోంది”

“నామీద వొత్తిడి కనిపిస్తోంది కానీ స్నేహకి అది రక్షణ కాదా? ఆమెకి న్యాయం చేద్దామన్న వత్తిడి”

“జంతు ప్రవర్తననుంచి ఎదగడం వొక నియమనిష్ట పాటించడం సంస్కారం అయితే, మేనరికాలు చేసుకొని హిందుస్తానీ వాళ్ళు , మనకన్నా సంస్కారం వున్నా వాళ్ళు కదా” అంది రాజ్యం అత్త.

“ మన జీవితం మనం జీవించడానికి కూడా ఏదోలేని దాన్ని ఊహించుకు భయపడడం సంఘం నియమం అనే గిరి గీసి గిరికున్న పరిధుల్ని చూసి భయపడడం నాకయితే అర్థంలేదనిపిస్తోంది.” అన్నాడు సింహం

“ఏమిటిరా అర్థం లేనిది, నువ్వు ఈదేశంలో పుట్టావు, ఈ వూరిలో పుట్టావ్, ఈ ఇంట్లో పుట్టావ్, ఈ సంస్కృతిలో పుట్టి పెరిగావ్...... వీటికి వేటికీ పనికిరానంత తెలివితేటలు కుదుర్చుకు అది వ్యక్తి స్వేచ్ఛ అంటున్నావు. అలా కాకుండా ఈ కట్టు బాట్లుకి, కట్టు బద్ధ వాళ్ళని చేతకాని వాళ్ళు, అనుకుంటున్నావు. అంటే తేడా.....!”

ఎవరూ మాట్లాడ లేదు. ఆయన ఎవరి గురించి అలా అంటున్నారో అర్థం అయిపొయింది.

ప్రకాశంకి అర్థం అయిపొయింది. “ మధ్యలో నా విషయం ఎందుకు?” అన్నాడు చిరాగ్గా

నాన్న అంతకంటే చిరాగ్గా “ మరేవరి గురించి మాట్లాడాలి. నీకేన్నో సంబంధాలోస్తున్నాయి. నువ్వు తలొంచితే స్నేహ పెళ్లి సజావుగా జరిగిపోతుంది. రాజేష్ కి స్నేహ పెళ్లి విషయం ఎత్తే ధైర్యం వుండకపోను. నాకీ మనస్తాపం వుండకపోను. అలా కాదె అందరూ జ్ఞానులే, స్వజనులకి ఒక కుటుంబానికి పనికి రాని జ్ఞానం...”

“ అందుకే ఆడపిల్ల పట్ల కూడా మార్పు రావాలి “

"ఆడపిల్లలో ఎన్ని మార్పు లొచ్చినా....ఆడది అన్న దృష్టిలో మార్పు రాదురా! మగాడికే కాదు ఆడదానికి కూడా......"

ఈ మాట ప్రకాశాన్ని, సింహాన్ని,రాజ్యాన్ని ఉలిక్కి పడేట్టు చేసాయి.

" అంటే మిగతావన్నీ నేలవిడిచి చేసే సాములు చూడ్డానికి బావుంటాయి. ఈ సమాజంలో అన్ని రకాల ఆలోచనలు వుంటాయి. అన్ని రకాల మనుషులూ వుంటారు. కానీ సామాన్యంగా కుటుంబం మౌలికంగా వుండే సమాజం మనది. ఇక్కడ కుటుంబం, మనం అన్నింటికీ మించి,.......వ్యక్తి స్వేచ్ఛ లేదా అంటే వుంది. కానీ దాన్ని నేను ప్రశ్నించనంత వరకూ, నీ స్వేచ్ఛని సమాజం వొప్పుకుంటుంది. అలా వొప్పుకోవాలనే నువ్వు నా అనుమతి అడిగావు. ఎందుకు? నీలో దాగి వున్న సంస్కారం వల్ల ఆ సంస్కారం ఈ నేల ఈ జీవితం నీకు నేర్పింది. నీకు దీని పుట్టు పూర్వోత్తరాలు తెలియవు అక్కరలేదు కూడా, అదే ఈనేల సంస్కార స్వభావం. ఇంక వ్యక్తి స్వేచ్ఛ లేదా అంటే వుంది.....ఇచ్ఛ వేరు.... స్వేచ్ఛ వేరు. ఇచ్ఛ విస్సృఙ్ఖలత్వం కింద మారకుండా, ఈ కుటుంబం కట్టుబాటు కాపాడుతుంది.

సింహం చేసింది అసాంఘికమా? తప్పా? వొప్పా? అన్న ప్రశ్న వచ్చినప్పుడు కుటుంబం అతన్ని ఎంతవరకూ స్వీకరించింది, అన్న దాని మీద ఆధారపడి వుంటుంది. కుటుంబం అనే వొకట్టుబాటుకు నేను బానిసని అని మీవుద్దేశం. మీస్వేచ్ఛకి నేను అడ్డురాకోడదు. రాను కూడా కానీ మీ విశృంఖలతకు అడ్డు వస్తాను. తప్పదు. విశృంఖలత స్వేచ్ఛ కాదు.....అదే స్వేచ్ఛ అని వాదిస్తే .....చేసేదేమీ లేదు ఘర్షణ తప్పు!.....

పెద్ద పండగ వెళ్లి పోయింది.

***

## సింహం మాట్లాడింది

రవి కొప్పరపు

గత పది రోజులుగా ప్రపంచమంతా ఒకటే ప్రధానమైన వార్త. సింహం మాట్లాడింది. నమ్మలేకుండా ఉన్నా కాని అదే నిజం. టీవీల్లో కూడా చూపించారు. ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది. మూగ జీవాలు మాట్లాడటమేంటి? మనుషులే సరిగ్గా మాట్లాడరు. మహా అయితే రామచిలుకలు మనమేమి నేర్పితే అవి చెప్తాయి తిరిగి. కాని ఈ సింహం అలా కాదు. స్వంతంగా మాట్లాడుతోంది. మీ అందరికీ ఒక అనుమానం రావచ్చు. ఏ భాష ? ఇంగ్లీషే. మాట కూడా సింహ గాండ్రింపులా వున్నాయి కాని అర్థం అవుతోంది. ఎక్కడుందీ సింహం? టాంజానియాలో (ఆఫ్రికా లో దేశం) వున్న ఒక జూలో. అసలెవరితో మొదట మాట్లాడింది? పది రోజుల క్రితం, ఆ జూలో పనిజేసే ఎవరో రోజు బోను శుభ్రపరిచి భోజనం పెడతాడు. ఆ రోజు అలానే చేస్తే, సింహం సూటీగా చూస్తూ మాట్లాడిందట. అతను భయపడి పారిపోయి, తన పై అధికారులతో చెప్తే, అలా అలా అందరికీ తెలిసింది.

ఆరా తీస్తే కొన్ని విషయాలు తెలిసాయి. ఆ సింహం పుట్టినప్పుడు నుండీ ఎవరో ఒక బ్రిటీషు జంతు శాస్త్రవేత్త సింహాలు, కోతుల రకాలు మీద పరిశోధన చెయ్యడానికి టాంజానీయా వచ్చి దగ్గరుండీ పెంచిందట. ఈ సింహం, ఇంకో చింపాంజీ, ఒక గొరిల్లా పిల్లలను దగ్గరుండీ కొన్ని సంవత్సరాలా పాటు పరిశోధన చేసిందట. ఏమో, అప్పుడేమైనా నేర్చుకుందేమో సింహం? పత్రికల వాళ్ళు వెంతనే ఆవిడ ఎక్కడుందో కనుక్కొని వివరాలడిగారు. మీరేమైన నేర్పించారా? సిమ్హమే ఎందుకు మాట్లాడుతోందీ? మీరైమైన మందులిచ్చారా మాట్లాడటానికి? ఆవిడ తను కేవలం తన భాషలో వాటితో మాట్లాడానని, ప్రత్యేకమైన శిక్షణ ఏమీ ఇవ్వలేదని, అసలు తను భాషా నిపుణురాలు కానని, జంతు శాత్రవేత్తనని చెప్పింది. కాకపోతే తను ఆ

జంతువులతో దాదాపు ఎనిమిది సంవత్సరాలు పని చేసానని, అప్పుడేమైనా అవి నేర్చుకొని ఉండొచ్చొని చెప్పింది. అంతకు మించి, తన పరిశోధన తప్ప ఏమీ తెలియదని చెప్పింది.

సింహం చెపుతోంది ఒకటే "ఈ భూమ్మీద వున్న దేశాధ్యక్షులతో మాట్లాడాలి" అని. ఎవరైనా ఏమడిగినా అదే సమాధానం. వారం నుండీ అందరూ తర్జన భర్జనలు పడుతున్నారు, ఏం చెయ్యాలని. అసలు సింహం మాట్లాడటవేంటీ, అది దేశాధ్యక్షులు వినడటమేమిటి...నాన్సెన్స్. అది కేవలం ఐక్యరాజ్య సమితి లోనే సాధ్యం. ముందు మధ్యవర్తులు, చిన్న అధికారులతో విషయం చెప్తే, పైకి తీసుకెళతామన్నారు. చివరికి అడిగీ అడిగీ, సింహం ఒకటే చెప్పింది "వెళ్ళే సమయం వచ్చింది" అని. ప్రపంచం విస్తుపోయింది. ఎక్కడికి వెళ్ళే సమయం, ఎవరు వెళ్ళే సమయం? అదెప్పుడు? ఇంకేమీ అడిగినా మళ్ళీ అదే సమాధానం. ఇంక టీవీల్లో వాటిల్లో దీని గురుంచి 'నిపుణుల ' చర్చలు. శాస్త్రీయంగా సిమ్హానికి మాట్లాడే అంగాలు, అవయవాలు లేవని ఒకరంటే, ఒక పక్క సిం హం మాట్లాడుతూ వుంటే అదసలు జరగదని అంటారేంటని ఇంకొకరు. ఇదేమైనా టాంజానియా ప్రభుత్వం ప్రపంచ దృష్టిని ఆకర్షించి, పర్యాటక ఆదాయం పెంచుకునే పన్నాగమేమో అని కూడా ఇంకొక ఆలోచన. ఆ ప్రభుత్వం తమకేమీ సంభంధం లేదని, కావలంటే అనుమతి తీసుకొని పరీక్షించుకోవచ్చని చెప్పారు. ఇటువంటి సంఘటన తమ దేశంలో జరగడం వల్ల తమకే ఉపయోగమని గ్రహించి, ఆ జూ కి భద్రత పెంచారు.

చివరికి సమితి ముందు తీసుకు రావడానికి ఏర్పాట్లు జరిగిపోయాయి. సింహాన్ని ఒక బోను లో వుంచి సమావేశానికి తీసుకొచ్చారు. భద్రత కట్టుదిట్టంగా ఉంది. సమితిలో అంతా దేశాధ్యక్షులు రాలేదుకాని, వారి ప్రతినిధులు కొంత మంది వచ్చారు. ఇంకొంత మంది అసలు రాలేదు, ఎవ్వరినీ పంపలేదు. ఇదేదో వ్యర్ధమైన సమావేశమని వాళ్ళ ఉద్దేశ్యం. ఏదో సింహం గాండ్రింపులు విని దాని మాటలు వినడమేమిటి? వేరే అత్యవసర పనులున్నాయ్ దీనికన్నా. టీ వీల్లో చూడొచ్చు కావాలంటే.

వివిధ దేశాలా వార్తా ఛానెళ్ళు ప్రసారం చెయ్యడానికి వచ్చారు. అందరూ ఆసక్తిగా చూస్తున్నరు. అంతా సిద్ధమయ్యింది. సమితి అధ్యక్షులు మొదట మాట్లాడారు.

"నేను మాట్లాడేది నీకు అర్థం అవుతోందా?" అని సింహాన్ని చూస్తూ అడిగారు.

సింహం అటూ, ఇటూ చూసి గర్జించింది "అర్థం అవుతోంది"

చిన్న కలకలం సమితిలోనూ, బయట కూడాను. మొదటిసారి ప్రపంచమంతా ఒకేసారి వినడం. అది కూడా ఒక కొత్త ప్రశ్నకు సమాధానం.

"సరే, ముందర అందరూ అనుకుంటున్న ముఖ్యమైన ప్రశ్న. అసలు నువ్వెలా మాట్లాడుతున్నావ్? అది కూడా మనుషులు మాట్లాడే భాష? మా శాస్త్రవేత్తల అంచనా ప్రకారం నీకు మాట్లాడే అవయవాలు అసలు లేవు కదా?"

కొద్ది సేపు మౌనం సింహం నుండి....తరువాత సమాధానం.

"నేను మీలా మాట్లాడటం లేదు, నా గాండ్రింపులే మీ భాషాలో మీరు చేసే శబ్దాలు పోలి వుండేలా మార్చుతున్నా. అందుకని నాకు ప్రత్యేకమైన అవయవాలు అక్కర్లేదు. అలా చెయ్యడానికి కొంత సమయం పడుతుంది. అందుకనే మీరు అడిగే ప్రశ్న కు నేను వెంటనే సమాధానం చెప్పలేను"

"పరవాలేదు. సమయం తీసుకొనే చెప్పు. మాట్లాడటం సరే, అసలు మేము చెప్పేది అర్థం చేసుకోవాలంటే కూడా మెదడు పరిణితి చెంది వుండాలి కదా?"

"లేదని మీరనుకుంటున్నారు. అందులో మీ తప్పేమీ లేదు. తమ ప్రవర్తన, జీవించే విధానం విభిన్నంగా వుంటే అది అర్థం కాక పరిణితి చెందలేదని అనుకుంటారు. మేము కూడా మిమ్మల్ని చూసి, అసలు మీరు బుద్ధి జీవులేనా అని అనుకుంటున్నాము"

"మేము అంటే?" అడిగారు అధ్యక్షులు.

"జంతు జాతి. మీరు కూడా జంతువులే, కాని మీకు అది అర్థం కావడం లేదు."

"సరే, అసలు మా భాష ఎలా నేర్చుకున్నావ్?"

"ప్రతి జంతు జాతి లో కొన్ని జంతువులకి వేరే జాతుల భాష అర్థం అయ్యే సామర్ధ్యం వుంటుంది. నా మటుకు, చిన్నప్పుడు ఒక శాస్త్రవేత్త దగ్గర పెరిగాను. దాని మూలంగా మీ భాష తెలిసింది. అదృష్టం కొద్దీ నాకు మిగతా జంతువుల భాష అర్థం అయ్యే సామర్ధ్యం, తిరిగి సమాధానం చెప్పే సమర్థత వచ్చింది. మీ లాగే మిగతా కొన్ని జంతువులతో కూడా నేను మాట్లాడగలను. మీరు జూ కి వెళ్ళినప్పుడు కొన్ని సార్లు మా సింహాల గాండ్రింపులు వింటూంటారు. మేమేదో ఊరికే చేస్తున్నామని మీ ఉద్దేశ్యం. కాని ఆ గాండ్రింపుల తో మేము పక్షుల తోను, మిగతా జంతు జాతి తోను మాట్లాడుతున్నాం"

"అంటే నీ లాగే మిగతా జంతువులు కూడా మా భాష మాట్లాడ గలవా?" అనుమానంగా అడిగారు అధ్యక్షులు.

"ఉండొచ్చు, కాని అవి నన్ను ఎన్నుకున్నాయి మీతో మాట్లాడటానికి"

మళ్ళీ కలకలం. జంతువులు ఎన్నుకోవడేమిటి?

"అంటే?" ఎవరో అడిగారు.

"మీ ఉద్దేశ్యంలో సింహం అంటే రాజు, అధిపతి. మీ సంస్కృతి లోను, మీ దిన చర్యల్లో సింహం అంటే ప్రభావితం చేసే శక్తి, గౌరవ మర్యాదలుండే చిహ్నం. అందుకని, ఇంకేమైనా జంతువుని పంపిస్తే వినరేమోనని నన్ను ఎన్నుకున్నారు"

"ఏం వినాలి?"

"మిగతా జంతు జాతుల నుండి ఒక సందేశం. ఒక హెచ్చరిక అనుకోండి. అది మిమ్మల్ని బెదిరించే హెచ్చరిక కాదు. జరిగే వాస్తవానికి అద్దం పట్టే సందేశం. అందరినీ, అంటే మిమ్మల్నీ, మమ్మల్నీ ప్రభావితం చేసే సంఘటనలు జరుగుతున్నాయి, జరగబోతున్నాయి"

"ఏంటవి?"

కొద్ది సేపు మౌనం మళ్ళీ. ఏమయ్యిందో నని అందరూ చూస్తున్నారు.

"ఇంకొద్ది కాలంలో మీరూ, మేము అంతరించబోతున్నాము"

ఒక్కసారిగా సమితి సభలో పెద్ద కలకలం. అధ్యక్షులు సభను మళ్ళీ శాంతపరిచేందుకు సమయం పట్టింది.

"ఎవరు చెప్పారు నీకు? ఇంకెంత కాలం?"

సిం హం మళ్ళీ మౌనం. కొన్ని క్షణాల తరువాత కూడా సమాధానం రాకపోయేసరికి మళ్ళీ అడిగారు.

"ఆగిపోయావేం? చెప్పు"

"ఇప్పుడు మీరడిగిన ప్రశ్నకి, నేనిప్పుడు సమాధానం మొదలుపెట్టే దానికి ఎంత సమయం గడించిందో అంత కాలం"

ఎవరికీ అర్థం కాలేదు.

"అది కేవలం కొన్ని క్షణాలే కదా. అంటే, ఇంకొన్ని క్షణాల్లో అంతరిస్తామా?"

"కాదు. ఒకటి చెప్పండి. మీకు ఇది కొద్ది క్షణాలే కదా. దేనితో పోలిస్తే? మనిషి ఆయుర్దాయం దాదాపు ఎనభై సంవత్సారాలు. ఈ ఎనభై సంవత్సారాల్లో ఎన్ని క్షణాలు వుంటాయి? కోటాను కోట్లు కదా? అంటే మీరు ఎనభై సంవత్సారాలు జీవిస్తారనే బదులు కొన్ని కోట్ల క్షణాలు జీవిస్తారని చెప్పొచ్చు కదా? మరి ఆ కోట్ల క్షణాల ముందు, నేను సమాధానం చెప్పటానికి తీసుకునే కొద్ది క్షణాలు అసలు లెక్క లోకి రాదు కదా?"

"అవును"

"అలాగే ఈ భూమి వయస్సు కోట్లాది సంవత్సరాలు. మీకు తెలుసు. ఆ వయస్సు ముందు మనమందరం అంతరించే సమయం లెక్కలోకి రాదు. అందుకే కొద్ది కాలంలో అన్నాను"

"అసలు అంతరించడం ఏమిటి?"

"మీకీ పాటికే తెలిసే వుంటుంది. ఈ భూమ్మీద ప్రతి రోజూ రక రకాల జాతులు అంతరించిపోతున్నాయి. మామూలుగా అయితే అది సర్వ సాధారణం. ఎన్నో కోట్ల సంవత్సారాల ముందు నుండి జరుగుతున్నదే. కాని మీ మానవ జాతి వచ్చి నప్పటి నుండి అది వేగవంతమైంది. ఎంతో కాలం వుండగలిగే జాతులు కూడ కేవలం కొద్ది సంవత్సారాలలో అంతరిచిపోతున్నాయి. అది మీకు పట్టట్లేదు. ఎందుకంటే అది మీకు పెద్ద ఉపద్రవం లాగా కనిపించట్లేదు. వాతావరణం వేడెక్కి, మీలో కొన్ని దేశాలు నివాసయోగ్యం కాని పరిస్థితులు వచ్చినా మీరు మారట్లేదు. ఇది ఇలానే సాగితే, మీతో పాటు మేము అంతరిస్తాము"

"ఎంత కాలం?"

"మా జంతు జాతి అంచనా ప్రకారం, మీరు ఇలానే సాగిస్తే, ఇంకో వందేళ్ళలో తొంభై శాతం జంతు జాతి, యాభై శాతం మానవ జాతి నశిస్తుంది"

మళ్ళీ చిన్న పాటి కల కలం.

అధ్యక్షులు ఎవరో ఇచ్చిన పేపరు ఒకటి తీసుకొని, దాన్ని చూస్తూ చెప్పారు.

"మా శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, ఇంకో అయిదు వందల సంవత్సరాలు వుంది నువ్వు చెప్పినవి జరగడానికి. నీ లెక్క ఎలా వచ్చింది?"

"మీ శాత్రవేత్తలు అన్ని చోట్లా, అన్ని కాలాల్లో వుండలేరు. కాబట్టి వాళ్ళకి జరిగుతున్నది తెలిసేది కొంత మాత్రమే. మాకు అన్ని జంతువుల దగ్గర నుండి విషయాలు ఎప్పటికప్పుడు తెలుస్తాయి. అందుకే మీకు వాస్తవం చెబుతున్నా"

"వివిధ ప్రాణులు అంతరించే విషయాలు మాకు తెలుసు. దానికి తగ్గ నివారణ పధకాలు ఇప్పటికే మొదలు పెట్టాము. భూమి ఇంకా వేడెక్కకుండా వుండాడానికి చర్యలు తీసుకుంటున్నాము." అధ్యక్షులు చెప్పారు.

"మీరు తీసుకున్న నిర్ణయాలు మంచి ఆరంభం. కాని దురదృష్టవశాత్తు ఇప్పటికే ఆలశ్యం అయిపోయింది. ప్రాణులు అంతరించడం అనేది ఈ భూమికి సాధారణం. ఎన్నో సార్లు జరిగింది. అసలు రాక్షస బల్లులు అంతరించినందుకే కదా మీరు, మేము వచ్చింది. ఇప్పుడు మన వంతు. మనం వెళ్ళిపోయిన తరువాత కొత్త జాతులు పుట్టుకొస్తాయి. ఇది నిరంతర చక్రం. కాకపోతే ఇంతకు ముందు అంతరించడానికి కారణాలు భూకంపాలో, ఉల్కా పాతమో, అగ్ని పర్వతాలో. అన్నీ జీవం లేనివే జీవుల్ని అంతరించాయి. ఈ సారి జీవులే మిగత జీవులు అంతరించడానికి కారణం. ఆ కారణం కూడా మీకు తెలుసు. అది మీరే "

"అంటే ఏంటి, భయపెడుతున్నావా?"

"కాదు, మీకు ముందే చెప్పాను. వాస్తవం లో జరిగే హెచ్చరిక అని. దీన్ని మీరు బెదిరింపు గా తీస్కోవద్దు. అందుకే నన్ను పంపించారు. నా మాట వింటారని"

"ఏం చెప్పాలని?"

సిం హం కొద్ది క్షణాలు మౌనం దాల్చి కిందకు చూసింది. తరువాత మెల్లగా తలెత్తి చెప్పింది.

"వెళ్ళే సమయం వచ్చింది"

## 'లాకర్' గోల్డ్

ఆర్.సి.కృష్ణస్వామి రాజు

"మేడం! బాగున్నారా !" అంటూ ఇంటిలోకి ప్రవేశించింది సురేఖ . ఉబ్బితబ్బియ్యింది ఊర్మిళ . అంత కాస్ట్లీ మనిషి హోండా యక్టీవా స్కూటరులో తన ఇంటికి వచ్చి తనని "మేడం " అని సంభోదిస్తూ పలకరించడం ఊహించని విషయం ఊర్మిళకి .

తిరుపతి పట్టణంలోని యోగా సెంటర్లలో కలవడం, ఫంక్షన్ల లో మాట్లాడుకోవడం, బ్యూటీ పార్లర్ లలో చిరునవ్వులు చిందించడం తప్పించి అంత గొప్ప వ్యక్తి తనని వెదుక్కుంటూ తన ఇంటికి రావడం ఊర్మిళకి ఉయ్యాలలో ఊగినంత సంబరమయ్యింది. సురేఖ మేడంని సోఫాలో కూర్చోపెట్టి వేడి వేడి ఫిల్టర్ కాఫీ అందించింది.

పిచ్చాపాటి మాట్లాడుకున్నారు . వంటా వార్పు గురించి చర్చించారు. ఆరోగ్య రహస్యాలు, అందానికి చిట్కాలు, టీవీ సీరియళ్ళ విశ్లేషణలు, వ్రత విధానాలు చెప్పుకున్నారు . చిన్నగా తను తెచ్చిన కువైట్ ఖర్జురాల గిఫ్టుప్యాక్ ఊర్మిళ చేతికి ఇచ్చింది సురేఖ.

బ్యాంకు క్లర్క్ భార్య అయిన తన ఫ్రెండ్ షిప్ కోరి, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ లవకుమార్ భార్య అయిన సురేఖ తనతో సన్నిహితంగా "క్లోజప్ " లో మాట్లాడడంతో ఆకాశం లో ఎగిరినంత ఆనందాన్ని పొందింది ఊర్మిళ .

'తమకేమో మోటార్ సైకిల్ మాత్రమే వుంది . వారికేమో యక్టీవా స్కూటరుతో పాటు మారుతి స్విఫ్ట్ కారు కూడా వుంది. తాము వుండేది మిడిల్ క్లాస్ అశోక్ నగర్ అయితే వారు వుండేది రిచ్ లొకాలిటీ వరదరాజ నగర్ లో . మేడం వేసు డ్రస్సు, నడక, మేనరిజం, ఇంగ్లీష్ పదాల వాడకం తను ఎన్ని జన్మలు ఎత్తితే .... అంతటి మనిషి కాగలదు? 'అని కాసేపు మనసులోనే బాధపడింది. అంతటి వి ఐ పి తనతో కబుర్లు ఆడటం నిజమా? అని తనను తాను గుచ్చి గుచ్చి చూసుకొంది .

అంతేకాక తను ఏమో చిన్న ఊరు అయిన పుత్తూరులో డిగ్రీ చదివినదాయె. మేడం ఏమో పెద్ద టౌన్ లోని మహిళా యూనివర్సిటీ లో యం.బి.ఏ . చదివినదాయె. నక్క ఎక్కడ ? నాగలోకం ఎక్కడ అని కూడా అనుకొంది.

అన్ని ముచ్చట్లూ అయిపోయాక సురేఖ వేడుకోలుగా ముఖం పెట్టి "ఊర్మిళా ! రానున్న శ్రావణ శుక్రవారం పంచమి రోజున మా అమ్మాయి మృదలకి పెళ్ళి చూపులు. అబ్బాయేమో కర్ణాటక రాష్ట్రం హుబ్లీలో సివిల్ ఇంజనీర్ గా పనిచేస్తున్నాడు. పెళ్ళి కొడుకుతో పాటు వారి తాలూకు బంధువులు పదిమంది దాకా వస్తున్నారు. నాకు ఒక చిన్న సహాయం చేయాలివే " అని అడిగింది .

'ఎంత భాగ్యం' అన్నట్లుగా ఊర్మిళ "తప్పకుండా మేడం " అని గట్టిగా చెప్పింది.

వెంటనే సురేఖ మేడం ఊర్మిళ కళ్ళలో కళ్ళుపెట్టి చూస్తూ ఇలా అంది. "ఏమిలేదువే! మా వద్ద బోలెడన్ని నగలున్నాయి. పెళ్ళి చూపులూ కదా! మరిన్ని నగలు పెండ్లి కూతురికి తొడిగితే బాగుంటుంది చూసేవారికి. మీ వద్ద బంగారు నగలు వుంటే ఇవ్వండి. పెళ్ళి చూపులయ్యిందే తిరిగి ఇచ్చేస్తాను".

"అయ్యో! అది ఏముందండీ ! శుభకార్యం కదా, అందరూ సంతోషంగా, సమిష్టిగా సహకరించు కోవాల్సిన వేడుక " అని చెప్పింది ఊర్మిళ. వెంటనే తన తండ్రి చేయించిన బంగారు గాజులు, తన తల్లి బహుమతిగా ఇచ్చిన రవ్వల నెక్లస్, తను ఇష్టపడి చేయించుకున్న వడ్డాణం, భర్త బహుమతిగా ఇచ్చిన నీలం రాయి బంగారు ఉంగరం ... అన్ని ఒక పాలిథిన్ కవర్లో భద్రంగా పొట్లం కట్టి సురేఖకి అందించింది .

" మీ లాంటి మంచి హృదయం వున్న వాళ్ళు తగ్గిపోతున్నారు. అంతా నకిలీ నవ్వులు, కృత్రిమ లావాదేవీలు, లేనిపోని బడాయిలు .... ఎటు వెళ్తుందో సమాజం " అంటూ కూలింగ్ గ్లాస్ వేసుకొని హైహీల్స్ తొడుక్కొని వి ఐ పి బ్యాగు తగిలించుకొని లిప్ స్టిక్ పెదాలతో చిరునవ్వుతో చిందిస్తూ టూవీలర్ పై సర్రున వెళ్లిపోయింది.

★★★★★

రెండు మూడు వారాల గడిచాయి. సురేఖ నగలు తెచ్చివ్వలేదు. భయం పట్టుకొంది ఊర్మిళకి . "పెళ్ళిచూపులకే కదా నగలు తీసుకెళ్లింది . రెండు మూడు రోజుల్లో తెచ్చి ఇస్తుంది కదా" అనుకొని ఈ విషయం భర్త ఉలగనాధం కి చెప్పనేలేదు .

నెల తర్వాత కూరగాయల మార్కెట్ లో కనిపించింది సురేఖ. చూసీ చూడనట్లు వెళ్లిపోయింది . మరొకసారి ప్రకాశం రోడ్డు లోని స్టేట్ బ్యాంకు ఏ టీ ఎం దగ్గర కనిపించింది. "హాయ్ " మాత్రమే చెప్పి వెళ్లిపోయింది. రెండు మూడు సార్లు ఫోన్ చేస్తే మొబైల్ స్విచ్ ఆఫ్ చేసివుంది .

ఇక లాభం లేదనుకొని, దైవ సహాయం కోరి ఆంజనేయస్వామి గుడి చుట్టడం మొదలు పెట్టింది. 48 రోజులు ఉపవాసం వుండి ప్రదిక్షణలు చేస్తే కోరికలు తీరుతాయని గుడిస్వామి చెప్పడం తో ప్రదక్షిణలు చేసింది. వడమాల, ఆకు పూజ కూడా చేయించింది ఆంజనేయస్వామికి. అన్నీ భక్తిగా చేసింది. అయినా ఫలితం దక్కలేదు. మధ్యమధ్యలో 'నగలు తొడగటం లేదు ఏమిటి విషయం ?' అని భర్త ప్రశ్నించినప్పుడల్లా కుంటిసాకులు చెప్పి తప్పించుకొంది.

అనుకోకుండా ఒక రోజు పసుపర్తి సూపర్ మార్కెట్ లో కనపడింది సురేఖ , "ఏయ్ ఊర్మిళా ! ఏమీ అనుకోవద్దు, నిన్ను కలువలేకపోయాను. ఆ పెళ్ళి సంబంధం కుదరలేదు. అబ్బాయికి ఇంకొంచెం రంగువున్న పిల్ల కావాలంట. ఏముందిలే ... ఈ సంబంధం కాకపోతే ఇంకొకటి. అబ్బాయిలకు కరువా ఏమిటి ?" అని ఊగిఊగి చెప్పింది .

ఊర్మిళ 'నగల ఉబలాటం' అర్థం చేసుకొన్న సురేఖ " పెళ్ళి చూపులయ్యిందే అన్ని నగలూ మాకున్న ఫెడరల్ బ్యాంక్ లాకర్ లో పెట్టేశాము. పొరబాటుగా నీ నగలు కూడా మా నగలతో కలిపి లాకర్ లో దాచాను. టైం దొరకడం లేదు. వచ్చేవారమైనా బ్యాంక్ కెళ్లి నీ నగలు నీకు తెచ్చి ఇస్తాను. ఏమి అనుకోవద్దువే, ఆలస్యమవు తోంది. సారీ, వే" అని నంగినంగిగా చెప్పింది.

ఊర్మిళకు మళ్లీ ఉయ్యాలలో ఊగినంత సంబరమయ్యింది. చీర కొంగు నడుముకు చెక్కింది. భవాని నగర్ ఆంజనేయస్వామి శక్తి సామర్థ్యాల పైన మరింత గురి కుదిరింది. ఇంటికెళ్లి నిలువెత్తుటద్దం ముందర నిలబడి డ్యాన్స్ చేసింది."ఏనాటికయినా ధర్మమే గెలుస్తుంది " అన్న పాత సినిమా డైలాగ్ గుర్తుకొచ్చి చిన్నప్పుడెప్పుడో చేసిన "జజ్జనక జజ్జనక " అడుగులు వేసింది. తనని తాను అద్దంలో చూసుకుంటూ 'కిస్ ' కొట్టుకుంది. వారంరోజుల పాటు ఆమెకు ఆ హ్యాంగ్ ఓవర్ తగ్గలేదు .

★★★★★

మళ్ళీ మూడు నెలలు గడిచిపోయాయి. రోడ్డు లో 'హాయ్',మార్కెట్ లో ' సారీ' తప్పితే గోల్డ్ మాత్రం తెచ్చి ఇవ్వలేదు సురేఖ.

మళ్లీ గుడిస్వామిని కలిసింది. ఆయన సలహాతో కపిలతీర్థం ఈశ్వరునికి అభిషేకం చేయించింది. అలిపిరి పాదాల వద్దకి వెళ్ళి వెంకటేశ్వర స్వామి పాదాలు నెత్తిన పెట్టుకొని ప్రదక్షిణలు చేసింది. తిరుచానూరు పద్మావతమ్మ గుడికెళ్ళి కుంకుమార్చన చేయించింది. అయినా లాకర్ గోల్డ్ చేతికి రాలేదు .

★★★★★

వైకుంఠ ఏకాదశినాడు భర్త ఉలగనాధం పదిఏళ్ల క్రితం కొన్న పాతిక వేల షేర్ల ధర రెండు లక్షల పై చిలుకు అయ్యిందన్న సంతోషంతో ఇంటికి చేరినాడు. మొగుడి మూడ్ పసిగట్టిన ఊర్మిళ దీనంగా ఫేస్ పెట్టి లాకర్ గోల్డ్ విషయం చెప్పి వెక్కివెక్కి ఏడ్చింది .

తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టినాడు. ఎగిరెగిరి ఊగి ఊగి అరిచినాడు. అటు మూడు తరాలు ఇటు మూడు తరాలు తిట్టినాడు. తిట్లను భరించలేక, ఊర్మిళకు తిరుక్కుం దామనిపించింది. కానీ తప్పు తన దగ్గర వుందని నోరు కట్టుకుంది .

ఉలగనాథం కోపం తగ్గలేదు. దూకి దూకి అరిచినాడు. దుమ్మెత్తి పోసినాడు.

మరింత అరవాలనిపించినా మొన్నటికి మొన్న నలభైఏళ్ళ కొలిగ్ కృష్ణమూర్తి హార్ట్ అటాక్ గుర్తొచ్చి అరవడం తగ్గించినాడు.

ఆవేశం తగ్గినాక భోరున ఏడ్చినాడు. భార్యాభర్తలిద్దరూ ఒకరినొకరు గట్టిగా పట్టుకొని ఏడ్చుకున్నారు. ‘ఎగిరి దంచినా ఎగిరెగిరి దంచినా పిండి ఒక్కటే’ అని గుర్తొచ్చింది వారికి. వెక్కిళ్ళు పెట్టి ఏడ్చినా నగలు లాకర్ నుంచి ఎగిరి తమ వద్దకి రావని అర్థమయ్యింది. ఒకరి నొకరు సముదాయించుకున్నారు. ఉగాది కి విడుదలైన టి టి డి పంచాంగంలో బంగారుతో సమస్యలు వుంటాయని చదివింది గుర్తొచ్చిన ఉలగనాథం పంక్చరయిన సైకిల్ లా వుండిపోయినాడు .

భర్త బాధని చూడలేని ఊర్మిళ వేడి వేడిగా బొరుగుల ఉప్మా చేసింది. కోపంతో ఉప్మా తినడని అనుకొంది కానీ మిర్చీ, కరివేపాకు , కొత్తిమిర , అల్లం ముక్కలు అన్నీ మిగలకుండా లాగించేశాడు – సురేఖ పై దాడి చేయడానికి శక్తి కావాలని కాబోలు. చిక్కటి పాలతో చక్కటి డికాషన్ కలిపి ఫిల్టర్ కాఫీ తయారు చేసి భర్తకి ఫుల్ కప్పు ఇచ్చింది. తను హాఫ్ కప్పు తీసుకొంది. కొంచెం గెస తగ్గింది ఇద్దరికీ .

సురేఖ ఇంటికి వెళ్లి తాడో పేడో తేల్చుకుందామనుకున్నారు. ఉలగనాథం బాహుబ లాగ తయారయినాడు. మోటార్ సైకిల్ మీద వెళదామనుకున్నారు కానీ, 'షాక్' లో వున్న తన భర్త బండి షేక్ చేసి బోల్తా కొట్టిస్తాడేమోనని భయపడి ఆటో మాట్లాడింది .

★★★★★

లెక్చరర్ లవకుమార్ తమ ఇంటి పోర్టికోలో, ఊగే ఉయ్యాలలో కూర్చొని వున్నాడు. నల్లకుండ పొట్ట, చింతింత కనుగుడ్లు, నల్ల తెల్ల మీసాలు కలిగి వున్నాడు. ఒక చేతిలో డైలీ సండే స్పెషల్ తిరగేస్తూ, మరొక చేతి బడ్ తో చెవి గులిమి తీసుకుంటున్నాడు.

బాధిత జంట ఊగే ఉయ్యాల ముందు నిలబడింది. ఎదురుగా వున్న పిట్ట గోడపైన కూర్చోమన్నాడు సారు. కూర్చొని చెప్పే కథగా అనిపించలేదు వారికి. నిలబడి సినిమా రీళ్ల లా విషయమంతా తిప్పి తిప్పి చెప్పినారు. వివిధ విన్యాసాలు, భంగిమలు హావభావాలతో లబోదిబోమన్నారు. అయినా ఉయ్యాల ఊగుతూనే ఉంది. ఉలుకు లేదు, పలుకు లేదు.

బాధిత జంట చెప్తున్న సోది ఇరుగూ పొరుగు చూస్తున్నారు కానీ వారంతా క్యాజువల్ గా వున్నారు .

తమ యాక్షన్ కి రియాక్షన్ ఇవ్వని లెక్చరర్ ముందు దిగాలుగా కూలబడ్డారు. భర్తకి బైర్లు కమ్ముతుందేమోనని భయపడి ఊర్మిళ తన మంగళసూత్రాలు కళ్ళకు అద్దుకొని బ్యాగులోని బాటిల్ నీళ్ళు తాగించింది. బాధిత జంట చెప్పిన కథ అంతా హరికథలాగా విన్న సారు పుత్తూరు వక్కపొడి నములుతూ నింపాదిగా "మాట్లాడి సెటిల్ చేద్దాం లే" అని మాత్రం అన్నాడు.

ఆ వాక్య భావం అర్థం కాలేదు బాధిత జంటకి. సురేఖ ముదురు అయితే ఆమె మొగుడు 'దేశ ముదురు ' అని అర్థమయ్యింది వారికి. సురేఖ దొంగ అయితే ఆమె మొగుడు 'దొంగలకు దొంగ ' అని తెలిసిపోయింది. తెలిసీ తెలియక రాక్షస గుహలో దూరామని సెకను పాటు బెదిరినారు.

అక్కడ ఉండి లాభం లేదని, 'యమదొంగ ' ఇక పలకడని, చేసేదీ ఏమి లేక కాళ్ళు ఈడ్చుకుంటూ వీధిలోకి వచ్చారు. ఎదురుగా కారులో సురేఖ కనిపించింది . పలకరింపు జరగలేదు కానీ ' ఎందుకు వచ్చారు మీరు మా ఇంటికి’ అన్నట్లుగా చూపులు విసిరింది. ఆశ చావక బాధిత జంట నిలబడి మాట్లాడాలని చూశారు. కాని ఆ అవకాశం వారికి ఇవ్వలేదు సురేఖ . కారు గేరు అయిదుకి మర్చి స్పీడ్ రైజ్ చేసి సర్రున వెళ్లిపోయింది. నల్లపొగ బాధిత జంటకి తగిలింది .

★★★★★

ఎలాగోలా కష్టపడి ఇంటికి చేరుకున్నారు. పరిచయం వున్న పోలీసులను కలిసినారు. తెలిసిన లాయర్లతో మాట్లాడినారు. స్థానిక వార్డు మెంబరుతో చర్చలు జరిపినారు. సమస్య ఎలా పరిష్కరించాలో ఎవ్వరు సరిగా పరిష్కార మార్గం చూపలేదు. 'అట్టయితే సహాయం చూసివుంటాం – ఇట్టయితే సహాయం చేసి వుంటాం’ అని అన్నారు గానీ ఎవ్వరు చిక్కుముడి విప్పలేదు .

★★★★★

రెండు మూడు రోజులు గడిచిపోయాయి. ఆదివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమైవుంది. ఇంటి ముందరి మెట్లపైన కూర్చొని వున్నాడు ఉలగనాథం. ఎదిరింటి ఎర్రెర్ర అగ్ని పూల చెట్లను తదేకంగా చూస్తున్నాడు. భార్య ఊర్మిళ పచ్చి మిరపకాయ తొడిమలు వొలుస్తూ ఉంది .

ఇంతలో రుయ్ మని సైకిల్ పై ఓ కుర్రాడు వచ్చి సైకిల్ లో దిగినాడు. తను సురేఖ గారి అబ్బాయినని, తన పేరు సిద్దార్థ అని పరిచయం చేసుకొన్నాడు. నగల సంచి ఇస్తూ ' "అమ్మ ఇచ్చి రమ్మంది ఆంటీ " అని ఇచ్చినాడు.

మొగుడూ పెళ్ళా లిద్దరూ తియ్య తియ్యని గుటకలు మింగారు. అక్కడే డిస్కో డ్యాన్స్ చేద్దామని అనుకున్నారు కానీ వీధుల్లో బాగుండదని సిగ్గుపడి ఆ పని చేయలేదు. తమ సంతోషాన్ని ఎలా ప్రకటించాలో తెలియక ఇంట్లో వున్న స్వీట్ ప్యాకెట్ ఒకటి ఆ అబ్బాయికి ఇచ్చినారు. వారి ముఖాల్లో వంద నక్షత్రాల కాంతి చూసి సిద్ధార్థ బిత్తరపోయినాడు. గబ గబా సైకిల్ తొక్కుకుంటూ బెల్ మోగించుకుంటూ డబుల్ స్పీడ్ తో ఉరికినాడు.

★★★★★

మొగుడు పెళ్ళా లిద్దరూ పడక గదిలోకి పరుగులెత్తినారు. నగలన్నిటిని సరిచూసుకొన్నారు . డైరెక్టుగా ఒకరికొకరు లైకింగ్ లు ఇచ్చుకున్నారు. హగ్ చేసుకున్నారు. మొబైల్ లో ప్లే మ్యూజిక్ అదిమారు. రాజాది గ్రేట్ సినిమాలోని రవితేజ పాట "గున్నా గున్నా మామిడి" పాట ప్లే చేసి చిందులేశారు. ఎగిరి ఎగిరి గెస పోసుకొని కూలబడ్డారు. గెస తగ్గినాక గోముగా అడిగింది భార్యామణి "హఠాత్తుగా వారికి నగలు ఎందుకు ఇవ్వాలని పించింది? " అని .

గంభీరంగా కాలర్ సర్దుకున్న ఉలగనాథం పెద్ద దువ్వెనతో తల దువ్వుతూ, చిన్న దువ్వెనతో మీసాలు దువ్వుతూ తను ఈ మధ్యలో సేకరించిన సమాచారాన్ని ఇలా చెప్పినాడు.

"దండిగా డబ్బులు సంపాదించాలని గొలుసుకట్టు వ్యాపారంలోకి దిగినారు. శ్రీ మరియు శ్రీమతి సురేఖ గారు జనాలను ఆకర్షించడానికి ఎన్నో ఎత్తుగడలు వేసినారు. మిడిల్ క్లాస్ స్థాయి నుంచి రిచ్ సొసైటీ లోకి జంప్ కావాలనుకున్నారు. లగ్జరీకి అలవాటు పడ్డారు. డబ్బులు లేకున్నా కారుకొన్నారు . రిచ్ లొకాలిటీ లో కాస్ట్లీ హౌసులో కాపురానికి దిగారు. మెహర్బానీ కోసం విచ్చలవిడిగా ఖర్చు పెట్టారు.

అందులో భాగంగానే, మన నగల్ని తీసి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ లో 40 పైసల వడ్డీకి మూడు లక్షల దాకా అప్పు తీశారు.

సురేఖ చెప్పిన మాట కరెక్ట్. నగలు లాకర్ లో పెట్టారు. తమ సొంత లాకర్లో కాదు, అప్పు చేయడం ద్వారా బ్యాంక్ వారి పెద్ద లాకర్ లో పెట్టారు. ఆరునెలలు పాటు మన నగల ద్వారా టెంపరరీ అడ్జస్ట్మెంట్ చేసుకొన్నారు.

ఈ మధ్యలో మనలాంటి 'భకరా ' కానీ 'భకరీ ' కానీ మరొకరు దొరికి వుంటారు వారికి. బహుశా .... అందుకే మన నగలు మనకి ఇచ్చేశారు .

ఇలాంటి వారు సమాజంలో ఎప్పుడూ వుంటారు. మన జాగ్రత్తల్లో మనం వుండాలి. వారు చిన్న చిన్న గిఫ్ట్ లు మన చేతికి ఇచ్చి మనల్ని పడేస్తారు. ఇలాంటివారు చక్కటి శారీరక సౌష్టవం కలిగి మాటకారి తనం, లౌక్యం, చక్కటి వస్త్రధారణ, మంచి భాషా ప్రయోగాలు చేసి జనాలను ఆకర్షిస్తారు . సెలబ్రెటీల మన్నట్లుగా ఫోజు కొడతారు.

మనం వారి పైపై మెరుగులు చూస్తాం. అంటే పై పై ప్యాకింగ్ చూస్తాం. ఆకర్షింపబడతాం. లోపలి సరుకు చూడం. గిఫ్ట్ ల పైన వున్న అందమైన రేపర్ లను చూసి గొప్ప గిఫ్ట్ లని భ్రమిస్తాం. రేపర్ లోపల ఏముందో తెలుసుకోలేం.

అందుకే మన జాగ్రత్తలలో మనం వుండాలి. లేకుంటే ఇలాంటి వాళ్లు తీసిన గోతుల్లో పడుతాము" అంటూ జీడిపప్పు, బాదం పప్పు వున్న కొండ లడ్డు ముక్కని ఊర్మిళ నోటికి అందించినాడు. 'నా మొగుడికి ఎంత తెలివబ్బా' అనుకొంటూ, నవ్వుకుంటూ స్నానాల గదిలోకి దౌడు తీసింది. చక్కగా తల స్నానం చేసి తన మొగుడికి మొదటి రాత్రి గుర్తు చేయడానికి.

ఆనందం పట్టలేని ఉలగనాథం మార్కెట్ వైపు నడిచాడు. భార్యకి పకోడీ పొట్లం, మల్లెల చెండు తేవడానికి. ఆ రాత్రంతా బంగారు నగల్ని చూసుకుంటూ విందు పసందులతో జల్సాగా జాగారం చేశారు.

# ది రైటర్ శ్రీనివాస గౌతమ్

గది నిండా 20 – 25 కాగితాల ఉండలు పడున్నాయి.

కళ్ళుమూసుకుని సోఫాలో చేరగిలిబడి ఉన్నాడు రవికిరణ్. ఓ మంచి కథ రాసి ప్రైజ్ కొట్టాలన్న తపన నిద్రలేకుండా చేస్తోంది.

అది ఎన్ని నాళ్ళ కలనో
అందుకోసం కలలుగన్న రాత్రులెన్నో
చించిపారేసిన పోత్తాలెన్నో
నాన్నతో తిన్న చీవాట్లేన్నో
మాటిమాటికీ ముందుపెట్టుకున్న తెల్లకాగితం
తెల్లబోయి వెక్కిరిస్తోంది
కలంలో గడ్డకట్టిన సిరా
అక్షరాలు కక్కనంటోంది
ఉన్న అక్షరాలు గుప్పెడంత
రాయదలుచుకుంది ఆకాశమంత
అయినా అక్షరం ముక్క పడదేం
తాగిన టీకప్పుల లెక్క తేలట్లేదు
బరికిన కాగితాలు అంతుతేలట్లేదు
మస్తిష్కంలో పురుడుపోసుకున్న
ఒక్క ఆలోచనకూడా సుఖప్రసవమైన జాడలేదు
ఆలోచనలు బీడుబారుతుంటే
అక్షర యుద్ధం ఆరంభమౌతోంది
ఆలోచనల మొదళ్ళను త్రోసుకుని
బలవంతంగా కనురెప్పలు తెరుచుకుని
రాని ఆలోచనల కోసం ఎదురుచూస్తున్న
కలల కుత్తుకలు కత్తిరించిన కలం
రాలిన రక్తాక్షరాలను ప్రోదిచేస్తోంది
ఆలోచనల అరంగేట్రంలో
పురుడుపోసుకుంటున్న కలలకు

అక్షరరూపమివ్వడానికి సిద్ధమవుతోంది

అప్పటికి ఎప్పటినుండి పిలుస్తున్నాడో అతని తండ్రి. ఎదురుగా ఉగ్రనరసింహంలా నిలబడి ఉన్నాడు. "ఏమిరా, పొద్దున్నే కలలు కంటున్నావా? కాలేజీకి వెలగబెట్టేది ఏమీ లేదా. వెధవ తిరుగుళ్ళు, చెత్తరాతలు. ఈ శ్రద్ధ చదువు మీద పెడితే బాగుపడతావ్" అంటూ ఉలుకూపలుకు లేకుండా చూస్తున్న కొడుకు వంక ఒకచూపు చూసి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

తండ్రి చెప్పింది నిజమే కానీ, ఓ కథ రాయాలన్న అతనిలోని బలమైన తపన అతడిని మాట విననీటల్లేదు. నిద్దరలేని రాత్రుల్ని పరిచయం చేస్తోంది. ఏదన్నా పాఠం చదవాలని మొదలుపెడితే సగంలో ఆగిపోయిన కథలా ఇదీ మిగిలిపోతోంది.

తండ్రి బయటికి వెళ్లిపోతున్నా బండి శబ్దం వినబడి ఈ లోకంలోకి వచ్చాడు. లేచి ఫ్రెష్ అయ్యాడు. ఇంతలో స్నేహితుడు వంశీ పిలవడంతో అమ్మా కాలేజీకి వెళుతున్నా అంటూ కేక వేసాడు రవి.

"ఉండరా, టిఫిన్ తిని వెళ్ళు" అంటూ బయటికి వచ్చింది తల్లి. టిఫిన్ కొడుకు చేతికందిస్తూ "ఆ కథలు రాయడం మాని నాన్న చెప్పినట్లు చక్కగా చదువుకోవచ్చు కదరా" అంది.

"నువ్వూ మొదలుపెట్టావామ్మా ........" అంటూ బయటపడ్డాడు రవి.

వంశీ బండి ఎక్కి కాలేజీకి బయలుదేరారు ఇద్దరూ.

"ఏంటి బాబాయ్ అంత డల్ గా వున్నావ్?" అడిగాడు వంశీ. రవిని బాబాయ్ అని పిలవడం వాడికి అలవాటు.

"అందరూ అన్నన్ని కథలు ఎలా రాస్తారో ఏమోరా, నాతో ఒక్క కథ కూడా కావట్లేదు. ఈ పందెంలోపల నేను కథ రాయలేకపోతే ఇంకా దాని వైపు కన్నెత్తికూడా చూడనని అమ్మకు చెప్పాను" గుండెలోని బాధని మాటల్లో కక్కేస్తూ ఒక్క క్షణం ఆగాడు రవికిరణ్.

"బాబాయ్. ఈ కథల గురించి నీకు తెలిసినంత నాకేం తెలీదుగానీ, ఒక్క విషయం చెబుతారా. ఏదన్నా మనం చెయ్యాలంటే దాని గురించి మనకి పూర్తిగా తెలిసుండాలి అని మా నాయనమ్మ చెబుతుండేదిరా. ముందు నువ్వు మంచి మంచి కథలు చదువు. రాసే తీరు, చెప్పే కథ, మాట్లాడే మాటలు, తిప్పే వంపులు ఇవన్నీ బాగా స్టడీ చెయ్యి. అప్పుడు రాయడం మొదలుపెట్టు. నాకు తెలిసీ అప్పుడు ఖచ్చితంగా నువ్వు కథ రాయగలుగుతావురా..." ఆగాడు వంశీ.

ఇంతలో కాలేజీ రావటంతో, బండి పార్క్ చేసి ఇద్దరూ కలిసి అడుగులేసుకుంటూ కాలేజీ కాంటీన్ లో ఉన్న టీ స్టాల్ దగ్గరికి వచ్చారు. వంశీ "రెండు టీ ఇవ్వు కాకా" అన్నాడు. పక్కనే వున్న బల్ల మీద కూర్చున్నారు ఇద్దరూ. షాప్ వాడు అందించిన టీ తీసుకుని నెమ్మదిగా సిప్ చెయ్యడం మొదలుపెట్టారు.

అదే సమయంలో ఆ పక్కనుంచి పోతున్న ఓ స్టూడెంట్ తన స్నేహితుడిని కేకవేసి, "ఒరేయ్, సాయంత్రం లాస్ట్ పీరియడ్స్ లెక్చర్ లేదట, మనం లైబ్రరీలో కలుద్దాం. బై" అంటూ హడావుడిగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

ఆ సంభాషణ విన్న రవి మనసులో ఓ చిన్న ఆలోచన మొదలైంది. తానూ సెంట్రల్ లైబ్రరీకి వెళ్లి అక్కడ పాత న్యూస్ పేపర్లు, పాత పుస్తకాలు తిరగేస్తే తనకి కథ రాయడానికి పనికివచ్చే ఏమన్నాసమాచారం దొరుకుతుందేమో అనిపించింది.

ఆలోచనల్లో ఉన్న రవిని కదిలించి "పదరా టైం అవుతోంది, క్లాసుకి పోదాం పద" అంటూ వంశీ ముందుకు అడుగేసాడు. ఇద్దరూ వెళ్లి క్లాసురూంలో కూర్చున్నారు. సమయం భారంగా గడుస్తోంది.

క్లాసురూంలో కూర్చున్నా బుర్ర అక్కడ నిలబడక పోవడం వల్ల, నెమ్మదిగా బయటికొచ్చి సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళాడు. అందులో పాత పుస్తకాలు, పేపర్లు ఉండే విభాగంలోకి వెళ్ళాడు. అక్కడ తన కథకి పనికి వచ్చే విషయం ఏదన్నా దొరుకుతుందేమో అన్న ఆశతో, ఒక్కొక్క పాత పేపర్ చూస్తున్నాడు. ఒక పేపర్ ప్రత్యేకంగా ఒక పక్కన పెట్టివుంది. ఏమిటా అని దాన్ని చేతులోకి తీసుకుని కిందకి దిగి వచ్చాడు. దుమ్ము దులిపి చదవడానికి

ప్రయత్నం చేసాడు. మొదటి రెండు పేజీల్లో ఏవో మామూలు రాజకీయ వార్తలే వున్నాయి. పేపర్ తిప్పాడు. మూడో పేజీలో వార్త చూడంగానే రవి రోమాలు నిక్కబొడుచుకున్నాయి. "ఓ కాలేజీ యువతి దుర్మరణం. హాస్టల్ గదిలో ఫాన్ కు వేళ్ళాడుతూ లభ్యమైన శవం. సిటీలో వున్న పెద్ద కాలేజీలో చదువుతున్నా యువతి గత కొద్దీ కాలంగా అదే కాలేజీలో చదువుతున్న మదన్ అన్న వ్యక్తితో ప్రేమలో వుంది. ఆమె అతనితో చాలా చనువుగా ఉండేదని కాలేజీలో ఆమె స్నేహితులందరూ చెబుతున్నారు. అయితే, మదన్ ఆమెపట్ల తనకా ఉద్దేశం లేదని, కేవలం మంచి స్నేహాన్ని కాంక్షించానని చెప్పటంతో, మదన్ తో తన ప్రేమ విఫలమైన కారణంగానే ఆమె ఆత్మ హత్య చేసుకుని ఉండొచ్చని అనుమానాలు వెలువడుతున్నాయి."

ఆ వార్త చదువుతున్న రవికి ఎందుకో అది నమ్మబుద్ధి కాలేదు. అంతరాల్లో ఎక్కడో ఆ అమ్మాయికి అన్యాయం జరిగింది అనిపించింది. వార్తలో అమ్మాయి ఫోటో ఏదన్నా ఉందేమోనని వెతికాడు. ఓ మూలగా చిన్న ఫోటో వేసారుగాని, అది కూడా కాలం తినేసి జీవితంలా, అస్పష్టంగా వుంది. ఏమన్నా మరికొన్ని వివరాలు దొరుకుతాయేమోనని ఒకటికి రెండుసార్లు చదివాడు. లాభం లేక పోయింది. అయినా, మారుతున్న రోజుల్లో అది పెద్ద అంతగా విశేషమైన వార్త కాకపోయినా, ఎందుకో తనకి అలా అనిపిస్తోంది, తన రాయాలన్న కధకి, కథావస్తువు ఇదే అనిపిస్తోంది.

కూర్చున్న కుర్చీలో వెనక్కి వాలి, ముఖానికి అడ్డుగా వున్న, తాను చదువుతున్న పేపర్ ని బల్ల మీద పెట్టాడు. తన ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని వుంది, కుందనపు బొమ్మలాంటి అమ్మాయి, పెద్ద పెద్ద కళ్ళు. అందమైన నుదురు. కొనదేరిన ముక్కు, చెక్కిళ్ళు, జున్ను గడ్డలాంటి చిన్ని గడ్డం, దొండపండులాటి పెదాలు, ఫాలభాగం పై నాట్యం చేస్తున్న ముంగురులు కాన్వాసుపై గీసిన చిత్రంలా వుంది. ఆమె మీదనుంచి చూపులు మరలనివ్వట్లేదు. ఆమెను చూస్తూ అలాగే ఉండిపోయాడు.

అప్పటిదాకా తలవంచి చదువుకుంటున్న ఆ అమ్మాయి తలపైకి ఎత్తడంతో చూపులతో చూపులు కలిసాయి. తడబడ్డాడు రవి. తలదించుకున్నాడు. ఆమె వివరాలు అడగాలని మనసు ఆరాటపడుతున్నా, సంస్కారం నోటికి తాళం వేసింది.

నెమ్మదిగా ఆమె లేచి బయటకు నడిచింది. వెళ్తూ వెళ్తూ వెనక్కితిరిగి ఆమె నవ్విన నవ్వు రవికిరణ్ మనసులో హత్తుకుపోయింది.

ఏంటో మనసు వెలితిగా అయిపోయింది. ఇంకోసారి ఆమెను చూడాలనిపించింది. లేచి దబదబా బయటకు వచ్చాడు. అప్పటికే ఆమె ఏటో వెళ్ళిపోయింది. ఆమె కనిపించలేదు. వెనక్కివెళ్లి మళ్ళీ సీట్లో కూర్చున్నాడు. మనసు అదోలా అయిపోయింది. ఎదురుగుండా ఆమె చదువుతూ వదిలివెళ్లిన పుస్తకం కనిపించింది. ఈ కాలం అమ్మాయిలు ఇంగ్లీష్ నవలలు కాకుండా ఇలాంటి పుస్తకాలు కూడా చదువుతారా అని నవ్వుకున్నాడు. చదువుతున్న పేపర్ పక్కన పెట్టేసి బయటకు నడిచాడు.

★★★★★★★★★★★★★★

రోజూలానే తెల్లవారింది. కానీ, ఆరోజెందుకో కొత్తగా వుంది. ఏదో చిన్న మార్పు. రవి మాటలో చేతలో ఆలోచనలో ఒక స్థిరత్వం ఒక కొత్తదనం కనిపిస్తోంది. లేవంగానే రోజులా కాగితాలు ముందేసుకుని కూర్చోకుండా, త్వరత్వరగా తయారై కాలేజీకి బయలుదేరాడు. రెండు క్లాసులు అటెండయి నిన్నటి టైంకి లైబ్రరీలో వున్నాడు. నిన్న కనపడ్డ అమ్మాయికోసం లైబ్రరీ అంతా కళ్ళతోనే జల్లెడ పట్టాడు. కనపడలేదు. నిన్న వచ్చిన అమ్మాయి ఇవాళ రాయాలని రూల్ ఏమి లేదుగా. తనలోనే నవ్వుకున్నాడు. మరికొన్ని పాత పేపర్లు ముందేసుకుని కూర్చున్నాడు. నిన్న తాను చదివిన వార్తకి పూర్వాపరాలు ఏమన్నా దొరుకుతాయేమోనని వెతికాడు.

ఆ తరవాత రెండు రోజుల తరవాత మళ్ళీ ఈ వార్తమీద పోలీసులు తమ కధనం ప్రచురించారు. అమాయకంగా కనబడే ఆమెకు ఎంతో మందితో సంబంధాలు ఉన్నాయని, అది తెలిసే మదన్ కాదన్నాడని, ఆమె ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిందని రాశారు.

కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కి వాలాడు. బుర్రలో వెయ్యి ఆలోచనలు. తెగటల్లేదు. పక్కనే ఏదో అలికిడి అయితే కళ్లుతెరిచాడు. ఎదురుగుండా మళ్ళీ అదే అమ్మాయి. అదే పుస్తకం సీరియస్ గా చదువుతోంది. గడ్డం క్రింద చేతులు పెట్టుకుని ఆమెవంక చూస్తూ కూర్చున్నాడు. కొద్దీ సేపటికి పుస్తకంలోంచి ఆమె కళ్ళెత్తి పైకి చూసింది.

ఆ అవకాశాన్ని అతను వదల దలుచుకోలేదు.

"హాయ్" అన్నాడు పలకరింపుగా

సమాధానంగా ఓ చిరునవ్వు నవ్వింది.

"నా పేరు కిరణ్, రవికిరణ్, మరి మీ పేరు ?" అడిగాడు

"మదాలస..." కోటి వీణలు మోగినట్లు పలికింది.

తరవాత ఏమి మాట్లాడా అర్థం కాక, "ఆ పుస్తకమంటే మీకంత ఇష్టమా ? ... ఆహా ఏమీ లేదు, నిన్నకూడా మీరు ఇదే పుస్తకం చదివినట్లుంటేను... "మాట సగంలో మింగేశాడు.

"అవునండి, ఇది ఓ అమ్మాయి హత్యకు సంబంధించింది. కొందరు గొప్పింటి మగపిల్లలు ఒక ఆడపిల్లను అమానుషంగా మానభంగం చేసి చంపేస్తే, ఆమె వాళ్ళమీద ఎలా పగ తీర్చుకుంది చెప్పే నవల, మీరూ చదవండి, మీకు ఏదన్నా కథ రాయటానికి పనికివస్తుంది." అంటూ ఆ పుస్తకం అతని చేతిలో పెట్టి వెళ్ళిపోయింది మదాలస.

కనుచూపు సాగేంతవరకు ఆమె వెళ్లిన వైపు చూసి చదువుదామని ఆ పుస్తకం తెరిచాడు. ఒక్కసారిగా షాక్ అయ్యాడు. అది ఖాళీ పుస్తకం. అందులో ఒక్క అక్షరం కూడా లేదు. ఒక్కసారి మదాలసపైన కోపం వచ్చింది. తనతో అబద్ధం ఎందుకు చెప్పిందో అర్థం కాలేదు. అంతలో ఆమె అన్న మాట గుర్తుకు వచ్చింది. తాను కథ రాయాలని అనుకుంటున్నట్లు ఆమెకి ఎలా తెలిసింది ? వెయ్యి డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా, ఆమె చెప్పిన కథ తనకు కథ రాయటానికి నిజంగానే పనికొస్తుందేమో అని ఆలోచిస్తూ ఇంటిముఖం పట్టాడు.

ఇంటికిచేరి, ఫ్రెష్ అయి అమ్మ ఇచ్చిన టీ తాగి తన రూంలోకి వెళ్లి కూర్చున్నాడు. పెన్ను కాగితాలు చేతిలోకి తీసుకున్నాడు. కథ రాయడానికి మొదలుపెట్టాడు. మొదటగా అందంగా కథ పేరు రాసాడు ... "మదాలస". ఆపుస్తకంలో ఉంది అంటూ ఆమె చెప్పిన ఆ నాలుగులైన్లే తనకి కథ రాయడానికి ఆలోచనని ఇచ్చాయి. తాను పేపర్లో చదివిన వార్తకి దీనిని అనుసంధానం చేస్తున్నాడు. వాస్తవికతను జోడిస్తూ తాను తిరిగే ప్రదేశాలు, తాను చదువుతున్న కాలేజీ, తన స్నేహితుల పేర్లు ఇలాంటివి దానికి కలుపుకుంటున్నాడు. ఎన్నడూ లేనిది కలం ఆగకుండా సాగిపోతోంది.........

అందానికే అందం ఆమె అందం
మచ్చలేని జాబిలీ ఆమె వదనం
ఆనంద నగరం ఆమె సదనం
బుడి బుడి అడుగుల పసిబాలలా
కాలేజీ బడిలో అడుగుపెట్టింది
మదనుని నెచ్చలి మదాలస
రాజహంస హొయలు ఒలుకుచు
చిలుక పలుకులు పలకనంటూ
పసిడి కాంతుల మోము పరదాల దాచుకుని
భయతాక్ష హరిణివోలె
కనుల నిటు నటు కదిలించుచు
అడుగుపెట్టింది మదాలస

భీకరారణ్యంలో బెదురుతూ అడుగువేసే హరిణివోలె ముందుకు నడిచింది మదాలస.

"ఏయ్ పిల్లా ఇటా ..... " అదేదో తోడేళ్ళ అరుపులా వినిపించింది మదాలసకు.

అప్పుడే కాలేజీకి వచ్చే కొత్త పిల్లలపై రాగింగ్ పేరుతో ఆ బాచ్ చేసే అల్లరి అంతా ఇంతా కాదు. తెలిసినా, వాళ్ళందరూ పెద్దింటి పిల్లలు, సంఘంలో ఉన్నత పదవుల్లో వున్న వాళ్ళ పిల్లలుగనుక మానేజ్మెంటు కూడా ఏమీ చేయలేక పోతోంది.

ఆ కేక వినబడనట్లే ముందుకి అడుగెయ్యబోయింది మదాలస. ఆమె ముందుకొచ్చి నుంచుంది ఆ కోతిగుంపు.

"పేరు అడుగుతుంటే వెళ్ళిపోతున్నావ్, పొగరా.. సీనియర్లంటే లెక్కలేదా " ముందుకొచ్చాడు వేణు.

"అబ్బే అదికాదండి...." ఆగింది ఆ అందం.

"పేరేంటి ?" మళ్ళీ అడిగాడు వెంకట్.

"మదాలస అండి" చెప్పింది.

"నాకు నచ్చలే. నిన్ను ముద్దుగా, మదా అని పిలుస్తా" కౌంటర్ వేసాడు వేణు.

"అన్నా, నేను ముద్దుపెట్టుకుంటానే" వెకిలిగా నవ్వాడు రాజేష్.

"నేను అలాంటిదాన్ని కాదండి. ప్లీజ్ వదిలెయ్యండి" బ్రతిమాలింది.

"మేము అలాంటి వాళ్ళమే" పళ్ళు బయటపెట్టి నవ్వాడు వెంకట్.

"సరే, సరే. ఇంతకీ ఏ క్లాస్." అడిగాడు వేణు.

"1st year - B Tech - CSC " అంది

"బాక్స్ తెచుకున్నావా, కాంటీన్ కి వస్తావా" అడిగాడు రాజేష్.

"లేదండి బాక్స్ తెచ్చుకున్నా" అంది మదాలస అమాయకంగా.

"సరే, ఆ బాక్స్ ఇటిచ్చి నువ్వెళ్లు" అంటూ ఆమె చేతిలో బాక్స్ లాక్కున్నాడు వెంకట్.

"ఒక్క ముద్దు పెట్టిపో " అంటూ చెయ్యి పట్టుకుని లాగాడు వేణు.

అంతే, ఒక్క క్షణం ఏమి జరిగిందో అర్ధం కాలేదు. బలంగా తగిలిన దెబ్బకి కిందపడిపోయాడు.

"ఎవడ్రా అది" అంటూ ఆ వైపుకి చూసాడు.

నోరు తెరిచేలోపు మరో రెండు తగిలించేసాడు మదన్.

"తప్పన్నయ్యలు, ఆడపిల్లని అలా ఏడిపించకూడదు" అంటూ కళ్ళకు పెట్టుకున్న నల్ల కళ్ళజోడు తీసి మందహాసం చేసాడు మదన్.

"ఒరేయ్" అంటూ దగ్గరకి రాబోయిన రాజేష్ కి, వెంకట్ కి అదే గతి పట్టింది.

ముగ్గురూ పారిపోయారు.

క్రిందపడ్డ పుస్తకాలని తీసి చేతికి అందిస్తూ వచ్చే ఏడుపును ఆపుకుంటున్న మదాలస దగ్గరికి వచ్చాడు మదన్.

"హాయ్" అని పలకరించాడు.

"థాంక్స్ అండి. ఈ రోజు మీరు అడ్డుపడక పోతే ..." అంటూ మాట సగంలో ఆపేసి కన్నీళ్లు పెట్టుకుంది మదాలస.

ఆమె మనసులోని ఆలోచన, భయం కనిపెట్టినవాడిలాగా మదన్ "భయపడకండి. నేను మీలాగానే ఒకప్పుడు బాధితుడిని. మనమంతా ఒకే కాలేజీలో చదువుకుంటున్నాం, అంతే మనదంతా ఒకే ఫామిలీ అన్నమాట. మనలో మనం సాయం చేసుకోపోతే ఎట్లా. అన్నట్లు, నా పేరు మదన్" అన్నాడు.

అతని మాటల్లో ఏదో స్నేహం కనిపించింది.

బాధల్లో ఉన్న ఆడపిల్ల కోరుకునే ఓ చిన్న ఓదార్పు అది.

"నా పేరు మదాలస" అండి అందీ.

"రండి, మీ క్లాస్ రూమ్ చూపిస్తా" అంటూ ఆలోచనల్లో ఉన్న మదాలసను తీసుకుని ముందుకు నడిచాడు మదన్.

క్లాస్ రూంలో తనని వదిలేసి, కాంటీన్ కి వెళ్ళాడు.

అక్కడ మదన్ కొట్టిన దెబ్బలకి ఆయింట్మెంట్ రాసుకుంటూ కూర్చున్నారు వేణు, రాజేష్, వెంకట్.

"ఏమయిందిరా అలా కొట్టావు ?" ముందుగా నోరుతెరిచాడు వేణు.

"సారీరా.. కొంచెం డోసు ఎక్కువయినట్లుంది. నాచురాలిటీ కోసం, అలా కొట్టకపోతే పిల్ల నమ్మద్దూ" నవ్వాడు మదన్.

"ఏమైనా కంగ్రాట్స్ మామా. కొత్త పిట్టని భలే లైన్లో పెట్టావ్" వెకిలిగా నవ్వాడు రాజేష్.

గర్వంగా నవ్వుకున్నాడు మదన్.

"దటీజ్ మదన్, కొన్నాళ్ళు మీరు నాకు దూరంగా వుండండి. మదాలస నన్ను పూర్తిగా నమ్మిందాకా, నా వలలోకి పూర్తిగా వచ్చిందాకా...." చెబుతూ నవ్వేసాడు మదన్.

మదన్ ఒక MLA కొడుకు. అతని అనుచరులు వేణు SI కొడుకు, రాజేష్ పేరుమోసిన CRIMINAL LAWYER కొడుకు, వెంకట్ MAYOR కొడుకు.

అందరు మగపిల్లల్లా కాకుండా పద్ధతిగా ఉండే మదన్ అంటే మాదాలసకి మంచి అభిప్రాయం ఏర్పడింది. ఆ అమాయకత్వం స్వచ్ఛమైన స్నేహాన్ని కాంక్షించింది. మదన్ లో నిజమైన స్నేహితుణ్ని వెతుక్కుంది. ఎవ్వరితోను కదలని మదాలస, మదన్ ని ఓ మంచి స్నేహితుడుగా నమ్మి కలిసి వెంట తిరిగింది. తన కష్టాలు, ఇష్టాలు చెప్పుకుంది. అది స్నేహంగా, ఆపై ప్రేమగా మారింది.

మనిషి రూపంలో ఉన్న మృగాలు వాళ్ళు సమయం కోసం ఎదురుచూస్తున్నారు. కాలం కూడా మంచి వాళ్ళ మాటకంటె, చెడ్డవాళ్ళ మాట వింటుంది అన్నట్లు, ఆ సమయం దగ్గరకి రానే వచ్చింది.

రాస్తున్న రవికిరణ్ కలం ఆగిపోయింది. అప్పటిదాకా అదేదో తన కళ్ళ ముందు కదులుతున్న దాన్ని చూస్తూ రాసినట్లు రాసాడు. సడన్ గా కలం ఆగిపోయింది. కాలం ఆగిపోయినట్లనిపించింది.

అప్పుడే తల్లి అన్నం తినటానికి పిలవడంతో ఈ లోకంలోకి వచ్చాడు. రూంలోంచి బయటకు వచ్చి అన్నం తిని మళ్ళీ వెళ్లి కలం పట్టుకుని కూర్చున్నాడు కానీ ఒక్క అక్షరం కూడా పడలేదు. ఆలోచన సాగలేదు.

ఆ రోజు మదాలసకి ఏమి కలిగింది అని రాస్తే కథ మలుపు తిరుగుతుందో అర్ధం కాలేదు. ఆలోచనలోనే మగతగా నిద్ర పట్టేసింది. తెల్లారింది. గదిలోకి వచ్చి సూరీడు గుచ్చుతుంటే మెలకువ వచ్చింది. వదలని బద్ధకాన్ని నీళ్లు పోసి తోమేసి, నెమ్మదిగా కాలేజీకి బయలుదేరాడు.

గత రెండు రోజులుగా తాను లైబ్రరీకి చేరుకున్న సమయానికే ఆ రోజుకూడా వెళ్ళాడు రవికిరణ్. తాను వెళ్ళేసరికే అక్కడ మదాలస కనిపించేసరికి ఆనందపడ్డాడు. ఆమె చేతిలో మళ్ళీ అదే పుస్తకం. వెళ్ళి ఆమె పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. ఆమెకు దగ్గరగా జరిగి "అక్షరాల్లేని పుస్తకంలో ఏమి చదువుతున్నావు మదాలస ?" కొంచెం గట్టిగానే అడిగాడు. పక్కనున్న అందరూ ఒకసారి అతని వంక వింతగా చూసి మళ్ళీ తమతమ పుస్తకాల్లో మునిగిపోయారు.

మదాలస నవ్వుతూ మళ్ళీ ఆ పుస్తకం రవి చేతికిచ్చి చదవమంది. పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని మదాలస వంక ఒకసారి చూసి, పుస్తకంలోకి తల తిప్పాడు. నిన్న కనిపించని అక్షరాలు ఇవాళ దర్శనమిచ్చాయి. తలెత్తి ఆశ్చర్యంగా మదాలస వంక చూసాడు.

"నా వంక తరవాత చూద్దువుగాని. ముందు పుస్తకం చదువు." అందీ మదాలస.

అందానికే అందం ఆమె అందం

మచ్చలేని జాబిలీ ఆమె వదనం

---

---

---

---

ఆ సమయం దగ్గరకి రానే వచ్చింది

అంతే ఆ తరవాత ఒక్క అక్షరం కూడా కనిపించలేదు.

చదవటం పూర్తయిన రవి ముఖాన చెమట పట్టేసింది. అది క్రితం రాత్రి తాను ఇంటి దగ్గర రాసుకున్న కథ. ఇందులోకి ఎలా .... ఆలోచన ఆగిపోయింది. తలెత్తి మదాలస వంక చూసాడు. మదాలస ముఖం ఎర్రబారడం చూసాడు. ఏదో అడగాలనుకున్నాడు. ఇంతలో మదాలస చెప్పడం మొదలుపెట్టింది.

"రవీ, అది నువ్వు రాయాలన్న కథ కాదు. మరుగున పడ్డ సత్యానికి నువ్వు తీస్తున్న పరదా ఇది" మదాలస గొంతులో, ప్రవర్తనలో మార్పు గమనించాడు రవి.

మదాలస ఏదో ట్రాన్స్ లో ఉన్నట్లు మాట్లాడుతోంది.

ఉన్నట్టుండి ఒకరోజు మదన్ మదాలసను పెళ్లిచేసుకోమని అడిగాడు. ఆమె ఆశ్చర్యపోయింది. మనం చదువుకుంటున్నాం. ఇప్పుడు అలాంటి ఆలోచనలు ఎందుకు. ముందు చదువు అయిపోనీ. అప్పటిదాకా మంచి స్నేహితులుగా ఉందాం. ఆ తరవాత ఆలోచిద్దాం, అన్నది".

మదన్ కొంచెం కోపంగానే వెళ్ళిపోయాడు. ఆ తరవాత ఆమెతో చాలారోజులు మాట్లాడలేదు. పరీక్షలు వచ్చాయి. తను బిజీ అయిపోయింది. మళ్ళీ కాలేజీ Annual డే రోజు మదన్ ఆమెను కలిసాడు.

ఆ రోజు కాలేజీ Annual Day Celebrations జరుగుతున్నాయి. స్టూడెంట్స్ అందరూ ఉత్సాహంగా, ఉషారుగా ఉన్నారు. రకరకాల ప్రోగ్రామ్స్ జరుగుతున్నాయి. మదాలసకు అలాంటివి నచ్చవు. రాను అని ఎంత బ్రతిమాలినా వినకుండా రమ్మని బలవంతం చేసి మదన్ తనని అక్కడకి తీసుకెళ్లాడు. ఓ గంట గడిచింది. దూరంగా ఆ కోతిమూకతో మదన్ మాట్లాడడం మదాలస చూసింది. అనుమానమొచ్చింది. భయమేసింది. ఇంతలో మదన్ దగ్గరికి వచ్చాడు. ఏమైంది మదన్ అని అడిగింది. ఏమి లేదు మదాలస, వాళ్ళేదో పిచ్చిగా మాట్లాడితే వార్నింగ్ ఇచ్చి వస్తున్నా అన్నాడు మదన్.

"అందుకే వద్దన్నా మదన్. మనం వెళ్ళిపోదాం" అని బ్రతిమాలింది మదాలస.

"సరే చెరొక కూల్ డ్రింక్ తాగి వెళ్ళిపోదాం" అంటూ ఆమె చెప్పేది వినకుండా పోయి రెండు కూల్ డ్రింక్స్ తెచ్చాడు. ఇద్దరు తాగేసి బయటికి వచ్చారు. తనని ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను, వచ్చి కారెక్కమంటూ వెళ్ళి కారు డోర్ తెరిచాడు. మదన్ మాటలు నమ్మి వెళ్ళి కార్లో కూర్చుంది. ముసురుకుంటున్న చీకట్లు, వీస్తున్న చల్లగాలి మత్తు చల్లిందో, ఏమి జరిగిందో కొద్ది నిముషాలకే మదాలస కారులో స్పృహ తప్పింది.

ఆమెకు తెలివి వచ్చేసరికి వళ్ళంతా నొప్పులుగా అనిపించింది. కళ్ళు బలవంతంగా తెరిచి చుట్టూ చూసింది. ముఖం మీద చల్లటి నీరు పడటంతో తుడుచుకుందామని చెయ్యి కదిలిస్తే చెయ్యి కదలలేదు. కాలు మెదలలేదు. తనని కట్టేశారని అప్పుడు అర్ధమయ్యింది. వెన్నులోంచి వణుకు మొదలయ్యింది. వంటికి చల్లగాలి తగులుతోంది. భయపడుతూ కళ్ళు తెరిచింది. ఎదురుగుండా నగ్నంగా మదన్. ఆ పక్కనే కెమెరా పట్టుకుని వీడియో తీస్తూ వేణు. ఆ పక్కనే రాజేష్, వెంకట్. కళ్ళతోనే తన శరీరాన్ని నాకేస్తున్నారు. జుగుప్స పడి తన వైపు చూసుకుంది. వంటిమీద నూలుపోగులేదు. ప్రాణం చచ్చిపోయింది. కెవ్వుమని కేక పెట్టింది. జరగబోతున్నది అర్ధమయ్యింది. తాను మదన్ ని నమ్మి మోసపోయింది. స్నేహం మాటున కాటేసిన సర్పం వాడు. కూల్ డ్రింక్ లో మత్తు మందు కలిపాడు. అప్పుడున్న భయంలో తనకి అర్ధం కాలేదు. అర్ధమయ్యేసరికి పరిస్థితి చెయ్యి దాటి పోతోంది. ధారగా కన్నీళ్లు వర్షిస్తున్నాయి. నోటితో కేకలు పెడుతూ బ్రతిమాలుతోంది. వదిలిపెట్టమని బతిమాలుతోంది. అది అరణ్యరోదనే అయ్యింది. ఆడది ప్రాణంగా చూసుకునే శీలం ఆ కామాంధుల ఘాతుకానికి బలయిపోయింది. ఒకరితరవాత ఒకరుగా నలుగురు, నాలుగు రోజుల పాటు తమ కామ వాంఛ తీర్చుకుని నిర్దాక్షిణ్యంగా ఆమెను చంపేసి, శవాన్ని హాస్టల్ గదిలో వేళ్ళాడేసి వెళ్లిపోయారు. అందరూ పెద్ద వాళ్ళ పిల్లలు కావడంతో కేసు పక్క త్రోవ పట్టింది. మాదాలసకి పతిత, తిరుగుబోతు అని ముద్రవేశారు. కోర్టులో న్యాయం చచ్చిపోయింది. ఆమె కుటుంబం చితికిపోయింది.

మదాలస గొంతు మూగపోయింది. మాట ఆగిపోయింది. ఒక్కసారిగా నిశ్శబ్దం. సాంతం విని తట్టుకోలేని రవి "నో" అంటూ గట్టిగా అరిచాడు.

పక్కనున్న వాళ్ళు తనని కదిలిస్తూ ఏమైంది అని అడగటంతో ఈ లోకంలోకి వచ్చాడు రవికిరణ్. అదీ అదీ అంటూ మదాలస వైపు చూపించాడు.

"రవీ, ఆ మదాలసను నేనే. భూస్థాపితమైన ఆ నిజాన్ని నువ్వు బయటపెట్టాలి. ఒక ఆడపిల్లకి జరిగిన అన్యాయానికి బదులు చెప్పాలి. చెబుతావు కదూ." ఆగింది మదాలస.

అందరూ తనవైపు అయోమయంగా చూడడంతో రవికి కొద్దికొద్దిగా అర్ధమయ్యింది. మదాలస తనకే కనిపిస్తోంది, ఆమె మాట తనకే వినిపిస్తోంది. ఆమె ఒక ఆత్మ. ఎందుకో ఆ ఆలోచన రాగానే ఒక్కసారిగా అతనికి వళ్ళు జలదరించింది. ఇన్నాళ్లూ తనతో మాట్లాడింది ఒక ఆత్మనా. భయం వేసింది. అంతలోనే ఆమెకి జరిగిన అన్యాయానికి మనసు మూగబోయింది. ఒక ఆడపిల్ల పండంటి జీవితాన్ని కాలరాచిన ఆ దుర్మార్గులపై మనసు రగిలిపోయింది.

"మదాలసా, ఆత్మలకి ఏవో శక్తులుంటాయటగా. మరి ఆ రాక్షసులని ఏమీ చెయ్యలేవా" అడిగాడు రవి. అతని కంఠంలో ఆమెకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం చెయ్యాలన్న సంకల్పం కనబడింది.

"రవీ, నీలోని ఈ మంచితనమే నన్ను నీవైపు ఆకర్షించింది. నువ్వు నాకు న్యాయం చెయ్యగలవాని నా అంతరాత్మకి అనిపించింది. అందుకే నీకు దీనితో ఎటువంటి సంబంధం లేకపోయినా నిన్ను ఇబ్బందిపెట్టాను. నాకు సాయం చేస్తావు కదూ. నా మీద పడ్డ కళంకాన్ని తుడిచేస్తావు కదూ" అడిగింది మదాలస.

"తప్పకుండా చేస్తాను మదాలస. నన్నేంచెయ్యమంటావో చెప్పు" అడిగాడు రవి.

ఒక్క నిముషం మౌనం, "చంపెయ్ నలుగురినీ. వాళ్లకి ఈ లోకంలో బ్రతికే హక్కు లేదు. మరో అమ్మాయి జీవితంతో ఆడుకునే హక్కు లేదు. చంపెయ్" ఆవేశంగా అందీ మదాలస.

"నేను నీ చేతిలో ఆయుధాన్ని మదాలస. శత్రుసంహారం మొదలుపెట్టు" అన్నాడు రవి.

"సమయం ఆసన్నమైంది. పద రవి" అంటూ ముందుకి నడిచింది మదాలస.

★★★★★★★★★

అప్పుడు సమయం రాత్రి 11 గంటల ప్రాంతం. ఊరికి చివరగా వున్నా బార్ అండ్ రెస్టారెంట్ లోంచి బయటికి వచ్చారు మదన్, మిత్రబృందం. పూర్తిగా మందుకొట్టేసి, తుళ్ళుతూ తూలుతూ వచ్చి కారెక్కి మదన్ వాళ్ళ గెస్ట్ హౌస్ వైపు బయలుదేరారు.

వెనకసీట్లో కూర్చున్న రాజేష్, "మామా ఎందుకో ఇప్పుడో పోరి ఉంటే బాగుంటుంది, అనిపిస్తోంది" అన్నాడు మత్తుగా.

కారు సడన్ బ్రేక్ తో ఆగింది.

ఒక్కసారి తలవిదిలించి అందరూ అటువైపు చూసారు. రోడ్డు దాటుతున్న ఓ ఇద్దరినీ కొంచెముంటే కారు గుద్దేసేది. అయినా వాళ్ళు కింద పడిపోయారు. వేణు, మదన్ కారు దిగి ముందుకొచ్చారు. పడ్డ వాళ్ళను చూసారు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. వేణు, మదన్ ఒకరినొకరు చూసుకున్నారు. లోపల చుట్టచుట్టుకుని పడుకున్న కామమనే కాలసర్పం పడగ విప్పి బుసలు కొట్టింది. మనసులో చీకటికోరిక పుట్టింది.

ఆ అమ్మాయిని పట్టుకుని నించో పెడుతూ, "దెబ్బలేమన్నా తగిలాయా ?" అంటూ ఆమెను ముట్టుకోవటానికి ప్రయత్నించాడు మదన్.

"అబ్బే, ఏం లేదులెండి. అయినా తప్పుమాడే. మేమె చూసుకోలేదు. మీరెళ్ళండి" అంటూ వెనక్కి జరిగాడు అతను, ఆ అమ్మాయి చేయిపట్టుకుని.

"లేదండి, తప్పు మాదే. ఇంకొంచెం స్పీడ్ ఎక్కువై ఉంటే అన్యాయంగా ఈరోజు నాచేతిలో రెండు ప్రాణాలు పోయి ఉండేవి" అంటూ దొంగ బాధ నటించాడు మదన్.

"పర్లేదు సార్. మీరు వెళ్ళండి. " అంటూ ముందుకు అడుగేసాడు ఆ అబ్బాయి.

"ఇంతరాత్రి మీరిక్కడకు వెళ్ళాలి. చెప్పండి మా కారులో డ్రాప్ చేస్తాను" అడిగాడు మదన్.

"వద్దులెండి, మీకెందుకు ఆ శ్రమ. రేపు మా చెల్లికి ఇక్కడ ఇంటర్వ్యూ వుంది. తెలిసిన వాళ్ళింటికి వెళితే వాళ్ళు ఊరికి వెళ్లారు. అందుకే ఈ రాత్రికి ఏదన్నా హోటల్ లో ఉందామని బయలుదేరాం" అన్నాడు ఆ అబ్బాయి.

"చాలా రాత్రి అయిపోయింది. ఇప్పుడు మీకెక్కడా దొరకవు. ఒక పని చేయండి. ఈ పక్కనే మా గెస్ట్ హౌస్ వుంది. ఈ రాత్రికి అక్కడ వుంది రేపు వెళ్లిపోండి" జాలి చూపించాడు మదన్.

"చాలా థాంక్స్ అండి. ఈ రోజుల్లో కూడా మీలాంటి వాళ్ళు ఉండడం మా అదృష్టం" అంటూ కారెక్కారు అన్నాచెల్లెళ్ళు ఇద్దరు.

కారు మెయిన్ రోడ్ ఎక్కి సర్రున గెస్ట్ హౌస్ వైపు దూసుకుపోయింది.

మదన్ వాళ్ళతో బాటు వీళ్లిద్దరు ఆ బంగ్లా లోకి అడుగుపెట్టారు. మిత్రులు నలుగురు క్రింద హాల్లో కూర్చుంటూ, మేడపైన ఉన్న గదిలో ఉండండి అంటూ వాళ్లకి పైకి వెళ్ళటానికి దారి చూపించారు. అన్నాచెల్లెళ్ళు పైకి వెళ్లిపోయారు.

ఉన్నమందు గ్లాసుల్లో పోసుకుని చీర్స్ చెప్పుకుని గుటకేసేసారు. పడగవిప్పుతున్నా కామం తరుముతుంటే నలుగురు పైన గది వద్దకి పోయారు. గది తలుపులు దగ్గరగా వేసివుండటంతో తోసుకుని లోపలి వచ్చారు. లోపల ఆ అమ్మాయి ఒక్కతే ఉంది. లోపల్నించి తలుపుకి బోల్టు పెట్టేసాడు రాజేష్.

ఆ అమ్మాయి వీళ్ళని చూసి బెదిరిపోయింది.

"సార్, ప్లీజ్ నేను అలాంటి దాన్ని కాను. నన్ను వదిలెయ్యండి" అంటూ బ్రతిమాలింది, కాళ్ళమీద పడింది, తప్పించుకోవటానికి శతవిధాలా ప్రయత్నించింది. అటూ ఇటూ పరిగెత్తింది. వాళ్ళ మనసు కరగలేదు సరికదా, ఒకడు వోణీ గుంజాడు, మరొకడు ఆమె జాకెట్టు చించాడు. అన్నయ్యా, అన్నయ్యా అంటూ కేకలు పెట్టింది. ఆమె ప్రయత్నం వృధా అయింది. టప్ మంటూ మదన్ కొట్టిన దెబ్బకి వెళ్లి మంచం మీద పడింది. బరితెగించిన కామం బట్టలిప్పింది. ఆమె పైకి లంఘించింది.

ఈ అమ్మాయి ఏడుపు చూస్తుంటే, వాళ్ళు నలుగురుకి మదాలస గుర్తుకొచ్చింది. అదే అన్నాడు రాజేష్. "ఆరోజు మదాలస కూడా ఇలాగే ఏడ్చింది కదరా తమాషాగా. కానీ, భలే మజా వచ్చిందిరా ఆమెతో". అంటూ నాలుక చప్పరించాడు.

వెంటనే వేణు, "అరై మదన్, కెమెరా ఎక్కడరా, మళ్ళీ మన వీడియో మిస్సవుతుంది" అంటూ నవ్వాడు. పక్కనే వున్నా అల్మెరాని చూపించి దాని తాళాన్ని తన జేబులోంచి తీసి ఇచ్చాడు మదన్.

నలుగురు తోడేళ్లలా ఆమె పైకి పడ్డారు, వేణు వీడియో మొదలు పెట్టాడు ఏడ్చే ఆమె చేతులు రాజేష్, వెంకట్ పట్టుకున్నారు. మదన్ ఆమెను ఆక్రమించసాగాడు.

కామంతో కళ్లు మూసుకుపోయిన వాళ్ళ కళ్ళు కప్పి ఓ వ్యక్తి ఆ గదిలోంచి ఓ ముఖ్యమైన వస్తువును తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు. బయటికి వెళుతూనే తన ఫ్రెండ్ వంశీకి ఫోన్ చేసాడు. "ఒరేయ్ వంశీ నువ్వు అర్జెంటుగా నువ్వు మదన్ వాళ్ళ గెస్ట్ హౌస్ దగ్గరకిరా. అలాగే మీ ఫ్రెండ్ ప్రసాద్ ఉన్నాడుగా, ఫోటో స్టూడియో వాడు, వాడిని కొంచెం అర్జెంటు పని ఉంది, స్టూడియో దగ్గరకి రమ్మని చెప్పు" అని ఫోన్ పెట్టేసి, ఒకసారి వెనక్కి తిరిగి గెస్ట్ హౌస్ వైపు చూసి, దబదబా ముందుకి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

వీడియో తీస్తున్న వేణు ఉలిక్కిపడ్డాడు. కెమెరా లోంచి తల పక్కకి తీసి, కళ్ళు తుడుచుకుని మళ్ళీ కెమెరా షూట్ మొదలుపెట్టాడు. మళ్ళీ అదే దృశ్యం. అదిరిపడ్డాడు. ఒక పోలి కేక పెట్టాడు "ఒరేయ్ మదన్" అంటూ వేణు.

వళ్ళు మరిచిపోతున్న మదన్ "ఏంటిరా" అంటూ విసుగ్గా మొహం పెట్టాడు.

"కె...కె... కెమెరాలో నువ్వు ఒక్కడివే కనిపిస్తున్నావురా. ఆ అమ్మాయి కనిపించట్లేదు.." వేణు గొంతు తడారిపోతోంది.

"ఒక్కడు కనిపించటమేమిటి, మజాక్ చేస్తున్నావారా .." కోపంగా అడిగాడు మదన్.

"లే....లే.... లేదురా. నిజం చెబుతున్నాను. విడిగా చూస్తే ఇద్దరూ కనిపిస్తున్నారు. కెమెరా లోంచి చూస్తే ఒక్కడివే కనిపిస్తున్నావు" ఏడిచినంత పని చేసాడు వేణు.

"ఒరేయ్ నువ్వు పనిగానీ" అంటూ రాజేష్ ని ముందుకు తోసి, తాను కెమెరా దగ్గరకి వచ్చాడు మదన్. అదే దృశ్యం. ఒక్క రాజేష్ కనపడుతున్నాడు.

మొదటిసారి భయమేసింది. తాగిన మత్తు వదిలిపోయింది. తల తిప్పి ఆ అమ్మాయి వైపు చూసాడు. కళ్ళు బైర్లు కమ్మాయి. అక్కడ మదాలస వుంది.

"రా మదన్ రా. ఇక్కడేగా ఆరోజు నన్ను అనుభవించి చంపేసావు. ఇప్పుడేమైంది రా" అంటూ పిలుస్తోంది మదాలస.

"దె... దె.....దెయ్యం ..." అంటూ కేకపెట్టాడు వెంకట్.

ఆ గదిలోంచి బయటికి వెళ్ళటానికి పరుగులుపెట్టారు నలుగురు. మదాలస కనుసన్నతో అన్ని తలుపులు మూసుకుపోయాయి. మదాలస కళ్ళు నిప్పులు వర్షిస్తున్నాయి.

"ఎంత మోసం చేసావ్ మదన్. ఎవ్వరినీ నమ్మని నేను, నువ్వు చూపించిన మంచితనాన్ని నిజమని నమ్మి, నీ వెనక తిరిగాను. నువ్వు నా నిజమైన స్నేహితుడని ఆశపడ్డాను. అలాంటి నన్ను, స్నేహం ముసుగులో వంచించావ్. మత్తిచ్చి మానభంగం చేసావ్. ఆడది ప్రాణప్రదంగా చూసుకునే శీలాన్ని నాశనం చేసావు. అది చాలదన్నట్లు, నీ పరపతితో తప్పు నా నెత్తిన రుద్ది, నన్ను పతితను చేసావ్. నీవల్ల, నా కుటుంబం నాశనమయ్యింది. మీరు చేసిన అఘాయిత్యాలకు చరమగీతం పాడటానికి వచ్చాను. మిమ్మల్ని ఎవ్వరినీ ఊరికే వదలను. హ హ హ హ ......." నవ్వుతోంది మదాలస.

దొరికిన కుర్చీలను తీసుకుని అద్దాలు పగల కొట్టడానికి ప్రయత్నించారు అందరు. ఫలితం సూన్యం.

"మదాలస, మమ్మల్ని వదిలేయ్, నువ్వెంచెయ్యమంటే అది చేస్తాం" భయంతో వణికిపోతూ బ్రతిమాలాడు మదన్.

"మదన్, గుర్తుందా, ఆ రోజు నేను కూడా ఇలానే మిమ్మల్ని బ్రతిమాలాను. నా చేతులు కాళ్ళు కట్టేసి నాతొ మృగంలా ప్రవర్తించావు. అప్పుడు నా ఏడుపు నీకు పాపమనిపించలేదా... ఇప్పుడు నీపైన నేను జాలి చూపించాలా..?" గద్దించింది మదాలస.

"నాతో పొరపాటయింది మదాలస. నేనేంచెయ్యాలో చెప్పు. చేస్తా. కానీ, నా ప్రాణం తియ్యకు. మమ్మల్ని వదిలేయ్" బ్రతిమాలాడు మదన్.

"సరే ఒకపని చెయ్. మీరు నలుగురు నా విషయంలో ఏం చేశారో, మొత్తం రికార్డు చెయ్" అంది మదాలస.

"నలుగురు తమ వాజమూలం రికార్డు చేశారు. మరుక్షణం అది వాళ్ళ సెల్ లోంచి రవికి ట్రాన్స్ఫర్ అయిపొయింది.

వెలుగుతున్న లైట్లు టపాటపామని కొట్టుకున్నాయి. ఒక్కసారిగా గదిలోకి గాలి రివ్వుమని వచ్చింది. కిటికీ రెక్కలు కొట్టుకున్నాయి. వేళ్ళాడుతున్న కర్టెన్లు ఎగిరెగిరి పడ్డాయి. స్విచ్ బాక్స్ లో స్పార్క్ వచ్చింది. చకచకమని ఆ స్పార్క్ అంటా పాకింది. చూస్తుండగానే గది అంతా మంటల్లో చిక్కుకుంది. గేటుదగ్గరున్న గూర్ఖా ఆ మంటలు చూసి పరిగెత్తుకొచ్చాడు. తలుపులు తోసినా అవిరాలేదు. మదన్ వాళ్ళ తండ్రికి, ఫైర్ ఇంజన్ కి ఫోన్ చేసాడు. అందరూ వచ్చేలోపలే నలుగురు మంటల్లో కాలి బూడిదకుప్పలైపోయారు. జరిగేది చూస్తూ మనసులో భారం తీర్చుకుని గాలిలో అదృశ్యమైపోయింది మదాలస.

★★★★★★★★★

అందరూ పోగయ్యే సరికి తెల్లవారిపోయింది.

గుర్తు తెలియని వ్యక్తినుంచి ఫోన్ రావటంతో మీడియా అంతా ఆ MLA గెస్ట్ హౌస్ దగ్గర గుమిగూడారు.

అక్కడకి వచ్చిన, MLA ని, మేయర్ ని, SI ని, CRIMINAL లాయర్ ని చుట్టుముట్టారు మీడియా జనాలు. ఎందుకిలా జరిగింది. కారణం వాళ్ళు ఏమనుకుంటున్నారు. ఎవరన్నా చేశారా లాంటి ప్రశ్నలు గుప్పించేసారు. వచ్చిన పోలీసులకి అక్కడ ఆ జరిగిన సంఘటనకి సంబంధించి ఎటువంటి సాక్ష్యం దొరక్క పోవటంతో షార్ట్ సర్క్యూట్ అని రాసుకుని వెళ్లిపోతుండగా, ఆ బూడిద కుప్పల దగ్గర ఒక ప్యాకెట్ దొరికింది. ఓపెన్ చేసి

చూస్తే అందులో ఒక CD, వాళ్ళు నలుగురు మాదాలసని పాడుచేస్తున్న ఫోటోలు దొరికాయి. వచ్చిన ఇన్స్పెక్టర్ SI ని పక్కకి పిలిచి చెప్పాడు. షాక్ తిన్న SI వాటిని దాచెయ్యమన్నాడు. జనంలో కలిసిపోయివున్న రవి అరే ఇక్కడేదో ప్యాకెట్ వుంది అంటూ అటువంటిదే మరో ప్యాకెట్ మీడియా చేతికిచ్చాడు. వాటిని చూసిన మీడియా దిగ్భ్రాంతి చెందింది.

రవి కళ్ళు మదాలస కోసం వెతికాయి. తన పక్కనే ఆమె శ్వాస తగిలిన అనుభూతి. పక్కకి తిరిగి చూసాడు. మదాలస ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. ఏదో సాధించానన్న ఆత్మ తృప్తి ఆమె కళ్ళల్లో కనబడింది. "రవీ, నన్ను నేను నిరపరాధినని నిరూపించుకోవటంలో నాకు ఎంతో సాయం చేసావు. థాంక్స్ రవి" అంది మదాలస. ఆమె కళ్ళు కృతజ్ఞతతో నిండిపోయి అశ్రుపూరితాలయి వున్నాయి. "వెళుతున్నాను రవి" అంటూ అనంతంలో కలిసిపోయింది.

పేపర్లో తిరిగి వార్త ప్రచురితమయింది. మదాలస అమాయకత్వం విని జనం రోదించింది. ఆమె మంచితనం అందరికి జాలి కలిగించింది.

"పోస్ట్ " అన్న పిలుపుతో ఆలోచనలో వున్నా రవి కళ్ళు తెరిచి, బయటకి వెళ్లి వచ్చిన కవరు తెచ్చుకున్నాడు. దానిపైన ఫ్రం అడ్రస్ ఆంధ్రభూమి అని ఉండటంతో, ఎక్సయిట్ అయ్యాడు. కవర్ ఓపెన్ చేసాడు.

"డియర్ రవీ,

మీరు పంపిన సగం నవల చాలా బాగుంది. దానిని మా వీక్లీలో సీరియల్ గా ప్రచురించాలని నిర్ణయించుకున్నాము. ఈ లెటర్ తో పాటు అడ్వాన్స్ రెమ్యూనరేషన్ పంపిస్తున్నాం. మీరు తరవాతి భాగాన్ని కూడా సిద్ధం చేయండి. ఈ వారం నుంచే మీ సీరియల్ ప్రారంభమౌతుంది. All the Best.

సంపాదకుడు,

ఆంధ్రభూమి"

రవి ఆనందానికి హద్దులు లేవు. పరుగు పరుగున వెళ్లి ఆ కవరు తండ్రికి చూపించాడు.

ఇది ఆరంభం.

## ఓం పుండరీకాక్షాయ నమః — రాజశేఖర్ తటవర్తి

"పిల్లలూ! ఎల్లుండి శ్రావణ పౌర్ణమి. కుదిరితే జందెం మార్చుకోండి." అని వాట్సఆపులో వాయిస్ మెసేజ్ పెట్టింది విశ్వనాథం వాళ్ళ అమ్మ। సమయాంతరం వలన విదేశాల్లో ఉన్న తన పిల్లలకి వాయిస్ మెసేజీలు పెడుతూవుంటుంది సుబ్బలక్ష్మమ్మ. "ఇలాంటివన్నీ ఇక్కడ కుదరవమ్మ. మాకు చెప్పకు. చెయ్యలేమూ అలాగని చెయ్యలేదని బాధపడకుండా ఉండలేము" అని ఒకటి రెండు సార్లు పిల్లలు కసురుకున్న మూలాన పండగలు పర్వదినాలు గుర్తుకు చెయ్యడం బాగా తగ్గించేసింది సుబ్బలక్ష్మమ్మ.

వినాయక చవితి, దీపావళి, సంక్రాతి, ఉభయ తాతగార్ల ఆబ్దికం వంటి ముఖ్యమైన రోజులు మాత్రమే ఫోనుకాలుగాని వాయిస్ మెసేజ్ గాని పెడుతూఉంటుంది. మెసేజీలో ఎప్పుడూ ఆఖర్న "కుదరకపోతే ఫరవాలేదు నాన్న నేను ఇక్కడ మీ తరఫున పూజ చేస్తానులే. పొద్దునపొయి రాత్రి

ఎప్పుడో వస్తారు. మాయదారి ఉద్యోగాలు. దేనికీ ఖాళీవుండదు. కనీసం వేళకైనా నెయ్యి వేసుకొని సరిగ్గా భోజనం...." అని వాయిస్ ఐకాన్ పైన మాట మధ్యలోనే వేలు తీసేసిన మూలాన ఆఖరి పదం ఎప్పుడూ కట్ అవుతూవుంటుంది. పిల్లలకి ఇది అలవాటయిపోయి ఆ ఆఖరి పదం ఖాళీని వారే పూరించుకుంటూవుంటారు.

సుబ్బలక్ష్మమ్మ పెద్దకొడుకు విశ్వనాథం తన భార్యా పిల్లలతో గత పదేళ్లగా సింగపూర్లో స్థిరపడ్డాడు. అక్కడ ఒక కంపెనీలో ఫైనాన్స్ హెడ్డుగా పనిచేస్తున్నాడు. చదువుకుంటున్న రోజుల్లో హైదరాబాదులో తన తల్లి తండ్రుల దగ్గరవుండి డిగ్రీ పూర్తిచేసాడు. సుబ్బలక్ష్మమ్మ రోజూ తెల్లవారుఝామున నాలుగున్నరకి పూజ చేయటం విశ్వానికి బాల్యంనుండీ జ్ఞాపకం.

విశ్వనాథం తండ్రి తటస్థంగా ఉన్నా, సుబ్బలక్ష్మమ్మ పట్టుబట్టిమరీ పిల్లలిద్దరికీ 7వ ఏటనే ఉపనయనం చేయించింది. వటువు విశ్వనాథం బాలశంకరాచార్యుల్లాగా ముఖవర్చసుతో వెలిగిపోయేవాడు. బడిలో ఉన్నప్పుడు ఆకతాయితనం వలన అనుష్ఠానం ఎగ్గొట్టేద్దామని ప్రయత్నించినా ఆ పప్పులు ఉడకనిచ్చేదికాదు సుబ్బలక్ష్మమ్మ. గీతాప్రెస్ వారి సంధ్యోపాసనవిధి పుస్తకం పైకి చదువుతూ, తానే పక్కనుండి పిల్లలిద్దరిచేత పూర్తి ఉపాసనావిధానం కంఠస్తం చేయించింది, మూడురకాల ఆచమనాలు, ముద్రలతో సహా.

మొలతాడుతో బిగియగట్టిన పట్టుపంచెలో, ఆ లేత చేతులతో ఆచమనం చేస్తోంటే ఆ చిన్నారి విశ్వాన్ని చూసి మురిసిపోయేది. ఆదివారం వస్తే విశ్వానికి హడల్. త్రికాలసంధ్య బంపర్ ఆఫరుతోపాటు 108 మార్లు మంత్రజపం చెయ్యాల్సిందే. మణిపూస ఎప్పుడొస్తుందా అని కళ్ళుమూసుకుని చకోరపక్షిలా ఎదురుచూసేవాడు. మంత్రం స్పష్టంగాకాక గొణిగితే మళ్ళీమొదట్నించే ఛా పరీక్షలాగా (ఈ అభ్యాసం వల్లే కామోసు విశ్వనాథం చార్టెడ్ అకౌంటెన్సీ (CA) మొదటి దఫాలోనే ఉత్తీర్ణుడయ్యాడు)

తరువాత కాలేజికెళ్లే రోజుల్లో అరగంటముందు నిద్రలేపి "ఒరేయ్ ఒక్క ఐదు నిమిషాలైనా అనుష్ఠానం చేసుకువెళ్లరా" అని బ్రతిమాలేది. వినకపోతే ఒరేయ్ ఇవాళ హనుమంతుడికి ప్రీతికరమైన రోజు పూజ తప్పక చేసుకోమనో లేక ముక్కోటి ఏకాదశనో, కనుమనాడు కాకి కూడా పూజ చేస్తుందనో యిలా నయానా భయానా చెప్పడంవలన, కష్టమనిపించినా వారానికి ఒకటి రెండుసార్లు కాలాతీత ప్రాయశ్చిత్తార్ఘ్యం యిచ్చి ప్రాతఃసంధ్య అయ్యిందనిపించేవాడు. అనుష్ఠానంచేయడం కష్టమనిపించినా దగ్గరున్న భావన్నారాయణస్వామి గుడి మాత్రం అతనికి అంతులేని మానసిక ప్రశాంతతనిచ్చేది. తరచుగా ఆ గుడిలో అన్నదానం గట్రాలో చేయూతనిచ్చేవాడు.

డిగ్రీ పూర్తి చేసిన తరువాత విశ్వనాథానికి ఒక ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. పని నిమిత్తం ఆరు నెలలు అతనిని సింగపూర్లో భర్తీ చేశారు. అక్కడ సెరంగూన్ రోడ్డులో ఒక రూమ్ అద్దెకి తీసుకొని ఉండగా శ్రీవల్లి అనే ఒక తమిళ అమ్మాయితో పరిచయయ్యి ప్రేమగా మారి ఒక సంవత్సరం తరువాత వివాహం జరిగింది.

కంపెనీలో మాట్లాడి సింగపూర్కి పెర్మనెంట్ పోస్టింగ్ వేయించుకున్నాడు. వల్లి కూడా ఒక ఈట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. పెళ్ళైన తరువాత సింగపూర్లో కొత్త జంట బెడోక్ ప్రాంతంలో ఒక వన్ రూమ్ కిచెన్ అద్దెకు తీసుకున్నారు. వారానికి ఐదు రోజులు ప్రొద్దున్నే ఏడుగంటలకి ఇల్లు తాళంపెట్టి వెళ్లిన మొగుడు పెళ్ళాం మళ్ళీ రాత్రి ఎనిమిదింటికి వచ్చేవారు. చాలా సాయంత్రాలు ఆఫీస్ దగ్గరే కలుసుకొని ఒక రెస్టారెంట్లో భోజనం చేసి ప్రామేనాడ్ బ్రిడ్జి మీద కొంతసేపు కబుర్లు చెప్పుకొని ఇంటికి అలసిపోయి వచ్చి హాల్లోనే పడుకొనే వారు.

ఇద్దరు పనిచేస్తున్నందున శ్రమవిభజన చేసుకొని ఒక రోజు విశ్వనాథం మరొక రోజు వల్లి ప్రొద్దుటే ఐదింటికి లేచి వంట వండి ఇద్దరికీ లంచిబాక్సులు సద్దుతోంటే, మరొకరు వాషింగ్మిషనులో బట్టలు వేసి, బ్రేక్ఫాస్టుకి కార్న్ ఫ్లేక్స్ రెండు చిప్ప బౌల్స్ లో రెడీ చేసేవారు.

రెడీ అయ్యిన తరువాత హడావిడిగా హాలులో కప్బోర్డు పై గూటిలోఉన్న ఒక చిన్న శ్రీ వెంకటరమణమూర్తి పటానికి దూరం నించి ఒక నమస్కారబాణం వేసి, తన కుడిచేతి బొటన మరియు చూపుడు వ్రేళ్ళను జోడించి తన పెదాలకు తగిలించి తరువాత అదే వ్రేళ్ళని తన ఛాతిమధ్యకు తాకించి, వంచిన చూపుడువేలితో లెంపలేసుకొని, ఒక అగరత్తు వెలిగించి రెండుసార్లు గిరాగిరా పటం చుట్టూతిప్పి అదే అనుష్ఠానం అని సరిపెట్టుకునేవాడు. ఒకొక్కపుడు గుర్తొస్తే ట్రైన్ (MRT)లో కూర్చొని ఒకటి రెండు స్తోత్రాలు మానసికం చేసుకొనే వాడు।

సుబ్బలక్ష్మమ్మ ఇప్పట్లో వాట్సఆపులో ప్రతీ కృష్ణపక్షానికి శుక్లపక్షానికి, మాసం మారినప్పుడు, ఋతువు మారినప్పుడు గుర్తు చేస్తూ ఉండేది. మధ్య మధ్యలో చాగంటి కోటేశ్వరరావుగారి "సంధ్యావందనం చేసుకోపోతే వచ్చే అనర్ధాలు" లేక గరికపాటివారి "సంధ్య ఎందుకు చేయాలి?" వంటి యు ట్యూబ్ లంకెలు "పిల్లలూ ఇది తప్పక వినండి" అనే మెసేజితో పెట్టేది. విశ్వనాథం వీడియోకాల్సులో విసుగ్గా "అమ్మా! అవన్నీ ఇక్కడ కుదరవమ్మా. పనివత్తిడి కూడా బాగా ఎక్కువ" అనగానే "అందుకేరా దీని అవసరం మరీ ఉంది. కొంచెం సమయం చేసుకుని రోజూ అనుష్ఠానం చేసుకొంటే మనోనిబ్బరం పెరుగుతుంది. భోజనానికీ నిద్రకీ సమయం దొరకట్లే, అలాగే ఎలాగో ఒకలాగా వీలు చేసుకోవాలిమరి" అని సౌమ్యంగా మందలించేది.

ఒకసారి వీడియోకాల్ లో విశ్వనాథం వంటిపైన యజ్ఞోపవీతం లేకపోవడం చూసి "జందెమేదిరా అబ్బాయి?" అని అడగగా తడుముకొని టక్కునలేచి స్నానాలగదిలో చిలక్కొయిన బనియన్తో పాటు వేళ్ళాడుతున్న జంధ్యాన్ని కళ్ళకద్దుకొని చటుక్కున వేసుకొచ్చాడు. మరొకసారి యజ్ఞోపవీతాన్ని అపసవ్య దిశగా వేసుకోవడం చూసి వీడియోలోనించి కొట్టినంతపని చేసింది సుబ్బలక్ష్మమ్మ.

త్రికాలసంధ్య నించి కాలాతిక్రమణ ప్రాయశ్చిత్తార్ఘ్యం అక్కడనించి కుదిరితే అప్పుడప్పుడు మానసికం చేసుకొనే దశకు వచ్చిన తన ఈ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని అప్పుడపుడు ఆఫీసుకెళ్లే దార్లో కునుకుపాట్లు పడుతూ రైలులో సింహావలోకనం చేసుకునేవాడు.

పొద్దుట నుండి రాత్రి వరకు ఇంట్లోనూ దప్తరులోనూ బాగా బిజీగా ఉన్నా, ఆర్ధికపరంగాను మరియు వృత్తి పరంగాను అభివృద్ధి ఉండడం వలన రోజులు బాగా ఉత్సాహంగా గడచిపోయేవి. ఇంత హడావిడిలో కూడా ప్రతి శనివారం సాయంత్రం విశ్వనాథం, వల్లి తప్పనిసరిగా దగ్గరలో ఉన్న మరియమ్మన్ గుడికి వెళ్లి అన్నదానం చేసేవారు.

సింగపూరుకి వచ్చిన తరువాత తన ఆఫీసు సహోద్యోగులు ప్రతి శుక్రవారం సాయంత్రం బీర్ ఓ క్లోక్ (Beer O' clock) అని సెంటరుకి వెళ్ళేవాళ్ళు। మొదట్లో విశ్వనాథం ప్రతివారం వెళ్ళకపోయినా నెలకొకసారి వెళ్లి ఒక పయింట్ సేవించి ఇంటికి వచ్చి మరునాడు తన యజ్ఞోపవీతాన్ని మార్చుకొనేవాడు.

యదహ్నా"త్-కురు'తే పాపం తదహ్నా"త్-ప్రతిముచ్య'తే । యద్రాత్రియా"త్-కురు'తే పాపం తద్రాత్రియా"త్-ప్రతిముచ్య'తే । అంటే ఏ పూట పాపం ఆ పూట ప్రక్షాళన అయ్యేలాగా ప్రార్ధన అన్నమాట। అప్పుడప్పుడు చేసినా నిత్యానుష్ఠానంలో ఈ సదుపాయం ఉన్నందుకు చాలా సంబరపడ్డాడు విశ్వనాథం।

ఇలా నెలకొకసారి నించి వారానికి ఒకసారి శుక్రవారం సాయంత్రం సహోద్యోగులతో వెళ్లడం వృత్తిపరంగా తప్పని సరయ్యింది విశ్వనాథానికి. కొన్నాళ్ళకు తాను కూడా వారాంతం స్నేహితులతో గడపడానికి ఎదురు చూసేవాడు. సహోద్యోగులతో స్నేహసంబంధాలు బలపరచుకోవడానికి మరియు వ్యక్తిగత సడలింపు సమయంగా ఈ శుక్రవారం సాయంత్రాళ్ళు (Happy Hours) పనికి వచ్చేవి. ఒకసారి పుండరీకాక్ష అని మనస్సులో క్షమాపణ చెప్పుకుని కానిచ్చేసేవాడు.

ప్రతిసారి ప్రక్షాళన చేసుకొనేటప్పుడు, చిన్నప్పటి ఆచారాలని, నమ్మకాలని మరువలేక, అదే సమయంలో తన క్రొత్త దైనందన జీవనశైలి మరియు ఆలోచనావిధానం మార్చుకోలేకా తాను స్వీయవంచన చేసుకుంటున్నాడని, రెంటికి చెడ్డ రేవడిలా ఉన్నాడని చాలా తర్జన భర్జన పడి శ్రీవల్లితో కూడా చర్చించగా ఆమె నిర్లిప్తంగా "థింక్ అబౌట్ ఇట్ బేబీ. నేను నీ ఏ నిర్ణయాన్నైనా సమర్ధిస్తాను." అని విశ్వనాథం నుదుటుని చుంబించి కిండిల్ లో పుస్తకపఠనం కొనసాగించింది.

కొన్నాళ్లకి తనలో తానే మదనపడుతూ, రేపు పిల్లలకి ఏలాంటి ఆదర్శం చూపిస్తున్నాని, తన తల్లితండ్రులు బాధని, చుట్టాలు దెప్పుళ్లను యిలా లాభనష్టాలు బేరీజు వేసుకొని ఎన్నో నిద్రలేని రాత్రుల తరువాత ఒక నిర్ణయానికి వచ్చాడు.

వచ్చే 10 -15 ఏళ్ళ సమయం లౌకికపరంగా చాలా ముఖ్యమైనది। ఇప్పటి రోజులలో క్రితంకాలం లాగా నిష్ఠగా ఉండాలంటే కష్టంతో కూడుకున్నపని. తన ఆచారాన్ని తన దృష్టిలో చులకన చేయతలచుకోలేదు విశ్వనాథం. అలాగని వీటి మీద బేషరతుగా నమ్మకం ఇంకా కుదరలేదు। జందెం వేసుకుని అనుష్ఠానం లేకుండా, మద్యపానం, అసౌచం సేవిస్తూ ఆచారాన్ని , అమ్మ నమ్మకాన్ని వమ్ము చేసేబదులు తాను మనసా వాచా కర్మణా నమ్మే రోజువరకు ఈ నిత్యకర్మలు చేయనని నిర్ణయించు కొన్నాడు।

యజ్ఞోపవీతాన్ని గౌరవిస్తూ తదుపరి శనివారంనాడు ప్రొద్దునే ఆఖరిసారి సంధ్య చేసుకొని, 108 సార్లు మంత్రోచ్చారణచేసి "యజ్ఞోపవీతం శిరో మార్గేణ సంత్యజేత్" అని చెమర్చిన కళ్ళతో తలమీదుగా జంధ్యాన్ని తీసివేసి, వేళ్లమీదగా చుట్టి చిన్నదండగా చేసి ఒక పచ్చటి మొక్క మొదట్లో పూడ్చాడు విశ్వనాథం. గుండెనుండి పెద్దభారం తొలగినట్లైంది. నూతన యజ్ఞోపవీతధారణ ఇంక చెయ్యలేదు.

మధ్యాహ్నం తనకు తానుగా అమ్మకి వీడియో కాల్ చేసాడు.

"చెప్పరా విశ్వం" అంది అమ్మ వాత్సల్యంతో. "భోజనాలు అయ్యాయా? అన్నట్టు శ్రావణ పౌర్ణమి జందెం మార్చుకున్నావా?" అడిగింది యధాలాపంగా.

"లేదమ్మా" అన్నాడు విశ్వనాథం బేలగా.

గొంతులో వేదనని పసిగట్టిన సుబ్బలక్కమ్మ "ఏమైంది నాన్నా! వంట్లో బాగానే ఉందా? ఆఫీసులో ఏమైనా టెన్షనా" అని అడిగింది ఆతృతగా.

తన సందిగ్ధం, తత్సంబంధ నిర్ణయం అమ్మకి చెప్పాడు. సుబ్బలక్ష్మమ్మ ఏమీ మాట్లాడలేదు. కాదు..మాట్లాడలేకపోయింది. పట్టుపంచె కట్టి శ్రద్ధగా ఆచమనం చేస్తున్న చిన్నారి విశ్వం ఒక్కసారిగా ఆమె కళ్ళముందు మెదిలాడు. రోజు సంధ్యచేసుకోవటానికి పేచీపెట్టిన చిన్నప్పటి విశ్వానికి ఇప్పటి విశ్వనాథానికీ పెద్దతేడా కనిపించలేదు సుబ్బలక్ష్మమ్మకి. అప్పుడు దోస్తులతో క్రికెట్ ఆడడానికి ఆత్రుతపడేవాడు. ఇప్పుడు లౌకికమనే ఆట. ఏదైనా ఆటే కదరా శివా అనుకుంది. అప్పుడు ఆ మారాం ముద్దొచ్చేది. ఇప్పుడు మనస్సు చివుక్కుమంటోంది. అసంకల్పితంగా తిరిగిన కంటనీరుని కొడుకు చూడకుండా కళ్లని పెద్దవి చేసి, ఒక్కసారి తలని వెనక్కి చాచి ఆ నీటిని కంటిలోపలికి పంపించడానికి ప్రయత్నించింది.

"ఎన్నాళ్ళు ఉందామని ఇలాగ?" ప్రశ్నించింది నిరాశతో, కన్నీటిపొర వలన మసకగా కనపడుతున్న విశ్వనాథంతో.

"తెలీదమ్మా! " అన్నాడు అనిశ్చయంగా.

“ఈ అనూచాన ఆచారం మానిన మాత్రాన నేను చెడ్డవాడిని కానమ్మ” అని చెప్దామనుకున్నాడు విశ్వనాథం కానీ అతని గొంతు పెగలలేదు.

“ఇది సాంప్రదాయమో ఆచారమో కాదు మన విధి అనీ, సమస్య నమ్మకానిది కాదు చేయాలనే పట్టుదల, తీరిక చేసుకోవాలనే ఆకాంక్షది” అని చెప్దామని, పిల్లవాడు మరింత నొచ్చుకుంటాడని సుబ్బలక్ష్మమ్మ పైకి అనలేదు.

"పోనీలేరా నాకు ఓపికున్నన్నాళ్లు నేను మనందరికోసం ప్రార్ధన చేస్తానులే. నాకు వేరే పనాపాటా!." అన్నది దాని బదులుగా.

ఓం పుండరీకాక్ష। పుండరీకాక్ష! పుణ్డరీకాక్షాయ నమః.

## ఏది నా ఉనికి? — భాస్కరలక్ష్మి కర్రా

"నాన్నమ్మా! రా, మామ్ మిర్చి బజ్జి వేస్తోంది, అందరం బ్యాక్ యార్డ్ లో ఉన్నాము, ఫాస్ట్ గా రా నాన్నమ్మ"

సాయంత్ర దీపాలు పెట్టి, ఎం.ఎస్.రామారావు గారి సుందరకాండ వింటుంటే నా మనవడు ఇంగ్లీష్ లాంటి తెలుగులో పిలిచేసరికి ,మెల్లిగా లేచి ఇంటి పెరట్లోకి వెళ్ళాను. వేడిగా మిర్చి బజ్జి, చల్లగా నిమ్మసోడా.. రెండు నాకు ఇష్టమయినవే, అక్కడ నాకు స్వాగతం పలికాయి.

జూన్ నెల , ఎండాకాలం వేడి గాలులు, చుట్టూరా రక రకాల హరిత వర్ణాలు,ఎంతో అందంగా ఉండే పూల తోటలు. నేను వచ్చి ఇరవై ఏళ్ళు అవుతున్నా న్యూ జెర్సీ వేసవి అందం లో మార్పు లేదు.

చలికాలంలో ఎంత నిస్తేజంగా ఉంటుందో, వసంత వేసవిలో అంత అందంగా ఉంటుంది ఈ ఊరు. ఎక్కడ కోనసీమలో పల్లెటూరు అనాతవరం.. ఎక్కడ న్యూ జెర్సీ? ఆలోచిస్తే అంతే చిత్రంగా ఉంది. ఇంకో వారంలో డెబ్బైయవ సంవత్సరంలో అడుగుపెడుతున్న నేను, అనగా సుబ్బలక్ష్మీ ని

అనాతవరంలో జమీందారి కుటుంబంలో పెరిగి, అమలాపురం లో ఉండే డాక్టర్ గారికి భార్యగా వచ్చి, లేక లేక ఒక మగ బిడ్డని కని, ఇరవై ఏళ్ళ క్రితం జీవిత భాగస్వామిని కోల్పోయాను.

ఊరిలో ఇల్లుని, పొలాన్ని అమ్మేసి, బంధువులని వదిలి, ఇక్కడ ఈ దేశంలో స్థిరపడ్డ నా కొడుకు కోడలి దగ్గరికి రాక తప్పలేదు. ఇక్కడికి వచ్చేటప్పటికే స్కూలుకు వెళ్లే మనవరాలు, చంటిపిల్లాడు అయిన మనవడు, చెరో దిక్కు ఉద్యోగాలకని వెళ్ళే కొడుకు కోడలు.. హడావుడి జీవితమే. ఏమనుకున్నారో ఏమో, నేను వచ్చిన ఏడాదే కోడలు ఉద్యోగం మానేసింది. ఇంట్లో నుండి చేసుకునే ఉద్యోగం లో చేరింది. ఆ తరువాత పిల్లలు హైస్కూల్ కి వచ్చేసరికి, నాలుగు పడక గదుల గల ఈ ఇల్లు కట్టించారు.

ఈ ఇంటికి మా అమలాపురంలో ఇంటికి పెద్ద తేడా లేదంటే నమ్మితీరాలి. సువిశాలమయిన పెరడు, పూజకి ప్రత్యేకంగా గది, పూజగదిలో నా రాముడు, మెట్ల కింద ఉండే గది నాకోసం, పెరట్లో ఋతువులకి తగ్గట్టుగా రకరకాల పూలు, పళ్ళు, కూర మొక్కలు.. ఇంటి ముందు రోజూ ముగ్గు, ఇంట్లో దీపం, ఇవే ఇంటికి, ఇంటి యజమానికి ఆరోగ్యం, శుభం అని నేను చెప్పిన నా మాటని తూచా తప్పకుండా పాటిస్తుంది నా కోడలు. కారు నడపడం దగ్గర నుండి ఇంట్లో పనుల వరకు అన్నీ తానే చూసుకుంటుంది. ఇక్కడ ఉండే తెలుగు వాళ్ళ ఇంటికి, వారితో అప్పుడు అప్పుడు ప్రవచనా గోష్టికి, వారంవారం ఇక్కడ ఉండే వెంకన్న గుడికి నన్ను క్రమం తప్పకుండా తీసుకుని వెళుతుంది. తనకి వంటలో, తోటలో , ఇంటి శుభ్రంలో సహాయం చేస్తూ, పుస్తకాలు చదువుతూ , వాళ్ళు ఎక్కడికి తీసుకుని వెళ్తే అటు వెళ్తూ కాలక్షేపం చేస్తున్నాను. ఈ మధ్యే మనవరాలి పెళ్ళి కూడా ఇక్కడ గుడిలో అంగరంగ వైభోగంగా చేశారు, అచ్చం మన ఊరిలో పెళ్ళి లాగానే. మరి ఇక్కడ దొరకనిది లేదు కదా. తాటాకు పందిరి నుండి, మావిడాకుల వరకు అన్ని దొరుకుతాయి. ఈ ఊరిని అందుకే లిటిల్ ఇండియా అని అంటారుట.

ఇక్కడ నాకు ఏ లోటు లేదు, అయినా కూడా ఏదో అసంతృప్తి. బంగారు పంజరంలో స్వేచ్ఛ లేని ముసలి పక్షిలాగా! ఇన్నేళ్లలో కేవలం రెండు సార్లు మటుకె భారతదేశం వెళ్లగలిగాను. అది కూడా హైదరాబాద్ లో ఉండే నా కోడలు తల్లిదండ్రుల చివరి చూపుకి. వెళ్లిన రెండు సార్లు నెల రోజులున్నా, వెళ్లిన పని వేరు కాబట్టి నా ఊరు చూసుకోలేకపోయాను. సొంత ఊరిలో ఉండే స్వేచ్ఛ, ఆప్యాయత, పుట్టి పెరిగిన ఆనవాళ్లు ఇవే జీవిత చరమాంకంలో మనకి బలాన్ని ఇస్తాయి. ఎప్పటికప్పుడు తిరిగి వెళ్లిపోవాలని ఉంటుంది కానీ అడిగి, వద్దు అనిపించుకోవడానికి ఇష్టపడక అడగలేదు.

ఇన్నాళ్ళు సద్దుకుని ఇదంతా ఇప్పుడు ఎందుకు అంటారా, దానికి కారణం లేకపోలేదు. రాజమండ్రిలో ఉండే నా తమ్ముడు, మొదటిసారిగా అమెరికాలో ఉండే వాడి కూతురి దగ్గరకు వస్తున్నాడు. ఈ వారం చివర్లో నా పుట్టినరోజుకని నన్ను కలవడానికి వస్తున్నాడు. ఇక్కడ ఒక నెల రోజులు ఉంటాడు. ఈలోపు నా మనసులో మాట చెపితే, వాడితో పాటు తిరుగు ప్రయాణంలో వెళ్ళవచ్చునని నా ఆశ.

"నాన్నమ్మ తిను తిను కోల్డ్ అయిపోయాయి, బజ్జిస్.." అని నా మనవడు అనడంతో ప్రస్తుతంలోకి వచ్చాను.

ఇంతలో నా కోడలు " అత్తయ్య, వేడి గా ఇంకో వాయ వేసాను, ఇవి తినండి. ఆ పక్క సందులో ఉండే తమిళం అమ్మాయి పేరెంట్స్ ఇండియా నుండి వచ్చారుట. వాళ్లకి ఇంట్లో తోచట్లేదు అంటే ఇలా రమ్మన్నాను. కాసేపట్లో వస్తారు. మీకు కాసేపు సందడిగా ఉంటుంది."

"నాకు తమిళం రాదు కదే! ఏం మాట్లాడ మంటావు?" అని నేను పూర్తి చేసేలోపే, "కానీ వాళ్ళకి తెలుగు వచ్చులే అత్తయ్య" అనేసి దాని పనిలో పడింది. పని రాక్షసి కదా మరి, ఎంత సేపు పని తప్ప నాతో మాట్లాడనికి సమయం లేదు దానికి. కనీసం నా కొడుకుకి అయినా నా ప్రయాణం సంగతి చెప్పాలి. రేపు పొద్దున్నే, నా మనవడు కొడుకు కసరత్తు చేసే సమయంలో చెప్పేస్తాను.

ఇంతలో ఆ తమిళ దంపతులు రానే వచ్చారు, ఇంటిని ఇల్లాలిని చూసి తెగ మెచ్చుకున్నారు. చెన్నై మహా నగరం లో ఏదో అపార్ట్మెంట్ లో ఉంటారట వాళ్ళు, అందుకని ఇంత విశాలమయిన ఇల్లు చూసి చాలా రోజులయిందన్నారు.

పూజ మందిరం, నా గది చూసి కాసేపు అలా ఉండిపోయాయిరు. నా పుస్తకాల అర చూస్తూ పేరు పేరునా ఏ పుస్తకమో అడిగి తెలుసుకున్నారు. వంటింట్లో అధునాతన వస్తువుల తో పాటు , చిన్న పాటి రుబ్బురోలు చూసి అవాక్కయ్యారు. అది మా కోడలు నా కోసం వెతికి వెతికి మరీ కొందని గర్వంగా చెప్పాను.ఇంటి పెరడు లో చెక్క తో చేసిన చిన్న పాటి గదిని చూసి ఆశ్చర్యపోయారు.

"ఆ గది నా కొడుకు నా కోసం కట్టిన కుటీరం, ఇంట్లో కన్నా, నేను ఎక్కువ సేపు ఇక్కడే గడుపుతాను.ఇందులో నేను పుస్తకాలు చదువుకోవడం కోసం ఒక పడక కుర్చీ, యోగా ధ్యానం చేసుకోవడానికి ఒక చాప తప్ప ఏమీ ఉండవు" అని చెప్పేసరికి వాళ్ల ఆనందానికి అవధులు లేవు.

"మీరు చాలా అదృష్టవంతులు. అమెరికాలో కూడా మీకు తగ్గట్టుగా, మన సంప్రదాయలని గౌరవిస్తూ ఇవన్నీ చేయగలుతున్నారు అంటే మీ పిల్లలు , మనవళ్లు మీకోసం ఎంతో ఆలోచిస్తున్నారు అని అర్థం అయింది. మేము అక్కడే ఉంటూ కూడా ఇవన్ని చేయడానికి వీలులేకుండా ఇప్పుడు పరిస్థితులు ఉన్నాయి" అని అనేసి భోజనాలు చేసి వాళ్ళ ఇంటికి వెళ్లిపోయారు.

నా గదిలోకి పడుకోడానికి వెళ్ళానే కానీ నిద్ర పట్టలేదు. ఇందాక వచ్చిన వాళ్ళు వీలు లేని పరిస్థితులు అంటున్నారు, నేను వచ్చిన ఈ ఇరవై ఏళ్ళలో అంత మార్పు వచ్చి ఉంటుందా? ఆ అది చెన్నై మహానగరం. మాది అమలాపురం టౌన్ కదా! ఏమి మారదులే! ముఖ్యంగా ఆ పచ్చని పొలాలు, సందు చివర రామాలయం, వీధి అరుగులు మీద ఇరుగు పొరుగు తో కబుర్లు, ఎప్పుడు అంటే అప్పుడు , ఒకళ్ళమే ఎంచక్కా బయటకి వెళ్లే సౌకర్యం, చలి కాలం లో ఒక శాలువా కప్పుని కూడా విధుల్లో తిరిగే వీలు, నిత్యం తగిలే సూర్య రస్మి  ఇవన్నీ నాకు ఇక్కడ అందని ద్రాక్షలే మరి. వాటికోసం అయినా నా ఊరుకి వెళ్లి తీరాలి.

తెల్లారే, అందరూ లేచి వారి వారి పనులలో హడావిడి గా ఉన్నారు. మనవడు తెగ కసరత్తు చేస్తున్నాడు, వాళ్ళ నాన్న పేపర్ చదువుతున్నాడు, మెల్లగా నేను వాడి పక్కన కుర్చోగానే, పరిగెత్తు కుంటూ నా మనవడు వచ్చి,

"నాన్నమ్మా ..నీకో సర్ప్రైజ్, నీ బర్త్ డే గిఫ్ట్ , అది ఇస్తే నాకేం ఇస్తావు?"

ఆ ఏముంటుంది చీరలు, కేకులు, లేకపోతే పుస్తకాలు అని మనసులో అనుకుని

"ముందు ఇవ్వు, అప్పుడు ఆలోచిస్తా" అని అంటుండగానే నా కోడలు వచ్చి,

"ఒరేయ్ అలా ఊరించ కూడదు, ఆ కవర్ తీసుకొచ్చి ఇవ్వు నాన్నమ్మ కి" అని అనేసరికి నా మనవడు ఒక తెల్లటి ఎన్వలప్ కవర్ తీసుకొని వచ్చాడు.

ముగ్గురు కలిపి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు అని చెపుతూ ఆ కవర్ ని నా చేతిలో పెట్టారు. అది తెరవగానే ఇంగ్లీష్ లో ఏదో ప్రింట్ చేసి ఉంది.

అప్పట్లోనే పదో తరగతి దాకా చదువుకున్నా, తెలుగు తప్ప ఇంగ్లీష్ చదవడం రాదు నాకు. కానీ ఇక్కడికి వచ్చాక ఇంగ్లీష్ నేర్చుకోక తప్పలేదు. మెల్లిగా నా కళ్ళదాలు సరి చేసుకుని చదవడం మొదలు పెట్టాను.

కొంత చదివేసరికి అది విమానం టికెట్ అని అర్థం అయింది, పూర్తిగా చదివేసరికి అది ఇండియా.. అంటే నా ఉనికికి టికెట్ అని అర్థం అయింది. నా మనస్సులో ఉన్న కోరికని నేను చెప్పకుండానే తెలుసుకున్న నా కుటుంబాన్ని ఆరాధన గా చూశాను. మాటలు రాలేదు, ఆనందభాష్పాలే!

వెంటనే నా కొడుకు "అమ్మా, ఈ టికెట్ ఐడియా నీ కోడలుదే. నీ పుట్టినరోజు కి బహుమతి ఏం ఇవ్వాలా అని తర్జనభర్జనలు అవుతూ ఉంటే, "అత్తయ్య కి ఆవిడ ఊరు వెళ్ళాలని మనసులో ఉంది. ఇప్పుడు ఎలాగూ మీ మావయ్య వస్తున్నారు కదా. కాస్త ఆవిడకి ప్రయాణం లో తోడు గా ఉంటారు, ఒక మూడునెలలకి పంపించండి. తిరుగు ప్రయాణం లో మనం వెళ్లి తీసుకునిరావచ్చు" అని అంది.అందుకే టిక్కెట్లు తీసాను. మావయ్యకి అన్నీ చెప్పాను. మన ఊరిలో మన ఇంటిలోనే , నీకు ఒక గదిని ఏర్పాటు చేశాడు మావయ్య. ఈ మూడు నెలలు నువ్వు అక్కడే ఉండచ్చు"

మూడు నెలలు ఏంటి, నేను ఎప్పటికి అక్కడే ఉండిపోవాలని అనుకుంటుంటే, కానీ ఆ విషయం ముందే తెలుస్తే అసలుకే మోసం వస్తుందేమో కదా. అక్కడికి అంటూ వెళ్ళాక, నాకు ఇక్కడే సుఖంగా ఉందని, ఓపిక, ఊపిరి ఉన్ననాళ్ళు ఇంక ఇక్కడే అని చెప్పేయచ్చు.. అని ఊరుకున్నాను.

ఇంతలో నా మనవడు "నాన్నమ్మ, నువ్వు అక్కడికి వెళ్ళాక డైలీ వీడియో కాల్ చేస్తూ ఉండాలి, నీకు అక్కడ ఏ ప్రాబ్లమ్ వచ్చినా వెంటనే చెప్పాలి సరేనా. అక్కడ ఏదో ఉంది అనుకుని వెళ్తున్నావు కానీ , చూడు వెళ్ళాక నీకే తెలుస్తుంది. అవతలి వైపు పచ్చన అని ఇంగ్లీష్ లో ప్రోవెర్బ్

ఉంది లే" అని వ్యంగ్య గా అనేసరికి ,ఒక్కసారిగా వాడు అన్నదాంట్లో నిజం ఉందా అని భయం వేసింది. అయినా కూడా నా మాతృభూమి మీద ప్రేమ దాన్ని కప్పేసింది.

చూస్తుండగా నా తమ్ముడు రావడం, నా పుట్టినరోజు వేడుక జరుపుకోడం జరిగిపోయాయి. గిర్రున నెల తిరిగి నా ప్రయాణం తేదీ కూడా వచ్చేసింది. అన్నీ సర్దుకుని సిద్ధంగా ఉన్నాను, ఇంకొన్ని రోజుల్లో నా కల నెరవేరబోతోంది మరి.

కొడుకు, కోడలు, మనవడు చెప్పిందే చెప్పి, నాకు వంద జాగ్రత్తలు చెప్పారు, ఎంతయినా ఇదే మొదటిసారి గత ఇర్రవై ఏళ్ళ లో వాళ్ళని వదిలి రావడం. విమానాశ్రయం లోపలి దాకా వచ్చి , మాకు వీడుకోలు పలికారు.

న్యూ జెర్సీ నుండి నేరుగా ముంబై వెళ్ళే విమానం, పదమూడు గంటల్లో వెళ్లేలాగా టికెట్ తీసుకున్నారు. అయినా కూడా ముంబై నుండి హైదరాబాద్, అక్కడ నుండి రాజమండ్రి మా తమ్ముడు ఇంటికి వెళ్ళేసరికి నాకు దారిలోనే నా రాముడు కనిపించాడు మరి. దిగి దిగగానే శ్రావణమాసం అనే పేరు కానీ ,ఆ ఉక్క, బంక తట్టుకోలేకపోయాను. ఇవాళే కదా వచ్చాను, కొన్ని రోజుల్లో అన్ని అవే నెమ్మదిగా అలవాటు అవుతాయిలే అనుకున్నాను.

మొదటి వారం అంతా ఒకటే నిద్ర, జెట్ లాగ్ కదా. ఏదో మా మరదలు చేసిన వంట ఇంత తిని, మనవడితో ఫోన్ లో మాట్లాడి , పడుకోడం తప్ప చేసింది ఏది లేదు. ఆ తరువాత వారం కాసేపు గోదావరి దాకా వ్యాహ్యాళి కి వెళ్లి రావడం, ఏవో పుస్తకాలు చదవడం మొదలు పెట్టాను. మరదలు చేసే వంట బానే ఉన్నా, కోడలి వంటకి అలవాటు పడ్డానేమో, నేనే ఇంత ఉడక వేసుకుని తిన్నాను. ఎంత సేపు టీవీ సీరియల్స్ చూసే మరదలు, పొద్దున్నే వెళ్ళి సాయంత్రానికి వచ్చే తమ్ముడు, రాజమండ్రి వేడి , ఆ మూడు పడక గదుల అపార్ట్మెంట్, నాకు కావాల్సిన సాంత్వనని ఇవ్వలేకపోయాయి.

ఇంకో వారం ఉండాలని గొడవ చేసినా, అమలాపురం లో నన్ను దించమని కోరాను. అనాతవరం మీదుగా అమలాపురం తమ్ముడి కార్ లో బయలు దేరాము. నేను పుట్టిన ఊరు, చదివిన బడి ఇదే అని చూపించినా కూడా నేను గుర్తుపట్టలేదు, అంతగా మారిపోయాయి. పంట పొలాలు చాలా మటుకు తగ్గిపోయి చేపల చెరువులు ప్రత్యక్షమయ్యాయి. ఎక్కడా కూడా మండువా ఇళ్ళు ,పెంకుటిళ్ళు లేవు, అన్ని కాంక్రీట్ వే. అమలాపురం ఎప్పుడు వస్తుందో అని అనుకుంటుంటే, అమలాపురంలోనే మనం ఉన్నాము అనడంతో ఒక్కసారి బయటకి చూసేసరికి నాకు ఏమి అర్థం కాలేదు. గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. ఏవో మాల్స్, కొత్త కొత్త బిల్డింగులు, చుట్టూరా అన్ని అపార్ట్మెంట్స్. మేము ఉన్న సందులోకి కారు పోనిచ్చి ఇదే మీ ఇల్లు, అని అనడం తో దిగి తేరిపారా చూసుకున్నాను. సందు మొత్తం కుంచించుకు పోయింది అనిపించింది.

ఇల్లు కూడా మొత్తం మారిపోయింది. వసారా, పెరడు ఏవి లేవు. అంతా మార్చేసి. అందులోనే మూడు పోర్షన్ లుగా విభజన చేశారు, అద్దెకు ఇచ్చే లాగా. నాకోసమని కింద పోర్షన్ లో ఒక గది అద్దెకి తీసుకున్నారు. ఆ పక్కన ఉండే వాళ్ళు నాకు ప్రతి పూట భోజనం పంపించేలా ఏర్పాటు చేసారు.

ఇప్పటి దాకా ఈ ప్రయాణంలో నాకు పెద్దగా నచ్చినదంటూ ఏది లేదు ఒక్క గోదావరి, అక్కడ అక్కడ పంట పొలాలు తప్ప. కనీసం ఈ ఇంట్లో ,ఈ మనుషుల మధ్య నా ఉనికి ఉందేమో చూడాలి.

“ఏ అవసరం వచ్చినా వెంటనే ఫోన్ చేయి” అంటూ, తమ్ముడు రాజమండ్రి బయలుదేరాడు.

నాకు ఇచ్చిన గది శుభ్రంగా ఉంది, అందులోనే స్నానాల గది కూడా ఉంది. చిన్న మంచం, ఒక బీరువా కూడా ఉన్నాయి. స్నానం చేసి, నా సామాన్లు సద్దుకున్నాను.

ఇంతలో పక్కింటి వాళ్ల బాబు "అమెరికా మామ్మగారు , వాట్ డు యు వాంట్? అంటూ వచ్చాడు. ఒక్కసారి నా మనవడు గుర్తుకువచ్చాడు. బయట ఎలా ఉన్నా కూడా, ఇంట్లో ముఖ్యం గా నాతో, తెలుగులోనే మాట్లాడాలని వాళ్ళ అమ్మ ఆర్డరు, అందుకే కష్టం అయినా తెలుగులోనే మాట్లాడుతాడు.

"ఈ పూటకి ఏమి వద్దులే బాబు, ఏకంగా రాత్రి భోజనం చేస్తాను. కొదిగ్గా కాఫీ మటుకు పంపించు" అని చెప్పి, నా మనవడికి ఫోన్ చేసి ఇప్పటిదాకా జరిగినదంతా చెప్తే వాడు ఒకటే నవ్వు, ఎండ కావాలని అని వెళ్లావు చూడు , ఆ ఉక్కలో బాగా ఎంజాయ్ చేయి అని చెప్పి ఫోన్ పెట్టేసాడు.

కాసేపు నడుం వాల్చి , పుస్తకం చదువుతూనే ఒక కునుకు పట్టేసింది. ఇంతలో పక్కింటి నుండి భోజనానికి అని పిలుపు వచ్చింది. బాగా ఆకలిగా ఉంది, అసలే అమలాపురం భోజనం, ఇంకా ఎక్కువ ఆకలి వేసింది. వెళ్లే సరికి ఆ ఇంటి ఇల్లాలు సోఫా లో కూర్చుని టీవీ చూస్తోంది. వాళ్ళ అబ్బాయి, భర్త నాకోసం కంచం పెట్టి అన్ని వడిస్తున్నారు. ఇల్లు చిన్నదే అయి , ఇల్లంతా దుమ్ము ధూళితో సామాన్లు. ఎక్కడ పొందికగా సద్దుకునట్టు లేదు. ఎక్కడ పడితే అక్కడ బట్టలు. ఇంటి బయట ముగ్గు లేదు, ఇంట్లో దీపము లేదు. కనీసం వంట అయిన బాగుంటే బావుండు అనుకుంటూ వెళ్ళేసరికి ,

"రండి రండి మీకోసమే ఇవ్వన్ని ఏర్పాటు చేసాము. వచ్చి కూర్చోండి" అంటూ ఆవిడ లేచి వచ్చింది. తినడం మొదలు పెట్టాను. కంచం లో ఒక పది రకాలు ఉన్నాయి. "పెళ్ళి భోజనం లా ఇన్ని చేశారు ఏంటండీ" అని అనగానే " అయ్యో ఇది పెళ్ళి భోజనం కాదు అండి, బుట్ట భోజనం" అందా ఇల్లాలు.

'బుట్ట భోజనామా!?" అదేంటి అన్నట్టు గా చూస్తూ ఉండిపోయాను.

వెంటనే ఆవిడ " ఇది కాకినాడ లో బాగా పేరున్న సుబ్బయ్య హోటల్ వాళ్ళ బుట్ట భోజనం అండి. మా వారు తరచుగా పని మీద కాకినాడ వెళ్ళినపుడల్లా ఆ హోటల్ కి వెళ్ళి ఈ బుట్ట భోజనం తెస్తుంటారు." అంటే అంతగా ఇంట్లో వంట కూడా చేసుకోరు అన్నమాట. ఇంక ముందు ముందు నా పరిస్థితి ఏంటో అర్థం అయింది. నిట్టూరుస్తూ నా కోడల్ని ఒక వందసార్లు తలుచుకున్నాను. దానికి పని తప్ప మాట్లాడం చేతకాదని అనుకున్నాను కానీ, నాకోసం నాకు తగ్గట్టు ఉంటూ చక్కగా ఇంటిని , కుటుంబాన్ని బంగారంలా చూసుకుంటోందని గ్రహించలేకపోయాను.

ఈ బుట్ట భోజనం దెబ్బకి కాసేపు అలా సందు చివర దాకా వెళ్ళి వస్తే కానీ కడుపు కాస్త సద్దుకునేలాలేదు. సందు దాటి అలా వెళ్తే తెల్సిన వాళ్ళు ఎవరయినా కనిపిస్తారు, అరుగుల మీద ఎవరో ఒకరు కబుర్లు చెప్పుకునే సమయం కదా అని అలా వ్యాహ్యాళి కి వెళ్ళాను. వీధిలో ఏ ఇంటి బయట అరుగులు లేవు, అక్కడ అక్కడ జనాలు మాత్రం ఉన్నారు. నా వయసున్న ఒక ఆవిడ దగ్గరకు వెళ్లి నేను ఇలా ఫలానా అని పరిచయం చేసుకుని, ఇది వరకు నేను ఉన్నపుడు మా ఇరుగు పొరుగు ఎవరు అయినా ఇక్కడ ఉన్నారా అని అడిగాను.

దానికి ఆవిడ " నేను వచ్చి పదేళ్లు అవుతోంది అండి. మా అబ్బాయి బ్యాంక్ లో పనిచేస్తాడు. మీరు చెప్పిన వాళ్ళు అందరూ సగం మంది అమెరికాకి , సగం మంది బెంగళూరుకు, హైద్రాబాదుకు వలస వెళ్లిపోయారు అండి. పిల్లల కోసం తప్పదు కదండీ. ఒకళ్ళే ఉంటే ఎవరు చూస్తారు, పైగా ఇప్పుడు బాగా రేట్లు కూడా పెరిగాయి. ఉన్నపుడే కొంత లాభానికి అమ్ముకుని సొమ్ముచేసుకుని, రిటైర్మెంట్ జీవితాన్ని ఆనందంగా గడువుతున్నారు.ఇంకా అరుగులు , ఇరుగు పొరుగు అలాంటివి కనుమరుగు అయిపోయినట్టే నండి. అలా వీధిలో అరుగులు ఉన్నా కూడా మంచికి రోజులు కావు, ఎవడో ఒకడు ఒక మొత్తు మొత్తి మెడలోవి, చేతిలోవి తీసుకుని పోతాడు. అందుకే చీకటి పడ్డాక బయటకి రాకపొడమే మేలు. ఉంటాను అండి " అని చెప్పి ఆవిడ ఇంటికీ వెళ్ళిపోయింది.

అందని ద్రాక్ష పుల్లనే అన్నమాట. నేను ఉహించుకున్నవి ఏవి ఇక్కడ లేవు, తెల్లారే లేచి , రామాలయం చూడాలి. కనీసం అది అయిన మారకుండా ఉంటే బావుండు అనుకుంటూ నా గదిలోకి వెళ్ళి, నిజం తెలిసిన నీరసంతో నిద్రలోకి జారుకున్నాను.పొదున్నే లేచి స్నానం చేసి నా రాముడిని చూడడానికి వెళ్ళాను. గుడి మటుకు అలానే ఉంది, నా రాముడు నన్ను చూసి " ఏ సుబ్బలక్ష్మి నా కోసం ఇక్కడి దాకా రావాలా ,అంతటా నేను ఉన్నాను కదా, మరి నీ మందిరంలో, నీ మదిలో కూడా ఉన్నట్టే కదా అని" అన్నట్టు అనిపించింది.

దండం పెట్టుకుని తిరుగి నా గదికి నడుస్తున్నానే కానీ ఒకటే ఆలోచనలు.ఇన్ని వేల మైళ్ళు దూరం , నా ఉనికి కోసం , నా వాళ్ళ కోసం వచ్చాను కానీ, బాగా మారిపోయిన ఈ ఊరుని, ఏ మాత్రం స్వీకరించటలేదు నా మనస్సు. మారిన వాతావరణాన్ని, తట్టుకోలేక పోతోంది నా వయస్సు. ఏది అయితేనే నా మనవడు అన్నట్టు , అవతలి వైపు గట్టు పచ్చన అని, ఎప్పుడు కూడా మనం ఎక్కడ ఉంటామో , ఎం చేస్తుంటామో దాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి. మన చుట్టూ ఉన్న ప్రదేశంలో కన్నా, మన కోసం ఆలోచించే మనుషులోనే మన ఉనికి ఉందని గ్రహించాను.

వెంటనే నా మనవడికి ఫోన్ చేసాను

"నాన్నమ్మా! ఇవాళ ప్రోగ్రాం ఏంటి, ఎటు వెళ్తున్నావు ?"

దానికి నేను" న్యూ జెర్సీ కి రా"అని అనగానే

"వాట్!! మామ్ నాన్నమ్మ వచేస్తా అంటోంది"

“అవునా! ఏమయింది అత్తయ్య! అక్కడ నచ్చలేదా మీకు. మేము వచ్చే వరకు ఉండలేకపోతే మీకు ముందే టిక్కెట్లు తీయిస్తాను. ముంబయి దాకా ఎవరయినా తెల్సిన వాళ్ళని ,మీకు తోడూ గా పురమాయిస్తాను. అక్కడ నుండి మీరు ఒకటే ఫ్లైట్ ఎక్కి న్యూ జెర్సీకి వచ్చేయచ్చు" అని అంది.

"ఆ పని చేయవే అమ్మాయి. నావల్ల కావడం లేదు ఇక్కడ. అలాగే నన్ను ఇంటికి తీసుకునివెళ్ళడానికి విమానాశ్రయానికి వచ్చేడప్పుడు నీ చేత్తో చేసిన మెత్తటి ఇడ్లెన్లు, రోట్లో నూరిన కొబ్బరి పచ్చడి, చింతపండు పులిహోర తప్పనిసరిగా తీసుకునిరావే తల్లి. ఇక్కడ జీవం లేని తిండి తిని విసుగొచ్చేసింది".

నా కోడలు నవ్వుతూ “తప్పకుండా అత్తయ్య” అని ఫోన్ పెట్టేసింది.

బంగారు పంజరం లో ముసలి పక్షి లాగా స్వేచ్ఛ లేదు అనుకున్నాను కానీ, సుతిమెత్తని పూలతో చేసిన కుటీరంలో , ఎంత వరకు నేను ఎగరగలనో అంత వరకే నాకు స్వేచ్ఛని ఇచ్చి, అంతకు మించి ఎగిరితే పడిపోతానని విశ్రాంతి కల్పించారని, ఈ ప్రయాణం పుణ్యమా అని తెలిసొచ్చింది మరి.

## అమ్మా నాన్నా బంగారు తల్లీ.. కృపాకర్ పోతుల

‘బంగ్స్’,...అంటే....’బంగారుతల్లి’ ఫోనులో మాట్లాడుతున్న మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి ప్రక్కగదిలో నాన్నకీ, వంటగదిలో అమ్మకీ. ఎందుకు వినబడవూ ఆ పిల్ల ఆరున్నొక్క రాగంలో సన్నాయి నొక్కులు నొక్కుతుంటే.

“హాయ్ ‘బేంగీ’ ( “బంగారాని”కి షార్ట్ ఫార్మ్. తన కాబోయే భర్తకి ‘బంగ్స్’ పెట్టుకున్న ముద్దుపేరది). ఎల్లుండి వేలెంటైన్స్ డే గుర్తుందా? ఆ రోజు ప్రోగ్రామ్ ఏమైనా ప్లాన్ చేసావా? ఓ... లెట్స్ మీట్ ఇన్ ద పబ్ నియర్ మై ఆఫీసా. ఎరౌండ్ నైనా. ఓకే . లెటజ్ డూ ఒన్ థింగ్ రా ఇడియట్. పబ్ లో అరౌండ్ ట్వెల్వ్ వరకూ స్పెండ్ చేసి ఆ తరవాత అక్కడే పార్క్ లో లెట్స్ స్ట్రాల్ ఫర్ అన్ హౌర్ ఆర్ సో. దేర్ ఆఫ్టర్ యూ కేన్ డ్రాప్ మీ ఎట్ హోమ్. లెట్స్ హేవ్ సమ్ ఫన్ యార్ . లవ్ యూ సో మచ్ రా రాస్కెల్. సీ యూ లేటర్ రా. బా.......య్” అని ఈకాలపు సాఫ్ట్ వేర్ యువతరంలా మూడొంతులు ఇంగ్లీషులోనూ, మిగతా ఒక్కొంతూ తెలుగులోనూ స్టైల్ గా మాట్లాడి, హై హీల్డ్ షూస్ టకటక లాడించుకుంటూ బయటకొచ్చి “అమ్మా రాత్రి నాకు టీమ్ డిన్నర్ ఉంది. వచ్చేటప్పటికి లేటవుతుంది. నా కోసం తినకుండా కూర్చొని, ఇంత లేట్ అయ్యిందేమని తరవాత సతాయించొద్దు” అని అరుచుకుంటూ బయటకి నడిచింది వయ్యారంగా.

బంగారుతల్లి కారు స్టార్టయ్యి, బుర్రుమని బయల్దేరిన శబ్దం చెవిలో పడగానే రయ్యిమని దూసుకొచ్చిందమ్మ నాన్నున్న గదిలోకి. “వింటున్నారా దాని వాగుడు. ‘వేలెంటైన్స్ డే’ అట, పబ్బట, రాత్రి పన్నెండు గంటలతర్వాత పార్కో్ల్ స్ట్రాలింగట. భయం భీతీ లేకుండా ఎలా వాగుతుందో చూసారా. భయమేస్తోందండీ దాన్ని చూస్తుంటే. ఏంచెయ్యాలో కాస్త ఆలోచించండీ” అంది ఆందోళనగా.

ఏం చెప్పాలో తోచలేదు నాన్నకి. ఒక్కగానొక్క బిడ్డ. కాలు కింద పెడితే కందిపోతుందేమోనన్నంత అపురూపంగా పెంచుకున్నారు. “కొండమీద కో....” మాట పూర్తవకుండానే కోతిని తెచ్చి కూతురి చేతిలో పెట్టి మురిసిపోయేవారు. పిల్ల ఫిఫ్త్ స్టాండర్డ్ చదువుతున్నప్పుడు, “డాడీ మాస్కూల్ బస్ లో ఒన్లీ మిడిల్ క్లాస్ కిడ్సే వస్తారు తెలుసా. రిచ్ కిడ్స్ ఓన్ కార్స్ లోనే వస్తారు. ఐ టూ వాంట్ టు గో ఇన్ అవర్ కార్ డాడీ. బస్ లో

వెళ్ళాలంటే షేమ్ షేమ్ గా ఉంది" అని బుంగమూతి పెడితే, "అబ్బో.. ఇంత చిన్నప్పట్నుండీ ఎంత కాస్ట్లీ టేస్టులో బంగారుతల్లికి. బస్సెక్కదంట, కార్లోనే వెళ్తుందంట" అని తెగ ముచ్చట పడిపోయి వారం రోజుల్లో కారు కొని కూతురి ముద్దు తీర్చారు.

స్కూలావస్థ దాటి కాలేజ్యావస్థకి వచ్చేటప్పటికి ఇంకా కాస్ట్లీ టేస్టు సంతరించుకుంది 'బంగ్స్'. ఎట్ లీస్ట్ 'హోండా సిటీ' ఆర్ 'స్కోడా రేపిడ్' గాని ఉంటే తప్ప "ఐ షల్ నాట్ గో టు కాలేజ్ " అని భీష్మించుక్కూర్చుంటే ఆ ముచ్చట కూడా తీర్చి మురిసిపోయారు అమ్మా నాన్నా. ఇక బట్టలకీ జోళ్ళకీ, సెంటుబుడ్లకీ, లిప్ స్టిక్కులకీ ఎంత డబ్బు తగలేస్తున్నా "ఉన్నదొక్క నలుసూ. సంపాదించినదంతా దానికే కదా. ఖర్చేపెట్టుకుంటుందో, దాచే దాచుకుంటుందో దానిష్టం" అనుకొని ఆనందించేరు తప్ప ఎప్పుడూ పన్నెత్తి ఒక్కమాట కూడా అనలేదు కూతుర్ని. ఇద్దరూ మంచి ఉద్యోగాల్లోనే ఉండడంతో 'బంగ్స్' ఎలాంటి గొంతెమ్మ కోరికలు కోరినా అవి తీర్చడం కష్టంకాలేదు అమ్మా నాన్నలకి. కాకపోతే ఆడింది ఆటా పాడింది పాటగా పెరగడంతో, పెద్దా చిన్నా మంచీ మర్యాదా అనేవి ఏకోశానా వంటబట్టించుకోకుండా, వట్టి రాలుగాయిలా తయారైంది బంగారుతల్లి. ఎవరైనా స్నేహితులుగాని, దగ్గర బంధువులుగాని కొంచెం హెచ్చరించబోయినా "కుళ్ళువెధవలు. మనం పిల్లని అతిముద్దు చేసి పాడుచేసేస్తున్నామట. తగ్గించుకుంటే మంచిదట. లేకపోతే తరవాత బాధ పడాల్సివస్తుందట" అని తిట్టుకోవడవే కాకుండా, వాళ్ళతో మాటలు మానెయ్యడం లాంటి కొకారీ పనులు కూడా చెయ్యడంతో కొన్నాళ్ళకి స్నేహితులూ బంధువులూ అంటూ ఎవరూ లేకుండా ఒంటిపిల్లిరాకాసుల్లా మిగిలిపోయారు అమ్మా నాన్నా. అంత క్రమశిక్షణారాహిత్యంలో పెరిగిన బంగారుతల్లికి చదువబ్బుతుందని మెడకాయమీద తలకాయున్నవాడెవడూ ఏనాడూ అనుకోలేదు. అయితే, సరస్వతీ కటాక్షం నిండుగా ఉండడంతో పిల్లకి చదువు సునాయసంగానే ఒంటబట్టింది. సిటీలో చాలామంచి పేరున్న కాలేజీలో ఇంజనీరింగ్ చేసి, గొప్ప మల్టీనేషనల్ కంపెనీలో పెద్ద ఉద్యోగం సంపాదించుకుంది.

"హమ్మయ్యా. బ్రహ్మాండంగా చదువుకొని, బ్రహ్మాండమైన ఉద్యోగం తెచ్చుకుంది బంగారుతల్లి. ఇక బ్రహ్మాండమైన సంబంధం చూసి పెళ్ళి చేసేస్తే మన బాధ్యత తీరిపోతుంది" అని తలంచి, వెంటనే "జలజా రాయ్ వెడ్డింగ్ లింక్స్" వంటి హైక్లాస్ పెళ్ళిసంబంధాలు కుదిర్చే సంస్థలో కూతురి వివరాలు నమోదు చెయ్యించేరు అమ్మానాన్నా. చెయ్యించేరన్న మాటేగాని "ఇలా చేస్తున్నాం తల్లీ" అని ఒక్క మాటైనా, కనీసం మాటవరసక్కూడా చెప్పలేదు బంగారుతల్లికి.

విషయం తెలిసిన అగ్గిమీద గుగ్గిలం అయిపోయింది బంగారుతల్లి. "నా పెళ్ళి విషయంలో మీ పెత్తనం ఏంటి బోడి" అని దబాయించింది. "హూ గేవ్ యూ ద రైట్. ఇదే అమెరికాలోనో, ఇంగ్లండ్లోనో అయితే పేరెంట్స్ దు నాట్ పోక్ దెయిర్ నోసెస్ ఇన్ సచ్ మేటర్స్. ఈ డర్టీ ఇండియా లోనే దిస్ కైండ్ ఆఫ్ న్యూసెన్స్" అని ఆంధ్రాంగ్ల భాషల్లో అందంగా విసుక్కోవడమేకాకుండా, "నా మేరేజ్ విషయంలో డోంట్ ఇంటర్ఫియర్ ఇన్ ఫ్యూచర్" అని గట్టిగా హెచ్చరించి 'ఐటీసీ కాకతీయ హోటల్లో' ఫ్రెండ్స్ తో డిన్నర్కి వెళ్ళిపోయింది కోపంగా.

పిల్ల నిష్క్రమించిన తరవాత సోఫాలో సొమ్మసిల్లిపోయిన అమ్మా నాన్నా ఓ గంట తరవాతగాని కళ్ళుతెరవలేదు. తెరిచాక "కిం కర్తవ్యం" అని తలపట్టుకున్నారు. అలా పట్టుకొనే ఉన్నారప్పట్నుండీ.

మొదట్లో "ఇప్పుడే కదా జాబ్లో చేరాను అప్పుడే పెళ్ళేంటి" అంటూ అమ్మనీ నాన్ననీ నోరెత్తనివ్వని బంగారుతల్లి రెండేళ్ళ తరవాత, "ఎట్లీస్ట్ టీమ్ లీడ్ అయితే గాని నో క్వస్చిన్ ఆఫ్ మేరేజ్" అని హూంకరించడం మొదలుబెట్టింది. తీరా టీమ్ లీడ్ అయ్యాక పెళ్ళి సంగతేంటంటే, "వాట్ ద హెల్ . టీమ్ లీడ్ అయ్యి జస్ట్ టూ యియర్సే కదా. అప్పుడే తొందరేంటి? లెట్స్ సీ ఆఫ్టర్ నెక్స్ట్ ప్రొమోషన్" అంది వేరే మాట మాట్లాడదానికి తావివ్వకుండా.

"అమ్మా మాకూ వయసైపోతోంది కదా. నీ మెళ్ళో మూడు ముళ్ళూ పడి, నీ కడుపునొక కాయ కాస్తే చూసీ..." అని సెంటిమెంట్ మీద ప్లే చేద్దామనుకున్న అమ్మని మధ్యలోనే తుంచిపారేస్తూ,

"మూడుముళ్ళూ, కడుపున కాయా లాంటి ఔట్ డేటెడ్ డైలాగ్స్ కొట్టొద్దు మమ్మీ. నా పెళ్ళి నేను కావాలకున్నప్పుడు, నాకు నచ్చినవాడితో చేసుకుంటాను. మీరున్నా లేకపోయినా ఇట్ డజన్ట్ మేక్ ఎనీ డిఫరెన్స్. అండర్స్టాండ్. అంతగా కావాలనుకుంటే నువ్వూ డాడీ మళ్ళీ ఇంకోసారి చేసుకోండి పెళ్ళి" అంటూ తను వేసిన విట్టుకి తనే విరగబడి నవ్వి, విసవిసా వెళ్ళిపోయింది 'ఇనార్బిట్ మాల్లో' షాపింగ్ కి.

ఏంచెయ్యాలో తెలీక తలలు పట్టుక్కూర్చున్న అమ్మా నాన్నల కళ్ళముందు తళుక్కుమని మెరిసిందొక ఆశాకిరణం ఆరునెలల క్రితం.

ఆరోజు సాయంత్రం ఆరుగంటలప్పుడు, అసురసంధ్య వేళ "మామ్ డాడ్ ఐ వాన్నా టు టెల్ యూ సంథింగ్. ఐ లవ్ 'బేంగీ'. హీ లవ్స్ మీ టూ. వీ వాన్నా గెట్ మేరీడ్. " అంది కళ్ళు గుండ్రంగా తిప్పుకుంటూ అమెరికన్ స్టైల్లో.

"ఎంత చల్లని మాట చెప్పావు బంగారుతల్లీ. దీనికోసమే ఎదురుచూస్తున్నాం ఇన్ని రోజులూ. అబ్బాయి వాళ్ళతో మాట్లాడి ముహూర్తాలు పెట్టేసుకుంటే, పెళ్ళిపనులు షురూ చెయ్యొచ్చు. కళ్యాణమండపమే ఆరునెలల ముందు బుక్ చేసుకోవాలీ మహానగరంలో" అని ఆనందంతో తబ్బిబ్బవుతున్న అమ్మా నాన్నల మాటల్ని మధ్యలోనే కట్చేస్తూ

"ఏక్చువల్లీ, ఈవెన్ దో వియ్ లవ్ ఈచ్ అదర్ సో మచ్, ఒకరినొకరు పూర్తిగా అండర్స్టాండ్ చేసుకున్నాకే పెళ్ళి చేసుకోవాలనునుకుంటున్నాం మమ్మీ. అలా అండర్స్టాండ్ చేసుకోవడానికి మినిమం ఒన్ యియర్ అయినా పట్టదూ. సో.......అవర్ మేరేజ్ విల్ టేక్ ప్లేస్ ఆఫ్టర్ ఒన్ యియర్ ఓన్లీ. దట్ టూ ఓన్లీఇఫ్ వియ్ ఫీల్ థట్ ఎవిరీథింగ్ ఇస్ ఓకే." అని చావుకబురు చల్లగా చెప్పిన బంగారుతల్లివేపు మిడిగుడ్లేసుకొని చూస్తూ ఉండిపోయారు అమ్మా నాన్నా ఏం మాట్లాడాలో తెలీక.

--00--

ఫ్లాష్ బేక్ లో కొట్టుకుపోతున్న నాన్న వర్తమానంలోకి వచ్చి, "ఎన్నాళ్ళైంది బంగారుతల్లి ఈ విషయం చెప్పి. ఐదు నెలలు. అంటే ఇంకా కనీసం ఏడు నెలలు గడిచిన తరవాత పిల్ల పెళ్ళికి పచ్చజెండా ఊపితే, ఆ తరవాత కనీసం ఇంకొక ఆరునెలలగ్గాని పెళ్ళవదు. ఈలోపులోనే ఏ హార్ట్ ఎటేకో వచ్చి పోతానో ఏమో. పోయేలోపు ఎలాగోలా పిల్ల పెళ్ళి చేసేస్తేగాని బ్రతికేలాలేను" అనుకున్నాడు నిస్పృహగా నుదురు కొట్టుకుంటూ.

---00---

'వేలెంటైన్స్ డే' రోజు రాత్రి. 'బంగ్స్' ఇంట్లో లేదు. ప్లాన్ చేసుకున్నట్టుగా పబ్ లో హేవింగ్ ఫన్ విత్ 'బేంగీ'. శీతాకాలంలో పొగమంచులా దట్టంగా కమ్ముకున్న సిగరెట్టుపొగా, ఏరులైపారుతున్న బీరూ, విస్కీ, రమ్మూ, కర్ణభేరి బద్దలయ్యేస్థాయిలో కఠోరంగామోగుతున్న చావుమేళంలాంటి పాశ్చాత్యసంగీతం, దానితో పోటీగా పిచ్చికేకలూ, పిల్లికూతలూ కూస్తూ, పూనకంవచ్చినట్టు శివాలెత్తిపోతున్న ప్రేమపక్షులూ. అదే జోష్ అయితే దానికి సిసలైన నిర్వచనంలాగానే ఉందా పబ్ సందేహంలేకుండా.

రెండు మెతుకులు తిన్నావనిపించి, తొమ్మిదిన్నరకి టీవీ ముందు చతికిలబడ్డారు అమ్మా నాన్నా. ఏ ఛానల్లో చూసినా 'వేలెంటైన్స్ డే' ప్రత్యేక కార్యక్రమాలే. ప్రతీ ఛానలూ పబ్బుల్లోనూ, పార్కుల్లోనూ "ప్రేమికుల పండుగ" ఉద్రేకోత్సాహాలతో జరుపుకుంటున్న ప్రేమికుల్ని క్లోజప్లో చూపిస్తూ

టీ.ఆర్.పీ. రేటింగులు పెంచుకోవడానికి ఒకదానితో ఒకటి తెగ పోటీ పడుతున్నాయి. టైమ్ పదిన్నరైంది....పదకొండున్నరైంది. కష్టం మీద అర్ధరాత్రి పన్నెండున్నరైంది. ఆందోళనగా ఒకదాని తరవాతొకటి ఛానల్స్ మారుస్తూ కూర్చున్న నాన్న సడన్ గా ఒక ఛానల్ దగ్గర ఆగిపోయాడు.

టీవీస్క్రీన్ మీద.... తాడిచెట్టంతెత్తున్న 'కం.తి.బ.శా' (కండలు తిరిగిన బలశాలి) ఒకడు చేతిలో ఉన్న నాలుగడుగుల లాఠీని ఝుళిపిస్తూ ఉద్రేకంగా ఉపన్యసిస్తున్నాడు. అతని వెనుక ఒక పదిమంది (జూ) కం.తి.బ.శా.లు క్రూరమైన ముఖాలూ, కొంచెం చిన్నసైజు లాఠీలు ధరించి నిలబడిఉన్నారు కేమరాలోకి కోపంగా చూస్తూ. కేమరా కం.తి.బ.శా.ల పైనుండి నెమ్మదిగా ప్రక్కకు జరుగుతూ జరుగుతూ, అంతవరకూ ఫోకస్లో లేని ఇద్దరు వ్యక్తులమీదకు ప్రసరించడం వారిద్దరినీ "బంగ్స్ మరియూ బేంగీ" గా గుర్తించిన అమ్మా నాన్నల గుండెకాయలు ఒక లిప్తకాలం పాటు ఆగిపోయి, 'రాకెట్ వేగంతో' మళ్ళీ తిరిగి కొట్టుకోవడం మొదలెట్టాయి.

"చూడండి సార్ వీళ్ళిద్దరినీ. ఇంజనీర్లట.... పే....ద్ద ఉద్యోగాల్లో ఉన్నారట, లక్షల్లో జీతాలట. పెళ్ళి చేసుకుంటారట గాని ఎప్పుడో చెప్పలేరట. ముందు ఒకరినొకరు బాగా **అండర్స్టాండ్** (అండర్స్టాండ్ అనే పదాన్ని ఒత్తి పలుకుతూ) చేసుకోవాలట, తరవాతే పెళ్ళట. అప్పటిదాకా ఇలా అర్ధరాత్రి వరకూ పబ్బుల్లో డాన్సులేసి, పార్కుల్లో పాటలు పాడుకుంటూ తిరుగుతారట. ఇలాంటి వారివల్లే కదా మహోత్కృష్టమైన మన సంస్కృతీ సాంప్రయదాయాలు మంటగలిసిపోతున్నది. మా కంఠంలో ప్రాణం ఉండగా ఇటువంటి అప్రాచ్యపుపనులు జరగనివ్వమండీ. వీళ్ళకి జీవితంలో మరచిపోలేని గుణపాఠం నేర్పించి తీరతాం. ఇప్పుడే, ఇక్కడే....పంచభూతాల సాక్షిగా, ఈ ఛానల్ వీక్షిస్తున్న మీ అందరి సాక్షిగా,....ఈ ప్రేమికులకి పెళ్ళి చేసేస్తాం. ఎవడడ్డమొస్తాడో చూస్తాం" అని తొడగొట్టి భయంకరంగా గర్జించి, "వాయించండ్రా" అని పొలికేకపెట్టడం, పక్కనే సిద్దంగా ఉన్న పురోహితుడు వెంటనే "మాంగల్యం తంతునానేనా......'" అని మంత్రోచ్చారణ మొదలుబెట్టడం, ఇంకోపక్క అంతకంటే రడీగా ఉన్న సన్నాయిమేళం ఏదో భక్తిపాట లంకించుకోవడం ఏకకాలంలో మొదలైపోయాయి. ఇంతలో కం.తి.బ.శా. పసుపుకొమ్ము కట్టబడి ఉన్న పసుపుతాడొకటి జేబులోనుంచి తీసి, 'బేంగీ' చేతుల్లో పెట్టి "హూ కట్టు" అని హుంకరించడం వజవజ వణుకుతున్న చేతులతో, చిగురుటాకులా కంపిస్తున్న బంగ్స్ మెడలో బేంగీ మూడుముళ్ళూ వేసేయడం కూడా నిర్విఘ్నంగా పూర్తైపోయింది. తలొంచుకునిలబడ్డ పెళ్ళికొడుకూ పెళ్ళికూతురి వేపు క్రూరంగా చూస్తూ "ఇక్కడితో అయిపోయిందనుకుంటున్నారేమో. రేపు రిజిస్ట్రార్ ఆఫీసులో మీపెళ్ళి నమోదు చెయ్యించేవరకూ మాదే బాధ్యత. అంత వరకూ ఇంట్లోనుంచి కదలేరా.... " అని కం.తి.బ.శా హెచ్చరిక జారీచేస్తుండగా వణుకుతున్న చేతులతో టీవీ ఆఫ్ చేసాడు నాన్న.

అరగంటపైనే పట్టింది అమ్మా నానా తేరుకోవడానికి. తేరుకున్నాక తడబడుతున్న అడుగులతో నడుస్తూ వెళ్ళి, ఫ్రిజ్లోనుండి వాటర్ బాటిల్ తీసుకొని మొత్తం ఖాళీచేసేసి మరికాస్త స్థిమితపడ్డారిద్దరూ. స్థిమితపడ్డాక తన మొబైల్ తీసుకొని ఒక నెంబర్ దయల్ చేసాడు నాన్న. చేసి ఒణుకుతున్న గొంతుతో నెమ్మదిగా "మండుతున్న కుంపటిని మాగుండెల మీదనుంచి దింపేసావు నాయనా ఈరోజు. మా చర్మంతో చెప్పులు కుట్టించి ఇచ్చినా మీ ఋణం తీర్చుకోలేం బాబూ. నువ్వన్నట్టు తెల్లవారుతూనేవచ్చి ఆ రిజిస్ట్రేషన్ పని కూడా పూర్తి చేసి పుణ్యం కట్టుకోండి నాయనలారా చచ్చి మీకడుపున పుడతాం. అనుకున్నట్టుగా రేపు సాయంత్రం దగ్గర మిమ్మల్ని కలుసుకుంటాం బాబూ తప్పకుండా" అని వినయంగా విన్నవించుకొని, ఫోన్ కట్ చేసాడు.

చాలా సంవత్సరాల తర్వాత మొదటిసారి......ఆ 'వేలంటైన్స్ డే' రాత్రి......అమ్మానాన్నా ఇద్దరూకూడా గాఢంగా, నిశ్చింతగా, నిద్రపోయారు.

# సోంగ్క్రాన్

ఆరి సీతారామయ్య

అర్ధరాత్రవుతున్నా లమాయికి ఇంకా నిద్రరాలేదు. ఆమె మనసు స్థిమితంగా లేదు. తన జీవితానికి దారీతెన్నూ లేకుండాపోయింది. తన బిడ్డ జీవితమయినా బాగా ఉంటుందనే ఆశతో పదిహేను సంవత్సరాల క్రితం థామస్ ని నమ్ముకుని అమెరికా వచ్చిందామే. ఇప్పుడు ఆ ఆదరువూ లేదు. తనంతట తాను కూతురుని చదివించుకోగల సమర్థత తనకు లేదు. మరేదీ దిక్కు? తనలాంటివాళ్ళ బిడ్డలకు పెద్దగా ఆశలుపెట్టుకునే హక్కు లేదేమో!

తెల్లవారితే సోంగ్క్రాన్ పండుగ. కొత్త సంవత్సరం వస్తుంది. చాంగ్ మై లో ఎంత సందడిగా ఉంటుందో. పొద్దున తొందరగా తయారై అమ్మానాన్నలతో, చెల్లెలు కోసుమ్ తో హరిపుంజయ బౌద్ధాలయానికి వెళ్ళటం, దోవలో ఎదురైనవాళ్ళు నీళ్ళు చల్లి, సవా బిపిమై (కొత్త సంవత్సరం శుభాకాంక్షలు) చెప్పడం తలపుకొచ్చాయి. ఇంటికొచ్చేసరికి అందరూ బాగా తడిసి ముద్దైపోయేవారు. పాత సమస్యలన్నీ నీళ్ళలో కొట్టుకుపోతాయని అందరి నమ్మకం. కొత్త సంవత్సరం తన సమస్యలనుకూడా కడిగేసి, ఏదైనా కొత్త మలుపు ప్రసాదిస్తుందేమో.

థాయ్ లాండ్ కి దూరంగా ఉన్నా, పండగరోజులు మంచి రోజులు. ముఖ్యమైన పనులేమైనా మొదలు పెట్టాలంటే అలాంటి శుభదినాల్లో మొదలుపెడితే సఫలమవుతాయని తల్లిదండ్రులు అంటుండేవారు. క్రోగర్ స్టోర్ లో తనతో పనిచేసే మేనేజర్ కెవిన్ ని రేపు భోజనానికి పిలిస్తే బాగుంటుందనిపించింది లమాయికి. అతను మంచి మనిషి. తనకు దాదాపు పది సంవత్సరాలుగా తెలిసిన మనిషి. తరచూ తన మంచిచెడ్డలగురించి అడుగుతూ ఉంటాడు. తన తప్పు ఏదీ లేకపోయినా థామస్ తనను వదిలేశాడని తెలిసినప్పుడు బాగా విచారించాడు కూడా. పొద్దుటే ఫోన్ చేసి భోజనానికి రమ్మని పిలవాలి. ఎటూ పండగ వంటకాలు చెయ్యాలనుకుంటుంది. థాయ్ వంటలు తనకు ఇష్టమేనని చెప్పినట్లు గుర్తు.

★

తొందరగా లేచి, స్నానం ముగించి, బుద్ధుడి విగ్రహాన్ని కడిగి నమస్కారం చేసి, కెవిన్ కి ఫోన్ చేసింది లమాయి. అతను భోజనానికి వస్తానన్నాడు. సంతోషంగా ఫోన్ కాల్ ముగించి కూతురి గది వైపు అడుగులేస్తూ, "మాలీ... మాలీ," అని పిలిచింది లమాయి.

అప్పటి దాకా సమాధానం చెప్పని మాలీ, తల్లి తలుపు దగ్గరకు రాగానే, "ఎందుకట్లా అరుస్తావు? ఎటూ వస్తున్నావు కదా? అరుస్తూ రాకపోతే ఏం? ఎదురుగా వచ్చి చెప్పరాదూ ఆ చెప్పేదేంటో," అని రుసరుస లాడింది.

తల్లికివ్వాల్సిన గౌరవం కూడా ఇవ్వకుండా, పెద్దాచిన్నా గమనింపులేకుండా, కూతురు ఇలా తననే మందలించడం ఇది మొదటిసారి కాదు. అయినా ఇలాంటి అవమానాలను భరిస్తూ, మనసుపడే కష్టాన్ని బయటకు రానివ్వకుండా నెట్టుకొస్తుంది లమాయి. మొదటినుండీ అతిగారాబం చెయ్యకుండా, థాయ్ అమ్మాయిని పెంచినట్లు పెంచినట్లయితే బాగానే ఉండేది. కానీ ఇప్పుడు దాని గురించి బాధపడి ప్రయోజనం లేదు.

"ఎందుకూ అంత కోపంగా ఉన్నావ్? ఒంట్లో బాగాలేదా?" అంటూ దగ్గరకొచ్చి నుదుటిమీద చెయ్యి పెట్టిచూడబోయింది లమాయి.

రెండడుగులు వెనక్కేసి, "బాగానే ఉన్నాన్లే. ఏంటీ చెప్పొచ్చావ్?" అని అడిగింది మాలీ.

"ఆదా," ఎంతో ఆప్యాయంగా కూతురి నుదుటిని తాకబోయిన మనిషి వాస్తవ ప్రపంచంలోకి వచ్చి, "ఈ రోజు సోంగ్క్రాన్. ఒక ఫ్రెండ్ ని భోజనానికి రమ్మని పిలిచాను. నువ్వు ఇంట్లో నే ఉంటావుగా?" అంది లమాయి.

"బాయ్ ఫ్రెండా?" అసమ్మతీ, తిరస్కారం కలగలిపిన స్వరంతో అడిగింది మాలీ.

"అవును," అంది లమాయి. చాలా మాటలు ఉబికి వస్తున్నాయి లోపలనుండి, కానీ వాటిని లోపలే అదిమిపెట్టిందామే.

"నేను ఫ్రెండ్స్ తో బయటికెళ్తున్నాను," సంభాషణ తెంచేస్తున్నట్లు అంది మాలీ, బీరువా తెరిచి బట్టలవైపు చూస్తూ.

"సోంగ్క్రాన్ పండుగ రోజు. నీకిష్టమైన వంటలు చేస్తాను. ఇంటిదగ్గర ఉండరాదూ?" బ్రతిమిలాడుతున్నట్లడిగింది లమాయి.

"నేనొస్తానని చెప్పాను ఫ్రండ్స్ తో," ఆమె వైపు చూడకుండానే సమాధానం చెప్పింది మాలి.

"సరే, నీ ఇష్టం," అని వెళ్ళిపోయింది లమాయి, చిరాగ్గా.

★

దాదాపు పదిసంవత్సరాలుగా క్రోగర్ స్టోర్ లో తనతో పనిచేస్తున్న లమాయి ఈరోజే భోజనానికి రమ్మని పిలవడంతో ఆమె ఏదో ఇబ్బందిలో ఉండి ఉంటుంది, తన సహాయం అడగటం కోసం రమ్మంటుంది అనుకున్నాడు కెవిన్. అతను వచ్చేసరికి వంట పూర్తిచేసి ఏపార్ట్ మెంట్ శుభ్రంగా సరిచేసింది లమాయి. అతను అడక్కుండానే ఈరోజు థాయ్ దేశస్థులకు నూతన సంవత్సరం అనీ, థాయ్ లాండ్ లో, ముఖ్యంగా తమ చియాంగ్ మయ్ లో, పెద్దఎత్తున పండగ జరుపుకుంటారనీ, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సంతోషంగా గడిపే రోజనీ చెప్పింది లమాయి.

కెవిన్ మనసు కుదుటపడింది. భోజనాలయింతర్వాత కూతురు ఏం చేస్తుందని అడిగాడు. ప్రస్తుతం కమ్యూనిటీ కాలేజీకి వెళుతుందనీ, శ్రద్ధగా చదువుతుందనీ, సెప్టెంబర్ నుంచీ ఏదైనా మంచి కాలేజీలో చేర్పించాలనీ చెప్పింది లమాయి. ఏదైనా పార్ట్ టైమ్ ఉద్యోగం అవసరం అయితే క్రోగర్ లో పనిచెయ్యవచ్చు అన్నాడతను. ఆ సూచనకు సంతోషం వ్యక్తపరుస్తూ, ఆ అమ్మాయికి మెడిసిన్ చదవాలనే కోరిక వుందనీ, ప్రస్తుతం బోమాంట్ హాస్పిటల్లో పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తుందనీ చెప్పిందామె.

★

ఫ్రండ్స్ ని కలవటానికి బయటికెళ్తున్నానని చెప్పినా మాలికి పెద్దగా స్నేహితుల్లేరు. నాలుగు సంవత్సరాల వయసులో తల్లితో అమెరికా వచ్చిన మాలీకి పక్కింటి పిల్లలతోగానీ, వీధిలో పిల్లలతోగాని స్నేహాలు కుదరలేదు. తన ముఖం వేరుగా కనబడటంతో, ఇంగ్లీషు రాకపోవడంతో, వీధిలో పిల్లలెవరూ వాళ్ళ ఆటల్లో తనను చేర్చుకోలేదు. బిడియంగా తను దూరంగానే ఉండిపోయింది. స్కూల్లో చేరిన తర్వాత కూడా తను పరాయిదేశపు అమ్మాయిననే ఆలోచనే బలపడింది. ఒంటరిగా కూర్చుని ఏదో పుస్తకం చదవడం, లైబ్రరీకెళ్ళి హోమ్ వర్క్ చేసుకోవడం అలవాటు చేసుకుంది గాని పెద్దగా స్నేహాలు కుదుర్చుకోలేక పోయింది.

మొదట తను అమెరికా ఎందుకు వచ్చిందో అర్థం కాకపోయినా, క్రమంగా తల్లి తనను అమెరికా ఎందుకు తీసుకొచ్చిందో గ్రహించింది. భర్త ఆమెను మాలీకి సంవత్సరం కూడా రాక ముందే వదిలేశాడు. రెండు మూడు సంవత్సరాలు తల్లిదండ్రుల్తో చియాంగ్ మయ్ లో ఉంటూ వాళ్ళ కిరాణా కొట్టు నడపటంలో సహాయపడుతూ గడిపిందామె. అనుకోకుండా చియాంగ్ మయ్ వచ్చిన థామస్ తో పరిచయం కావడం, అతను పెళ్ళిచేసుకోమని అడిగితే, తల్లిదండ్రులకు పెద్దగా ఇష్టం లేకపోయినా, అతనితో అమెరికా వచ్చింది లమాయి. ఎంతో శ్రద్ధగా, తనవైపునుంచి ఎలాంటి లోటూ రాకుండా అతనికి సేవలు చేసినా, పన్నెండు సంవత్సరాల తర్వాత తల్లినీ కూతురునూ వెళ్ళిపొమ్మన్నాడతను. అప్పటినుండీ ఒక ఏపార్ట్మెంట్లో ఉంటూ, క్రోగర్లో పనిచేస్తూ, కూతుర్ని పెంచుకుంటుందామె.

నీకోసమే నేను ఇదంతా చేశాను అని ఆమె మాలీతో ఎప్పుడూ అనకపోయినా, థాయ్ లాండ్ లో ఉన్న తాత అమ్మమ్మలతోనూ, ముఖ్యంగా చిన్నమ్మకోసుమ్ తోనూ లమాయి ఫోన్లో మాట్లాడేటప్పుడు తను చాలాసార్లు విన్నది మాలీ. తన జీవితం నాశనం అయిందనీ, కనీసం మాలీని చదివించుకోగలిగితే, ఆ అమ్మాయికి మంచి జీవితం ఏర్పడితే తన కష్టాలకు ఫలితం దొరికినట్లేనని ఆమె చెప్తుంటుంది.

తల్లి మనసు తెలిసినా, ఆమె మీద అమితమైన ప్రేమ ఉన్నా, గౌరవం అయితే లేదు మాలీకి. గతంలో ఆమె తీసుకున్న నిర్ణయాలు బొత్తిగా బుద్ధిలేనివనిపిస్తుంది మాలీకి. పైగా తనకు జాగ్రత్తలు చెప్తుంటుందామె. మగపిల్లలతో స్నేహం చెయ్యవద్దనీ, అలాంటి స్నేహాలు చేస్తే పిల్లలు పుడతారనీ తను తొమ్మిదోతరగతికి వచ్చినప్పటినుంచీ నెలకొకసారైనా చెప్తూనే ఉంది. ఆమెకు నిజంగా మగవాళ్ల గురించి తెలుసా? కూతురుకి సంవత్సరం కూడా రాకముందే వదిలేసిన వాణ్ణి ఎలా ఎంచుకుని పెళ్ళి చేసుకుందామే? సెక్స్ కోసం థాయ్ లాండ్ వచ్చిన థామస్ ని ఎలా నమ్మి పెళ్ళిచేసుకుంది? అతని కోసం తనవాళ్ళందరినీ వదిలిపెట్టి అమెరికా ఎందుకొచ్చింది? తనకు నీతులూ జాగ్రత్తలూ చెప్పే అధికారం, తెలివితేటలూ ఆమెకసలు ఉన్నాయా?

ఆర్థిక కారణాలవల్లే అమెరికా వచ్చిందనుకున్నా, అలా రాకూడదనీ, తనకాళ్ళమీదే నిలబడాలనీ ఆమెకు ఇంకా అర్థం అయినట్లు లేదు. ఇప్పుడు మళ్ళా నన్ను కాలేజీకి పంపించేందుకు ఎవరితోనో సంబంధం పెట్టుకోవాలని చూస్తుంది. అలాంటి మనిషిని ఎలా గౌరవించడం?

తన చదువు ఖర్చులకు ఆమె తన జీవితం పాడుచేసుకోనవసరం లేదు. ఆ విషయం ఆమెకెలాచెప్పడం? ఎలా చెప్తే వింటుంది?

ఇంతలో ఆరుంబావైందనీ, పదిహేను నిమిషాల్లో లైబ్రరీ మూసేస్తారని ప్రకటన వినగానే ఆలోచనల్లోంచి బయటికొచ్చింది మాలీ. ఇంటికివెళ్ళి, తయారై, ఎనిమిది గంటలకు హాస్పిటల్ కి కెళ్ళాలి.

★

కెవిన్ వెళ్ళిపోయింతర్వాత గిన్నెలు కడిగి వంటగది సర్దుతున్నప్పుడు ఇంటికి వచ్చింది మాలీ.

తను భోజనానికి పిల్చిన స్నేహితుడు ఇప్పుడే వెళ్ళిపోయాడనీ, మాలీ ఉన్నట్లయితే బాగుండేదనీ అంది లమాయి.

ఇలాంటి సందర్భం వస్తుందని కొన్నాళ్ళుగా అనుకుంటున్న మాలీ, "ఎవరతను? అతన్ని పెళ్ళిచేసుకుందామనుకుంటున్నావా?" అని అడిగింది.

అతను క్రోగర్లో ఒక మేనేజర్ అనీ, పెళ్ళి గురించి ఆలోచించలేదనీ, అసలా ప్రస్తావన రాలేదనీ అంది లమాయి.

"మే, నీకు చెప్పడం మర్చిపోయాను. డిట్రాయట్లో వెయిన్ స్టేట్ యూనివర్సిటీకి దగ్గరగా ఒక ఏపార్ట్ మెంట్ తీసుకున్నాను. రెండు వారాల్లో, మే ఫస్ట్ న దాంట్లోకి మారాలి," అంది మాలీ నిర్లిప్తంగా.

లమాయికి షాక్ కొట్టినట్లయింది. వెంటనే ఏం మాట్లాడలేకపోయిందామె. ఏదోఒకరోజు మాలీని కాలేజీకి పంపించాలనీ, అది దూరంగా ఉన్న కాలేజీ అయితే ఆ అమ్మాయిని ఇంటికి దూరంగా పంపించడం తప్పదు అనీ తెలిసినా, మానసికంగా దానికి తయారుగా ఉండాలని అనుకున్నా, అకారణంగా మాలీ ఇలా ఇల్లు వదలి వెళ్తుందని ఆమె ఎప్పుడూ ఊహించలేదు. నీరసపడిపోయిందామె. తను అన్ని విధాలా వోడిపోయినట్లనిపించింది.

తనేం తప్పుచేసింది? మాలీ ఇలా వెళ్ళిపోతే తను పరాయిదేశంలో, తాడూబొంగరం లేని జీవితం గడపటం ఎందుకు?

తను నమ్మిన మగవాళ్లు తనకు తోడుగా నిలబడలేదు. అది ఎవరితప్పు? తను సర్వస్వంగా పెంచిన కూతురికి తనమీద గౌరవం లేదు. ఇక తను చెయ్యగలిగిందేమిటీ? కూతురుకి రెక్కలొచ్చాయి. ఆమె జీవితం తన జీవితం లాగా కాకూడదని ఆశించడం మాత్రమే ఇక తను చెయ్యగలిగింది.

"సరే నీ ఇష్టం," అని అటువైపు తిరిగింది లమాయి, కళ్ళు తుడుచుకుంటూ.

ఆమె మనసు తెలిసిన మాలీ, మెల్లగా ఆమెదగ్గరకెళ్ళి, ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని, "మే, నేను దగ్గరలోనే ఉంటానుకదా? డిట్రాయట్ ఇక్కడకి ఇరవైమైళ్ళే. అప్పుడప్పుడూ వచ్చిపోతుంటాను గదా," అంది.

"సరే," అంది లమాయి, కిందికి చూస్తూనే.

ఆమెను కౌగలించుకుని, "నువ్వు నాగురించి విచారించొద్దు. ఈ దేశంలో చాలామంది అప్పుచేసి చదువుకుంటారు. నేనూ అప్పుచేసి చదువుకోగలను. నువ్వు నాకోసం సంబంధాలు పెట్టుకోవద్దు. నీ గురించి ఆలోచించుకో. అది చాలు నాకు," అని తల నిమురుతూ ఓదార్చింది కూతురు. తలూపింది లమాయి.

మాలీ కళ్ళలోకి చూసిందామె. ఈ అమ్మాయితో మాట్లాడాలంటేనే భయంగా ఉండేది ఇన్నాళ్ళు. ఆ కళ్ళల్లో ఇప్పుడు కోపం లేదు. అసహ్యం లేదు. విచారం లేదు. స్నేహ భావం నిండిన కళ్ళు!

కూతురు చాలా ఎదిగినట్లనిపించిందామెకు. ఇది వరకు లేని ధైర్యం ఆమెను ఆవహించింది.

"సరే, తిందామ్ రా. నీ కిష్టమైన వంటలు చేశాను," అని మాలీని చెయ్యిపట్టుకుని వంటగది వైపు నడిపించింది లమాయి.

# కేశవుడు

రాయపెద్ది వివేకానంద్

చాలా ఘోరం జరిగిపోయింది మా స్కూల్లో.

అతను నా దగ్గర చేరిన రోజే ఏదో తేడాగా అనిపించింది. ఇక ఈ పిల్లలని ఆ దేవుడే బాగు చేయాలి. గొర్రె కసాయి వాడిని నమ్ముతుంది అన్నట్టు, మా మేనేజ్ మెంట్ వారు ఈ వెర్రి వాడిని నమ్మి ఇక్కడికి పంపారు.

అసలేం జరిగిందో వివరంగా చెపుతాను. మీరు ఆసక్తిగా వింటున్నారు కాబట్టి మీరు ఆప్తులు అన్న భావన కలుగుతోంది నాకు.

★★★★★

"మనం మన మాతృభాషని ప్రేమించాలి" నాకు స్పృహ తప్పినంత పనయింది. ఏమిటి ఈ పాడుమాటలు!? మాది ఇంగ్లీష్ మీడియం స్కూలు. కార్పొరేట్ స్కూలు ప్రిన్సిపాల్ గా ప్రతిరోజు ఉదయాన్నేఅన్ని తరగతి గదుల ముందూ పర్యవేక్షణ చేస్తూ తిరుగుతూ ఉన్న నాకు కేశవుడి కంఠం పెద్ద షాకే ఇచ్చింది.

ఆగిపోయి వింటూండిపోయాను, ఇంకా ఏమేమి చెప్తాడో అని.

జోశ్యం టెక్నోస్కూల్ పదవ తరగతి గది నుంచి కేశవుడి కంఠం స్పష్టంగా వినిపిస్తోంది. "మనం విజ్ఞానం ఎంతగా పెంపొందించుకుంటామో, మన సంస్కారాన్ని కూడా అంతగానూ పరిరక్షించుకుంటూ వుండాలి. మన మూలాల్ని మనం మర్చిపోకూడదు. మనం ఎప్పుడైతే మన అస్తిత్వాన్ని కాపాడుకుంటామో అప్పుడే ప్రపంచం మనల్ని గౌరవిస్తుంది"

అయ్యా ఆయన తెలుగు మాష్టారు కాదు. స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్ మెంట్ ట్రెయినర్ గా అతను ప్రఖ్యాతి గాంచిన మా జోశ్యం టెక్నో స్కూల్లో చేరి పట్టుమని నాల్గు నెలలు కాలేదు.

అతని పోకడ ఆది నుంచి నాకు చిరాగ్గానే వుంది.

తెలుగు కూడా ఇంగ్లీష్ లో నేర్పిస్తాం మేం.

'అ టు అః' అనిట్రెయినప్ చేస్తాం, 'అ ఫర్ అమ్మ, ఆ ఫర్ ఆవు' అని చెప్పి మేము స్టూడెంట్స్ ని ఇంగ్లీష్ లో పర్ ఫెక్ట్ గా మౌల్డ్ చేస్తాం. అది మా పద్ధతి. లేదంటే పిల్లలకి ఇంగ్లీష్ ఎలా వస్తుంది? వెధవది తెలుగుదేముంది, వద్దన్నా వస్తుంది. రాకున్నా చింతలేదు. పరీక్షల్లలో మార్కులు వచ్చేటట్టు ట్రెయినప్ చేస్తాం. జోశ్యం టెక్నోస్కూలా మజాకా? మాకు ఇంగ్లీష్ ముఖ్యం. ఇంగ్లీష్ లో మాట్లాడితే మాకు సొసైటీలో వచ్చే గుర్తింపే వేరు.

లోపల పాఠం కొనసాగుతోంది. వింటూండి పోయాను.

"జపాన్, జర్మనీ, దక్షిణకొరియా,చైనా, ఫ్రాన్స్ లు అభివృద్ధి సాధించటానికి ప్రధాన కారణం వారు విద్యను వారి మాతృభాషలో నేర్చుకోవటమే"

నాకు మిడిగుడ్లు పడ్డాయి. ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అయ్యాను. మా స్కూలు కేదో కీడు జరగబోతోంది. ఈ కేశవుడి రాక వల్ల ఖచ్చితంగా ఏదో ఉత్పాతం జరగబోతోంది అని అర్థం అయింది.. థాంక్ గాడ్ నేను సరి అయిన సమయానికి వచ్చి ఇతని నిజ స్వరూపాన్ని చూడగలిగాను. 'కరుణామయుడైన భగవాన్ ఎంత కష్టం తెచ్చిపెట్టావయ్యా.' నాకు కళ్ళు తిరుగుతున్నాయి. ఆసరా కోసం స్తంభం పట్టుకుని నిలబడిపోయాను.

అయిదంతస్తుల భవంతిలో మిగతా అన్ని క్లాసులు సక్రమంగా ఇంగ్లీష్ లో నడిచి పోతున్నాయి, ఇక్కడే నాకు పంటి కింద రాయిలా 'చెడు పలుకు 'వినిపిస్తున్నాయి.

ఎవరయినా పిల్లలు తెలుగులో మాట్లాడుతూ కనిపించారంటే వారిని కఠినంగా శిక్షిస్తాం. ఒక పలక మీద "నేను గాడిదను. నేను తెలుగులో మాట్లాడాను ఈ వేళ. అయాం సారీ" అని వ్రాయించి వాడిని ఒక్కో క్లాసుల్లోకి తీసుకెళ్ళీ పిల్లలందరి ఎదుట, బోర్డు దగ్గర నిలబెట్టి ఆ పలకలోని మాటలను వాడితోనే చదివించి, మిగతా వారికి కూడా జ్ఞానోదయం అయ్యేలాగా చర్యలు చేపడతాం. అటువంటి ఉత్తమ శిక్షణ మా స్వంతం.

ఇలాంటి శిక్షలు ఎన్నో ఉన్నాయి మా దగ్గర. మరి క్రమ శిక్షణ అంటే ప్రాణం ఇచ్చే వ్యక్తిని కదా నేను.

ఇటువంటి క్రమశిక్షణ కలిగిన మా సంస్థలో, సాక్షాత్తు ఒక మాష్టారు, అందునా ఇంగ్లీష్ మాష్టారు, ఆ పిల్లల క్లాస్ టీచర్ ఇలాంటి పాఠాలు చెబుతుంటే నాలాంటి డిసిప్లిన్డ్ ప్రిన్సిపాల్ కి ఎలా వుంటుంది మీరే చెప్పండి. ఇలాంటి వారికి ఎలాంటి శిక్ష వెయ్యాలో మీరే చెప్పండి.

ఇందాకే చెప్పినట్టు మాది నగరంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన కార్పొరేట్ స్కూలు. ర్యాంకులు, గ్రేడ్లు మా స్కూలుకు ప్రతి సంవత్సరం వస్తూ వుంటాయి. అలా ర్యాంకులు రెగ్యులర్ గా రావాలి అంటే మేము ఎంత శ్రమ పడతామో మీరు ఊహించలేరు. నగరం నడిబొడ్డున ఓ అయిదంతస్తుల షాపింగ్ కాంప్లెక్స్ ని అద్దెకు తీసుకుని నడిపిస్తున్నాం ఈ స్కూలుని. ఇలాంటి బ్రాంచులు నగరం నిండా మాకు ఓ ఇరవై దాకా ఉన్నాయి. గిట్టని వాళ్ళు కోళ్ళ ఫారంలో కోళ్ళలా కుక్కేస్తాం క్లాసుల్లో పిల్లలని అని ఆడిపోసుకుంటారు. మాకు అద్దెలూ అవీ వెళ్ళాలి గదండి మరి. గిట్టని వాళ్ళదేముంది లేండి ఏదయినా అనగలరు. మా స్కూళ్ళన్నింటిలో ఏకాగ్రత అంతా ర్యాంకులు, గ్రేడింగులు, మార్కులమీదనే వుంటుంది. చదువుకు ఆటంకం కలిగించే ప్లేగ్రౌండ్, ఆడిటోరియం, లైబ్రరీ వంటి వాటి జోలికి వెళ్ళం, వీటన్నిటి మాట దేవుడెరుగు, అసలు టాయిలెట్లు కూడా సరిగ్గా వుండవు. మా ఏకాగ్రత అంతా, ఇందాకే చెప్పాను కద, ర్యాంకులు, మార్కులు, గ్రేడింగులు వీటిమీదనే వుంటుంది. అదన్న మాట మేము విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత. ఇవన్నీ మాములు వాళ్ళకు చెబితే అర్థం చేసుకోరు, మీలాంటి సహృదయులకు చెబితే కనీసం నన్ను అభినందించి, నా పట్ల జాలి చూపిస్తారు.

నాకు  విద్యావేత్తగా నగరంలో చాలా మంచిపేరు వుంది. నేను డబల్ ఎమ్మే, ఎం.ఫిల్, పీ.హెచ్.డీ. గోల్డ్ మెడలిస్టుని. బట్టీ పట్టేసి చదువుకుంటు వెళ్ళిపోతే, 'ఏదో రకంగా' డిగ్రీలు తెచ్చుకుంటే ఒక విద్యావేత్తగా గుర్తింపు పొందవచ్చు. ఏమంటారు?

ఇక ప్రస్తుత విషయానికొస్తే, ఈ కేశవుడి పూర్తి పేరు 'బలీరాం కేశవుడు' అట. నాగ్ పూర్ కు చెందిన ఎవరో స్వాతంత్ర్య సమరయోధుడి పేరట అది. ఎవరి పిచ్చి వారికి ఆనందం అంటే అదే. ఈ బలీరాం కేశవుడి పేరే కాదు, అతని ప్రవర్తన కూడా చాలా చిత్రంగా వుంటుంది. నాకు సహజంగానే వ్యక్తిత్వవికాస శిక్షణ నిపుణులంటే ఎందుకో తగని చిరాకు, వీళ్ళు చెప్పే పాఠాలు మార్కులు తెచ్చిపెట్టవు కద. ఇతన్ని దగ్గరనుంచి చూసే కొద్దీ ఆ చిరాకు ద్విగుణీకృతం అవుతోంటుంది.

విద్యార్థులకుపోయి వ్యక్తిత్వవికాస శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్ గాడిద గుడ్డు ఎందుకండి?  వీటికిపొయి మళ్ళీ ఒక ట్రెయినర్.

అసలు పిల్లలంటే ఏమి చేయాలి? చక్కగా కూర్చుని చదువుకోవాలి. అర్థం కాకుంటే బట్టీ పట్టాలి. ప్రతీ రోజు స్లిప్ టెస్టని, తరచూ యూనిట్ టెస్టనీ, క్వార్టర్లీ అనీ, హాఫియర్లీ అని ఏదో ఒక పరీక్ష వ్రాస్తూ సంవత్సరాంతం లో వచ్చే పెద్ద పరీక్షకి సిద్ధపడాలి. ఇంతకు మించి ఈ పర్సనాలిటి డెవలెప్ మెంట్ వంటి పనికిమాలిన విషయాలు అస్సలు అక్కరలేదని నా నిశ్చితాభిప్రాయం.

ఇదిగో రాబోయె చెడురోజులకు నాందీప్రస్తావనగా, మా బ్రాంచీలోకి ఈ కేశవుడు వచ్చి పడ్డాడు. అసలు ఇతని ప్రవేశం వెనుక మా చైర్మన్ గారి అబ్బాయి పాత్ర వుంది. ఈ చైర్మన్ గారి అబ్బాయి మా స్కూలు మేనేజిమెంట్ లోకి రెండొ తరం ప్రతినిధిగా ఎంటర్ అవ్వటం, అతను తనతో కూడా ఈ కేశవుడిని తీసుకు రావటం జరిగాయి.

మా  చైర్మన్  గారు తనకున్న వందాలాది బ్రాంచిలలొ ఓ పాతిక బ్రాంచిలకు ఇదిగో తన పెద్దబ్బాయిని డైరెక్టర్ గా నియమించారు.

నాకు తెలుసు లెండి, మీలాంటి సహృదయులు ఖచ్చితంగా నాలాగే ఈ కేశవుడి పట్ల ఇప్పటికే అయిష్టత పెంచేసుకుని వుంటారని. కాని ఏమి చేద్దామండి, మేనేజిమెంట్ సపోర్ట్ వుంది ఈ కేశవుడికి. కలికాలం. ఏం చేద్దాం చెప్పండి?

ఈ వింత మానవుడు ఎలా వుంటాడో కాస్తా వివరంగా చెప్తాను, మీక్కూడా అతని మీద ఇంకాస్తా చిరాకు కలుగుతుంది.

పాతికేళ్ళు కూడా వుండవు ఈ వింత మానవుడికి. తెల్లటి శరీర చాయ, పల్చటి కళ్ళద్దాలు,లేత గడ్డం, మరీ సన్నం కాని శరీర నిర్మాణం, కోలమొహం, ఎప్పుడూ తెల్లటి కుర్తా పైజామలలో కనిపిస్తాడు.

అసలు నాకు తెలియక అడుగుతానండి, ఉపాధ్యాయుడు అంటే ఎంత సీరియస్ గ వుండాలి, అందునా పిల్లలతో ఎంత గంభీరంగా వుండాలి. ఈ వింత మానవుడికి అది కూడా తెలియదు.

ఎప్పుడు చూసినా చిరునవ్వుతో పిల్లలతో మాట్లాడుతూ వుంటాడు.

నిజం చెప్పొద్దూ అతనిలో నాకు అన్నింటికన్నా అత్యంత చిరాకు కలిగించే అంశం ఆ చిరునవ్వుతో కూడిన మొహం. ఎప్పుడు నవ్వుతూ కనిపించే వాళ్ళంటే మీక్కూడా చిరాకే అని నాకు తెల్సు లెండి. అందునా ఉపాధ్యాయులు ఎంత సీరియస్ గా వుండాలి అని నేను అక్కడికీ ఎన్నో సార్లు చెప్పిచూశాను.

తెలివా తేటా నా మాట విని ఏడిస్తే కద. నా మాట వింటే ఎప్పుడో బాగు పడిపోయే వాడు.

ఇకపోతే స్టూడెంట్లంతా ఇతగాడికి పెద్ద ఫాన్స్ అయిపోయారు. ఇతని రాకతో మాస్కూలు పరిస్థితి చాలా అరాచకంగా తయారయేటట్లు కనిపిస్తోంది. ఇతను నిప్పులో దూకమంటే దూకటానికి సిద్ధం అనేలా ఉన్నారు పిల్లలంతా.

ఖర్మ. ఇతను స్కూల్లోకి, నా జీవితంలోకి కూడా సునామిలా ప్రవేశించాడు.

ఇక మీకు ఒక విషయం చెప్పాలి. నాకు అనేక డిగ్రీలు, గోల్డ్ మెడల్స్, డాక్టరేట్లు వున్నప్పటికి ఇంగ్లీష్ లో అనర్ఘళంగా మాట్లాట్టానికి రాదు. ఏదో ఒక లాగ లాగిస్తూ వుంటాను.. ఉన్న మాట చెప్పుకోవటానికి మొహమాటం ఎందుకు చెప్పండి, అందులో మీ వంటి సహృదయుల దగ్గర. కాకపోతే పిల్లలంతా ఇంగ్లీష్ లోనే మాట్లాడాలి అన్నది నా నిబంధన.

ఏమండీ మీరైనా చెప్పండి, మన పిల్లలు మనకంటే మెరుగ్గా వుండాలనే కదా ఆశిస్తాం? ఇంగ్లీష్ మాట్లాడే విషయం కూడా అలాగే అనుకోండి. మీరు ముసి ముసి గా ఎందుకు నవ్వుతున్నారో నాకైతే అర్థం కావటం లేదండి.

పిల్లలు చక్కగా చదువుకుని, హాయిగా ఇంగ్లీష్ లో మాట్లాడుతూ వుంటే తప్పేమిటి? ఇందుకు గాను వారిని అనేకరకాలుగా మోటివేట్ చేస్తూ వుంటాము.

వారిలో వారికి పోలికలు తెచ్చి, కించ పరిచి, రెచ్చగొట్టేలాగా మాట్లాడి మా తంటాలు మేము పడుతూ వుంటాము. నా ఆందోళనంతా వారి భవిష్యత్తు గురించే సుమండి.

ఇకపోతే మీకు తెలిసిన విషయమే కద పిల్లల ప్రగతికి ప్రధాన శత్రువులు ఆట పాటలు, ఎక్స్ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్ అని నా నిశ్చితాభిప్రాయం. యోగా , ఆటపాటలు వంటి అల్పమైన విషయాలలో పడి చదువు సంధ్యలను ఎక్కడ దెబ్బతీసుకుంటారో అని నేను బెంబేలెత్తి పోతూ వుంటానంటే నమ్మండి.

మా టీచర్లందరికీ నా మాట శిలా శాసనమే. ఇక్కడ మా టీచర్ల గురించి కాస్తా చెప్పాలి. మా స్కూలు చుట్టు ప్రక్కల నివసించే గృహిణులు, అత్తెసరు మార్కులతో బి.టెక్ పూర్తి చేసి ఏ ఉద్యోగం దొరికే అవకాశంలేని యువతీ యువకులు వీళ్ళే టీచర్లంటే. మీరు మరీ ఎక్కువెక్కువ ఊహించేసుకోమాకండి మా టీచర్ల గురించి. ఈ విషయంలో కూడా మేనేజిమెంట్ తో నాకు ఏ అభిప్రాయ భేదం లేదు. ఇలాంటి టీచర్లయితే తక్కువ జీతానికి వస్తారు. అసలు టీచర్ ఎంత బాగా చెప్పినా బట్టీ పట్టకుంటే మార్కులు ఎలా వస్తాయి చెప్పండి. అందుకే ఇలాంటి టీచర్లతో మేము బండి నడిపిస్తున్నాము.

ఈ టీచర్లంతా నాతో మాట్లాడేటప్పుడు చక్కగా తెలుగులోనే మాట్లాడి తమ తమ పనులు చక్కబెట్టుకుని వెళుతూ వుంటారు. వారు నాకు చాలా గౌరవం ఇస్తారు.

"మీ అంతటి వారితో ఇంగ్లీష్ లో మాట్లాడటానికి , మీ అంత బాగా మాకు ఇంగ్లీష్ రాదు సార్" అని సవినయంగా చెప్పుకుంటారు. వారిలోని ఆ వినయమే నాకు నచ్చేది.

ఈ కేశవుడితో ఈ విషయంలో కూడా నాకు తలనొప్పే. అతడికి చాలా భాషలు వచ్చు. ఇంగ్లీష్ నిజానికి మంచినీళ్ళ ప్రాయం అతనికి. ఏ బ్రిటిష్ వాడో వచ్చి మాట్లాడుతున్నాడేమో నన్నంత ఫ్లూయెంట్ గా అచ్చు అదే ఉచ్చారణతో మాట్లాడే వాడు. అతని మాటల్లో కొన్ని అర్థమయి కూడా చావవు నాకు.

రూల్ పెట్టింది నేనే కద. మింగలేను, కక్కలేను.

పిల్లలతో తెలుగు, నాతో ఇంగ్లీష్ మాట్లాడి చావగొడుతున్నాడు. నా చావు ఎవ్వరికి చెప్పుకోను?

లెసన్ ప్లాన్ ఎలా చేసుకోవాలి అన్న విషయంలో మిగతా టీచర్లంతా నా వద్దకు వచ్చి నా సలహామేరకు వాళ్ళ లెసన్ ప్లాన్ చేసుకోని వెళతారు. నేను చెప్పినట్టు తు.చ తప్పకుండా పాఠిస్తారు.

ఈ విషయంలో కూడా కేశవుడిది అరాచక ధోరణే. లెసన్ ప్లాన్స్ నిశితంగా తయారు చేసుకుని వస్తాడు. పీ.డీ.ఎఫ్ ఫైల్స్, జే.పీ.జీ ఇమేజెస్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్స్, కేస్ స్టడీస్, రోల్ ప్లేస్, నా పిండం, నా శ్రాద్ధం, ఇలా ఏవేవో తీసుకుని వస్తాడు, వాటిని వివరించి చెప్పేటప్పుడూ ఒక విధమైన ఆధిపత్య ధోరణి, ఇంగ్లీష్ లోనే నాకు వివరించి, నా సలహాలు అడుగుతాడు. తానా రోజు క్లాసులో ఏమేమి చెప్పబోతున్నాడో ఇంగ్లీష్ లోనే నాకు వివరించి నా అభిప్రాయం అడిగి, చక్కా క్లాసుకు వెళతాడు. పెద్దల్ని గౌరవించే పద్ధతి ఇదేనా మీరే చెప్పండి. నాకు ఇంత అనుభవం వుంది కద, నన్ను ఆడిగి కద పెన్ను పేపర్ పై పెట్టాలి? అహంభావి. అహా, మీరైనా చెప్పండి, ఇదంతా అహంకారం కాకపోతే మరేంటి? వినయం లేదు, భక్తి లేదు, పెద్దలయందు ఉండాల్సిన భయంలేదు. సరే అతనే దారికి వస్తాడు అని ఎదురుచూస్తున్నాను.

ఉద్యోగంలో చేరిన మొదటి రోజే, అందరిలా నా ఆశీర్వాదం తీసుకోవటం మాట అటుంచి, రివర్స్లో తన గురించి ఒక అరగంట లెక్చర్ ఒకటి ఇచ్చాడు. అంతా ఆధిపత్య ధోరణే.

ఎవడడిగాడండి ఇతగాడి లెక్చర్? పెద్ద వాడిని కద, నా సలహా సంప్రదింపులు తీసుకోవాలా వద్దా?

"నా వరకు నాకు వృత్తే దైవం సార్. నాకప్పజెప్పబడిన పనిని సంపూర్ణంగా, శ్రద్ధగా చేయటమే నాకు అలవాటు. నా గురించి నా పని మాట్లాడాలి. ఒకవేళ మీరు మీ కారు తుడవమని నాకు అప్పజెప్పారనుకుందాం. కారు అప్పుడు ఎంత బాగా తుడుస్తాను అంటె, మీరు కారును చూసి ఇంప్రెస్ ఐపోయి అరె ఈ కుర్రాడికి డ్రైవర్ పని కూడా అప్పజెప్పుదామా అని మీకు అనిపించేలా తుడవాలి సార్. అదీ నా పద్దతి. పిల్లల అభివృద్ధి విషయంలో నేను అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తాను సార్.హోలిస్టిక్ అప్రోచ్ తో ముందుకు వెళతాను. నాకు మీ సలహాలు సూచనలు ఎప్పటికీ కావాలి సార్" అంటూ చక్కా క్లాసుకు పోయాడు. అతని మాటల్లో నాకు సగం అర్థం కాలేదు.

అది ప్రారంభం మాత్రమే.

ఇతగాడు స్కూల్లో చేరింది లగాయతు రోజుకొక వింత వార్త నా చెవుల్ని సోకుతోంది.

ఇతని ప్రవర్తన మా టీచర్లందరికీ ప్రధాన వినోదమైంది. ఇంచుమించు అతగాడు ఒక 'లాఫింగ్ స్టాక'యిపోయాడు మా అందరికి.

ఉండుండి అతగాడి గురించిన ఏదో ఒక న్యూస్ ఇంచుమించు బ్రేకింగ్ న్యూస్ లాగా వస్తూనే వుంది.

"ఏమండోయ్ ఇది విన్నారా? అదేదో సంఘంలో సభ్యుడట ఇతగాడు, అందులో చిన్ననాడే భరతమాత పటం ముందు నిలబడి ప్రమాణం చేశాట్ట, ఆజన్మ బ్రహ్మచారిగ వుండిపోతానని" అని ఒక వార్త వస్తుంది ఒక రోజు, దాని తాలూకు ప్రభావం నుండి కోలుకొనే లోగా ఇంకో వార్త వస్తుంది.

"అన్నట్టు ఇది విన్నారా? మన స్కూలుకు దగ్గరలోనే ఓ పెద్ద ఇల్లు అద్దెకి తీసుకుని దిగిపోయాట్ట."

"భలే. అంత పెద్ద ఇంట్లో ఏ వస్తూ సామగ్రి లేకుండా, ఓ లారీడు పుస్తకాలు లోడుతో దిగి పోయాట్టటండీ. అతని ఇల్లు ఇంచుమించు ఒక లైబ్రరీ లాగా వుంటుందటండి"

"ఫర్నిచర్ కాదు కద చిన్నపాటి సామగ్రి కూడా లేదట, ఏదొ కాసిన్ని వంట పాత్రలు తప్పనిచ్చీ"

"మన స్కూలు పిల్లలు ఏ క్లాసువారయినా సరే ఎప్పుడు వెళ్ళినా సరే, విసుగు విరామం లేకుండా ఉచితంగా ట్యూషన్స్ చెబుతాడటండి. అంతే కాదు భోజనం కూడ వండి మరీ వడ్డిస్తాడటండి"

ఇవన్నీ ఒక ఎత్తయితే, స్కూలుకు లీవనేది పెట్టడు, ఒక క్షణం ఆలశ్యంగా రాడు. వంటరిగాడు పెళ్ళామా పిల్లలా, ఇందులో ఏమి పెద్ద గొప్ప వుంది? కాని అమాయకులైన మా టీచర్లలో కొందరికి ఇతగాడు అప్పుడే ఒక రోల్ మోడల్ , ఆరాధ్యపురుషుడు అయిపోయాడు.

ఇతనికేం వెర్రో గానీ, ఏ టీచరైనా ఎప్పుడైనా లీవు పెడితే, తనెళ్ళి ఆ క్లాసు తీసుకునే వాడు. తనకు ఆ పీరియడ్ ఖాళీ వుంటేముందు వెనుకలు ఆలోచించకుండా ఆ క్లాసులో వాలిపోయి మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ,తెలుగు, హిందీ ఇలా ఒకటేమిటి ఆయా టీచర్ల సబ్జక్టును కంటిన్యుయిటి దెబ్బతినకుండా ఆ పాఠం చెప్పి వచ్చే వాడు.

ఘోరమేమిటంటే అసలు సబ్జక్టు టీచర్ కన్నా ఇతను బాగా చెప్పి వచ్చాడని పిల్లలు అనే వారు. ఇది ఏమయినా బాగుందా చెప్పండి. కీర్తి కండూతి ఇతనికి ఎక్కువ అనుకుంటాను.

పరీక్షలకు పనికి వచ్చేవిధమైన శిక్షణ మాత్రమే కాక ఆయా సబ్జక్టులు జీవితంలో ఏ విధంగా ఉపయోగపడతాయో అన్న విషయంలో లోతైన అవగాహన కల్పించాడని,పిల్లలు, వారి తలితండ్రులు చెప్పుకోవటం వినవచ్చింది.

ఇతన్ని ప్రత్యేకంగా చూడటానికి తలితండ్రులు వచ్చి ఆపిల్స్, స్వీట్స్ కూడా తీసుకు వచ్చి ఇవ్వటం అతన్ని ఆరాధనగా చూస్తూ మాట్లాడటం తరచుగా జరుగుతోంది. టిచర్లను గురించి ఏదో ఒక కంప్లయింట్ ఇవ్వటానికి తలితండ్రులు రావటమే మాకు తెలిసిన విషయం ఇప్పటిదాకా.

ఈ విధంగా కూడా ఇతను వ్యక్తి ఆరాధనకి తెర ఎత్తి మా స్కూలు పరువు తీయటనికి సిద్ధపడి పోయాడు.

'కేశవుడు సారి కల్పించిన జ్ఞానం ఇచ్చిన ఆనందం వల్ల, మనసులకు మస్తిష్కానికి రెక్కలు మొలిచిన అనుభూతి కల్గిందట" బదుద్ధాయిలు కవిత్వం వెలగబెడుతున్నారు.

పరీక్షలలో మార్కులు ఎలా తెచ్చుకోవాలి, ర్యాంకులు ఎలా తెచ్చుకోవాలి, తద్వారా వచ్చే సంవత్సరంలో స్కూలు అడ్మిషన్లు ఎలా పెంచుకోవాలి అని ఆలోచించకుండా ఇవన్నీ ఇతనికి అవసరమా చెప్పండి. ఏదో మీరు నా భావలతో మమేకం అయ్యే పెద్దమనసు వున్న వారు కాబట్టి ఇవన్నీ చెప్పుకొస్తున్నాను.

ఇంకో వెర్రి వేషం గురించి మీకు ఇక్కడ చెప్పాలి. చదువేస్తే ఉన్న మతి పోయింది అన్నట్టు,అసక్తి వున్న పిల్లలందరినీ ఓ గంట ముందే రమ్మనే వాడు. పోనీ చదివిస్తాడా అంటే అదీ లెదు. పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టండి అన్నాట్ట వెనుకటికి ఒకడు. ఇతను చేపట్టిన పని అంతకన్న మెరుగ్గా ఏమీ లేదు.

పిల్లలందరినీ మొదట ఒక అరగంట వేగంగా నడిపించే వాడు. కాళ్ళూ, చేతులు బాగా కదిలిస్తూ వేగంగా నడిపించే ఈ ప్రక్రియకి 'బ్రిస్క్ వాక్' అని పేరు పెట్టాడు. గాడిద గుడ్డేం కాదూ? "హెల్తీ బాడీ లీడ్స్ టు హెల్తీ మైండ్" అని పిచ్చి స్లోగన్ ఒకటి చెప్పిస్తూ పిల్లలందరితో సూర్య నమస్కారాలు, యోగా, ప్రాణాయామాలు చేయించి ఆపై క్లాసులకు వెళ్ళమనే వాడు. హతోస్మి, చదువు చెప్పించకుండా ఇవేమీ వెర్రి మొర్రి వేషాలు చెప్పండి?

ఇక ఆసక్తి వున్న పిల్లలతో సాయంత్రాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణ అని పేరు పెట్టుకుని ఏదో సుత్తి కొట్టి, ఆ తర్వాత ఓ అరగంట పిల్లలని వేదికపై నిలబెట్టి వాళ్ళతో చిన్నచిన్న ఉపన్యాసాలు ఇప్పించటం మొదలెట్టాడు. అయా ఇవన్నీ పిచ్చి పనులు కాక ఏమిటి మీరే చెప్పండి. ర్యాంకులు వస్తాయా, మార్కులు వస్తాయా, ఉత్తి టైం వేస్ట్ తప్ప.

కొత్తొక వింత అన్నట్టు, పిల్లల తల్లి తండ్రులు వచ్చి నన్ను అభినందిచటం మొదలు పెట్టారు, మంచి మేష్టారుని అపాయింట్ చేసారు అని. వాళ్ళ పిల్లలో చాలా మంచి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయంట. ఉదయాన్నే నాలుగున్నర, అయిదు మధ్యన లేచిపోతున్నారట, తల్లి తండ్రుల పాదాలు మొక్కి, ఆ తర్వాత కాసేపు దైవధ్యానం చేసుకుని పుస్తకాలు తీసుకుని కూర్చుంటున్నారట. ఖర్మ, లేచింది లగాయతూ చదివితే ఇంకో అరగంట కలిసి వస్తుంది కద. హతవిధి, మా స్కూలుకేదో చెడ్డ రోజులు ప్రారంభమయ్యాయని నాకు బలంగా అనిపిస్తోంది.

ఇప్పుడు పిల్లలందరూ పెద్దలకు గౌరవమర్యాదలు ఇస్తున్నారట. వీడియోలు, వీడియో గేమ్స్ తగ్గించారట. ఇంట్లో చిన్నచిన్న పనులకు సహాయ పడుతున్నారట. పిచ్చి పేరెంట్స్, రేప్పొద్దున టెన్త్ క్లాసులో పదికి పది గ్రేడింగ్ రాకుంటే నా పీక పట్టుకోరా అని నాకు భయం పట్టుకుంది. ఇల్లలుకగానే పండగ అనుకుంటున్నారు.

అతి సర్వత్ర వర్జయేత్ అని అన్నారు కద, ఇక నేనే నడుం బిగించి పిల్లలందరిని పూర్వ పద్ధతులలో క్రమశిక్షణలో వుంచాలి అని నిర్ణయం తీసుకున్నాను. నేనిలా అనుకుంటుండంగానే మరొక ఉపద్రవం జరిగింది.

ఒక మధ్యాహ్నం నేను నా చాంబర్ లో పని చేసుకుంటుండగా ఓ పదవ తరగతి విద్యార్థిని, ఆ పిల్ల తలితండ్రులు, మిఠాయిలు తీసుకువచ్చి ఓ బాంబు పేల్చారు. 'యునెస్కో' వారు రక్షిత కట్టడాలు అన్న టాపిక్ పై నిర్వహించిన ఓ పోటీలో ఈ పిల్ల గీసిన ఛాయా చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో బహుమతి వచ్చిందట. తనలో అంతటి కళ దాగుందని ఆ పిల్లకే తెలియదట, యధాప్రకారం, మన కేశవుడే ఆ పిల్లలోని స్పార్క్ ని కనిపెట్టి, దగ్గరుండి ఆ పిల్లతో ఆన్ లైన్ లో అప్లై చేయించాడట. ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేయించాడట. ఇంకేముంది, ప్రైజ్ రానే వచ్చింది.

మేము పదవ తరగతి పిల్లలని రక్షిత కట్టడాలకంటే జాగ్రత్తగా కాపాడుకుంటాము, వారి విలువైన టైం ని మేము వృధా చేయనివ్వము. వారిని ఇంచుమించు జాగ్రత్తగా ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ యూనిట్ లోని పేషంట్ల లాగా కాపాడుతూ, పరీక్షల పట్ల వారిలో విపరీతమైన భయాన్ని కలిగించి, శ్రద్ధగా చదువుకొనేలాగా ప్రోత్సహిస్తాము. ఈ వ్యవస్థకి కూడా గండి కొట్టేశాడన్న మాట ఈ కేశవుడు. ఇలాంటివన్నీ నాకు తెలియకనా, నేనెందుకు ప్రొత్సహించలేదంటారు పిల్లలని ఇలాంటి వాటి పట్ల. ఏమి పనులండీ ఇవన్నీ, చదువులు అటకెక్కవా ఇలాంటి పనుల వల్ల? ఇక తప్పదు, ఇతని నిర్వాకాలన్ని, మా చైర్మన్ గారబ్బాయికి కాదు గాని, చైర్మన్ గారికే తెలియజేయాలి. ఆయన ఏదో విదేశీ యాత్రలకు వెళ్ళారట. రానివ్వండి చెపుతాను.

ఇది అంతం కాదు ఆరంభమే అని నాకు అర్థం అయిపోయింది. ఇది తుఫాను ముందటి మొదటి ప్రమాద హెచ్చరిక లాంటిదని నాకు త్వరలోనే అర్థం అయింది. ఇలాగే అనేక జాతీయ, రాష్ట్రీయ స్థాయి పోటీల్లో మా స్కూలు పిల్లలకు బహుమతులు వచ్చాయి. వీటన్నిటి వెనుక కేశవుడే వున్నాడన్నది బహిరంగా రహస్యం. నా కళ్ళ ముందే పిల్లల చదువులని భ్రష్టు పట్టిస్తూ, తాత్కాలిక విజయాలకోసం, బంగారులాంటి భవిష్యత్తు ని పణంగా పెడుతున్న ఈ కేశవుడిని ఏమి చేయాలి మీరే చెప్పండి.

నా బాధ ఎవరు అర్థం చేసుకుంటారు చెప్పండి?

ఇతని దురాగతాలన్నీ ఒకెత్తు. మా స్కూల్ డే రోజు ఇతను చేసిన నిర్వాకం ఒక్కటీ ఒకెత్తు. ఇతని దౌష్ట్యాలన్నిటిలో కలికి తురాయి లాంటిది అని చెప్పుకోదగ్గ దుర్మార్గం ఒకటి చెపుతాను. మీకు కూడా బాగా కోపం వస్తుంది.

ప్రతి సంవత్సరం నగరంలో ఉన్న మా బ్రాంచీలన్నింటి పిల్లలని ఒక దగ్గర చేర్చి, ఓ పెద్ద స్టేడియంలో స్కూల్ డే నిర్వహిస్తాం. మా చైర్మన గారికి రాజకీయాల్లో బాగా పలుకుబడి వుందిలేండి. ఎవరో ఒక మంత్రివర్యులు వస్తారు ముఖ్య అతిధిగా. మీడియా ప్రతినిధులు సరేసరి.

ఏ ఆర్ రెహమాన్ పాడిన వందేమాతరం వంటి దేశభక్తి గీతాల తర్వాత చక్కటి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. పిల్లలు చిన్న చిన్న బృందాలుగా వేదికపైకి వస్తారు. కాస్తా చిన్ని చిన్ని బట్టలు ధరించి, సినిమా పాటలకు అనుగుణంగా నడుం కదిలిస్తూ, చిలిపిగా హావభావాలు ఒలకబోస్తూ హుషారు కలిగించేలా డాన్సులు చేయటం మొదలెడతారు;. పిచ్చి పిల్లలు జన్మకో శివరాత్రిలా సంవత్సరానికి ఒక సారి ఏదో కాస్తా ఎంజాయ్ చేస్తే తప్పేమిటి మీరే చెప్పండి. ఈ సత్సాంప్రదాయానికి కూడా గండి కొట్టేశాడు మన కేశవుడు.

ఈ సంవత్సరం మా బ్రాంచి తరపున హుషారెత్తించే పాటలు లేకపోగా , పరమ బోరు కలిగించే 'స్కిట్స్ అంటూ ఏవో ప్రదర్శించటం జరిగింది. వీటిలో కూడా 'గోల్ సెట్టింగ్', 'పాజిటివ్ థింకింగ్', 'విన్-విన్ సిట్యుయేషన్', '360 డిగ్రీస్ థింకింగ్', అంటూ నిరర్ధకమైన నినాదాలు, నిరాసక్తమైన సందేశాలు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఇలాంటి చచ్చు కార్యక్రమాలు నా జన్మలో చూడలేదు నేను. మిగతా బ్రాంచీల పిల్లలు యధావిధిగా ఐటెం సాంగ్స్ కి చక్కగా నడుం కదిలిస్తూ డాన్సులు చేసి నన్ను ఆకట్టుకున్నారు.

మా బ్రాంచి పిల్లల్నే కేశవుడు ఇలా దిగజార్జేశాడు. నా ఖర్మ ఏం చేద్దాం చెప్పండి? చిత్రంగా ఇతను నిర్వహించిన కార్యక్రమాలకు చప్పట్లు ఎక్కువగా వచ్చినట్టుగా అనిపించింది నాకు.

ఇంకో చిత్రం చెప్పనా, చక్కటి డాన్సులన్నింటినీ త్రోసి రాజని మన కేశవుడి స్కిట్స్ కే అవార్డులన్నీ క్యూ కట్టుకుని మరీ వచ్చాయి.ఇలాంటి గొప్ప శిక్షకుడు ప్రతి బ్రాంచిలో వుండాలని మా చైర్మన్ గారి అబ్బాయి ప్రశంశా వాక్యాలొకటి.

విదేశాల నుంచి రాగానే చైర్మన్ గారితో కూలంకషంగా మాట్లాడాలని ఇక ధృఢంగా నిశ్చయించుకున్నాను.

తదుపరి పరిణామాలు మరింత ఘోరంగా పరిణమించాయి.

నెక్స్ట్ రౌండ్ ఆఫ్ ఆపరేషన్స్ అన్నట్టు , టీచర్లందరిపై తన దృష్టిని కేంద్రీకరించాడు కేశవుడు. సాధికారికంగా ఇంగ్లీష్ లో మాట్లాడే శిక్షణ ప్రారంభించేశాడు. ఆశువుగా మాట్లాడే వక్తృత్వ శిక్షణ, వ్యక్తిత్వ వికాస శిక్షణ, ప్రారంభమయిపోయాయి. ఇక ఇతగాడి ట్రేడ్ మార్క్ సూర్యనమస్కారాలు, యోగా, బ్రిస్క్ వాకింగ్, ప్రాణాయామాలు సరేసరి.

నాకు తెలియక అడుగుతా. ఎందుకండి ఇవన్నీ!?

ప్రతీరోజు కనీసం ఒక్కసారన్నా ఇతగాడిని నా ఛాంబర్ కి పిలిచి, ' ఈ పిచ్చి పనులు కట్టిపెట్టి, పిల్లలందరికీ పదికి పది స్కోరు వచ్చే దానిపై ఫోకస్ చేయమ'ని చెప్పటం  నా నిత్య కృత్యాల్లో ఒకటిగా మారిపోయిందంటే నమ్మండీ. ఇలా అనుభవం లేని అధ్యాపకులని మలచుకోవటమే కద ప్రిన్సిపాల్ గా నా విధి.

ఇక సంవత్సరం అంతంలో పరీక్షలు జరగటం, ఫలితాలు వెలువడటం చకచక జరిగి పోయాయి. మా బ్రాంచి చరిత్రలోనే కనివిని ఎరుగని ఫలితాలు ఈ సంవత్సరం వచ్చాయి.

ఎక్కడ చూసినా అభినందనల వెల్లువ. కేశవుడిని అప్పాయింట్ చేయటం నా దార్శనికతకి ప్రతీక అని పేరెంట్స్ అందరూ కొనియాడుతున్నారు. ఖర్మ , ఇన్నేళ్ళూ నేను చేసిన శ్రమ ఫలించింది., క్రెడిట్ ఈ కేశవుడు కొట్టేస్తున్నాడు.

పోన్లెండి కనీసం కేశవుడికి అయినా అర్థమయి బుద్ధి తెచ్చుకుని, ఇకనైనా నేను చెప్పినట్టు వింటాడని ఆశిద్దాం.

కానీ తానొకటి తలచిన దైవమొకటి తలచును అన్నట్టు , కేశవుడిని మా బ్రాంచికి ప్రిన్సిపాల్ గా అప్పాయింట్ చేస్తూ, నన్ను ఇంటి దారి పట్టమన్నారు.

పోన్లెండి. ఈ జ్యోస్యం టెక్నో స్కూలు ఒక్కటే కాదు కద. గోవిందా టెక్నో స్కూలు, వైప్లవ్య కాన్సెప్ట్ స్కూలు ఇలా బోలెడు స్కూళ్ళు నన్ను రమ్మని ఎప్పటినుండో పిలుస్తూనే వున్నాయి.  నేనంటూ వెళితే కళ్ళకద్దుకుని తీసుకుంటాయి.

కానీ ఈ కేశవుడి చేతిలో పడి ఈ స్కూలు గతి ఏమవుతుందో ఊహించుకుంటేనే జాలి కలుగుతుంది.

## మనసు లోపల

డా.పేరం ఇందిరా దేవి

"డెక్స్ట్రోకార్డియా" అనగా ఎడమవైపు కాకుండా కుడివైపు గుండె ఉండడం ఒక అరుదైన వైద్య రుగ్మత .  (మెడికల్ డిసార్డర్.) అలాంటి రోగిని ఇవాళ కేస్ స్టడీకి పెట్టారు. గుండె కుడి వైపు ఉంటే మిగతా అవయవాలు కూడా ఎలా వుంటాయో చీఫ్ వివరిస్తున్నారు. "12,019 మందిలో ఒకరికి ఇలాంటి లోపం ఉంటుంది . ఇందులో కూడా మరికొన్ని రకాలున్నాయి. దీని వలన గుండె, ఇతర అవయవాలు పనిచేసే తీరు మారిపోతుంది. చాలా మంది

పిల్లలు ఈ జన్యుపరమైన జబ్బుతో పుట్టిన కొద్దికాలానికి మరణించడం జరుగుతుంది. కొంతమందికి ఏ రకమైన ఇబ్బంది లేకుండా కూడా వుంటారు..." రోగిని పరిశీలిస్తూ వింటున్నాం.

అప్పుడే నర్స్ పరిగెత్తుకుని వచ్చింది, "ఎ" క్లాస్ లో వున్న లివర్సిరోసిస్ తో బాధపడుతున్న హేమవర్ధన్ పరిస్థితి బాగా లేదని. చీఫ్ తో పాటు అందరం అక్కడికి పరిగెత్తాం. ముందు నుంచీ ఆ హేమవర్ధన్ గారిని చాలా జాగ్రత్తగా చూస్తున్నాం. దానికి మొదటి కారణం అతను చీఫ్ స్నేహితుడు కావడం, రెండవది అతని స్వభావం. చాలా ముభావంగా, ప్రశాంతంగా, నిర్వికారంగా వుంటారు. బాగా ఎక్కువ మద్యం త్రాగడం వలన అతని కాలేయం మార్పిడికి (transplantation) కూడా వీలుకానంత పాడయ్యింది. ఆయన మృత్యువుకు అతి చేరువలో వున్నారు. చీఫ్ అతన్ని చూసుకునే బాధ్యతని ఎక్కువ నాకే అప్పగిస్తుంటారు. ముందునుంచీ చీఫ్ కు నేనంటే అభిమానం, నమ్మకం.

చీఫ్ కు హేమవర్ధన్ పరిస్థితి చూడగానే అర్థమైంది. చీఫ్ ముఖంలోని ఆదుర్దా చూడగానే నాకు కూడా అర్థమైంది. ఐ సి యు (ICU) కి మార్చాం. ESLD అంటే ఎండ్ స్టేజ్ లివర్ డిసీజ్ ఆయన్ని పూర్తిగా మరణానికి చేరువ చేసింది. పీజీ చేస్తున్న మేము ముగ్గురం, ఇద్దరు అసిస్టెంట్ డాక్టర్లు, మా చీఫ్ , చీఫ్ స్నేహితుడైన మరొక సీనియర్ గాస్ట్రోఎంట్రాలోజిస్ట్ రాత్రంతా ఆయన దగ్గరే వున్నాం .

ఉదయాన్నే నేను ఇంటికి బయలు దేరుతుంటే

"అనిమా ఇంటికెళుతున్నావా? వారీసిల్ హెమోరేజ్ ( variceal hemorrhage,) చాలా ఎక్కువుంది ... ట్రీట్మెంట్ కు ఎంత స్పందిస్తాడో చూద్దాం. నువ్వు మళ్ళీ రాగలవా ! నీవుంటే నాకు కొంచం భరోసా వీడి విషయం లో నేను డాక్టర్ను కాదు...స్నేహితుడ్ని మాత్రమే ... ప్లీజ్ నా కోసం" చీఫ్ వేడుకోలుగా అడిగారు.

అతని జీవితం ఆఖరి క్షణాల్లో వుంది. ఆ మాటకొస్తే ICU లో అందరి పరిస్థితి అటు ఇటు గానే వుంది.

నేనుండి ఏంచేస్తాను ? కానీ చీఫ్ అభ్యర్థన ను కాదనలేని పరిస్థితి.

టీవీ సీరియల్ "అత్తగారు" లో నటి శ్యామలమ్మ కూడా ఆఖరి క్షణాల్లో వున్నారు . హెపటైటిస్ బి ఆమెకు ఎలావచ్చిందో పాపం, అది కాస్త లివర్ కాన్సర్ కు మారింది. ఆమె ఉదయమే కోమా లోకి వెళ్లి పోయారు. ఆమెకెవరూ లేరని ఆమె సహ నటి ఒకామె హాస్పిటల్ లో చేర్పించారు. ఆమే మూడు రోజులుగా వుంది శ్యామలమ్మ దగ్గర. రాధిక పిలుస్తే వెళ్లాను . ఆమె చనిపోయారు . అయిదు నిముషాల్లో ఖాళీ మంచం ! నేనంటే ఆమెకు చాలా ఇష్టం ... ఆమె తను నటించిన సీరియల్ చూశావా అని అడిగేది . టీవీనే చూడనంటే ఆశ్చర్య పోయేది . నన్ను అనిమా అనకుండా ఆమని అని పిలిచేది. రాధిక సరిదిద్దితే నేను ఇలాగే పిలుస్తాను తల్లీ .. ఆ పేరు రాదు అనేది. రోజూ ఇలా రోగులుగా వచ్చే వాళ్ళు ...కొందరు నయమయి పోయేవాళ్లు ..మరి కొందరు శవాలుగా మారి పోయేవాళ్లు. ఇక్కడ ఇది నిత్యకృత్యం .

హేమవర్ధన్.. పరిస్థితి అసలు బాగా లేదు. చీఫ్ కృష్ణ కు స్నేహితుడు కాబట్టి హాస్పిటల్ లో వున్న చీఫ్ లంతా చూసి వెళుతున్నారు వాళ్ళు చెప్పిన మెడిసిన్స్ కూడా తెప్పిస్తున్నారు ...పొట్టంతా నీరు చేరింది తీస్తున్న కొద్దీ అది చేరుతూనే వుంది. మెల్లిగా ఒక్కొక్క అవయవం పని చేయకుండాపోతున్నాయి ... ఊపిరి తీసుకోవడానికి కష్టపడుతున్నారు.

నేను, రాధిక, మా చీఫ్ ఆయన దగ్గరే వున్నాం . చీఫ్ ఇంటికి కూడా పోకుండా ,పోయినా వెంట వెంటనే వచ్చేయడం , పెద్ద కార్పొరేట్ హాస్పిటల్లో చేరే శక్తి వున్నా, ఇక్కడే చేర్చుకోవడం బట్టి హేమవర్ధన్ గారు కృష్ణ సార్ కు చాలా మంచి స్నేహితుడని అర్థమైంది. మగతగా వుండి కోమాలోకి వెళ్ళబోతున్న అతన్ని "హోల్డ్ హిమ్ అనిమా" గట్టిగా అరిచారు. నేను అదిరి పడి ఆయన్ని పట్టుకున్నా . "హర్షా హర్షా ..ఇటు చూడు"అని అతన్ని కుదిపి మాట్లాడ్డానికి ప్రయత్నించారు. మేము చూస్తుండగానే ఆయన .. కోమా లోకి వెళ్లిపోయారు. వెంటిలేటర్ మీద పెట్టాము ... లివర్ పూర్తిగా పని చేయడం ఆగిపోవడంతో రక్తస్రావం ఆగలేదు. ఒకప్రక్క రక్తం ఎక్కిస్తున్నాం... చూస్తుండగానే బ్లడ్ ప్రెజర్ పడిపోతోంది. బీపీ పెరగడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. అన్ని ప్రధాన అవయవాలకు రక్త ప్రసరణ ఆగిపోవడంతో మేము చూస్తుండగానే ఆయన ఊపిరి ఆగిపోయింది .

చీఫ్ అక్కడే మౌనంగా ఉండిపోయారు. నేను రాధిక బయటికి వచ్చాం ..ఐసీయూ లోనే ఆయన ఏడుస్తున్నట్లు నర్స్ చెప్పింది.

"... చిన్ననాటి స్నేహితుడంటకదా ! నెల నుండి ఎంత బాగా చూసుకున్నారు ఆయన్ని ...." నర్స్ అంది

నాకు కొంచం ఆశ్చర్యం అయింది సార్ అలా స్పందించడం. రోజూ ఎన్ని మరణాలు చూస్తుంటాం ! నెల రోజుల క్రిందటే అతని పరిస్థితి మాకు తెలుసు. కానీ సర్ రోజూ వచ్చి చూసుకోవడమే కాకుండా హాస్పిటల్ ఓపీ లో వున్నా , అప్పుడప్పుడు వార్డ్ లో వున్న డ్యూటీ డాక్టర్ కు పీజీ లకు ఫోన్ చేసేవారు ఎలా వున్నారో అని. సార్ బయటికి వచ్చారు ఆయన కళ్ళు ఎర్రగా వున్నాయి .

"అనిమా ఇలా రా "అన్నారు ఆయన తన క్యాబిన్ లోకి వెళుతూ

వెళ్లాను . నా చేతికి ఒక కవర్ ఇచ్చారు ..." ఏంటిది సర్ ?"

"చదువు" కొంచం గట్టిగా అన్నారు అందుకుని తెరిచాను

*అనిమా ...!*

*నా బంగారు తల్లీ ,*

*ఈ ఉత్తరం నిను చేరేప్పటికీ నేను ప్రాణాలు వదిలి వుంటాను. కృష్ణ ను నా మరణం తర్వాతే ఇది ఇవ్వమని చెప్పాను. అసత్యాలతో, వంచనలతో నేను ఏర్పర్చుకున్న సంబంధాలు, బంధాలు కాలేక పోయాయి. నాకంటూ ఒక్కర్ని కూడా మిగుల్చుకోలేకపోయాను. నా జీవితం చివరలో నేనెవరో నీకు తెలియకుండానే నీ చేతుల్లో మరణించడానికి వచ్చాను. నీ కన్నతండ్రిని అని చెప్పుకోలేని నిర్భాగ్యుడ్ని ... వ్యామోహాల వెంట నీవు గర్భంలో ఉండగా మీ అమ్మను వదిలి అమెరికా వెళ్లాను . ఆమె కన్నీటికి కారణమైన నన్ను నీవు క్షమించవని నాకు తెలుసు.. అది ఆశించను తల్లీ.. నా యావదాస్తిని నీకు రాశాను ...ఇది ఒక్కటి చేయగలిగాను. నాకు తెలుసు నా తప్పులకు నిష్కృతి లేదు. నాలాంటి వంచకుడిని నమ్మి మోసపోయిన మీ అమ్మ నీలాంటి ఆణిముత్యాన్ని కని ధన్యురాలయింది. నేను మిమ్మల్ని కోల్పోయి జీవితాన్నే కోల్పోయాను . నా వయసు, ఆరోగ్యం, అన్నీ కోల్పోయాక మీ అమ్మ విలువ తెలుసుకున్నాను. మీరెక్కడున్నారో ఎలా వున్నారో తెలుసుకున్నాను. మీ అమ్మ మళ్ళీ పెళ్లిచేసుకోలేదని నీకోసం ఒంటరిగా ఉండిపోయిందని, నీవు పదవ తరగతిలో , ఇంటర్లో , ఎంసెట్ లో స్టేట్ రాంకర్ వని ,మెడిసిన్ లోఅన్ని సబ్ జెక్ట్లలో గోల్డ్ మెడల్స్ సంపాదించావని , మళ్ళీ పీజీ లో కూడా మొదటి రాంక్ సంపాదించి జనరల్ మెడిసిన్ చేస్తున్నావని తెలుసుకున్నా. నీ ప్రతి విజయం వెనుక మీ అమ్మ ఉందని , మీ అమ్మ కూడా నీతో పాటు మేలుకుంటుందని , నీడలా నీ వెంట వుంటూ నిన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, అయినా నీకు సంపూర్ణమైన మైన స్వేచ్ఛ ఇచ్చిందని , మీ అమ్మ కు కష్టం కలిగే పని నీవు ఏదీ చేయవని , ప్రతి విషయం మీ అమ్మ తో పంచుకుంటావని తల్లీ కూతుళ్ళ లాగే కాకుండా మంచి స్నేహితుల్లా ఉంటారని తెలుసుకున్నా .*

*నీకు చేరువ కావడానికే ఎప్పుడో చిన్నప్పటి స్నేహితుడైన మీ చీఫ్ కృష్ణ తో స్నేహం పెంచుకున్నాను. కృష్ణకు నీ మనస్తత్వం తెలుసు అందుకే నేను జీవించి ఉండగా నేను నీ తండ్రినని చెప్పడానికి ఒప్పుకోలేదు. కృష్ణ సహాయం తోటే వసంత్ ఇంట్లో మీ అమ్మ కు తెలియకుండా చూడాలని ప్రయత్నం చేశాను. కానీ మీ అమ్మ నన్ను చూసింది . మీ అమ్మ కళ్ళలో ఆశ్చర్యం ,అసహ్యం కనిపించాయి . తప్పు చేశానని క్షమించమని మీ అమ్మని అడిగేంత మూర్ఖుడ్ని కాను ఆమె ను కళ్ళెత్తి చూసే ధైర్యం ,నైతిక శక్తి నాకు లేవు. వెంటనే నేను వచ్చేశాను . మీ అమ్మ ఆ విషయం నీకు చెప్పివుండకపోవచ్చు. నాన్న అనే పదం కూడా ఎప్పుడూ నీవు వాడవని నీ స్నేహితులు చెప్పారట కృష్ణతో . నిజమే నీ జీవితం లో తండ్రి పాత్ర లేదు. కానీ నెల రోజులుగా నిన్ను మురిపెంగా చూసుకుంటూ తరిగి పోతున్న నా ఆయువును తలచుకుంటూ బ్రతికాను. నాకు తెలుసు ఇంక ఎక్కువ సమయం లేదని. చివరి దశలో అయినా నిన్ను చూశాను ... నీ సమక్షంలో కడతేరి పోతున్నాను .*

*హర్షవర్ధన్*

ఉత్తరం చదివి చీఫ్ ప్రక్కకు చూశాను. కాసేపు ఆయన ఏమీ మాట్లాడలేదు . తర్వాత బయటికి వెళ్లారు.

నాకు వసంత్ వాళ్ళ గృహ ప్రవేశం రోజు గుర్తొచ్చింది . క్రొత్త ఇల్లుకట్టుకున్న సందర్భంగా వసంత్ అమ్మ నాన్న గారు ఇచ్చే పార్టీకి నేను ఆలస్యంగా వచ్చాను . నైట్ డ్యూటీ ఉందని చెప్పినా, అలాంటి పార్టీలు అమ్మకు ఇష్టం లేదని చెప్పినా అతను వినిపించుకోలేదు అమ్మను తీసుకుని రావాలని ఎంతో అడిగాడు. నాకు ఆలస్యం అవుతుందని చెప్పడం తో అమ్మ నేరుగా వసంత్ ఇంటికి వెళ్ళింది.

డాక్టర్ వేణు కూడా అవాళ సెలవులో ఉండడం వలన చీఫ్ ను రెండుగంటలు పర్మిషన్ అడగడానికి కూడా జంకాను. మెడికల్ వార్డులో ఎప్పుడూ మూడు నాలుగు సీరియస్ కేసులుంటాయి. ఇద్దరు లివర్ సిరోసిస్ తో నెల రోజులుగా మృత్యువుతో పోరాడుతున్నారు. డాక్టర్ రాధిక ఒక్కతే వుంది.

“తొందరగా ఒక గంటలో వస్తాను” రాధిక తో అన్నాను.

“మీ దేవదాస్ అంకుల్ మాకు మాట వినడు ఇంజక్షన్ వేయించుకోడు సిస్టర్ ను సతాయిస్తాడు, చెప్పి వెళ్ళు... ” అంది రాధిక

“నాకేనా అంకుల్ మీకు కాదా ఏంటి ? ”

“ఆయనకు నీవు స్పెషల్ కదా నీవు ఒక్క రోజు రాకపోతే అనిమ రాలేదామ్మా , ఎప్పుడొస్తుంది అని అడుగుతునే ఉంటాడు. నీకు గ్రేట్ ఫాన్! నీ ఓపికకు అందరు ఫాన్స్ లే అనిమా, ఆ టీవీ సీరియల్లో గయ్యాళి అత్త వేషం వేసే ముసలావిడ కూడా, ఆమని తల్లి రాలేదా అని అడుగుతుంది.... ఏం మేం డాక్టర్లము కామా! అని తగులుకున్నా ఒకసారి. అప్పటినుండి అడగడం మానేసింది .”

“రాధికా.....వాళ్ళు మానసికంగానూ, శారీరకంగానూ దుర్బలమైన పరిస్థితిలో వున్నారు. కొంచం ఓపిగ్గా సమాధానం చెబితే వాళ్ళు ప్రశాంతంగా వుంటారు. మరణానికి చేరువగా వున్న వీళ్ళు రేపు ఉదయాన్ని చూస్తారో లేదో తెలియదు. అది గుర్తు తెచ్చుకుంటే మనకు వీళ్ళమీద కోపం రాదు, సరే కానీ ఎందుకైనా మంచిదని చీఫ్ కు పర్మిషన్ లెటర్ రాసిపెట్టి ఆయన టేబిల్ పై పెట్టి వచ్చాను. వెళ్ళొస్తాను రాధికా, ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా వస్తాను ... సరేనా ?”

రాధిక తలూపింది.

సీరియస్ కేసులైన లివర్ సిరోసిస్ పేషంట్లను మళ్ళీ ఒకసారి పరామర్శించి బయలుదేరాను.

వసంత్ ఇల్లు డూప్లెక్స్ మోడల్ , పెద్ద హాలు తో అతి ఖరీదైన ఇంటీరియర్స్ తో చాలా బావుంది. వసంత్ నేను అక్కడకు రాగానే అందరి కళ్ళు మా ప్రక్కకు తిరిగాయి. నేను అమ్మకోసం చూశాను, కనపడలేదు. నేరుగా వసంత్ తన అమ్మానాన్న దగ్గరకు తీసికెళ్ళాడు.

“నా ఫ్రెండ్... డాక్టర్ అనిమ.. జనరల్ మెడిసిన్ ఫైనల్ ఇయర్ చేస్తోంది....అనిమకు నైట్ డ్యూటీ వుంది తొందరగా వెళ్ళిపోవాలి ” పరిచయం చేశాడు. వసంత్ తల్లిదండ్రులు సంతోషంగా తలవూపారు .

“మీ అమ్మగారిని కూడా ఇందాకే కలిసాం అనిమా.. , వసంత్.. అనిమ కు ఇల్లు చూపించు....తొందరగా భోజనం ఏర్పాట్లు కూడా చూడు ...”వసంత్ అమ్మగారు ఆప్యాయంగా పలకరించారు. వసంత్ నన్ను అమ్మ దగ్గరకు తీసికెళ్ళాడు. అమ్మ ముఖం చూడగానే నేను ఏదో జరిగిందని గ్రహించాను. అమ్మ ముఖం ఎర్రగా అయింది .. కళ్ళు తడిగా వున్నాయి.

“ఇల్లు చూద్దాం రా” అన్న వసంత్ మాటలు పట్టించుకోకుండా “అమ్మా ఏమయ్యింది అన్న నా ప్రశ్నకు బలవంతంగా నవ్వు తెచ్చుకుంటూ “ఇల్లు చూసి రాపో...మళ్ళీ వెళ్ళాలిగా ” అంది.

అమ్మ మనసు కష్టపడింది అది నా తలపులోకి రాగానే నాకు దేనిపైనా ఆసక్తి కలగలేదు. అమ్మ నా ప్రాణం, అమ్మ కంటతడి పెట్టిందంటే ఎంత గాయపడి ఉంటుందో ! దేనికీ అమ్మ పెద్దగా చలించదు ...కానీ అమ్మను గాయపెట్టే విషయం ఏమై ఉంటుంది ? ఇదే ఆలోచన ..!

ఇల్లు చూశాక “చాలా బావుంది... కంగ్రాచులేషన్స్ ... నేను అమ్మదగ్గరకు వెళతాను వసంత్” అన్నాను

“పద..అమ్మ కూచి” నవ్వాడు

"అమ్మా ఏంజరిగింది ? ఎందుకలా వున్నావు ? ఎవరైనా ఏమన్నా అన్నారా ? అలాంటిది జరిగితే చెప్పు ఇప్పుడే వెళ్ళిపోదాం"

"అదేం లేదులే .... భోంచేద్దాం పద ..." అంది

సమయం చూసుకుని వసంత్ తల్లిదండ్రులతో సెలవు తీసుకున్నాను.

అమ్మ నా చేయి గట్టిగా పట్టుకుంది. ఆ స్పర్శ లోనే అమ్మ చాలా అలజడిగా ఉందని గ్రహించాను.

"అమ్మను నేను డ్రాప్ చేస్తాను నీవు వెళ్ళు ఇప్పటికే ఆలస్యం అయిందిగా !" అన్నాడు వసంత్.

అమ్మతో వెళ్ళాలని వున్నా ..వార్డ్ పరిస్థితి గుర్తొచ్చి కళ్ళతోనే అమ్మ తో సెలవు తీసుకున్నా. మనసంతా అమ్మ తడిఆరని కళ్లపైనే వుంది. అతి ప్రయత్నం మీద నా ధ్యాసను రోగులపైకి మరల్చాను.

ఉదయాన్నే తలుపు తీసిన అమ్మ ముఖం చూసి అదిరిపోయాను . రాత్రంతా నిద్రపోలేదని అర్థమైంది . బలవంతంగా చిరునవ్వు పెదాలపైకి తెచ్చుకుంది. నేను ముఖం కడుక్కుని వచ్చేప్పటికి బోర్నవిటా కలుపుకుని వచ్చింది. నాకు జ్ఞాపకం వచ్చినప్పటి నుండి నా రోజు అమ్మ ఇచ్చే బోర్నవిటాతోనే మొదలవుతుంది .

"ఏమైంది నిన్న వసంత్ వాళ్ళింట్లో ?"

అమ్మ మాట్లాడలేదు.

నాకు చిరాకేసింది...అమ్మకు నాకు మధ్య ఎప్పుడూ రహస్యాలు లేవు...వాటి అవసరం కూడా ఇంతవరకు రాలేదు. బాల్కనీలో కూర్చుని వుంది. కొంగును వ్రేలికి చుట్టి మెలివేస్తోంది . ఆ చర్య ఆమె తీవ్రమైన ఒత్తిడి లో ఉందని చూపుతోంది.

"ఏం జరిగింది నిన్న వసంత్ వాళ్ళింట్లో ?"సూటిగా అడిగేశాను

"రాత్రి మీ నాన్న వచ్చారు పార్టీకి" అని అమ్మ తలవంచుకుంది.

నాన్న అనే పదం నాతో అమ్మ ఇంతవరకు వాడలేదు...నాకు వూహ వచ్చినప్పటి నుండి నాకు అమ్మ ఒక్కతే కనపడింది. అందరికీ ఉన్నట్లు నాకు నాన్న లేడని నాకెందుకో ఎప్పుడూ అనిపించలేదు. అమ్మ రెండు పాత్రలు సమర్థవంతంగా పోషించింది. నాకేదైనా తక్కువైతేకదా నాకు నాన్న ఉండివుంటే అవి సమకూరేవి అనే ఆలోచన రావడానికి . ఆరోగ్యకరమైన మానసిక వాతావరణం కలిగించింది అమ్మ ఉన్నతమైన విద్యతో పాటు ఉన్నతమైన భావాలు కలిగిన అమ్మ జీవితంలో నాన్న లేకపోవడాన్ని నేను అతి చిన్నవయసులోనే అంగీకరించాను. నాన్న నాకెందుకులేడనే ప్రశ్న కానీ,నాన్న ఉంటే బావుంటుందనే భావాలు నాలో కలగలేదు. ఇరవై మూడేళ్ళ అమ్మాయికి మొట్టమొదటి సారిగా "మీ నాన్న" అన్న పదం వాడింది అమ్మ . కానీ నిశ్చలమైన సరస్సులాంటి అమ్మ ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీసిన అతను నాకు నాన్న కావడమేంటి? అతను నా జన్మకు కారకుడు అంతే.

"నాకు నాన్న అనే బంధం లేదమ్మా... ఆ పదం వాడకు...నా జన్మకు కారకుడు ఎవరైతేనేం? నాకేమీ అవసరం లేదు. నీ కంటూ వేరే ప్రపంచం లేకుండా నేనే నీ ప్రపంచం అనుకుంటూ బ్రతికావు ... నాకు కూడా నీవు అంతే .... కానీ నాకు నా వృత్తి కూడా చాలా పెద్ద బాధ్యత. నిన్ను ఎలా విస్మరించలేనో నా వృత్తిని కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించలేను. నీవు బాగుంటేనే నేను నా రెండో బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చగలను . అందువల్ల మనిద్దరం అవసరమైన వాటి గురించే ఆలోచిద్దాం."

అమ్మను గాయపెట్టిన ఆ వ్యక్తి గురించి ఇంక మథనం వద్దని నా మాటల్లో గ్రహించిన అమ్మ మళ్ళీ ఆ ప్రసక్తి తేలేదు. నేను కూడా పూర్తిగా మర్చిపోయాను.

వసంత్ గృహప్రవేశం ఫోటోలు చూస్తుండగా ఒక ఫొటోలో హర్షవర్ధన్ గారు కనపడ్డారు...నేను ఆశ్చర్యపోయాను. హాస్పిటల్ లో వుండే ఆయన అక్కడికి ఎందుకెళ్లారో ! ఎలా వెళ్లారో ! వసంత్ ను అడిగితే తెలియదన్నాడు, ఎప్పుడూ చూడలేదన్నాడు. ఆలోచించేకొద్దీ హర్షవర్ధన్ ఎవరో అర్థమైంది. ఆ విషయం నన్నేమీ ఇబ్బందిపెట్టలేదు. రోగి పట్ల డాక్టర్ గా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలి...అదే నే చేశాను.

కృష్ణ సార్ వచ్చారు ..."అనిమా... అతనెవరో తెలిసిందిగా బాడీ ని మీ ఇంటికి తీసికెళతావా ... నీకు ,మీ అమ్మగారికి చెబుదామని ఎంత చెప్పినా హర్ష ఒప్పుకోలేదు. అయామ్ సారీ..."

"అతనెవరో నాకు నెలరోజుల క్రిందటే తెలుసు సర్...డాక్టర్ గా నా కర్తవ్యం నేను చేశాను. ..అంతే..అతనితో ఇంకే బంధమూ నాకు, మా అమ్మకు కూడా లేదు. మా అమ్మకు అతను ఇక్కడ వున్నాడని కూడా తెలియదు. ఈ విషయాలతో మాఅమ్మను గాయపెట్టడం నాకు ఇష్టంలేదు సర్... మూడు రోజులుగా మీకోసం రాత్రి పగలు డ్యూటీచేశాను. అమ్మ కంగారు పడుతోంది...నేను వెళతాను. అతను నా పేర రాసిన ఆస్తినంతా తిరిగి మన హాస్పిటల్ కు డొనేట్ చేస్తున్నాను... ప్లీజ్ సర్... ఇది మనిద్దరి మధ్యనే వుండనీండి .... "

"అది కాదు అనిమా కనీసం నువ్వు కూతురుగాఆయన దహన సంస్కారాలు చేసేప్పుడు ఉండవా ..." సార్ ఏదో చెప్పబోయారు.

"పేషంట్ ను కాపాడ్డానికి ఆఖరి వరకు డాక్టర్లు ప్రయత్నిస్తారు సర్ ... చనిపోయిన పేషంట్ తో డాక్టర్ కు ఏమీ సంబంధం లేదు. అతను కూడా నాకు పేషంట్ మాత్రమే...ఈ విషయంలో నాకు ఏమీ చెప్పకండి ...వెళ్లనీయండి...." ఉత్తరం, డాక్యుమెంట్లు వున్న కవర్ ఆయన టేబిల్ పై పెట్టి " అలసటగా కళ్ళు మూతలు పడుతుండగా నెమ్మదిగా బయటికి నడిచాను.

అమ్మకు ఫోన్ చేశాను వస్తున్నానని. నాకోసం గుమ్మం దగ్గరే ఎదురుచూసే అమ్మ గుర్తొచ్చి నాకు తెలియకుండానే కన్నీళ్లు తిరిగాయి..అమ్మను ఆనందంగా ఉంచడం కంటే గొప్ప ధ్యేయం నాకు లేదు. అదే నా జీవితాశయం కూడా.

## అంతా ఒకరి మంచికే

ఎలక్ట్రాన్

*చిన్నపట్నుంచీ నాకు పోలీసంటే మహా చెడ్డ అభిమానం. సమాజంలో నేరప్రవృత్తి కలవారినందర్నీ సినిమాల్లో చివరికి కటకటాల వెనక్కి పంపడం నాకు భలేగా అనిపించేది. అయితే నేరాల భాష్యం చెప్పడం అంతసులువైన సంగతి కాదు. ఈ సంగతి నేను పట్టుదలతో పోలీసు శాఖలో ప్రవేశించే పెద్ద అర్హత పట్టా సాధించిన తర్వాత కానీ తెలియలేదు. ఒకరు కష్టపడి సంపాదించింది మరొకరు చోరీ చెయ్యడం నేరం. నా చిన్నప్పుడు నాయనమ్మ ఓ నాలుగ్గంటలు శ్రమించి లడ్డూలు చేసి, పిల్లలకి ఒకటి చేతిలో పెట్టి, మిగిలినవి ఓ జాడీలో ఉంచి అటకమీద ఉంచేది. ఆవిడ తాపత్రయం అంతా ఓ నాలుగైదు రోజులు పిల్లలకి మిఠాయి పెట్టడం. అయితే మధ్యాహ్నం వేళ పెద్దలు కునుకు తీసేవేళ, నిచ్చెన వేసుకొని పైకెక్కి ఆ లడ్డూలని స్వాహా చేసేవాళ్లం. "వెధవాయిల్లారా!నిచ్చెన జారితే కాలో చెయ్యో విరుగుతుంది. ఇకనుంచీ పిల్లకాయకో రెండు చొప్పున చేసి ఊరుకుంటాను. అంతకు మించి ఇలా అటకలనెక్కి మూడూ నాలుగూ ఒకే రోజున తింటే ఆరోగ్యం పాడౌతుంది" అని మందలించేది. ఆ మందలింపే ఒక ముద్దైన శిక్షగా భావించే వాళ్ళం.*

నేను ఉన్నత పాఠశాలలో పన్నెండో తరగతి పెద్ద పరీక్షలు రాస్తున్నప్పుడు నా వెనకబెంచిలో కూర్చున్న కోటి నా సమాధానపత్రాల్ని గెద్దకళ్లతో చూసి నకలు దించేస్తోంటే పర్యవేక్షకుడు పట్టుకొన్నాడు. కోటి గాణ్ణి పట్టుకోవడమే కాదు, వాడికి కనిపించేటట్లు నేను కాస్త జరిగి కూర్చున్నానని నన్నూ చీవాట్లు వేశాడు. ఒళ్ళంతా ఆభరణాలు దింపుకొని పేరంటానికి వెళ్ళే ఇల్లాళ్ల ఇళ్ళలో దొంగతనాలు జరగమంటే జరగవూ? చోరీ చెయ్యడానికి అవకాశమిచ్చినవాడు కూడా మౌలికంగా నేరస్థుడేనన్నమాట!

బలాత్కారాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. కారణమేమిటీ అంటే కామోద్రేకం. ఈ కామోద్రేకనికి కారకులెవ్వరూ అంటే సమాజంలోని కొందరు అని జవాబు తప్పించి ఇతరత్రా వివరణ ఇవ్వడానికి నేను సాహసించ లేను.

ఇకపోతే అవినీతి. అవినీతిని నిర్వచించడమూ కష్టమే. దానికి శతకోటి రూపాలు. అనంతకోటి మార్గాలు. ధన దారిద్ర్యమూ, ధనాశా రెండూ కారణాలే. ఉద్యోగరీత్యా చేయాల్సిన విధుల్ని అదనపు సంపాదనతో ముడిపెట్టి చెయ్యడం. తనని ఎన్నుకొన్న ప్రజల ప్రాంతానికి ప్రయోజన ప్రణాళికలు ఎందుకు జరగటల్లేదని ప్రశ్నించడానికి ప్రశ్నకింతని వసూలు చేసుకోవడం.

ఇంకొకటి అవసరంకొద్దీ ప్రజలే ప్రోత్సహించేది. రైలెక్కిన తర్వాత చేతులు తడిపి పడకలు సాధించడం, లేదా దళారీల ద్వారా టికెట్లు సాధించడం. తత్కాలిక రిజర్వేషన్లు రైల్వే ఆదాయాన్ని అధికార పూర్వకంగా పెంచే మార్గం. దేవాలయాల్లో దళారీల ద్వారా శీఘ్రదర్శనాలు చేసుకోవడం. లేదా అధికరపూర్వకంగా అదనపు రుసుములు చెల్లించి శీఘ్రదర్శనాలు చేసుకోవడం. ఈ రెండో అంశాన్ని మరీ తప్పు పట్టకూడదు. ఎందుకంటే అలా కూడిన సొమ్ముతో సమాజ ప్రయోజన కార్యాలని కొంతైనా నిర్వహిస్తున్నారు కాబట్టి. ఇటువంటి భక్తులమీద స్వామివారి, అమ్మవార్ల అనుగ్రహం కూడా ఒకింత ఎక్కువ ఉంటుందేమో తెలియదు.

మద్యపానం సమాజ హితం కాదు. అయితే ప్రభుత్వాలే ఖజానాలు నింపడంకోసం మద్య విక్రయాన్ని ఇతోధికంగా ప్రోత్సహిస్తున్నాయి. కేరళలో కొబ్బరినూనెలో కాలుష్యాలుంటే అది నేరం. ఎందుకంటే అక్కడ అది వంట నూనె. అదే బీహారులో సెంటు కొబ్బరి నూనె అమ్మితే అది నేరంకాదు. ఎందుకంటే దాన్ని తలకే రాసుకుంటారుకాని, వంట కోసం ఉపయోగించరు కాబట్టి.

అయితే పోలీసులు దొంగల్ని, మోసగాళ్ళని, అవినీతిపరుల్నీ, బలాత్కారాలు చేసే వారినీ, హంతకుల్ని, అపహరణకర్తల్ని, ఆటంకవాదుల్ని- ఇలా ఎందరో నేరస్థులనందర్నీ చుట్టబెట్టడానికి నిరంతరమూ ప్రయాస పడ్తున్నా, చట్టంలో ఉన్న అనేకానేకమైన లోపాల్ని, రాజకీయపరమైన ఒత్తిళ్లను, వెసులుబాటులుగా తీసుకొని నేరస్థులు శిక్షా పరిధుల నుంచి బయటపడిపోతున్నారు. కోర్టులది ఒకటే న్యాయం. వందమంది నేరస్థుల్ని వదలొచ్చుకానీ ఒక్క నిర్దోషికి మట్టుకు శిక్ష పడ కూడదు.

ఇలాంటి ఎన్నో కేసుల్ని సాధించినా, ఎన్నో కేసుల్లో అపజయాలు ఎదురైనా, కొన్ని అనుకోని సంఘటనలు పోలీసుల్ని చాలా విచిత్రకరమైన పరిస్థితుల్లోకి నెట్టి పారేస్తాయి.

రాత్రి పదింటికి పెద్దాయన కమిషనర్ గారి వద్ద నుంచి వెంటనే వచ్చి కలుసుకొమ్మని ఫోనొచ్చింది. కౌగిలి వదిలించుకొని వెళ్ళే వయసు దాటి పోవడంతో, ఇల్లాలినుంచి ఏ విధమైన నసుగుళ్లు, సణుగుళ్లు రాకపోవడం మూలాన. నిద్రకుపక్రమించడానికి సిద్ధమౌతున్న నేను వెంటనే దుస్తులు మార్చుకొని, కారు తీసుకొని బయలు దేరాను. ఆయన బంగాళా దర్వాను గేటు తీసి, నాకో సలాం కొట్టి, 'అయ్యగారు మీ కోసం ఎదురు చూస్తున్నారు,' అంటూ లోపలికి పంపాడు. బలరాం గారు ముందు హాల్లో ఎదురు చూస్తున్నారు.

"రావయ్యా, శ్రీరాం కూర్చో. ముందస్తుగా ఓ కప్పు కాఫీ తాగి, నిద్రమత్తేమైనా ఉంటే దూరం చేసుకో !" అంటూ ఫ్లాస్క్ లోని కాఫీని రెండు కప్పుల్లో పోసి, ఒకటి నాకందించి రెండోది తను తీసుకొన్నాడు. పర్వాలేదు, విజయవాడ ప్లాట్ ఫారం మీద దొరికే కాఫీ కన్నా బావుంది. కానీ చెన్నై కాఫీకన్న తీసికట్టే. నెమ్మదిగా పెద్దాయన ఓ చెడు కబురు చెప్పాడు.

"మన స్థానిక శాసనసభ్యుడు రాయుడిగారి మనవరాలు సుభద్ర అనే అమ్మాయి మన నగరం సువిద్యా పి.జి కాలేజీలో బోటనీ లెక్చరర్ గా పనిచేస్తోంది. ఆమె నాలుగురోజుల్నించీ ఐపూ పత్తా లేకుండా పోయింది. మునగపాడు పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్ శోభనాద్రి కొడుకు అర్జున్ అనే ఓ యువకుడు అదే కాలేజీలో ఫిజికల్ ట్రైనింగ్ బోధకుడిగా పని చేస్తున్నాడు. జిల్లా స్థాయి మాజీ క్రికెట్ ఆటగాడు. అతగాడు లేవదీసుకుపోయాడని రాయుడుగారి నమ్మకం. గోల చేయకుండా, రెండోకంటికి తెలియకుండా ఆ కుర్రాడూ, కుర్రదీ ఎక్కడున్నారో కనుక్కొని, బలవంతంగానైనా తీసుకురమ్మని రాయుడుగారు స్వయంగా వచ్చి చెప్పి పోయారు. ఆ భారం నీ మీద పెడ్తున్నాను."

యువరాణి మణిహారం పోయిందని చెప్పడం ఒక వింతైతే, శతృదేశపు బందిపోటుతో లేచిపోయిందని చెప్పడం మరో వింత!

ఈ నాటి చాలా ప్రేమ పురాణాలు కుల, మత పట్టింపుల్తో, వంశ గౌరవ ప్రతిష్టలతో ముడివడి సంఘర్షణలకీ, హత్యలకీ, ఆత్మహత్యలకీ దారితీస్తున్నాయి. పురాణ కాలం నుంచీ ఈ ప్రేమ పురాణాలు జరుగుతోనే ఉన్నాయి. చరిత్ర పుటలు తిప్పితే ఎన్నో అమరప్రేమ గాథలు. గడపలుదాటి, సమాజపు పరిధులు దాటి, పోలీసు ప్రాంగణంలోకి ఇలాంటి సమస్యల్ని తీసుకువస్తే పరిష్కారాలు అంత సులువు కాదు.

వయో పరిమితికి తక్కువగా ఉన్న కేసులైతే శిక్షాస్మృతిని ఎలాగో అమలుపరచ వచ్చుకాని, వయోపరిమితిని మించిన యువతీ యువకులు ఒకరినొకరు యిష్ట పడితే అది చట్టం ఆమోదించిన ప్రేమాయణమే తప్ప నేరాయణం కాదు.

ఇదే సంగతి పెద్దాయనతో అన్నాను.

"నిజమేనయ్యా! కార్బైడ్ తో పచ్చికాయాల్ని ఎలా పండించేస్తున్నారో, సినిమాలు, టీవీ షోలూ, నీలి చిత్రాలు, కుర్రకుంకల్ని కూడా పండించేస్తున్నాయి. లేచిపోవడాలూ, పరస్పరాంగీకార సంయోజనాలూ, బలాత్కారాలు విద్యార్థి దశనుంచే ఆరంభమైపోవడం విచారించదగ్గ విషయం. దినపత్రికల్లో కూడా ఒక పేజీ సినిమా వార్తలకే కేటాయించి ముద్రిస్తున్న సంగతులూ, చిత్రాలూ పత్రికాధిపతుల వ్యాపారదృష్టిని సూచిస్తున్నాయే తప్ప, సమాజానికి పరోక్షంగా తీరని హాని కలిగిస్తున్నాయని తెలుసుకోవాలి."

పడక్కుర్చీ ప్రవచనాలూ, వేదికమీద ప్రసంగాలు ఇలానే ఉంటాయి. ఆయన ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ, "ఫోటోలున్నాయా సర్?" అని ప్రశ్నించాను. లేవన్నాడు. "నా ప్రయత్నం నేను చేస్తాను," అని సెలవు తీసుకొని, శుభరాత్రి చెప్పేసి బయట పడ్డాను.

ఆ మర్నాడు సువిద్యా పి.జి.కాలేజీకి వెళ్ళాను. ప్రిన్సిపల్ నారాయణి సాదరంగానే ఆహ్వానించి, "మా కాలేజీకి అమెరికా అధ్యక్షులవారి కూతురు వచ్చినప్పుడు మీరు వచ్చి భద్రతా ఏర్పాట్లు చెయ్యడం గుర్తుంది. కూర్చోండి,"అంది.

కూర్చున్న తర్వాత చెప్పబోయే విషయం సున్నితమైనది కాబట్టి, రహస్యంగా ఉంచాలన్న అభ్యర్థనా పూర్వకమైన ముందరికాళ్ళ బంధం వేసి సంగతి చెప్పాను. కర్ణుడు తల్లి కుంతికి ఇచ్చిన శాపం మొత్తం స్త్రీ జాతికే కాబట్టి ఆవగింజలు నానని నోళ్లకి సంగతి చెప్పకుండా ముందంజ వేసే అవకాశం నాకు లేదు.

సంగతి విని ఆవిడ గలగలా నవ్వేసింది. "నెలలో నలుగురైదుగురు స్త్రీ ఉపన్యాసకులు వారికి విద్యార్థులు ప్రేమ లేఖలు రాస్తున్నారని పితూరీలు చేస్తోనే ఉంటారు. ఏం చేయగలం? 'ఆ ఉత్తరాలు మీ అందాలకి గీటురాళ్ళు. ఎంతమంది అమ్మాయిలు మగ ఉపన్యాసకులకు ఉత్తరాలు రాస్తున్నారో మీకేం తెలుసు? మీ జాగ్రత్తల్లో మీరు ఉండండి చాలు,' అని సర్ది పంపించేస్తున్నాను. ఇప్పుడు రాయుడిగారి మనవరాలు సుభద్ర, శోభనాద్రి కొడుకు అర్జున్ లేచిపోయారంటే మీరూ, నేనూ చేయగలిగింది ఏముంది?"

"మీరు చేసేదేమీ ఉండదు. 'మా వివాహానికి బుద్ధిలేని పెద్దలు అడ్డు తగుల్తున్నార'ని వాళ్ళు ఫిర్యాదు చేస్తే మేము దగ్గరుండి వివాహం చేయించాలి. పెద్దలిద్దరూ అధికారం, పలుకుబడి ఉన్న మనుషులు. వోటుదారుల నిధులు. తంటా అక్కడే! సుభద్ర, అర్జున్ల ఫోటోలు కావాలి. లేచిపోతే పర్వాలేదు కానీ, అపహరణ జరిగితే మట్టుకు అది మా పరిధిలోకి వచ్చేస్తుంది!"

"నేనంత దూరం ఆలోచించ లేదు. ఒక్క నిముషం ...." అంటూ తన పి.ఏ.కి రెండు టీలు తెప్పించమని ఫోన్ లో చెప్పింది. కంప్యూటర్లోంచి ఆ యిద్దరి ఫోటోలు ప్రింటర్ కి కమాండ్ ఇచ్చి, రెండేసి చొప్పున మొత్తం నాలుగు ప్రింట్లు అందించింది. వాటిని శ్రద్ధగా చూస్తూ,"వీరిద్దర్నీ ఎక్కడని వెదకాలి? చిరునామాలు కూడా యివ్వండి!" అని అంటూన్న సమయంలో, ఓ పదేళ్ళ కుర్రవాడు రెండు టీలు కప్పుల్లో తీసుకువచ్చి బల్లమీద ఉంచాడు. "కాస్సేపు బయట ఉండు. బెల్ కొట్టగానే వచ్చి కప్పులు తీసుకు పో," అంది.

ఇద్దరి స్వగ్రామ, స్థానిక చిరునామాలు ప్రింట్ తీసి ఇచ్చింది. "అర్జున్ పదిరోజుల క్రితం నెలరోజులు సెలవు కావాలని అడిగితే యిచ్చాను. విద్యార్థులకీ, యాజమాన్యానికీ ఆటలమీద అభిరుచి లేదు. కానీ నియమాల ప్రకారం ఆ శాల్తీ ఉద్యోగం క్రీడాప్రాంగణమున్నా, లేకపోయినా కాలేజీలో ఉండి తీరాలి. సుభద్ర తనకి ఒంట్లో నలతగా ఉందని వారం రోజుల క్రితం ఓ వారం రోజులు సెలవు కావాలని అడిగితే కొంచెం ఇబ్బందిగానే ఇచ్చాను. ఎంచేతనంటే క్లాసులు పోతాయి. ఇద్దరూ ముందుగానే ఆలోచించుకొని సెలవులు అడిగి ఉంటారు!"

ఎవరి గోడు వారిది. ఇక సంభాషణలు పొడిగించకుండా ధన్యవాదాలు తెలుపుకొని, గది వదిలి ముందు వరండాలోకి దారి తీశాను. టీ కుర్రాడు బయట గోడావారగా నిలబడి ఉన్నాడు. "సర్! మీతో మాట్లాడాలి!" అన్నాడు. సరిగా అప్పుడే లోపల్నుంచి కాలింగ్ బెల్ వినబడింది. టీ కుర్రవాడు నన్ను ఆగండి అని సంజ్ఞచేస్తూ, లోపలికి వెళ్ళి ఖాళీ టీ కప్పులతో బయటకు వచ్చాడు. నేను నెమ్మదిగా నడవసాగాను. టీ కుర్రవాడు నా పక్కనే నడుస్తూ, కాలేజీ ప్రాంగణంలో ఓ పెద్ద వేపచెట్టు కింద నున్న రేకుల షెడ్ వరకూ తీసుకుపోయాడు. అది టీ బడ్డీ. లోపల ఓ

నడివయస్కుడు ఏవో పనులు చూసుకుంటున్నాడు. టీ కుర్రాడు నెమ్మదిగా నాతో అన్నాడు. "సర్! మీ మాటలు నాకు వినబడ్డాయి. వాళ్ళిద్దరూ ఎక్కడికి వెళ్ళారో నాకు తెలుసు!" అన్నాడు.

అక్కడే ఉన్న ఓ బల్లమీద కూర్చుని వివరాలు అడిగాను. ఆ కుర్రాడి పేరు సింహాద్రి."సార్! వాళ్ళిద్దరూ తరుచూ కాలేజీ అయిపోయి అందరూ వెళ్ళిపోయిన తర్వాత ఇక్కడికొచ్చి వేడివేడిగా పచ్చిమిరపకాయ బజ్జీలు వేయించుకొని తింటారు. టీ తాగుతూ కులాసాగా కబుర్లు చెప్పుకొంటూ కాస్సేపు కూర్చుని వెళ్ళి పోతారు. వాళ్ళు శ్రీకాకుళం జిల్లాలో ని బారువ వెళ్లారనుకొంటాను. అక్కడ అర్జున్ అమ్మమ్మగారింట్లో పెళ్లిచేసుకొందామనుకొంటున్నారు!"

వెదకబోయిన తీగ కాళ్ళకి చుట్టుకొన్నట్లయింది. వెంటనే నా స్మార్ట్ ఫోన్లో గూగుల్ మహాశయుడిద్వారా వివరాలు లాగాను. సూక్ష్మంగా చెప్పాలంటే అది సముద్రతీరపు గ్రామం. అక్కడ మహేంద్రతనయ అనే చిన్న నది సముద్రంలో కలుస్తుంది. పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దే ప్రయత్నంలో విహార విరామ మందిరాలు (హాలీడే రిసార్ట్స్) వెలిసాయి. పెద్దమ్మ తల్లి గ్రామదేవత.

"సార్ మీరు వారిని వెదకడానికి కానీ వెడ్తరా?"

వెళ్లక తప్పదు. వెంటనే మరో ఆలోచన తట్టింది. కాకినాడనుంచి బారువ దరిదాపులుగా 370 కిలోమీటర్లు. సావధానంగా వెడ్తే ఓ ఎనిమిది గంటలు కారు ప్రయాణం. విశాఖలోనూ, శ్రీకాకుళంలోనూ కాస్త విశ్రాంతి తీసుకొన్నా మొత్తం పదిగంటల్లో వెళ్లిపోవచ్చు. శ్రీమతికూడా వస్తే ఇద్దరికీ ఉబుసుపోతుంది. అక్కడికంటే వెళ్లొచ్చుకానీ, అర్జున్ అమ్మమ్మ గారి ఇల్లంటే ఎలా వెతకడం? అర్జున్, సుభద్రల కోసం గాలింపు చెయ్యాలి. ఆ యిద్దరి ముఖ పరిచయం బాగా ఉన్న సింహాద్రి తోడుగా ఉంటే సహాయకరంగా ఉంటుంది. "సింహాద్రీ! నాతో బారువ వస్తావా?" అని అడిగాను.

"ఎప్పుడు సర్?"

"రేపు ఉదయమే! అయిదింటికల్లా బయలుదేరి."

సింహాద్రి లోపలికి పరుగెత్తి అయిదు నిముషాలు తర్వాత వచ్చాడు. "నేను సిద్ధం సార్! నా బాస్ అనుమతిచ్చేశాడు! మీ ఇల్లెక్కడో చెబ్తే వస్తాను!" అన్నాడు.

"వద్దులే నీకు శ్రమవుతుంది. నేనే ఇక్కడకు వస్తాను. సిద్ధంగా ఉండు."

ఇంటికి పోయి శ్రీమతికి కబురు చెప్పాను. ఎగిరి గంతేసినంత పని చేసి, వెంటనే బట్టలు సర్దే ప్రయత్నంలో పడి పోయింది. పెద్దాయనకి సూక్ష్మంగా కబురు చెప్పి మఫ్టీ దుస్తుల్లో నా శ్రీమతితో సహా నా కారులో వెడ్తున్నానని చెప్పాను. ఆఫీసువారి అనుమతితో స్వంతకారులో పొరుగూర్లకు ఆఫీసు పని మీద వెళ్ళే వెసులుబాటు మాకు ఉంటుంది.

ఆ మర్నాడు ఉదయం నేను సువిద్యా పి.జి. కాలేజీ చేరుకొనేసరికే, సింహాద్రి ఒక చేతి సంచీతో గేటు బయట నిలిచి ఎదురు చూస్తున్నాడు. మధ్యలో అనుకొన్నట్టుగానే రెండుమూడు చిన్న మజిలీలు చేసి, బారువ చేరుకొనే సరికి మూడయ్యింది. బారువ ఊర్లో ప్రవేశించేముందు కొన్ని గుడిసెలున్నాయి. ఒక గుడిసే ముందు జనాలు పోగయి ఉన్నారు.

"సర్! కారు ఆపుతారా?" అన్నాడు సింహాద్రి. అప్పటికే జనాల్ని చూసి నెమ్మదిగా నడుపుతున్న కారుని అపాను. సింహాద్రి కారు వెనక తలుపు తీసుకొని దిగాడు.

"అప్పాయమ్మ కొడుకొచ్చేశాడు!" అని ఎవరో గట్టిగా అరిచేశారు.

బక్కపలచటి ఓ ఆడమనిషి, "ఏరా సింహాద్రీ! మీ అమ్మకి వారంరోజులుగా సుస్తీగా ఉందని కబురంపితే యిప్పుడా రావడం? మధ్యాహ్నమే చిలక ఎగిరి పోయిందిరా! లోపలికి వెళ్ళి చూడు!" అంటూ రాగాలు తీసింది. నేనూ, శ్రీమతీ కూడా కారు దిగి లోపలికి వెళ్ళాం. సింహాద్రి తల్లి పార్థివ శరీరం మీద పడి రోదిస్తున్నాడు.

వెక్కి వెక్కి ఏడుస్తూ వాడు చెప్పిన సారాంశం. 'తల్లికి సుస్తీగా ఉందని రెండు నెలల జీతం ముందస్తుగా తీసుకొని నాలుగు వందలు మనియార్డరు చేశాడు. ఊరెళ్ళి తల్లిని చూసి వస్తానని మరికొంత అడిగితే యజమాని యివ్వనన్నాడు. రైలెక్కితే సామర్లకోటలో టికెట్ లేదని దింపేశారు. చేసేది లేక ఓపిక తెచ్చుకొని కాలవగట్టు రోడ్డమ్మట నడుచుకుంటూ తిరిగి కాకినాడ వెళ్లిపోయాడు. ఎందుకంటే యజమాని రెండుపూట్లా యింత తిండి పడేస్తాడు. దయతలచి మేమిద్దరమూ వాణ్ని బారువ తీసుకొచ్చాం!'

ప్రేమపావురాలు బారువ రాలేదని, అదంతా సింహాద్రి నిస్సహాయత ఆడించిన అబద్ధమని తేలిపోయిందని వేరే చెప్పనఖర్లేదు. తల్లీకొడుకుల పేగు బంధానికి సింహాద్రి తెగువ ఒక తార్కాణం. ఏ శక్తి నన్ను సింహాద్రిని కూడా తీసుకుపొమ్మందో తెలియదు కానీ, మధ్య జరిగినది ఒక వాస్తవమైనా, ఆఖరి అబద్ధం నా హృదయాన్ని కలిచి వేసింది. రెండు రోజులు అక్కడే విరామ మందిరంలో ఉండి, వాళ్ళ ఆచారాల కనుగుణంగా నా ఖర్చుతో కర్మ కాండలు చేయించి, పెద్దమ్మ తల్లి గుడికి వెళ్ళి అమ్మవారి దర్శనం చేసుకొని, సింహాద్రి చేతిలో కొంత సొమ్మించి తిరిగి వచ్చాం.

పది రోజుల తర్వాత సింహాద్రి తిరిగి కాకినాడ చేరుకొన్నాడు. సింహాద్రిని చదువులో పెట్టాను.

ఉపసంహారం: ఇంతకీ అర్జున్, సుభద్రలు ఎక్కడికీ పారిపోలేదు. రాయుడుగారి గృహాంతర్భాగంలోనే హాయిగా ఉన్నారు. బోర్డు ప్రెసిడెంట్ శోభనాద్రి తనమీద రాయుడుగారు కేసు పెడ్తారన్న భయంతో తన కండువా రంగు రాయుడిగారి కండువా రంగుకు మార్చడంతో, రాయుడు గారి ఓట్ల బలిమి ఎక్కువైంది. అర్జున్ సుభద్రల వివాహం వైభవంగా జరిగింది. కమిషనర్ బలరాం గారి నోరు నూరు శాపనార్థాలు పెట్టినా కర్ణుడి ఒక శాపం ముందు ఎందుకూ పనికిరానివి కాబట్టి, నాయకుల ఆటలు కొనసాగుతోనే ఉన్నాయి. అయితే, సుభద్రార్జునులు లేచిపోయినా, పోకపోయినా, రాయుడుగారు చేసిన నోటి ఫిర్యాదుతో కమిషనర్ గారు స్పందించి నన్ను రంగంలోకి దింపక పోతే యాదృచ్ఛికంగా జరిగిన ఓ మంచి జరగకపోయి ఉండేదిగా..!?

# పంకజం — డి.వి.జి.శంకర్రావు

**ఆఫీసు నుండి ఇంటికి చేరాను.** పంకజం ఎదుర్రాలేదు. వాకిలి గచ్చు తడిగా ఉండటంతో అర్థమైంది. కన్నీటి ద్రవం. ఏదో ఉపద్రవం మళ్ళీ ముంచుకొచ్చినట్టుంది. జాగ్రత్తగా అడుగులు వేస్తూ పడకగదిలోకి వెళ్ళాను. మధ్యలో రెండుసార్లు ధబీమని కాలు జారిపడ్డాను. కానీ అంత ముఖ్యం కాదుకదా అని మీకు చెప్పటం లేదు.

పడక గదిలో పంకజం కళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. నన్ను చూసి 'ఏమండీ' అంటూ కళ్ళు తుడుచుకుంది.

"పంకజం ఒకసారి నువ్వు చీర మార్చిస్తే ఆ చీర, దుప్పటి, టవళ్ళు మేడమీద ఆరేసి వస్తాను. బాగా తడిచిన వాటితో ఎక్కువసేపుంటే జలుబు చేస్తుంది" లాలనగా అన్నాను.

"మీ తొందర మీదే. ఏమైందని అడగడం మాని చీర పిండి ఆరెయ్యడానికి పరుగెడ్తున్నారు" అంటూ భళ్ళున ముక్కింది.

"అయ్యో! నా మతిమండ. ఎంతసేపూ పనిధ్యాసే. ఇప్పుడడుగుతున్నాను. ఏమైంది బంగారం? ఈ రోజు సీరియల్‌లో కోడలు పిల్లకు దెబ్బ తగిలిందా? బంగారం రేటు మనం కొనడంలేదని తెలిసి తగ్గిపోయిందా?"

"ఏడ్చినట్టుంది. ఇంతకాలమైనా భార్య మనసు అర్థం చేసుకోవడం చాతకాదు మీకు. ఇదుగో ఈ పేపరు చూడండి" పేపర్ నా మొహాన కొట్టింది.

పేపర్ తెరిచి అందులో బికినీ డ్రస్‌లో ఉన్న హీరోయిన్‌ని చూస్తూ చొంగ కారుస్తున్నాను. అలా ఎంతసేపు చూస్తుండిపోయానో తెలియదు. పంకజం హుంకరింపుతో ఈ లోకంలోకి వచ్చాను.

"ఆ పేజీ కాదు. పక్కపేజీ చూడండి."

ఆ పేజీలో బాక్స్ కట్టి ప్రచురించబడి ఉంది. "ఈసారి మాయా లాటరీ బంపర్ ప్రయిజ్ విన్నర్ కె. స్వరాజ్యం. చంద్రమండలంపై ప్లాటు గెల్చుకున్నారు."

అది చదివి నేనూ 'కెవ్వు'మన్నాను.

"చూశారా. మీరే 'కెవ్వు'మంటే మరి నేనేమవ్వాలి? దాని స్వంత చెల్లెల్ని"

పంకజం బాధ అర్థమైంది..

"నిజమే బంగారం. స్వంతవాళ్ళు బాగుపడడంకన్నా బాధ కలిగించే అంశం ఏముంటుంది? అయినా మనకే ఇలా అవ్వాలా? ఆ దేవుడు పగబట్టాడు.. పగ బట్టాడు" నాకు తెలీకుండానే నా గొంతు బొంగురుపోయింది.

❦❦❦

పంకజం అక్క స్వరాజ్యం. ఇద్దరూ ఆదర్శవంతమైన అక్కచెల్లెళ్ళు. పెళ్ళిళ్ళు అయ్యేవరకూ ఒకర్ని విడిచి ఒకరున్నదే లేదట. అక్కకు పెళ్ళవ్వగానే తనకూ అంతకుమించిన బకరాని తెచ్చి, అంతకన్నా ఎక్కువ కట్నమిచ్చి పెళ్ళిచెయ్యాల్సిందేనంటూ మొండిపట్టు పట్టిందట పంకజం.

'బకరానైతే తీసుకురాగలం గానీ కట్నం అంత ఇచ్చుకోలేం' అని వాళ్ళ నాన్నంటే అప్పుడూ ఇలానే కన్నీరు మున్నీరైందంట.

అదుగో అలా జరిగింది మా పెళ్ళి. ఆ వరదల బురద ఎండకముందే మా పెళ్ళి తాంబూలం పండింది.

❦❦❦

స్వరాజ్యానికి లాటరీ తగలడం నాకూ కడుపుమంటే జేబులో రెడీగా ఉంచే 'కడుపు మంటకి మాత్ర' తీసి గుటుక్కున మింగాను. నీళ్ళు అందుబాటులో లేక వెక్కిళ్ళు వచ్చాయి.

'అలా ఆపసోపాలు పడడం బదులు కొంచెం కన్నీళ్ళు పెట్టుకోరాదూ' గదమాయించింది.

'టీవీ కొన్నరోజూ ఇదే వరస. పాడు సంత' గొణుక్కుంది.

ఒక్కసారి వెక్కిళ్ళతోపాటు గతం ఠక్కున గుర్తుకొచ్చింది.

❦❦❦

ఆరోజు స్వరాజ్యం ఇంటికి చుట్టం చూపుకెళ్ళాం. అక్కా చెల్లెళ్ళిద్దరూ గాఢంగా కౌగలించుకున్నారు. తోడళ్ళుళ్ళం కూడా టీవీ సీరియల్ అభిమానాల్ని ఒలకబోశాం. అసలు విడివిడిగా ఎలా బ్రతకగలుగుతున్నాం అంటూ బోలెడు ఆశ్చర్యపోయాం. భోజనాలు ముగించిన పిమ్మట వీడలేక వీడలేక విడిపోతూ బై బై చెప్పుకున్నాం. పంకజం, నేనూ బైకు ఎక్కామో, లేదో స్వరాజ్యం, వాళ్ళాయన ధడేలున తలుపు మూశారు. ఆ

వీధి చివర దాటామొ లేదో పంకజం అందుకుంది "చూడండీ దాని మిడిసిపాటు. నేను చూడాలని తన నగలన్నీ దిగేసుకుంది. లేకపోతే ఎవరైనా మూడేసి హారాలు ఒకేసారి వేసుకుంటారా?"

"అవునోయ్. వాళ్ళాయన చూశావా? ఇప్పుడే వస్తానంటూ లోనికి వెళ్ళి నాలుగు ఉంగరాలు తగిలించుకొచ్చాడు. వాళ్ళ మాడ్యులర్ కిచెన్ ఎలా డిజైన్ చేసిందీ వండుతున్నంతసేపూ చెపుతూనే ఉన్నాడు."

మా కబుర్లు వాళ్ళని దాటలేదు. ఇంకా సగంలో ఉండగానే 50 కిలోమీటర్లు దాటి ఇంటికొచ్చేశాం. తనని దించేసి అలా ఆఫీసుకి వెళ్ళాను.  తిరిగొచ్చే వేళకు వీధి అంతా ఇంకుడు గుంతలు తవ్వుతున్నారు. అటూ, ఇటూ నీటికాలువలు పొంగిపొర్లుతున్నాయి.

'వర్షం లేదు. వారం రోజులుగా మంచి నీళ్ళులేవు. అకాలంగా అబ్బో ఎంత నీరో అనుకుంటూ అబ్బురంగా ఇల్లు చేరాను. అవి మా ఇంట్లోంచే వస్తున్నాయి. అలా బోలెడు హాశ్చర్య పడిపోతూ మధ్య మధ్యన కాలు జారిపడిలేస్తూ పడకగదికి వెళ్ళాను. అక్కడ చూశాను పంకజాన్ని. కొలను మధ్యన నిల్చున్న పంకజంలా. రెండుకళ్ళనుండి నయాగరాలు. చుట్టూ తడిసి ముద్దయిన బట్టలూ, పుస్తకాలూ.

"ఏమైంది బంగారం?"

"స్వరాజ్యం ఇంటినుండి వచ్చాక మన వస్తువులన్నీ ఈ స్కేలుతో కొలుస్తున్నానండీ. అన్నీ వాళ్ళ వస్తువుల కొలతలకు సరిపోయాయి. ఇదుగో ఈ టీవీ మాత్రం వాళ్ళ టీవీకన్నా చిన్నగా ఉందండి. నాకెలా ఉంటుంది చెప్పండి?" గద్దించింది.

ఛెంగున దూకి స్కేలందుకున్నాను. ఎలా ఎటు తిప్పి కొలిచినా చిన్నదిగానే ఉంది.

అప్పుడు మొదలైంది కడుపుమంట. విలవిల్లాడాను.

"నిజమే బంగారం. లక్ష మందికి లక్ష పెద్ద టీవీలుంటే మనకెందుకు? కోటి మందికి కోట్ల రూపాయలుంటే మనకెందుకు? మన దగ్గరివాళ్ళకు మనకన్నా పెద్ద టీవీ ఉంటే నిద్రెలా పడ్తుంది? రేపే మార్కెట్‌కి వెళ్ళి కొనుక్కో. నా క్రెడిట్ కార్డు తీసుకెళ్ళు."

పరిష్కారం చెప్పేసి తడిచిన బట్టలు ఆరేసాను.

మర్నాడు సాయంత్రం ఇంటికొచ్చేసరికి తలుపులేదు. తలుపు పక్క గోడకూడా కొంతకొట్టేసి ఉంది. బెరుగ్గా ఇంట్లో అడుగుపెట్టేసరికి పంకజం ముఖమంతా వెలిగిపోతోంది. నవ్వుతూ కూల్‌డ్రింకు చేతిలో పెట్టి పడగ్గదిలోకి తీసుకెళ్ళింది. పడగ్గది నిండా పెద్దటీవి. దానికి స్థానం చాలదని మంచం బయటపడేసింది.

"ఇప్పుడు చెప్పండి. టీవీ బాగుంది కదూ! స్వరాజ్యం వాళ్ళ టీవీకి డబుల్ ఉంటుంది కదూ"

"ఎందుకుండదోయ్. అద్భుతంగా ఉంటేనూ. మన తలుపుకేమైంది? గోడ కొట్టేశారేం?"

"మీ బుర్ర షెర్లాక్స్ హోమ్స్ ఎత్తుకెళ్ళా. ఆమాత్రం ఆలోచించలేరా? ఆ చిన్న ద్వారంలోంచి ఇంత టీవీ ఎలా వస్తుందనుకున్నారు? అందుకనే కొట్టించేశా."

"ఓ అదా! తట్టనేలేదు" భుజం తట్టి అభినందించాను.

ఆ వెంటనే స్ఫురించింది. అవునూ వాళ్ళ టీవీ ఈజీగా ఇంట్లో పెట్టారంటే వాళ్ళ తలుపులు మాకన్నా పెద్దవే అయ్యుండాలి కదా! ఓ వైపు కడుపుమంట రెండోవైపు నీటి కరువు. వెరసి వెక్కిళ్ళు. వాటి ట్రీట్‌మెంటు కోసం మళ్ళీ పరుగుపెట్టాను క్రెడిట్ కార్డు పట్టుకుని. అదీ అప్పటి సంగతి.

నిద్రలోనే పంకజం దేవుణ్ణి మొక్కేస్తూ కలవరిస్తోంది ఈ గండం గట్టెక్కించమంటూ. నాకు మెలుకువ కన్నా ముందే వెక్కిళ్ళు వచ్చి వెక్కిరిస్తున్నాయి. ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. ఉదయాన్నే ఒక చేతిలో పేపరు, మరో చేతితో కొరడా పట్టుకుని నన్ను లేపింది.

"అర్జెంటుగా చూడండీ పేపరు. నిన్నటిది తప్పు వార్తట. సవరణ రాశారు. వేరే ఊరిలో ఉన్న వేరే స్వరాజ్యందట బంపర్ గెలుపు. హెంత ఆనందంగా ఉందో."

"గుడ్ న్యూస్. ఆవిడెవరు?"

"ఏమో? నాకేం తెలుసు? ఎవరికైనా మంచి జరిగితే మనం సంతోషించాలిగా" ప్రేమగా నా నెత్తిమీద మొట్టింది.

"ఔనౌను" లేచిన బొప్పిని తడుముకుంటూ వంతపాడాను. అన్నట్టు వెక్కిళ్ళు కూడా ఆగిపోయాయి.

# పిపీలికం

కృపాకర్ పోతుల

తొమ్మిదోక్లాసు చదువుతున్న విద్యార్థులని ప్రశ్నిస్తున్నారు తెలుగుమాస్టారు 'పెద్దయ్యాక నువ్వు ఏమౌదామనుకుంటున్నావురా అబ్బాయ్' అని. చాలామంది డాక్టర్లవుతామన్నారు. కొంతమంది ఇంజనీర్లన్నారు. ఇంకొంతమంది లాయర్లౌతామన్నారు. క్లాసుమొత్తానికి ఒక్క రామేశం మాత్రం తెలుగు పంతులవ్వాలనుందని ప్రకటించాడు. ఆమాట విన్న తెలుగుమాస్టారి మొహం కోటిసూర్యులవెలుగు నింపుకుంది. "ఎందుకు నాయనా తెలుగుటీచర్ అవ్వాలనుకుంటున్నావు?" అని గొంతునిండా మార్దవం నింపుకొని అడిగిన మాస్టారికి "కథలూ నవలలూ రాసి రచయితగా మంచిపేరు తెచ్చుకోవాలని నాకోరిక సార్. మీలాగ తెలుగుటీచర్ అయితే అవి రాయొచ్చని" అనే రామేశం చెప్పిన సమాధానానికి మురిసిపోయిన మాస్టారు 'మనోవాంఛాయసిద్దిరస్తు' అని మనస్ఫూర్తిగా దీవించి రామేశాన్ని కౌగలించుకొని కన్నీరు పెట్టుకున్నారు.

అలా రచయిత అవ్వాలనే ఆకాంక్ష వెలిబుచ్చిన రామేశం 'రవీంద్రనాథ్ (టాగోర్)' లాగానో, '(బెర్ట్రాండ్) రస్సెల్ ' లాగానో బాగా డబ్బున్న కుటుంబంనుంచి వచ్చినవాడు కానేకాదు. చాలా సాదాసీదా దిగువమధ్యతరగతి కుటుంబానికి చెందినవాడే. వాళ్ళనాన్న చేసేది ఏదో బేంకులో మెసెంజర్ ఉద్యోగం. చాలీచాలని జీతం. వారపత్రికలు మాసపత్రికలూ అటుంచి, కనీసం దినపత్రిక కూడా కొనేఅలవాటులేని కుటుంబంలోనుంచి వచ్చిన రామేశానికి కథలూ కాకరకాయలూ రాసి పేరు తెచ్చుకోవాలనే కోరిక ఎలా మొలకెత్తిందో రామేశానిక్కూడా అర్ధంకాని విషయం.

అయితే అన్నీ మనం అనుకున్నట్టే జరిగితే అది జీవితం ఎందుకౌతుందీ? కాదుకదా. ఉదయాన్నే శుభ్రంగా ఉద్యోగానికివెళ్ళిన ఉక్కుముక్కలాంటి వాళ్ళనాన్నకి ఉధృతంగా గుండెనొప్పి రావడం, ఆస్పత్రికి తరలించేలోపే అంతా అయిపోవడంతో రామేశం జీవితం అస్తవ్యస్థమైపోయింది. చదువుతున్న చదువుకి మంగళగీతం పాడేసి, బేంకు నిబంధనలప్రకారం సంక్రమించిన 'మెసెంజర్' ఉద్యోగంలో చేరిపోవలసి వచ్చింది. ఇద్దరు చెల్లెళ్ళకీ కొద్దిపాటిచదువైనా చెప్పించడానికిగాని, గంతకితగ్గ బొంతల్నితెచ్చి పెళ్ళి చేయడానికీ అలుపెరుగని పోరాటం చేయాల్సిరావడంతో, రచయితగా గొప్పపేరు తెచ్చుకోవాలనికనిన కలల మాటటుంచి తన పెళ్ళివిషయం కూడా జ్ఞాపకానికి రాకుండాపోయింది పాపం రామేశానికి.

ఆవిషయం జ్ఞాపకం వచ్చేసరికే ముప్పైఐదేళ్ళొచ్చిన రామేశానికి పెళ్ళికావడం కష్టమే అయ్యింది. జుట్టూడిపోయి మిగిలిన నాలుగువెంట్రుకలూ కూడా అక్కడక్కడా నెరిసిపోవడం, అది చాలనట్టు చిరుబొజ్జకూడా చిగురించడంతో రామేశాన్ని పెళ్ళిచేసుకోడానికి, అప్పటికి బేంకులో కేషియర్గా పదోన్నతి పొందినాసరే, ఏపిల్లా ముందుకిరాలేదు. అఖరుకి ఎక్కడో పార్వతీపురానికి అవతలున్న ఏదో పల్లెటూరిలో పదోక్లాసు ఫెయిలైన పాతిక

దాటి అయిదేళ్ళు నిండిన ప్రౌఢ, రామలక్ష్మి , కరుణించడంతో ఎట్టకేలకూ రామేశానికి ఒక ఇంటివాడయ్యే అదృష్టం కలిగింది. అవ్వడానికి పదోక్లాసు ఫెయిలైన పిల్లేగాని, రామలక్ష్మి తెలివైనదే.

పెళ్ళవడం, ఇద్దరుపిల్లలు పుట్టుకురావడం, ఈమధ్యలో అనారోగ్యంతో మంచంపట్టిన తల్లి మరణించడంలాంటి సంఘటనలతో రామేశం జీవితం ఉరుకులూ పరుగులతోనే సాగింది ఆ తరవాతకూడా. తక్కువ జీతం ఆర్థిక ఇబ్బందులూ వీటిని అధిగమించడానికి ఆఫీసర్ స్థాయికి ఎదగడమొకటే సొల్యూషన్ అని గ్రహించిన రామలక్ష్మి బి.య్యే.పరీక్షకి కట్టమని చెవినిల్లుకట్టుకొని పోరితే, మూడుసంవత్సరాల బియ్యే ఎలాగోలా ఐదున్నరసంవత్సరాల్లో పాసయ్యాననిపించుకున్న రామేశం ఇంకొక ఐదేళ్ల సర్వీసుండనగా ఆఫీసర్గా రూపాంతరం చెందాడు. తదుపరి అందరు బేంకాఫీసర్లలాగానే, తనకంటూ ఒకప్పుడొక జీవితం ఉండేదనీ, అందులో తనకొక ఇల్లూ, అందులో ఒక భార్యా ఇద్దరు పిల్లలూ కూడా ఉండేవారనేటటువంటి అల్పమైన విషయాలనేకం మరచిపోయి, బేంకులో గొడ్డుచాకిరీచేసి, అరవైఏళ్ళు నిండాక రిటైరై "హమ్మయ్యా" అని నిట్టూర్చాడు.

--00--

అలా రిటైరైన పదిరోజులకి మొదలైంది అసలు కథ. ఖాళీగా కూర్చున్న రామేశం తలని రకరకాల ఆలోచించనలు తొలిచెయ్యడం మొదలుబెట్టాయి. తనజీవితాన్ని....బాల్యం నుండి పదవీవిరమణ వరకూ సింహావలోకనం చేసుకున్నాడొకసారి. అయ్యబాబోయ్ ఇన్ని బాధలూ కష్టాలూ నేనే అనుభవించానా? దానిక్కావలసిన దమ్మూ, ధైర్యం నాకెక్కడనుండొచ్చాయి అని ఆశ్చర్యపోయాడు. తండ్రి అకాలమరణం, పర్యవసానంగా తనచదువు చట్టుబండలవడం గుర్తుతెచ్చుకొని ఒక రెండురోజులు చింతించేడు. అలా చింతిస్తూ చింతిస్తూ రెండోరోజున రచయిత కావాలన్న తన చిన్ననాటి కల ఊరిపక్క ఉప్పుటేట్లో ఎలా కలిసిపోయిందో గుర్తొచ్చి ఇంకొక రోజు అదనంగా చింతించేడు. ఆతరవాత ఇక ఆశ్చర్యపోవడానికీ, చింతించడానికీ ఏమీ కారణం దొరకనందుకు మరొకరోజు దుఃఖంలో మునిగితేలుతుండగా...... రామేశం జ్నానేత్రం తెరుచుకుంది అకస్మాత్తుగా.

"రిటైర్ అయిపోయాను. బేంకుకెళ్ళాల్సిన అవసరంలేదు. రోజంతా ఖాళీనే. తినికూర్చోవడం, నిద్రొస్తే నిద్రపోవడం తప్ప నేనేం చేస్తున్నానిప్పుడు? ఏమీ లేదుకదా. ఇలా అయితే, ఏదో సినిమాలో రావుగోపాలరావన్నట్టు, గొడ్డుకీ, నాకూ తేడా ఏటుందబ్బా" అంటూ తర్కించుకున్నాడు చాలాసేపు. "అబ్బే ఏమీలేదు సుమా" అని తనకుతానే చెప్పుకుని, "మనిషిలా ఇప్పటికైనా బ్రతకాలంటే ఏంచెయ్యాలీ" అని తీవ్రంగా ఆలోచించాడు. ఆలోచించగా ఆలోచించగా గుర్తొచ్చింది రామేశానికి కల్లగా మిగిలిపోయిన తన చిన్ననాటి కల... పెద్ద రచయిత కావాలనే తీరని కల. అంతే...'రాయాలి', అదే తన తక్షణం కర్తవ్యం అని నిర్ణయించుకున్నాడు వెంటనే. "కుదురుగా కూర్చొని రాస్తే కన్నుమూసేలోపు కనీసం కొన్నికథలైనా అచ్చవ్వవా. అది చాలదా ఈజన్మకి" అని తలంచి అందు విషయమై కాస్త సంతోషించాడుకూడా. అయితే 'కథరాయడం ఎలా?' అనే విషయంలో బొత్తిగా అవగాహనలేని కారణాన, ఎలా రాయాలో తెలియక, తీవ్రమైన అలజడికీ అశాంతికి గురై నిద్రలేకుండా గడిపేడా రాత్రంతా. అలా గడుపుతున్న సమయంలో గుర్తొచ్చాడొక మిత్రుడు రామేశానికి.

ఆ మిత్రునికి అప్పుడప్పుడూ కథలూ కవితలూ చదవే అలవాటు మాత్రమే కాకుండా, అలా చదివినవాటి గురించి, "ఆ కథ కడుపుబ్బ నవ్వించింది. ఈ కథ ఆలోచింపజేసింది. అల్లా కవిత కంటనీరు కార్పించింది" లాంటి ఉత్తరాలు రాయడం, వాటిలో ఒకటీ అరా ఏపత్రికలోనైనా అచ్చైతే, ఇక దాన్ని పుచ్చుకొని ఊరిమీద పడి, కనిపించిన ప్రతీవాడికి అచ్చులో తనపేరు చూపించుకొని పరమానందంపొందటంవంటి అలవాటున్నవాడు. ఒకట్రెండు పత్రికల్లో అతని పేరలా చూసిన అదృష్టానికినోచుకున్న రామేశం 'హమ్మయ్య. ఇంకేం భయంలేదు. రేపు ఉదయాన్నే గురూగార్ని కలిసి కథలెలారాయాలో తెలుసుకుంటే చాలు. ప్రోబ్లం సాల్వ్ అయిపోతుంది' అని నిర్ణయించుకున్నాక నిశ్చింతగా నిద్రపోయాడు.

--00—

ఉదయం తొమ్మిదిగంటలకే ఇంటిలోనుంచి బయటపడ్డ రామేశం తిన్నగా గురూగారింటికి పరుగెత్తాడు. రామేశాన్ని చూసిన గురూగారు చిన్నగానవ్వుతూ "ఏంటోయ్ రామేశం ఉదయాన్నే వచ్చావ్ . ఏమైనా పనుందా?" అని ప్రశ్నించాడు 'వీడింత ఉదయాన్నే తగలడ్డాడంటే ఏ అప్పోసప్పో అడగడానికే అయ్యుండొచ్చు" మనసులో మథనపడుతూ.

గొంతు సవరించుకున్నాడు రామేశం. తన వ్యధా వేదనా గురూగారితో పంచుకోవడం మొదలెట్టాడు. తండ్రి మరణం తన జీవితాన్నెలా అస్తవ్యస్తంగావించిందో వివరించాడు. తనచదువు ఏవిధంగా చట్టుబండలైనదీ చెప్పాడు. దానితోపాటే రచయిత కావాలనే తన కోరిక ఎలా కొడిగట్టిపోయిందో గురూగారి గుండె కరిగేలా వర్ణించాడు. అంతా చెప్పాక కన్నీరు తుడుచుకుంటూ "గురూగారూ ఇప్పటికైనా నాలుగుకథలూ నవల్లూ రాసి శేషజీవితాన్ని సార్ధకం చేసుకోవాలనే జ్ఞానం నిన్ననే కలిగింది సార్" అంటూ గురూగారివేపు చూసాడు అర్ధవంతంగా.

రామేశం అప్పడగడానికిరాలేదన్న విషయం నిశ్చయమవడంతో నిశ్చింతగా ఊపిరిపీల్చుకున్నా గురూగారు "దానికేం భాగ్యమోయ్ రామేశం. అలాగే రాసీ" అని శెలవిచ్చారు ఆనందంగా.

రాయొచ్చనుకోండి. కాని వచ్చిన చిక్కేంటంటే కథ ఎలా రాయాలో ఎంత ఆలోచించినా తెలియట్లేదండీ. మీరు గొప్ప రచయిత కదా. నాకేదైనా దారి చూపిస్తారనే ఆశతో ఉదయాన్నే వచ్చేను సార్" అన్నాడు దీనంగా. గురూగారి గుండాగిపోయింది. "ఈడేదో అప్పుకొచ్చుంటాడేమోనని భయపడిచస్తే దాని బాబులాంటి బాంబు పేల్చేడే. ఎలాగిప్పుడు" అని లోపల విసుక్కొని, పైకిమాత్రం ప్రసన్నంగా నవ్వుతూ "నువ్వెప్పుడూ ఇంతేనోయ్ రామేశం. ఏదో సమస్యతో ప్రక్కవాడి బుర్రెప్పుడూ పాడుచేస్తూనే ఉండీవాడివి. రిటైర్ అయ్యాకకూడా నువ్వేమీమారలేదన్నమాట" అని కొకారీ నవ్వొకటినవ్వి "ఒక పనిచెయ్, రేపుదయాన్నే ఈటైంకి రా. ఆలోచించి చెప్తాను ఏంచెయ్యాలో" అని అప్పటికి వదిలించుకున్నాడతన్ని యుక్తిగా.

--00—

మరసటిరోజు ఉదయం ఎనిమిదిగంటలకే గురూగారింటికి చేరుకున్నాడు రామేశం. రామేశాన్ని చూసిన గురూగారు స్వాతిముత్యంలో కమల్హసన్ని చూసిన శంకరశాస్త్రిలా రియేక్టవబోయారుగాని బాగోదని మానుకొని, "రావోయ్ రామేశం. రా. నీసమస్య పరిష్కరించేసానోయ్. ఎలా అంటావా. ఈ మధ్య పెద్దగా రాయట్లేదు గాని, లబ్దప్రతిష్టులైన రచయిత ఒకాయన మనూళ్ళోనే ఉన్నారు. మనకి బాగా కావలసిన స్నేహితుడ్లే. నిన్నరాత్రి ఆయనతో నీగురించి మాట్లాడానోయ్. మంచివాడూ, రాయాలనే తపన ఉన్నవాడూనూ, మీరు కాస్త దారిచూపిస్తే రాయాలని ఉబలాటపడుతున్నాడు. మీకభ్యంతరం లేకపోతే అతన్ని మీదగ్గరకొకసారి పంపుతాను సార్" అని చెప్పాను అన్నారు గురూగారు.

"''పెదగురూగారు'' ఏమన్నారు సార్. పంపమన్నారా?" అని అడిగాడు రామేశం ఆతృతగా.

"నేనడిగితే కాదనడమే. పంపమనే అన్నారు. కాకపోతే ఈరోజాయనకేదో పనుందట. అందుకని రేపు ఉదయాన్నే పదిగంటలకల్లా నిన్ను వాళ్ళింటికొచ్చెయ్యమన్నారు." అన్నారు గురూగారు. రామేశం మొహం సంతోషంతో చాటంతయ్యింది.

--00—

మరసటిరోజు ఉదయం పావుతక్కువ పదిగంటలకల్లా పెదగురూగారి సన్నిధికి చేరుకున్న రామేశం ఆయన పాదాలకు నమస్కరించాడు వినయంగా. శిష్యుడి వినయవిధేయతలు చూసి పెదగురూగారు పులకించిపోయారుగాని, శిష్యుడిదగ్గర సీరియస్గా ఉండాలనే విషయం గుర్తుకు తెచ్చుకొని "నువ్వేనా కథలూ గట్రా రాయాలని సరదా పడుతున్న రామేశానివి?" అన్నారు రామేశాన్ని నఖశిఖపర్యంతం పరీక్షిస్తూ. రామేశానికి భక్తితో మాట పెగల్లేదు. తల మాత్రం ఆడించాడు అవునన్నట్టుగా.

"నా దగ్గరనుంచి ఏ సహాయం ఆశిస్తున్నావు నువ్వు? నీ కథలు వేసుకోమని ఎవరికైనా సిఫారసు చెయ్యమని అడగడానికి వచ్చుంటేమాత్రం నువ్విప్పుడే శెలవు తీసుకోవచ్చు. అలాంటిపనులు నేను ఛస్తే చెయ్యను" అన్నారు పెదగురూగారు కటువుగా.

దెబ్బకి గొంతు పెగిలిన రామేశం "అమ్మమ్మ. తమలాంటి పెద్దవారిని అలాంటి పనులు చెయ్యమని అడగడమే. నేనిక్కడికొచ్చింది అందుక్కాదు సార్. తమరి సలహా కోసం మాత్రమే" అన్నాడు చేతులు నలుపుకుంటూ.

"ఓకే దెన్. ఏంకావాలో అడుగు" వరమిచ్చారు పెదగురూగారు.

"చిన్నప్పట్నుండీ నాకు కథలు గట్రా రాయాలని చాలా ఇది సార్. కాకపోతే......" రామేశాన్ని మాట్లాడనివ్వకుండా మధ్యలోనే తుంచేస్తూ "విషయం చెప్పు రామేశం" అన్నారు కించిత్ విసుగ్గా.

"అదే...ఎలా రాయాలో తమరి దగ్గర నేర్చుకొని, కథలూ నవల్లూ రాసుకుంటూ మిగిలిన జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ..." అన్నాడు రామేశం నసుగుతూ.

అది విన్న పెదగురూగారు కొన్ని క్షణాలు తీవ్రంగా ఆలోచించారు. అలా ఆలోచించి, "మంచి తెలుగు కథ రాయాలంటే ఎవరికైనా ఇంగ్లీషు బాగా వచ్చుండాలోయ్. నీకు ఇంగ్లీషు బాగా వచ్చామరి" అని ప్రశ్నించారు మహాకవి 'శ్రీశ్రీ'ని మననం చేసుకుంటూ. తను మూడు సంవత్సరాల బి.ఏ. ఐదున్నర సంవత్సరాలు చదవడానికిగల ఏకైకకారణం ఇంగ్లీషుభాషేనన్న విషయాన్ని ఎన్నడూ మరచిపోలేని రామేశం బుర్ర తకాయించాడు అడ్డంగా.

"ఇంగ్లీషు రాదు సరే. కనీసం తెలుగులో మంచి పుస్తకాలేమైనా చదివావా పోనీ?" ఇంకో ప్రశ్న సంధించారు.

"అంటే" అని నోరెళ్ళబెట్టిన రామేశాంతో "అంటే 'రావిశాస్త్రీ' "కారా" "చాసో" "కొకు" లాంటి గొప్పరచయితలు రాసినవేమైనా చదివావా అని" అని శెలవిచ్చారు కాస్త వ్యంగ్యంగా.

బుర్ర మళ్ళీ అడ్డంగా తకాయించాడు శిష్యుడు.

"చదవలేదా!! అయితే.......నువ్వీ జన్మలో కథేకాదు, ఇంకేదీ రాయలేవోయ్ రామేశం" తేల్చిపారేసారు పెదగురూగారు. " బయల్దేరు. ఇంటికెళ్ళిపోయి మీఆవిడకి అప్పడాలో, ఆవకాయో పెట్టడంలో సాయం చెయ్యి. ఆవిడైనా సుఖపడుతుంది పాపం" అని కూడా శెలవిచ్చేరు.

చూస్తుండగానే రామేశం కళ్ళలో నీరు, చెలమలో ఊరినట్టు, జలజలా ఊరిపోయి, మందారపూలమాదిరి ఎర్రరంగుకు తిరిగిపోయాయి. అలా కన్నీరు నింపుకుంటున్న రామేశాన్ని చూసిన పెదగురూగారి గుండె 'ఎల్ నైనో' ప్రభావానికి కరిగిపోతున్న ధృవప్రాంతపు మంచులా కరిగి "పోనీ ఒక పనిచెయ్యవోయ్ రామేశం. వాళ్ళు రాసిన పుస్తకాలు నాదగ్గర చాలానే ఉన్నాయి గాని ఒక నెలరోజులు మాఇంటికొచ్చి అవి చదువు. తరవాత సంగతి అప్పుడాలోచిద్దాం" అన్నారు జాలిగా.

పెదగురూగారి వద్దనుండి ఆవిధమైన సలహా పొందిన రామేశం ఆ తరవాత కొన్నిరోజులు బాహ్యప్రపంచాన్నే మరచిపోయాడు. ఉదయాన్నే పెదగురూగారురింటికి పరుగెత్తడం, సాయంత్రం వరకూ దీక్షగా అక్కడ పుస్తకాలు చదువుకోవడం. అదే లోకమైపోయిందతనికి. పదిహేనురోజుల్లోనే ఆయన చెప్పిన పుస్తకాలన్నీ చదివవతల పారేసాడు. తరవాత ఎందుకైనా మంచిదని ఇంకొక రెండురోజులాగి, పెదగురూగారుగారి సన్నిధిలో నిలబడ్డాడు.

రామేశాన్ని చూసిన పెదగురూగారు తలపంకించి, "ఏంటి రామేశం అప్పుడే నెలైపోయిందా. పుస్తకాలన్నీ చదివేసావా" అని అడిగారు ఆశ్చర్యంగా.

"ఇంకా నెలరోజులు కాలేదుగాని తమరు చెప్పిన పుస్తకాలన్నీ చదివేసాను సార్" అని బదులిచ్చాడు రామేశం వినయంగా.

ఇంకోసారి మళ్ళీ ఆశ్చర్యపోయిన పెదగురూగారు తేరుకొని, తెప్పరిల్లి, అరగంటపాటూ రామేశాన్ని అనేకమైన ప్రశ్నలడిగి పరీక్షించేరు.

వాటికి రామేశం చెప్పిన సమాధానాలతో సంతృప్తి చెందినవారై తలపంకించి "పరవాలేదోయ్ రామేశం. నువ్వు రాయగలవ్. ఆలస్యం చెయ్యకుండా మొదలుబెట్టు. గాడ్ బ్లెస్యూ" అని దీవించి శలవిప్పించారు.

--00--

అప్పట్నుంచీ ఒక పదిరోజులు రామేశం సూర్యభగవానుడి మొహంచూడలేదు. గదిలో తలుపులు బిగించికూర్చొని ఏకబిగిని రాస్తూనే ఉన్నాడు. రాసిరాసి వేళ్ళు వాచిపోతున్నా, కళ్ళు కరకరలాడిపోతున్నా, దాహంతో నాలుక పిడచకట్టుకుపోతున్నా, ఆకలితో దహించుకుపోతున్నా, నిద్రముంచుకొస్తున్నా ఆపకుండా రాస్తూనే ఉన్నాడు. అలా పదికథలు రాసిపారేసి, పెద్దపేరున్న పత్రికలొక అయిదింటికి పదకొండోరోజు వాటిని పోస్టుచేసి 'హమ్మయ్య' అని నిట్టూర్చాడు సంతృప్తిగా. స్టాంపులతికించిన కవర్లు జతచెయ్యడంమాత్రం మరచిపోలేదెందుకనో.

నెలరోజులకల్లా తిరుగుటపాలో కొట్టుకొచ్చేసాయి కథలన్నీ. రామేశం గుండె ముక్కలైపోయింది. అప్పుడు గుర్తొచ్చింది రామేశానికి, అంతవరకూ గుర్తురాని తన సహధర్మచారిణి. భార్య భుజంమీద తలవాల్చి వెక్కివెక్కి ఏడ్చేడు. అలా శోకించి హృదయభారం కొంత తగ్గించుకున్నాక అసలు విషయం రాబట్టింది రామలక్ష్మి . కథంతా విని "ఓస్ ఈమాత్రానికే ఇంతిదైపోతున్నారా. ఆ చిన్నగురూగారికో, ఇంకో పెద్దగురూగారికో కాకుండా మీ సంకల్పమేదో మొదట నాకే చెప్పుంటే అసలీ సమస్యే తలెత్తేదికాదుగా. పర్వాలేదు. ఏంచేయాలో నేను చెప్తాను గాని కొంచెం టీ తాగండి ముందు" అని అనునయించి, స్ట్రాంగ్ టీ చేసిచ్చి, రామేశం టీ తాగుతుండగా ఏం చెయ్యాలో ఉపదేశించింది.

"ఈరోజుల్లో కథెలా రాయాలో తెలుసుకోవాలంటే, ఎప్పుడో యాభయ్యోదశకంలోనో, అరవయ్యోదశకంలోనే **'ఊరూపేరూలేని'** రచయితలెవరో రాసిన పాతచింతకాయపచ్చడి కథలు చదువుతారటండీ ఎవరైనా" అని మెదలెట్టి "అయినా అలాంటి పిచ్చికథలు ఇప్పుడెవరు చదువుతున్నారూ" అంటూ చప్పరించేసింది. "కథ రాయాలంటే ప్రస్తుతం వస్తున్న కథలెలా ఉంటున్నాయి అనే విషయాన్ని ఆకళింపుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని' సెలవిచ్చింది. "దానికేం చెయ్యాలీ" అంటే "గత ఆరేడు నెలలుగా ప్రతీపత్రికలోనూ అచ్చైన ప్రతీకథా నవలా జాగ్రత్తగా చదవాలి సుమండీ' అని ఉపదేశించింది. 'అవిప్పుడెక్కడ దొరుకుతాయీ' అని ఆందోళన పడుతుంటే "పాతపేపర్లు కొనే ఏ షాపుకెళ్ళినా దొరుకుతాయికదా ఆమాత్రం కూడాతెలీదా" అని 'ఇకటాలాడింది'. "వెంటనే పరుగెత్తుకెళ్ళి దొరికిన పాతపత్రికలన్నీ కొనుక్కొచ్చెయ్యండి. రెండు వారాలపాటూ ఆపుస్తకాల్లో ఉన్న కథలూ నవల్లూ క్షుణ్ణంగా చదవండి. అన్నట్టు అదిమాత్రమే చాలదండోయ్. దానితోపాటూ టీవీలో వస్తున్న ప్రతీ తెలుగుసీరియల్నీ కూడా ఏకాగ్రతతో చూడాలి సుమా. ఇవి చేసిన తరవాత చెప్తాను ఏంచెయ్యాలో" అని భర్తని కార్యోన్ముఖుడ్ని చేసింది.

తాగుతున టీ సగంలోనే వదిలేసి బయటికి పరుగెత్తాడు రామేశం. భార్య చెప్పిన పత్రికలూ గట్రా రెండు గోనెసంచులనిండా కొనుక్కొని, ఆటోలో వేసుకొని గంటలో తిరిగొచ్చాడు. ఆతరవాత రెండువారాలు ఉదయం నుండి సాయంత్రం వరకూ వాటిలో అచ్చైన ప్రతీ కథనీ ఏకాగ్రతతో మధించేడు. సాయంత్రంకాగానే శుచిగా స్నానంచేసి, కడిగిన పుష్పంలా టీవీ ముందు కూర్చొని, అందులో వస్తున్న ప్రతీ తెలుగు సీరియలూ నిష్టగా తిలకించేడు. రెండువారాలయ్యాక భార్యముందు హాజరయ్యేడు మరింత జ్ఞానోపదేశం కొరకు.

"కథలన్నీ చదివేసారా" అడిగింది రామలక్ష్మి . చదివానన్నట్టు తలూపాడు రామేశం.

"నేను చెప్పినట్టే చదివారా. విషయం అర్దం చేసుకున్నారా" అడిగింది. అవునన్నట్టు తలూపాడు మళ్ళీ.

"అయితే మీరేమి అర్దంచేసుకున్నారో చెప్పండి కొంచెం" అంది చిన్నప్పటి తెలుగుమాస్టారిలా. కళ్ళుతేలేసాడు రామేశం. "అర్దం కాలేదా. మీరు చదివిన కథల్లో ఇతివృత్తాలూ అవీ ఎలాఉన్నాయో మీకర్దమయినట్టు చెప్పండీ" అంది కొంచెం ఎంకరేజింగ్ గా.

"ఇతివృత్తాలా" అని కొంచెంసేపు ఆలోచించి, "ఆ....నేను చదివిన కథలన్నింటిలోనూ అనేకానేకమైన వృద్ధాశ్రమాలున్నయ్" అన్నాడు ఉపోద్ఘాతంగా.

"వెరీగుడ్ " అంది రామలక్ష్మి .

”ఇంకా.......అవన్నీ పిల్లలచే నిర్దాక్షిణ్యంగా బయటికి గెంటివేయబడ్డ నిర్భాగ్యులైన తల్లిదండ్రులతో, గూడుకట్టుకున్న వారి హృదయవేదనా, ఘనీభవించిన వారి కన్నీటిధారలతో నిండిపోయి ఉన్నాయ్” అన్నాడు గర్వంగా.

”ఎక్స........లెంట్ . ఇంకేమున్నాయ్” అంది ఎంకరేజింగ్ గా.

”పల్లెటూళ్ళలో రేపోమాపో కూలిపోవడానికి సిద్ధంగాఉన్న పూరిగుడిసెల్లో కునారిల్లిపోతూ, మింగమెతుకులేని అస్థిపంజరాల్లాంటి అమ్మానాన్నలున్నారు. వాళ్ళ పిల్లలు మాత్రం పెద్దపెద్ద సాఫ్ట్వేర్ కంపెనీల్లో పనిచేస్తూ అమెరికాలోనో ఆస్ట్రేలియాలోనో ఉన్నారు” అన్నాడు రామేశం .

”వ్వా.......వ్ . సూ......పర్. ఇంకా” అంది రామలక్ష్మి ఆనందంగా.

“ఆ తల్లిదండ్రులందరూ దశాబ్దాలైనా మొహంచూపని తమ కొడుకుల్ని అనుక్షణం తలంచుకుంటూ, “మావోడీరోజొచ్చేత్తాడు, మమ్మల్ని ఇమానవెక్కించి అమ్రికాకి తీసుకెల్తాడంటూ” ఆకాశంలో ఎగిరే ప్రతీ విమానం వేపూ ఆశగా చూస్తూ ఉన్నారు” అన్నాడు రామేశం కూడా ఆనందంగా.

‘వావ్’లూ ‘సూపర్లూ’ అయిపోయాయి గనుక ఇంగ్లీషులో ఇంకేమనాలో తెలీక, “అ.....బ్బ అద్ద.....రగొట్టేసారండీ. ఇంకా” అంది రామలక్ష్మి భర్తవేపు ఆరాధనగా చూస్తూ.

“ఇంకా అంటే.... ఆ! చా......లా కథల్నిండా దుష్యంతుడ్నీ, దుశ్శాసనుడ్నీ దేవుళ్లనిపించే దుర్మార్గులైన ‘మృగాళ్ళూ’ వారి మాయమాటలకి మరులుగొని, సర్వస్వాన్నీ సమర్పించి దగాపడిన అభంశుభం తెలియని అతివలూ వారి కన్నీటిగాథలూ ఉన్నాయ్” అన్నాడు రచయితలకి సహజంగాఉండే భావోద్వేగానికి లోనౌతూ.

“కథలగురించి చాలుగాని సీరియల్స్ గురించి చెప్పండిప్పుడు” అంది భార్యామణి పులకించిపోతూ.

”సీరియల్స్ లో ఏముందీ. అందం అరంగుళం కూడా జారని “సూపర్ గ్లామర్” అత్తగార్లున్నారు వాటినిండా” అన్నాడు భార్యమణీవేపు చిలిపిగా చూస్తూ.

”అయితే ఇన్నిరోజులూ అవే చూస్తున్నారన్నమాట నోరెళ్ళబెట్టుకొని” అంటూ బుంగమూతి పెట్టింది యాభైఅయిదేళ్ళ రామలక్ష్మి .

“అబ్బెబ్బే. బట్టతలలూ బానకడుపులూ వేసుకొని ఆ అత్తల కొంగుచాటునుండి తొంగిచూసే తేభ్యంగాళ్ళని, అదే వాళ్ళభర్తల్ని కూడా చూసేనుకదా” అన్నాడు డామేజికంట్రోల్ మోడ్లోకి వెళ్ళిపోతూ.

“ఇంకా” అడిగింది అయినా మూడ్ లోకి రాని రామలక్ష్మి .

”ఇంకా అంటే” అంటూ బుర్ర గోక్కొని, “ఆ.... ఆ అత్తల ఆగడాల్ని చీల్చి చెండాడే ఝాన్సీ లక్ష్మీ భాయీ, రాణీ రుద్రమదేవుల్లాంటి కోడళ్ళూ.....” రామేశం మాట పూర్తికానియ్యలేదు. ముద్దుల్తో ముంచెత్తేసింది మూడ్ లో కొచ్చేసిన రామలక్ష్మి .

“చాలండీ చాలు. ఇంకేమీ చెప్పక్కరలేదు. మీరు రచయితలనాడీ పాఠకులనాడీ ఒడిసిపట్టేసారండీ. మీరు కత్తుల్లాంటి కథలూ నాణ్యమైన నవలలూ రాయడం అవి పత్రికల్లో ప్రచురింపబడడం మాత్రమేకాక టీవీ సీరియల్స్ గా కూడా రావడం ఖాయం. రాకపోతే నన్నడగండి. ఈరోజే రాయడం మొదలుపెట్టండి. ఏకాదశి......మంచిరోజు కూడాను” అంది ఉత్సాహంగా మెటికలు విరుస్తూ.

అలా ఆ ఏకాదశిరోజున తెలుగుసాహిత్యవినీలాకాశంలో ఒక ధృవతార ఉదయించింది. ఉదయించి ఉజ్జ్వలంగా ప్రకాశిస్తోంది. తెలుగుసాహితీఉద్యానవనంలో పరిమళపుష్పాలు పూయిస్తోంది. సాహితీసౌరభాలు వెదజల్లే ఆసాహిత్యకుసుమాలు పాఠకలోకాన్ని ఆనందసాగరంలో ఓలలాడిస్తున్నాయి, ఉర్రూతలూగిస్తున్నాయి. తెలుగుసాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నాయి. తననమితంగా ఆరాధించే పాఠకుల్ని అలరించే బృహత్ప్రయత్నంలో ధృవతార అలుపెరుగని సాహితీకృషీవలులయ్యేరు. దశాబ్దకాలంగా నిర్విరామంగా సాహితీసేద్యం చేస్తూనేఉన్నారు. చేస్తూ తరిస్తూనేఉన్నారు. పాఠకుల్ని అలరిస్తూనే ఉన్నారు.

(ఇదే ‘పిపీలికం’ పేరుతో ‘ఆణిముత్యం’ లాంటి కథ రాసిన నాఅభిమాన రచయితా, ఆరాధ్యదైవం...శ్రీ రావిశాస్త్రిగారికి క్షమాపణలతో)

# కోడికూర

కొండపల్లి వివేకానంద

పెద్ద నోట్ల రద్దు చిన్న జీవితాల్ని కడుపులో గుద్ది పది రోజులయ్యింది. ఐలయ్య సరిగ్గా తిని కూడా అంతే .

పొద్దున్న టైము తొమ్మిదయ్యింది. ఎయిర్ పోర్టు కి దగ్గర్లో నిర్మాణం లో ఉన్న మాల్ ముందు ఆ కాంట్రాక్టర్ గుమాస్తా నిలబడమంటే నిలబడి పిజ్జా తింటున్నాడు. రాత్రి మిగిలిన రెండు పిజ్జా ముక్కలు పారేయడం ఇష్టం లేక ఐలయ్య చేతికిచ్చి వెళ్ళాడు ఇందాకే, దయగల ఓ సాఫ్ట్ వేర్ మారాజు. ఐలయ్య నీరసానికి తింటున్నది రుచించలేదు. తినడానికి ఇంత సత్తువ ఖర్చవుతుందని తెలిస్తే తీసుకోకపోయేవాడు. ఎదురుచూస్తున్న గుమాస్తా నవ్వకుండా నడిచొస్తున్నాడు. ఐలయ్య నవ్వుదామన్న ఉద్దేశాన్ని నములుతున్నదానితో కలిపి మింగేశాడు.

“నిన్నింక రావద్దన్నరు తాతా. రాకు. నువ్వు చెయ్యలేవు ఈ పని.”

“అట్లా అనకు చిన్నా ... మల్లొక్కసారి అడుగు సార్ ని.”

“నీ మొకం చూసే ఇప్పటికి ముప్పై సార్లు అడిగిన తాతా. మల్ల కదిలిచ్చినంటే నా మీద ఎగురుతడు.”

“తీసెయ్యకు చిన్నా జర. చేసిన గద నాల్గు నెల్లు . “

“నాదా తాతా ఇది? క్యాష్ దొరకట్లేదు పనోల్లకియ్యటానికి. చూస్తున్నవ్ గద బయటెట్లుందో. మల్ల నీ బలం గురించి నీ ఒంటికి పట్టే చెమట గురించి నువ్వింటికి తీస్కపోయే డబ్బుల గురించి నానా మాటలంటడు. నన్ను కూడ తిడతడు. అర్థం చేస్కో తాతా. ఇంకెక్కడైనా చూస్కో. నిన్ను ఊకెనే పంపలేక ... ఇదిగో మా ఇంట్లో పొయ్యి దగ్గర నా చేతికి దొరికినన్ని కూరగాయలు తెచ్చిన. నేను చెయ్యగలిగిందింతే. “ ....అంటూ ఒద్దంటున్నా బతిమాలి బుట్ట చేతికిచ్చాడు గుమాస్తా.

“తింటానికి ఏం లేనప్పుడు ఆకలెయ్యటమే ఒక రోగమై కూసుంటది. వారంకి సరిపడ కూరగాయలన్నడు. ఒక పూటైతే గడుస్తదిలే! మరి వారమని ఎందుకు జెప్పాలె. ఒక్కపొద్దులు జేసెటోడి లెక్కేమన్న ఔపద్దదా? నా డొక్క సూత్తే తెలిసేది. ఎన్ని పొద్దులు గూకిన ఒక్క పొద్దు జేశిన్నా అని. అయిన మంచోడు లే బిడ్డ. టమాటాలిచ్చిండు, ఉల్లిగడ్డలిచ్చిండు, మెరక్కాయలున్నయ్, నిమ్మకాయలు, కొత్తిమీరా.... ఓరినీయమ్మ అల్లం ఎల్లిగడ్డ దనియాలు కూడ ఉన్నయి.”

ఏం కూర వొండుకోవాలో నిర్ణయించుకుని తింటున్నట్టు ఊహించుకున్న ఐలయ్యకి ఆకలి తీరినంత పని అయింది. ఆలోచనలు తేలికయ్యాక బుట్ట చేతులు మారకుండా కుదురుగా కుడిచేతికొచ్చి ఆగింది. ఐలయ్య మొహం మీదకి నవ్వొచ్చింది.

మధ్యాహ్నం ఎండ ప్రశాంతంగా కాస్తోంది. పనికెళ్ళే వాళ్ళని, పనికోసం వెళ్ళేవాళ్ళని దాటుకుంటూ చాలా సేపు నడిచాక ఇల్లు చేరుకున్నాడు. ఆ కాలనిలో ఆఖరి ఇంటికి కిలోమీటరు దూరం లో ఉంది ఐలయ్య ఇల్లు. తాళం తీసి, లోపలికెళ్ళి తలుపేసుకోబోతూ బైటికి చూసాడు. ఇంటి మొత్తలో నడుస్తూ ఢిల్లీ, నగేసు కనబడ్డారు. వెంటనే తలుపు తీసి

"రేయ్ ఆగురా..."

అని గద్దిస్తూ  బైటికురికొచ్చాడు. వాళ్ళు దొరకమన్నట్టు నవ్వుకుంటూ పారిపోయారు.

ఢిల్లీ, నగేసు  అన్నదమ్ములు. ఆ కాలని దొంగలు.

లోపలికొచ్చి తలుపేసుకుంటూ మాట్లాడుతున్నాడు...

"ఈ గాడిదలు ఏం తీస్కపోదామని తిరుగుతున్నరో మల్ల కాలనీలో. ఒకసారి కాలనీవోల్లు పట్టుకున్నరు గట్టిగనే కొట్టిన్రు...ఆ కానిస్టేబుల్ కొడుకు సైకిలు  గుంజకపొయ్యి అమ్ముదామనుకున్నరు. అప్పుడే జైల్ల పెట్టనుండె. "

మాట్లాడుతూనే షర్టు, బనీను విప్పి లోచెడ్డి మీద గాబులో నుంచి గబగబా నాలుగు చెంబుల నీళ్లు పోసుకున్నాడు. తల తుడుచుకుని తల దువ్వుకుంటుంటే అద్దం లో ఒక మూల కనపడింది. తన వెనక ట్రంకు పెట్టె మీద నిలబడి దిక్కులు చూస్తున్న కోడి.

ఐలయ్య వెనక్కి తిరక్కుండానే ....

"నీ మీదే వాళ్ళ కన్నంతా!! నాగ్గాని దొరికితె కొడుకుల ఈపులు పలగ్గొడుదును. ఎంత మందిని ఏడిపిచ్చకదిని  ఉంటరు. "

పెద్దమ్మ తల్లి పటం ముందున్న కుంకుమ పొట్లంలో ఇంకో మూడు బొట్లున్నాయేమో! ఒకటి పెట్టుకుంటూ...

"గుడికి పొయ్ చాన దినాలయ్యింది! కనపడేవ్ ....ఇంగేమ్ లే!! రాయి ఇసిరి కొడ్తరు నీ తలకాయ మీదికి. తీస్కపొయి తింటరు భాడ్కావ్ గాన్లు. నేనెందుకు దిన్నిస్తా గాని. నేనే ఒందుత గా నిన్ను ఒచ్చే లచ్చిమారం"

బుట్ట చుట్టూ తిరుగుతున్న కోడితో తన కోరిక చెప్పుకున్నాడు ఐలయ్య. పొద్దున్న ఆర్చిన జావ ని పొయ్యి వెలిగించి వేడి చేసాడు. నూకలు రాత్రి ఉడకబెట్టి పెద్ద పళ్ళెంలో చల్లారబెట్టి, తెల్లవారేక, వాటిని ముక్కలు చేసి గంజి కలుపుకుని తినాల్సొస్తుంది ఐలయ్యకి పని పోయిన దగ్గర్నుంచి.

కొన్ని నూకలు తీసి కిందపోసి ఇంట్లో ఆ మూల ఈ మూల వెతికాడు. కోడి వేరే వైపు నుంచి వచ్చి నూకలు తింటోంది. ఐలయ్య ఇంకా వెతుకుతున్నాడు. దొరికింది. గాట్ల పీట. తెచ్చి, కోడి పక్కన వేసి గంపతో దాన్ని మూసాడు. మంచం మీద కూర్చోగానే ఏ మూలో నవారు ముడి ఊడింది. ఏ మూలో చూసే ఓపిక లేక అలానే ఒరిగిన ఐలయ్యకి వెంటనే నిద్ర పట్టింది.

సాయంత్రం ఆరు కావస్తున్నట్టుంది. పెద్ద విమానం శబ్దం. మెలుకువొచ్చింది. చప్పున మంచం మీది నుంచి లేచి గంప తీసి కోడి ని ఎత్తి పట్టుకుని తలుపు తీసి ఇంటి బైటికి ఒచ్చాడు. విమానాలు ఇంటి మీద నుంచి పోతాయి ల్యాండ్ అవ్వడానికి. కోడితో పాటు నిలబడి అంత దగ్గరగా విమానాలు చూడటం ఓ సరదా ఐలయ్యకి.

రాత్రయ్యింది.

ఆకలంటే పూట పూటకీ మనిషిని బతకమని అభ్యర్ధించే దేవుడో లేక చంపుతానని బెదిరించే దెయ్యమో అర్ధం కాదు. మనిషంటే మాత్రం రోజుకో శేరు బియ్యం ఖర్చు చేసే ఒక మర అని అర్ధమయ్యింది.

మళ్ళీ ఆకలేస్తోంది.

బిందెలోనుంచి ఒక చెంబుతో  నీళ్లు ముంచుకొచ్చి అందులో అప్పుడే బుట్టలోనుంచి తీసిన ఒక నిమ్మకాయి పిండి, ఉప్పేసి గట గట తాగేశాడు. తర్వాత ఒక పెద్ద టమాటా తినుకుంటూ గాట్ల పీట మీద కూర్చున్న కోడితో కబుర్లలో దిగాడు ఐలయ్య.

"కొడుకులు, బిడ్డలంత హౌలేగాన్లు ఉంటరు నాసొంటి బుడ్డే గాళ్ళకి. ఎందుకంటే నాకు ఆకలైతాంది ...తిననీకి ఎం లేదు. సూన్నీకి ఎవ్వర్రారు. గంతేలే ఎందుకు సూస్తరు ఎవుని బతుకు ఆనిది. ఇంటామె ఉన్నన్ని దినాలైనా మంచిగుంటుండె ...నాకు గిన సత్తువుంటుండె. జెప్ప పెట్టకుండా అదీ బాయె. గంతేలే ఎందుకు జెప్తరు... ఎవుని సావు ఆనిది. "

"ఆకలైతాందే. మంచిగ దినాల్ననుంది. "

టమాటా అయిపోయింది.

"ఎవుర్నయిన అడగమంటావ్ !!! ఛీ ... చెయ్యి సాచుదు లేదు ఇంట్ల. పనికిబో ...పైసలోస్తయ్ ... తాగు...తిను... నిద్రవో ....లే ...పనికిబో ....ఇంతే. "

బుట్టలో తన కంటబడకుండా బిస్కెట్ ప్యాకెట్లు ఏమైనా దాక్కున్నాయేమో అని అనుమానంతో వెతికాడు. మనిషికి అదృష్టం మీద ఉండే నమ్మకానికి చాలా దగ్గరి బంధువులు ఇలాంటి అనుమానాలు.

ఏం దొరక్క బుట్టని దూరం జరిపాడు.

"పొద్దున్న కూడ ఆ పిలగాలిద్దరు  మస్తు బతిమిలాడిన్రు. ఒకడేమో ఎండిపోయిన రొట్టె ముక్కలు తినమని. ఒకడేమో బుట్ట తీస్కపొమ్మని.  రోజు పోయి సెంటర్ లో నిలబడితే ఎవుడో ఒకడు బతిమిలాడతడు. కానీ గదే కదా అడక్కతినుడు యవ్వారమంటే. ఉన్ననాడు తలకాయ కూర. లేనినాడు తోటకూర. కాని ...మంచిగ దిని మాసమైతాంది. మా మేస్త్రి బిడ్డ పెళ్లి రోజు దిన్న. యాట కోశారు ....కోళ్లు కోశారు. బాగ జేశారు. "

"కోడికూర అంటే యాదికొచ్చింది. లచ్చిమారం ఒండుత నిన్ను. ఎల్లుండే. సర్నా ... నీతోనే జెప్తుంటే ఎట్లనో ఉంది కదుపుల. కదుపులకి వోతవా!"

"మాటాన్నీకి ఎవురన్న ఒత్తే బాగు......"

అంటూ మంచం ఎక్కగానే ఇంకో రెండు ముదులు వొదులయ్యి ఒక పావు నవారు నేల మీదకి జారింది.

★★★★★★★★★★★★

తెల్లారకుండానే విమానం నిద్ర లేపింది. మంచం దిగి పళ్లు తోముకుని మంచిగ తల దువ్వుకుని...డబ్బా లో నుంచి కొన్ని నూకలు తీసుకుని గంప ఎత్తాడు. సగం కళ్ళు మూసి గాట్ల పీట మీద నిద్రపోతున్న కోడి ని చూసి నవ్వొచ్చింది ఐలయ్యకి.  కోడి కళ్ళు తెరిచి తల పైకెత్తింది.... నూకలు దాని పక్కన పోసి ఇంటికి తాళం వేసి దారిబట్టాడు.

సెంటర్ లో పని కోసం అందరి కన్నా ముందొచ్చి నిలబడినా... తర్వాత వచ్చినోళ్లందరిని పని పలకరించింది.

"నేను తవ్వత ...పాత్తా ... చదును చేస్త .... సున్నాలేస్త ... షామియానాలు ఏస్త ....పైపులు బిగిస్త .... నాకు రాని పని ఏదన్న ఉన్నదా?"

"భుజాలు బలంగ లేవని ఒకడు ... ఎన్నుపూస సక్కగ నిలబడలేదని ఒకడు ... పాణం ఐతె ఉందిగ .... మనిషిని నిలబడే ఉన్న ...నడుస్తున్న.... కళ్లు కానొస్తున్నె ... "

ఎవరి మీద అరవాలో తెలీలేదు ఐలయ్యకి. మొహం  వాడిపోయే వరకు నిలబడి బోరింగు నీళ్లు తాగి వెనక్కి నడిచే ఓపిక తెచ్చుకున్నాడు. కొంచెం దూరం నుంచే పసిగట్టాడు. తన ఇంటి బయట ఢిల్లి గాడు కూసోని కాపు కాస్తున్నాడు. లోపల ఆడి తమ్ముడు నగేసు గాడు ....

"దొంగ లండిల్లారా .... రేయ్ ...."

ఐలయ్య అరుపుకి ఢిల్లీ పరుగు తీశాడు . ఇంటి లోపల నుంచి కోడి తో ఉరుక్కుంటూ బైటికొచ్చాడు ఎనిమిదేళ్ల నగేసు. ఐలయ్యని చూసి దౌడు తీశాడు. ఇప్పుడు ఐలయ్య వెన్నుపూస  నిటారైయ్యింది. భుజాల్లోకి బలమొచ్చింది. అరికాళ్ళలోకి కోపమొచ్చింది. నగేసు వెనక వేగంగా ఉరికాడు. ముందుకు ముందే దూరంగా పారిపోయిన ఢిల్లీ, తమ్ముడి కోసం ఆగి....

"జల్దీ ఉరుకు రా" అంటూ అరుస్తున్నాడు..

ఐలయ్య ఒక రాయి తీస్కొని నగేసు మీదికి విసిరాడు. అది నగేసు వీపుకి తగిలి కిందపడ్డాడు. కోడి చెయ్యి జారింది. వీపు రుద్దుకుంటూ ఏడ్చుకుంటూ లేచి అన్న దగ్గరికి ఉరికాడు నగేసు. ఇద్దరు పరారయ్యారు. రొప్పుతూ కోడి దగ్గరికొచ్చి ఆగాడు ఐలయ్య. మెదలకుండా ముడుచుకుంది చంకలో. నూకలు పోసిన చేతులు గుర్తేమో కోడికి. మరి రేపు లచ్చిమారమని గుర్తో లేదో!! రేపు ఎక్కువ తినొచ్చని ఇవ్వాలంతా ఏం తినకూడదనుకుంటున్న విషయం ఇంకో టమాటా తింటూ చెప్పాడు ఐలయ్య. మధ్యానం మూడయింది. కోడి గంపలోకి రానంటూ చంక ఒదిలిచ్చుకుంది. ఆ ఒంటి గది ఇంటికి గడి పెట్టి మంచం మీద పక్కేసుకున్నాడు.

"నువ్వు ఇంట్లో అట్లా తిరుగతా ఉంటె నాతో పాటు ఇంకో పాణం ఉందని బతుకు మీద చాన ఆసైతందే రేపు ఇంటికెవురన్న ఒచ్చి పని కాడికి తీస్కపోతరనో ... కాలనీ ఓల్లు పెద్దమ్మ గుళ్లో పెద్ద పండగేదైన చేస్తరనో ... గౌర్మెంటోళ్లు ఒచ్చి ముసలోల్లందరికి తలా లచ్చ రూపాయలు ఇస్తన్నమని ...ఇదిగో ఐలయ్య నీ లచ్చ అంటరనో .... "

"పాపం పెద్ద రాయే ఇసిర్న. ఆ నగేసు గాడికి తగుల్తదనుకోలె . పాపం మూగోడు, పసోడు. డిల్లీ గాడే వీడ్ని చెడగొడతండు. దొంగతనాలు మంచియేనా నువ్ జెప్పు. డిల్లీ గాడికైన తగలాల్సి ఉండె రాయి. ఇప్పుడున్న బియ్యం ముగ్గరికి అయితయ్ గా ....రేపు కూర అయ్యాక పిలిచి అన్నం పెడతా. "

నిద్ర పట్టింది.

సాయంత్రం లేచి కోడికి దాని ఆఖరి విమానాన్ని చూపించాడు. రాత్రి నిమ్మకాయ నీళ్లు చెంబుడు తాగి ఎప్పుడూ లేనంత గట్టిగా త్రేంచాడు.

మంచాన్ని చూస్తే పడుకోనిచ్చేలా లేదు. నవారు నరాలు ఐలయ్య కన్నా బలహీనపడి మెల్లగా మంచం మీద నుంచి తప్పుకుంటున్నాయి. దాన్ని అల్లుదామన్న ఉల్లాసమొచ్చింది చేతుల్లోకి. పని చేసుకుంటూ మాటల్లో పడ్డాడు కోడితో ...

"లచ్చిమారం ఎందుకంటవా? ఖచ్చితంగా దెల్వది... గాని నా పెండ్లయింది గా దినాన...

పెండ్లిదినం లచ్చిమారమని గుర్తు... ఇంగేమ్ గుర్తులే... పెండ్లాం మొకం గూడ...

ఇంకా చాన లచ్చిమారాలున్నయి.. చెప్పనా...

పెద్దోడు వుట్టంది... చిన్నోడు బాయిల పడ్డప్పుడు బైటికి దీసింది.

యాప చెట్టు ఇరిగి పడి ఎడ్లు రెండు సచ్చింది...

ఇంకా చానున్నయి...

సూత్తె సూత్తె నా బతుకు మొత్తం లచ్చిమారాల లెక్క అనిపిస్తది.

ఇల్లు ఇట్లుండేటిది గాదె..."

నవారు గట్టిగా గుంజి

"పెండ్లాం... "

అల్లిక ఒదులు చేస్తూ

"పిల్లగాన్లు... "

ఆగి

"బతుకమ్మ ఎట్లా జేస్తుంది ఎరకనా!"

"నీకు గిట్ల శాన మంది దోస్తులుంటుండె... నువ్వు కూసునే పీట మీద ఎన్ని గాట్లున్నయి అదిగో... అంత మంది దోస్తులుంటుండె ఇంట్ల. నువ్ సూస్కోనికి ఆ గాట్ల పీటైన ఉంది... నాకది గూడ లే...! పోట్వలు దిగాలసుండే మేం గిన! "

ఎందుకో ఆ పీట ముట్టుకోవాలనిపించింది ఐలయ్యకి. వెళ్లి తెచ్చుకున్నాడు.

"ఇంత గరుక్క ఉందేందే... ఎన్నడూ చేయి ఉంచలే దీని మీద... ఎట్లా నిద్ర వద్తుంది నీకు దీని మీద...

నీకు దెలుసా నీ కాందాన్ మొత్తం? ఏ గాటు ఏ పీక మీద వడిందో నువ్వు గుర్తు వద్తవా... నేను గుర్తు వద్త..."

"ఇది పెద్దది. ఐదు సంసరంలైన అయ్యి ఉంటది. దసర పండక్కి కొడుకులిద్దరు ఒచ్చి ఆటోలు కొన్కుంటమని భూమి అమ్మమన్నప్పటిది. ఆఁ ...ఈ మూల ఉంది జూడు! నాలుగు సంసరం లు అయ్యుంటది. ఇద్దరు ఇంటికొచ్చి మంచిగ తిన్నరు ...తాగిర్రు... ఇగ మరి పైసల కాడ ఏం తగువైందో... యమ దన్నుకోని ...నన్ను కూడ దన్నిర్రు. అప్పటినుంచి రాలె ... "

"గిదేమో... ఇంటామె పెద్ద దినం నాటిదనుకుంట... అప్పుడు కూడ రాలె. ఇంగ రారు లె !"

ఇంకా చోటు లేనన్ని గాట్లు... కాని ఇంకొక్కటి వడిద్ధి... లచ్చిమారం... రేపేనానే?"

గట్టిగ బిగించి ముడులేసి ...సందులేకుండా అల్లిన మంచాన్ని చూసుకుని మురిసాడు. లైటు ఆర్పి .... ఎక్కగానే కొత్త మంచం లా అనిపించింది . అలసట తెలుస్తున్నా గాని ... ఇంకా ఏదో మాట్లాడాలనిపిస్తోంది ఐలయ్యకి నిద్రపోకుండా అక్కడక్కడే తిరుగుతూ శబ్దాలు చేస్తున్న కోడితో.

ఉన్నట్టుండి కింద నుంచి ఉబికిన నీళ్లలో కళ్ళ మీద ఉన్న నిద్ర మునిగిపోయింది.

గట్టిగా చెవులు మూసుకుని...

"సాయంత్రం దాక మంచిగనే నోట్లో నీళ్లూరె .... మరేందో ఇప్పుడు మనసికారమైతందె...చప్పుడు చెయ్య కే !

మడిసికి ఆకలైతదే. లోకమెటన్న సావనీ..

మడిసికి ఆకలైతది.... మల్ల మల్ల అయితది.... సంపి తినేటంత ఆకలి... సచ్చేదాక అయితది...

నేనేమ్ జెయ్యను..."

అటు తిరిగి పడుకుని....

"సూసేటోళ్లు లేరు... నన్నొచ్చి సూసేటోళ్లు లేరు... నేను పోయి సూసేటోళ్లు లేరు..... నేనేం జెయ్యను...

బడి పలుకులు దెల్వయి... పలుకుబడులు దెల్వయి... పైసలేడికెల్లొస్తయే... పోనీ నువు నన్ను సంపి తిను... ఏమేమో ఆలోచిస్తున్న!

నెత్తికి బెట్టిన నూనె తియ్యస్తదా?

కడుపుకి బుట్టిన ఆకలి కానొస్తదా?

నీ నూకలు కూడ అయిపోనయే! ఇంగ పండుకో! చప్పుడు చెయ్యకు.

శంకలేమన్నుంటే... శంకరుడు దీరుస్తడు... సర్నా!"

అంటూ తల మీదుగా దుప్పటి కప్పుకున్నాడు.

తెల్లవారురఝాము నాలుగయింది. నగేసు వీపు మీద వాపు తేలింది. నిద్రపట్టక అటు ఇటు దొర్లుతున్న నగేసుని జాలిగా నిద్రపోకుండా చూస్తున్నాడు డిల్లీ. రెండు కిలోమీటర్ల దూరం లో ఉన్న కాలనీకి నీళ్లిచ్చే వాటర్ ట్యాంక్ కిందే వీళ్ళ పడక, బతుకు. తమ్ముడి మీద ప్రేమగా రగ్గు కప్పి కోపంగా లేచి చెప్పులేసుకున్నాడు ఢిల్లీ.

"ఆ ముసలోడ్ని సంపి ఐన వాడి కోడిని ఇంకా వాని ఇంట్ల ఉన్నయన్నీ ఎత్కస్త. చిన్న పిలగాడి మీదికి రాయి ఇసిరిండు. ఛీ !!"

ఐలయ్య ఇంటి మొత్త లోకి వచ్చి కొంచెం భయం మింగి .... ముసలోడికి దొరక్కూడదని తనకే అన్ని దొరకాలని పెద్దమ్మకి మొక్కుకున్నాడు డిల్లీ. దూరంగానే చెప్పులిప్పి అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చి తలుపుకి తన చెవ్వు ఆంచాడు. ఏ సద్దూ చెయ్యని ఆ ఇంటి మూగ పరిసరాల్ని చీల్చడానికన్నట్లు దిక్కులు చెవులు మూసుకునేంత మోత మోగిస్తూ ఇంటి మీద నుంచి వెళ్ళింది ఒక విమానం. దాంతో ఒక్కసారిగా డిల్లీ అదిరిపడి, కిందపడి దగ్గర్లో ఉన్న చెట్టు చాటుకి ఉరికాడు. కాసేపు అక్కడే ఉండి తలుపుని గమనించాడు. ఐలయ్య లేవలేదని నిశ్చయించుకున్నాక మళ్ళీ వెళ్ళి చాకచక్యంగా లోపల్నుంచి ఇనప తీగలతో కొక్కేనికి తగిలించిన తలుపు గడి ని ఊడబీకాడు. అప్పుడే తెల్లారుతోంది. చీకటి గదిలో డిల్లీకి సహాయంగా కిటికీ లో నుంచి సూర్యుడొచ్చాడు. గంప కనపడింది. ఎత్తి చూస్తే గాట్ల పీట మీద కదలకుండా కోడి. జాగ్రత్తగా పీటతో పాటు ఒడిసి పట్టుకున్నాడు. ఇంకా ఏమైనా కనిపిస్తాయేమోనని వెతగ్గా... ఒక బుట్ట....దాంట్లో కూరకి కావాల్సినవన్నీ ఇంకేం ఆలస్యం చెయ్యకుండా అక్కడి నుంచి జారుకున్నాడు. సంతోషంలో విప్పిన చెప్పులు కూడా మర్చిపోయి తమ్ముడి దగ్గరకు పరుగు పెట్టాడు.

ఐలయ్య లేవనందుకు ...పట్టుకుని తన్ననందుకు ...పెద్దమ్మ తల్లి మీద నమ్మకం పెరిగింది ఢిల్లీకి.

తినాలా వొద్దా అనుకుంటూ అల్లుకున్న మంచం మీద ఆకలితో పడుకున్న ఐలయ్య ఆలోచనల గొలుసు నిద్దట్లో నిశ్శబ్దంగా తెగింది.

వాటర్ ట్యాంక్ నీడలో కూర బాగా ఉడికింది. అన్న వొండాడు. తమ్ముడికి ప్రేమగా తినిపించాడు. ఇద్దరు తృప్తిగా భోంచేసారు.

అదే రోజు సాయంత్రం చెప్పులు తెచ్చుకోడానికి వెళ్లిన ఢిల్లీ, ఐలయ్యను కడసారి చూసి... ఏడ్చుకుంటూ వెళ్లి పెద్దమ్మ గుళ్లో పూజారికి చెప్పాడు.

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

## సుభద్ర పట్టాభిషేకం

కె.వి. బాపారావు (Los Anegeles, USA)

(కృష్ణార్జున సంవాదరూపేణా గయోపాఖ్యానానికో అనధికారిక టిప్పణి—చిలకమర్తిగారికి క్షమాపణలతో)

**కృష్ణుడు** హాల్లో సోఫాలో కూలబడి, వెనక్కి చేరగిలబడి, గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు."హమ్మయ్యా, వ్యవహారం కడతేరింది. మనోడు ఏం కొంప ముంచుతాడో అని హడిలి చచ్చాను చివర్లో," అనుకున్నాడు స్వగతంగా. "అడ్డు ప్రశ్నలు వెయ్యక బతికించాడు..."

ఆలోచన మధ్యలోఉండగానే, అర్జునుడు ఊడిపడ్డాడు, హడావిడిగా.

ఒక్కసారి చిరాగ్గా మొహం చిట్లించి, అంతలోనే నవ్వు పులిమేసుకున్నాడు కృష్ణుడు.

“హలో బావా, ఎప్పుడు వచ్చితీవు?” అంటూ పలకరించాడు.

అర్జునుడి మూడ్ బాలేదు.

“సర్లే బావా, నీకన్నీ వేళాకోళమే, అంతా మాయే, ఇవతల ఇరుక్కుపోయేవాళ్ళం మేము,” నిష్ఠూరంగా అన్నాడు.

“శాంతించవోయ్ బావా, ఇలాకూచుని నీబాధేమిటో వివరించుమీ.” తన సరసన సోఫా తట్టాడు కృష్ణుడు.

“అదుగో మళ్ళీ...”

“సరే, సరే, నువ్వేదో సీరియస్ గానే ఉన్నట్టుంది. మాట్టడుకుందాములే. అక్రూరుడుగారూ, మనోడికి కాస్త కాఫీ పంపిస్తారూ?”

“ఆ వస్తున్నాయ్, కాఫీ, చేగోణీలూనూ.” అక్రూరుడు లోపల్నుంచి కేక పెట్టాడు. అర్జంటుగా ఓ లంగా వోణీ గోపిక విసవిసలాడుతూ ట్రేలో రెండు కప్పుల్లో కాఫీ, రెండు బుల్లి గిన్నెల్లో చేగోణీలూ, మరో పళ్ళెంలో వెన్నముద్దా పట్టుకొచ్చి, కృష్ణుడి ముందున్న కాఫి టేబులుమీద విసురుగా కుదేసి వెళ్ళిపోయింది. కృష్ణుడు ఈ పోకడేం పట్టించుకోకుండా ఆత్రంగా చేగోడీల గిన్నెఒకటి తన కేసి లాక్కుని, చేగోడీ ఓటి తీసి వెన్న ముద్దలో ముంచుకుని, ప్రీతిగా ఆరగించడం మొదలెట్టాడు. అర్జునుడు కృష్ణుడి పక్కన కూలబడి, ఉడుకుబోతు మొహం పెట్టుకుని, కాఫీ చప్పరించాడు.

“ఇప్పుడు చెప్పు మరి...” కృష్ణుడు బుజ్జగింపుగా అడిగాడు.

“ఆ, నీకు తెలీనట్టు. ఎలక్షన్లు నెత్తిమీదికొస్తున్నాయి, ఈ గయుడి గొడవతో పనిగట్టుకుని అనవసరంగా పెద్ద తంటా తెచ్చి పెట్టావు, ఏమన్నా అంటే, మాయ, మాయ అని దాటేస్తావు. అవతలి వాళ్ళకి ఏమీ బోధపడి చావదు, అయినా కృష్ణుడికి తెలియకపోతుందా, అనుకుని గంగిరెద్దుల్లా బుర్రలాడించి, నోళ్ళు మూసుకుంటారు. నీకిదంతా ఓ ఆట, ఓ నాటకం. ఇంక నావల్ల కాదు. అసలీసారి పోటి విరమించుకుందామనుకుంటున్నాను. ఈసారేంఖర్మ, ఎప్పటికీను. రాజకీయ సన్యాసం పుచ్చేసుకుంటున్నాను. ఆ!” గద్గదస్వరంతో, అంటూ కాఫీ గుక్క పుచ్చుకున్నాడు అర్జునుడు.

కృష్ణుడికి చిర్రెత్తుకొచ్చింది. “రాజకీయ సన్యాసం పుచ్చుకుంటావూ? నీకేమైనా పిచ్చా వెర్రా? తెలిసీతెలియకుండా ఏమిటా వాగుడు?” కసిరాడు.

అనుకోకుండా బావ వైఖరి ఇలా అవ్వడంతో అర్జునుడు బిక్క మొహం పెట్టాడు. కృష్ణుడికి జాలేసింది.

“సర్లేరా, నీదేం తప్పు లేదు. నీకు మాయ విప్పి చెప్పాల్సిన తరుణం వచ్చింది. చెబుతాలే, మొహం అలా పెట్టకు, ఓ చేగోడీ తిను, కాఫీ చివరంటా తాగేయ్. చేగోడీలోకి వెన్నముద్ద కావాలా?”

“అహహ వద్దొద్దు,” కంగారుగా అన్నాడు అర్జునుడు. బావ పట్టువిడుపుల వైద్యంతో మూడ్లోంచి బయటికొచ్చి కాస్త తేరుకున్నాడతను. కాఫీ పూర్తి చేసి, “అయితే చెప్పుమరి,” అన్నాడు.

“ఇక్కడకాదులే, సర్దాగా జీపులో ప్రభాస తీర్థం రోడ్లో బీచెంబడి ఓ రౌండేస్తూ మాట్లాడుకుందాం,” అన్నాడు కృష్ణుడు, `ఎందుకైనా మంచిదనుకుంటూ. “అక్రూరుడుగారూ, కాస్త జీపు బయట పెట్టిస్తారూ?”

“ఓ గోపెమ్మా, విన్నావుగా, కాస్త ఆ పన్జూడమ్మా!” లోపల్నుంచి అక్రూరుడు.

కృష్ణార్జునులిద్దరూ పోర్టికోలోకి వచ్చారు. అప్పటికే జీపునక్కడికి తీసుకొచ్చిన ఖాకీ యూనిఫారం గోపిక జీపు దిగి, సెల్యూట్ విసిరికొట్టి వెళ్ళిపోయింది.

బండి డ్రైవరు సీట్లో కృష్ణుడూ, పాసింజరు సీట్లో అర్జునుడూ ఎక్కారు. అర్జునుడికి మాట్లాడద్దన్నట్టు సైగ చేసి, గేరు వేసి, బండిని బంగళా ఆవరణ దాటించి, బీచి రోడ్డు ఎక్కడానికి ముందు, ఓ పక్క వీధిలో ఆపాడు కృష్ణుడు. కోటు లోపలి జేబులోంచి ఒక చిన్న పరికరం ఒకటి తీసి, అది పెట్టి జీపు లోపలి భాగం అంతా పరిశీలించి, తృప్తిగా తలాడించి, బండిని పి.టీ. బీచిరోడ్డెకించాడు.

"సరే ఇప్పుడు చెప్పు. తంటా అన్నావు, మాయ అన్నావు, కదా, నీ దృష్టిలో జరిగిన డ్రామా అంతా ఏమిటంటావు?"

నేనే చెప్తే ఇంక నువ్వెందుకన్నట్టు చూసాడు అర్జునుడు.

"మాయ అనేది ఎవ్వరిది వాళ్ళకే ప్రత్యేకం. నిన్ను చుట్టుకున్న మాయ విప్పాలంటే, నిన్నది చుట్టుకున్న తీరు తెలియాలి. నాకు తెలియక కాదు, నీచేతే చెప్పిస్తే, ఆ పైన విరుగుడు నీకు మరింత బాగా వంట పడుతుంది."

"ఏముందీ, ఈ గయుడు తెల్లవాళ్ళ దేశపు ఫారినరు, మన సంస్కృతీ, సంగీతం అవీ బాగా ఇష్టం, కాస్త త్యాగరాజకృతులూ అవీ, తప్పుదు యాసతోనైతేనేం, పాడతాడుకూడాను. మన దేశంలో మానవ హక్కుల ఎన్జీవో నడుపుతున్నాడు.

ఉన్నట్టుండి వాడు మన మతం మీద ఉమ్మేశాడనీ, వాణ్ణి చంపెయ్యాలనీ నువ్వు స్టేట్మెంచ్చావని KLHM ఛానలు వాళ్ళ "కొట్టుకుందాం రండి" చర్చ ప్రోగ్రాం నడిపే కలహాల భోజనరావు "పగుల్తున్న వార్త" గా పొద్దస్తమానమూ కోడై కూశాడు. మా కన్సల్టెంటు నారదరావేమో, 'సెక్యూలర్ వోట్లు కాసినైనా పడాలంటే, ఇదే ఛాన్సు, ఆలస్యంలేకుండా కృష్ణుడి స్టేట్మెంటుని ఖండిస్తూ గయుడి ప్రాణానికి నా ప్రాణం అడ్డు' అని ఎదురు స్టేట్మెంటు ఇమ్మన్నాడు. ఆఫ్టాల్ స్టేట్మెంటే కదాని ఇచ్చేసాను. ఇంకేముంది, అర్జునుడు కృష్ణుణ్ణి నానా బూతులూ తిట్టాడు, అంటూ భోజనరావు మళ్ళీ వార్త పగలగొట్టాడు.

అదేమిటి, అని నేనడగబోయేంతలో, సాత్యకి లీడులో యాదవ గాంగూ, వాళ్ళ వెంబడే నువ్వూ మా పాండవ పార్టీ ఆఫీసు మీద పడి కుర్చీలు విరగ్గొట్టి, నన్నూ తన్న బోయారు.

ఇంతలో `ఎలా వచ్చాడో శివుడు ఊడి పడ్డాడు. నువ్వూ శివుడూ ఓ మూల చేరి మంతనాలాడుకున్నారు, గయుడితో కూడా ఏదో మాట్లాడారు. ఇంక నా దగ్గరికొచ్చి, 'చంపడమూ గింపడమూ ఏమీ లేదు, కృష్ణుడూ అర్జునుడూ వీడని జోడీ, వాళ్ళ మధ్య తగువేమిటి, నాన్సెన్సు' అని మీడియా వాళ్ళకి సమిష్టి స్టేట్మెంటోటి ఇచ్చారు, వాళ్ళెదురుకుండానే, నువ్వు గయుడికి షేక్ హాండు కూడా ఇచ్చావు, వాడు నమస్కారం పెట్టి, వెకేషనంటూ వాళ్ళ దేశం చెక్కేసాడు. వెళ్ళబెట్టిన నోటిని కూడదీసుకుని, నేనేదో అనబోయేంతలో, నువ్వేమో చెవులో, 'ఒరే బావా, నువ్వు నోర్మూసుకో, ఇదంతా మాయలే' అనేసి, ద్వారక్కి తుర్రుమన్నావు.

మరోగంటకి సాత్యకి ఫోనొచ్చింది. చాలా దురుసుగా, 'మన మతం మీద ఉమ్మేసిన ఆ ఫారిన్ రాస్కెల్ని వెనకేసుకొస్తావేం? కృష్ణన్నయ్యా, సుభద్రక్కయ్యా మొహాలు చూసి నిన్ను తన్నకుండా వదిలాను గానీ, ఎన్నికల్లో మా యాదవుల వోట్లకి మాత్రం గుడ్బై చెప్పేయ్' అని పెట్టేసాడు.

యాదవ వోట్లలో ఎక్కువ భాగం, సెక్యులర్ వోట్లలో ఓ మోస్తరు భాగం, లేందే నెగ్గే ఛాన్సు లేదాయె. మరందుకే, అప్పట్నుంచీ నిద్ర లేదు, అన్నం విషంలా అనిపిస్తోంది. ఇందాక తిన్న చేగోడీలే ఇన్నాళ్ళబట్టి ఏదైనా తినడం. చాలా విషాదంగా ఉంది బావా!"

సానుభూతిగా తల ఊపాడు కృష్ణుడు.

“అసలిదంతా ఏమిటి? ఆ గయుడేదో అంటే మాత్రం నువ్వు చంపుతాననాలా? ఆ పైన సెక్యూలర్ వోట్లకోసం నిన్ను వ్యతిరేకిస్తూ స్టేట్మెంటు ఇవ్వక నేను చావనా? అన్నీ తెలిసిన వాడవు నువ్వు నన్నలాంటి ఇరకాటంలో ఎందుకు పడేసావ్?“ అర్జునుడికి మళ్లి ఉక్కురోషం ఎక్కేస్తోంది.

మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చింది. “అవునుగానీ, అసలు ఈ జీపు సవారీ ఏంటి? ఇంట్లోనే మాట్లాడవచ్చుగా? జీపంతా చెకింగు చెయ్యాల్సిన అవసరం ఏమొచ్చిందిటా?”

మౌనంగా బండిని రోడ్డు తప్పించి, సముద్రం కేసి ఇసక మీద నడిపించాడు కృష్ణుడు. అమావాస్య కావడాన్న సముద్రం పోటు లేదు. జీపుని నీటి ఒడ్డున ఆపాడు. ఒక వైపు సముద్రం, మరోవైపు భూమి. మధ్యలో బండి, అందులో కృష్ణార్జునులు. చుట్టూ ఎవరూ లేదు. సముద్రం ఘోష తప్పిస్తే అంతా నిశ్శబ్దం.

కృష్ణుడు ఆందుకున్నాడు.

“నిన్ను కూచోబెట్టుకుని జీపు నడపడం, జీపులోనే నీతో ఉన్నది ఉన్నట్టు మాట్టాడ్డం, అందులో ఏదో ప్రత్యేకత ఉంది. తరవాత్తరవాత అది నీకే తెలుస్తుంది. చెకింగంటావా, బగ్గీలో బగ్గులుంటాయని అనుమానం. అదుగో మళ్లీ వెర్రి మొహం పెట్టకు. బగ్గుల విషయం తరవాత. అసలు పాయింట్లోకి వద్దాము నీకు ఖాండవ దహనం జ్ఞాపకం ఉందిగా?“

“ఆ అదే మన ఇంద్రప్రస్థం ప్రాజెక్టు.”

“అందుకోసం ఖాండవవనాన్ని కాల్చావు, అందులో జనాలు చచ్చిన వాళ్ళు చావగా, తత్తిమ్మా వాళ్లు దిక్కులేక చెల్లాచెదరైపోయారు. జంతువుల అవస్థ చెప్పక్కర్లేదు. చెట్లు సరేసరి.”

“అభివృద్ధి కావాలంటే తప్పదుగా మరి? ఉద్యోగాలు కూడా పెరిగాయి. అక్కడి వాళ్ళ మయుడు & కో కే కదా ఇంజనీరింగు, లేబరు కాంట్రాక్టులు ఇస్త?”

“నిన్ను తప్పు బట్టాలని కాదు ఆ విషయం ఎత్తడం. అప్పుడు నువ్వు చేసిన పనికి ఓ పేరుంది. జీవఖండ వధ, ఈకోసైడ్. అంతర్జాతీయ చట్టాల దృష్ట్యా చాలా పెద్ద నేరం. గయుడి ఎన్జీవో నీ మీద ఆ నేరం మోపే సన్నాహాలు చేస్తోంది.”

“అదేమిటీ, గయుడి మేనమామ కుబేరుడే ఆ ప్రాజెక్టులో మనకి ఋణదాతా, భాగస్వామిన్నీ కదా?”

“ఇప్పుడు కాదు. అంటే ప్రత్యక్షంగా కాదు. పరోక్షంగా అవును. తన హోల్డింగ్సన్నీ పట్టుబడకుండా పకడ్బందీ చేసి పెనామా బేనామీలోకి మార్చుకున్నాడు.”

“అయినా, ఈ అంతర్జాతీయ చట్టాలతో మనకేం నిమిత్తం? వాళ్ళ గొడవ వాళ్ళది, మన పని మనది.”

“కావచ్చు. అయినా, మనకేం నిమిత్తం అనడం పొరబాటు అవుతుంది. కుబేరుడు మనకి అప్పిచ్చాడంటే ఏదో ముందు డబ్బిచ్చి ఆ పైన కొన్నాళ్ళాగి వడ్డీతో వాపసు తీసుకోడం తో ముగిసే వ్యవహారం కాదు. ఎల్లకాలం మన్నీ, దేశంలో వనరుల్నీ, ఉత్పత్తి సాధనాల్నీ, తన గుప్పిట్లో పెట్టుకోడమే పరమార్థం. అవసరానికని చిల్లర డబ్బులు అప్పిచ్చి, ఆమీద రైతుని తరతరాలపాటు వెట్టిచాకిరీలోకి దించే పద్ధతి ఎరుగుదువు కదా, ఇదీ అంతే.”

“ఏమో నాకంతా అయోమయంగా ఉంది. మన దగ్గిర పెట్టుబడికి డబ్బు లేకే కదా, కుబేరుడి అప్పు పట్టింది? వాణ్ణి భాగస్వామిగా పెట్టుకుందీ? మన్ని కేసు బనాయించి లోపలేస్తే వాడికేం ఒరుగుతుందీ?”

“ఎన్నికల టైములో గయుడు నీ మీద వాళ్ళ హేగులో కేసు పెడతాడు. కేసు కారణంగా యాగీ అయ్యి నువ్వు నెగ్గవనుకో, మరెవరధికారంలోకి వచ్చినా, నీకున్నలాంటి చరిత్రే కాస్త అటూ ఇటూగా వాళ్ళకీ ఉంటుంది, నీ కేసు చూసి ఝుడుసుకుని, ఆ మటుకుని బుద్ధిగా కుబేరుడికి విధేయులై, దేశాన్ని వాడికప్పగించి, వాడు విదిల్చిన ఎంగిలి మెతుకులు మేస్తూ పాలిస్తారు. ఇందాక చెప్పిన వెట్టిరైతు వంట చెరుకుకోసం అడివిలో చెట్లు నరికాడనుకో, వాడి మీది ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్లు కేసు పెడతారు. ఆ కేసు తప్పుకోవాలంటే, ఆ ఆఫీసరు మేనమామని––అదే రైతుకి అప్పిచ్చినవాడున్నాడే, వాణ్ణే––దాసోహమనక తప్పదు. ఇదీ అంతే. కాస్త అమౌంటు తేడా తప్పితే.”

“మరి నేను ఎలాగోలా ఎన్నికల్లో నెగ్గితేనో?”

“మున్ముందు ఒళ్ళు దగ్గిరెట్టుకుని, కుబేరుడికి ఒదిగి ఉంటావు. ఎన్నికలనేవి మళ్లీ మళ్ళీ వస్తూనే ఉంటాయి. ఇవాళ గెలిచావని రేపు గెలుస్తావన్న నమ్మకం లేదు. మధ్యలో ప్రజా ఉద్యమాలూ, వీధి విప్లవాలూ అనేవి ఉండనే ఉన్నాయి. కుబేరుడు తలుచుకుంటే, వాటికి కొదవ లేదు.”

“అద్సరే, గయుడు మతాన్ని తిట్టడం ఏమిటి?”

“గయుడి లాంటి కుబేరుడి మేనల్లుళ్ళకి తాము దేన్నిగురించి ఎలా మాట్టాడినా చెల్లుతుందన్న ధీమా ఉగ్గుపాలతో వంటపడుతుంది. వాడన్నదాన్ని మతదూషణగా భాష్యం చెప్పడం మనకో లెక్కేం కాదు. భోజనరావూ, వాడి KLHM ఛానలూ, ఇంకా మీ నారదరావూ వీళ్ళంతా మన దగ్గిరా, సెక్యూలర్ వాళ్ళదగ్గిరా, కుబేరుడి దగ్గిరా కతుకుతారు. తెలివిగా కల్లోలం సృష్టిస్తారు. గయుడు ఉండబట్టలేక మతం గురించి ఏదో ఒక పొల్లుమాట అనక మానడని నాకు తెలుసు. నేను గయుణ్ణి చంపుతానని ప్రత్యేకించి అనక్కర్లేదు. నేను అలా అన్నానని భోజనరావుచేత టీవీ ఛానల్లో అనిపిస్తే చాలు. ఆపైన నారదరావు నీకివ్వాల్సిన సలహా ఎలాగూ ఇస్తాడు. కథ కంచికీ, డ్రామా ఢిల్లీకీ చేరుకుంటాయి.”

“గయుడిమీద ధ్వజం ఎత్తడం వల్ల మనకేం ప్రయోజనం?”

“డబ్బు తక్కువుండి ఆశ ఎక్కువున్నమనబోటిగాళ్ళ జుట్టు కుబేరుడి చేతుల్లో ఉంటే ఉండవచ్చు, కానీ, వాణ్ని కూడా ఇబ్బందుల్లో పెట్టడం మనకీ చాతవునని వాడికి మెసేజి వెళ్ళాలి. నేను చేసిందదే. ప్రస్తుతానికి నీ మీద కేసు విరమిమచుకుంటాడో, స్థాయి పెంచుతాడో, వాడి చేతులో ఉంది. దాన్ని బట్టి మనమూ తరవాయి కథ నడుపుతాం.”

“ఇంతా అయ్యాక మరిప్పుడు ఎలక్షన్నెల్లా? యాదవుల వోట్లు రావంటున్నాడే సాత్యకి?”

“సాత్యకి! వీడు నాక్కొన్నందాల సమస్యా, మరికొన్నందాల పరికరమూను. నన్ను తప్పించి యాదవుల నాయకుణ్ణైపోవాలని వాడి ఆశ. అందుకు సాంబుడూ, ఇతర యాదవ కుర్రాళ్లనీ ముసలం ఫాక్షన్‌గా కూడగట్టి దుండగీళ్ళుగా తయారు చేసాడు. మా పరివారం కొంతమంది కూడా వాడి పక్షం అయిపోతున్నారు ఇటీవల. నేనుత్తుత్తి సుత్తి కబుర్లు చెప్పే పాలకోవాగాణ్ణీ, ఎగస్పార్టీ నాయకులతో రాసుకుపూసుకు తిరిగి, మన మతాన్ని వాళ్ళు అవమానించినా చిద్విలాసంగా చూస్తూ ఊర్కుంటానూ, అని వీళ్ళఅభిప్రాయం. ఇందాక గోపికల వైఖరి చూసావుగా, గయుణ్ణి చంపకుండా వదిలేసానని వాళ్ళకి కోపం. అక్రూరుడు కూడా ముభావంగా ఉంటున్నాడు.

వీళ్ళందర్నీ దారిలోకి తీసుకురావలంటే చక్రం తిప్పాలి. గయుడి కేసులో హడావిడి చేసి భీభత్సం సృష్టించడానికి సాత్యకిని వాడుకున్నాను. ఈ డ్రామా వల్ల వాడి మీద నాదే పైచేయి అయ్యింది. కల్లోలం ఏ వెధవైనా సృష్టించగలడు. ఇట్టే సృష్టించిన కల్లోలాన్ని అట్టే అదుపుచేసి అంతర్థానం చెయ్యడమే ప్రజ్ఞ.

గయుణ్ణి బెదిరించకుండా నేను మడి కట్టుక్కూచ్చుంటే నన్ను పక్కకి నెట్టేసి సాత్యకిగాడే నాయకుడైపోగలడు. అలానే జరిగితే, అంతర్యుద్ధం తెచ్చి పెడతాడు. దాంతో ఇంద్రప్రస్థం లాంటి ఎన్నెన్నో ప్రాజెక్టుల్లో కుబేరుడు పెట్టిన డబ్బంతా ఉష్ కాకీ అయిపోతుంది. అంతా అనిశ్చిత పరిస్థితి నెలకొంటుంది. దేశం కళ్ళాలు వాడి గుప్పిట్లోంచి జారిపోతాయి. అదంతా వద్దనుకుంటే కుబేరుడు నాతో సహకరించి నీమీద కేసు విరమించుకోక తప్పదు. కుబేరుడు వెర్రివెధవైతే ఇంత వాడు కాలేడు. అందుకే ఈ విషయం వాడు గ్రహిస్తాడననే అనుకుంటున్నాను. గ్రహిస్తే స్థాయి పెంచక, కాల్పుల విరమణకి ఒడబడతాడు. లేదా, అంతర్యుద్ధానికి మనం సిద్ధమే. ఉన్నాయిగా మీ జమ్మిగోడౌన్లో అస్త్రాలు అవీనీ?"

అర్జునుడు గుడ్లప్పగించి తలూపాడు.

"ఇంక నువ్వడిగిన ప్రశ్న: బగ్గుల గురించి. సాత్యకి గాడు నా మీద స్పయింగు చేస్తున్నాడు. అందుకే జీపు చెక్ చెయ్యడం."

"అర్థం అయ్యింది. కానీఎన్నికల మాట చెప్పావుకాదు. యాదవుల వోట్లన్నీ సాత్యకి చేతుల్లో ఉన్నాయేమో కదా?"

"నిజమే. నీకా వోట్లు ప్రస్తుత పరిస్థితుల్లో రావు. నువ్వు నెగ్గితే నాకు బలం, అది వాడికి పనికి రాదు. సాత్యకి ముసలం గాంగు నేను చెప్తే వినే స్థితిలో లేరు. ఉగ్రసేన తాతయ్య కూడా వాళ్లవైపే మొగ్గుతున్నాడు. పరివారం సంగతి చెప్పాను కదూ?"

"మరయితే, ఇప్పుడెలారా బావా?"

కృష్ణుడి దృష్టి ఫలకంలో ఏదో తళుక్కుమంది. అల్లంత దూరంలో సాత్యకి దగ్గిర సుపారీ పుచ్చుకున్న బోయవాడు నైట్ విజన్ బైనాక్యులర్లతో జీపుని పరకాయిస్తుండటం గ్రహించాడు.

ఓ నిమిషం మౌనంగా ఆలోచించాడు.

"చూడూ, నువ్విందాక అన్నావు కదా, సన్యాసం అని. అది మరీ అంత చెత్త ఆలోచన కాదులే. పుచ్చేసుకో. పర్మనెంటుగా కాదులే. ఈ ఎలక్షన్లలో పదవి వద్దూ, త్యాగం చేసి దేశోద్ధారణకి దేశసంచారం చేపడుతున్నాను, అని ఓ స్టేట్మెంటియ్యి. మీడియా వాళ్ళని వెంటేసుకుని కేమేరాలు చూస్తూండగా దరిద్రుల్ని ముద్దెట్టుకుని నెత్తినెట్టుకో. వాళ్ళిళ్ళల్లో దూరి అన్నం తిను. కాషాయగుడ్డలు నీకు బాగా సూటవుతాయి గూడాను. సుభద్రనడుగు, చెప్తుంది. అలా చేస్తివా, పై ఎలక్షన్లకి నీకు వోట్లే వోట్లు. సాత్యకీ గీత్యకీ ఎందుకూ పనికిరారు."

"మరి ఈ ఎలక్షన్ల మాటో?"

"సుభద్రని నుంచోబెడదాం."

"సుబ్బులునే?"

"అవును. సాత్యకి గాడు సుబ్బులు విషయంలో గీగా అంటే బలరామన్నయ్య వాడి వీపు చీరేస్తాడు. ఉగ్రసేన తాతయ్య కూడా ఊరుకోడు. అది వాడికీ తెలుసు. ముసలం గాంగుక్కూడా సుబ్బులంటే భలే ఇష్టం. చచ్చినట్టు దారిలోకొస్తాడు వాడు. ఈ లెక్కన, యాదవుల వోట్లకి ఢోకా ఉండదు. ఇంక సెక్యులర్ వోట్లంటావా, ఇవ్వాళరేపు అంతా ఫెమినిజం కదా, పైగా మన సుబ్బి భలే గ్లామరస్సు, అంచేత అటేపు నుంచి వోట్లు బానే పడతాయి. ఇంకా లోపాయకారీ దొడ్డిదారీ వ్యవహారాలకొస్తే, ముందు చూపుతో దాన్ని బలరామన్నయ్య ఒకచెంప సంప్రదాయమో అని ఊ గగ్గోలెడుతున్నా వినిపించుకోకుండా, నేను కాన్వెంటు చదువూ, ఆ పైన తెల్లోళ్ళదేశంలో పై చదువులూ చెప్పించా. అంచేత, ఆ సెక్యులర్ లోకంలో దీనికంతా దోస్తులే. ఆపైన ఎవరన్నా తోక ఝాడిస్తే వెనకాల మన బలగం ఉండనే ఉంది. వెరశి జయం

నిశ్చయం. గెలిచాక సుబ్బి పాలన అప్రతిహతం. కుబేరుడంట, వాడి అల్లుడంట. దార్లోకొచ్చి వాడు బాగుపడి మన్ని బాగుపడనిస్తాడా, సరేసరి. లేదంటే, రానీ! చూసుకుందాం. జమ్మి గోడౌన్లో అస్త్రాలకి బాగా సాన పెట్టించి రెడీగా ఉంచు.

ఇదిరా బావా, నీ సమస్యకి పరిష్కారం. ఏమంటావు?"

"అనేందుకేముందీ? అయోమయమంతా పోయింది. నువ్వేమిటో, నేనేమిటో, మనమేమిటో అర్థం అయ్యింది. మనస్సు కుదుట పడింది. డౌట్లన్నీ తీరాయి. అంతా నీ చలవ బావా, నువ్వు చెప్పినట్టే చేస్తాను.

అవునుగానీ బావా, ఓమాటు సుభద్రని కూడా అడగాలిగా మరి, అసలు తనకిష్టమోలేదో, తన అభిప్రాయమేమిటో?"

కృష్ణుడికి చాలా హాయిగా ఉందిప్పుడు. ఆనందాతిరేకంలో మరేం వినిపించలేదతనికి. "ఆనందమానందమాయెనే, మా చెల్లాయి దేశనేత ఆయెనే..." అంటూ కూనిరాగం ఆలపిస్తూ జీపు స్టార్టు చేసాడు.

సంజయ ఉవాచ:
యత్ర యోగేశ్వర కృష్ణో యత్ర పార్థో ధనుర్ధర:
తత్ర శ్రీ విజయోర్భూతి ధృవానితిర్మతిర్మమ
ఓం శాంతి శాంతి శాంతి:

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం విజేత

# జనని-జన్మభూమి

శ్రీనివాస ఫణి కుమార్ డొక్కా (Atlanta, GA)

"అమ్మా, ఇంకెప్పుడూ ముల్లు గుచ్చుకోనే. నాకిక్కడ భయం వేస్తోంది. ఇంటికెళిపోదామే".

"వెళిపోదాం నాన్నా. డాక్టర్ గారొచ్చి, ఓ మాటు కాలు చూసి టాబ్లెట్టిస్తారు. ఇవ్వగానే ఇంటికెళిపోదమే."

"అమ్మా నాకు ఇంజెక్షనొద్దే".

"ఛఛ ఇంజెక్షనివ్వరు నాన్నా, ఉత్తినే ఓ మాటు చూసి, టాబ్లెట్లు రాసిస్తారు. నీకు కాలు నొప్పెడుతోందికదా,
ఆ నొప్పి పోవడానికీ, జెరం రాకుండా ఉండడానికీ మాత్రలిస్తారన్నమాట".

" పెద్ద మాత్తర్లా ?"

"తెలీదు. పెద్దమాత్తర్లైనా వేసుకోవాల్సిందే. లేకపోతే, రోజూ వచ్చి ఇంజెక్షన్లు చేయించుకోవాలి. ఇంటికెళ్ళాకా మళ్ళీ పేచీలు పెట్టకూడదు మాత్రేసుకోవడానికి. చక్కగా పాలతోటి గబుక్కున వేసేసుకోవాలి, తెలిసిందా"

" సరే అమ్మా. అమ్మా ఇక్కడొద్దే, ఇంటికెళిపోదామే. నాకు భయంగా ఉంది" అన్నాను.

డాక్టర్ శ్రీధర్రావు గారి ఆసుపత్రి. ఒక గోడ మీద నోటి మీద వేలెట్టుకుని "ఉష్" అంటున్న పిల్లవాడు. ఒకవైపు సిరంజిలు మరుగుతున్న గిన్నె. ఒకవైపు చేతులు కడుక్కునే వెడల్పాటి తెల్లటి పింగాణీ పాత్ర. ఆకుపచ్చ గుడ్డ కప్పిన సన్నని టేబుల్ మీద నేను. పక్కనే గాడ్రేజి కుర్చీలో అమ్మ. అవతల ఇంకా నాలుగు రూములు. వాటిల్లోంచి ఏవో పిల్లల ఏడుపులు, పెద్దవాళ్ళ మాటలూ, నర్సుల హెచ్చరికలూ వినబడుతున్నాయి. నాకు మనసంతా అదోలా అయిపోతోంది. అసలు ఆటల్లో నాకే ఎందుకు గుచ్చుకోవాలి ఈ ముల్లు. అందరం ఆడాం కదా. ఏం, ఆ గోపి గాడికి గుచ్చుకోవచ్చు కదా అనిపించింది. అంతలోనే మళ్ళీ, అయ్యో పాపం గోపీగాడికి అమ్మ లేదు. వాళ్ళ అమ్మమ్మగారు పాపం వాణ్ణి ఆసుపత్రికి తీసుకురాలేరు కదా. అందుకనే మళ్ళీ అనిపించింది. నాకు గుచ్చుకోవడమే కరెక్టని. నాకు ఏమైనా భయంలేదు, అమ్మ ఉందిగా, అన్నీ చూసుకుంటుంది.

ఇలా ఏవో ఆలోచిస్తున్న నాకు ఎప్పుడు మత్తు ఇంజెక్షనిచ్చారో, ఎప్పుడు ముల్లు బైటికి తీసి కట్టు కట్టారో తెలియనే లేదు. తెలియనివ్వలేదు అమ్మ. నేను ఏడుస్తూ ఉంటే, రిక్షా కట్టించి తీసుకొచ్చి మా పట్టె మంచం మీద పడుకోబెట్టి, పక్కనే కూర్చుని, మెల్లిగా విసిన కఱ్ఱ తో విసిరింది. సాయంత్రం అవగానే అన్న, నాన్నగారు వచ్చేస్తారు. మా ఇంట్లో హాయిగా ఉండచ్చు నేను. మా ఇంట్లో నేనుండి, మా అమ్మ నా కళ్ళముందు ఉంటే అంతకు మించిన భద్రత ఎక్కడుంది? అసలు ఎవరికైనా ఇంతకంటే ఇంకేమి కావాలి?"

గణ గణ మంటూ అల్లారం మోగింది, కల చెదిరిపోయింది. నలభై ఏళ్ళు ఇవతలికొచ్చేసాను. ఒక్కమాటు కల నెమరువేసుకుని, నవ్వుకుని, లేచి, ఆహ్నికాలన్నీ పూర్తిచేసి, ఆఫీసు పని మొదలెడదామని లేప్ టాప్ తీసేప్పుడు గుర్తొచ్చింది. ఇవాళ గురువారం. అంటే ఇవాళ నా పేరు ఫణి కాదు. శ్రీరాం. అది జ్ఞాపకం చేసుకునే లోపే శ్రీరాం నించి ఫోనొచ్చింది " ఫణీ, మళ్ళీ గురువారం వచ్చేసింది. నేను ఏంస్టర్ డాం లో ఉన్నాను. ఇవాళ నీకు వీలవుతుందా, అమ్మ దగ్గరకి వెళ్ళడానికి?". "ఓ ష్యూర్. తప్పకుండా. ఇప్పుడే పిల్లల్ని స్కూళ్ళలో దింపేసి వచ్చాను. మరో పది నిముషాలలో మీ ఇంట్లో ఉంటాను. సరేనా." అన్నాను. "నీకు ఎలా థాంక్స్ చెప్పాలో తెలీదు ఫణీ.." అంటూంటే అడ్డు తగిలి "అబ్బా శ్రీరాం, ఎవరి అమ్మైనా ఒకటే. నేను వారమంతా గురువారం కోసమే ఎదురు చూస్తాను. ఇవాళ బోలెడన్ని వీడియో లింకులు రెడీ చేసాను అమ్మకోసం. మన బిగ్ స్క్రీన్ కి కనెక్ట్ చేసి, అమ్మకి అడిగినవన్నీ చూపిస్తాను. మనం కలుద్దాం. నువ్వు రేపు రాత్రికి ఒస్తావు కదా?" అన్నాను. "యా, రేపు లేట్ నైట్ కి దిగుతాను. కలుద్దాం. ఉంటానేం" అని ఫోను పెట్టేసాడు శ్రీరాం.

అమ్మ పేరు కౌసల్య. వయసు ఎనభై. వీల్ చెయ్యిర్లోనే ఉంటారు. రోజూ క్రిష్టల్ వచ్చి ఆవిడకి స్నానం చేయించి, చక్కటి బట్టలు వేసి వీల్ చెయిర్లో కూచోబెడుతుంది. పచ్చటి శాలువా కప్పుకున్న అమ్మ, గూట్లోంచి పిల్లలరాకకోసం ఎదురుచూస్తున్న గువ్వ లా ఉంటారు. ఆవిడకి, ఇంట్లో చేసి పెట్టిన సూపు, జావ ఇలా ఆరారగా తాగిస్తుంది క్రిష్టల్. రోజుకి మూడు సార్లు వేరే వేరే మాత్రలతో కడుపునింపుతుంది. ఆవిడకి ఎన్నో ఆరోగ్య సమస్యలున్నాయి. అవన్నీ వరసగా రాస్తే, పది పేజీలు నిండిపోతాయి. వాటన్నిటినీ మించిన బెంగ ఉంది. మనసు మనసులో ఉండదు. మెదడు మెదడులో ఉండదు. ఆ మందుల ప్రభావం వల్ల రోజంతా ఇంచుమించు నిద్ర మత్తులో జోగుతూ ఉంటారు. అయితే ఎప్పుడూ అలా ఉండడం మంచిదికాదని అప్పుడప్పుడూ ఆవిణ్ణి ఏదో ఒక విధంగా ఎంగేజ్ చెయ్యడం చాలా ముఖ్యమనీ డాక్టర్లు చెప్పడం వల్ల, ఆవిడ రూములో ఒక పెద్ద స్క్రీన్ టీ.వీ కూడా పెట్టి, దానిలో ఏవో సీరియళ్ళూ, పాటలూ వచ్చే ఏర్పాటు చేసాడు శ్రీరాం. అలా కొన్నాళ్ళు నడిచింది. ఇప్పుడు ఆ టీవీ చూస్తూ చూస్తూనే నిద్రపోవడం, ఏవో మాటలు, ఎప్పటివో సంఘటనలూ, కలవరింతలూ, "ఇక్కడ బావులేదురా, మనం హాయిగా ఇంటికెళిపోదాం" అంటూ ఉండడం, అకారణంగానే క్రిష్టల్ మీద విసుక్కోవడం, ఆవిడ ఇచ్చిన మందులు వేసుకోనని మొరాయించటం చేస్తున్నారు. అయితే క్రిష్టల్ కి భూదేవికి ఉన్నంత సహనమూ, ఓపికానూ. ఎంత కష్టం వచ్చినా పెదాల మీద చిరునవ్వు వెలుగుతూనే ఉంటుంది.

ప్రతి గురువారం అమ్మకు కాస్త ఆటవిడుపు, క్రిస్టల్ కు కాస్త తీరిక దొరికే సమయం. ఆరోజున ఆవిడకి ఎక్కువ మాత్రలు ఇవ్వరు. ఏవో కొన్ని అత్యవసరమైనవి మాత్రమే ఇస్తారు. దానితో నిద్ర అంతగా రాదు. గురువారం ఆవిడ మెలకువగా ఉండే రోజన్నమాట. ఆ రోజు ఆవిడ ఎన్నో దశాబ్దాలలో జీవిస్తారు. ఎన్నో పాత్రలు ధరిస్తారు. ఎక్కడెక్కడికో వెడతారు. ఏవేవో ముచ్చట్లు చెబుతారు. తన గతం అనే చలన చిత్రాన్ని ఒక రంగస్థల నాటకంగా మన కళ్ళముందు ఉంచుతారు. ఆవిడ పాత్ర కౌసల్య పాత్రే. అయితే ఆ కౌసల్య వయసు అలా అలా మారిపోతూ ఉంటుంది. నా పాత్ర పేరు శ్రీరాం. నాకు ఇద్దరు అక్కలు. పెద్దక్క లలిత, చిన్నక్క హేమ. నాన్న గారు సుబ్రహ్మణ్యం గారు. కాలేజీ లెక్చరర్ గారు. ఆవిడ మాటలనిబట్టి మా పాత్రల వయసులన్నీ మారిపోతాయి. అక్కడ ప్రత్యక్షంగా ఉన్న పాత్రలు రెండే కౌసల్య, శ్రీరాం. పరోక్షంగా అవతల గదిలోనో ఎక్కడో ఉండే మిధ్యా పాత్ర సుబ్రహ్మణ్యం గారు. మిగిలిన పాత్రలన్నీ ఎక్కడెక్కడున్నాయో, ఎలా ఉన్నాయో నేను కల్పించి చెప్పాలి. కోడలు మైథిలి గారు డాక్టరు. పగటి వేళ క్రిస్టల్ ఎంత ఆప్యాయత చూపిస్తుందో, దానికి మూడు రెట్లు ప్రేమను, అనురాగాన్నీ చూపిస్తారు మైథిలి, అత్తగారిపైన. కంటికి రెప్పలా చూసుకుంటారు తన అత్తయ్యగారిని. మైథిలి గారు ఆసుపత్రినించి వచ్చే వరకూ మా నాటకం జరుగుతుంది. చీకటి పడేవేళకి అమ్మకు మళ్ళీ నిద్ర పట్టే మాత్రలు ఇచ్చి ఇంటికెళిపోతుంది క్రిస్టల్. అమ్మ మెల్లిగా నిద్రలోకి జారుకోగానే, ఆవిణ్ణి మైథిలి గారికి అప్పచెప్పి నేను వచ్చేస్తాను. ఇదీ గత కొన్ని గురువారాలుగా నా వ్యాపకం.

బయల్దేరి అమ్మని చేరే సరికి పది. పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుని, నవ్వుతూ కుర్చుని ఉంది వీల్ చెయిర్లో. క్రిస్టల్ నన్ను చూసి, నవ్వుతూ పలకరించి, బట్టలు ఉతకడానికి లోపలికెళ్ళింది. నేను వెళ్ళి అమ్మని పలకరించాను "అమ్మా. ఎలా ఉన్నావు?". "బావున్నాన్రా. ఏరీ నాన్నని పిలు, లలిత కి రాష్ట్ర పరీక్ష ఫీజు కట్టారో లేదో కనుక్కోవాలి" అంది. నేను వెంటనే "నాన్నా, అక్క కి హిందీ పరీక్ష ఫీజు కట్టావా" అన్నాను పెద్దగా. "అబ్బ, ఆ పెరట్లో ఉండి ఉంటారు. పనస కాయ కోసుకొస్తానని వెళ్ళారు." అంది. "అవునా, సరే, నేను వెళ్ళి కనుక్కొస్తా" అని బైటికెళ్ళి, కాసేపు ఆగి లోపలికొచ్చి "ఎప్పుడో కట్టేసారుట. నీకు నిన్ననే చెప్పారటకదా. ఈ మధ్యన నువ్వు అన్నీ మర్చిపోతున్నావమ్మా" అన్నాను నవ్వుతూ. "నిజవే రా, పెద్దతనం వచ్చేసింది. చప్పున ఏవీ గుర్తుండట్లేదు. ఇంతకీ ఇదేం నెల ?" అంది. నేను నా లేప్టాప్ బయటికి తీస్తూ "జనవరి అమ్మా "అని అబద్ధవాడేసాను, నా దగ్గర ఉన్న వీడియోలు గుర్తుచేసుకుంటూ. మెల్లిగా లేప్టాప్ టీవీకి కనెక్ట్ చేస్తున్నాను. కాసేపు ఆవిడ నిశ్శబ్దంగా ఉన్నారు. "జనవరి, పుష్యమాసం.., సంకురాత్రి. జగ్గంతోట ప్రభల తీర్థం. కామాక్షమ్మగారి మనవడు తప్పిపోయాడు. పాపం ఆవిడ్ని ఎవరు ఓదారుస్తారు?" అంటోంది అమ్మ మెల్లిగా. నేను నాకు కావలసిన టాపిక్ మాత్రమే గుర్తు చేస్తూ "ప్రభల తీర్థం జరిగింది నిన్న. నువ్వు వీల్ చెయిర్లోంచి కదలకూడదన్నాడు కదా డాక్టరు. అందుకే నేను వెళ్ళి వీడియో తీసుకొచ్చా. ఎంత బాగా చేసారనుకున్నావు? చూస్తావా?" అన్నాను. ఆవిడ మొహం కాంతితో నిండిపోయింది. "ఓమాటు పెట్టరా, చూస్తాను. అయినా ఒక్కడివీ ఎలా వెళిపోయావురా?" అంది. నాన్న తీసుకెళ్ళారమ్మా. అక్కలిద్దరికీ బోలెడు గాజులు, బొమ్మలకొలువులోకి బొమ్మలు కొని తెచ్చాం. చూడు" అని ఆవిడ దృష్టి టీ.వీ మీదకి మార్చేసాను. ఎన్నో ఊళ్ళనించి వచ్చే ప్రభలు, ప్రభని మోసుకుంటూ ఏరు దాటటం, తీర్థము, జీళ్ళు, రంగులరాట్నాలు అన్నీ చూసి పరవశించిపోయింది అమ్మ.

కాసేపు చూసి, "రామా, నిన్న పెద్ద బావగారు ఫోను చేసారు. విష్ణు గాడికి చదరంగం లో ఫస్టు వచ్చిందిట. లలిత కి మీ నాన్న నేర్పించారు. అది వాడికి నేర్పింది. ఓ మాటు విష్ణు గాడికి ఫోను చెయ్యి, బాగా గుర్తొస్తున్నాడు" అంది అమ్మ. ఆ విష్ణు కి ఇప్పుడు 24 ఏళ్ళు. బోస్టన్ లో బ్రెయిన్ సర్జన్. వాడు చిన్నప్పుడు చెస్ ఆడిన రోజులనాటి జ్ఞాపకమది. శ్రీరాం కి టెక్స్ట్ చేసి, విష్ణు ఫోను నెంబరు తీసుకుని, ఫోను చేసి విషయం చెప్పాను. వాడు నవ్వి ఫోను అమ్మమ్మకి ఇవ్వమన్నాడు. ఇచ్చాను. "హాయ్ అమ్మమ్మా. నాకు రెండు ట్రోఫీలిచ్చారు చెస్సులో. నువ్వు హాలీడేస్ కి వస్తావుకదా, అప్పుడు చూపిస్తా" అన్నాడు మెల్లిగా. ఆవిడ నవ్వుతూ "వస్తాలే. అందాకా బాగా చదువుకో. ఏదీ అమ్మకియ్యి

ఒకమాటు" అంది. "అమ్మ, కూరలుతేడానికెళ్ళింది. రాగానే ఫోను చెయ్యమంటాలే" అన్నాడు. "సరే నాన్నా. బాగా చదువుకో.." అనేసి ఫోను పెట్టేసింది ఆవిడ. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాను నేను.

"విష్ణు గాడు పెద్దపిల్లాడైపోతున్నాడురా. గొంతులో చిన్నతనం పోతోంది" అంది మురిపెంగాను.

"అవునమ్మా. అందరం పెద్దవాళ్ళమౌతున్నాం కదా. అలాగే వాడూను" అన్నాను ఆలోచిస్తూ. ఆవిడ కాసేపు చాలా మౌనంగా ఉండిపోయింది. "అవును, పెద్దదాన్నయిపోయాను. నాకిక్కడ బాలేదు. మన వూరు వెళిపోదాం. మన ఇంటికి వెళిపోదాం. అక్కడ మన మండువా ఇంట్లో హాయిగా అందరం ఉందాం. ఇక్కడ బాలేదు. రామం, నన్ను ఇంటికి తీసుకెళిపోరా. మన మాలతీ పందిరి ఎలా ఉందో. మన గోరింటాకు చెట్టుకి అద్దెవాటావాళ్ళు నీళ్ళు పోస్తున్నారో లేదో. మన నూతి గట్టు పక్కన ఉన్న కనకాంబరాలు పూస్తున్నాయో లేదో. ఒరేయ్, రామం, నాకు ఈ అమెరికా, ఈ డాక్టర్లూ, ఈ క్రిస్టలూ వద్దురా. మనం ఇంటికి వెళిపోదాంరా. మొన్న కోడలికి కూడ చెప్పాను. సరే అందిరా బంగారు తల్లి. మరి వెళిపోదామా?" అంది బేలగా.

నేను ఒక్కమాటు ఆవిడ కళ్ళలోకి చూసాను. అదే చూపు. చిన్నప్పుడు అమ్మ నన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళినప్పుడు నేను అమ్మతోటి బేలగా "అమ్మా, ఇంటికెళిపోదామే" అంటూ చూసిన అదే చూపు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఎలానటించాలో తెలియలేదు. ఒక్కమాటు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పక్కకు తిరిగి కళ్ళు తుడుచుకున్నాను.

ఇక్కడ ఊడలు దిగిన మఱ్ఱి చెట్లలాంటివాళ్ళం మేమంతా. ఇప్పుడు ఇదే మాలోకం. తల్లిదండ్రులని బోన్సాయ్ వృక్షాలుగా చేసి, వారి జ్ఞాపకాల ఊడలని అందంగా కత్తిరించి, వారిని మా కళ్ళ ముందుంచుకుని, కంటికి రెప్పలా కాపాడుకుంటున్న మాకు, మేము చేస్తోన్నది పాపమో పుణ్యమో తెలియదు. అందరం ఒకచోట ఉండటంలోనే మాకు ఒక భద్రత. నేనైనా, శ్రీరాం అయినా, లలితైనా, హేమ అయినా అంతే. ఉన్నంతలో, మాకు తెలిసినంతలో అమ్మనీ, నాన్ననీ సంతోషపెట్టాలని చూస్తున్నాం. ఎంతకీ తీర్చుకోలేని ఋణంలో ఏ వెయ్యోవంతో తీర్చుకుందామని, మా పరుగుల జీవితంలో, అమ్మనీ, నాన్ననీ ఎత్తుకుని పరిగెట్టాలని ప్రయత్నిస్తున్నాం. వారి మధురమైన పాత జ్ఞాపకాల ఊడలు మెల్లిగా త్రుంచేసి, అందమైన, ప్రశాంతమైన కొత్త ఊడలు సృష్టించాలని శ్రమిస్తున్నాము.

బోన్సాయ్ చెట్టు అట్టే నీరు తాగదు. అట్టే ఎరువులూ అడగదు. అది ఎంత ఎదగాలో మనమే నిర్ణయిస్తాము. వట వృక్షాన్ని పెంచేటంత స్థలం లేదు మా దగ్గర. అందుకే అనుభవాల కొమ్మల్నీ, జ్ఞాపకాల ఊడలనీ ఆరారగా కత్తిరిస్తూ, అందంగా, అపురూపంగా పెంచుకుంటాము. జీవం ఉంది కదా, బొమ్మ కాదు కదా అన్నదొక్కటే ధైర్యం. ఆ జీవం మాకు జీవం. ఆ జీవం మాకు స్ఫూర్తి. ఆ జీవం మాకు నమ్మకం. దాన్ని ఎంత పొడిగిస్తే మాకు అంత ధైర్యం. ఇదే మాకు తెలిసిన జీవన సూత్రం.

"మాట్లాడవేవిరా రామం. నన్ను మనింటికి తీసుకెళ్ళరా" అంది ఆవిడ. "తీసుకెళ్తా గానీ, ఇదిగో చూడు మన మాలతీ పందిరి ఎన్ని పూలు పూసిందో" అని ఒక ఫొటో, "మన గోరింట చెట్టు, మన తులసికోట" అని మరికొన్ని ఫొటోలు పెట్టాను. వాటి గురించి మళ్ళీ కొన్ని కథలు చెప్పాను. శ్రావణ మాసం, వరలక్ష్మీ వ్రతం గుర్తుచేసింది అమ్మ. రుమాలులో కట్టిన శెనగల ఫొటో చూపించాను. "ఎక్కువ తినకూడదు నాన్నా కడుపులో నెప్పొస్తుంది" అంది అమ్మ. ఇలా పొద్దు గడిచింది. సాయంత్రమయ్యింది. క్రిస్టల్ సాయంత్రం మాత్రలు వేసేసి, వెళిపోయింది. మైథిలి గారు వచ్చి వంట చేసారు. అమ్మ కి మెల్లిగా నిద్ర వస్తోంది. "అన్నట్టు, కామాక్షమ్మగారి మనవడు దొరికాట్ట, నాన్న చెప్పారు" అన్నాను. "కామాక్షమ్మెవరురా?" అంది అమ్మ. "హమ్మయ్య" అనుకున్నాను.

"సరే మరి, నేను ఒకమాటు విమానం వాళ్ళతో మాట్లాడి చూస్తాను. వాళ్ళు సరే అంటే రేపో ఎల్లుండో టికెట్లు చూసుకుని బయల్దేరి మన ఇంటికెళిపోదాం. సరేనా?" అన్నాను. "సరేరా, అన్నట్టు నీ ఆఫీసు ట్రిప్పేదో అన్నావు" అంది అమ్మ. "ఇదిగో, ఇప్పుడు వెళ్ళి మళ్ళీ

రేపొద్దున్నకొచ్చేస్తాను. మీ కోడలు గారు నీ ఫేవరెట్ సూప్ చేసారు. చక్కగా తాగేసి నిద్రపో, సరేనా?" అన్నాను నవ్వుతూ. అప్పటికే ఆవిడ కళ్ళు అర్థ నిమీలితాలౌతున్నాయి. మైథిలి గారు సూప్ తీసుకుని వచ్చారు. నేను వెళ్ళొస్తానని సంజ్ఞ చేసి మెల్లిగా బయల్దేరి వచ్చేసాను. ఆవిడ కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పారు.

జీవితంలో అందమైన జ్ఞాపకాల విరులను ప్రోగుచేసుకుని, దాచుకుని, ఆకురాలే కాలంలో కూడా వసివాడని కుసుమాల దండలు అల్లగలగడం ఒక వరం. మాయ చేసే మనసునే మాయ చేసి, గతాన్ని వర్తమానంగా మలచి ఆనందాన్ని పంచటం, ఆనందించటం ఒక కళ.

అసలు, బ్రతకడమే ఒక గొప్ప కళ.

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

## "నేను తప్పుచేశానంటావా?"

సాయి ప్రభాకర్ యర్రాప్రగడ(Winter Garden,FL)

"దివా! టైం ఎనిమిదవుతోంది. లేచి స్నానం చేయాలి. ఇంకో అరగంటలో కుళాయి కట్టేస్తారుట" అన్న భార్య మాటలకి మెలుకువొచ్చింది దివాకరానికి.

అబ్బా! ఇక్కడకూడా పడుకోనీయవా అంటూ బద్ధకంగానే లేచి బాత్రూంకి దారితీశాడు.

అంతకుముందు రోజే అమెరికా నుండి ఇద్దరు పిల్లలను తీసుకొని రెండువారాలు ఇండియాలో గడపటానికొచ్చారు దివాకరం, నీలిమ. రాజమండ్రి పట్టణాన్ని ఆనుకొని గోదావరి ఉన్నా వేశవి కాలం కావడంతో సగానికిపైగా ఎండిపోవడంతో నీటికుళాయి సరఫరాను ప్రొద్దున్న సాయింత్రాలకు గంట చొప్పున పరిమితం చేశారు. వీలైనంతవరకు కుటుంబం మొత్తం కుళాయి వెళ్ళేలొపులో నీళ్ళకార్యక్రమాలు కానిచ్చేసి, మిగతా నీటిని రెండు పెద్ద గుండిగలతో పట్టుకొని సాయింత్రం కుళాయి కోసం వేచిచూడడమన్నది పట్టణవాసుల దినచర్యలలో ఒక ప్రధానభాగమైపోయింది.

దివాకరం స్నానం చేసి హాల్లో కూర్చొని పేపర్ తిరగేస్తున్నాడు.

"టిఫిన్ తేవడానికి నాన్న హొటెల్ కి వెళ్ళారు. ఈలోపు కాఫీ తాగుతావా" అడిగింది నీలిమ.

"అలాగే, పిల్లలింకా లేవలేదా? రాత్రి బాగా లేటుగా పడుకున్నారనుకుంటా" అంటూ నీలిమతోబాటు కిచెన్ లోకి నడిచాడు దివాకరం.

"బాగా నిద్రబట్టిందా బాబూ" అని దివాకరాన్ని పలకరిస్తూ, "పాలు స్టౌ మీద పెట్టాను, ఫిల్టరులో డికాషను దిగే ఉంటుంది చూడు" అని కూతురికి పురమాయిస్తూ పెరట్లోకి దారితీసింది నీలిమ తల్లి.

రెండు స్టీలు గ్లాసుల్లో కాఫీ పోసి ఒకటి దివాకరానికిచ్చి, "నడు హాల్లో కూర్చొని తాగుదాం" అంది నీలిమ.

"ఈరోజు కార్యక్రమం ఏమిటి?" అన్నాడు మెల్లిగా కాఫీ సిప్ చేస్తూ.

"నువ్వేవో బట్టలు కొనాలన్నావు కదా? ఒకవేళ రెడీమేడ్ కాకపోతే, కుట్టివ్వడానికి టైం పడుతుంది" అంది నీలిమ.

" అవును కదా! అయితే ఈరోజే వెళదాం పద" అన్నాడు దివాకరం.

ఉదయం పదకొండుకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దివాకరం, నీలిమ షాపింగుకి బయలుదేరారు ఆటోలో.

కోటగుమ్మం గాంధీ బొమ్మదగ్గర ఆటో దిగి బట్టల కొట్టులు చూసుకుంటూ నడుస్తున్నారిద్దరూ. దాదాపు ఇరవై ఏళ్ళుగావస్తోంది రాజమండ్రి వదలి. ఊరు బాగా పెరిగిపోయింది. ఆటోలు మోటారు సైకిళ్ళు విపరీతమైపోయాయి. అసలే ఇరుకుసందు, ఆటోలు పోనివ్వరు కాబట్టి మోటారు సైకిల్ పై కుటుంబం మొత్తాన్ని ఎక్కించుకొని అడ్డంగా నడుస్తున్న జనాలను చాకచక్యంగా తప్పించుకొని వెళ్ళేవిధానం చూస్తుంటే ఇద్దరికీ ఆశ్చర్యంగాఉంది. ఆవీధొక చిన్న ప్రపంచం. అక్కడ దొరకని వస్తువంటూ ఉండదు. ముఖ్యంగా నల్లమందు వీధి, గుండువారి వీధి చాలా ప్రశిద్ధి. నాలుగడుగులు వేసారో లేదో ఒకటే ఉక్కబోత. ధారాళంగా చమటలు పడుతున్నాయి దివాకరానికి.

" అబ్బా! నావల్లకాదు! ఏదోఒక షాపులోకెళదాం పద!" అని దివాకరం అనగానే, సరేఅని అతనితోపాటు ఎదురు గుండా కనిపిస్తున్న మూడంతస్తుల బట్టల షాపులోకి నడిచింది నీలిమ.

లోపలికి అడుగుపట్టగానే ఏసి చల్లదనానికి ఒక్కసారి ప్రాణం లేచొచ్చినట్లయింది. ఒకనలుగురైదుగురు చుట్టూమూగి ఏం కొనాలనుకుంటున్నానో అడిగి మగాళ్ళ సెక్షన్ కి తీసుకుపోయారు. ప్యాంటు చొక్కాల తాన్లు షెల్ఫుల నిండానే కాకుండా నేలమీదకూడా గుట్టలుగుట్టలుగా పడిఉన్నాయి. చాలా కంఫ్యూజన్ లో పడిపోయాడు దివాకరం. ఇరవయ్యేళ్ళల్లో ఒక్కసారికూడా తనబట్టలు తను కొనుక్కోలేదు. ఎప్పుడూ భార్య కొని పట్టుకొచ్చినవి కట్టుకోవడమే. ఏం కొనాలో అర్థం కావడంలేదు. అందరూ తననే చూస్తున్నారు. కొంత ఇబ్బందిగా అనిపించింది.

"నావల్ల కాదుగానీ, నువ్వే కానిచ్చేసేయ్" అని నీలిమకి ఒక హింటిచ్చాడు దివాకరం.

భార్య చూపించినవాటికి తలూపుతూ మొత్తానికి ఒక అరడజను జతలు తీసుకొని క్యాష్ కౌంటర్ దగ్గరికి వెళ్ళి క్రెడిట్ కార్డిస్తూ "ఇక్కడెవరైనా బాగా కుట్టే టైలర్ ఉన్నడా" అని అడిగాడు.

“ప్రక్కనే గుండువారి సందులో టైలర్ ఖాదిర్ అని ఉన్నాడండి, బాగా కుడతాడు" అని అక్కడికి ఎలా వెళ్ళాలో చెప్పాడు కౌంటర్లో కూర్చున్న వ్యక్తి.

" దివా! నేను చీరలు చూస్తూఉంటాను, నువ్వెళ్ళొచ్చేయ్" అని నీలిమ చీరల సెక్షన్ లోకి నడిచింది.

బిల్లు చెల్లించి టైలర్ షాపుకి బయలుదేరాడు దివాకరం. అడ్రసు చాలా సులువుగానే దొరికింది. పెద్ద షాపేమీ కాదు, చిన్న అరుగుమీద ఒకే ఒక్క మిషను. ఒక చిన్న కుర్రాడు, సుమారు పది సంవత్సరాలుంటాయి చొక్కాలకి బొత్తాలు కాజాలు కుడుతున్నాడు.

"బాబూ! ఖాదిర్ షాపిదేనా" అడిగాడు దివాకరం ఆ కుర్రాడిని.

" లేదండి నమాజుకెళ్ళాడు ఒక అర గంటలో వస్తాడు" అని ఆ కుర్రాడు చెప్పి కూర్చోవడానికి స్టూలు చూపించాడు . దివాకరానికి అనుమానం వచ్చింది అసలు సరిగ్గా కుడతాడాని. కానీ ఆ ఎండలో మరి ఇంక తిరగడానికి సాహసించకుండా స్టూలుమీద కూర్చున్నాడు. ఆకుర్రాడినే చూస్తున్నాడు. హుషారుగా ఒక చొక్కా తరువాత మరొక చొక్కాకి కుట్టుకుంటూ పోతున్నాడు. చాలా చురుగ్గా ఒక యంత్రంలో పనిచేస్తున్నాడు.

" బాబూ నువ్వేమవౌతావు ఖాదిర్ కి" అడిగాడు దివాకరం.

"ఖాదిర్ మానాన్నండి. నా పేరు షాజహాన్" అని బదులిచ్చాడాకుర్రాడు.

" ఏం చదువుతున్నావు షాజహాన్" అని అడిగాడు దివాకరం.

" స్కూలు మానేశానండి. అయిదు దాక చదివాను" అన్న షాజహాను మాటల్లో కొంత బాధలాంటిది ధ్వనించింది.

దివాకరం ఆసక్తిగా మాటలు కొనసాగించాడు. తనకిద్దరక్కలున్నారని , సుమారు 3 మైళ్ళ దూరంలో కాలనీలో వాళ్ళిల్లుందని, వాళ్ళమ్మ ఇంటిదగ్గరే ఉన్న ఒక అపార్టుమెంటు వద్ద ఇస్త్రీ బండి నడుపుతుందని గడ గడా అచ్చ తెలుగులో చెప్పాడు. వాడి భాష చూసి ముచ్చటేసింది దివాకరానికి. టివి ఏంకర్ల తెలుగుతో అసలు తెలుగు మరచిపోతున్న ఈరోజుల్లో చక్కటి స్వరంతో గోదావరి యాసతో ఒక ముస్లీం అబ్బాయి ఒక్క అక్షరంకూడా పొల్లుబోకుండా చెప్పడంచూసి ఆశ్చర్యమేసింది.

ఇంతలో తెల్ల కుర్తా పైజమా, తెల్లని గడ్డం నెత్తిమీద టోపీ ఉన్న ఒక వ్యక్తి వచ్చి "నమస్తే సార్" అన్నాడు.

అతనే ఖాదిర్ అని అర్ధమైంది దివాకరానికి.

"ఇవి ఆరు జతలు, పది రోజులలో కుట్టివ్వాలి. కుదురుతుందా" అడిగాడు దివాకరం.

"అలాగే సార్" అని తలూపి టేపుతో కొలతలు తీసుకోవడం మొదలెట్టాడు ఖాదిర్. తండ్రి టేపుతో కొలతలు తీసుకొని చెపుతుంటే షాజహాను పుస్తకంలో రాస్తున్నాడు. ముత్యాల్లాంటి అక్షరాలు. ఏమాత్రం ఒంకరలులేవు. తనచేతివ్రాతని గుర్తుకుతెచ్చుకొని కొంచెం సిగ్గుపడ్డాడు దివాకరం.

"ఎన్నిరోజులలో కుట్టివ్వగలవో ఖచ్చితంగా చెప్పు" అన్నాడు దివాకరం.

"వచ్చేవారం మొత్తం అన్నీ కుట్టి ఇస్తాను సార్ కొంచెం అడ్వాన్సు ఇవ్వండి" అడిగాడు ఖాదిర్.

"ఇస్తాను, ముందు మొత్తం ఎంతవుతుందో చెప్పు" అన్నాడు దివాకరం.

"జతకారొందలుజొప్పునివ్వండి" అన్న ఖాదిర్ మాటలకెదురు చెప్పకుండా ఒక 500 రూపాయిలు అతని చేతిలో పెట్టి ఇంకొక 200 రూపాయిలు తీసి షాజహానుకి ఇవ్వబోయాడు దివాకరం.

కాని వాడు తీసుకోవడానికి నిరాకరిస్తూ వెనక్కి వెళ్ళిపోయాడు. తీసుకొమ్మని కొంచం గట్టిగా చెప్పినాసరే వినలేదు. ఆ డబ్బు కూడా ఖాదిరికిచ్చి బట్టలకొట్టుదగ్గరకు నడిచాడు దివాకరం.

ఇంకా చీరలు చూస్తూనే ఉంది నీలిమ.

" అప్పుడే వచ్చేశావా! ఇంకా నా సెలక్షన్ అవ్వనేలేదు" అంది దివాకరాన్ని చూసి.

అయితే నేను వెళ్ళి ఆ సోఫాలో రిలాక్స్ అవుతానని దివాకరం అక్కడున్న సోఫాలో కూలబడ్డాడు.కళ్ళు మూసుకొని షాజహాన్ గురించే ఆలోచిస్తున్నాడు దివాకరం.చాలా చురుకైన కుఱ్రాడు, ఇలా బాల కార్మికుడుగా జీవితాన్ని వృధాచేస్తున్నాడనిపించింది. తానేమీ సాయం చేయలేడా? వాడి జీవితాన్ని మార్చలేడా అని తనని తానే ప్రశ్నించుకున్నాడు. ఎలాగైనా సరే వాడి జీవితాన్ని మార్చాలనే ధృఢాభిప్రాయానికి వచ్చాడు.

"కమాన్ దివా! అయాం డన్" అన్న నీలిమ పిలుపుతో

దివాకరం ఒక్కసారి కళ్ళు తెరచి, సెల్ ఫోనులో టైం చూస్తూ, అబ్బా అప్పుడే ఆరైందా అని, ఆమెతో కలసి బయటకు నడిచాడు.

అటువైపుగా వస్తున్న ఆటోలో ఎక్కి ఇంటికి బయలుదేరారు.

"బట్టలు ఎప్పుడిస్తానన్నాడు దివా?" అడిగింది నీలిమ .

"వారం లోపలే ఇస్తాడుట" అన్నాడు.

"అబ్బా! అంత తొందరగానా?" అని కొంత ఆశ్చర్యాన్ని ప్రకటించింది.

" నీలూ! ఈరోజు ఒక పిటీఫుల్ బోయ్ ని చూశాను" అన్నాడు దివాకరం.

" పిటీఫుల్? ఎక్కడ?" అంది ఆమె.

" చెబుతా విను" అంటూ షాజహాను చురుకుదనాన్ని వాడి ప్రవర్తనను నీలిమకి ఒక కథలా వివరించాడు.

అదివిని ఎంతో ఎక్సైట్ అవుతుంది అనుకున్న దివాకరానికి, "ఓహో! అది మామూలే దివా వాళ్ళ జీవితాల్లో" అన్న ఆమె సమాధానం, అతన్ని పూర్తిగా నిరాశ పరచింది".

ఇంకా బయిట ఎండ ఉక్కపోత. ఇంటికిచేరి స్నానం చేసేసరికి ఒక్కసారి హాయిగా అనిపించి ప్రాణం లేచొచ్చినట్లయింది ఆ దంపతులకి.

భోజనం చేస్తున్నసేపు దివాకరం ఆలోచనలన్నీ షాజహాను చుట్టూ తిరుగుతూనే ఉన్నాయి. ఎలాగైనా నీలూని కన్విన్స్ చేసి షాజహాన్ కి ఒక మంచి దారి చూపించాలి అని ఒక ధృడ నిశ్చయానికొచ్చి పడగ్గదిలో మంచంపై నడుమువాలుస్తుండగా నీలిమ వచ్చింది.

"నీలూ! మనం షాజహాన్ ని చదివిస్తే ఎలావుంటుంది" అడిగాడు దివాకరం.

"దివా! వాడేమీ చదవడు. నువ్వు అనవసరంగా ఎక్కువ ఆలోచిస్తున్నావు. పోనీ వాడికి కొంత డబ్బు ఇవ్వు" అని నీలిమ చాలా తేలిగ్గా కొట్టి పారేసింది. ఆమె మాటలు దివాకరానికి చివుక్కుమనిపించాయి.

"నీలూ! వాడికి అహంభావం ఎక్కువ, నేను ఇచ్చిన డబ్బు తీసుకోలేదు తెలుసా? అందరినీ ఒక కాడికి కట్టకూడదు" నిష్టూరంగా అన్నాడు.

భర్తకి కోపం వచ్చిందని అర్థమైంది నీలిమకి.

"నీ ఇష్టం దివా! నీకంతగా ఏదైనా చెయ్యాలనిపిస్తే నేనేమీ అడ్డు చెప్పను. ప్లీజ్ ప్రొసీడ్" అని అతని భుజంపై చేయివేసి కళ్ళల్లోకి చూస్తూ చెప్పింది.

ఆ మాటలకి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది దివాకరానికి. ఇక ఇండియాలో ఉండేది రెండు వారాలే కాబట్టి ఇక సమయం లేదని ఆమర్నాడే వాడి చదువు సంగతి చూడాలని నిశ్చయించుకున్నాడు.

ప్రొద్దున్నే లేచి రెడీఅయ్యి ఆటోలో ఖాదిర్ కొట్టుకి బయలుదేరాడు. ఇంతలో మరో ఆలోచన వచ్చింది దివాకరానికి. అసలు వాడు చదువుకున్న స్కూలుకెళ్ళి ఎలా చదివేవాడో ఎంక్వైరీ చేస్తే ఎలా ఉంటుందని. ఆ ఆలోచన సబబే అనిపించింది. ఒకవేళ చదువులో ఏమాత్ర శ్రద్ధ చూపించకుండా, స్కూలు ఎగ్గొట్టుంటే మాత్రం, ఇప్పుడు తనప్రయత్నం వృధాయే అనుకొని, ఆటోని స్కూలు వైపు పోనీమన్నాడు.

హెడ్మాస్టర్ దగ్గరికి వెళ్ళి తనను తాను పరిచయం చేసుకొని, షాజహాను గురించి అడగడం మొదలు పెట్టాడు. స్కూల్ మానేసి ఎన్నో రోజులు కాకపోవడంతో చాలా సులభంగానే హెడ్మాస్టర్ షాజహానుని గుర్తుకు తెచ్చుకున్నారు. చాలా చురుకైన తెలివైన కుర్రాడని చదువుల్లోనే కాకుండా ఆటల్లో కూడా అందరికంటే ముందుండేవాడని తెలపడంతో దివాకరానికి మంచి ఊరట లభించి ఉత్సాహంతో ఖాదిర్ కొట్టుకి చేరాడు.

నిన్ననేకదా ఇచ్చి వెళ్ళారు! అప్పుడేవచ్చారేమిటీ అన్న సందేహంతో "నమస్తే సార్" అంటూ కత్తెర తో బట్టలు కత్తిరిస్తున్న ఖాదిర్ బయటికి వచ్చి దివాకరాన్ని అక్కడున్న స్టూల్ పై కూర్చోమన్నాడు.

దివాకరం ఇంక వేరేదేమీ మాట్లాడకుండా

"ఖాదిర్! నీకొక సలహా చెబుతాను, వింటావా" అంటూ అసలు విషయం మొదలుబెట్టాడు.

"చెప్పండి సార్" అన్నాడు ఖాదిర్ నెత్తిమీద టోపీ సర్దుకుంటూ.

"షాజహాన్ ని స్కూల్ కి పంపించి చదివించు" అన్నాడు.

ఇంకా ఏదో పెద్ద విషయం అనుకున్న ఖాదిర్ కి ఆమాట వినగానే ఒక చిన్న నవ్వు నవ్వి, "లేదు సార్! వాడిక్కడ లేకపోతే నాకు కష్టమవుతుంది. అందుకే బడి మానిపించా" అని తిరిగి బట్టలని కత్తిరించడం మొదలుబెట్టాడు.

ఖాదిర్ మాటలకు కొంత నొచ్చుకున్న దివాకరం, ఎలాగైనా తన పంతం నెగ్గించుకోవాలనే పట్టుదలతో, షాజహాన్ని తాను చదివిస్తానని, చదువుకుంటే పిల్లలజీవితాలు మారడమే గాకుండా తల్లితండ్రుల జీవితాలు వృద్ధాప్యంలో ఎలా ఆదరింపబడతాయో కొంచెం నచ్చచెప్పే ధోరణిలో ఉదాహరణలతో సహా చెప్పేసరికి ఖాదిర్ కొంచం మెత్తబడి ఆలోచించడం మెదలుబెట్టాడు.

ఇదంతా వింటూనే ఏకాగ్రతగా తనపనితాను చేసుకుపోతున్న షాజహాన్ని బయటకు పిలిచి " షాజహాన్! నువ్వు మళ్ళీ స్కూల్ కెళ్ళి చదువుకుంటావా?" అడిగాడు దివాకరం.

ఒక్కసారి కళ్ళల్లో మెరుపులు మెరిసినా, తండ్రివైపు చూసి తలదించుకున్నాడు షాజహాన్.

గతంలో తను స్కూలుకి వెళతానని మారాం చేయడం, తండ్రి వద్దనిచెప్పడం ఒకసారి కొట్టునుంచి పనిమానేసి స్కూలుకి పోతే, తండ్రి వచ్చి తనని కొట్టుకుంటూ తీసుకొచ్చి పనిచేయించడం ఆ చిన్న మెదడు మరచిపోలేదు. అప్పటి నుంచి స్కూలు సంగతి మరచిపోయాడు షాజహాను. అవన్నీ గుర్తుకొచ్చి ఒక్కసారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బెరుగ్గా తండ్రి కేసి చూసాడు.

వాడికి స్కూల్ కి వెళ్ళడం ఇష్టమేనని గ్రహించాడు దివాకరం. ఖాదిర్ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"ఏమాలోచించావ్ ఖాదిర్" అన్న దివాకరం మాటలకి ఒక్కసారి లోకంలోకి వచ్చి

" సార్! కొంచెం టైం ఇవ్వండి మా ఆవిడతో మాట్లాడి చెబుతాను" అన్నాడు.

" నీకు అభ్యంతరం లేకపోతే నేను కూడా వస్తాను ఇప్పుడే వెళ్ళి మాట్లాడదాం" అన్నాడు దివాకరం.

ఖాదిర్ ఇంక ఎదురు చెప్పకుండా, షాజహాన్ కి కొట్టు అప్పగించి, దివాకరంతో కలసి ప్రక్క వీధిలోనున్న అపార్టుమెంటు కాంప్లక్సు దగ్గరకెళ్ళారు. అక్కడ ఖాదిర్ భార్య చిన్నబండి పెట్టుకుని బట్టలు ఇస్త్రీ చేస్తోంది. ఇద్దరి కూతుళ్ళు కాడా అక్కడే ఉన్నారు. వాళ్ళలో పేదరికపు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆమెకి దివాకరాన్ని పరిచయం చేసి విషయమంతా చెప్పాడు ఖాదిర్. ఆమెకి ఆనందం కలిగినా ఒక్కసారి నిట్టూర్చింది.

"అయ్యా మాఇంట్లో అందరూ పనిచేస్తేనే గానీ గడవదయ్యా! వాడు స్కూలికెళితే ఖాదిర్ ఒక్కడూ చేసుకోలేదు. ఇబ్బందవుతుంది"దండంపెడుతూ చెప్పిందామె. ఒక్కసారి నీరుకారిపోయాడు దివాకరం. కానీ ఎలాగైనా ఒదలకూడదనుకున్నాడు.

"ఇదిగో చూడండి! షాజహాను బ్రతుకును మీరు దయచేసి నాశనం చేయకండి. వాడు చదువుకుంటే భవిష్యత్తులో మీకీ కష్టాలుండవు" అని కొంచెం కఠినంగానే చెప్పాడు దివాకరం.

భార్య ముఖంలోకే చూస్తున్నాడు ఖాదిర్.

ఇక లాభం లేదనుకొని ఆఖరి అస్త్రంగా

" చూడు ఖాదిర్! నీకు పనిలో సాయం చేయడానికి ఎవరినైనా పెట్టుకో. ఆజీతం, షాజహాను స్కూలు ఫీజులు, తిండి, బట్టలు ఇతరఖర్చులు కలిపి మొత్తం పది వేలు నెలనెలా ఇస్తాను. నేను షాపు దగ్గర వెయిట్ చేస్తూ ఉంటాను, మీరు ఆలోచించుకొని నాకు ఏవిషయం చెప్పండి" అని దివాకరం వడివడిగా అడుగులేస్తూ వెళ్ళిపోయాడు.

ఒక్కసారి మొగుడు పెళ్ళాలు గతుక్కుమన్నారు. నెలయ్యేసరికి అతికష్టం మీద అయిదారువేలు సంపాదించేవాళ్ళకి ఇంత పెద్దమొత్తం వినేసరికి కాదనడానికి ఇక ఏకారణం కనపడలేదు.

ఆరోజే షాజహాన్ని స్కూలుకి తీసుకెళ్ళి జాయిన్ చేయడం, కావలసినవన్ని కొనివ్వడం జరిగిపోయాయి.

ఒక మంచిపనిచేశాననే తృప్తితో దివాకరం మనసు దూదిపింజలా గాల్లో ఎగరసాగింది. చాలా ఆనందంతో ఇల్లు చేరుకున్నాడు.

"నీలూ! ఎక్కడున్నావ్?" అని పిలిచేలోగా, ఆటో శబ్దం వినబడి తనే పెరట్లోంచి ఇంట్లోకి వచ్చింది.

దివాకరం మొహం వెలిగిపోవడం చూసి అన్నీ అతను అనుకున్నట్టే జరిగి ఉంటాయని ఊహించుకుంది. దివాకరానిది చిన్న పిల్లాడి మనస్తత్వం. సంతోషమైనా విచారమైనా మొహం మీదే తెలిసిపోతుంది. జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించాడు నీలిమకి.

బాగా అలసిపోయాడేమో! భోజనం చేసి మంచం మీద చేరిన వెంటనే నిద్ర కమ్ముకొచ్చింది దివాకరానికి.

తను దేశం వదలివెళ్ళే ముందురోజు ఖాదిర్ చేతిలో పది వేలు పెట్టి నెలనెలా బాంకులో డబ్బు జమచేస్తానని హామీ ఇచ్చి, షాజహాన్ని బాగా చదువుకోవాలని హితబోధ చేసి భార్యతో కలసి ఫ్లయిట్ ఎక్కి వచ్చేసాడు దివాకరం.

ఉరుకుపరుగుల యాంత్రిక జీవితంలో వారాలు నిమిషాల్లా దొర్లిపోతున్నాయి. వారాంతరాలు ఇంట్లో, బజార్లో పనులతో సరిపోతున్నాయి. తంచనుగా నెల నెలా ఖాదిర్ కి డబ్బు పంపిస్తున్నాడు దివాకరం.

వీలు కుదిరినప్పుడల్లా ఫోనులో మాట్లాడుతున్నాడు. షాజహాను క్రమం తప్పకుండా స్కూల్ కి వెళుతున్నాడని, బాగా చదువుతున్నాడని విని చాలా సంతోషించేవాడు. నీలిమతో కూడా ఆవిషయం పంచుకొని ఇద్దరూ ఆనందించేవారు.

గిర్రున ఏడాది తిరిగిపోయింది. ఒక్కసారి ఇండియా వెళ్ళొద్దాం రెండు వారాలకి అని అనుకుంటున్న దివాకరానికి, పిల్లలు భార్యా యూరప్ ట్రిప్ వెళదాం అనేసరికి కాదనలేకపోయాడు. సెలవంతా అయిపోవడంతో ఇక ఇండియా ప్రయత్నాన్ని ఆ సంవత్సరం విరమించాడు. తన స్నేహితులెవరైనా ఇండియా వెళుతుంటే వాళ్ళతో షాజహాను కోసంబట్టలు బూట్లు చాక్లేట్లు వంటివి పంపేవాడు. అప్పుడప్పుడు ఖాదిర్ తో ఫోనులో మాట్లాడడం, నెల నెలా క్రమం తప్పకుండా డబ్బుపంపడం కొనసాగిస్తూనే ఉన్నాడు.

మరదలి పెళ్ళి ముహూర్తం పెట్టామని మామ గారు ఫోను చేయటంతో, ఆర్నెల్లు ముందుగానే భార్యా పిల్లలతో ఇండియా వెళ్ళడానికి టిక్కట్లు బుక్ చేయించాడు. చాలా ఆనందంగాఉంది దివాకరానికి, ఈవంకనైనా షాజహాన్ని కలవచ్చని. అప్పటికి రెండు సంవత్సరాలవుతుంది స్కూల్లో చేర్చి. ఫోను చేసినప్పుడల్లా ఖాదిర్ చెబుతున్నాడు, బాగా చదువుతున్నాడని, స్కూల్లో అందరికంటే ముందుంటున్నాడని. ఆమాటలువిని దివాకరం పొంగిపోతున్నాడు. పెద్ద క్లాసుల్లోకి వెళుతున్నాడు కాబట్టి ట్యూషను పెట్టిస్తే బాగుంటుందని తన మిత్రులద్వారా వాకబు చేసి, ఒక పేరున్న ట్యూషను సెంటర్ ని ఎంపికచేసి వాళ్ళతో ఫోనులో మాట్లాడి, అడ్వాన్సు చెల్లించి సీటు రిజర్వ్ చేయించాడు. ఇంటర్మీడియట్ వచ్చేసరికి హైదరాబాద్ తీసుకొచ్చి అక్కడ మంచి కాలేజి లో జాయిన్ చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

ఇండియా చేరిన మరునాడే షాజహను కోసం పట్టుకొచ్చిన గిఫ్టులు బట్టలు పట్టుకొని ఆటోలో బయలుదేరాడు దివాకరం.

"జూన్ నెలైనా ఎండ విపరీతంగా ఉందేంటయ్యాబాబు" ఆటోడ్రైవర్ తో మాట కలిపాడు.

"ఈరోజుల్లో ఆనెలా ఈనెలా అని లేదుసార్ ఏడాదికి పది నెల్లు ఎండే" అని నిట్టూర్చాడు ఆటోడ్రైవర్.

గాలి వీస్తుండటంతో ఉక్కపోత లేదు. తిన్నగా ఖాదిర్ కొట్టుకి తీసుకుపొమ్మన్నాడు ఆటోని. వెళ్ళేసరికి తాళం వేసిఉంది. ఖాదిర్ ఫోనుకి ప్రయత్నిస్తే అందుబాటులో లేదని వస్తోంది. భోజనానికో లేదా నమాజుకో వెళ్ళి ఉంటాడనుకొని తిరిగి ఆటోలో షాజహాను స్కూలికి బయలుదేరాడు. ఆరోజు రెండో శనివారం శెలవట, స్కూలు మూసేసి ఉంది. ఇల్లెక్కడో తెలియదు, షాజహాను తల్లి ఇస్త్రీ చేసే అపార్ట్మెంటు గుర్తుకొచ్చింది. కానీ పేరు గుర్తు లేదు, లీలగా దారి గుర్తుంది. తను గుర్తులు చెబుతుంటే ఆటో వెళుతోంది, మొత్తానికి అక్కడికి చేరుకున్నారు. బండుంది గానీ, ఎవరో ఒకతను తలపాగా కట్టుకొని ఇస్త్రీ చేసుకుంటున్నాడు. వివరాలడిగితే తనొచ్చి ఆర్నెల్లవుతోందని ఎవరూ తెలియదన్నాడు. ఏం చేయాలో పాలుపోలేదు దివాకరానికి. తిరిగి ఆటోని కోటగుమ్మంవద్దకు పోనీమ్మని, అక్కడ దిగి డబ్బులిచ్చి పంపించేశాడు. తల బద్దలుకొట్టేస్తోంది అర్జంటుగా స్ట్రాంగ్ కాఫీ తాగుదామని ప్రక్కనే కనిపిస్తున్న హొటల్ వైపు దారితీసాడు. కాఫీ త్రాగుతూ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఈపాటికి ఖాదిర్ వచ్చి ఉంటాడేమో ఒక్కసారి మళ్ళీ ఖాదిర్ కొట్టువద్దకెళదాం అని నిర్ణయించుకొని, చేతిలో సామాను బరువుగా ఉండటంతో ఆటో ఎదైనా వస్తుందేమోనని కాసేపు ఎదురుచూసి ఇక లాభం లేదనుకొని నడక ప్రారంభించాడు. మెల్లిగా ఖాదిర్ కొట్టుకి చేరాడు. ఇంకా తాళం అలాగేఉంది. చుట్టూ ఎవరి పనులలో వాళ్ళు బిజీగా ఉన్నారు. ఒక ప్రక్కన బిల్డింగ్ నీడలో నిలబడ్డాడు. ఖాదిర్ ఫోనుకి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ప్రతిసారి అదే సమాధానం. విసుగ్గా ఫోను జేబులో పెట్టుకుని ఇక ఇంటికి తిరిగి వెళ్ళిపోదామని సిద్ధమౌతుండగా, ఖాదిర్ కొట్టు ముందు సైకిల్ పై ఒక వ్యక్తి దిగి, కొట్టు తాళం తీస్తున్నాడు. దివాకరం గబగబా నడుచుకుంటూ అక్కడికి వెళ్ళాడు. తాళంతీసి ఆవ్యక్తి లోపలనుంచి కొన్ని గోనె సంచులు తీసుకొని బైటకొచ్చాడు. లోపల కుట్టు మిషన్ ఏమీ కనిపించలేదు దివాకరానికి. బయటికొచ్చిన వ్యక్తి ఏం కావాలన్నట్లుగాచూస్తుంటే, ఖాదిర్ గురించి అడిగాడు దివాకరం.

"ఖాదిర్ కి మీరేమవుతారు" అన్న అతని ప్రశ్నకి దివాకరం సమాధానం చెప్పగానే ఆ వ్యక్తి ఒక్కసారి గతుక్కుమని లోపలకి తీసుకువెళ్ళి లోపలకి తీసుకువెళ్ళి దివాకరాన్ని స్టూలుపై కూర్చోమని తను క్రింద కూర్చుంటూ “మీరు ఖాదిర్ తో ఆఖరు సారి ఎప్పుడు మాట్లాడారు సార్" అనడిగాడు.

సుమారు ఆరు నెలలై ఉంటుందని, తరువాత రెండుమూడు సార్లు ప్రయత్నించినా ఫోను కలవలేదని చెప్పాడు దివాకరం.

సమాధానం విన్న ఆవ్యక్తి కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

“ఉండండి సార్ టీ పట్టుకొస్తాను" అంటూ, దివాకరం వద్దని వారిస్తున్నా వినకుండా బయటికివెళ్ళి పది నిమిషాల్లో రెండు కప్పులతో టీ తీసుకొచ్చి, ఒకటి దివాకరానికిచ్చి రెండోది తను తీసుకొని చెప్పడం ప్రారంభించాడు. ఆవ్యక్తి చెప్పే సమాచారం వింటుంటే కళ్ళు బైర్లుతిరుగుతున్నాయి దివాకరానికి. చెప్పిందంతా విన్నాకా ఒక్కసారి కాళ్ళకింద భూమి చీలిపోయి తాను అందులో కూరుకుపొయినట్లనిపించింది. కళ్ళుమూసుకొని నీరసంగా గోడకి జారగిలపడ్డాడు.

నోటమాట రావడంలేదు. కాసేపటికి స్థిమితపడి, ఆవ్యక్తిని ఆటో తీసుకురమ్మని చెప్పి, అందులో కూలబడి ఇంటికి తిరిగి పయనమయ్యాడు దివాకరం.

ఇల్లంతా పెళ్ళికొచ్చిన చుట్టాలతో హడావిడిగా ఉంది. దివాకరాన్ని చూసిన నీలిమ ఆశ్చర్యపోయింది.మొహమంతా నల్లగా మాడిపోయి పది లంఖణాలు చేసినివాడిలా ఉన్నాడు. ఉదయం షాజహానుకోసం పట్టుకొని వెళ్ళినవన్నీ తిరిగి తీసుకొనిరావడంతో ఒకింత ఆదుర్దా పడి, గదిలోకి తీసుకెళ్ళి కూర్చోపెట్టి ఫ్రిజ్ లోంచి చల్లని మంచినీళ్ళు పట్టుకొచ్చి ప్రక్కన కూర్చుని అతనికిస్తూ

"దివా! ఆర్ యూ ఓకే?" అని ఆమె అడగ్గానే, ఒక్కసారి దుఃఖం పొంగి పొర్లింది దివాకరానికి. ఆమె రెండు చేతులు పట్టుకొని వెక్కి వెక్కి ఏడవసాగాడు.

ఒక్క నిమిషం తరువాత స్థిమితపడి "ఆ వ్యక్తి" ఇచ్చిన సమాచారాన్ని నీలిమకు చెప్పడం ప్రారంభించాడు.

"ఖాదిర్ కొన్ని రోజులపాటు షాజహాన్ని స్కూలుకి బాగానే పంపాడు. దివాకరం చెప్పినట్లుగా కొట్లో ఇంకెవర్నీ పనిలోకి పెట్టుకోలేదు. షాజహాన్ని స్కూల్ అయిపోయిన తరువాత కొట్టుకి తీసుకువచ్చి రాత్రి దాకా పనిచేయించేవాడు. నెల నెల ఖచ్చితంగా దివాకరాన్నించి డబ్బు అందుతూండటంతో అప్పటికే మద్యం అలవాటున్న ఖాదిర్ దాని పరిణామాన్ని ఇంకా పెంచి, త్రాగుడికి పూర్తిగా బానిసయ్యాడు. దానికి తోడు పేకాట కూడా జోడవడంతో కొన్ని రోజులపాటు షాపు తీసేవాడు కాదు. దానితో బేరాలు బాగా తగ్గిపోయాయి. పగలంతా పేకాట రాత్రంతా మత్తుతో సంసారాన్ని పట్టించుకోవడం మానేశాడు. అప్పటికే ఫీజులు కట్టకపోవడంతో అనేక హెచ్చరికల తరువాత షాజహాన్ని స్కూల్ నుండి తీసేసారు. దివాకరం ఫోను చేసినప్పుడల్లా అబద్ధాలు చెప్పేవాడు. ఇల్లంతా రోజూ నరకంలా తయారైంది. భార్యసంపాదనతోనే ఒకరోజు తింటే ఒకరోజు తినేవారుకాదు. పేకాటాడి సాయంత్రానికి తాగి ఇంటికి రావడం, భార్యా భర్తలు గొడవపడడం, దొరికింది పుచ్చుకొని భార్యని కొట్టడం చుట్టుప్రక్కలవాళ్ళకి ఇది రోజూ ఉచిత వినోదంలా ఉండేది. షాజహాన్ కి తండ్రి ప్రవర్తన చాలా చికాకు పుట్టిస్తోంది. కానీ ఏమీ చేయలేని అసహాయ స్థితి. ఇద్దరి అక్కలదీ కూడా అదే స్థితి.

ఒకరోజు రోజూలాగే ఫుల్ గా త్రాగి ఇంటికివచ్చాడు ఖాదిర్ . అప్పటికే అతని ప్రవర్తనతో విసిగి వేసారిపోయిన భార్య, లోపలకి రావద్దని గుమ్మనికి అడ్డంగా నుంచుంది. ఇద్దరికీ పెద్ద పెనుగులాటజరుగుతోంది. ఒక్కసారి భార్యని నేలమీదకి తోసేసాడు. త్రాగుడు మైకంలో తనేంచెస్తున్నాడో తనకే తెలియడం లేదు. పూర్తిగా విచక్షణ కోల్పోయాడు. ప్రక్కనే ఉన్న పచ్చడి బండని తీసుకొని భార్య తలపై గట్టిగా మోదాడు. ఇదంతా నిశ్చేష్టపోయి చూస్తున్న షాజహాన్ కి విపరీతమైన కోపం ఉద్రేకం కలిగాయి. ఒక్కసారి తండ్రిమీదకి ఉరికాడు. క్రిందపడేసి అదే పచ్చడి బండని తీసుకొని తండ్రి తలపై కసిగా మోదుతూనేఉన్నాడు. అతన్ని ఆపడానికి అక్కలిద్దరు చేసిన ప్రయత్నం ఆ మొండిబలం ముందు వెలవెల బోయింది. అప్పటికే ఆ భార్యా భర్తలిద్దరి ప్రాణాలు గాల్లో కలసి పోయాయి. ప్రస్తుతం షాజహాను చిన్నపిల్లల జైలులో ఉన్నాడు. అతని అక్కలిద్దరూ ఎమైపోయారో ఎవరికీ తెలియదు."

చెప్పడం పూర్తిచేసిన దివాకరం, నీలిమ కళ్ళలోకి చూస్తూ " నేను తప్పుచేశానంటావా" అని బేలగా అడుగుతుంటే, ఆమె దుఃఖం ఆపుకోలేకపోయింది.

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

## "డోరియన్ - దూరియాన్"

నిర్మలాదిత్య {భాస్కర్ పులికల్, Tampa, FL}

ఎప్పుడొచ్చారు? హౌ వాజ్ యూర్ డే? ఈ కథ మీకు నేను చెప్పాల్సిందే. ఇదిగో ఇప్పుడే మా చెల్లితో కూడా వాట్సాప్ లో విడియో చాట్ చేస్తూ ఇదేకథ చెప్పా. ఇట్ టుక్ హర్ బై సర్ప్రైజ్. ఆశ్చర్యపడింది తను. ఆశ్చర్య పడాల్సిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయనుకోండి. వచ్చిన కొత్తలో ఇంటర్నేషనల్ కాల్ అంటే వారానికి ఓ సారి ఫోన్లో, ఆచి తూచీ ఓ కన్ను గడియారం ముల్లు మీద పెట్టి మరీ మాట్లాడేవాళ్ళం. అవతలి వారు కాల్ కోసం ఎదురుచూస్తుండేవారు. ఇప్పుడు అనుకున్న తరువాయే మాట్లాడొచ్చు. అవతలి వారు పనిలో ఉన్నాం కొంత సేపు తరువాత చేయండి, అని అనగలిగినంత సులభంగా. కానీ మా చెల్లి సంగతి తెలుసు కదా. ఎప్పుడూ ఫోన్ చేసినా గంటల తరబడి మాట్లాడుతూనే ఉంటుంది. చిన్నప్పుడే మమ్మల్నిద్దరిని వస పిట్టలు అనేవారు. మరి మనుష్యులు, అపాయింట్మెంట్ తప్పితే దొరకని ఈ దేశంలో, ఎదురుగా కనిపించారంటే , నేను మాట్లాడకుండా ఉండిపోవడమే. మీకింకేమి ఆప్షన్ లేదు నా కథ వినాల్సిందే.

పోయిన సారి ఇర్మా తూఫాన్ వచ్చి నప్పుడు పడిన అగచాట్లతో జనాలు, ఈ సారి డోరియన్ తుఫాన్ వస్తున్నదని విన్న వెంటనే బాగా అప్రమత్తం అయ్యినట్లున్నారు. పోయినసారి లాగా, ఈ సారి హడావిడులేమి కనపడలేదు. గ్యాస్ అన్ని స్టేషన్ల లోను దొరుకుతున్నాయి. గ్రోసరీ స్టోర్ల పైన దండయాత్రలులేవు. నిత్యావసరాలు దొరుకుతూనే ఉన్నాయి. దానికితోడు డోరియన్ సముద్రం పైనే, మనుష్యులకు, తీరప్రాంతంకుకొంత దూరం గానే తన రహదారి వెదుక్కుంది కదండి. జనము ఊపిరి పీల్చుకుని, తిరిగి తమ గానుగ జీవిత దినచర్యలపై పడడానికి పెద్ద గ్యాప్ ఏమి కనపడలేదు. తుఫాను వల్ల కాదు కానీ, నిన్నరాత్రి నిద్ర పట్టలేదు. ఇది నాకప్పుడప్పుడు వస్తున్న సమస్యే. మొదట్లో కష్టమనిపించినా, ఇప్పుడు అలవాటైపోయింది కదా, చప్పుడు కాకుండ లేచి కిందకు వెళ్లి కారు తీసి వాల్మార్ట్ స్టోర్ కి వెళ్ళా. స్టోర్ 24 గంటలు తెరిచి ఉండడం నా లాంటి వారికి ఓ ఉపశమనమే. దేదీప్తమాన్యంగా వెలుగుతున్న దీపాలతో, దిగాలు పడుతున్న రాత్రిని , కాంతులు విరాజిమ్ముతున్న దినంగా మార్చేస్తున్నది. అలా స్టోర్ లో పోయి పచార్లు చేయడం మొదలెట్టా. కొత్తగా ఏదైనా కనిపిస్తే ఆగి చూడడం, మళ్లీ ఇంకో వరుసలోని వస్తువులు చూడడం, అలా ఓ జోంబీ లా తిరగడమే. సమయం అట్టే గడిచిపోతుంది. ఫోన్ మ్రోగింది.

మన సుందరమే. రెండిళ్ళ అవతల ఉంటాడు కదా. ఇంత రాత్రి చేస్తున్నాడేం అబ్బా, అదీ నాకు, అనుకున్న. సుందర్ ఆయన భార్య రేవతి ఇద్దరికి ట్రావెల్ ఉద్యోగాలే. మొన్నటి వరకు ఇద్దరూ సీయాటల్ బోయింగ్లో పనిచేసేవారు. ఇప్పుడు రేవతి సాన్ హోసే కు మారింది.

"వనిత గారు, ఇది సుందర్. ఫ్లోరిడా లో మీకు అర్ధ రాత్రి కదండి. సారి అండి. రేపు చేద్దామనుకున్న. రేవతి మీరు మేల్కొనే ఉంటారంది. అందుకేచేస్తున్నాను. ఓ ఫేవర్ కావాలండి. డోరియన్ తుఫాన్ వస్తుందని అమ్మను సీనియర్ కమ్యూనిటీ హోమ్ లో వదిలి వెళ్ళాం. ఇప్పుడు తుఫాన్ మనూరి వైపు రాదని తెలిసి పోయింది. అమ్మ అక్కడుండాల్సిన అవసరం లేదు. మీరు కొంచెం ఆవిడని పిక్ అప్ చేసుకొని మనింట్లో డ్రాప్ చేయగలరా?" సుందర్ గొంతులో కొంత ఆదుర్ధ కూడా వినిపించింది.

సుందర్ వాళ్ళ కుటుంబం చూసి, మనం అలా ఉండాలని ఎన్నిసార్లు అనుకోలేదు. సుందర్, రేవతిలాగా పిల్లల చిన్నప్పటి నుంచే, తల్లి తండ్రులకు కూడా గ్రీన్ కార్డు స్పాన్సర్ చేసి, ఇక్కడికి రప్పించి ఉమ్మడి కుటుంబంలో లాగా కలసి ఉండాలని ఎవరు అనుకోరు? ఆంటీ, అంకుల్ చిన్న పిల్లలను రోజు స్కూల్ బస్ వచ్చేసరికంతా రెడీ చేసి బస్టాప్ లో వదలడం, సాయంత్రం వాళ్ళను ఇంటికి తీసుకెళ్లడం, సాయంత్రం పూటల వాళ్లని సాకర్ కని, సంగీత, నాట్యాలని కార్లో తిప్పడం అందరూ చూసిందే. సుందర్, రేవతి తమ ట్రావెల్ జాబ్స్ నిరంతరంగా, సంతోషంగా చేసుకోవడానికి, ఆంటీ, అంకుల్ పాత్ర ఎంత ఉందో, పిల్లలు కాలేజీ డార్మ్ లకు వెళ్లే టప్పటికి కానీ తెలియలేదని రేవతి నాకు స్వయంగా చెప్పింది. పిల్లలు ఆంటీ అంకుల్ ను విడవడానికే కన్నీళ్లు నింపుకున్నారట. అలాంటి పిల్లలు ఇప్పుడు ఉద్యోగాల్లో కూడా స్థిరపడిపోయారు. అంకుల్ కూడా పోయి రెండేళ్లు అయ్యిపోయాయి. ఆంటీ ఇప్పుడు సుందర్ వాళ్ళింట్లో ఒంటరిగానే ఉంటుంది. తుఫాన్ అని సీనియర్ హోమ్ లో చేర్చినట్లున్నారు. ఇక సుందర్ ఆంటీ గురించి ఆదుర్తాపడ్తున్నాడంటే, ఆశ్చర్య మేముంది.

"సుందర్ మీరు వర్రీ కాకండి. పొద్దున్నే ఆంటీ ఉండే సీనియర్ కమ్యూనిటీకి హోమ్ కు వెళ్లి , ఆంటిని మీ ఇంట్లో డ్రాప్చేస్తానని" , భరోసా ఇచ్చాను.

ఇవ్వాళ ప్రొద్దునే సుందర్ చెప్పిన సీనియర్ హోమ్ కు వెళ్ళాను. ట్రాఫిక్ పెద్దగా లేదు. ఫోర్ట్ మాయర్స్ పెద్ద ఊరూ కాదు. ఓ అరగంటలోనే చేరిపోయాను. గ్రాండ్ విల్లా. పేరు కు తగట్టు పెద్ద భవనమే. 4 అంతస్తులు, ముందు పెద్ద గార్డెన్, ఫౌంటెన్, తెల్లటి ఎత్తైన స్థంభం పై, నక్షత్రాలు, ఎరుపు తెలుపు గీతలతో రెప రెప లాడుతున్న మన దేశం జెండా. లోపలికి వెళ్ల గానే పెద్ద ఓపెన్ లాబీ కనిపించింది. ఎదురుగా పై అంతస్థులకి పోవడానికి అనుకుంటా, పాత సినిమా సెట్లో లాగా మెట్లు ఉన్నాయి. లాబీలో అక్కడక్కడ సోఫా సెట్లు, పూల మొక్కలు, క్రోటాన్ చెట్లతో అందంగా అమర్చారు.

రిసెప్షన్ కౌంటర్ లో ఉన్న అమ్మాయి వైపు వెళ్లి పరిచయం చేసుకొని, ఆంటీని కలవాలన్నాను. అమ్మాయి ఆంటీకి ఫోన్ చేసి నేను వచ్చినట్లు చెప్పింది. ఆంటీ చెప్పింది విని, ఫోన్ పెట్టేసి, "ఆంటీ రూంలో లేరండి. కాల్ ఆవిడ మొబైల్ కి వెళ్ళింది. ఆవిడ రిక్రియేషన్ హాల్ లో ఉన్నారు. ఎదురుగా ఉన్న మెట్లు ఎక్కితే ముందుగా కనిపించేది ఆ హాలే. మీరు కావాలంటే పక్కనున్న ఈ ఎలివేటర్ కూడా ఉపయోగించుకోవచ్చు", అని చెప్పింది. ఇప్పుడే హై స్కూల్ ముగించి జాబ్ చేస్తున్నటుంది. అమ్మాయి మాటలు, ఉత్సాహం, చూసి మరింత ముచ్చట వేసింది. అమ్మాయికి థాంక్స్ చెప్పి, నేను మెట్లు ఎక్కి రిక్రియేషన్ హాల్ చేరాను.

హాల్లో అక్కడక్కడ సోఫా సెట్లు టేబిల్లు, కుర్చీలు వేసారు. కొందరు పుస్తకాలు, వార్త పత్రికలు చదువుతూ, కొందరు పిచ్చాపాటి మాట్లాడుతూ, కొందరు ఏదో ఆలోచిస్తూ, మరికొందరు బోర్డ్ గేములు ఆడుతూ కనిపించారు. అటు మూల స్క్రాబెల్ ఆడుతూ ఆంటీ కనిపించారు. తాను తల ఎత్తి చూచిన వెంటనే నవ్వి, చేయి ఉపాను. ఆంటీ నవ్వుతూ , "ఏంటమ్మా నువ్విక్కడ?" అన్న పలకరింతతో, నా వైపు అడుగు వేసింది. నేను తన వైపు వడిగా అడుగులు వేస్తూ పోయి కౌగలించుకున్నాను.

"ఎలా ఉన్నారు ఆంటీ. మీ అబ్బాయి సుందర్ పంపించారు. తను ఫోన్ చేస్తే మీరు దొరకలేదంట".

"ఇక్కడ బాగానే ఉందమ్మ. ఇంట్లో ఎవరూ లేనిది, నాకు నేనే మాట్లాడుకోవాల్సి వచ్చేది. ఇక్కడ కావాలిసినంత కంపెనీ. వాడు ఫోన్ చేసి నప్పుడు, ఇదో ఇలా ఎవరితోనో మాట్లాడుతూను, అట్లాడుతూను ఉండి ఉంటాను", అంది ఇంకా చెరగని నవ్వుతూ.

ఆంటీ నవ్వుతే బాగుంటుంది. ఈ మధ్యలో తనని అలా సంతోషంగా చూడలేదు. ముఖంలోను ఏదో కాంతి, కొత్తదనం కనిపిస్తున్నది.

"నా పరిస్థితి అంతే ఆంటీ. ఎందుకు నీలో నీవే గట్టిగా మాట్లాడుకొంటున్నావని, ఆటపట్టిస్తున్నారు. ఏదో మరి, ఎడ తెరపి లేని ఈ ఆలోచనలు అలా నోటి మాట గా వచ్చేస్తున్నాయి. ఇంతకీ నేను వచ్చింది మిమ్మల్ని ఇంటికి తీసుకెల్దామని. సుందర్ డోరియన్ తుఫాను బెడద తప్పిపోయింది కాబట్టి ఇంటికి తీసుకు రామన్నారు", అన్నాను.

"డోరియన్ తుఫాన్ అంటే నాకు హిందీలో దూరియాన్ అని వినిపిస్తుంది, దూరాభారం గుర్తుకొచ్చి మనస్సు బరువై పోతుంది. ఇంగ్లీష్ భాషతో వచ్చిన చిక్కే ఇది. డోరియన్ కు దూరియాన్ కు ఇంగ్లీషులో ఒకటే స్పెల్లింగ్ కదా. ఇల్లు వదిలి ఇక్కడ దూరంగా సీనియర్ హోమ్ పొమ్మంనందుకేమో, డోరియన్, దూరియాన్ లాగా అనిపించింది. కానీ, ఇక్కడ వచ్చిన తరువాత ఈ దూరం, దాని వల్లనిపించిన ఈ, దిగులు ఇట్టే మాయమైపోయాయి. మళ్లీ ఇంటికి వెళ్ళాలా?"

ఆంటీ ముఖంలో కొంత అయిష్టం, మాటలో కొంత దుఃఖం నాకు తెలిసింది. మరీ ఎక్కువ ఆలోచిస్తునా అని అనిపించి,"ఇక్కడ కంటే సొంత ఇల్లు మంచిది కదండి. అదీ కాక, సుందర్ నిన్ననే ఈ సీనియర్ హోమ్ ఆఫీసు వారితో మాట్లాడి అకౌంట్ సరి చేసేసారట. మనం ఇంటికి బయలు దేరాలి. వేరే ఆప్షన్ లేదు", అన్నాను.

ఆంటీ ఓ రెండు నిమిషాలు ఏమి మాట్లాడ లేదు. నేను జవాబు కోసం కొద్దిగా అసహనం గా కదిలాను.

"సరే, ఓ పది నిమిషాలకు ఆగమ్మ. వస్తువులు సర్దుకు వస్తాను", అని ఇది వరకు తను గేము ఆడుతున్న టేబిల్ దగ్గరికి వెళ్లి అక్కడున్నతనితో వీడ్కోలు అనుకుంటా, తీసుకొని పై అంతస్థులో ఉన్న తన రూము కు పోయింది.

ఆ పది నిమిషాల తరువాత ఆంటీవస్తూ వస్తూ మరొకతని కూడా వెంట పట్టుకొచ్చింది. ముఖవలికలు తెల్లవారి లాగా ఉన్నా, చామన ఛాయా రంగు వల్ల, ఎక్కడివాడో పోల్చుకువడం కష్టంగానే ఉంది. ఎక్కడో చూసాననిపించింది. వెంటనే గుర్తు వచ్చింది. ఇందాక ఆంటీ ని ఇక్కడ మొదట చూసినప్పుడు, తన తోనే స్క్రాబుల్ ఆడుతూ కనిపించాడు.

"తను జార్జ్. ఇక్కడే పరిచయమయ్యాడు. ఆయన కూడా ఖాళీచేస్తున్నాడు. దారిలోడ్రాప్ చేయగలవా?", అని ఆంటీఆడిగింది.

జార్జ్ ముఖంలో ప్రసన్నత, చిరు నవ్వు తో నేను ఇట్టే ఒప్పుకోకుండా ఉండ లేక పోయాను. జార్జ్ మంచి కులుపుగోలు మనిషి. వాళ్ళ పూర్వికులు జమైకాలో ఉండేవారట. వాళ్ళు జమైకా కి వలసే వచ్చి ఉంటారు. ఆ దేశంలో డెంటల్ కాలేజీలో చదివి ఈదేశంలో స్థిర పడ్డాడట. భార్య పోయి 5 సంవత్సరాలు అయ్యిందని ప్రస్తుతం రిటైర్ అయ్యి ఎదో టైం పాస్ కని సొంతంగా ఓ షాప్ నడుపుతున్నాడని మాటలలో తెలిసింది.

కారు ట్రంక్ లో వాళ్ళ సూట్ కేసులు పెట్టేసి ఎక్కడికి పోవాలి అని జార్జ్ ని అడిగా. జార్జ్ సానిబెల్ ద్వీపం అని చెప్పాడు. సానిబెల్, ఫోర్ట్ మయిర్స్ పక్కనే ఉంది. ఓ 15 మైళ్ళ డీ టూర్ నాకు, ఆంటీకి. పెద్ద దూరమేమి కాదు. జీ పీ ఎస్ లో జార్జ్ చెప్పిన అడ్డర్స్ ఎక్కించి కారు స్టార్ట్ చేసాను.

సానిబెల్ కాస్ వే రాగానే పాస్ ఉంది కాబట్టి, ఆగకుండా టోల్ రోడ్డుఎక్కాను. 3 మైళ్ళు సముద్రం మీద ప్రయాణం.. రెండు పక్కల నీలంగా సముద్రం, దానికి పోటీ పడుతున్నట్లు నీలాకాశం. దూరంగా, ఒకటో రెండు తెల్లటి మబ్బు తునకలు బద్ధకంగా తేలుతున్నాయి. మరో లోకంలోకి పోతున్నట్టనిపించింది.

ఆంటీ, జార్జ్ కబుర్లలో పడిపోయాయారు. దృష్టి రోడ్డు మీదఉండడం వల్ల, వాళ్ళ మాటలు వింటూ అప్పుడప్పుడు నేనూ వాళ్ళతో మాట్లాడుతూ ఉన్నాను. ఆంటీఇంతకు ముందు వారు ఆటలో ఉపయోగించిన పదాలగురించి వాదిస్తున్నది. జార్జ్ అలాంటి పదం లేదనడంతో, తాను చదివిన పుస్తకంలో ఓ వాక్యం, దాని సందర్భం చెప్పి జార్జ్ కి వివరించింది. ఆంటీ ఒకప్పుడు సైన్స్ టీచర్ గా పనిచేసినట్లు విన్నాను. కానీ ఇంగ్లీష్ సాహిత్యం మీద కూడా తనకు పట్టు ఉందని ఈ ప్రయాణంలో తీసింది. అలా, అలా వారిద్దరూ ఓ విషయం నుంచి మరో విషయం కు అనాయాసంగా ప్రయాణం చేయడం, వింటున్న నాకే ముచ్చట వేసింది.

కాస్ వే దిగగానే సానిబెల్ ద్వీపం. మొత్తం ద్వీపం పొడవు 15 మైళ్ళు వెడల్పు 5 మైళ్ళు. స్పీడ్ లిమిట్ 35 మైళ్ళు. కారును నిదానంగా నడపడంతో మనస్సు ఒక్కింత రిలాక్స్ అయ్యినట్లనిపించింది, 70 మైళ్ళ స్పీడ్ తో నడుపుతున్నప్పుడు అలికినట్లు, మసక, మసక గా కనిపించే రోడ్డు పక్కన ఈత జాతి పామ్ చెట్లు, వీటి మధ్యలో పూల మొక్కలు, రకరకాల నీటి పక్షులు...మంచి ఫోకస్ లోకి వచ్చి చక్కగా కనిపిస్తున్నాయి. కార్లు కూడా ఎక్కువ లేవు. ద్వీపంలో చాలా మటుకు టూరిస్ట్ లకని రిసార్ట్లు, రెస్టారెంట్ లు, వారు తీరికగా తిరగడాని సైకిళ్ళు ఉన్నాయి. తూఫాన్ భయంతో ఎక్కువ జనం లేరు. ప్రపంచం ఆగి సేద తీర్చుకున్నట్లు ఉంది.

జార్జ్ చెప్పిన అడ్రస్ జి పి ఎస్ లో ఓ ఆరు మైళ్ళ తరువాత ద్వీపం చివర్లో ఉంది. దారిలో షెల్ మ్యూజియం కనిపించింది. కొత్తగా మార్పులు చెయ్యడానికి మూసివేసినట్లు నోటీస్ పెట్టారు. దాన్ని చూసి జార్జ్ , నా దగ్గర కూడా మంచి గవ్వల కలెక్షన్ ఉంది. చూపిస్తాను లెండి అన్నాడు. మీకు తెలిసిందే కదా సానిబెల్ గవ్వల రాజధాని. ద్వీపం చుట్టూ ఉన్న తీరాల వెంబడి ఎప్పుడు గవ్వలు వెతుక్కుంటున్న టూరిస్ట్ లని చూడొచ్చు. పొద్దున సూర్యోదయానికి ముందు ఈ జనాలు మరీ ఎక్కువ.

మాటల్లోనే జార్జ్ చెప్పిన అడ్రస్ కు వచ్చేసాం. అది ఓ గవ్వల క్యూరియో షాప్.

"ఇల్లెక్కడ? షాప్ లాగా ఉంది", జార్జ్ ని చూసి అడిగా.

"ఇది నా షాపే. ఇల్లు ఈ షాపు వెనకాల ఉంది".

"అలాగా", అని జార్జ్ తన బ్యాగ్ తీసుకోవడాని, ట్రంక్ బటన్ నొక్కి తెరిచాను.

"మీరూ దిగండి. ఇందాక అన్నట్లు మీకు నా దగ్గరున్న గవ్వల కలెక్షన్ చూపిస్తాను. మీకు తప్పకుండా నచ్చుతుంది".

ఆంటీ అప్పటికే దిగేసి జార్జి పక్కన నుంచుంది. ఇక గత్యంతరం లేక నేనూ కార్ పార్క్ చేసి దిగాను.

జార్జి కొట్టు తెరిచి మమ్మల్ని లోపలికి ఆహ్వానించాడు. ఓ నగల దుకాణం లాగా ఉంది. గోడ పైన, గది చుట్టూ బల్లల పైన గాజు కౌంటర్లు, వాటిలో అందంగా అమర్చిన గవ్వలు, గవ్వలతో చేసిన రకరకాల బొమ్మలు, నగలు. గవ్వలు ఇన్ని రంగులలో ఉంటాయని తెలీదు. జార్జి తాను ఎలా జీవితాంతం బీచి పక్కన ఊళ్ళోనే గడిపింది, ఎలా ఈ గవ్వల సేకరణ హాబీగా మారింది, ఆ గవ్వలలో ఉన్న తేడాలు, అవి గుర్తు పెట్టడం ఎలా, అని చమత్కారంగా వివరిస్తూ ఉంటే, సమయం ఇట్టే గడిచిపోయింది. ఆంటీ కూడా ఇంత ఓపికగా , ఎంతోఆశక్తి తో జార్జ్ మాటలు వింటుంటే ఆశ్చర్యమేసింది.

ఇక సమయం అయ్యిందని జార్జ్ దగ్గర సెలవు తీసుకో ప్రయత్నిస్తే, ఆగండి అని ఈ ఫ్లోరిడా రాష్ట్ర చిహ్నం గుర్తుగా తీసుకోమని ఫ్లోరిడా గుఋం శంఖం తానే ఒకటి తీసి ప్యాక్ చేసి నాకిచ్చాడు. ఆంటీకి ఎందుకివ్వ లేదనుకున్నాను. అప్పటికే తీసిఉంచిన ట్రంక్ నుంచి జార్జి సూట్ కేస్ తీయబోతుంటే, తనే వచ్చి సూట్ కేసు అందుకున్నాడు. అలానే ఆంటీ సూట్ కేస్ కూడా దింపేస్తే,

"అయ్యో జార్జ్ గారు అది ఆంటీ సూట్ కేస్ అండి. ఉంచేయండి. ఆంటీని డ్రాప్ చేసినప్పుడు, ఆవిడ సూట్ కేస్ కూడా వాళ్ళ ఇంట్లో పెట్టేస్తాను", అన్నాను.

"ఇట్స్ ఓకే అమ్మా. నేనిక్కడే డ్రాప్ అయ్యిపోతాను",అంది ఆంటీ.

నా ముఖంలో షాక్ చూసి, తిరిగి ఆవిడ నవ్వుతూ, నా దగ్గరికి వచ్చి నన్ను దగ్గర తీసుకొని, భుజం వత్తుతూ "జార్జ్ కి ఈషాప్ నడపడంలో సహాయం కావాలన్నాడు. నాకు కావలసినంత తీరిక ఉంది కదా. సరే అన్నాను. తన ఇంట్లోనే ఉండే వసతి కలిపిస్తానన్నాడు. సో ఐ ఆమ్ సెట్", అంది ఆంటీ.

ఈ కాలం పిల్లల లాగా, ఇలా ఆంటీ ఇంకొకరి ఇంటికి మూవ్ అవ్వడం షాకే. తెరుకోవడానికి నాకే సమయం పడే టట్లుంది. ఇంక ఆంటీ వాళ్ళబ్బాయి కి ఏమని జవాబు చెప్పాలి.

అదే మాట, ఆంటీ తోను చెప్పాను. ఆంటీ అదేనవ్వుతో "పిల్లలిద్దరూ కాలేజీకి వెళ్లిపోయారు. వాళ్ళ చిన్నప్పుడు, నేను ఇంట్లో ఉండడం అబ్బాయికి, కోడలికి సౌకర్యంగా ఉండేది, అదీ వారు ట్రావెల్ జాబులు చేసుకొని మరింత సంపాదించడానికి. ఇప్పుడు పిల్లలు ఇంట్లో లేరు. ఒంటరిగా ఉన్న నేను, ఇలాంటితుఫాను సమయాలలో వాళ్లకి సమస్యనే. ఇదో నీ లాంటి వారిమీద ఆధార పడవలసి వస్తుంది. నేనిలా ఇంటి నుంచి వెళ్లిపోయానని, బయట వారికి చెప్పడానికి వాళ్ళు ఇబ్బంది పడతారేమో. కానీ సమయమే అన్నీ సమస్యలకు పరిష్కారం. మొన్నీమధ్యే

మనమరాలు బాయ్ ఫ్రెండ్ తో మూవ్ అయ్యింది అంటే అబ్బాయి, కోడలు పెద్దరిలీఫ్ తో తెగ సంతోష పడలేదు. నేను అలానే మూవ్ అయ్యాననుకొని, అర్ధం చేసుకుని కొన్ని రోజుల తరువాత గొప్ప రిలీఫ్ తో సంతోష పడతారు లే. అయినా నేను అప్పుడప్పుడు వీకెండ్స్ కో, థాంక్స్ గివింగ్ కో కలుస్తూనే ఉంటాలే", సముదాయించింది.

మళ్లీ నా ముఖం లో ఇబ్బంది చూసిందేమో.

"నీవింటికి వెళ్ళమ్మ. నేనే మా వాడికి ఫోన్ చేసి చెప్తాను",అంటూ హగచేసుకొని వీడ్కోలు చెప్పింది.

విన్నారా...ఆంటీ ఆ సీనియర్ హోమ్లో కలిసినాయన తో మూవ్ అయ్యి పోయింది. హే మీకే చెప్పేది, నాగొంతు పెంచా.

తల తిప్పి చూసాను. ఫోన్ వాట్స్ ఆప్, ఫేస్ బుక్ లోకాల్లో మునిగిపోయిన మా వారు, తలెత్తి " ఆ..ఆ..మిస్ అయ్యా...మరో సారి చెప్పు", అన్నాడు.

ఇద్దరం టివి ముందు ఓ అరగంట క్రితం కూల బడ్డాం. టీవీలో సి ఎన్ ఎన్ న్యూస్ వస్తూనే ఉంది. టివి మ్యూట్ చేసి క్లోజ్ కాప్షన్ ఎప్పటిలాగే పెట్టి, కథ మోదలెట్టా. ఇప్పుడు మళ్లీ మొదలెట్టాల?

ఎదురుగా టేబిల్ పైన నా కోసం చేసుకొని కొంచెం రుచిచూసి వదిలిన మోహితో గ్లాస్ ఉంది. ఫ్లోరిడా వచ్చిన తరువాత మోహితో ఇష్టమైపోయింది. నేనే ఈ కాక్టెయిల్ చేసుకున్నా. తెల్ల రమ్ లో, చక్కెర, నిమ్మ కాయ కోసి దాని రసం , సోడా కలిపాను. పుదీనా ఆకులతో పాటు, మా అత్తగారు పోయిన సారి వచ్చినప్పుడు పెరట్లో వేయించిన తులసి చెట్టునుంచి ఆకులు కోసి పైన చల్లాను. తులసి ఆకులు, మాకూ మోహితో కు, సంబంధం లేదన్నట్లు పైన తేలుతున్నాయి. తులసి ఆకుల పైన అంటీ అంటనట్టు మోహితో చుక్కలు స్థితప్రజ్ఞులు లాగా మెరుస్తున్నాయి.

చేయి చాచి, గ్లాస్ అందుకొని మొత్తం మోహితో ని, ఓ గుక్కలో తాగేసా.

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్ట మొదటి కథ' విభాగంలో బహుమతి పొందిన కథ

## ఆటలో అరటి పండు

సింధూరి పోతుల (Prague, Czech Republic)

"**ప్రతీరోజూ** ఇలా కష్టపడుతుంటే మీ ఆరోగ్యం ఏమౌతుందో అని భయంగా ఉందండీ" అంది అన్నపూర్ణ కాస్త ప్రేమా కాస్త భయం కలగలిసిన చూపులతో రాజారావుని చూస్తూ. "ఎందుకు భయం. నాకేమీ కాదు. చిన్నప్పట్నుండీ ధక్కామొక్కీలు తిని పెరిగిన శరీరం. ఈమాత్రానికే ఏమీ అయిపోదులే" అన్నాడు రాజారావు చిన్నగా నవ్వుతూ. "మీకు నవులాటగానే ఉంటుంది. ఉదయం ఐదు గంటలకి మొదలయ్యే మీ దినచర్య ఇదిగో రాత్రి పదైనా ముగింపుకి రాదు. ఉదయం స్కూలుకెళ్తూ నోట్లోవేసుకునే ఆ నాలుగుమెతుకులే. తరవాత మళ్ళీ

టీనీళ్ళు తప్ప వేరే ఏమీ తిననుకూడా తినరు. అలా అయితే ఆరోగ్యం పాడుగాక ఏమౌతుంది. నా కంఠశోషనాదే గాని కొంచెంకూడా మీరు చెవినిపెట్టరుకదా" అంది నిష్ఠూరంగా చూస్తూ.

"ఇంకెన్నాళ్ళులే పూర్ణా. ఇంకో ఐదు సంవత్సరాలు. అంతే. రెండోవాడి చదువుకూడా అయిపోతే ఆ తరవాత కష్టపడమన్నా పడను. సాయంత్రం ఐదవగానే ఇంటికొచ్చేస్తాను. సరేనా" అన్నాడు రాజారావు అన్నంలో మజ్జిగ కలుపుకుంటూ.

ఉదయం ఎండలో ఇంటి ఎదురుగా ఉన్న వేపచెట్టునీడలో వాలుకుర్చీలో కూర్చొని ఉన్న రాజారావు మాస్టారి మస్థిష్కంలో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. చేతిలో ఆరోజు పేపరు ఉందిగాని రాజారావుగారి దృష్టి పేపరుమీద లేదు. అసలాయన దృష్టి చుట్టుపక్కలున్న దేనిమీదా కేంద్రీకృతమైలేదు. కళ్ళు శూన్యంలోనికి చూస్తున్నాయి. మస్తిష్కంలో ఆలోచనలు గతాన్ని తొలుచుకుంటూ పోతున్నాయి.

"ఎంత కాలం గడిచింది అన్నపూర్ణతో ఈమాట చెప్పి. పన్నెండేళ్ళా. అవును....పుష్కరకాలం" అనుకున్నారు తనలో తను.

గతం కళ్ళముందు కదలాడింది. గడిచిపోయిన బాల్యం గుర్తొచ్చింది. బాల్యంలో అనుభవించిన పేదరికం ఆకలీ జ్ఞాపకానికొచ్చి అన్ని దశాబ్దాల తరవాత కూడా మళ్ళీ భయమేసింది. అంత పేదరికంలో కూడా క్లాసు ఫస్టుగా చదువుకునే తన తెలివితేటలతో పాటు ఐదోక్లాసు తరవాత "ఇంక సదివింది సాలుగాని నాతోపాటూ పనిలోకిరా ఈ శెలవలకాడ్నించీ" అని నాన్న అన్నమాటలు గుర్తొచ్చి గుండె జలదరించింది. నాన్న మాటలువిన్న తన కళ్ళలో క్రిష్ణా గోదావరీ కలిసి ఉప్పొంగడం గుర్తొచ్చి చెమర్చిన కళ్ళు గట్టిగా మూసుకుంటే...మూసిన కనురెప్పలకింద దేవానందం మేస్టారి రూపం లీలగా కదలాడింది. ఆయన చేసిన మరిచిపోలేని సాయం గురొచ్చి హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. "ఆ రోజు మాస్టారే గనక ఆదుకోకపోతే నా బ్రతుకు ఊరిలో రోజుకూలీగా తెల్లారిపోయుండేది" అనుకున్నారు దేవానందంమాస్టారిని తలచుకుంటూ. గవర్నమెంటు హాస్టళ్ళలో బ్రతికిన రోజులు..... అసలు వాటినెప్పుడైనా మరచిపోతేకదా. "నా మట్టుకు నాకు గవర్నమెంటు హాస్టళ్ళలో ఉండి చదువుకోవడం మంచి చేసిందనే అనిపిస్తుంది పూర్ణా. అక్కడ క్రిమికీటకాదులతో నిండిన చాలీచాలని తిండి తిని బ్రతకగలిగాక ప్రపంచంలో ఏప్రాంతంలోనైనా, ఏ రకమైన తిండి తినైనా బ్రతకొచ్చుననే విశ్వాసం ఏర్పండింది తెలుసా" అని భార్యతో తనెప్పుడూ చెప్పే మాట గుర్తొచ్చి అంత ఆందోళనలోనూ చిన్నగా నవ్వొచ్చింది.

సగం నిండిన కడుపుతో, మాసికలు వేసిన గుడ్డలతో ఇంటర్మీడియెట్ కాలేజీ ఫస్టుగా పాసవడం, త్వరగా తన కాళ్లమీద తను నిలబడి నాన్నకు సాయపడాలన్న ఆలోచనతో టీచర్ ట్రైనింగులో జాయిన్ అవడం గుర్తుచేసుకొని 'ఆ టైంలో ట్రైనింగులో జాయినవ్వకపోయి ఉంటే జీవితం ఎలాఉండేదో" అనుకున్నారు తనలో తను. ఎందుకంటే భగవంతుడి దయవలన ఆయన ట్రైనింగు పూర్తిచేసిన సమయానికే టీచర్ల నియామకానికి ప్రభుత్వం ప్రకటన జారీచెయ్యడం, స్వతహాగా తెలివైన రాజారావుగారు ఎవరికీ చేతులూ మూతులూ తడపక్కరలేకుండానే ఆ పరీక్షలో ఎంపిక కావడం జరిగింది ఆరోజుల్లో కూడా నమ్మశక్యంకాని అద్భుతమే. ప్రభుత్వోపాధ్యాయునిగా ఉద్యోగం రావడం 'నాకొక్కడికే కాదు, మాకుటుంబం మొత్తానికే అదొక పెద్ద మలుపు' అనుకున్నారు స్వగతంగా. ఉద్యోగం వచ్చాక అంతకుముందులా ఆకలితో కాకపోయినా ఆర్ధికపరమైన పోరాటం సాగించడం తప్పలేదు రాజారావుగారికి. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేయడం అత్యంతప్రధానమైన విషయం రాజారావుగారికి. చదువుసంధ్యలు పెద్దగాలేని చెల్లెల్లిద్దరికీ ఇద్దరు రాజకుమారుల్ని తీసుకొచ్చి కట్టబెట్టకపోయినా తిండికీ బట్టకీ లోటులేని సంబంధాలు చేయగలిగారు. దానితోపాటూ ఒక్కగానొక్క తమ్ముడి చదువుసంధ్యలూ, ఉద్యోగంకూడా.

ఈ బాధ్యతలన్నీ ఒక్క తనజీతం మీద ఆధారపడే నిర్వర్తించాల్సివస్తే చేయలేకపోయేవారే. కాకపోతే రాజారావుగారి అదృష్టమేమంటంటే ఆయన లెక్కల్లో రామానుజమంతటి ఘనాపాఠీ. ఎంత క్లిష్టమైన లెక్కనైనా అవలీలగా చేసిపారేసే తెలివితేటలు ఆయన సొంతం. ఆ తెలివితేటలే హైస్కూలు రోజులనుండీ ఆయనను ఆదుకుంటూ వచ్చినది. ఎలాఅంటే...ఆయన ఏ క్లాసులో ఉంటే దానికంటే చిన్నక్లాసులవారికి అర్ధంకాని లెక్కలు బోధపరచి, వారిచ్చిన తృణమో పణమో తీసుకొని దానితో తన పుస్తకాలూ పెన్నుల ఖర్చులు గడుపుకునేవారు. ఆయన ఇంటరు చదువుతున్నప్పుడూ, టీచరుట్రైనింగ్ చేస్తున్నరోజుల్లోనూ కూడా ఆయనను ఆదుకున్నది ఆ లెక్కలపాండిత్యమే. అదే ఆయన్ని మళ్ళీ ఇంకొకసారి కాపాడింది. ఖాళీ సమయంలో విద్యార్ధులకి లెక్కలు చెప్పి సంపాదించిన కొద్దిపాటి డబ్బు ఆయనకొచ్చే జీతానికి వేడినీళ్లకి చన్నీళ్ళులా తోడవడంతో తన బాధ్యతలు కష్టంగానైనా నిర్వర్తించగలిగారు. అదే సమయంలో ప్రైవేటుగా డిగ్రీ చదివి తరవాత కష్టపడి బిఈడీ కూడా చేసి, హైస్కూలు ఉపాధ్యాయుడిగా పదోన్నతిపొందిన తరవాతగాని తన గురించి ఆలోచించుకోలేదు.

ఆ తరవాతైనా ఆయన జీవితం గాడిన పడి సాఫీగా సాగిందా అంటే అలాంటిదేమీ లేదు.. ఎక్కడికక్కడ మనుగడకోసం పెనుగులాటే. 'తనపిల్లలు తను పడినట్టు దేనికీ కష్టపడకూడదు. ఏ విషయంలోనూ వారికి లోటురానికూడదు' అన్న రాజారావుగారి సంకల్పం నెరవేరడానికి ఆయన మళ్ళీ లెక్కలనే నమ్ముకోవలసి వచ్చింది. ఉదయం ఆరుగంటలనుండి ఎనిమిదిగంటలవరకూ ఇంట్లోనూ, సాయంత్రం స్కూలు అయిపోయిన తరవాత రాత్రి తొమ్మిది గంటలవరకూ కోచింగ్ సెంటర్లలోనూ లెక్కలట్యూషన్లు చెప్పి చెప్పి ఇంటికి వచ్చేసరికి పిల్లలతోనూ భార్యతోనూ మాట్లాడడానికిగాని గడపడానికిగాని సమయం గాని, శక్తిగాని ఉండేవికాదు. పిల్లల స్కూల్లో జరిగే ఏ కార్యక్రమానికీ, ఆఖరుకు 'పేరెంట్-టీచర్' మీటింగుకి కూడా రాజారావుగారు ఎప్పుడూ హాజరుకాలేదంటే, ఆ సమయంలో ఆయన ఎవరికో ఎక్కడో లెక్కలు చెప్తూ పిల్లలకోసం పదిరూపాయలు సంపాదించే ప్రయత్నంలో ఉండడం తప్ప వేరే కారణం ఏదీ లేకపోయినా, బాధ్యతల మధ్య నలిగిపోతున్న మాస్టారికి అహోరాత్రులూ తను ఎందుకు, ఎవరికోసం, అంతలా కష్టపడుతున్నాడో వారికి ....అంటే ఆయన పిల్లలకి... ఆవిషయం అర్ధమయ్యేలా చెపాలన్న ఆలోచనే ఎప్పుడూ స్ఫురించేదికాదు. దానికితోడు స్వతహాగా అంతర్ముఖుడేమో (ఇంట్రోవర్ట్), పిల్లలమీద తనకున్న ప్రేమని వ్యక్తంపరచడం ఎలాగోకూడా ఆయనకు తెలిసేది కాదు. కనీసం అన్నపూర్ణమ్మగారైనా తండ్రి అంతగా కష్టపడుతున్నది వాళ్ళ సుఖంకోసమేనని పిల్లలకి ఎప్పుడైనాచెప్పి ఉంటే వాళ్ళకి తెలిసుండేదేమో. అయితే ఆ బాధ్యత నిర్వర్తించడంలో ఆవిడ పూర్తిగా విఫలమయ్యారని నిస్సందేహంగా చెప్పొచ్చు. దాని పర్యవసానం "అమ్మకి మామీద ఉన్న ప్రేమలో కనీసం వందోవంతైనా నాన్నకి లేదనీ, అందుకే ఆయన మాతో సరిగ్గా మాట్లాడనుకూడా మాట్లాడరనీ అంటీముట్టనట్టుంటారనే అభిప్రాయం పిల్లల మనసుల్లో చిన్నతనంలోనే గట్టిగా నాటుకుపోవడం. ఆ పరిణామం పిల్లలకు తల్లి ఎడల ఎక్కువ ప్రేమానురాగాలు ఏర్పడడానికీ వారి జీవితం మొత్తం తల్లిచుట్టూనే పరిభ్రమించేలా చేయడానికీ దోహదపడడమేకాక పిల్లలకీ తండ్రికీ మధ్య అనుబంధంగాని, ఆత్మీయతగాని మృగ్యమై పూడ్చశక్యంకాని అగాధం చోటుచేసుకోవడానికి కారణభూతమైంది.

చిన్నప్పుడు స్కూల్లో చాక్లెట్లో, బిస్కెట్లో కొనుక్కోవడానికి కావలసిన చిల్లరడబ్బుల దగ్గరనుండి పెద్దై కాలేజీకి వచ్చాక బండిలో పెట్రోలు వెయ్యించుకోవడానికో, జత బట్టలు కొనుక్కోవడానికో కావలసిన డబ్బులవరకూ అన్నీ అమ్మనే తప్ప నాన్నని అడగడం అనే ప్రశ్నే తలెత్తేది కాదు. స్కూల్లో కాలేజీలో జరిగే ప్రతీవిషయం పంచుకునేది తల్లితోనే. ఏచిన్న సమస్య వచ్చినా చెప్పుకునేదీ తల్లితోనే. "ఈ విషయం నాన్నకి చెప్తే ఆయనకూడా సంతోషిస్తారుకదా" అన్న ఆలోచనే పిల్లలకెప్పుడూ వచ్చేదికాదంటే అది అబద్ధం కాదు. ఏ శెలవురోజో కాస్త టైం

దొరికి తల్లీకొడుకులు కబుర్లు చెప్పుకుంటున్న దగ్గరకి రాజారావుగారు వెళ్ళి కూర్చుంటే పిల్లలు చాలా ఇబ్బందిగా ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చొని, నెమ్మదిగా లేచి వెళ్ళిపోయేవారు అక్కడనుండి.

కాలచక్రం గిర్రున తిరిగి, పిల్లలు పెద్దాళ్ళూ, మాస్టారూ అన్నపూర్ణమ్మగారూ వృద్ధులూ అయిపోయారు. మాస్టారు రిటైర్ అయ్యారు కూడా. మాస్టారు కలలు కన్నట్టే ఐఐటీల్లో చదివిన ఇద్దరు కొడుకులూ, ఈకాలం కుర్రాళ్ళలా "దర్టీ ఇండియా" అనుకుంటూ, అమ్మని వదిలేసి అమెరికాకి ఎగిరిపోలేదు. ఇక్కడే మంచి ఉద్యోగాల్లో కుదురుకొని, ఉన్నతమైన స్థానాలకు చేరుకున్నారు. వారిద్దరి పెళ్ళిళ్ళూ అన్నపూర్ణమ్మగారికి నచ్చిన, ఆవిడ ఎంపికచేసిన అమ్మాయిలతోనే ఆవిడ కోరుకున్నట్టే జరిగాయి. పండగలకీ పబ్బాలకీ వచ్చినప్పుడు "అత్తయ్యా అత్తయ్యా" అంటూ భార్య వెనకాతల తిరుగుతున్న కోడళ్లని చూస్తున్న మేస్టారి కళ్ళు ఆనందంతో మెరవడం ఇంట్లోవారెవరూ గమనించకపోవడం మాస్టారికసలు తెలియనే తెలీదు. ప్రతీరోజూ ఏదో ఒకటైంలో ఫోను చేసి పిల్లలు తల్లితో కనీసం పావుగంటసేపైనా మాట్లాడుతుంటే "ఈ కాలంలో కూడా కన్నతల్లిదండ్రుల్ని ఇంతగా ప్రేమించే పిల్లలుండడం నేనూ పూర్ణా ఎప్పుడో పూర్వజన్మలో చేసుకున్న పుణ్యం." అనుకొని ఆనందించేవారు. "అన్నపూర్ణ గురించి నాకేమీ దిగులులేదు. నేనుపోయినా కళ్ళలో పెట్టుకొని చూసుకుంటారు కొడుకులూ కోడళ్ళూ" అనుకునేవారు నిశ్చింతగా. అంతేకాదు భార్యకంటే తనే ముందుపోవాలని కూడా కోరుకునేవారు మనస్ఫూర్తిగా.

అయితే మాస్టారు ఒకటనుకుంటే భగవంతుడు వేరేవిధంగా అనుకున్నాడో ఏమో మహాలక్ష్మిలా ఆరోగ్యంగా తిరుగుతున్న అన్నపూర్ణమ్మగారికి ఒక రాత్రి తెల్లవారలేదు. నిద్రలోనే వెళ్ళిపోయారు. ముప్పైఏళ్లపైబడి తనకు తోడూనీడగా ఉన్న భార్య అకస్మాత్తుగా తననలా ఒంటరిని చేసి వెళ్ళిపోతుందని ఏనాడూ ఊహించని మాస్టారు ఆదెబ్బకి తట్టుకోలేకపోయారు. కొడుకులకి ఎలా ఫోను చేసారో, వాళ్ళెప్పుడువచ్చి చేయవలసిన కర్మకాండలు ఎలా పూర్తిచేసారో ఏమో.... అంతా ఏదో అచేతనావస్థలో ఉండి చూస్తున్నట్టు మూగగా చూస్తూ ఉండిపోయారు రాజారావుమాస్టారు.

ధశదినకర్మ అయిపోయిన మరుసటిరోజే ప్రయాణమైపోతున్న పిల్లలు ఇంకా కొన్నిరోజులు ఉంటే బాగుండునని మనసులోఉన్నా "బాధ్యతాయుతమైన ఉద్యోగాల్లో ఉన్నపిల్లలు. ఇప్పటికే చాలా రోజులున్నారు ఇంకెన్నాళ్ళుండగలరని" సరిపెట్టుకొని ఉండమని అడగలేదు. "మాతో వచ్చెయ్యండి నాన్నా. ఒక్కరే ఇక్కడెలాఉంటారు అమ్మలేకుండా" అని బలవంతంచేస్తారేమో వాళ్ళమనసులు కష్టపడకుండా రానని ఎలా చెప్పాలా అని తర్జనభర్జన పడిన మాస్టారు కొడుకులుగాని కోడళ్ళుగాని ఆ మాటే ఎత్తకపోవడంతో, కొంచెం ఆశ్చర్యానికి గురైనా, నిశ్చింతగా నిట్టూర్చారు. "మీ ఆరోగ్యం జాగ్రత్త సుమండీ. అవసరం అయితే ఫోను చెయ్యండి" అని చెప్పి బయల్దేరి వెళ్ళిపోయారు పిల్లలు. వెళ్ళి మూడునెలలవ్వొస్తోంది. అమ్మ బ్రతికిఉన్నప్పుడూ ప్రతీరోజూ విధిగా ఫోనుచేసి మాట్లాడే పిల్లలు తనతో కూడా అలాగే రోజూ మాట్లాడతారని ఎదురుచూసిన మాస్టారికి నిరాశే మిగిలింది. వారంరోజులు ఎదురుచూసి "పిల్లలు చెయ్యకపోతేనేం. నేను చెయ్యొచ్చుకదా" అనుకొని ఫోను చేసిన మాస్టారికిగాని పిల్లలకిగాని మాట్లాడుకోవడానికి విషయాలే కరువవడంతో ఒకట్రెండు ప్రయత్నాలతరవాత అదికూడా మానుకున్నారు. భార్యలేని లోటు ప్రస్ఫుటంగా తెలుస్తోంది మాస్టారికి. భార్య బ్రతికిఉన్నప్పుడు ప్రతీ చిన్న విషయానికీ ఆవిడమీద ఎంతగా అధారపడేవారో అవగతమైంది. స్నేహితులంటూ పెద్దగా లేని మాస్టారికి రోజులు గడవడం కూడా కష్టంగా మారింది. పర్యవసానంగా ఆందోళనా ఆతురతా ఎక్కువై నిద్రాదేవత శీతకన్నేసింది. పొద్దు గడవడమే కష్టమైన మనిషికి రాత్రినిద్ర కూడా కరువైతే జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందో అనుభవంద్వారా తెలుసుకున్నమాస్టారు నిద్రకొరకు మాత్రల్ని ఆశ్రయించాల్సిన అగత్యం ఏర్పడింది.

ఏంచెయ్యాలో పాలుపోని సంకటస్థితి. 'ఏదైనా వృద్ధాశ్రమానికి వెళ్ళిపోతేనో?' అనే ఆలోచన వచ్చినా దాన్ని మొగ్గలోనే తుంచేసారు. భార్యతో చివరివరకూ కలిసి జీవించిన ఆఇంటిలోనే తను కూడా తుదిశ్వాస వదలాలి అనేది అందుకు మొదటి కారణం అయితే వృద్ధాశ్రమాలమీద ఆయనకి సదభిప్రాయంలేకపోవడం రెండవకారణం. "అన్నపూర్ణ లేకుండా ఇలా ఒంటరిగా ఎన్నాళ్ళో జీవించలేను. ఏదో ఒకటి చెయ్యాలి. లేకపోతే ఆత్మహత్యే శరణ్యం" అనుకున్నారు నిండుగా ఉన్న నిద్రమాత్రలసీసా కళ్ళముందు కదులుతుండగా .

"ఏంచేయాలి ఈ దురవస్థనుండి ఎలా బయటపడాలి" అని దీర్ఘంగా ఆలోచిస్తున్న మాస్టారికి ఈశ్వరప్రసాదంలా (godsend) గుర్తొచ్చారు. అదే ఊరిలో అనాథాశ్రమాల్లో ఉంటూ గవర్నమెంటుస్కూళ్ళలో చదువుకుంటున్న అనాథపిల్లలు. ముప్పైఐదేళ్ళకుపైగా ప్రభుత్వోపాధ్యాయునిగా పనిచేసిన మాస్టారికి అలాంటి ఆశ్రమాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల విద్యాప్రమాణాలు ఏస్థాయిలో ఉంటాయో తెలియని విషయంకాదు. "భగవంతుడు తప్ప వేరే దిక్కులేని ఆ అనాథలకోసం ఏమైనా చేస్తే బాగుంటుందేమో" అని అనిపించిన మరుక్షణమే "ప్రతీరోజూ వారుంటున్న ఆశ్రమానికి వెళ్ళి వారికి లెక్కలూ, ఇంకా అర్థంకాని పాఠాలూ చెప్తేనో" అన్న ఆలోచన రావడంతో ఒక్కసారిగా వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టనిపించింది మాస్టారికి. "అవును అక్కడ పిల్లలకి ఉదయం సాయంత్రం ఉచితంగా లెక్కలూ ఇతర పాఠాలూ చెప్పొచ్చు. అంతే కాకుండా టెంత్, ఇంటర్మీడియేట్ చదువుతున్న పేదవిద్యార్థులకి కూడా ట్యూషన్లు ఫ్రీగా చెప్పొచ్చు. ఇన్నాళ్ళూ కన్నబిడ్డలకోసం, తోడబుట్టినవాళ్ళకోసం కష్టపడిన నేను ఇప్పటికైనా దేవుడు తప్ప దిక్కులేని అనాథలకోసం ఈపని చేస్తే ఇన్నాళ్ళ నా ఉపాధ్యాయవృత్తికి న్యాయం చేసినవాడ్ని అవుతాను. పిల్లలు మాట్లాడడంలేదనీ, సమయం గడవడం లేదనీ కలుగుతున్న బాధకూడా దూరమౌతుంది. రేపేవెళ్ళి ఆశ్రమం నిర్వాహకులతో మాట్లాడతాను తప్పకుండా" అనుకున్నారు తేలికపడ్డ మనసుతో.

ఆ రాత్రి నిద్రపట్టడానికి నిద్రమాత్రల అవసరం లేకపోయింది రాజారావు మాస్టారికి.

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

## కల్యాణం, కమనీయం

సి.హెచ్. రమాకాంత్ (Hamburg, Germany)

**ప్రకృతి పచ్చ** తోరణం తొడిగే వేళ, చెట్టూ-పుట్ట సింగారించుకొనే వేళ, చలి గాలుల వీర విహారాన్నీ శమింపచేస్తూ, నులు వెచ్చని కిరణాలు ఉదయించే వేళ, ఎన్నో ఆశలతో ఎన్నో కొత్త కబుర్లతో, పంచాంగ శ్రవణాలతో, తెలుగు వారందరు ఒక్కటయ్యి ప్రకృతి మార్పులని స్వాగతిస్తూ ఆనందోత్సాహాలతో జరుపుకునే ఉగాది పండగ!, మరొక పక్షం రోజులలో రాబోతోంది. అయితే ఇప్పట్నించీ హడావుడి ఎందుకు అనుకుంటున్నారా, మా నాన్న స్వామి గుడి నిర్వాహకులు గా వ్యవహరిస్తున్నారు, మరి హడావుడి అంతా మాదే కదా! ఉగాది వచ్చే పక్షం రోజుల ముందుగానే గుడి ప్రధాన పూజారి గారు మా నాన్న తో గుడి కార్యక్రమాలన్నిటిని చర్చించి, పండగ కి అవసరమైన హంగులు, ప్రతి ఏడాది జరిపే ఉత్సవాలు గురించి కూలంకషంగా మాట్లాడి, గుడి కి అవసరమైన చందాలని, ఆహ్వానించాల్సిన

పెద్ద మనుషులని, పంచాంగ శ్రవణానికి పండితులని , ముఖ్య మైన వారందరిని సమావేశపరిచి, ఉగాది ఎలా దిగ్విజయంగా జరపాలి అన్న విషయాలని, ఆలోచించుకుని కార్యచరణ సిద్ధం చేసుకుంటున్నారు. అన్నింటికంటే అతి ముఖ్య మైనది, గుడి మూల విరాట్ అయిన వేంకటేశ్వర స్వామి కి ఇచ్చే లాంఛనాలని, అమ్మవారికి ఇవ్వాల్సిన ఆభరణాలని గుర్తు చేసుకుంటూ కార్యాచరణ మొదలు పెట్టారు.

అన్నట్టు చెప్పటం మరిచాను నా పేరు 'పద్మావతి', మా ఊరికి దగ్గరలో ఉన్న కళాశాలలో డిగ్రీ పూర్తి చేసాను.చిన్న నాటి నుండి గుడి ప్రాంగణ వాతావరణం లో పెరిగిన కారణం చేత ఏమో గాని , నా దృష్టి అంతా గుడి మీదే ఉండేది, జరిగే ప్రతి ఉత్సవం, ప్రతి పండగ, నా మనసులో బలంగా ముద్రించుకుపోయాయి. పైగా నాన్న గుడి నిర్వాహకులవ్వటం చేత, ప్రతి కార్యక్రమం లోను పూజారి గారు ప్రధమంగా మమ్మల్ని ఆహ్వానించడం, మేమంతా వెళ్లి స్వామి ఆశీర్వాదం తీసుకోవడం, అటు పైన జరిగే ఉత్సవాలలో ముందుగా ఉండి, కార్యక్రమాలలో పాలు పంచుకునే అవకాశం దక్కేది, స్నేహితులమంతా కలిసి వీలైనప్పుడల్లా చిన్న పాటి కచేరి కూడా చేసేవాళ్ళం. ఇలా ఇంట్లో ఉండే సమయం కన్నా గుడిలో ఉండే సమయమే ఎక్కువ గా ఉండేది.

మా ఊరి లో గుడి అంత అందమైన గుడి నేనెక్కడ చూడలేదు. మేఘాలని సైతం పలకరించే గాలి గోపురం, నలు దిక్కులా వ్యాపించి నట్లుగా ఉండే ఆలయ ప్రాకారం, ఏనుగులతో కానీ తెరవ లేనంత ప్రధాన ద్వారం, లోపలి అడుగిడిన వెంటనే వెండి ధ్వజస్తంభం , దాని కిందనే హనుమ చిన్న విగ్రహం. రాతి బండను సైతం ఆలయ అంతర్భాగంగా మలిచారు, ఎంతో శిల్ప కళా నైపుణ్యం, ముఖ్యమైన రామాయణ, మహాభారత ఘట్టాలు, దశావతారాలు, వాటి చరిత్రలు, వాటిపై చెక్కి ఉన్నాయి, అన్నింటికంటే ముఖ్యమైనది మూల విరాట్టు, 'వేంకటేశ్వర స్వామి', ఆజానుబాహుడు, అరవింద నేత్రుడు, ఊరందరిని చల్లగా చూసే వెంకన్న స్వామి, చిరు మందహాసం తో వచ్చిన వారందరికీ దర్శనం ఇచ్చి ఆశీర్వదిస్తున్నాడు, పక్కనే 'పద్మావతీ దేవి', శాంత మూర్తియై, జగన్మాత అయి, పెద్ద కన్నులతో, స్వామి వారి కంటే కొంచెం మించిన మందహాసంతో, పెద్ద ముక్కుపుడక పెట్టుకొని, వచ్చీ పోయే ప్రజలందరినీ బిడ్డల్లాగే చూసుకుంటూ, మురిసిపోయి చూస్తున్నట్టుగా అనిపించేంత స్వరూపం, అంతే ఇది గా భూదేవి మరో వైపు ఆశీర్వదిస్తూ , ఊరికొచ్చే ప్రతి కష్టాన్ని తీరుస్తూ, కొలువయి ఉన్నారు. అటు పైన, ధ్వజస్తంభానికి ఆగ్నేయంగా పెద్ద రావిచెట్టు-వేపచెట్టు కలగలిసిన ప్రదేశం, అక్కడ కూర్చుంటే వచ్చే చల్లని పిల్ల గాలికి తనువంతా కూడా మైమరిచిపోతుంది, 'సాక్షాత్తు వైకుంఠమే' అన్నంత అద్భుతమైన దృశ్యం గా కనిపిస్తుంది నా కళ్ళకి. గర్భ గుడికి ఈశాన్యంగా గుడి కోనేరు, గుడి బయట అందమైన సెలయేరు, ఎదురుగా పెద్ద రావి చెట్టు, దాని జడలు పట్టుకుని ఉయ్యాలలూగే చిన్నారులు, దాని కింది రచ్చబండ, రచ్చబండ మీద పేకాటరాయుళ్లు, సెలయేటి పిల్లకాయలు గోచీలు కట్టి మహా జోరుగా ఈత కొడుతున్నారు, మరో పిల్లాడికి నేర్పిస్తున్నారు, వాడు రాను కుయ్యో-మొర్రో అంటుంటే లాక్కొచ్చి మరీ పడేసారు నీటిలో, ప్రాణి లక్షణం కదా ప్రాణాన్ని కాపాడుకోవటం, దానంతటదే వచ్చేసింది ఈత, ఈదుకుంటూ బయటకొచ్చేసాడు, ఈసారి వాడే దూకాడు, మహా జోరుగా!. సెలయేటి వాసులు ఈరోజు ఈత నేర్చుకున్నట్టే రేపు సంసారం మనే సముద్రంలోనూ అంతే సరదాగా ఈదేస్తారు కలిసికట్టుగా. నిజానికి గుడి చుట్టూ మన జీవితాలని పెన వేసుకు పోయేలాగా మన సంస్కృతీ సంప్రదాయాలని తీర్చి దిద్దిన ఎందరో మహాను భావులకి శత కోటి వందనాలు, ఎందుకంటే, ఆలోచిస్తే ప్రతి పనిలోనూ మనలో తెలీకుండానే ఒక ఆధ్యాత్మిక భావనని, సాత్విక లక్షణాలు అల వోకగా అలవర్చుకోగలిగే విధంగా రోజు వారి జీవితంలో ముడి వేసేసారు. ఏ కష్టం వచ్చినా , సంతోషం వచ్చినా అన్ని గుడి ఆవరణ లోనే, నలుగురితో గడపడం, నలుగురితో కాలక్షేపం, వయసు మళ్ళినా కూడా ఎక్కడ నిరాశ నిస్పృహలకు లోను కాకుండా, మనసుని ఉత్తేజ పరుస్తూ ఆహ్లాదకరంగా నిలిచే వాతావరణాన్ని కల్పిస్తూ, మనిషి మనస్సుని సంస్కరించే విధంగా తీర్చిదిద్దిన మన ఋషులందరి ఋణం ఎలా తీర్చుకోగలం!, వారి పేరుని గోత్రంగా మన వంశానికి తగిలించుకోవడం, వారు నేర్పిన సంస్కృతీ సంప్రదాయాలని గౌరవించడం తప్ప!

అది అలా ఉంటే, ఇదిగో ఉగాది రానే వచ్చింది, అసలే గుడి పెద్దలం కాబట్టి, ఆ రోజు తెల్లవారు జాము రెండింటికే లేస్తాము, నాలుగింటికల్లా, స్వామి వారికి జరిగే ఉత్సవ పూజలో, ఊరి పెద్దలు, ఆహ్వానితులు అందరు కలిసి పాల్గొంటారు, ప్రధమంగా స్వామి వారికి పూజ మా చేతనే చేయిస్తారు, అందులో నేను కూడా కూర్చుంటాననుకోండి, పూజ 2 గంటలు పడుతుందిట, సంవత్సరమంతా ఎదురు చూసి, ఆ ఒక్కరోజు మాత్రమే దొరికే అరుదైన అద్భుతమైన క్షణాలు, ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుండగానే, రానే వచ్చింది, షడ్రుచులతో, షడ్భావాలని, నవ నాడులని ఉత్తేజితం చేసే పచ్చడి అదేనండి 'ఉగాది పచ్చడి', పూజారి గారు స్వామికి నివేదించడం అయిపోయింది, ఇంక ప్రసాదం తీసుకోవటం తరువాయి, ఎపుడు చేతిలో పడిందో ఎపుడు నాలిక చేతిని తుడిచేసిందో తెలియదు అంతా ఒక్క క్షణం లో జరిగిపోయింది, ఇంకా తనివి తీరక ఇంకొంచెం అడిగి తీస్కొని తింటే గాని ఊరుకోలేదు ఆత్మా రాముడు. గుడి ప్రాంగణం లో కూర్చొని స్వామి వారిని, వచ్చీ పోయే జనాలని చూస్తూ కూర్చున్నాను, మెల్లగా రద్దీ తగ్గింది. ఇదిలా వుంటే, నాకు తెలియకుండా మరొక కబురు కూడా తీసుకొచ్చింది కొత్త సంవత్సరం. 'శ్రీరామనవమి మరునాడే పెళ్లి చూపులు అని, పిల్లాడు అమెరికా లో ఉంటాడని, 'వేదిక్ ప్రొఫెసర్' గా పని చేస్తున్నాడని, వాళ్లందరికీ నచ్చాడని', చెప్పి నాన్న తన పనిలో నిమగ్నమైపోయారు. అంతే! దెబ్బకి ఉత్సాహం అంతా నీరు గారి పోయింది, తెలీకుండానే కళ్ళ నిండా నీళ్లు తిరిగాయి, ఎంతలా అంటే, 'ఎదురుగా ఉన్న స్వామి కూడా కనిపించనంత'!

ఎప్పుడు వచ్చిందో తెలీదు కానీ, అమ్మ నా దగ్గరకొచ్చి కూర్చుంది. నాలో జరిగే అంతర్మధనాన్ని ముందే పసిగట్టిందో ఏమో, శ్రీనివాస కళ్యాణం చెప్పడం ఆరంభించింది. "తెలుసు కదా అమ్మ ఎన్ని సార్లు చెప్తావ్!" అని అన్న వినిపించుకోలేదు, పైగా అంటుంది, "పద్మావతీ దేవి!, అంతటి జగన్నాధుడు భర్తగా రావాలని గట్టిగ కోరుకుంది కాబట్టే, సాక్షాత్తు స్వామి వారే దొరికారు, నువ్వు కూడా అలాగే కోరుకో మంచి మొగుడే వస్తాడు" అని, "రెండు వంశాలని తరింప చేయగలిగే శక్తీ దేవుడు ఆడవారికి మాత్రమే ఇచ్చారు, అది మనకే సొంతం, అనవసరమైన పిచ్చి ఆలోచనలు చేయక, చెప్పింది విను!" అని చెప్పి వెళ్ళిపోయింది. ఎన్ని చెప్పినా మనసూరుకోలేదు. చిన్నపటినుంచి పెరిగిన వాతావరణం, ఇల్లు, గుడి, అమ్మ నాన్న, స్నేహితులు, అందరిని వదిలి ఎక్కడో అమెరికా కి వెళ్ళాలా, అసలు నాకీ బంధాలెందుకు, పెళ్ళెందుకు చేసుకోవాలి, ఎప్పుడూ మా నాన్న తో నే ఎందుకు ఉండకూడదు!, అన్ని పనుల్లో మా నాన్నకి సహాయం చేస్తూ ఇక్కడే ఉండి పోవచ్చుగా, అంతగా అవసరమైతే ఈ ఊళ్ళోనో లేకపోతె చుట్టూ ఉన్న ఊళ్ళలోనూ సంబంధాలు వెతకచ్చు కదా!, అమెరికా దాకా వెళ్ళాలా,నన్ను కనీసం ఒక్క మాట కూడా అడగలేదు, అసలు ఈ గుడి ని వదిలి ఎలా వెళ్ళాలి, తలుచుకుంటేనే ఏడుపు తన్నుకు వచ్చేస్తోంది. ఒక్కగానొక్క కూతుర్ని, ఇల్లరికం తెచ్చుకోవాలి అని కూడా అనుకోవట్లేదెందుకో, ప్రయత్నిస్తే దొరుకుతారు కదా!. ఇలా ఎన్నో ఆలోచనలు చుట్టుముట్టాయి. నేరుగా గుడి లోపలి అమ్మ వారి ముందు కూర్చున్న, అభయ హస్తంతో, చిద్విలాసంతో, పెద్ద కన్నులతో, ప్రశాంత చిత్తం తో కనిపించింది, 'ఏంటో విషయం' చెప్పమన్నట్టుగా పలకరిస్తున్నట్టుగా ఉంది ఆ క్షణంలో 'అమ్మవారు'. ఎలాగైనా పెళ్లి కుదరకుండా చూడమని వేడుకొని, ఇంటికి వచ్చేసాను. బహుశా ప్రతి అమ్మాయి పెళ్ళికి ముందు ఇంతేనేమో. కానీ సత్యమేమిటంటే, నేను చూసిన వారందరు, పెళ్ళికి ముందు ఎన్ని అనుకున్న, పెళ్ళైన మరుసటి రోజు నుండే చెప్పలేనంత మార్పు, ఎవరు చెప్పనక్కర్లేనంత పరిపక్వత దానంతట అదే వచ్చేస్తోంది వారికి సహజంగా అదేంటో. ఎక్కడో ఎందుకు మా అమ్మ లాంటి వాళ్ళని చుస్తే ఆశ్చర్యమేస్తుంది అపుడప్పుడు, ఎలా తమని తాము తీర్చిదిద్దుకుంటూ, కుటుంబానికి మూల స్తంభంగా ఉంటూ, అన్ని పనులు సమర్ధించటం చుస్తే అమిత మైన గౌరవంతో నిండి పోతుంది మనసంతా. మానవాళికి ఇలాంటి వారు చేసే త్యాగం మరువరానిదిగా అనిపిస్తుంది, త్యాగం సహనం ఓర్పు నిష్ఠ లతో ఇరు వంశాలని ఒక్క చేత్తో నడిపిస్తూ, 'భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని నిలబెడుతూ, సంప్రదాయాలకు విలువనిస్తూ నిలబడే ప్రతి ఆడవారికి, మా అమ్మ లాంటి వారందరికీ, అందరు రుణ పడి ఉండి పోవాల్సిందే' అన్నంత సహృద్భావము కలుగుతోంది .

అమ్మవారిని వేడుకున్నాను గాని , ఏం జరుగుతుందో నన్న భయం, మనసు మనసులో లేదు, అన్నిటికి చిరాకు పరాకు, అసలు నన్నడగకుండా ఇలాంటి ఏర్పాటు చేసినందుకు అమ్మా నాన్న మీద పీకల్దాకా కోపం, ఎవర్ని ఏమి అనలేను. రాత్రి భోజన సమయం అయింది. నేను నా గదిలోనే ఉన్నాను, భోజనానికి అమ్మ పిలుస్తోంది, ఆకలి లేదని అరిచాను!, వెంటనే వాళ్లకి అర్థం అయింది అనుకుంటా, ఇద్దరు కూడబలుక్కొని నా దగ్గరికొచ్చారు, ఎన్నో చెప్పారు, అన్నిటికి విని, ఏం చెప్పలేక అమ్మని గట్టిగ కౌగిలించుకొని నాన్న వైపే చూస్తూ ఉన్నాను, స్వామి వారి లాగే చిద్విలాసంతో ఉన్నాడు మా నాన్న, కొంచెం బాధ కూడా లేదేమిటో. చివరాఖరకి ఒక మాట చెప్పారు, ఇది పెళ్లి చూపులే, పెళ్లి కాదు ఎందుకంత హడలి పోతున్నావ్ అని, కొంచెం ధైర్యం వచ్చి ఆపూట భోజనం కానిచ్చాను.

శ్రీ రామ నవమి రానే వచ్చింది, గుళ్లో కోలాటం– కోలాహలం బానే ఉన్నా, ఈసారి ఏదో తెలియని అలజడి, జరిగే హడావుడిలో సమయం తెలియలేదు, వెచ్చని వేసవి లో చల్లటి పానకం తాగి వడపప్పు తిని గుడి ప్రాంగణం లో కూర్చుని ఉన్నాను. ఎక్కువ దిగులుగా కనిపిస్తే అమ్మ ఈసారి సీత రామ కళ్యాణం చెప్పేస్తుంది, అందుకే ఆలోచనలన్నిటికి స్వస్తి పలికాను జరిగేది జరగక మానదు అనుకుని గుడి చుట్టూ తిరుగుతున్నాను. రేపే పెళ్లి చూపులు, చూద్దాం ఏం జరుగుతుందో, రాముడు వస్తాడో రావణుడో ఎవరికి ఎరుక! ముఖ్యమైన బంధువులు, ఇరుగు పొరుగు వారందరు  వచ్చారు, నా ప్రమేయం లేకుండానే నన్ను చక్కగా తీర్చి దిద్దారు, నాకు నేనే నచ్చేసాను, ఇంకేముంది అయిపోయింది, కచ్చితంగా నచ్చేస్తాను. ఆ వచ్చే వాళ్లకి నచ్చకపోతే బాగుండు అనుకుంటూ, వేచి చూస్తున్నాను.  పెళ్లి చూపుల తతంగం మొదలయ్యింది , వచ్చిన వారందరు ఒక్కొక్కరుగా కొన్ని ప్రశ్నలు అడిగారు, అతను మాత్రం ఏమి అడగలేదు, ప్రత్యేకంగా మాట్లాడే ఏర్పాటు ఏం జరగలేదు.  అందరు బయలుదేరడానికి సిద్ధమయ్యారు, 'ఇంట్లో అందరం చర్చించుకొని ఏ విషయం చెప్తాం' అని చెప్పి బయల్దేరారు.

అనుకున్నదంతా అయింది, పెళ్లి కుదిరిపోయింది. ముహూర్తం కూడా పెట్టేసారు, వైశాఖ మాసం లో, అంటే గట్టిగ నెల రోజులు కూడా లేదు. పెళ్లి పనులన్నీ హడావుడిగా సాగిపోతున్నాయి, బంధువు లందరు ఒక్కొక్కరుగా వస్తున్నారు, అందరు అన్ని పనులు పంచుకొని చలాకీ గా ఉన్నారు ,  రోజు సరిపోనన్ని విషయాలు మాట్లాడుకుంటూ, ఎపుడు తెల్లారిందో ఎపుడు చీకటి పడిందో కూడా తెలీనంత ఇది గా దొర్లి పోతున్నాయి రోజులు. పెళ్లి కూడా గుడి లోనే, గుడి ప్రాంగణం లోనే చేస్తున్నారు. మగ పెళ్ళివారికి విడిది ఏర్పాటు చేశారు, అన్ని మర్యాదలు దగ్గరుండి నాన్న చూసుకుంటున్నారు, పెళ్లి రోజు రానే వచ్చింది, అర్ధ రాత్రి  రెండింటి ముహూర్తానికి మూడు ముళ్ళు ఏడడుగులు జరిగిపోయాయి,  తెల్లారే సరికి పెళ్ళయిపోయిందన్నారు. అప్పగింతలు, మా అమ్మ నాన్న మొహం చూడలేకపోతున్నాను, చుస్తే ఎక్కడ ఏడ్చేస్తానో అని, వ్రతానికి వస్తున్నారని విని కాస్త సర్దుకున్నాను, మొత్తం మీద అత్తారింట్లో అడుగు పెట్టేసరికి మరుసటి రోజు అర్ధ రాత్రి ఒంటి గంట  , విపరీతమైన నిద్రలో  మునిగిపోయాను, తెల్లవారే సరికి  అమ్మ నాన్న వచ్చి ఉన్నారు, నన్ను నిద్ర లేపారు, తరువాత  వ్రతం జరిగిపోయింది, ఇంక అమెరికా ప్రయాణం మొదలయ్యింది! ఈసారి మా నాన్న కొంచెం దిగులు పడ్డారు కానీ నేను సంతోషం గా ఉంటాననే నమ్మకంతో తమాయించుకున్నారు, బరువెక్కిన గుండెతో ఏమి మాట్లాడలేని స్థితిలో మేమంతా ఉన్నాము. ఫ్లైట్ ఎక్కేముందు కొన్ని విషయాలు అతని గురించి తెలిసాయి, ప్రొఫెసర్ గా మాత్రమే కాకుండా, వేదాల్లో చెప్పబడినటువంటి, సైన్స్ కి అందని విషయాలని, వేద శాస్త్రం ఆధారంగా  ఉన్న మర్మాలని కలుపుతూ, కొత్త ప్రయోగాలను రీసెర్చ్ చేయటం, ముఖ్యంగా ప్రకృతి ని కాపాడే విధానాలను సూచిస్తూ, మానవాళికి ప్రపంచానికి ఉపయోగపడాలన్నదే అతని లక్ష్యం గా పని చేస్తున్నారు అని. ఎందుకో తెలీకుండానే అతని పైన ఒక మంచి భావం ఏర్పడిపోయింది.

అమెరికాలో ఫ్లైట్ ల్యాండ్ అయింది, ఎన్నో వేల కిలోమీటర్ల దూరంలో ఇల్లు, అమ్మ నాన్న గుడి, కోనేరు , సెలయేరు, రావి చెట్టు అన్ని కళ్ళముందు కదలాడుతున్నాయి. ఇంతలో ఇల్లు రానే వచ్చింది,  ఒక రోజు పూర్తిగా నిద్ర పోయి లేచాము.  తరువాత  రోజు, మా మామ

గారు మా ఇద్దర్ని పిలిచి అతి ముఖ్యమైన విషయాన్ని చెప్పారు, 'మనం ఇక్కడ వేంకటేశ్వర స్వామి గుడి నిర్వాహకులం, వ్యవహారాలన్నీ దగ్గరుండి మనమే చూసుకోవాలి, మీ నాన్న గారి ఆధ్వర్యంలో పెరిగిన నీకు ఈ పనులన్నీ బాగా తెలుసనే అనుకుంటున్నాను, అందుకే కొన్ని బాధ్యతలు మీరిద్దరికి ఇస్తున్నాను' అని, మాకు కొంత బాధ్యతలు అప్పగించారు, అంతే, ఎక్కడలేని ఆశ్చర్యం నా వంతు అయింది. నోట మాట రావట్లేదు, మనసు ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతోంది, మళ్ళీ గుడి దగ్గరికి వచ్చాను అని. గుడికి తీసుకెళ్లారు, సుందరమైన పద్మావతి–భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కోవెల, నా ఆనందానికి అవధుల్లేవు, గుడిలో అడుగు పెడుతూనే, నాన్న ఫోన్ చేశారు, ఫోన్ తీస్తూనే, నాకళ్ళలో ఆనన్ద భాష్పాలు, తనని , తన మనసుని సైతం అర్ధం చేస్కుని ఎక్కడైతే సుఖంగా ఉండగలనా గ్రహించి అంత మంచి వరుడ్ని తీసుకొచ్చి పెళ్లి చేసి, ఈరోజు ఇంత బాధ్యతను తీసుకో గలిగేలా చేసిన నాన్నతో ఇప్పుడు మాట్లాడ లేని పరిస్థితుల్లో ఉండిపోయాను, కళ్ళ నిండా నీళ్లు తిరుగుతున్నాయి, ఆనంద బాష్పాలత, అందుకేనేమో బహుశా ఈసారి 'స్వామి స్పష్టంగా కనిపిస్తున్నాడు, గుళ్లోనూ, తన మదిలోను'!

భారతీయ సనాతన ధర్మాన్ని, ఖండాంతరాల్లోనూ, అఖండ భారతావనిగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసే ప్రతి ఒక్క భారతీయునికి, సంస్కృతి సాంప్రదాయాలని, ప్రపంచ మంతా వ్యాప్తి చేస్తూ, ఎక్కడ ఉన్న మేమంతా ఒక్కటే అని నిరూపిస్తూ, దేశ భక్తిని, భారతీయతని చాటి చెప్పే ప్రతి ఒక భారతీయునికి వందనాలు, మరియు ఉగాది శుభాకాంక్షలు!

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్ట మొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

## క్షుధానలం - గౌతమ్ లింగా (Johannesburg, South Africa)

**నడి రేయి** రాత్రిలో, నాలుగు దారుల కూడలిలో ఆమె నిర్వర్ణం గా నిలబడి ఉంది. ఆమె కళ్ళలోంచి వర్షించడానికి ఆకాశం సిద్ధంగా ఉంది. చలి, విచిత్రంగా చూస్తున్న మగాళ్ల చూపులు చిరుగులుపడిన రవికలోంచి తనువుకు ఒకేసారి తగులుతున్నాయి. ఎవరికోసమో ఎదురుచూస్తుంది కానీ ఆ ఎవరు ఎవరో ఆమెకి ఎప్పటికీ తెలియదు. ఎన్ని ఆకలి రాత్రులు ఈ నల్లటి చీకట్లో తెల్లటి చందమామలాగా అందం గా నిలబడి రాకాసులు తిరిగే ఈ రహదారికి అందాన్ని తెచ్చిందో. ఎన్ని సార్లు అమాయకంగా తనువుని సుఖపెట్టి మనసుని గాయపెట్టుకుందో. ఏ తల్లి మురిపెంగా పెంచుకున్న ఆఖరి ఆడబిడ్డో ఈ క్షుధానల దగ్ధమూర్తి. నాన్న గుండెలపై ఇంకా మిగిలున్న ఆమె పాదాలగుర్తులు ఎవ్వరి దేహదహనంతో అనంతంలో కలిసిపోతాయా. లోకమంతా ఆమెను వేశ్య అంటుంది అంతకంటే ముందు ఆమె మనిషి అని మర్చిపోయి.

ఓ పున్నమి రోజు రాత్రి ఎప్పటిలాగానే అదే దారిలో ఆమెకు తోడొచ్చే మనిషి కోసం ఎదురుచూస్తుంటే ఓ బక్కపలచని దేహం ధరించి నీరసంగా, నిస్తేజంగా, నిర్లిప్తంగా నడుచుకుంటూ ఓ అందరిలాంటి మగాడు ఆమె వైపే వస్తున్నాడు, అతని కళ్ళలో అందరిలాగా ఆశలేదు,

మనిషిని తినేసేంత పిచ్చి కోరిక లేదు కానీ ఎదో ఉంది అదేంటో అర్థం అవ్వట్లేదు, ఆకలేమో? ఆమెకు అలవాటై సరిగా తెలియట్లేదు. కాళ్ళీడ్చుకుంటూ ఇటే వస్తున్నాడు, ప్రేమగా పలకరించాలనుకుంది. ఈ ప్రేమకు పేరేమిటో, ఇది ఎలాంటి ప్రేమో ఆమెకి ఆ క్షణం లో తెలియదు. కళ్ళముందుకొచ్చి దేహానికి ఓపికలేక కుప్పకూలాడు ఆమె కన్నుల్లోనిండిన మనిషి. ఎం చేయాలో తెలియనితనంతో ఒళ్ళోకి ఆ మనిషి తలని తీసుకొని, ఆకలికి పడిపోయాడని గుర్తించి, ఆకలి అన్ని పడిపోవడాలకి మూలకారణమని గ్రహించి, చేతనైన సపర్యలు చేసి తనతో ఇంటికి తీసుకెళ్లింది రోజూలాగే, రోజూలా కాకుండా. కలిసి నడిసేప్పుడు ఈసారి భుజం మీద చేయి ఈమే వేసింది. కొత్తగా అనిపించిందేమో.

ఈ రాత్రి కొంచం కొత్తగా గడిసిందామెకు, మగాడితోనే అయినా మరోరకంగా, ఒంటిపై ఏ గాయం లేకుండా రాత్రి ముందుకు నడిచింది. ఉషోదయపు వెలుగులతో లోకానికి మెలకువొచ్చినట్టు, ఆమె ప్రేమగా చేసిన సపర్యలతో, ఇష్టంగా తినిపించిన అన్నం ముద్దలతో అతనికి కొత్త మెలుకువొచ్చింది. ఆమె మానవత్వానికి ఆశ్చర్యపోయాడు, చచ్చి పడున్నా ఆగిచూసే ఓపికలేని ఈ కాలం లో ఇంటికి తీసుకొచ్చి మనిషిని చేసిన మనిషి మనసుని చూడగలిగాడతడు, మానవత్వం మాధుర్యాన్ని అనుభవించాడతడు.

నిజమైన ఇష్టంతో ఒక్కటై పెళ్లి చేసుకుందామనుకొని ఆమెనడిగాడు, ఒక్కనిముషం అర్థంగాని మానసికస్థితితో ఆమె

ఆమె: "లోకానికి తనువమ్ముకున్న మనిషిని నేను.. నేనసలు మనిషినో కాదో కూడా నాకే తెలియదు"

అతను:"తనువని అమ్ముకున్నా హృదయం నీలోనే దాచుకున్నావు జాగర్తగా.. ఆది నాకిస్తావా నువ్వమ్ముకున్న తనువును నా ప్రేమతో కడిగి ముత్యంలా మార్చి నీ మనసుకి అతికిస్తా."

ఆమె: "రూపాయికి శీలాన్నమ్ముకున్న బ్రతుకు నాది.. నాదసలు బ్రతుకో కాదో కూడా నాకు అర్థం కాదు"

అతను: "మనసు నీడనున్న శీలాన్ని కొనే రూపాయిలింకా తయారవ్వలేదు, మనిషినే కానీ మనసును కొనగలిగే శ్రీమంతులింకా పుట్టలేదు, అదే మనసును నేను ప్రేమతో కొంటా నువ్వు ఇష్టం గా అమ్ముతావా?"

ఆమె: "నా దేహం నాది కాదు, రెక్కలొచ్చిన పక్షులు గూడునొదలి పోయినట్టు ఎప్పుడో నానుంచి వెళ్ళిపోయింది, నా ఆలోచనలు నావి కావు బలంగా, రాక్షసంగా నా మనసును శాసించే మరో మనిషి చెంతచేరి నావి కాకుండా పోయాయి."

అతను: "ఏవి ఎటు వెళ్లినా దరిచేర్చుకునే స్తైర్యం, దగ్గరకు తీసుకునే ధైర్యం నీకున్నాయి, మానవత్వం ధవళవర్ణపు చీరకట్టుకుని నా కళ్ళముందు నిలబడితే నీ దేహం నాకొద్దు, నీ ఆలోచనలు నాకొద్దు, నీ ప్రేమ చాలు."

ఆమె: "నా తనువంతా ఆగకుండా కారిన కన్నీటి ధారల చారలే, నాకడుపు కర్ణాల నిండా ఆగని ఆకలి కేకలే, నా లేత హృదయపు చక్కిళ్ళపై పాషాణపు పంటి గుర్తులే, చీరంచున దాయాల్సిన దేహంతో ఆకలిమంటలనార్పుకుంటున్న ఆడదాన్ని నేను, రాక్షసత్వానికి బలై తనువుని తగలపెట్టుకున్న అమానవత్వానికి వారసత్వాన్ని నేను, దగ్ధమవుతున్న బ్రతుకు నాది, శిధిలమవుతున్న దేహం నాది, రంగులలోకంలో చీకటి రంగుకి ప్రతినిధిని నేను."

అతను: "బ్రతుకుకు కొత్త రంగులేసుకుందాం, శిధిలమైన దేహాలలోంచి కొత్త జీవితాలు పుట్టిద్దాం, పాత జ్ఞాపకాల్ని కాలిపోనిచ్చి ఆ భస్మగర్భాల్లోంచి మనుషులుగా మళ్ళీ పుడదాం, మనస్సులో కొలువైన దైవం సాక్షిగా మనం మళ్ళీ కొత్త బతుకుల్లోకి జన్మిద్దాం, ఈ సారి ఆకలిమంటలని మన అనురాగవర్షంతో ఆర్పేద్దాం, మన బ్రతుకులకి అంటిన గుర్తులన్నీ కడిగేసుకొని కొత్త బ్రతుకులు మొదలెడదాం."

ఈ మాటలు ఇలాగే నిరాటంఖంగా సాగుతుండగా ఓ మంచి క్షణాన వాళ్లిద్దరూ ఒక్కటిగా ప్రయాణం సాగించారు, పెళ్లి వాళ్ళకి చిన్నదిగా అనిపించిందేమో మనసుల సాక్షిగా జీవితాల్ని మళ్ళీ మొదలుపెట్టారు. ఒకళ్ళ పేర్లు ఒకళ్ళకి చెప్పుకున్నారు.

ఆమెకి, అతనికి ఏదో పేర్లు ఉండే ఉంటాయి

సిరికి చెప్పకుండా, శంఖ చక్రాలు ధరించకుండా, తనని తానైనా పట్టించుకోకుండా లోకాలు దాటి నేలకొచ్చిన నారాయణనామాల్లో ఒక్కటో

స్మశానాల్లో, శవాల పక్కన తిరుగుతూ భువనాలనేలే రాజులనైనా తనదరికి రప్పించుకొనే రుద్రుని వేల పేర్లలో ఒక్కటో

★★★

శ్రీ శార్వరి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
25 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

# అంతర్మథనం - శాంత సుసర్ల (Houston, TX)

**తెలతెలవారుతోంది**.. దూరంగా పక్షుల కిలకిలారావాలు, పేపర్ బాయ్ కేక, కూరలు అమ్మే వారి అరుపులతో మెలకువ వచ్చేసింది. సూర్యుడి నులివెచ్చటి కిరణాలు కిటికీ లోంచి తొంగి చూస్తున్నాయి. ఉదయం ఎంతో అందంగా కనిపిస్తోంది. మనసు ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంది. పక్కన చూసాను శ్రీవారు కనిపించలేదు, అప్పుడే నిద్ర లేచి పేపరు చదువుతున్నారు. నేను పది నిమిషాల్లో కాఫీ అంటూ ఆయన ముందు ప్రత్యక్షం. కాఫీ అవగానే ఇంక ఆయన ఆఫీసు కి రెడీ అవుతున్నారు హడావుడిగా. నేను వంటింట్లో పరుగులు పెడుతూ ఆయనకి బ్రేక్ ఫాస్ట్, లంచ్ బాక్స్ తయారు చేస్తూ..

పనులన్నీ అయేసరికి మధ్యాహ్నం అయ్యింది. కొంచం బడలిక గా అనిపించింది ఎందుకో. ఎదురుగా వారపత్రిక కనిపించింది. కొంచం అటూ, ఇటూ తిప్పి పక్కన పెట్టి ఆలోచనలో పడి పోయా. మనసు ఎటో వెళ్ళిపోయింది. నా మనసులో భావాలను ఎవరికీ చెప్పలేను. అప్పుడే పెన్ను, పేపర్ ముందేసుకుని వ్రాయడం మొదలు పెట్టాను.

ప్రియమైన నీకు,

ఎలా మొదలు పెట్టాలి అని ఆలోచిస్తోంటే అస్సలు అర్థం కావడం లేదు. నువ్వేమో ఏమీ చెప్పొద్దు 'జస్ట్ ఫీల్ ఇట్' అన్నావు. అవును, ఖచ్చితంగా నువ్వు నాలో వున్నట్లే, నాతో వున్నట్లే అనిపిస్తోంది. నీ మీద నా ప్రేమ తెలుస్తోంది. నీ నుండి దూరంగా వున్నానన్న బాధ, పరధ్యానం ఎక్కువగా ఉంది. నువ్వు ఎప్పుడు వస్తావా అని రోజులు లెఖ్ఖ పెడుతున్నా. నా చుట్టూ ప్రపంచం అందంగా, ప్రేమ మయం అయిపోయింది. ఆ అంతర్మథనం ఇంత ఆనందం ఇస్తుందనీ, ఇంత తీయగా ఉంటుందనీ తెలియలేదు. ఇదివరకు ఎన్నడూ లేని అనుభవం... కానీ ఎందుకో చాలా చెప్పాలని, ఈ తీయని అనుభూతి నీతో పంచుకోవాలని వుంది.

మనిషి జీవితంలో ఒక్కసారే ప్రేమించాలనీ, ప్రేమించ బడాలనీ, లేదా ఇంకోసారి ప్రేమ పుట్టదు అని అంటే నమ్మను. ఎన్ని సార్లు అయినా ప్రేమ పుట్టచ్చు మరియు పుడుతుంది. ఎవరైనా కాదని అన్నా అది అబద్ధం అంటాను. నా పెళ్లి అయినతరువాత మొట్టమొదటి సారిగా నేను నేనుగా ఇష్టపడుతున్నది నిన్నే...... "ఐ లవ్ యు" అని చెప్పిన మొదటి వ్యక్తివి. నాకు నీగురించి ఏమితెలుసు అని అనుకోవచ్చు నువ్వు, కానీ ఏదీ ఆలోచించను ప్రస్తుతానికి .... ఏ షరతులు లేని ప్రేమ నాది.

ప్రేమ అనేది ఎలా మొదలు అవుతుందో , ఎందుకు ఇష్టమో చెప్పడం చాలా కష్టం. కానీ నువ్వంటే పిచ్చి ప్రేమ.. నా హృదయంలోంచి చెప్పే మాట ఇది.... ఇది చెప్పడానికి అస్సలు సిగ్గుపడను. ఏమి మాయ చేసావు బంగారం ...

నేను నీతో గట్టిగ మాట్లాడుతున్నది ఒక నెల, రెండు నెలలు నుండి కానీ ఇంతగా ఎలా దగ్గర అయాను అని అర్థం కాకుండా వుంది. ఇది నాకు చాలా వింతగా, ఆశ్చర్యంగా, నాకే తెలియకుండా వుంది. ఇది ఇష్టమా, ప్రేమా, పిచ్చా, లేక ఇవన్నీ కలిసిన ఒక అద్భుతమైన అనుభూతా అనేది నాకు తెలియదు.

ఇష్టమా అంటే అవును అది ఎప్పటినుండో వుంది. ప్రేమా అంటే అది నాకు తెలియకుండానే మొదలు అయింది. ఎప్పుడు, ఎలా మొదలు అయిందో చెప్పలేకపోతున్నా. కానీ చాలా పిచ్చిగా వుంది. ఇదంతా ఒక అందమైన అనుభూతి లేక అన్నీ కలిపిన ఒక తీయని భావం లా వుంది.

అందని ఆ చందమామ నా అందుబాటులో ఉంది అనో, ఆ చందమామ వెలుగులు నా ఈ చందమామ కళ్ళల్లో చూడాలని వుంటే అది అత్యాశే ..

ఇదివరకు ఎన్నడూ లేనిది, కొత్తగా, థ్రిల్లింగ్ గ, గుండె లోపల ఒక చిన్న బాధ, నిన్ను చూడాలన్న తాపత్రయం, నీతో ఏదో మాట్లాడాలనే ఆరాటం, నీ గొంతు మాటిమాటికీ వినాలనే ప్రయత్నం, మాట్లాడలేకపోతున్ననే నిస్సహాయత, నిన్ను కలవాలనే అసహనం, నాలో ఎన్నడూ లేని ఈ అశాంతి, మరియు నీకు దగ్గరగా లేనే అనే విసుగు. ఒక స్త్రీ మనసుకే అర్థం అయే పరిభాష ఇది.

ప్రతీ క్షణం నువ్వే గుర్తుకు వస్తున్నావు. ఎంతమందిలో కూర్చున్నా నీతోనే వున్నట్లు, ఎవరిని చూసినా నిన్నే చూస్తున్నట్లు, ఇలా ఇంతలా నా మనసు అడుక్కి ఎక్కడికో వెళ్ళి, అక్కడ పెద్ద పీట వేసుకోని కూర్చున్నావు.

అప్పుడప్పుడు నేను ఒక్కదాన్నే బీచ్ కి వెళ్ళి అలల వంక చూస్తూ కూర్చోవటం, లేదా పార్క్ కి వెళ్లి అక్కడ ఆడుకుంటున్న పిల్లల్ని, పరిసరాలని చూస్తూ కూర్చోడం ఇష్టం. కానీ ఇప్పుడు ఈ చెప్పిన ఏవి చూసినా .... నువ్వు తప్ప ఇంకేమీ కనిపించటంలేదు. నిన్ను దాటి ఆలోచన ముందుకు సాగటంలేదు. నువ్వు నాతొ వుంటే ఎలా ఉండేదో, ఎలా వుంటుందో, ఎలా నవ్వుతావో ఇవే ఆలోచనలు. నా ఆలోచనలు అన్నీ నీ చుట్టూనే తిరుగుతూ ఆ సర్కిల్ లో నుండి బయటకు రావడానికి కూడా ఇష్టం లేకుండా వుంది. నాకు తెలీకుండానే అంతగా ఇమిడిపోయావు నా ఆలోచనలలో, మనసులో.

నువ్వు కనిపించగానే నిన్ను నా చేతుల్లోకి తీసుకోవాలనీ, నీ గుండె చప్పుడు తో మాట్లాడాలనీ, నీ చుట్టూ బిగుసుకున్న నా చేతులు నిన్ను మరింతగా దగ్గరకు తీసుకుంటే, మిగతా ప్రపంచం అంతా అలా స్తంభించి పోతే బావుండు అని వుంది. నీ కబుర్లు వినాలనీ, నీ దగ్గరగా ఉండాలనీ, నీ నవ్వు చూడాలనీ, ఇంకా చాలా చాలా ఏమిటేమిటో గా వుంది..... ఏంటీ ఇలా అంటున్నా అనుకుంటున్నావా... చెప్పగా నా మనసు నిన్ను దాటి ఆలోచించటం లేదు. నా మనసులో అనిపించిన ప్రతీదీ ఈ ఉత్తరం లో పెడుతున్నా.. మరి నవ్వుకోవాలంటే నవ్వుకోవచ్చు బంగారం.

నిన్ను నిన్నుగా చాలా ఇష్టంతో వచ్చిన ప్రేమ ఇది. నాలో కలిగే ఈ కొత్త ఆనందాన్ని, నీతో బాటు ఇలానే పెరుగుతుందని ఆశిస్తా. కోరుకుంటున్నా!

మనం ఇలా కలవాలని దేవుడు అనుకున్నాడు కనుకే త్వరలో కలవబోతున్నాము.

నీ రాక కోసం ఎదురు చూస్తూ....

**లవ్ యు డియర్.**

ఉత్తరం మడిచి కవర్ లో పెడుతూంటే తలుపు చప్పుడు అయ్యింది. ఆయన వచ్చేసారు అనుకుంటూ గబుక్కున లేచి అది నా చీరల క్రింద దాచాను.

అనుకున్న ఆ ఘడియ రానే వచ్చింది. సమయం దగ్గర పడినకొద్దీ ఏదో భయం, ఆందోళన, ఆత్రుత, బాధ ఎక్కువ అయింది, తట్టుకోలేని బాధని పళ్ళ బిగువున ఆపుకోలేక పోతున్నా....

కొన్ని గంటల తరువాత, డాక్టర్ నా ఎదురుగా వచ్చి నవ్వుతూ నేను ఇన్నాళ్ళుగా ఎదురు చూసిన, నేను కలలు కన్న, ఎప్పుడెప్పుడా అని అంతరంగంలో మధన పడ్డ, అప్పుడే పుట్టిన పొత్తిళ్ళ లో ఉన్న నా చిన్నారి బాబుని చేతిలో పెట్టి నన్ను తట్టి వెళ్ళి పోయింది. నేను తదేకంగా నా బిడ్డని చూస్తూ, ఒక్కసారిగా నా గుండెలకు హత్తుకుని ముద్దులాడుతూ ఈ ప్రపంచాన్ని, ఇన్ని రోజులు నేను పడ్డ బాధని మర్చిపోయాను.

అంతకుముందు వారమే నా ఉత్తరం చదివిన శ్రీవారు నన్ను, తన కొడుకుని నవ్వుతూ చూస్తూ మురిసి పోతున్నారు.

## చిత్రలహరి — కిరణ్ విభావరి

"పెద్దమ్మా, తొలిప్రేమ అంటే ఏంటి పెద్దమ్మా?" చింటూ గాడు నా పక్కలోకి చేరి అడిగాడు. సెలవులు కదా పిల్లలందరూ రావడంతో సినిమా చూపించి వచ్చారు మావారు. చిన్న పిల్లల సినిమాలు ఏవి లేకపోవటంతో తొలిప్రేమ సినిమాకు తీసుకెళ్లారు. దాని ఎఫెక్ట్ ఇది అన్నమాట.

"ఇప్పుడెందుకు నాన్నా అవన్నిను?? పొద్దుపోయింది పడుకోరాదు.." బుజ్జగించే ప్రయత్నం చేశాను.."ఊహు" అంటూ తల అడ్డంగా ఊపాడు.

నాకు, మా చెల్లికి తొలిచూలు ఆడపిల్లలే పుట్టారు. ఒక పిల్ల చాలనుకుని మేము ఆగిపోయినా, చెల్లికి మాత్రం ఇదిగో ఈ చిచ్చర పిడుగు పుట్టేసాడు. మగపిల్లాడు అని నా అతిగారాబం వల్లనేమో గానీ వీడికి నా దగ్గర చనువెక్కువ. అందుకే వాళ్ళ అమ్మను అడగడానికి భయపడే ప్రశ్నలన్నీ నన్ను అడిగి మరీ తెలుసుకుంటాడు.

రాత్రుళ్ళు నిద్రలవీ కూడా నా దగ్గరే, నేను కథలవి బాగా చెప్తానని, మారం చేసి మరీ నా దగ్గరే పడుకుంటారు పిల్లలంతా. రోజుకో కథ అంటే ఎక్కడ నుండి తేను?? ఏదో నాకు తెలిసిన పేదరాశి పెద్దమ్మ కథలవి అటు తిప్పి, ఇటు తిప్పి చెప్తూ నిద్రపుచ్చేస్తాను.

నేను చెప్పే కథలవీ మా పిల్లలతో పాటు మా వారు కూడా వింటూ హాయిగా నిద్రపోతారు. కానీ వీళ్లు వెళ్ళిపోయాక "రాజీ నాకూ ఒక కథ చెప్పవా??" అంటూ నా ఒడిలో తలదాచుకుని గోముగా అడుగుతారు చూడండి.. దానికి ఫిదా అయిపోతాను.

"ప్లీజ్ పెద్దమ్మా, చెప్పు.." వాడి అక్క, నా బంగారు తల్లి నయన ముద్దుగా అడిగింది. దాని విశాలమైన కళ్ళు చూసి నేనే దానికా పేరు పెట్టాను. మా చెల్లి కూడా అదే పేరు ఉంచేసింది. దాని చిట్టి మోము చూడగానే ఆ చారడేసి కళ్లే మొహమంతా ఉన్నట్టు కనిపిస్తాయి. అదే దాని ప్రత్యేకత. అది కళ్ళు రెపరెపలాడిస్తు నా మంచానికి ఆనుకుని నించుంది.

నేను పడుకునే దానిని అమాంతం ఎత్తి నా పొట్ట మీద కూర్చోపెట్టుకున్నాను. " చెప్తా కానీ ...గిరక్క ఏది బంగారం?" దాని లేలేత బుగ్గలు పట్టుకుని ముద్దుగా అడిగాను మా పాప గిరిజ గురించి. మా నయనవి అందమైన కళ్ళు ఎలాగో.. నా సంతానం గిరిజవి గిరిజాల జుట్టు. అంజలి సినిమాలో అచ్చం అంజలి పాపలా ఉండేది చిన్నప్పుడు. ఇప్పుడు కొంచెం ఒళ్ళు చేసి బొద్దుగా అయ్యింది. ఇంకా పన్నెండు దాటలేదు కదా ఆ వయసుకు ఆ మాత్రం బొద్దు గా ఉన్నా ముద్దుగా ఉంటారని నేను పెద్దగా అదుపు చెయ్యలేదు దానిని.

" మరేమో, అమ్మతో కలిసి మాంగో తింటుంది.." మా నయన ముద్దుగా చెప్పింది.

"దానికి తిండే ప్రపంచం" నాకు అటుపక్కగా పడుకున్న మా వారు మా వైపు తిరిగి చెప్పారు.

"పొన్లెద్దురు...చిన్నపిల్ల ..మళ్లీ పెద్దయ్యాక బోల్డన్ని డైటింగ్లవి చెయ్యాలి. ఏమి తెలియని బాల్యం... ఎదగనివ్వండి దానికి నచ్చినది అది చేసుకుంటూ.." అని నేను నచ్చజెప్పేలోపు మా గిరిజ వచ్చేసింది.

"అమ్మ నన్ను ఎత్తుకో.. నే కూడా బొజ్జ మీద కూర్చుంటా" మా గిరిజ ఎత్తుకోమని చేతులిచ్చింది. మా వారు "ఇప్పుడు ఎత్తు.." అన్నట్టు నా వైపు నవ్వుతూ ఓ లుక్కు వేశారు.

" నువ్వు పెద్దయ్యావు కదా ...నిన్ను ఎత్తుకోకూడదు బుజ్జి తల్లి" మా ఇంట్లో ఎవ్వరం పిల్లల్ని బాడి షేమ్ చేయ్యం. వారి లేలేత మనసులో వారి శరీరం పట్ల యెటువంటి నెగటివ్ ఆలోచనలు నిండకుండా జాగ్రత్త పడతాం. అందుకే "నువ్వు బొండాంలా ఉన్నావు. నిన్ను ఎత్తుకుంటే నేనుంటానా" అని కాకుండా వేరేలా చెప్పే ప్రయత్నం చేశాను.

నా బుజ్జి తల్లి నిజంగా బుజ్జిదే. మారు మాట్లాడ కుండా, మంచమెక్కి నా పక్కన కూర్చుంది.

"మరి పెద్దమ్మ...అక్కనెందుకు ఎక్కించుకుని మీద పెట్టుకున్నావు??" మా చింటూ బాంబు పేల్చాడు. ఏం చెప్పాలో తెలియక మావారి మొహం చూసాను.

మా వారు ఏదో చెప్పబోయే లోపలే మా గిరిజ " మరే..నువ్వు చెల్లి చాలా రోజుల తరువాత వచ్చారుగా..మిమ్మల్ని ప్రేమగా చూసుకోవాలి. నేనెప్పుడూ ఇక్కడే ఉంటానుగా ...మీరు వెళ్ళిపోయాక మా అమ్మ ప్రేమంతా నాదే." అంటూ నా గుండెల మీద వాలుతు చెప్పింది.

నిజంగా ఇలాంటి బుజ్జి తల్లి ఉండటం నా అదృష్టం. నన్ను, మా వారిని ఎప్పుడూ నొప్పించలేదు. పేచీలు, మారాలు ఎప్పుడూ లేవు. మమ్మల్ని అర్థం చేసుకుని నడుచుకునే నా బుజ్జిదాన్ని ప్రేమగా ముద్దు పెట్టుకున్నాను. అది చూసి...

"పెద్దమ్మా నువ్వు ఫస్ట్ కిస్ ఎవరికి చేశావు?"

" నువ్వు కూడా ఎవర్నైనా లవ్ చేసావా?" మా ఇద్దరు పిడుగులు బాంబులు పేల్చారు. మా ఆయన్ని చూసాను. అప్పటికే గిరిజను తన దగ్గర పడుకో బెట్టుకుని, జో కొడుతూ నేనేం చెప్తానా అన్నట్టు చూస్తున్నారు.

"నీ తొలిప్రేమ గురించి చెప్పవా?" ఈసారి ఈ బాంబు పిల్లల నుండి కాదు...ఇంకా నాకు పిల్లాడుగా ఉన్న మావారి దగ్గర నుండి.

నేను ముసి ముసిగా నవ్వి " చాల్లెద్దురు... పిల్లల ముందు ఎందుకు??" చెయ్యితో చిన్నగా ఆయన భుజం మీద తట్టి చెప్పాను. ఆయన నవ్వుతూ ఊరుకున్నారు.

కానీ మా పిల్లలు ఊరుకుంటారా...చెప్పు చెప్పు చెప్పు అని ప్రాణాలు తోడేస్తే ఇక తప్పదన్నట్టు చెప్పడం మొదలు పెట్టాను.

"అప్పుడు నేను ఏడో తరగతి..." అని ఇలా మొదలు పెట్టానో లేదో " మా అక్కంత యేజు అన్నమాట" అంటూ చింటూ గాడు మధ్యలో మాట్లాడాడు.

"ఇదిగో ఇలా మధ్యలో మాట్లాడితే నేను అస్సలు చెప్పను" బుంగ మూతి పెట్టి మొహం పక్కకు తిప్పుకున్నాను. మా వాళ్ళు సారి సారి అంటూ మళ్ళీ రిక్వెస్ట్ చేశారు.

"అప్పుడు మాకు పబ్లిక్ పరీక్షలు ఉండేవి. మీలా ఇన్ని ట్యూషన్లు పెట్టుకు చదివేవాళ్ళము కాదు కానీ, స్కూల్ నుండి రాగానే పాఠాలు ఒకసారి నెమరు వేసుకుంటూ హోమ్ వర్క్ చేసేసరికి , రాత్రి ఏడున్నర అయ్యేది. శుక్రవారం వస్తే చాలు అమ్మ పెట్టిందేదో గబగబ తినేసి, ఎదురింటి జయలక్ష్మి అత్తమ్మ దగ్గరకు వెళ్ళిపోయేదాన్ని.

ఎందుకో తెలుసా?? చిత్ర లహరి కోసం...చిత్ర లహరి అంటే పాటల ప్రోగ్రాం. పాత పాటలు వేసేసారు. తరవాత ఏం పాట వస్తోంది అని ఎదురుచూస్తూ టీవీల ముందు చిన్నా పెద్దా చేరిపోయి , ఆసక్తిగా చూసేవాళ్ళం.

ఎవరికైనా వారికి ఇష్టమైన పాట వస్తే చాలు 'హాయ్ నా కిష్టమైన పాట ఇది' అని చప్పట్లు కొట్టుకుని ఆనందపడి పోయేవారు. వారి ఆనందంలో అందరం పాలు పంచుకునేవాళ్ళం. శుక్ర వారం వస్తే చాలు టీవీ ఉన్నవాళ్ళ ఇంట్లో పండుగ వాతావరణమే.

కొందరు ఉన్నోల్లు.. వచ్చిన వారికి, టీ లు, టిఫిన్లు ఇస్తే; కొందరు లేనోల్లు ...వచ్చిన వారినే మీ రాత్రి బోజనాలు ఇక్కడికి తెచ్చేసుకొండి ..అందరం కలసి భోజనం చేసేద్దాం అనే వారు. పాపం వారం వారం పెట్టాలంటే ఇబ్బందే కదా.

అలాంటి ఇబ్బందులు లేని ఫ్యామిలీ జయ అత్త ఫ్యామిలీ. అత్త అంటే సొంత అత్త కాదు. మా ఎదురింటిలో ఉండేవారు. మా అమ్మ ' వదిన ' అని పిలిచేది. అందుకే నేను అత్త అని పిలిచేదాన్ని. వాళ్ళింట్లో మాత్రమే టీవీ ఉంది. అందుకే ప్రతి శుక్రవారం రాత్రి వాళ్ళింటికి వెళ్ళిపోయేదాన్ని.

అందరికీ టిఫిన్లు, టిలు, కాఫీలు ఇస్తున్న మా అత్త మొహం మహాలక్ష్మి లా కళకళలాడేది. మావయ్య కూడా వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించే వారు. సందడి సందడిగా ఆ రోజు గడిచిపోయేది.

కానీ వాళ్ళింట్లో మాతో అంటి ముట్టనట్లు ఉండేది ఒక్కరే... జాని. హా జాని మాత్రం మేమొస్తే చాలు రూంలోకి వెళ్ళి తన మంచం మీద పడుకునే వాడు. ఒక్కసారి కూడా చిత్రాలహరి చూడడానికి రాలేదు. కానీ ఒక్కసారి నాకిష్టమైన ఒక్క పాటకు మాత్రం బయటకు వచ్చి, కర్టెన్ వెనుక దాక్కుని చూసాడు.

అదే మొదటిసారి జానినీ నేను చూసింది... తన కళ్ళలో ఏదో మాయ ఉంది అలానే చూస్తూ ఉండిపోయా. తను కూడా అంతే నన్నే చూస్తూ నిల్చున్నాడు. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటే అదే ఏమో.

నాకు గీతాంజలి సినిమా లోని " ఆమని పాడవే హాయిగా" అనే పాట చాలా ఇష్టం. అదే పాట వచ్చిన ప్రతీసారీ జాని వచ్చి ఎవ్వరికీ కనిపించకుండా వచ్చి నన్ను చూసి ,పాట విని , లోపలికి పోయె వాడు.

నాకు ఇష్టమైనది తనకు ఇష్టమనో...లేదంటే చాలా తెల్లగా అందంగా ఉన్నాడనో!! తెలియదు కానీ జాని మీద ఇది అని చెప్పలేని ఫీలింగ్. జాని కూడా వచ్చిన ప్రతీసారీ ఓర చూపులు చూసే వాడు. నా గుండె జల్లుమనేది.

రాను రానూ జాని మీద ఆసక్తి పెరిగిపోయింది. క్లాసులో కూడా జాని తలంపే. మా స్నేహితులతో చెప్తే ఇది ప్రేమ అని చెప్పారు. నాలో ఏదో తెలియని హాయి.

మా టైములో పుట్టిన రోజు నాడు ఇరుగు పొరుగు ఇళ్లకు వెళ్లి చాక్లెట్లు ఇచ్చి, వాళ్ళిచ్చే కొన్ని డబ్బులు తీసుకుని పాకెట్ మనీగా దాచుకునే వాళ్ళం. ఎప్పుడెప్పుడు పుట్టిన రోజు వస్తుందా ..డబ్బులు ఎన్ని వస్తాయా అని వేచి ఉండేవాళ్ళం మా వయసు పిల్లలమంతా.

ఆ రోజు రానే వచ్చింది. నా పుట్టిన రోజు నాడు అమ్మ కొన్ని పిండి వంటలు చేసి, జయ అత్తకు ఇచ్చి రమ్మని పంపింది. తెల్లని గౌను వేసుకుని, దానికి మట్టి అంటకుండా జాగ్రత్త పడుతూ వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

జయ అత్త తలుపు తీసి, నాకు విష్ చేసి ముద్దు పెట్టుకుంది. నాకు డబ్బులు ఇవ్వడానికేమో లోపలికి వెళ్ళింది.

అంతలో ఎక్కడ నుండి వచ్చాడో జాని వచ్చి నన్ను ముద్దు పెట్టుకున్నాడు. నా లేలేత బుగ్గల మీద....నా మొదటి కిస్...నా తొలి ముద్దు...మా మోము ముద్ద మందారంలా ఎర్రగా కంది పోయింది. నాకు భయం వేసి మాయింటికి పరుగు పెట్టాను. అత్త దగ్గర డబ్బులు తీసుకోకుండానే, నా డ్రెస్సు మట్టిలో పడుతుందని పట్టించుకోకుండా పరుగు పెట్టాను.

నా డ్రెస్ మాసిందని అమ్మ తిట్టింది. అమ్మకు జాని ముద్దు పెట్టుకున్నాడు అని చెప్దామని ఊరుకున్నాను. మళ్లీ అత్తకు అమ్మకు గొడవవుద్దని.

నా ఫ్రెండ్స్ కి మాత్రం చెప్పాను. ఫస్ట్ కిస్ అని చెప్పారు. కొద్ది సేపు ఆటపట్టించారు. సిగ్గుతో చచ్చిపోయాను బాబు. అప్పటికే ప్రేమ సినిమాల ప్రభావం మా మీద పడుతొంది. అన్ని విషయాలు తెలుస్తున్నాయి.

నాకెందుకో గిల్టీగా ఉంది. జాని నాకు చెప్పకుండా ముద్దు ఎలా పెట్టుకుంటాడు. అనే కోపం కూడా ఉంది.

మరోసారి కూడా అంతే .. ప్రతీ వినాయక చవితికి మా వీధిలో తెర మీద సినిమా వేసేవారు. వీధి వీధంత తెర ముందు కూర్చుండిపోయేవాల్లం. జాని కూడా వస్తాడేమోనని ఆశగా చూసా...రాలేదు.

సినిమా మొదలైంది. "తొలిప్రేమ" సినిమా.. హీరో పవన్ కళ్యాణ్. నాకు జాని గుర్తుకు వచ్చాడు. జాని కూడా నన్ను దొంగ చాటుగా చూసే వాడు ఈ సినిమాలో హీరో లా. ముసి ముసిగా నవ్వుతూ పక్కకు తిరిగితే నా గుండె లయతప్పింది. నా పక్కన జాని వచ్చి కూర్చున్నాడు. వేగంగా కొట్టుకుంటున్న గుండెను అదుపు చేసుకుని, ఊపిరి బిగపట్టి కూర్చున్నాను. జాని నాకు దగ్గరగా జరిగాడు. అమ్మో మళ్లీ ముద్దు పెట్టేసుకుంటాడేమో అని నేను ఇంట్లోకి పరుగు పెట్టాను. సినిమా చూడకుండానే ..

ఇలా కొన్ని రోజులు గడిచిపోయాయి. పరీక్షల్లో పడి నేను జాని గురించి పట్టించుకోలేదు. కానీ ఓ రోజు జాని ఇంటిముందు బోల్డంత మంది జనం.

జయ అత్త, మావయ్య ఆక్సిడెంట్ లో చనిపోయారంట. వారి శవాల ముందు బాధతో, మౌనంగా కూర్చున్న జానినీ చూసి గుండె బరువెక్కింది. ఇప్పుడు జాని ఒంటరి వాడా?? జాని అనాధా?? లేదు నా జాని కి నేనున్నాను... నేను మా ఇంటికి తెచ్చుకుంటాను. నా జానిని నేను కాపాడుకుంటాను.

ఇదే విషయాన్ని నాన్నని అడిగాను. అమ్మను అడగ మన్నారు. అమ్మతో చెప్పాను. వద్దంది. జయ అత్త దగ్గర ఎంతో తీసుకున్నాం. ఈ కొద్ది సాయం చేస్తే ఏం పోతుంది?? అని అడగాలనిపించింది. కానీ పెద్దలను ఎదిరించకూడదని ఆగిపోయాను.

గాంధీజీలా సత్యాగ్రహం చేశాను.మూడు రోజులు అన్నం తిననని మొండికేస్తే చివరికి అమ్మ ఒప్పుకుంది. "వాడి తిండి ఖర్చు బోలెడంత అవుతుంది. వాడు గొప్పింటి బిడ్డ. మనం తినే ఆహారం తినలెదని" అమ్మ చెప్పింది.

" పర్లేదు నేను తినిపిస్తే తింటాడు" అన్నాను.

" వాడు ఇక్కడ అక్కడ మల మూత్రలు విసర్జిస్తాడు..అవన్నీ నేను ఎత్తలేను" అని అమ్మంది.

" పర్లేదు నేను తనని నేను బయటకు తీసుకు పోయి చేయిపిస్తా" అని చెప్పాను.

" వాడు రాత్రుళ్ళు భౌ భౌ మని అరిచి గోల చేస్తాడు " అని అమ్మ చెప్పింది.

"పర్లేదు నేను తనను నా గదిలో పడుకోబెట్టుకుని తలుపులు వేసేస్తాను అప్పుడు మీకు గోల రాదు.." అని సర్ది చెప్పాను.

నా మొండితనం చూసి అమ్మ అయిష్టంగానే ఒప్పుకుంది."

"అంటే పెద్దమ్మ ...నువ్వు చెప్పే జాని...ఒక కుక్కా???" వాళ్ళ చిట్టి మెదడులో బోల్డన్ని ప్రశ్నలు.

" అవును ..నా తొలి ప్రేమ... నా కుక్క పిల్ల జాని మీదనే...నన్ను మొదటి సారి ముద్దు పెట్టుకున్నది కూడా వాడే..జాని..ఏం కుక్కల మీద ప్రేమ ఉండకూడదా??? నాకు వాడిని చూడగానే లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అయ్యింది. మాకు మీలాగా చిన్న వయసులోనే ప్రేమలు గీమలు లేవమ్మా... స్వచ్ఛమైన ప్రేమ మాది." అని నవ్వుతూ చెప్పాను. ఏదో ఊహించుకున్నట్టు ఉన్నారు ఉసూరుమంటూ పడుకున్నారు.

వాళ్ళు నిద్రపోయాక నా పక్కన చూస్తే మా వారు లేరు. బాల్కనీలో ఆకాశంలో నక్షత్రాల్ని చూస్తూ ఏదో మధన పడుతున్నారు. నేను వదులుగా ఉన్న జుట్టును ముడి వేసుకుని, ఆయన చెంతకు చేరాను.

ఆయన కళ్ళు చెమ్మగా ఉన్నాయి. ఆయన భుజం మీద తలవాల్చి, గుండెల మీద రుద్దుతూ ఓదార్చే ప్రయత్నం చేశాను.

"అత్తమ్మ గుర్తుకు వచ్చిందా??" మౌనంగా నిల్చున్న ఆయన్ని అడిగాను.

"మొత్తానికి నన్ను కుక్క పిల్లని చేసేశావు!!" ఆయన కళ్ళు తుడుచుకుని, బాధను దిగమింగి లేని నవ్వును తెచ్చుకుని అడిగారు.

" ఆ..మరి...పిల్లలకి ఈ వయసులో ప్రేమ కబుర్లు చెప్తారా ?? వాళ్ళ చిట్టి బుర్రలో ఇదే నాటుకు పోదూ" నేను ఆయన బుగ్గ గిల్లుతూ చెప్పాను.

మరి మమ్మల్ని కలిపింది కూడా ఆ ప్రేమ పాటలు, ప్రేమ సినిమాలే అని మరచి....

ఆమని పాడవే హాయిగా.... ఎక్కడో దూరంగా మా ఇద్దరికీ ఇష్టమైన పాట వినిపిస్తోంది..

## గోపీ చందనం మేడ — రాజశేఖర్ తటవర్తి

పాత బస్టాండు వెనకాల సందు బైకులతో హడావిడిగా వుంది. ఆ వందమీటర్ల చిన్న సందులో రోడ్డుకిరువైపులా ఒక కంటాస్పత్రి, ఒక తల్లిపిల్లా ఆసుపత్రి, ఒక మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి, ఒక డెంటల్ క్లినిక్, ఒక మెడికల్ షాపు వెలిశాయి. ప్రతి ఆసుపత్రిలోనూ కిక్కిరిసివున్నారు జనం. రోడ్డు మధ్యలో ఒక ఆవు ఫ్రెష్షుగా పుష్కలంగా పేడ వేసి పక్కనే చతికిలపడి తాపీగా నెమరువేసుకుంటోంది. ఇండియాలో తనలాంటి ఆవులకు ఇది బెస్ట్ టైం అని, దాని మూత్రం ఇంధనతుల్యం అని, పేడ పతంజలి అని దానికి తెలిసిపోయింది. ఆస్పత్రులనించి బయటకి వచ్చే ఒకరిద్దరు జనం ఆ గోమాత పృష్ఠభాగానికి దణ్ణం పెట్టి వెడుతున్నారు. ఆస్పత్రి గేట్ల ముందర బైకులూ కార్లు అడ్డదిడ్డంగా పార్కు చేసున్నాయి. సందంతా హార్న్ల మోతతో మారుమ్రోగిపోతోంది. సగం ఆ సౌండుకే మనిషికి రోగమొచ్చేలావుంది.

ఈ ఆస్పత్రుల కూటమి మధ్యలో తామరపూవుల్లా ఒక పాత గోపీచందనం రంగు మేడ కూడా ఉంది. ఆ ఇంట్లో ఎవరూ ఉన్నట్టు లేదు. వీధివైపు తలుపులు మూసివేసి వున్నవి. ఇంటి బయట జయవిజయుల్లాగా ఒక రావి చెట్టు ఒక బాదం చెట్టు వీధిగుమ్మానికి నీడనిస్తున్నాయి. గేటుబైట నో పార్కింగ్ బోర్డు ముందర హాస్పిటల్ తాలూకా మోటారుబళ్ళు దర్జాగా పార్కు చేసున్నవి. గేటు ముందర గళ్ళచొక్కా వేసుకొని, మెరుస్తున్న సరికొత్త బట్టతలతో చేతిలో సెల్ఫోన్ వంక చూస్తూ వెయిట్ చేస్తున్నాడు రామారావు. ఈ గోపీచందనం మేడ అతనిదే. అదే... తాతలనించి సంక్రమించిన ఆస్తి.

రామారావు వెంకటాచలంగారి పెద్ద మనవడు. పెళ్ళాం పిల్లలతో గత పదిహేనేళ్ళుగా అమెరికాలో స్థిరపడినాడు. సుమారు యాభై ఏళ్ళ వయసుండచ్చు. తన తండ్రి బ్రతికున్నపుడు సంవత్సరానికి ఒకసారి ఇండియా వస్తూవుండేవాడు. ఆయన పోయి మూణ్ణాలుగేళ్లయింది. ఇప్పుడు రెండేళ్ళకొకసారో లేక యిలా ఆఫీస్ పనిమీద ఢిల్లీ వచ్చినప్పుడో ఒకసారి కాకినాడ వస్తూంటాడు. తన తండ్రి తదనంతరం ఆ ఇంటిని రెండు వాటాలు చేసి అద్దెకిచ్చాడు రామారావు. వాళ్ళు టైంకి అద్దె ఇచ్చి యివ్వక, రిపైర్లనీ అవని యివని అద్దెలోంచి విరగ్గోసుకోవడం ఇవన్నీ తలకాయనెప్పి వ్యవహారం అయి ప్రత్యామ్నాయాలు పరిశీలించసాగాడు. క్రితంసారి ఆఖరినిమిషంలో ఇల్లు అమ్మకం వాయిదా వేసాడు మనసొప్పక. ఈసారైనా దీని సంగతి తేలుద్దామని ఢిల్లీ నుండి ఒక వారం సెలవు పెట్టి వచ్చాడు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు కబురుపెట్టాడు. ఒక శ్రేయోభిలాషి ఈ ఇంటి విషయంలో సాయంచేస్తానని రామారావుకు పక్క డాక్టరుగారిని పరిచయం చేసాడు. హైటెక్ రోగాల పుణ్యమా అని రెండు చేతులా సంపాదిస్తున్న ఆ డాక్టరు రామారావుని కలిసి ఆ స్థలం

కొనుగోలుకు ఆఫర్ చేసాడు. ఆ ఇంటిని యోగా మరియు రెకూపరేషన్ సెంటరుగా మార్చడానికి. ఈ రోజు కాంట్రాక్టరు నల్లం సుధాకర్ వస్తున్నాడు కలవడానికి మరొక ప్రతిపాదనతో. అతని కోసమే రామారావు వెయిట్ చేస్తున్నది.

సాయంత్రం ఐదున్నర కావస్తున్నది. రావిచెట్టుమీద వసారా ఏర్పరుచుకున్న పక్షులు మెల్లగా గూటికి చేరుకుంటున్నాయి. ఉన్నచోటే నిల్చుంటే దోమలు రక్తాన్ని పీల్చేస్తున్నాయని ఆ వీధిమొగదాకా నడుస్తూ వెళ్ళాడు. అక్కడ తన చిన్నప్పటి వీరబాబు కిళ్లీకొట్టు యింకా ఉంది. అరటిగెలలు కొట్టుబయట మునపటిలాగే వేళ్ళాడదీసున్నాయి. కొట్టుముందు కళ్ళాపి చల్లి ముగ్గేసుంది. రామారావుకి పెద్దపండగప్పుడు గొబ్బెమ్మలూ హరిదాసు పాటలు గుర్తొచ్చాయి. చలంగారు రోజూ తప్పకుండా హరిదాసుకి భిక్ష వేసేవారు. "అయ్యగారికి దణ్ణం పెట్టు.. అమ్మగారికి దణ్ణం పెట్టు.. అయ్యగారి పిల్లలు పెద్ద పెద్ద సదువులు సదవాలి.. ఇదేశాల్లేల్లాలి.." అన్న గంగిరెద్దులవాడి ఆశీర్వచనం గుర్తొచ్చి నిట్టూరుస్తూ తనలో తానే చిన్నగా నవ్వుకున్నాడు. కూల్డ్రింక్ త్రాగుదామని ఆ కొట్టుదగ్గరకు వెళ్ళాడు. వీరబాబు కొడుకు కామోసు ఆ గల్లావెనుక. తన చిన్నప్పుడు సంక్రాతి, వేసవి సెలవలకి కాకినాడ వచ్చినప్పుడు రోజూ వాళ్ళ తాతగారు ఒక పావలా ఇచ్చేవారు. ఒక రోజు బిగ్ ఫన్ బబుల్ గమ్ మరొక రోజు నిమ్మతొనలు కొనుక్కునేవాడు ఈ కొట్టులోనే తన బాబాయ్ కొడుకు చంద్రంతో కలిసి. చంద్రం యిప్పుడు ఆస్ట్రేలియాలో ఉంటున్నాడు.

కిళ్లీకొట్టునానుకొని వున్న తల్లీ-పిల్ల ఆసుపత్రి స్థానంలో అప్పట్లో చిన్న పబ్లిక్ లైబ్రరీ ఉండేది. అక్కడే ఓం ప్రథమంగా తనకు ఇంగ్లీష్ న్యూస్ పేపరు చదివే అలవాటు అబ్బింది. బాబాయ్ రోజూ పేపర్ చదవడానికి వెడుతూ చంద్రాన్ని, రామారావుని వెంట తీసుకెళ్లేవాడు. తాతగారి లైబ్రరీకార్డు తీసుకువెళ్లి అగాథా క్రిస్టీ నవలలు తెచ్చుకొని కూడబలుక్కుని చదివేవాడు. ఇంటర్మీడియట్ దాకా ఆ డిటెక్టివ్ పేరు పైరోట్ అని అనుకున్నాడు.

చెవులవెనకాల దోమలు బాక్గ్రౌండ్ మ్యూజిక్కుతో సహా కుట్టడంతో గతం ఆలోచనలోనుండి బయటి వచ్చి తన ఇంటి వైపు నడవసాగాడు. దీపాలవేళ వీధి గుమ్మంలో లైట్ వేసి, ఆ కాంట్రాక్టరుకు ఫోనుచేసి హాల్లో కూర్చోగానే ఆ కిర్రుమనే ఫ్యాన్ సౌండ్ తనని మళ్ళీ గతంలోకి గిర్రుమని తీసుకెళ్లింది. తన మేనత్త సంగీతంలో దిట్ట. సెలవల్లో పిల్లలందరికీ పాటలూ సంగీతం నేర్పేది. ఆ ఫ్యాన్ కిర్రు సౌండుని గమ్మత్తుగా.. ధా తిరకిట తక్ తూనా తూనా అని.. గ గ గ గ రిగపగా అని తాళానికి మలచి పిల్లలతో పాడేది. ఆ కిర్రు శబ్దం ఇంకా అలాగే వుందిగానీ రామారావుకు యిప్పుడు ఏ తాళమూ స్ఫురణకు రాలేదు. ఒకసారి ఇల్లంతా చుట్టొద్దామని లేచాడు. విశాలమైన ఈ ఇంట్లో పన్నెండు గదులు.. వెనకాల రేకులషెడ్డులో సర్వెంట్ క్వార్టర్స్. ప్రతిగదిలోనూ గంపెడేసి జ్ఞాపకాలే... అప్పట్లో పది మంది మనవలు మనవరాళ్లు, అత్తలు, మావయ్యలు, బాబాయ్ పిన్ని అందరు వచ్చినా ఇల్లు సౌకర్యంగా ఉండేది. రామారావు బామ్మ అతను పుట్టిన మూడునాలుగేళ్లకే గతించింది. కాబట్టి శెలవులు అంటే అన్నీ తాతగారి జ్ఞాపకాలే. రామారావు తాతగారు రేడియో అంటే చెవికోసుకునే వారు. ప్రొద్దున్నే రేడియోలో నాగార్జున యూరియా పాటతో పిల్లలని లేపి సంస్కృత వార్తలు పాఠాల కార్యక్రమం ముగిసేసరికి పెరట్లో స్నానాలు పోసి తయారుచేసే వారు. బాయిలర్ వెలిగించి నీళ్లు కాచి తొలిపి పెట్టేవారు అమ్మా పిన్నినూ. అది తలచుకోగానే బాయిలర్లో కాలిన కొబ్బరిపీచు వాసన తన నాసికాపుటల్ని మెదిలింది. పిల్లల స్నానాల తరువాత దేవుడి గదిలో తాతగారు ఒక గంటసేపు విద్యాప్రకాశనంద స్వామివారి భగవద్గీత వినేవారు. అప్పుడప్పుడు ఏ అర్జున ఉవాచో భగవానువాచో పిల్లల చెవిన పడడం ఇప్పటికీ రామారావుకు జ్ఞాపకం. పెరట్లో రెండు కొబ్బరి చెట్లు ఉండేవి. వాటినుండి రాలిన కొబ్బరి పిందెలతో ఏడు పెంకులాట ఆడేవారు. కొబ్బరాకుల జువ్వ ఎవరిది ఎత్తు వెళ్తుందో పందెం. తాతగారు కొబ్బరాకులతో బూర చేసి బుద్ధిగా మధ్యాహ్నం పడుకునే పిల్లలకు బహుమతిగా ఇచ్చేవాడు. కొబ్బరిబూర చేయడం కష్టం. ఒకవేళ పిల్లలు చేయప్రయత్రించినా మోగేది కాదు. మధ్యాహ్నం భోజనాల తరువాత పిల్లలందిరికీ తాతగారు తలో బంగినిపల్లి మామిడికాయ చెంప యిచ్చేవారు. రామారావుతో సహా అందరూ పెరటి అరుగుమీద చొక్కాలుతీసి తినాల్సిందే.

దొడ్డి గుమ్మం గచ్చుమీద రామారావు నించొని ఇప్పటి ఆ కొబ్బరిచెట్లను పరికించాడు. వాటిలో ఏ మార్పూ లేదు. ఈ చెట్లే నయం అనుకున్నాడు మనసులో. రెండు చెట్ల మధ్యలో తులసికోట. కోటలో యిప్పుడు తులసి మొక్క లేదు. మట్టి ఎండిపోయి ఎప్పుడో వెలిగించిన రెండు మూడు అగరత్తు పుల్లలు మిగిలివున్నాయి అందులో.. పూర్వం అనుష్ఠాన వైభవానికి సాక్ష్యంగా.

తులసికోటకు కుడిపక్కన మేడమెట్లు. రామారావుకి ఇంట్లో అన్నిటికన్నా ఇష్టమైన జాగా మేడమీద. సెలవల్లో రోజూ సాయంత్రం తన అత్తా పిన్నులతో సన్నజాజిపూలు కోసేవాడు. మధ్యాహ్నాలు పక్కింటినుండి తొంగిచూసే మామిడిచెట్టు నీడలో మేడమీద చంద్రంతో పాటూ ఇంగ్లీష్ నవలలు

చదువుకునేవాడు. మధ్యలో రైలుకూత వినపడగానే అమాంతం పిట్టగోడదగ్గరకు పరుగెత్తి దూరంగా కనిపించే రైలు బోగీలు లెక్కపెట్టేవారు. గూడ్స్ రైలైతే మరీ ఆనదం. వాళ్ళమ్మ ఎండబెట్టిన గుమ్మడి వడియాలు తన కళ్ళముందే ఆడాయి. కాకులు ముట్టకుండా పిల్లలే కాపలా. వేసవి రాత్రులు బొంతలు తెచ్చి నాన్న బాబాయిలతో మెడపైనే పడుకునేవారు. ఇంకా ఆ ఇనప టార్టాయిస్ స్టాండ్ ఏమూలైనా వుందేమోనని వెదికాడు. పడుకునే ముందు రేడియోలో వివిధ భారతి వినేవారు. బినాకా గీత్ మాలలో పాత హిందీ పాటలతో తోలిపరిచయం ఈ మేడమీదే జరిగింది. ఏడు పెంకులాటకి కావలసిన పెంకులు చంద్రం మేడ మీదనించే గుట్టుగా తెచ్చేవాడు. తాతగారు కంటపడితే ఇద్దరినీ పిలిచి "ఇదిగో పిల్లలూ ఈ స్థలం మా నాన్నగారు ఆ రోజుల్లో పావలా పెట్టి కొన్నారు. కష్టపడి డబ్బుదాచి నాలుగు గదుల ఇల్లు కట్టి తరువాత నాకిచ్చారు.. నేను ఇదిగో ఈ డాబా వేసాను. నా తరువాత ఇది మీ నాన్నకిస్తాను. మీ నాన్న.. మీకిస్తాడు.. మీరు మీ పిల్లలకివ్వాలి తెలిసిందా.. ఇలా పెంకులు పీకేస్తే ఇల్లు పాడైపోదూ" అని ఆ పెంకులు తాను తీసుకువెళ్ళి తిరిగి పైన అమర్చేవారు. ప్రతి రెండేళ్ళకూ టంచనుగా వెల్ల వేయించేవారు. కొత్త పెళ్లికూతురులాగా మెరిసిపోయేది మేడ ఆ కాలంలో.

మేడమీద దోమలు విజృంభించడంతో మెట్లవైపు నడవసాగాడు. తన తాతగారి మాటలు తన మదిలో మెదిలి ఆలోచనలు రేకెత్తాయి. "ఎలాగూ పదేళ్లలో తానూ కూడా రిటైరయిపోతాడు. ఇక్కడికి వచ్చి తన నాన్నగారిలా ఈ ఇంట్లో ప్రశాంతంగా గడుపుదామనుకున్నాడు. కానీ యిప్పుడు తన కజిన్స్ కానీ ఫ్రెండ్స్ కానీ ఎవరూలేరు. అందరూ హైదరాబాదో బెంగళూరో అమెరికాలోనో స్థిరపడ్డారు. వాళ్ళుకూడా రిటైరయిన తరువాత ఇక్కడకి వద్దామనుకుంటున్నారా? ఏమో!.. దుబాయిలో పెరిగిన తన భార్య శిరీష ఇక్కడ ఇమడగలదా? రోజంతా ఏమి చేస్తుంది? పిల్లలు సెలవలకి వచ్చినప్పుడు ఎయిర్పోర్టు నించి దూరమవ్వదూ? పదేళ్ల తరువాత రాజెవరో, రెడ్డెవరో.. అప్పటిదాకా దూరంగా అమెరికానుండి మేనేజ్ చెయ్యడం ప్రాక్టికల్ కాదు అలాగని ఈ మేడ అమ్మేస్తే వచ్చే ఏటికల్లా అపార్టుమెంటో ఏటీఎంమో లేస్తుంది ఈ స్థలంలో. కొన్నాళ్ళకి ఇక మేడవుండేది తన మధుర జ్ఞాపకాల ధ్యానశ్లోకంలోనే వారి తాతగారు మంత్రదేవతగా.

"ఇంతకాలం ఆగాను. మరొక రెండుమూడేళ్లు చూద్దాంలే. చంద్రంగాడితో కూడా మాట్లాడి చూస్తాను." జీవనప్రయాణంలో అలసి ఎప్పుడైనా తన చిన్ననాటి తలపుల ఒడిలో వాలాలనిపిస్తే ఈ జ్ఞాపకాలగుడే ఆసరా. ఒకసారి తన చుట్టాలందిరిని చూడాలనిపించింది అతనికి. వచ్చే డిసెంబర్లో ఈ పాత ఇంట్లో అందరూ కలిస్తే ఎలావుంటుందనిపించింది. అత్తల్ని, కజిన్స్ని, వారి పిల్లల్ని అందరిని కలవచ్చు. బంగినిపల్లి మావిడికాయలాంటి ఈ తీపి జ్ఞాపకాలు వారి హృదయాంతరాళ్లను కూడా తట్టి లేపనీ" అని అభిప్రాయపడ్డాడు. మర్నాడు చంద్రంగాడితో మాట్లాడినప్పుడు ఈ ప్రస్తావన తెద్దామనుకున్నాడు.

జేబులోంచి ఫోనుతీసి కాల్ చేసాడు సుధాకర్కి రావద్దని చెప్పడానికి.

ఈ ఊర్లో యిలాంటి గోపీచందనం మేడలు యింకెన్నో!!

## అత్తి రసాలు — ఎండపల్లి భారతి

దీపావలికి నోమే అమావాస్యనోములు మాకు లేవు. మాకు వారాల నోములు. దీపాల పండగ పోయిన మరుసునా పొద్దు మాఊర్లోని ఆడోల్లందరికీ ఒకటే బీతి ఎత్తు కుంటుంది. బిడువు దొరికినప్పుడల్లా ఊర్లో నలుగురైదు మంది ఆడోల్లు ఉడ్డజేరి నిన్న దీపాల పండగ అయిపాయ, ఇంగ తొలి వారం ఏకాశినోములు అవి అయితానే వారాలు వస్తాయి,ఈసారి పండగ నాలుగు వారాలే అంట వచ్చిండేది మనమంతా ఏ వారం నోముదాము ఎవురన్నా ఊరుపెద్దతో ఎచ్చరిచ్చరాదా అని అనుకుంటా ఉండాము.

మాఊరిపెద్ద ఈరపెద్దమ్మ ఆయాలకే మాకాడికొచ్చె .

నేను ఉండుకొని ''పెద్దమ్మా నీకు నూరేండ్లు ఆవిసి'' అంటి.

ఆ మాటకు ఆయమ్మ ఉండుకొని ''య్యాలమ్మ ఇంగాబాధలు పడాలా ''అనే .

''కాదు పెద్దమ్మ నోముల పండగ ఎబుదు చేద్దామో నిన్ను అడుగుదామని అందరం అనుకుంటున్నాము ఆయాలకే నువొస్తివి. చెప్పు మన ఊర్లో పండగ యాపొద్దు చేద్దాము'' అనిడిగితిమి.

''కాదునాయనా పండగంటే ఊరికే అయిపోతుందా ఇంటికి రెండుమూడు వేలు లేంది చేయలేము.అన్ని సమాలిచ్చల్లంటే రెండు వారాలు పడుతుంది. అందుకే మూడోవారం చేద్దాం.మల్ల 'మరిబెల్లం' ఏయను కడవారం సరిపోతుంది''' అనేసి ఆయమ్మ ఎలిపాయ.

ఆయమ్మ అట్లెల్లిపోతానే మా తమ్ముని పెండ్లం నీల ఉండుకొని ''కాదు వొదిన నేను అన్ని పండుగలు సంబరంగా చేస్తా ఈ నోములు పండగ వొచ్చిందంటే అత్తిరసాలు సరిగ్గా లేస్తాయో లెయవో అని నోట్లో తడి ఉండదు.నేనుఅన్ని వంట్లు ఉలి బలిగా చేస్తా ,ఈఅత్తిరసాలు చేసేది రావడం లేదే ,అత్తిరసాలకు పాకు పట్టేది నేర్చుకోలేక పోతాఉండ, నాకురాదు మా యత్తకు రాదు. ఇప్పటికి నాకు పెండ్లై ఇరవై ఏండ్లయింది . అబటి నుండి సారి సారికి ఎవరోఒకర్ని అడుక్కోవల్ల .ఇట్లన్నదానికి ఏడేండ్ల నాపొద్దు మాటఇది.మాయత్త తమ్ముడు రామన్న ఆపొద్దు ఊరునుండి మా ఇంటికి వచ్చినాడు. అత్తిరసాలు పాకు పట్టేదిరాక అంగలాస్తా ఉంటే ఆయప్ప ఉండుకొని అత్తిరసాలకు పాకు నేను పట్టిస్తాననే ! పండక్కని నామొగుడు చింతకట్లు కొట్టకచ్చిండే .పొయిలో చింతకట్లు పెడితే పొగ రాకుండా అగ్గి ఆరకుండ తాలి మలగతాయి.వంట బిరిన్నె దిగుతుందని ఆపొద్దు నేను చింతకట్లుతో పొయ్యి మంటేస్తి .రామన్న ఉండుకొని వొట్టి సట్టి పొయిన పెట్టమనె. ముద్దబెల్లం నల్లగొట్ట మనే.ఉగసుక్కనీల్లు కూడా బొయలే . చింతకట్లు కదా అగ్గి దగ, దగ మండతాఉంది. వొట్టి బెల్లం సట్లో ఏసిందేపనికదా మంట జోరేత్తే కొద్ది రామన్న ఆ పాకులో సంగటి కట్టి ఏసి కలబెడతా ఉండాడు. అది కాటు వాసన ఏస్తాఉంది.పాకే ముదిరిపోయ.దించే రామన్న అంటే కూడా దించలా పైగా నన్నే గదమాఇస్తాడు, నేను ఇట్లావి ఎన్ని చేసినా అంటాడు. మేము వాదించుకుంటా వున్నిట్లే సట్లో పొగపాయ.అప్పుడు ఆదరా బాదరా కిందకు దించి పిండి పోసి గెలికితే గెట్టిగా బండ అయిపోయింది. పాకులోకి గడ్డపారేసిన కూడా దిగదు . సమిటితో కొట్టినా కూడా పగలదు. ఆ సట్టి కడగను వారందినాలు పడింది. ఆపొద్దంతా మా ఇంట్లో ఎవరికెగాని మనుశ్శాంతి లేదు. రామన్న వంట సెడిసినాపొద్దు ఆ తెల్లారితే నోమల్ల .మా ఎదురింట్లో పన్నెండు అత్తి రసాలు ఇపిచ్చకొచ్చి నోముకున్నా. ఆయప్ప జేసిన పని ఇబుటికీ గుర్తొస్తుంది .

“కాదు వదిన నేను పండగ కోసమని రెండు వారాలు ఇడవవకుండా బేల్దారిపనికి పోయిన.సిమెంట్ పని వాడికిలేక చేతులు పొక్కి బొక్కలు పన్నాయి. అట్ల కష్టపడి నలుగురితో పాటు సంబరంగా పండగ చేద్దామని పూజిసామాను కాన్నించి అత్తిరసాలు వరకు రెండు ముద్దలు బెల్లం, రెండు సేర్లు బీము,రెండులీటర్ల నూని,మంచి నూగులు,నెయ్యి ఇంకా కావాల్సిన సరుకులన్నీ తీసుకున్న.అత్తి రసాలు బాగా మెత్తగా చేసుకుని అనపబ్యాల్లు సున్నగా ఉడకబెట్టి రెండుబాయ్లు తెల్లగడ్డ రవంత పసుపు ఏసీ పప్పుగెత్తితో నున్నగా రుద్ది సాసవలు పచ్చి కరివేపాకు ఏసి నేతిలో తిరగ బోసుకుని అంత నెయ్యి పోసుకొని అత్తిరసా ల్లోకి ఆ పప్పు పోసి పిసుక్కొని తింటే బలే ఉంటుంది.అట్లా చేసుకొని తిందామని అత్తిరసాల సరుకులు ఎయ్యికి తెచ్చిన. ఈ వంట చేసేది సంవత్సరాని కోనాడు.అట్లాంటిది చెడిపోతే కడుపు చెడినట్లు అయిపోయింది. .ఇవన్నీ చూసి ఈ పండగ సాలిచేద్దామనుకున్నాను. సాలిస్తే మల్ల అసద్దాలు ఏమన్నా జరుగుతుందోఏమో అనుకోని చేస్తాఉండాము'' అనే .

ఆయాలకే మాగౌరి చిన్నమ్మ వచ్చే " కాదు పాపా మన ఊర్లో నూరు ఇండ్లు ఉండాయి మన ఊరు పైకి నాలుగైదు ఇండ్లోల్లు మాత్రం అత్తి రసాలకు పాకు కరట్టు గా పడతారు మిగిలిన వాల్లంతా పడితే న్యాబాకన్నా పడతారు లేదంటే ముదురుపాకన్నా పడతారు.న్యాబాకు పట్టిన అత్తిరసాలు పొల్లుఅయిపోతాయి.ముదురు పాకు పడితే గెట్టిగాపెంకులు అయిపోతాయి. అవి పొంటి కింద పడితే ఫల ఫల మంటాయి. పాకుఎట్లపట్టల్లంటే పొయిన సట్టి పెట్టి సొరెడు నీల్లు పోయల్ల .ముద్ద బెల్లం కొట్టి ఏయల్ల. అగ్గి మంటేస్తా సంగటి కట్టితో కలబెడతా ఉండల్ల. తొలిత పెద్ద పొంగు వస్తుంది.మల్ల సీమలపొంగు వస్తుంది. మల్ల గాతాలు పడతాయి. అప్పుడు కాసింత పాకుని నీల్ల తట్టలోకి ఏసుకుని రెండేల్లతో ఉంట చుట్టాలి . ఉంటకొస్తే దించెయల్ల. అప్పుడు పాకు సకత్తు గా సరిపోతుంది. ఉన్నరుగా దించుకోవల్ల" అనే.

పాపంనీల. దానిబాధ నిజిమేగదా! సంవత్సరంలో వచ్చే పండగల్లో కల్లా ఈనోములపండకయ్యేంత ఖర్చు ఏపండక్కు కాదు.ఇంత జెసేది అత్తి రసాలు గతుమారా తిందామనేకదా .నోమేదాంట్లో కూడా రెండు రకాలు. రాసికి, ఎన్నికి. మేమునోమేది ఎన్నికి అంటే జంట నోములు అంటారు దేవునికి పూజికి బెట్టెటీవీ అత్తి రసాలు కాన్నుండి,ఆకులు,వక్కలు,నోముదారాలు,అంటిపొండ్లు,పసుపుగుమ్ములు, నోములుగాజు,పూస,దువ్వాని, అద్దం,శవ్వాకు,పసుపుకుంకుమఇవన్నీపన్నెండు జతలుఎంచి పెట్టల్ల .ఇవిగాక బీము,బెల్లం,బ్యాల్లు మనకుఎన్ని బుద్ధి పుడితే అన్నీకొలిసి పొయ్యల్ల .రాశికి నోమేవాల్లు అయితే వాళ్లకెన్ని బుద్ధిపుడితే అన్నిపెట్టొచ్చు.గుడికి బోతే కర్సుతగ్గుతుంది. ఇండ్లల్లో పండగ చేయాలనే వాళ్లకు కర్సు ఎక్కువ అవుతుంది. పదేల్లకుముందు అయితే మనఊరంతా ఇండ్లల్లోనే నోమతాఉంటిమికానీ ఇప్పుడే అదురూ గుడికి మరిగిరి. పాతబద్ధతి ఇడకుండ ఇబుటికీ నాలుగైదుఇండ్లు పాటిస్తా ఉండారు" అనే ఆయమ్మ

ఇంతలో మా నాగవదిన ఉండుకొని అయినా ఇండ్లలో పండగ చేసినంత కళావశం గుడికి పోతే రాదు.ఇంట్లో నోమితే ఇల్లు పూస్తా ఉంటిమి.పండగ నాపొద్దు ఎదురుదబ్బలు చీల్చి నిలపట పన్నెండు అడ్డం పన్నెండు ఏసి తడికే గతం మట్టంగా నాలుగు సమకాలుగా కడతాము. దాన్ని పలవలు అంటారు .ఇంట్లో రాసిమూలన (దేవమూలన) ఆ పలవలు రెండు అడుగుల ఎత్తులో కట్టేది.వాటికి చేనులో పండే అలసందలు,అనపకాయలు,గురుగపూలు,జొన్నకంకులు,సద్దకంకులు,వొడ్లగొలకలు,తంగేడిపూలు,చెరుకులు, ధాన్యాలు,కాయలు గుత్తులుగుత్తులుగా పన్నెండు రకాలు అట్లే పెరక్కచ్చి ఏలాడగడతారు. అంటిమాను తెచ్చి వాటి పట్టలు చీల్చి పలవలు చుట్టూ గుడి కడతారు.దాన్నిపూలతో అలంకరిస్తారు.దానిలోపల ఆకు పరిచి పసుపు ముద్ద చేసి ఆముద్దే గౌరమ్మఅనుకొని మన సొమ్ములన్నీ అమ్మకు పెట్టి ఇంగ పూజకి ఎన్నికి నోమేవాల్లు ఎన్నికి, రాశికి నోమేవాల్లు రాశికి అన్నీ ఆడ పెట్టుకొని ఊర్లో ముత్తయిదువుల్ని పిల్సుకొచ్చి తొలీత పాటలు పాడేది .

"గౌరీ నోమదాము వస్తారా గౌరమ్మ నోముదాము వస్తారా
చాట్లో సిరిమల్లెలు బోసి చెంగ్రలాయుడు
దీపమెట్టి కోరకొప్పులే పెట్టుకొని
కొడుకును సంక నెత్తుకొని
వొమ్ములొమ్ములే సొమ్ములు పెట్టుకొని
సొమ్ములనీడా చూసుకుంటూ

ఎరజేని ఎరదుక్కిలో
గౌరమ్మ వేడుకతో నిను గొలుతుము
చాల నోములు నోమితే గౌరమ్మ
సంతానము ఈయవమ్మ
అత్తింటి కొరకై అన్ని నోములు నోమి
పుట్టినింటి కొరకై పుణ్య నోములు నోమి
జమట నోములు నోమి తమ్మునికిస్తి
జొమ్ము జమనేరేడిల్లు జోమ్మొగిరి నా స్వామి
జంట నేనయితే జోమ్ము జమ నేరేదు ఇల్లు" అని పాట పాడేది
అది అయితానే కథ !

మన ఆట్ల నూరిండ్ల పల్లెంట.ఆ పల్లిలో అందరూ గౌరీనోములు నోమతా ఉండారంట. కానీ ఆ ఊరికి దిగదాల రెండు తాటాకుగుడిసెలు ఉండాయంట. ఆ రెండు గుడిసెల్లోన ఇద్దరు అక్కజెల్లెల్లు ఉన్నారంట.వాళ్లకు ఆ పొద్దు ఎత్తి ఎసిట్లోకి ఎయను కూడా ఏమీ లేదంట. తట్లు ఎత్తుకొని పిడక నుగ్గులు యారకొచ్చు కోను పాయిరంట. ఆడ ఏటిమిట్నశివిని గుల్లో బాపనవారి అక్కమ్మలు బలిజవారి అక్కమ్మలంతా గౌరీ నోము నోమతా ఉండిరంట. అది చూసి చెల్లిఅయింది వచ్చి అక్కని అడిగిందట . అక్కా అక్కా మనముకూడా గౌరీనోము నోమాదామక్కా అని . అక్క అయింది ఏమనిందంటే వొట్టి చేతులతో ఎట్లనోముదామమ్మా అని పక్కన ఏట్లో నీళ్లు పోతా ఉండాయి ఇద్దరం నీల్లు పోసుకుందామురా అని ఈ యాపచెట్టే గౌరమ్మ ,మన తట్టలో పిడక నుగ్గులే అత్తిరసాలు,మర్రి ఆకులే తమలపాకులు,మర్రి కాయలే వక్కలు,నారపాసలే నోము దారాలు,ఇసుకే అక్షింతలు అనుకుని ఇవన్నీ ఆడ పెట్టి గౌరమ్మను నోమిరంట.నోముకోని ఇంటికి వొచ్చి చూస్తే తాటాకుల గుడిసెలు మేడలై పోయినంట .అబుడు అందరూ వాల్ల బక్తి చూసి ఆ గౌరీ దేవి వాల్ల పాలిట నిలిచింది అని అనుకున్నరంట. అంతడితో కథ ముగించుకొని అచ్చింతలు చల్లి టెంకాయకొట్టి ఒక్కపొద్దు తీర్సుకుంటారు .పూజకొచ్చిన అమ్మలక్కలకందరికీ ఆకు వక్క అత్తిరసాలు ఇచ్చి పంపిస్తారు. ఇంట్లో పండగ చేస్తే అంత గంభరంగా ఉంటుంది .

పండుగైన మర్సునాడు అమ్మలక్కలంతా జేరి ఎవరింట్లో అత్తిరసాలు బాగా లేసినాయి ,ఎవరింట్లో బాగా లెయ్యలేదు అని ఒకరి మానం ఒకరు తీసుకుంటా ఉంటారు . మల్ల కడ వారం మరిబెల్లం ఏస్తాం . ఆపొద్దు మల్ల ఇండ్లు వాకిండ్లు అలుక్కుని నోములప్పుడు గౌరమ్మ ముందరబెట్టిన బీము,బ్యాలు ఏసి అన్నంచేసి ముద్ద కూడు బెట్టి ఈ గౌరమ్మ సామాన్లన్నీ పెట్టి టెంకాయ కొడతారు. ఆటికి పండగ అయిపోయినట్లు. అంతవరకు అంటుకోకుండా దేవునికి పక్కకు దీసిన ఆ మరిబెల్లం అత్తిరసాల కోసం ఇంట్లో ఉండే చిన్న పెద్ద నీకా నాకా అనుకొని తింటారు.ఆ సివరి రుసి అంత పలవరిస్తుంది అందర్నీ అనే ఆయమ్మ.

మల్ల అందరమూ ఉండుకోని అత్తిరసాలకు ఏ బియ్యం నానబోద్దాం అనుకొంటా ఎవరి ఇండ్లకు వాళ్ళం బోతిమి

# అభినందనలతో

ఆర్.సి.కృష్ణస్వామి రాజు

డబ్బా రేకుల సుబ్బారావు గారు రాత్రీ పగలు, వారాలు నెలలూ కష్ట పడి పదిహేను కథలు వ్రాసినాడు. ఇంట్లోవాళ్ళకి చదివి వినిపించాలని ప్రయత్నించాడు కానీ ఎవ్వరూ చేతికి దొరకలేదు.

తన పాత మిత్రుడు రిటైర్డ్ తహసీల్దారు రంగరాజు ఖాళీగా వుంటాడు కదా తన కథలు చదివి భలే భలే అని అంటాడేమో నని అడ్రసు వెదుక్కొంటూ పోయినాడు. రెండు కళ్ళు కాటరాక్టు ఆపరేషన్ చేసుకొని పడుకొని వున్నాడు రంగరాజు. ఆరు నెలల దాకా చిన్న అక్షరాలు చూడొద్దని, చదవ వద్దని కంటి డాక్టరు చెప్పినట్లు రంగరాజు బాంబు పేల్చినాడు. బాగోగులు మాట్లాడేసి లేచి వస్తూ వుంటే రంగరాజు చిన్నగా లేచి కూర్చొని ఉచిత సలహా ఒకటి ఇచ్చినాడు."కథలు మనం వ్రాసి ఎవరి పుస్తకాల లోనో ప్రచురింప బడాలని ఎదురు చూడటం ఎందుకు,నువ్వే ఒక కథల సంపుటి ప్రచురిస్తే పోదా" అని చ క్కెర గుళికల లాంటి ముత్యాల సరాలు వదిలినాడు.

ఆ రోజు నుంచీ సుబ్బారావు తిండి సరిగా తినక, అప్పుడప్పుడూ అర తిండి తింటూ 24 X 7 ఆలోచించినాడు . భార్యకు చెబితే 'భార్యా బిడ్డలు కలిసి ముసలోడని కూడా చూడకుండా కుమ్మి కుమ్మి మూల పడేస్తారేమోనని భయపడి' తనలో తనే నూట పదహారు కోణాల్లో ఆలోచించినాడు. ఎక్కువ ఆలోచిస్తే వున్న నరాలు పుటుక్కున తెగిపోతాయేమో నని రోజూ గంట చేసే ప్రాణాయామాలు ఒకటిన్నర గంట చేసి ఒత్తిడి తగ్గించుకొనే ప్రయత్నం చేసినాడు. చివరికి మూడో కంటికి తెలియకుండా ప్రభుత్వ బ్యాంకులో భద్రంగా దాచిన రిటైర్మెంట్ డబ్బులు కొంచెం డ్రా చేసి క్వాలిటీ బాగుంటుందని విజయవాడ పబ్లిషర్ని కలిసినాడు. పబ్లిషరు కథల్ని కిందా పైనా ముందూ వెనకా చూసి "అంతా బాగుంది,అయితే పుస్తకానికి ముందుమాట పెద్ద పేరున్న రచయిత దగ్గర రాయించండి. పేరున్న పెద్దోళ్లు మంచిగా వ్రాస్తే మన పుస్తకం వేడి పకోడీ లాగా అమ్ముడవుతుంది" అని అద్భుతమైన సలహా ఒకటి ఇచ్చినాడు.

సుబ్బారావు గబగబా మూటా ముల్లె సర్దుకొని హైదరాబాదు రైలు ఎక్కినాడు. ఆ పేరున్న రచయిత ఎగాదిగా చూసి ముందు మాట వ్రాయడానికి అంగీకరిస్తూ చిన్న కండిషను పెట్టినాడు. తను వ్రాసిన "నక్క చస్తే గొర్రెలేడుస్తయా?" కథల సంపుటిని "నా వీపు నువ్వు గోకు,నీ వీపు నేను గోకుతా" అన్నట్లుగా చేతికిచ్చినాడు. ఇస్తూ ఇస్తూ బుక్కు బాగుంటే 40 మార్కులు చాలా బాగుంటే 60 మార్కులు చాలా చాలా బాగుంటే 100 మార్కులు ఇవ్వాలని చెప్పినాడు. తన రీడింగ్ రూంలో రివాల్వింగ్ చైర్ వేసి చల్లగా ఏ సి వేసి కూర్చోబెట్టాడు. కప్పు కాఫీ ఇవ్వమని భార్యకి సంకేతమిచ్చినాడు. 'అంబిలి తాగెటోడికి మీసాలు ఎత్తే టోడు కావాల్నా' అన్నట్లు గుడ్ల గూబ కళ్ళతో సీరియస్ లుక్కు విసిరింది. అయితే కిటికీ లోంచి చూసిన మేడమ్ కు సుబ్బారావు హైదరాబాదుకి వస్తూ వస్తూ పట్టుకొచ్చిన తిరుమల కొండ లడ్డు లు కనబడ్డాయి. లడ్డుల్ని చూసి నవ్వుతూ "కాఫీ తాగండన్నయ్యా "అంటూ వూగుతూ వూగుతూ వచ్చి కాఫీ ఇచ్చింది. కాస్త కాఫీ తాగితే గానీ నక్క కథలు చదవలేమని సుబ్బారావు సంతోషంగా కాఫీ అందుకొని కొండ లడ్డులు ఆమె చేతిలో పెట్టినాడు. రచయిత భార్య అయిన తనకి జిల్లా రచయితల సన్మాన సభ లో శాలువా కాకుండా పదివేల కంచి పట్టు చీర కప్పినంత సంతోష పడింది.

సుబ్బారావు నక్క కథల పుస్తకాన్ని గబ గబా గంటలో చదివేశాడు. ముందు చూపు లేకుండా కథలు బాలేవని చెబితే ముందు మాట వ్రాయనని అంటాడేమోనని భయపడి వందకి వంద మార్కులు వేసినాడు. తన కథల్లో అంత స్టఫ్ఫు ఉందని, ఎవ్వరికైనా నచ్చి తీరుతుందని,

మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుందని గంట సేపు సుత్తి కొట్టినాడు. 'రోకట్లోతల దూర్చి రోకటి పోటుకు భయపడితే ఎలా' అనుకొని బెల్లం కొట్టిన రాయిలా గమ్మున విన్నాడు సుబ్బారావు.

మూడు రోజుల్లో ముందుమాట ముచ్చటగా వ్రాసి పెడతానని చెబుతూ పెద్ద పార్సెల్ చేతి కిచ్చాడు. భయ భయంగా అందుకొన్నాడు సుబ్బారావు. ఎవ్వరూ చూడటం లేదని నిర్ధారించుకొని గబుక్కున లేచి తలుపేసి సుబ్బారావు చేతులు పట్టుకొని ఈ వంద పుస్తకాలు అమ్మి పెట్టండి. డబ్బులు మీరు అటూఇటూగా ఇచ్చినా ఫర్లేదు. డబ్బులంతా తగలేస్తా ఉండానని ఇంట్లో ఒకే పోరు. తట్టుకోలేక పోతున్నా. నాకీ సహాయం చేసి పె ట్టండి.చచ్చి మీ కడుపున పుడతా అన్నాడు. 'చచ్చే దాకా వైద్యుడు వదలడు,చచ్చినా పంచాంగం చెప్పేవాడు వదలడు' సామెత గుర్తు తెచ్చుకొని సుబ్బారావు పార్సెల్ని భుజాన పెట్టుకొని బస్సు ఎక్కి స్వంత ఊరు తిరుపతి చేరినాడు.

చిన్నగా ప్రకాశం రోడ్డు కెళ్ళి పరిచయమున్న పుస్తకాల అంగడి ప్రకాషుని కలిచి విషయం చెప్పినాడు. " సుబ్బారావు మావా నీకు ఏదైనా అవసరం వుంటే వంద అడుగు, వెయ్యి అడుగు ఇస్తా, అంతే గానీ ఇంత పెద్ద ప్రాజెక్టులు ఇచ్చి నాకు పరీక్షలు పెట్టద్దు. ముందు మాదిరి లేదు మావా పుస్తకాల వ్యాపారం. కొత్త వ్యాపారాలు చేయలేక, చేస్తున్న వ్యాపారం వదులుకోలేక కడుపు చించు కొంటే కాళ్ళ మీద పడుతుందని ఎవ్వరికీ చెప్పుకో లేక ... ఏదో రన్నింగ్ ది షో " అని మెత్తగా తప్పించుకున్నాడు.

పుస్తకాలు అమ్మడం ఆషా మాషీ వ్యవహారం కాదని తెలుసుకొని అది తన వల్ల అయ్యే పని కాదని నిర్ధారించుకొని ప్రతి నెలా మొదటి ఆదివారం టీటీడీ పార్కులో జరిగే వాకర్స్ అసోసియేషన్ మీటింగుకెళ్ళాడు. అందరకీ ఉచితంగా పుస్తక ప్రసాదం పంచినాడు. తీసుకొన్నట్లే తీసుకొని మీటింగు నుంచి పోయేటప్పుడు చాలా మంది పుస్తకాల్ని అక్కడే వదిలి వెళ్ళినారు. పట్టు వదలని విక్రమార్కుడిలా చిన్నగా వాటిని సేకరించి ఎన్ జీ వో హోంలో జరిగే రిటైర్డ్ ఎంప్లాయిస్ మీటింగు కు హాజరై తలా ఒక పుస్తకం అందించినాడు.

బ్రిస్క్ వాకర్ మరియు రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ అయిన భూపతి నాయుడు బుక్కు అందుకొని "సుబ్బారావు గారూ, మీ కథల సంపుటి ఆవిష్కరణ ఎప్పుడు" అని అడిగినాడు. 'ఊరు ఊరంతా మనకి అభిమానులుండారే' అనుకొని సుబ్బారావు కాసేపు గాలిలో తేలినాడు. నక్క తోక తొక్కిన లెక్కన సంబరపడినాడు.తన ఫేవరేట్ హిందీ హీరోయిన్ రేఖతో మైసూరు బృందావనం గార్డెన్స్ లో డ్యూయెట్ పా డుతున్నట్లు నిలబడే డ్రీమ్ వేసుకున్నాడు.

అప్పుడు సుబ్బారావుకు సీతారామపురం రచయిత రంగారావు చెప్పిన "రచయితలైన మనల్ని మనకి తెలియకనే ప్రపంచం మనల్ని గమనిస్తూఉంటుంది" ముత్యాల లాంటి మాటలు గుర్తుకొచ్చాయి

బ్రిస్క్ వాకర్ భూపతి నాయుడు కి ఒకటికి రెండు సార్లు షేక్ హ్యాండ్ లిచ్చి "త్వరలోనే విడుదల" అంటూ వి ఐ పి వాకింగ్ స్టైల్ లో నడుచుకొంటూ సర సర ఇంటికి పోయినాడు. ఆ హడావుడిలో సుబ్బారావు సరిగా గమనించలేదు కానీ నాయుడు గారి చొక్కా జేబులో మిల మిల మెరిసే కాగితం ఒకటి తొంగి చూస్తోంది. అప్పుడే వేడివేడిగా వండి వార్చిన దీపావళి కవిత ఎవరైనా దొరికితే చదివి వినిపించడానికి సిద్ధంగా వుంది.

తన పుస్తక ఆవిష్కరణ మహోత్సవం రేణిగుంట రోడ్డులోని భీమాస్ హోటల్ లో జరపనున్నట్లు ప్రకటించినాడు. విషయం అముదవల్లి కి తెలిసి మొగుడిపైన లక లక మని అరుస్తూ సివంగి లెక్కన మొగుడి పైకి దుకాలనుకొంది. మొన్ననే శ్రీ వారి గుండెకి ఆంజియోప్లాస్టీ జరిగింది గుర్తుకొచ్చింది. రెండు అడుగులు వెనక్కి వేసింది. 'బాగున్న నా మొగుడికి సన్మానాల పిచ్చి పట్టింది కదా,సన్మానాల పిచ్చిఅనేది సామాన్యమైన జబ్బు కాదు కదా ఏ వైద్య శాస్త్రంలోనూ ఈ జబ్బుకు ఇంతవరకు మందు కనుక్కోలేదు కదా' అని మొగుడు చూడనప్పుడు మరుగ్గా ముక్కు చీదింది. అయినా పొయ్యి మీది అన్నం మెతుకులు వుడికినట్లుగా రక్తం సల సల వుడికింది. బాగా గాలి పీల్చి గాలి వదిలి ఒత్తిడి తగ్గించుకొని

మనకు వుండేది ఒక్క మంగళ సూత్రమే కదా,జరగరానిది జరిగితే ఊర్లో ఏ ముఖం పెట్టుకొని తిరిగేది అని ఆలోచించి గమ్మున వుండిపోయింది .

బ్యాంకు లోని డబ్బు మరి కొంచెం డ్రా చేసి ముందు మాట వ్రాసిన హైదరాబాదు రచయితకు మనీ ఆర్డర్ చేసినాడు. విజయవాడ పబ్లిషర్ తో మాట్లాడి 500 కాపీలు అచ్చు వేయించాడు. జిల్లా రచయితల సంఘం సుబ్బారావుకు సంఘీభావం ప్రకటించింది.

ఆవిష్కరణకు సుముహూర్తం నిర్ణయించి సభావేదికను రంగరంగ వైభవంగా తీర్చి దిద్దినాడు. పబ్లిషింగ్ హౌస్ వారు అందమైన బ్యానర్లు హాలంతా కట్టారు. సభకు జనాల సమీకరణలో భాగంగా మీటింగుకు ముందు గా వచ్చిన పది మందికి ప్రోత్సాహక బహుమతులిచ్చారు. వచ్చినోళ్ళు స్వీటు కారా కాఫీ[ఎస్ కే సి ] తిని తాగేసి మీటింగుకు వుండకుండా వెళ్లి పోతారేమోనని చివరి వరకు వున్న వాళ్ళ పేర్లు రాసి డబ్బాలో వేసి లాటరీ తీసి 1,2,3 బహుమతులివ్వ దలిచారు. దీంతో జనంతో సభా మందిరం కళకళ లాడింది.

సభాధ్యక్షుడిని, ముఖ్య అతిధి మరియు పుస్తక ఆవిష్కర్తనీ, మొదటి ప్రతి స్వీకర్తనీ, అంకిత స్వీకర్తనీ, విశిష్ట అతిధిని, గౌరవ అతిధులను, ఆత్మీయ అతిధులను, సమన్వయ కర్తను సిద్ధం చేసినాడు. జనాల్ని రప్పించుకోవడంలో భాగంగా అభినందనలతో అంటూ తన బావమరిది పేరు తోడల్లుడు పేరు వియ్యంకుడి పేరు మేనమావ పేరు మేనల్లుడి పేరు ఆహ్వాన పత్రికలో ప్రచురించినాడు. తెల్ల కాగితంలో నల్ల అక్షరాలుగా వున్న తమ పేర్లు ప్రింటులో చూసుకొని వారు మురిసి పోయినారు. ఎగిరెగిరి పనిచేసినారు.తలా పది మందిని పిలుచుకు వచ్చినారు. సాహితీ ప్రియులతో సభ కిట కిట లాడింది. రచయిత బయో డేటాను రంగురంగు కాగితాల్లో ప్రచురించి పంపిణీ చేసినారు. సందిట్లో సడేమియా గా రాయల చెరువు రమాదేవి తను కాణిపాకం వినాయకుని పైన వ్రాసిన స్తోత్రాల పుస్తకాలు ప్యాకెట్ సైజువి పంపిణీ చేసింది. చాలా మంది కాలి చెప్పులు తీసేసి భక్తిగా పుస్తకం తీసుకొని రమాదేవికి నమస్కారాలు పెట్టినారు. పుస్తకాలన్నీ పంచేసిన వెంటనే 'నా రచన ఎలావుంది?మీ ఫీడ్ బ్యాక్ ఏమిటి' అని అందరినీ అడగసాగింది. వెంటనే రమాదేవి మొగుడు మొగిలి మునిస్వామి కలుగజేసుకొని "వాళ్ళని గాలి అయినా పీల్చుకోనీయవే, నిదానంగా చదివి చెబుతారు గానీ ఫీడ్ బ్యాక్" అని బలవంతంగా రమాదేవి ని కుర్చీలో కూర్చోబెట్టాడు. యువ రచయితలు కవితా ఓ కవితా అంటూ కవితా గానం చేశారు .

ధీర వీర శూర అంటూ పొగిడేవాళ్లు పొగుడుతూవుంటే అభిమానులు కొందరు పూల గుత్తులు అందిస్తూ తనని అభినందిస్తూ వుంటే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయినాడు సుబ్బారావు. విచ్చేసిన వక్తలు సుబ్బారావు కథలను ఎక్స్ రే కళ్ళతో,మరికొందరు స్కానింగ్ కళ్ళతో, ఇంకొందరు ఎం ఆర్ ఐ స్కానింగ్ కళ్ళతో చదివి సమీక్షలు చేశారు.

మీటింగుకు వచ్చిన రిటైర్డ్ తహసీల్దారు రంగరాజు గబ గబా పంచె ఎగ గట్టుకొని వచ్చి సుబ్బారావు చెవిలో "అయ్యా రచయితగారూ,మీరేమో అందరికీ పుస్తకాలు అభిమానంగా ఉచితంగా అందిస్తున్నారు. మీరు అలా పుస్తకం ఇస్తే మన వాళ్ళు చదువుతారో చదవరో గానీ మంచి రంగురంగుల పేపర్ ని రేపర్ గా వేసి వేరే వాళ్లకి కాం ప్లిమెంట్ గా ఇచ్చే అవకాశం వుంది. అనుభవంతో చెబుతున్నా ,వాళ్ళ కిచ్చే పుస్తకాలలో "అభినందనలతో" అని వ్రాసి నీ స్వహస్తాలతో సంతకం చేసి పంపిణీ చెయ్. మన దగ్గర పుస్తకం తీసుకొన్న వాళ్ళయినా తప్పక చదివి తీరుతారు" అని గుడి గంట కొట్టినట్లు చెప్పినాడు. చిన్నగా సుబ్బారావు స్టేజి దిగి అందరినీ పలకరిస్తూ చిన్న చిన్నగా వాళ్ళ దగ్గర పుస్తకాలు తీసుకొని అభినందనలతో అని వ్రాసి ఇచ్చాడు.

మీటింగుకి మూలగా పుల్లంపేట నూలు చీర కట్టుకొచ్చిన అముదవల్లి ఆముదం తాగిన ముఖంలా దిగులుగా కూర్చొని వుంది. రంగరాజు గారికి ఫ్లాష్ లాగా ఒక ఆలోచన వచ్చింది. చక చక నడుచుకొంటూ సభాధ్యక్షుడి చెవిలో చిన్నగా " సారుకి మాత్రం సన్మానం చేస్తే చాలదు. మేడంని కూడా స్టేజి పైకి పిలిపించండి"అని ఆణిముత్యం లాంటి సలహా ఇచ్చాడు.

యుద్ధ ప్రాతిపదికన మిస్టర్ అండ్ మిస్సెస్ సుబ్బా రావు లకు మేళతాళాలతో సన్మానం ప్రారంభమయ్యింది . తిరుమల కొండ మీది వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. పట్టణ రచయితల సంఘ సభ్యులు అందరికీ చాక్ లెట్లు పంచారు. ఆహ్వాన పత్రికలో బెస్ట్ కాంప్లిమెంట్స్ చెప్పిన బంధువులు పూల వర్షం కురిపించారు. స్వీటు హాటు తింటున్న సభికులు ఆహా ఓహో అన్నారు. పేపరోళ్ళు పేనాలు విదిలించి విదిలించి విషయాలను నోట్ చేసుకో సాగారు.

ఎప్పుడూ సన్మానం ముఖం ఎరుగని అముద వల్లి మనసు పాల పొంగు లెక్కన పొంగింది. వంద పున్నమి చంద్రుల వెలుగుతో ఆమె ముఖం వెలిగింది. తనను తాను ఒకటికి రెండుసార్లు గిచ్చుకొని చూసుకొంది. ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యింది. మూడు రోజుల క్రితమే తలకి డై వేసిన విషయం గుర్తొచ్చి తెల్ల వెంట్రుకలు బయటపడలేదని సంతోష పడింది. 'దొరుకునా ఇటువంటి ఛాన్సు' అనుకొని ఫోటోగ్రాఫర్ కి అనువుగా ఫోజులిచ్చింది. అందరూ తనని చూస్తున్నారా లేదా అని అద్దాలు వేసి ఒకసారి, అద్దాలు తీసి ఒకసారి సభలోని సభికులనంతా తేరిపార చూసింది.

ఇంతలో ముందు మాట వ్రాసిన పేరున్న రచయిత నుంచి సుబ్బారావుకు ఫోను వచ్చింది. సుబ్బారావు బిజీ గా వున్నాడని అముదవల్లి ఫోన్ తీసింది. పనుల ఒత్తిడి వల్ల రాలేక పోయానని బెస్ట్ అఫ్ లక్ చెబుదామని ఫోన్ చేసానని చెప్పాడు. వెంటనే అముదవల్లి "అన్నగారూ! మీరు ఈ సారి పుస్తక ఆవిష్కరణకి మిస్ అయ్యారు గానీ వచ్చే ఉగాదికి మా సా[వా]రు ఆవిష్కరించబోయే నవలకి మీరే ముందు మాట వ్రాయాలి, ఆవిష్కరణ సభని మీరే ముందు వుండి జరిపించాలి" అని చేతులు ఊపుతూ చెబుతోంది. అముదవల్లి మాటలు విన్న సుబ్బారావు ముక్కు మీద వేలేసుకొన్నాడు. 'ఎంత వారలైనా పొగడ్తలకు సన్మానాలకు దాసులే కదా' అనుకున్నాడు.

తెలుగు పండిట్ కోర్సు చదివే అమ్మాయిలు కాలేజీ యూనిఫారం లో వచ్చి జణ గణ మణ పాడటంతో సభ సమాప్తమయ్యింది.

మంచి సహాయం చేసినావని రంగరాజుని హగ్ చేసుకొని అభినందనలు తెలియజేశాడు సుబ్బారావు. తను వ్రాయబోయే నవలకి 'అభినందనలతో' అనే టైటిల్ ని ఖరారు చేసి నవల వ్రాయడానికి తెల్ల కాగితాలు కొత్త పేనా ఎత్తుకున్నాడు. అముదవల్లి మెచ్చుకోలుగా మొగుడి వైపు చూసింది. ఆమె చూపులు సుబ్బారావుకి "నీ దున్నుట్ల ఏముంది,ఉండేదంతా నా చల్లుట్లనే వుంది" అన్నట్లుగా అనిపించాయి.